Barcode : 2020010001762
Title - Hungary_Viplavamu
Author - puripanda appulaswamy
Language - TELUGU
Pages - 270
Publication Year - 1957
Barcode EAN.UCC-13
2020010001762

# హంగేరీ విప్లవం



అనువాదం:

పురిపండా అప్పలస్వామి

823
M582H

# హంగేరీ విప్లవం

అనువాదం

**పురిపండా అప్పలస్వామి**

పబ్లిషర్సు: అద్దేపల్లి అండ్ కో
సరస్వతీ పవర్ ప్రెస్
రాజమహేంద్రవరము

# THE BRIDGE AT ANDAU

by

JAMES A. MICHENER

Copyright, 1957 by James A. Michener

Telugu Translation by

PURIPANDA APPALASWAMY

First Edition – January 1960 – 5,000 Copies

Price Rs. 2-50

Copyright of this Telugu Translation belongs to :

Publishers : ADDEPALLY & CO.

SRASWATHI POWER PRESS

RAJAHMUNDRY (A. P.)

# హంగేరీ విప్లవం

# జోసప్ఫుటాత్

అది 1956 అక్టోబరు 23 వ తేదీ మంగళవారం. ఆరోజు ప్రపంచం అంతత్వరగా మరిచిపోలేదు. సాయంకాలం కావస్తూవుంది. పద్దెనిమిదేళ్ళ యువకుడొకడు తనఇంటిపని అట్టేపెట్టి, హంగేరీరాజధాని బుడాపెస్టు నగరంలో కొబానియావీధిలో వున్న ఇంజనుల ఫ్యాక్టరీ ఫోర్మేను కార్యాలయానికి వెళ్ళాడు. సాయంకాలం షిఫ్టులో అతడుపని.

"కమ్యూనిస్టు పఠనకేంద్రాలికి ఇంకా తరుచుగా వెళ్ళాలి నువ్వు" హటాత్తుగా యువకుణ్ణి హెచ్చరిస్తూ అన్నాడు ఫోర్మేను.

యువకుడు కావడంచేత ఫోర్మేనుకి జవాబుచెప్పాలని అనుకున్నాడు జోసపు. అవలిస్తూ వున్న చూపులతో క్రూరంగా చూశాడు ఫోర్మేను. దాంతో తలవంచి వూరుకున్నాడు యువకుడు.

"రోజుకి పదిగంటలు పనిచేస్తాను" ఆఫీసుబైటికి వచ్చేసి అనుకున్నాడు యువకుడు - "అయినా సరిపోయినంత తిండిలేదు నాకు. పనయిన తరవాత కమ్యూనిస్టు సభలికి ఎందుకు వెళ్ళాలి?"

అందమైన యువకుడతడు. నల్లటి జుత్తూ, బూడిదరంగు కళ్ళూ - తిన్నగా జువ్వలా వుంటాడు. ఒంటిమీద మచ్చలు యవ్వనం పాటమరింపుతో అప్పుడప్పుడే చెరిగిపోతూ వున్నాయి. చౌకబారు కాడ్రాయిపంట్లం తొడుకున్నా డతడు. దానికంటే చౌకరకం చొక్కా వేసుకున్నాడు. ఒకబనియనులా వుంపది. చొక్కాకి జిప్పరు వుంది. కాని అది ఎప్పుడూ పనిచేయదు. కాళ్ళకి బరువైన బూట్లున్నాయి. ఇంట్లో వొకకోటు వుంది. అది పాతపడిపోవడంచేత వెచ్చగా మాత్రముండదు. ఒక టోపీకూడా వుంది. పల్చటి మరొక దుస్తుల జతా వుంది. అతడు ప్రతీ ఆదివారం తొడుక్కుంటాడవి. ఇప్పటికి నాలుగేళ్ళయి పనిచేస్తూవున్నా అతడికి వున్న బట్టలన్నీ అవే.

బాగుండని తిండీ, రాసూపోనూ ట్రాం ఖర్చులూ అప్పుడప్పుడు తన తండ్రికి ఇచ్చే కొద్దిపాటి డబ్బులూ - తనకివచ్చే కూలిడబ్బుయావత్తూ ఇంత మాత్రానికే సరిపోతుంది బొటాబొటిగా. నిజంగా అతడికి వచ్చే ఆదాయం విచారిస్తే మనకి జాలివేస్తుంది.

జోసప్ఫుటాత్‌కి తల్లిలేదు. ఆమె చచ్చిపోయి రెండేళ్ళయింది. ఆమెచావు ఒకరహస్యం. పాపం, ఆమెచావు జోసపు కుటుంబానికి వొక పెద్ద దెబ్బ.

ఆర్థికంగానూ ఒక ఆపద. ఆమె ఎప్పుడూ ఉల్లాసంగా వుండేది. అయితే మహావాగేది. ఆమెనోటికి అడ్డూ ఆపూ వుండేది కాదు. ఎవళ్ళనయినా హేళన చెయ్యడంలో ఆమె వెనకాడేది కాదు. ఆతల్లి ఛాయలే జోసప్పలోనూ అవుపిస్తాయి. ఆమె పెదవులమీద ఎప్పుడూ చిరునవ్వు తొణికిసలాడుతూనే వుండేది.

ఒకనాడు రాత్రిభోజనాలదగ్గిర జోసప్పతల్లి మామ్మూలుగా కొంతమందితో కూచుని యధాలాపంగా అంది. "ఎక్కడచూసినా రష్యాజెండా కనిపిస్తోంది. మన పాతహంగేరీ జెండా చూడాలని నాకోరిక."

ఆ దినాల్లో బుడాపెస్టులో తిండికరువుగా వుండేది. భోజనాల దగ్గిర వున్నవాళ్ళతో ఒకనమ్మకస్తుడు జోసప్పతల్లి మాటలు అవకాశంగా తీసుకోవాలని నిశ్చయించుకున్నాడు. ఆమె అన్నమాటలు ఏవివో * వాళ్ళతో వూది లాభం పొంది తిండికింత సంపాదించుకోవాలని అతడి ఊహ.

మర్నాడు ఒకచిన్న ట్రక్కు జోసప్ప ఇంటికివచ్చింది. దానిలో ఇద్దరు ఏవివో మనుషులున్నారు. జోసప్పతల్లిని ట్రక్కులో ఎక్కించుకుని ఎక్కడికో పట్టుకుపోయారు వాళ్ళు. ఆరుమాసాలదాకా ఆమెజాడలేదు. ఆరునెలల తరవాత ఒకనాడు హటాత్తుగా ఆమె ఇంటికి వచ్చింది. ఆమె బాగా అడిలిపోయి వుందని ఆమె వైఖరివల్ల తెల్లమవుతూవుంది. అయినా మరేమీ ఫరవాలేదని ఆమెపెదవులమీది చిరునవ్వుతో తనవాళ్ళకి నమ్మకం కలిగించింది. ఏవివో వాళ్ళచేతుల్లో వున్నప్పుడు తనకేమీ ప్రమాదం జరగలేదనే చెప్పిందామె. కుటుంబంలోవాళ్ళు అందరూ ఆమెమీద ప్రశ్నపరంపరలు కురిపించారు. నిశ్చలంగా అన్నిటికీ ఒక్కటే జవాబు చెప్పిందామె. "ఏమీ జరగలేదు" అని. కాని కారాగృహంలో తిండీ తిప్పలూ లేకపోవడంవల్లా, అక్కడ ఆమెపడ్డ యాతనలవల్లా ఇంటికి వచ్చిన కొద్దికాలంలోనే ఆమె కాయిలా పడింది. తుదకి చచ్చిపోతుందనే స్పష్టమయింది. అప్పుడు టూకీగా అతిమెల్లగా కొన్నిసంగతులు మాత్రం చెప్పిందామె. అయితే స్పష్టంగా మాత్రం ఏమీ చెప్పలేదు. గోడకి చెవులుంటాయి. తనమాటలు వింటే తన కుటుంబానికే ఏమయినా ప్రమాదం రావచ్చు. అనుకోకుండానే ఎవడైనా గుప్తచరుడు వినవచ్చు. ఎలా అయితేనేం తాను నిర్బంధంలో వున్న ఆరు

* ఏవివో : Allam vedelmi osztag (A. V. O.)
ప్రత్యేక రాజ్య రక్షణ సంస్థ.

నెలలలో ఏం జరిగిందో జోసపుకి అర్థమయేటంతమాత్రం ఆమెచెప్పేసింది.

"ప్రతీరోజూ గంటలకొద్దీ వొంటికాలుమీద నిలబడేవాన్ని" వొకనాడు కొడుకుతో అంతమాత్రమే చెప్పిందామె. ఈమాటలు మెల్లిగా అంటూవుంటే ఆమె మొహంమీద భయంనీడలు అలుముకున్నాయి. అప్పటి ఆదృశ్యం మరపరాంది. అదయిన కొద్దిదినాల్లోనే ఆమెచచ్చిపోయింది.

పదిహేనునిమిషాలు వొంటికాలుమీద నిలబడి చూశాడు జోసపుటాత్. తన తల్లంత లావాటివాడు తాను కాకపోయినా, త్వరలోనే అతడికి బాధకలిగింది. భరించలేకపోయాడు. తన తల్లి గంటలతరబడి ఎలా నిలబడిందో ఊహించలేక పోయాడు.

ఫొర్మేను ఆఫీసునించి బైటికి వెళుతూ జోసపు తనమనసులోని భావం మనసులోనేవుంచుకున్నాడు. ఫ్యాక్టరీలో పనిచేసేవాళ్ళలో ఏవివోమనుషులెవరో అతడికి తెలియదు. అతడికేకాదు ఎవరికీ తెలియదు. అయితే వాళ్ళు వున్నారని మాత్రంనిశ్చయంగా తెలుసు. కొద్దిరోజుల కిందటే తనతో పనిచేస్తూవున్న వొకడు ఇంకొకణ్ణిచూపిస్తూ "ఈ దుష్టుడు తప్పకుండా రష్యా ఏజంటయి వుంటాడు" అన్నాడు. ఈమాటకాస్తా ఎవరి చెవులోనో పడింది. వాణ్ణి ఎత్తుకుపోయారు. చచ్చేటట్టు కొట్టి మళ్ళీపనిలోకి పంపించారు.

అంతేకాదు, బుడాపెస్టు బైట జోసపుతల్లి గ్రామంలోనూ ఇలాంటిదే వొకటి జరగడం తెలుసు జోసపుకి. అక్కడ వొకడు పన్నులు బకాయి పడ్డాడు. దురదృష్టవశాత్తూ అతడు వొకస్నేహితుడితో అన్నాడు. "మా అన్న అమెరికాలో వున్నాడు" అని.

ఎవళ్ళో ఏవివో వాళ్ళు ఈ మాట విన్నారు. "అయితే నీపన్నుల బాపతు డబ్బంతా అమెరికానుంచి ఆరువారాల్లో తెప్పించు" అన్నారు. పాపం, అతడు తెప్పించలేకపోయాడు. దాంతో అతణ్ణి ఎక్కడికో ఈడ్చుకుపోయారు. మళ్ళీ అతణ్ణి ఎవరూ చూడలేదు. అతడి సంగతి ఏమయిందో అనైనాఎవ్వరూ ఊహించలేదు. అదే అన్నిటికంటే చిత్రమైన విషయం. ఏమంటే ఏవివో వాళ్ళకి తెలిస్తే తంతారని వాళ్ళభయం. అంచేత అందరూ కిక్కురుమనకుండా వూరుకున్నారు.

ఒక పని బాగా చేసినంతమాత్రాన ఏవివో వాళ్ళు సంతోషించరు. దానికో ఉదాహరణ. హంగేరీ కమ్యూనిష్టులవశం కాకపూర్వం, చదువుకున్న వొకడు ఇంజను ఫ్యాక్టరీలో పనిచేస్తూ వుండెవాడు. దురదృష్టవశాత్తూ వొక

ఇంగ్లీషు పత్రికనించి వొకవ్యాసం అతడు తర్జుమా చేశాడు. "ఇనపతెర వెనక కొత్తవిజ్ఞానం అభివృద్ధి" అని దాని శీర్షిక. ఏవివో వాళ్ళు అతణ్ణి ఎత్తుకు పోయారు. మూడువారాలు నిర్బంధంలో వుంచారు. ఏంచేశారో తెలియదు. అతడు ఎన్నడూ ఆవిషయమై పెదవి కదిలించలేదు.

"ఇనపతెర అన్నది ఎక్కడాలేదు. ఈ సంగతి అందరికీ తెలుసు. క్యాపిటలిస్టులు వేసిన అపవాదు ఇది. ఈ అపవాదు ఇతడు తెలివితక్కువగా వాడాడూ అంటే, ఇతడి మెదడులో కాలుష్యం వుందన్నమాట. దానిని బాగుచెయ్యడానికి మూడు వారాలపాటు ఇతణ్ణి ఏవివో వశంచెయ్యాలి" అన్నారు వాళ్ళు. మెదడు కాలుష్యం బాగుచెయ్యడానికి వాళ్ళు ఏంజేస్తారో అవ్యాసం తర్జుమాచేసిన యువకుడికి తప్ప మరెవ్వరికీ తెలియదు. సూచన ప్రాయంగా అయినా ఇంతకిముందు అతడికది ఎవ్వరూ చెప్పలేదు. చెప్పారో వాళ్ళు పూర్తిగా మాయమే అయిపోతారు.

ఏవివో వాళ్ళభయం కొద్దీ జోనపుటాత్ తాను ఏంమాట్లాడినా, ఏం చేసినా, ఏం నమ్మినా చాలా జాగ్రత్తగా వుండేవాడు. ఏవివో వాళ్ళులేనిచోటే అతడికి అవుపించలేదు. అంచేత ఎక్కడ కాలుజారి వాళ్ళవలలో పడతానో అని బెంగతోనే వుండేవా డతడు. ఇంజను ఫ్యాక్టరీలో తయారయే ఇంజనులు తిన్నగా రష్యా వెళతాయనీ, లేదా ఈజిప్టు వ్యాపార సంపర్కంలో వెళతాయనీ అతడికి తెలుసు. కాని అమాట అతడు ఎన్నడూ ఎవరితోనూ చెప్పడు ఇంజనులమీద అడ్రసులు రాసేవాడితోనూ అనడు. ఏమంటే వాడే ఏవివో మనిషి కావచ్చు.

బుడాపెస్టులో అప్పుడే చలి ప్రారంభ మవుతూవుంది. సాయంకాలం షిఫ్టులో తనపని ముగిశాక జోనపు తన కోటు దగ్గిరికి వెళ్ళాడు. దానిని తీసి తొడుక్కున్నాడు. ఫ్యాక్టరీనించి బైటపడ్డాడు. ట్రాం కారు అందుకుని ఇంటికి వెళ్ళడానికి బైలుదేరాడు. "కమ్యూనిస్టు పతన కేంద్రానికి రేపు వెళతాను" అనుకుంటూ, తన అయిష్టం తనమనస్సులొనే దాచుకున్నాడు. బహుశా పోర్మేను ఏవివో గుంపువాడేమో!

రాత్రిగాలి చురుగ్గా వుంది. జోనపు పదడుగులు ముందుకి సాగాడో లేదో, "నువ్వు హంగేరీ యువకుడివే అయితే మాతోచేరు" అంటూ కేకలు వేస్తూ వొకయువకులగుంపు తనకి ఎదురయింది. యువకులందరూ పాతికేళ్ళలోపు వయస్సు కలవాళ్ళే. వాళ్ళు ఏం చేస్తున్నారో జోనపుకి తెలియదు.

అయినా మెరుపులాగ అనిమిషంలో ఆవేశం వచ్చింది వతడికి. అతడిలాగే ఏమీ ఎరగని మరికొంత మంది యువకులూ ఆగుంపులో చేరారు.

ఆ గుంపులోంచి ఒకనినాదం బయలుదేరింది. ఆశాజనకమైన నినాద మది. ఆవేశపూరిత మైంది. ఉత్సాహ భరితమైంది. గుంపులో ఒక విద్యార్థి అరిచాడు. "హంగేరీనించి ఏవీవో తరిమేస్తాం" ఈ మాటలు జోసపుకి అర్థ మయాయి.

యువకులగుంపు ఒక్కసారి సముద్రంలా ఉప్పొంగింది; పోలీసు స్టేషనులో దూరింది. తలుపులు బద్దలుకొట్టి లోపల ప్రవేసించింది. ఆఫీసర్లు కంగారు పడిపోయారు. శాంతపరచడానికి ప్రయత్నించారు.

"మీ తుపాకులు ఇటు తెండి" అంటూ అరిచారు యువకులు.

"నీ తుపాకి ఇటుతే" ఒక పోలీసు ఆఫీసరుని ఉరుముతూ అన్నాడు జోసపు. తన ధైర్యానికి తనకే ఆశ్చర్యం వేసింది.

"ఎందుకోసం ?" తడబడుతూ అడిగాడు పోలీసు. జోసపు జవాబు చెప్పలేదు. తీక్షణంగా చురచురా చూశాడు.

'ఏవీవోని అంతంచేస్తాం' ఒకవిద్యార్థి అరిచాడు. పోలీసు నోరు వెళ్ళ బెట్టాడు. కళ్ళుతేలవేశాడు. జోసపు అతడి పిస్తోలు లాక్కున్నాడు. తనకంటే బలమైన మరొకయువకుడు అతడి చేతిలోంచి లాక్కున్నాడు. చూస్తూ వుండ గానే పోలీసు తుపాకుల కొట్టమంతా యువకుల వశమయిపోయింది. యువ కులంతా వీధిలోకి వచ్చేసరికి ప్రతీ యువకుడి చేతిలోనూ తుపాకి వుంది.

వాళ్ళ అదృష్టమా అన్నట్టు సరిగ్గా అదేవేళకి హంగేరియను సైనికులు నడిపిస్తూన్న ఒకటాంకు ఆసందులోకి వచ్చింది. భయంకరంగా వుంది దాని శబ్దం. జోసపువున్న దిక్కే అది నడుస్తూ వచ్చింది. ఇద్దరు ఏవీవో మను షులు దానికి దారిచూపిస్తున్నారు. అది పాతకాలపుటాంకు, T. 34. అది నడుస్తూ వుంటే ఎంతో చప్పుడవుతూ వుంటుంది. దానికి మరతుపాకులు బిగించి వున్నాయి. పిస్తోళ్ళతో దానిని ఎదిరించడం అసంభవం.

దానిని చూసి మొదట ఏమీతోచలేదు యువకులికి. భయభ్రాంతులయి నిలబడి పోయారు వాళ్ళు. కుర్రాళ్ళమీద తుపాకులు పేల్చడం ఇష్టంలేదు టాంకులో సోల్జర్లకి. తమదగ్గిర వున్న చిన్న ఆయుధాలతో టాంకుని కొట్ట డానికి యువకులూ భయపడ్డారు. ఇంతలో టాంకులోని ఏవీవో మనుషులు

ఆలోచించారో ఏమో, టాంకునించి తుపాకులు ఒక్కసారి పేలాయి. ఎంతో మంది యువక కార్మికులు వీధిలో పడిపోయారు.

దాంతో టాంకుమీద దెబ్బతియ్యాలని యువకుల్లో ఆవేశం హెచ్చింది. ఒక్కసారి దానిమీద విరుచుకు పడ్డారు వాళ్ళు. పిస్తోళ్ళతో టాంకు పైభాగాన్ని కొట్టారు. రాళ్ళూ రప్పలూ, సీసాలూ విసిరారు. పదహారేళ్ళకి తక్కువ వయసుకల కుర్రాళ్ళు ఇద్దరు టాంకుతుపాకుల కిందికి వెళ్ళారు. దాని గొలుసు గాడీల్లో ఇటికలు పెట్టేసి దానినాపేశారు.

టాంకు ఆగిపోయింది. మరఫిరంగులు మాత్రం గుళ్ళు కురిపిస్తూనే వున్నాయి. అవి యువకుల తలలమీంచి వెళ్ళిపోతున్నాయి. జోసపు పక్క నుంచున్న ఒకకుర్రాడు, గాయపడ్డ మరొకడి చేతిలోంచి సబ్‌మెషీనుగన్. లాక్కున్నాడు. ఒక అపరిచితమైన శక్తి అతణ్ణి ఆవేశించింది. టాంకు పైభాగాన్ని గట్టిగా కొట్టాడతడు. అన్ని వైపులనించీ టాంకుమీద తుపాకి గుళ్ళు వర్షించాయి. టాంకు పైభాగం తాబేలు వీపులావుంది. గుళ్ళన్నీ తగిలి తుళ్ళి పోయాయి. అవి తిరిగివచ్చి ప్రజలకే తగిలాయి. కొందరు. చచ్చిపోయారు. కొందరు గాయపడ్డారు. ఏవివో వాళ్ళు కొట్టిన గుళ్ళే అవి అనుకున్నారు జనం. ఆగిపోయిన టాంకులోంచి గుళ్ళవర్షం కురుస్తూనే వుంది. ఇంతలో ఒక సాహసవంతుడైన యువకుడు పిస్తోలు పట్టుకుని టాంకుమీదికి దూకాడు. మీదితలుపొకటి తెరచిలోపల అధేకురిపించడం కురిపించాడు గుళ్ళు. అంతలో మరో సాహసవంతుడు మరతుపాకి పట్టుకుని అతడితో కలిశాడు. దాంతో టాంకులో సద్దు మణిగిపోయింది. దానిలో ఏవిధమైన చలనమూ లేకండా పోయింది.

తాను ఎంత ప్రమాదకరమైన సాహస కృత్యంలో పాల్గొంటున్నాడో తెలియకండానే టాంకు నిలిపివెయ్యడంలో చేతులు కలిపాడు జోసఫుటాత్.

దెబ్బలు తినేసి, విరిగిపోయి, ఒకడొక్కులా అయిపోయి వీధిలో పడి వుంది టాంకు. ఆవేశంతో వున్న ప్రజానీకానికి అదృశ్యం మరింత ఉత్సాహం కలిగించింది. ఇంకా పెద్దపెద్ద సాహసకార్యాలు చేయాలని ప్రోత్సాహం రేకెత్తించింది. ఉప్పెనలా పొంగుతూ ముందుకి సాగారు జనం. యంత్రాల పని తెలిసిన కార్మికులు ఆటాంకు బాగుచేసి ఉపయోగించుకోడానికి వుండి పోయారు. టాంకులోని శవాలు పైకిలాగేసి వీధిలో పారేశారు వాళ్ళు.

జోసఫుటాత్ జనసమూహంలో కలిసి రేడియోస్టేషను దిక్కు సాగాడు.

టాంకు యుద్ధం గమనిస్తూవున్న ఒక యువతి వీధిలోని ఒకశవాన్నిచూసి "వీడు ఏవీవో మనిషి" అంటూ అరిచింది. టాంకులో పనిచేస్తూవున్న కార్మికులు ఆమెమాటలు విని గతుక్కు మన్నారు. ఏవీవో మనుషుల శవాలన్నా వాళ్ళకి భయమే. ఇపంతా మరొక ఏవీవో మనిషి చూస్తున్నాడేమో!

రేడియో స్టేషను దగ్గరమాత్రం అలాంటి జంకూ కొంకూ కనిపించలేదు.

హంగేరీ కమ్యూనిస్టు రాజ్యానికి 'రేడియో బుడాపేస్టు' నరాల కేంద్రం వంటిది. బ్రాడ్‌సెంటరు వీధిలో మ్యూజియం పార్కుకి దగ్గిరగా ఒక బ్రహ్మాండమైన భవనంలో వుంచది. కమ్యూనిజానికి జీవం పోసే ప్రచారమంతా ప్రతీ రోజూ ఇక్కడి నుంచే ప్రసారమవుతుంది. అంచేత అది బుడాపేస్టులో అత్యంత ముఖ్యమైన భవనం. కమ్యూనిస్టు మంత్రుల కౌన్సిలు స్వయంగా దానిమీద పెత్తనం వహిస్తుంది. కమ్యూనిస్టుపార్టీకి చెందిన పన్నెండు వందలమంది ఉపన్యాసకులూ, నాటకకర్తలూ, నటకులూ, కవులూ, గాయకులూ, కథా రచయితలూ అందులో పనిచే వుంటారు.

మరతుపాకులు పట్టుకుని ఎనభైమంది ఏవీవో మనుషులు దానిని ఎల్లప్పుడూ రక్షిస్తూవుంటారు. వాళ్ళచేతుల్లో తుపాకులు చూసి ప్రజలు వాటిని 'రష్యను ఏడేళ్ళు' అంటారు. ఆ భవనంలోకి వెళ్ళాలంటే ఎన్నో అన్ని అనుమతిపత్రాలు కావాలి. ఆ భవనానికి రెండు పెద్ద కర్రతలుపులున్నాయి. కోట తలుపులులాగ వుంటాయవి. వశంతప్పిన ఏ మనుషుల గుంపయినా లోపలికి తోసుకురాకండా వుండాలని బుడాపేస్టు రేడియో భవనం ఇలా హంగేరీ కమ్యూనిస్టునాయకులు కట్టుదిట్టంచేశారు. ఇంతయినా అక్టోబరు ఇరవైమూడు నాటి సాయంకాలం ఉద్రిక్తులయిన యువకులు 'రేడియో బుడాపేస్టు'ముందు ఎక్కడెకక్కడినించో వచ్చి గుమికూడారు. కాలేజీ విద్యార్థులు ఎదోవిధమైన పతూరీ లేవదీశారని పుకారుపుట్టింది. నగరమంతా వ్యాపించింది. రేడియోభవనం రక్షిస్తున్న ఎనభైమంది ఏవీవో మనుషులు అప్పుడే కీలకస్థానాల్లో అనుకూలమైన పట్టులో నిలబడి సిద్ధమవుతున్నారు. కొత్తసైనికులు రావడంకోసం బరువైన రేడియో తలుపులు విడివడ్డాయి. ఆ భవనం ముట్టడించడం ఇప్పుడు మరీ కష్టమైపోయింది.

రాత్రి తొమ్మిదయింది. రేడియోస్టేషను చుట్టుపట్ల గుంపులుగుంపులు మనుషులు చేరుతున్నారు. యూనివర్సిటీ విద్యార్థులు కొందరు జట్టుగా తలుపుల దగ్గిర నిలబడి "తమ అభిప్రాయం హంగేరీ ప్రజలకు రేడియో

హారా చెప్పేహక్కు తమకువుంది" అంటూ వాదన ప్రారంభించారు. ఏవిహో మనుషులు వాళ్ళని చూసి నవ్వారు. 'రేడియోలో మీరు మాట్లాడటానికి వీలు లేదు. మీరు చెప్పదలచుకున్నది టేపుమీద రికార్డుచేస్తాం. అవసరమని తోస్తే అది తరవాత ప్రసారంచేస్తాం.' విద్యార్థులు దీనికి ఒప్పుకోలేదు. భవనంలోకి బలవంతంగా చొరబడాలనే వాళ్ళు ప్రయత్నించారు. ఏవిహో వాళ్ళు తలుపులు మూసేశారు. విద్యార్థుల ఈ పరాజయం చూసి ప్రజల్లో ఆవేశం హెచ్చింది. వెంటనే వచ్చి విద్యార్థులతో కలిశారు వాళ్ళు. అందరూ ఏకమై తలుపులు బద్దలుగొట్టడానికి ప్రయత్నించారు. ఏవిహో వాళ్ళు సిద్ధపడేవున్నారు. ప్రజలమీద టేరుగ్యాసుబాంబులు వేశారు. ప్రజలు ఉక్కిరిబిక్కిరి అయిపోయి మ్యూజియం పార్కుతట్టు జరిగారు.

ఆ రాత్రి బుడాపెస్టులో స్వాతంత్ర్య వాతావరణం బాగా వ్యాపించింది. ప్రజలగుంపు మళ్ళీ రేడియో స్టేషను దిక్కు వెళ్ళింది. మళ్ళీ టేరుగ్యాసు బాంబులు వాళ్ళమీద పడ్డాయి. మళ్ళీ వాళ్ళు వెనక్కి తగ్గారు. ఈ సారి ఏవిహోవాళ్ళు ఒక కొత్త ఆయుధం ప్రయోగించారు. రేడియోస్టేషను కప్పు కోణాలనించి రెండు బ్రహ్మాండమైన బేకనులైట్లు వేశారు. ప్రజల్లో ఎవరెవరు నాయకులో, ఎవరెవరు ముందున్నారో తెలుసుకోడం ఇప్పుడు వాళ్ళకి సులువయింది. ఆ వెలుగులో తిరుగుబాటుదార్ల పేర్లు గబగబా రాసుకోవడం మొదలెట్టారు వాళ్ళు. ప్రజలు ఒక్కసారి గావుకేకలు వేశారు. లైట్లమీద రాళ్లు రువ్వారు. ఏవిహో వాళ్లు సహించలేకపోయారు. ఈ సారి తుపాకులు కాల్చడం ప్రారంభించారు.

'ఓహో, వీళ్ళు మనల్ని చంపేస్తున్నారు" అంటూ ఆడంగులు గావుకేకలు వేశారు.

"వీళ్లు పిచ్చికుక్కల్లావున్నారు" అంటూ విద్యార్థులు అరిచారు.

'పారాడండి' అంటూ ముందువరసలో వున్న విద్యార్థులు ప్రజల్ని హెచ్చరించారు.

ఏవిహో వాళ్ళు తడబడలేదు. బలమైన గోడలవెనక సురక్షితంగావుండి ప్రజలమీద తుపాకులు కాలుస్తూనే వున్నారు వాళ్ళు. ప్రజల్లో ఎంతోమంది పడిపోయారు. ఇంతలో హంగేరియను సైనికోద్యోగి ఒకడు ఏమయినాసరే హంగేరీని రక్షించాలి అంటూ ఒకదృఢనిశ్చయం చేసుకున్నాడు. హంగేరీ అంటే కమ్యూనిస్టు హంగేరీ అన్నమాట, ఇక్కడ. కాని రక్షించడం ఎవరినించి? శత్రువులనించికదా! అయితే, ఇపుడు రేడియో ఆఫీసు ముట్టడించినవాళ్ళు శత్రువులూ కారు, విదేశీయులూ కారు, పెట్టుబడి దారులూ కారు. వాళ్లందరూ తమసోదరులే. తమ పిల్లలే. తాము ప్రేమిస్తూవున్న స్త్రీలే.

వీళ్ళందరూ తుపాకులికి గురిఅవుతూవుంటే అతడు బిత్తరపోయి చూశాడు. ఉత్తరక్షణంలో ఒక ట్రక్కుమీదికి దూకాడు. "ఒరే, పందుల్లారా! ఎవ ర్నిరా మీరు చంపుతున్నారు ? మీకు మతిపోయిందా ఏమిటి ?" అంటూ తుపాకులు కాలుస్తున్న వాళ్ళని గదమాయిస్తూ అరిచాడు.

బేకం లైట్ల వెలుగు అతడిమీద పడుతూ వుంది. "ఒరే, పందుల్లారా! తుపాకులు ఆపండి" ఒక్క పొలికేక పెట్టాడతడు.

ఆ చీకటి భవనంలో ఎక్కడినించో ఒక మరతుపాకి టప టపా పేలింది. ట్రక్కుమీంచి సైనికోద్యోగి దొర్లిపోయాడు. స్వాతంత్ర్యంకోసం పోరాడుతూ చచ్చిపోయిన మొదటి సైనికు డతడు. ప్రజల్లోంచి దుఃఖంతో ఒక రొద లేచింది. రేడియోస్టేషనుకు చాలా దగ్గిరగావున్న గుంపు వెర్రెత్తి నట్టు తలుపులమీదపడి దబదబా బాదింది. గోడలుకూడా కొందరు బాదారు. ఏవో కొన్ని ఆయుధాలు వుంటేకాని రేడియోస్టేషను ఆక్రమించడం సాధ్యం కాదని కొందరు బుద్ధిమంతులు గ్రహించారు.

సరిగ్గా అదే సమయానికి ఒక అద్భుతమైన సంఘటన జరిగింది. ఆధునిక ప్రపంచ చరిత్రలోనే ఒక నిర్ణయాత్మకమైన సంఘటన అది. కాలేజీ విద్యార్థులుకానీ, అక్కడున్న మరెవ్వరుకానీ తమెచ్చి కలల్లో కూడా ఊహిం చని, అనుకోని సంఘటన అది. పట్నం దక్షిణభాగం నించి ఒక ట్రక్కుల వరస అక్కడ ప్రత్యక్షమయింది. అందులోంచి ఎంతోమంది కార్మికులు దిగారు. వాళ్లు మామ్మూలు కార్మికులే. వాళ్లు సెపెలునించి వచ్చారు.

వాళ్ళని చూసేసరికి ప్రజల్లో ఎక్కడలేని ఆవేశమూ ఆవేసించింది. వాళ్ళరాకతో ఇన్నాళ్ళూ కమ్యూనిస్టులు చెపుతూ వచ్చిన అబద్ధాలు బట్టబయ లైపోయాయి.

"ఓహో, సెపెలునించి వచ్చినవాళ్ళు వీళ్ళు" అంటూ ఒకయువతి కేకవేసింది.

"వీళ్ళు ఆయుధాలూ మందుగుండూ పట్టుకునే వచ్చారు" అంటూ ఒక విద్యార్థి అరిచాడు.

"వాళ్ళని చూడండి" మరొక కేక.

"ఔను, కమ్యూనిజానికి గుండెలావుండిన సెపెలుదీవినించి వచ్చారు వాళ్ళు. కమ్యూనిజానికి వ్యతిరేకంగా పోరాడడానికి నడుం కట్టా రిప్పుడు. ఇది ఎంత గొప్పవిషయం! కమ్యూనిస్టులు మొట్టమొదట స్థాపించిన ఫ్యాక్టరీలో

పనిచేస్తున్న కార్మికులు వీళ్ళు. ఆ దీవిలో నేటికి పదకొండేళ్ళనించీ ఒక్క పెట్టుబడిదారు లేడు. కమ్యూనిజానికి సెపెలుదీవి కేంద్రంగా, ఆత్మప్రాయంగా వుండేది. అక్కడి వర్క్‌షాపులలోంచీ, ఫ్యాక్టరీలలోంచీ వచ్చిన వాళ్ళే వీళ్ళు. ఒకప్పుడు వీళ్ళని సెపెలు కమ్యూనిస్టులు అనేవాళ్ళు జనం. ఇప్పుడు వాళ్ళే ఇక్కడ ట్రక్కులలోంచి దిగి మరతుపాకులు ఏర్పాటుచెయ్యడానికి ఎత్తులు కడుతున్నారు.

సెపెలు కార్మికులు రాగానే ట్రక్కుమీద ఒక పెద్ద తుపాకి ఎక్కించారు; రేడియోస్టేషనుభవనంమీద తూర్పుగావున్న బేకంలైటు కొట్టేశారు. అదీ వాళ్ళుచేసిన మొదటిపని. దాంతో ఆతట్టు బుడాపేస్టుమీద కమ్యూనిస్టులు ప్రసరింపజేస్తూవున్న వెలుగు ఒక్కసారి ఆగిపోయింది. ఈసారి కార్మికులు పడమటితట్టు లైటుపని పట్టించడానికి తుపాకి అమర్చడం ఆరంభించారు. సరిగ్గా అప్పుడే రేడియోస్టేషను దగ్గరవున్న గుంపులో చేరాడు జోసపు టాత్. తన ఫ్యాక్టరీలో ఏవీవో వాళ్ళపేరు చెపితేనే అందరూ అదలెత్తేవాళ్ళు. కాని ఇక్కడ ఏవీవో వాళ్ళమీద ప్రజలు తిరగబడుతున్నారు.

"మనం ఏవీవో నాశనం చేద్దాం" అంటూ ఆవేశంతో ఒకడు ఉపన్యాసం ఆరంభించాడు.

సెపెలు కార్మికులు జాగ్రత్తగా తుపాకి అమర్చారు. గురిపెట్టి రెండో బేకనులైటుకూడా కొట్టేశారు.

ఏవీవో వాళ్ళని తిడుతూ ప్రజలు కేకలు వేశారు.

పక్కనున్న రకోజీవీధిలోంచి ఒక తెల్లటిబండి మెల్లిగా 'రేడియో బుడాపేస్టు' వైపు వచ్చింది. అది మామ్మూలు యాంబులెన్సు బండి. "గాయపడ్డవాళ్ళకోసం మీరు రావడం మాకు చాలా సంతోషంగావుంది" దానిని ఆపుతూ కొందరు విద్యార్థులు అన్నారు. ప్రజలు తప్పించుకుంటూ ఆబండికి దారి ఇచ్చారు. గాయపడ్డవాళ్ళని దాటుకుంటూ యాంబులెన్సుబండి ముందుకి నడిచింది.

"ఎక్కడికి వెళుతున్నారు ? వీళ్లే గాయపడ్డవాళ్లు" అంటూ అరిచారు విద్యార్థులు.

"భవనంలోపలి గాయపడ్డవాళ్ళనే ఎక్కించుకురమ్మని నాకు ఆజ్ఞ"-జంకుతూ అన్నాడు డ్రైవరు.

"అలా వీల్లేదు" ఒక్కసారి అరిచారు ప్రజలు. అలా నిరసనగా అరిచినవాళ్ళలో జోసపుటాత్‌కూడా వున్నాడు.

"నేను వెళ్ళితీరాలి. అది ఆజ్ఞ" ప్రాథేయపడుతూ అన్నాడు డ్రైవరు.

గుంపులో వారిచేసుకుంటూ బలవంతంగా ముందుకి వెళ్ళబోయా డతడు. ఒకడి కాలిమీంచి బండిచక్రం దొర్లింది. బాధతో అరిచా డతడు. దాంతో జోసపూ మరికొందరూ యాంబులెన్సు కారుమీద పడ్డారు. తలుపులు తెరిచేసి డ్రైవరుని వీధిలోకి లాగేశారు. కారులో మందూమాకూ ఏమీలేదు తుపాకులూ ,మందుగుండూ మాత్రముంది.

"అయ్యో దేవుడా!" అంటూ ఒకయువతి ఏడ్చింది.

"ఇవిగో గ్రేనేడ్లు!" జోసపు అరిచాడు. ప్రజలు ఉప్పెనలా కారుకేసి తోసుకువచ్చారు.

ఒక్క క్షణంపాటు భయంకరమైన నిశ్శబ్దం ఆవరించింది. తరవాత గుసగుసలు బయలుదేరాయి. "కారులో ఒక ఏవిఓ మనిషి వున్నాడు" అని ఒకరితోఒకరు చెప్పుకున్నారు. ఒక వెయ్యిచేతులు అతడికోసం తడువు కుంటూ ముందుకి సాగాయి. చీల్చి ముక్కలు చేసేద్దామని వాణ్ణి లాగడ మారంభించాయి. "అయ్యో, నేను ఏవిఓవాణ్ణి కాను"అంటూ వాడు మొత్తు కుంటూనే వున్నాడు. అయినా వాడిగోడు ఎవడూ వినలేదు. మరిన్ని కొత్త చేతులు వాడిమీదికి వస్తూనేవున్నాయి. చివరికొకడు ఆకారులోంచే ఒక తుపాకి తీశాడు. ఆ ఏవిఓవాణ్ణి కాల్చి పారేశాడు. వాడికి అదే నయమనిపించింది. మరొకడు వాడిశవం ఒక్కతన్నుతన్ని పక్కకి తోసేశాడు. కొందరు యువకులు యాంబులెన్సు బండిలోని తుపాకులూ, మందుగుండూ అంతా సెపెలు కార్మికులికి అందిచ్చారు.

'ఓ ఇకచాలు. ఈ ఆయుధాలతో ఈ భవనం ముట్టడించవచ్చు" అన్నారు సెపెలు కార్మికులు.

భవనంమీదవున్న కిటికీలో మరతుపాకులుపెట్టి ఏవిఓవాళ్ళు గుళ్ళ వర్షం కురిపించారు.

"తుపాకులు లేనివాళ్ళు వెనక్కి వెళ్ళండి" తమజట్టుకి నాయకత్వం వహించి ముందుకివచ్చి అన్నాడు ఒక సెపెలు కార్మికుడు. మరికొంతమందిని పిలిచి ఇలా అన్నాడతడు: "ఇదిగో మీరు ఇక్కడే వుండండి. ఇక్కడా, ఇక్కడా బారికేడ్లు కట్టండి."

రేడియోస్టేషనుకోసం పోరాటమిక ఆరంభమవుతుందనగా పదహారేళ్ళ యువకుడొకడు తుపాకి తిప్పుతూ జోసపు దగ్గిరికి వచ్చాడు. "ఇదిగో, ఈ

రేడియోభవనంలోకి ఆపక్క వీధి ఇంట్లోంచి ఒక సొరంగమార్గముంది" అంటూ అతడిచెవిలో వూదాడు.

"పొరపాటు" అన్నాడు జోసఫు — "ఏవివోవాళ్ళు అలాంటిపని చెయ్యరు."

కుర్రాడు అంతతో వూరుకోలేదు. "జర్మనులు ఇక్కడ వున్నప్పుడు ఈభవనం కట్టారని మానాన్న చెప్పాడు. ఈ భవనాలన్నిటికీ సొరంగమార్గాలున్నాయని ఆయనే నాతో చెప్పాడు" అన్నాడు.

ఆ కుర్రాడు జోసఫుని అనుకుని నుంచున్నాడు. వాళ్ళిద్దరికీ ఒక విధమైన నమ్మకం కుదిరింది. ఇద్దరూకలిసి ఒక సెపెలు కార్మికనాయకుణ్ణి పిలిచారు. అతడికి ఇరవై సంవత్సరాలుంటాయి.

"ఈ రేడియో భవనానికి ఒక సొరంగమార్గముందంటున్నాడు ఈ కుర్రాడు" సెపెలుమనిషి తనని నవ్వకుండా, తనకేమో అంత నమ్మకం లేనట్టు అతడితో అన్నాడు జోసఫు.

"అయితే వెళ్ళిచూద్దాం" అన్నాడు సెపెలు మనిషి. మరోముగ్గురిని తనవాళ్ళనికూడా పిలిచాడు.

ఇలా ఆ ఆరుగురూ పక్కవీధిలోకి వెళ్ళారు. కుర్రాడుచూపిన ఇంట్లో ప్రవేశించారు. "ఈ ఇంట్లో ఏదైనా సొరంగం వుందా ?" అంటూ ఆ ఇంటి యజమానిని అడిగారు.

"ఉంది" అన్నాడు ఇంటాయన— "హిట్లరుకాలంలో కట్టాం."

"అది ఎక్కడికి పోతుంది ?"

"నాకు తెలియదు."

ఆ ఆరుగురు యోధుల్నీ అతడు ఒకగదిలోకి తీసుకువెళ్ళాడు. ఒక తలుపు వెనక్కి తోశాడు. లోపల చీకటిగావుంది. "టార్చిలైటు వుందా ?"— నాయకుడు అడిగాడు. లైటువేశారు. గదిలో లోతయిన సొరంగం కనిపించింది. సెపెలుమనిషి తనతోటివాళ్ళని సొరంగంలోకి తీసుకువెళ్ళాడు. వంకరటింకరగానూ, చెమ్మగానూవుంది దారి. జాగ్రత్తగా అడుగులువేస్తూ కొంతదూరం వెళ్ళారు వాళ్ళు. నాయకుడు ఒకచోట ఆగి మెల్లిగా అన్నాడు. "ఈసొరంగం రేడియోభవనందాకా వెళ్ళవచ్చు. ఇదిగో, మీఇద్దరు కుర్రాళ్ళూ వెనక్కివెళ్ళి ఒక పాతికమందిని మరతుపాకులతోసహా తీసుకురండి."

వెలుతురులేని ఆ చీకటి సొరంగంలో గోడలు చేతులతో తడువు కుంటూ జోసపూ తన కొత్తస్నేహితుడూ వెనక్కి వచ్చారు. గదిలో, ఇంటా యన భయపడుతూ వాళ్ళకోసం నిరీక్షిస్తున్నాడు. జోసపు తన స్నేహితుడితో ఇలా అన్నాడు. "నువ్వు ఇక్కడేవుండు. వీడు కదలకండా చూడు. వీడు ఎవడో మనకి తెలియదుకదూ!"

ఇలాచెప్పి జోసపు ఒక్కపూవుని పైకి వెళ్ళాడు. ఒక పాతికమందిని సెపెలు కార్మికుల్ని వెంటపెట్టుకుని తిరిగివచ్చాడు. తాను వచ్చేసరికి, తాను ఒదిలివెళ్ళిన కుర్రాడు గోడకి ఆనుకొని ఇంటియజమానిమీద తుపాకి గురి పెట్టివున్నాడు. ఇంటియజమాని భయంతో వడవడా వణుకుతున్నాడు.

"నువ్వు ఇలాగ ఇక్కడేవుండు" కుర్రాణ్ణి ఆదేశించాడు జోసపు. సెపెలు మనుషులు ఒకరివెంటఒకరు సొరంగంలోకి దిగారు.

"మీరు ఏం చేయదలుచుకున్నారు ?"— కుర్రాడు అడిగాడు.

"కొంత పోరాటం జరగవచ్చు. నువ్వు ఇక్కడే కాపలాకాయి" అన్నాడు జోసపు. అతడుకూడా సొరంగంలోకి వురికాడు. సెపెలు కార్మికుల వెంట నడిచాడు. అందరూ నాయకుణ్ణి కలుసుకున్నారు.

"ఏవో మాటలు వినిపిస్తున్నాయి" కొంతదూరం వెళ్ళాక ఆగి మెల్లిగా అన్నాడునాయకుడు"ఇక్కడఎక్కడోఏవివోమనుషులువున్నారనుకుంటాను."

ఒక్కసారి అంతా నిశ్శబ్దమయింది. ఎక్కడో ఒక తలుపు అవతల నించి ఎవరివో ధ్వనులు వినిపిస్తున్నాయి. బహుశా గాయపడ్డ ఏవివో మను షులు అక్కడ తలదాచుకున్నారేమో! "ఏమైనాసరే, లోపలకిపోయిచూద్దాం" అన్నాడు నాయకుడు.

సాహసవంతులైన నలుగురు యువకుల్ని అతడు ఎంచాడు. రకోనీ మెటలువర్క్సులో పనిచేసే కమ్యూనిస్టులు వాళ్ళు. "నేను తోసుకు వెళ తాను. వాళ్ళు ఆశ్చర్యపోతారు. మీరు తుపాకులు సిద్ధంగా వుంచుకోండి. బహుశా నేను పడిపోవచ్చు" అంటూ వాళ్ళని హెచ్చరించాడు నాయకుడు.

"తుపాకులు పేలుస్తూ మనం లోపలికి వెళ్ళకూడదూ ?"

"ఏవివోవాళ్ళు నిర్బంధించిన ఖైదీలుకావచ్చు వాళ్ళు."

"ఏమయినా తుపాకులు పేల్చక తప్పదనుకుంటాను" అన్నాడు నలుగురిలో ఒకడు.

"సరే," ఆలోచిస్తూ అన్నాడు సెపెలు నాయకుడు— "కాని మొదట కొంచెం గుళ్ళు పైకిపేల్చండి. దాంతో వాళ్ళు ఎవళ్ళో ఆసంగతి మీకే తెలిసి పోతుంది."

"మేం తుపాకులు పేల్చుకుంటూనే లోపలికి వస్తాం" అన్నారు మిగి లినవాళ్ళు. పైకి పేల్చడంగురించిమాత్రం వాళ్ళు ఏమీ మాటఇవ్వలేదు.

సెపెలునాయకుడు ఒక్కదూటున తలుపుతోసుకుని లోపలపడ్డాడు. సుమారు యాభైమంది ఏవివోమనుషులు లోపలవున్నారు. నాయకుడివెంట వెళ్ళిన సెపెలు మనుషులు తుపాకులు పైకిపేల్చలేదు. కసితీరేటట్టు ఏవివో వాళ్ళమీదే గుళ్ళుకురిపించారు. ఏవివోవాళ్ళు తుపాకులతో జవాబివ్వలేదు. వాళ్ళు హాసోహమనేదాకా తుపాకులు పేలనిచ్చాడు నాయకుడు. ఏవివో వాళ్ళంతరూ చేతులెత్తేశారు. అందరినీ బైటికి తీసుకుపొండి" వాళ్ళందరినీ ఒక్కదగ్గిర పోగుచేసి, జోసపునీ మరో ఆరుగురినీ పిలిచి అన్నాడు నాయ కుడు—"కాని వీళ్ళని చంపవద్దు."

"ఏంచెయ్యదలుచుకున్నావు ?" అంటూ అడిగాడు ఒక యువకుడు.

"నాకు ఇంకా తెలియదు" అన్నాడు నాయకుడు.

జోసపుటాత్ ఏవివోవాళ్ళని సొరంగంగుండా తీసుకువెళ్ళిపోయాడు. రేడియోస్టేషనుకి తనకి మధ్యవున్న తలుపుకేసి చూస్తూ ఒకపెట్టెమీద కూచు న్నాడు సెపెలు కార్మికనాయకుడు.

జోసపుటాత్ తన ఆరుగురు అనుచరులతోనూ ఏవివోవాళ్ళని సొరం గం బైటిగదిలోకి తీసుకువచ్చాడు. కుర్రాడు ఇంకా గోడకి ఆనుకొని అలాగే తన తుపాకి ఇంటియజమాని గుండెలమీద గురిపెట్టి నుంచునేవున్నాడు.

"అక్కడ యాభైమంది ఏవివోవాళ్ళని చూశాం" జోసపుటాత్ అరి చాడు.

"వాళ్ళు మామ్మూలుగా అందరిలాగే అవుపిస్తారు"అన్నాడు కుర్రాడు.

జోసపు ఏవివోవాళ్ళతట్టు చూశాడు. కోపంతో వణికిపోయా డతడు. ఏవివో మనుషుల ఎదట నిలబడడం ఇదే అతడికి మొదటిసారి. ఇప్పుడు వాళ్ళు ఏమంత ప్రమాదకరంగా అవుపించలేదు. వాళ్ళు ఒక అంగుళం కది లితేచాలు, ఆరుగురు సెపెలు కార్మికులూ వాళ్ళని తునకలుకిందకొట్టేస్తారు.

జోసపుటాత్ వీధిలోకి వచ్చేసరికి పోరాటం ఘోరంగా జరుగుతూ వుంది. ఒక ఏవివోమనిషి రేడియోస్టేషను కప్పుమీదకూచుని ఎడాపెడా గుళ్ళు

పేల్చేస్తున్నాడు, నిర్లక్ష్యంగా. ఒకగుండువచ్చి జోనపు ఎడమకాలు దూసుకు పోయింది.

జోనపుకి చెప్పలేనంత బాధకలిగింది. కాలు తుక్కయిపోయిందనిపించింది. పంట్లంనించి రక్తం ధారలు కట్టింది. అతడు పడిపోయాడు. ఈ సందడిలో ఒక ఏవివోమనిషి పారిపోవాలని చూశాడు. సెపెల్ మనిషి తుపాకీ కాల్చాడు. ఏవివోమనుషులు వీధిలోకి వచ్చారు. అవతలపక్కనించి పెద్ద రొద వచ్చింది. రేడియోస్టేషను కర్రతలుపులమీద గ్రెనేడ్లు (చేతిబాంబులు) పడుతున్నాయి.

"తలుపులు పడిపోతున్నాయి"— దూరంనించి ఒక కేక వినపడింది. అదే జోనపువిన్న చివరి మాట. అతడు స్పృహతప్పి పడిపోయాడు.

# వివేకవంతులు

హంగేరీ విప్లవంలో జరిగిన ఒకవిషయం సోవియటు రష్యాను బాగా కలతపెట్టింది. అది ఏమిటంటే, పార్టీలోని వివేకవంతులే వ్యతిరేకించి ధ్వజమెత్తడం. తరగతులులేని సంఘం ఒక్క కమ్యూనిజమే నిర్మించగలదని ఎంత ప్రచారంచేసినా అది స్వయంగా తరగతులవారీ విభజనమీదే తయారయింది. పార్టీలో కొందరికిమాత్రమే అన్ని సదుపాయాలూ లభిస్తాయి. పార్టీ నాయకుల్లాగ ప్రజలికి అధికారం లేదు; అలాఅని వాళ్ళు పార్టీనించి చీలిపోయి చేసేదీలేదు. ఇద్దరు కమ్యూనిస్టు యువకులు పార్టీలో అగ్రస్థానానికి ఎన్నికయ్యాక, కమ్యూనిజం కావాలా, దేశభక్తి కావాలా, అనేటప్పటికి 'కమ్యూనిజం కావాలి' అనడానికి వెనక్కి తగ్గారు. ఆకథ చెపుతాను. వీళ్ళ ఇద్దరిచరిత్రా నాయకులికి సింహస్వప్నం. చదువుకున్న యువకులు తాము ఎరిగినపద్ధతికంటే కమ్యూనిజం తమాషాగా వుంటుందని అభిప్రాయపడి, ఆవేశం తెచ్చుకున్నా, తీరా కమ్యూనిస్టు నియంతృత్వం వచ్చి తమని అపరించేటప్పటికి తిరగబడతారు.

ఇస్త్వానుబలోగ్ బాగా చదివి పైకివచ్చాడు. అతడు ఒక కార్మికుడి కొడుకు. అంచేత హైస్కూలుతరగతిని మించి చదువుకునే అర్హత తనకి

కలిగింది. ఒకనాడు అతణ్ణిచూసి పార్టీఉద్యోగి వాళ్ళఇంట్లో ఇలా అన్నాడు: 'మేము ఇస్ట్వాన్ను కనిపెట్టి చూస్తున్నాం. ఇతడు తెలివైనవాడు. ఇలా పుస్తకాలు ప్రేమించే యువకులే మాకు కావాలి. ఇతడి వయస్సెంత?"

"పదహారు" అన్నాడు ఇస్ట్వాన్.

"విశ్వవిద్యాలయం చదువుకి అర్హత సంపాదించాలంటే నీకు అనుభవం కావాలి. నాకొక ఫ్యాక్టరీ తెలుసు........"

"ఫ్యాక్టరీలో పనిచేసేటంత వయస్సువచ్చిందా నాకు?" ఇస్ట్వాను అడిగాడు.

"నువ్వు బక్కపలచగానే వున్నావు. కాని ఫ్యాక్టరీ అనుభవం లేందే ఏదీ సాధ్యంకాదు" అన్నాడు ఉద్యోగి.

ఇస్ట్వానుబలోగ్ బుడాపేస్టులో కాంటాక్టా ఎలెక్ట్రికలు ఫ్యాక్టరీలో పనికి కుదిరాడు. తనచుట్టూవున్నవాళ్ళందరిలో తాను బలహీనుడైనా అతడు ఎంతో వోపికతో పనిచేసి ప్రతినెలా తనకి ఇచ్చిన పనికంటే ఎక్కువ చేసేవాడు. ఒక పఠనసంఘానికి అతణ్ణి నాయకుడిగా నియమించారు. ఫ్యాక్టరీ పని అయాక ఈ సంఘం కార్లుమార్క్సు, లెనిను, స్టాలిను గ్రంథాలు చదవాలి.

ఇస్ట్వానుకి చదువులో బుద్ధి లగ్నమయింది. అందులోనే ఎంతోకాలం గడిపాడతడు. అయితే దానివల్ల తనకిచ్చినపనిమాత్రం పూర్తిచేయలేకపోయేవాడు. ఏవివో మనుషులువచ్చి అతణ్ణి పట్టుకున్నారు; రెండురోజులు నిర్బంధంలో వుంచారు. నిజంగా అతడికి ఫ్యాక్టరీమీదా, కమ్యూనిస్టురాజ్యంమీదా భక్తివుందా లేదా అని పరీక్షించారు. అతడు భక్తికలవాడే అని తృప్తిపడ్డాక వొదిలిపెట్టారు. అప్పుడే యూనివర్సిటీ చదువుకి అతడు తగినవాడేఅని యోగ్యతాపత్ర మిచ్చారు.

కాని ఇంకా అతణ్ణి పూర్తిగా పరీక్షించడంకోసం మరోఅయిదేళ్ళు ఫ్యాక్టరీలో పనిచేయాలని నియమించారు. అంతకాలమూ అతడు పనిలో ఏమాత్రమూ ఏమరపాటు చూపకండా పనిచేశాడు.

ఇస్ట్వాన్‌బలోగ్ తన ఇరవైరెండో ఏట మంచి పనివాడుగానూ, గట్టి కమ్యూనిస్టుగానూ తయారయాడు. సన్నగా వుక్కుతీగలాంటి శరీరమతడిది. నల్లటిజుత్తు చెవులమీద వేలాడుతూవుండేది. అతడి నల్లటి కళ్ళలో ఆవేశం వుట్టిపడుతూవుండేది. పార్టీలో మంచి పలుకుబడికల సభ్యుడయాడతడు.

బుడాపేస్టు యూనివర్శిటీలో లా చదవడానికి అర్హుడని పార్టీవాళ్ళు నిర్ణయించారు. యూనివర్శిటీలో అతడికి ప్రత్యేకస్థానం లభించింది. ప్రభుత్వంలో అతడికి పెద్దఉద్యోగం ఇస్తారని ప్రొఫెసర్లు చెప్పారు. ఇస్త్వాన్‌కి యూనివర్శిటీ చదువు మంచి అనుభవం కలిగించింది. చదువుకోడానికి కావలిసిన పుస్తకాలు లభించడమేకాకండా, మేధావులైన ఎంతోమంది ప్రొఫెసర్లతో అతడికి పరిచయం కలిగింది. "వాళ్ళు నాకు న్యాయశాస్త్రమూ, మార్క్సిస్టు సిద్ధాంతాలూ, కమ్యూనిజం చరిత్రా, మిలిటరీ శాస్త్రమూ నేర్పారు. విద్యలో అఖండులు వాళ్ళు"— అనేవాడతడు.

అంతకంటే ముఖ్యమయిందేమిటంటే విద్యార్థుల్లో కొంతమంది భావాలు తనకంటే బాగాపరిణతి పొందివుండేవి. కమ్యూనిస్టుసిద్ధాంతంమాత్రం తనకి క్షుణ్ణంగా తెలుసు దానివల్లే అతడికి మంచిమార్కులు వచ్చాయి. కమ్యూనిస్టు ప్రొఫెసర్లు మార్క్సిస్టు సిద్ధాంతాల్లో ఎంతో ప్రవీణులుగావుండేవాళ్ళు. న్యాయవాది కాగోరిన ప్రతివిద్యార్థీ తమతో సమానమైన ప్రావీణ్యం గడించాలని వాళ్ళు అనేవాళ్ళు. ఇస్త్వాను ఇంకా రష్యాభాష బాగా చదవలేకపోతున్నాడు. అది చక్కగా రాకపోతే డిగ్రీ దొరకదని ప్రొఫెసర్లు హెచ్చరించారు. ఇస్త్వాన్ చాలా కష్టపడి రష్యాభాష చదివాడు; క్లాసులో మొదటివాడుగా నెగ్గాడు.

ఈలోగా అతడు కొన్నిసభల్లోకి వెళ్ళి పాల్గొన్నాడు. దాంతో అతడి జీవితమంతా తారుమారయిపోయింది.

1956 అక్టోబరు 19 దీనాడు ఆ సభలు ఆరంభమయాయి. బుడాపేస్టు విద్యార్థులు ఈసభల్లో పాల్గొన్నారు. తామంతా ఒకటనీ, పోలండులో రష్యా అధికార్లమీద తిరగబడుతూవున్న పోలిషు విద్యార్థులమీద తమకి సంపూర్ణమైన సానుభూతివుందనీ వాళ్ళు ఉపన్యాసాలిచ్చారు. పోలిష్ వ్యవహారాలంటే సౌహార్ద్రపూర్వకమైన అభినివేశం కొంత వుండడమూ, పోజునాడ్‌లో జరిగిన అల్లర్లబట్టి బహుశా హంగేరీకూడా అదేవిధంగా బానిసత్వంనించి విముక్తిపొందడం సాధ్యమేమోఅని అనేకమంది విద్యార్థులు అనుకోడమూ ఈసభలికి పునాదులయాయి. ఇస్త్వాను ఆసభల్లో పాల్గొన్నాడు.

అతడి ప్రవర్తన తోటి విద్యార్థులు గమనించారు. అక్టోబరు 21ని బుడాపేస్టులో సమావేశమై సంప్రదించనున్న కాలేజీవిద్యార్థుల సభకి ఇస్త్వానును తమ ప్రతినిధిగా ఎన్నుకున్నారు. యువకులంతా అప్పటి అయిదు

ముఖ్యసమస్యలగురించి ఆందోళనపడుతూ వుండేవాళ్ళు. 1. హంగెరీనించి రష్యావాళ్ళని వెళ్ళగొట్టడం. 2. జీవిత పరిమాణం హెచ్చించడం. 3. ఆర్థిక సామగ్రి అధికంగా సానుకూలపరచడం. 4. బలవంతంగా రష్యాభాష నేర్పే ఉద్యమం అవుచేయించడం. 5. అబాలగోపాలమూ ద్వేషించే రష్యా సుత్తి, కొడవలి తీసేసి 1848 విప్లవంలో ప్రముఖ హంగేరీనాయకుడైన లూయీ కానత్‌చిహ్నం జాతీయచిహ్నంగా పునరుద్ధరించడం. అయిదోది అన్నిటి కంటే ప్రియమైంది.

అక్టోబరు 22నాడు కమ్యూనిజానికి వ్యతిరేకంగా ప్రారంభంకాబోయే విప్లవంలో తాను సహాయపడతానన్న విషయం ఇస్త్వాన్‌బలోగ్‌కి తెలియదు. అనాడు అతడు డాన్యూబునదిదాటి బుడాపట్నంలోని టెక్నికలు హైస్కూలులో విద్యార్థికులైన కమ్యూనిస్టు యువకులసభలో పాల్గొనడానికి వెళ్ళాడు. సభా ప్రారంభంలోనే హంగేరీ ప్రజల కష్టాల పట్టిక ఒకటి వాళ్ళు తయారుచేశారు. సాయంకాలం మూడుగంటలికి బహిరంగసభ ప్రకటించారు. సభాస్థలంలో వందలువందలు యువకులూ, సెపెలు కార్మికులూ పోగయారు. బలోగు కమిటీచేసిన పనికి వాళ్ళందరూ సంతోషించారు. అంతమంది అక్కడ సమావేశం కావడంచూసి ఇస్త్వానుబలోగ్ ఆశ్చర్యపడ్డాడు. "మేం ఏదోరాసిన దానికి ప్రజలు ఇంతగా ఆదరిస్తారని మొదటిసారి నేను గ్రహించాను" అన్నాడు బలోగ్; వెనకటి సంగతులు జ్ఞాపకంచేసుకుంటూ.

సభలో ఒక్కొక్క ఉపన్యాసకుడూలేచి ఉపన్యాసమిస్తూవుంటే ఇస్త్వాను ఆవేశం నీళ్ళుకారిపోయింది. ఎవ్వరి ఉపన్యాసమూ ఉద్రేకపూరితంగా లేదు. "ఏమీ జరగదు. ఇదీఒకందుకు మంచిదే" అనుకున్నాడు బలోగ్.

సభ ఇంకా ముగియలేదు. సభ వెనకనుంచి ఎవరో ఒక అవ్యక్తవ్యక్తి లేచాడు. కొట్టవచ్చినట్టు సూటిగా ప్రశ్నించాడు "నేను ఒక్కప్రశ్న వెయ్యదలచుకున్నాను. మనదేశంలో రష్యా పటాలాలు ఏహక్కుకింద పడావువేసి వున్నాయి ?"

సభలో మందుగుండు పేలినట్టయింది. విద్యార్థులు తాముకూచున్న దగ్గిరనించి ఒక్కసారిలేచి కేకలువేశారు "రష్యావాళ్ళని వెళ్ళగొట్టండి! రష్యావాళ్ళని వెళ్ళగొట్టండి!!"

కొంతమంది ఈలలు వేశారు. కొందరు అరిచారు. దీంతో ఉపన్యాసం చేసేవాళ్ళకి ఎక్కడలేని ఆవేశం వచ్చింది. ఆ ఆవేశంలో, తాము బలవం

తంగా గురిఅవుతూవున్న నిరంకుశత్వంగురించి మాట్లాడారు వాళ్ళు. అప్పుడు ప్రకటమైన దేశభక్తిచూసి ఇస్త్వాన్‌బలోగ్‌కూడా ఆవేశం తెచ్చుకు న్నాడు. "రష్యావాళ్ళు హంగేరీవిడిచి వెళ్ళాలి" అంటూ వేదికమీంచి గట్టిగా అరిచాడు.

సభసభంతా ఆవేశపూరితమయింది; ప్రశ్నపరంపరలు కురిపించింది. ఏవేవోవాళ్ళు అంతవరకూ కప్పిపుచ్చిన విషయాలమీద ప్రశ్నలవి.

"విలువైన మా యురేనియం యావత్తూ రష్యావాళ్లు దోచుకుపోయి దానికిబదులు మాకు వాళ్ళు ఇస్తున్నదేమిటి ? బతకడానికి సరిపోయినంత డబ్బు మనవాళ్ళు ఎందుకు గడించలేకపోతున్నారు ? పాశ్చాత్యగ్రంథాలు మనం ఎంచేత చదవలేకపోతున్నాము ?"

ఈ ప్రశ్నల వరద తగ్గాక, ఇస్త్వాన్ బలోగ్ కమిటీ కమ్యూనిస్టు ప్రభుత్వం జవాబు చెప్పవలసిన ప్రశ్నల పట్టిక ఒకటి తయారుచేసింది. "రష్యా సైనికులు హంగేరీ వొదిలి ఎప్పుడు వెళతారు ?" అన్నది అందులో నాలుగోప్రశ్న. అవాళనించీ ఆప్రశ్నే విద్యార్థుల ఉద్యమం అంతటికీ పునాది అయింది.

ప్రశ్నలన్నీ తయారయాయి. అంతలో ముతకగుడ్డలు కట్టుకున్న ఒక వ్యక్తి సభలోంచి లేచి నుంచున్నాడు. "నేను మీలాంటి మెత్తటిభాష మాట్లాడ లేను. నేను సెపెలులో పనిచేస్తూవున్న ఒక కార్మికుణ్ణి. ఇవాళ ఇక్కడవిన్న ఉపన్యాసాలు నా గుండె రక్తం ఉడుకెత్తించాయి. మీరు ఎంతో మంచిపని చేస్తున్నారు. నావంటి వాళ్ళు ఎందరో మీతో కలిసి సహకరిస్తారు" అన్నాడు.

ఇదిగో ఇలాంటి ప్రోత్సాహమే ఇస్త్వానుకి కావలిసింది. "అక్టోబరు 23 దీని, అంటే మర్నాడు జనరల్ జోసఫుబెమ్ విగ్రహం దగ్గిర బహిరంగంగా సానుభూతి సభ జరపాల"ని అతడు ఒక తీర్మానం ప్రవేశపెట్టాడు. అది అందరూ ఏకగ్రీవంగా ఆమోదించారు.

జోసఫుబెమ్ 1848 లో జరిగిన హంగేరీ విప్లవంలో పోలండునించి స్వచ్ఛంద సేవకుడుగా వచ్చాడు. అప్పుడుకూడా రష్యావాళ్ళు వాలంటీర్లుగా వచ్చారు.

అధ్యక్షుడు సభ ముగిసిందని ప్రకటించాడు.

నాటిరాత్రి ఇస్త్వాన్‌బలోగ్ పెస్టు పట్నంలోవున్న తన బసకి గొప్ప ఆవేశంతో వచ్చాడు. "అవాళ సభలో ఏవేవో మనుషులు ఎవరైనా గూఢ

చారులుగా వుండి, అంతా గమనించివుంటే- ఇప్పుడు ఏమవుతుందో ?" అంటూ మాటిమాటికీ తనలో తాను తర్కించుకున్నాడు. వేదికమీంచి మొండి ధైర్యంతో తాను అరిచిన అరుపులన్నీ జ్ఞప్తితెచ్చుకున్నాడు.

"నేను కమ్యూనిస్టుని. రష్యా మాకు మిత్రదేశం. మేం దానిస్నేహం వొదిలేస్తే మళ్ళీ ఫాసిస్టులు అధికారానికి వస్తారు" అంటూ తనలో తాను ఊహించుకున్నాడతడు. నిర్లక్ష్యంగా, ముందూ వెనకా చూసుకోకండా ఆ రాత్రి తాను చేసినపనులు అపరాధాలని అనుకున్నాడు. 'మనకి కావలి సినవన్నీ అక్కడా అక్కడా కొన్నిమార్పులు మాత్రమే. అధికం ఆహారపదార్థాలూ – ఇలాంటివే" అని భావించుకున్నాడు.

ఇంత సతమతమైపోయిన ఆ కమ్యూనిస్టు యువకుడు మర్నాడు పెద్ద సుడిగుండంలా వచ్చిన ప్రజల ఆవేశంలో ఇట్టే చిక్కుకున్నాడు. అనుకున్నట్టు ఏ కొద్దిమంది విద్యార్థులోకాక ఏభై వేలమంది దేశభక్తులు జోసపుబెమ్ విగ్రహం దగ్గిర సమావేశమయారు. 'ఇస్త్వాను బలోగ్ మళ్ళీ వాళ్ళతో కలిశాడు; కేకలు వేశాడు. ఈసారి కేవలం క్షణికమైన ఆవేశంతో అరిచిన అరుపులు కావవి. బాగా ఆలోచించి, అనుకుని అరిచిన అరుపు లవి.

"రష్యావాళ్ళు వెళ్ళిపోయి తీరాలి !"

ఆవాళ సాయంకాలం అనుకోకండానే పార్లమెంటు స్క్వేరు ఎదురుగా పోగయిన మరింత పెద్ద జనసమూహంతో కలిసిపోయా డతడు. యూరపులోకల్లా అందమైన భవనాల్లో వొకటైన అక్కడి పార్లమెంటు భవనంముందు ఎనభై వేలమంది హంగేరీ ప్రజలు సమావేశమై, రాజకీయ న్యాయంకోరుతూ నుంచున్నారు. ఇస్త్వాను వందలకొద్దీ కొత్తపతాకాలు చూశాడు. కమ్యూనిస్టుల ఎర్రజెండాలమీద వున్న సోవియట్ సుత్తీ కొడవలీ చిరిగిపోయి వున్నాయి. హంగేరీ స్వాతంత్ర్యంకోసం వెర్రి ఆవేశంతోవున్న పురుషులూ, స్త్రీలూ అతడికి అవుపించారు.

"నాయకులు నశించాలి."

"స్వాతంత్ర్యం వర్ధిల్లాలి."

"ఇమ్రె నాగీ కావాలి."

చివరి నినాదం ఇస్త్వానులో ఆశాజ్యోతి వెలిగించింది. ఏమంటే ఇమ్రె నాగి నమ్మకమైన కమ్యూనిస్టు. చాలాకాలం అధికారం అనుభవించినవాడు. విశాలభావాలు కలవాడు. అంచేతే రెండేళ్ళకిందట అతణ్ణి అధికారంలోంచి

తొలిగించారు. ఇమ్రి నాగీ అధికారంలోకి వస్తే హంగేరీకి స్వాతంత్ర్యం లభిస్తుంది. స్వాతంత్ర్యంతోవున్న హంగేరీ మంచి కమ్యూనిస్టు దేశంగా వుంటుంది.

ఇమ్రి నాగీ పార్లమెంటు భవనం బాల్కనీమీదికి వచ్చి ప్రజల్ని సంబోధించడంచూసి ఇస్త్వాను ఆశ్చర్యపడ్డాడు.

"ప్రియమైన కామ్రేడ్లూ!"- నాగీ ఉపన్యాస మారంభించాడు. ప్రజలు నిరాకరణ సూచకంగా పొలికేకలు పెట్టారు– "మేం కామ్రేడ్లం కాం. అలా మమ్మల్ని పిలవవద్దు."

ఈ నిరాకరణ స్వీకరిస్తూ, కమ్యూనిస్టుల పాతకాపయిన నాగీ మళ్ళీ ప్రారంభించాడు– "ప్రియమైన స్నేహితులారా!"

అంగీకార సూచకంగా ప్రజలు హర్షధ్వానాలు చేశారు. నాగీ ప్రజాభిప్రాయం ప్రకారం ఎక్కడికక్కడ లొంగిపోతున్నాడు. మూర్ఛావస్థలో వున్నట్టు వుండి ఇస్త్వాను ఇదంతా గమనిస్తున్నాడు. పాతకాపయిన నాగీ ఇలా లొంగిపోవడం చూసి అతడు చకితుడయాడు.

హంగేరీ పాతపాటనించి ఒక చరణం ప్రజలు పాడడ మారంభించారు-

"ఇపుడే ఇపుడే ఇపుడే జరగాలి.
కాదంటావా ఎపుడూ జరగదు"

ఉద్రేకపూరితమైన ఆపాట అలా సాగుతూవుంటే, నిశ్శబ్దంగా వుండండని నాగీ చెయ్యెత్తాడు. ఒణుకుతూవున్న గొంతుకతో "హంగేరీకి అభ్యుదం కలగాలి" అన్న పాట అతడు మొదలుపెట్టాడు. కమ్యూనిస్టులు నిషేధించిన పాట అది. ప్రజల్లో సంతోషం తాండవించింది.

ఆ పొంగులో జనం బుడాపెస్టంతా అల్లుకున్నారు. ఇంతలో భయంకరమైన ఒకవార్త వచ్చింది. "రేడియోస్టేషను దగ్గిర తుపాకి కాల్పులు జరిగాయి" దొమ్మీచేసిన వాళ్ళమీద బహుశా ఏవివో వాళ్ళు తుపాకులు పేల్చి వుంటారు అని మొదట ఇస్త్వాను అనుకున్నాడు. ఇంతలో కొత్త వార్తలు వచ్చాయి. ఉద్రేకం రెచ్చగొట్టే వార్తలవి.

"విద్యార్థులూ, కార్మికులూ కలిసి ఏవివో వాళ్ళని హతమారుస్తున్నారు"

దేశభక్తులంచరూ వెర్రెత్తినట్టు రేడియో భవనంవేపు పరిగెడుతున్నారు. మరికొందరు- వాళ్ళలో ఇస్త్వాబలోగ్ కూడా వున్నాడు- బుడాపెస్టులోని స్టాలిన్ స్క్వేరు తట్టు దూసుకువెళ్ళారు. అది పట్టణంలోకల్లా పెద్ద సమావేశస్థానం. పెస్టులోని పెద్దపార్కుకి దక్షిణంగావుంది అది.

అక్కడ కాగడాల వెలుగులో, మోటారుకార్ల వెలుగులో ఇస్త్వాను రష్యా వాళ్ళకి వ్యతిరేకంగా నినాదాలు చేస్తున్నవాళ్ళని వేలాదిమందిని చూశాడు. ఇలా బహిరంగంగా ప్రజలు తమ ద్వేషం వెలిబుచ్చుతూవున్న వైఖరిచూసి అతడికి ఆశ్చర్యం వేసింది. వాళ్ళు చేస్తూన్న నినాదాలు నిజమా కాదా అన్నంత సందేహం కలిగింది.

"రష్యావాళ్ళు మా యురేనియం దోచుకుంటున్నారు"— ఎక్కువ మంది పాడే పాట ఇది.

"ఏవివో వాళ్ళు మమ్మల్ని అష్టకష్టాలూ పెడుతున్నారు"— మరొక నినాదం.

"మమ్మల్ని తిండిలేకుండా చంపుతున్నారు"— ఇది మరొక కేక.

ఇంతలో ఇద్దరు యువకులు జోనపుస్టాలిను పెద్ద లోహవిగ్రహంమీదికి ఎక్కడం చూశాడతడు. తాళ్ళువేసి మీదికి వెళుతున్నారు వాళ్ళు.

ఆతాళ్ళతో బరువైన తీగెలు మీదికి లాగుతున్నారు. ఎలా అయితేనేం మొత్తానికి విగ్రహం తలకి ఆ తీగెలు చుట్టారు. "అదిగదీ! బలే!" అంటూ ప్రజలు కేకలు వేశారు. పాకుతూ యువకులు ఇద్దరూ కిందికి దిగేశారు. విగ్రహం కింద పడలాగడంకోసం వందలాదిచేతులు ప్రయత్నించాయి. జన సమూహం చూస్తూ నుంచుంది. వాళ్ళకి ఆశాభంగ మయింది. స్టాలిను విగ్రహం మంచి బలమైన ఉక్కుతో చేశారు రష్యావాళ్ళు. అది పడదొయ్యడం సాధ్యంకాలేదు. వికృతంగావున్న ఆ విగ్రహాన్ని ఆడంగులు పిడికిళ్ళతో గుద్దారు. ఇంతలో ముగ్గురు కార్మిక యువకులు అక్కడికి వచ్చారు. వాళ్ళదగ్గిర యాసిటిలిక్ కాగడాలున్నాయి. వాటితో వాళ్ళుస్టాలిను విగ్రహం మోకాళ్ళ వెనకభాగం కోసేశారు. సంతోషంతో జనసమూహం కోలాహలం చేసింది. మిగిలిన కార్మికులు యావన్మందీ బలమంతా వినియోగించి విగ్రహం లాగారు. భయంకరమైన ఆ విగ్రహం మెల్లిమెల్లిగా ముందుకు వంగింది. మోకాళ్ళదగ్గిర లోహం చిట్లింది. ఒకయువకుడు అక్కడే గునపం మెలిపెట్టి దబాయించాడు.

విగ్రహం మెల్లిగా పీఠంమీంచి వొరిగింది. తుదకి బోర్లా పడిపోయింది. ప్రజలు పిచ్చెత్తినట్లు అరిచారు. లోగడ స్టాలిను స్క్వేరులో ఏముండేదో వొక్కసారి జ్ఞాపకం వచ్చింది వాళ్ళకి.

"మా చర్చి మాకు కావాలి.
"మా చర్చి మాకు కావాలి."

అంటూ వెంటనే పాట లంకించుకున్నారు వాళ్ళు. ఆ స్క్వేరులో ఒకప్పుడు ఒక జయ స్తంభం వుండేదని ఇస్త్వానుకు జ్ఞాపకం వచ్చింది.

"మా గుడి మాకు కావాలి" అని జనసమూహంలోవున్న పెద్దవాళ్ళు యావన్మందీ పాడారు. తరవాత జరిగిందంతా ఇస్త్వానును మరింత ఆశ్చర్య పరిచింది. శిథిలమైన గుడి గురించి పాడడం మానేశారు ప్రజలు. పడిపోయిన స్టాలిను విగ్రహం దిక్కు దూసుకువెళ్ళారు. ఆ విగ్రహంమీద అంతమందీ వుమ్మేశారు. స్టాలిను పరిపాలనకింద బాధలుపడ్డ స్త్రీలూ, పురుషులూ పడిపోయిన రాక్షసుణ్ణి అవమానపరిచి కసితీర్చుకున్నారు.

"వెల్లకిలా దొర్లించండి" అంటూ అరిచారు జనం.

ఒక కార్మికుడు సుత్తి పట్టుకుని విగ్రహంమీద బాదడ మారంభించాడు. "ఇది కరిగించి తుపాకి గుళ్ళుపోస్తాం" అన్నాడొకడు.

"మీరు యావన్మందీ రేపు రావచ్చు" స్టాలిను తలచుట్టూ మూగిన జనసమూహాన్ని వెనక్కి తోసేస్తూ అన్నాడు ఒక విద్యార్థి. అతడి చేతిలో తాడుంది. తనతోటి లా విద్యార్థి అని అతణ్ణి ఇస్త్వాను గుర్తించాడు.

"ఏం చేస్తున్నావోయి నువ్వు?" ఇస్త్వాను కేక వేశాడు.

"దీనిమీద సవారీ చేస్తాను" అన్నాడు లావిద్యార్థి.

ఇంతలో ఒక ట్రక్కు వచ్చింది. దానిమీదికి తాడు విసిరా డతడు. ఇస్త్వాను ఒక్క వూపుని దానిమీద దూకాడు. స్టాలిను స్క్వేరు దాటుతూ డ్రైవరు బండి నడిపాడు. వికృతమైన స్టాలిను విగ్రహం దాని వెనకాలే నేల గరగర మనిపిస్తూ ఈడ్చుకుపోయారు. స్టాలిను వీధిమీదుగా పట్నంమధ్యకి ట్రక్కు నడిచింది. సోవియటు నియంత లోహవిగ్రహం ప్రజల తిట్లు తింటూ, గరగరా గరగరా ట్రక్కు వెనకాల ఈడిగిలబడుతూ వెళ్ళింది. మోకాళ్ళదాకా విరిగిపోయినా ఆ విగ్రహం భయంకరంగానూ, బ్రహ్మాండంగానూ వుంది.

బుడాపెస్టు పట్నం చుట్టూవున్న పెద్ద వీధిగుండా వెళ్ళి ట్రక్కు దక్షిణ దిక్కుగా మళ్ళింది. ఇస్త్వాను బలోగ్ ఎంతో అంత ఆవేశంతో ప్రజల్ని రెచ్చగొడుతూ కేకలు వేశాడు.

"ఈ గజదొంగని పట్టేశాం."

రకోజీవీధి మలుపులో జోసఫ్ స్టాలిను అవమానం అప్పటిమట్టుకు

అంతమయింది. దీనితరవాత అంతకంటే పెద్ద అవమానం మొదలయింది. ఏమంటే అక్కడేవున్న ఒక కమ్యూనిష్టు ప్రచారపత్రిక "ఫ్రీ పీపుల్" కార్యాలయంముందు ఒక విద్యార్థి గుంపు పోగయింది. అది బుడాపెస్టులోకల్లా పెద్ద ప్రచార ముద్రణాలయం. దానిని విద్యార్థులు ముట్టడించారు. పెద్ద దొమ్మి జరిగింది. ఇన్నాళ్ళూ కమ్యూనిస్టులు ప్రచారం చేస్తూవున్న అబద్ధాలంటే వాళ్ళకి ఎంత ద్వేషం కలిగిందంటే, ఆ భవనం వాళ్ళు ఉత్తచేతులతోనే ధ్వంసం చేసేశారు. మంచి కమ్యూనిష్టుగా ఎన్నికైన ఇస్త్వాను బలోగ్ ఇప్పుడు కమ్యూనిష్టుల అబద్ధాలుకూ, వాళ్ళపీడకూ వ్యతిరేకంగా తన దేశీయులు మొదలుపెట్టిన పోరాటంలో హృదయ పూర్వకంగా పాల్గొన్నాడు. ఫ్రీ పీపుల్ కార్యాలయం తరవాత 'ఫ్రీ పీపుల్' పుస్తకాల దుకాణానికి వెళ్ళారు విద్యార్థులు. ఫ్రీ పీపుల్ కార్యాలయం అప్పటికే పూర్తిగా ధ్వంసమైపోయింది. ఇప్పుడు పుస్తకాల దుకాణం పెద్ద కిటికీలమీద విద్యార్థులు పడ్డారు. కిటికీలు బద్దలు కొట్టేశారు. తలుపులు విరిచేశారు. కమ్యూనిష్టు పుస్తకాలన్నీ వీధిలోకి అడ్డదిడ్డంగా విసిరేశారు.

ఇస్త్వాన్ బలోగ్ ఆ గుంపులో దూరి పుస్తకాలు పారెయ్యడంలో బుజాలు కలిపాడు. ట్రక్కులోంచి ఒక కార్మికుడు గ్యాసోలిన్ వేసి అపుస్తకాలు నిప్పంటించాడు. చూసి సహవ్వా అంటూ ఇస్త్వాను అరిచాడు. అయిదు గంటలసేపు ఇస్త్వాను విద్యార్థులతో కలిసి కమ్యూనిష్టు ప్రచార గ్రంథాలు యావత్తూ కాల్చి బుగ్గిచేసేశాడు.

తాను చేస్తూవున్న పనిమీద అతడికి వ్యతిరేకభావం కలుగుతూవుండేది. పుస్తకాలు కాల్చడమా? ఇంతలో, స్టాలిన్ మొహం, పుస్తకాల మంట వెలుగులో అతడికి అవుపించింది. మరిన్ని పుస్తకాలు మంటలో వేశాడతడు. చివరికి అతడి చేతులు పీకిపోయాయి.

ఇస్త్వాను బలోగ్ ఏమంత వీరుడుకాడు. హంగేరీ స్వాతంత్ర్యంకోసం పోరాడిన ఆవేశపూరితుడైన దేశభక్తుడున్నూ కాడు. పొరపాటున కాలుజారి కమ్యూనిజంమీద విముఖుడైనవాడతడు. పరిస్థితులు మరోవిధంగా వుండి వుంటే తన చేతలుకూడా ఇంకోవిధంగా వుండేవని ప్రతిభాశాలి అయిన ఆ యువకుడికి తెలుసు. "ఆ తిరుగుబాటూ, ఆ దొమ్మీ జరక్కపోయివుంటే నేను కమ్యూనిష్టుగానే వుండి, కమ్యూనిష్టు ప్రభుత్వాన్నే సమర్థించి వుండేవాణ్ణి. ఆ ప్రభుత్వ భయంకర చర్యలగురించి నేను ఎన్నడూ మాటాడలేదు.

ఏవివోకి భయపడుతూనే నా జీవితం గడుపుకునేవాణ్ణి. చేత చిక్కినన్ని లాభాలున్నూ పొందేవాణ్ణి" నెత్తిమీద ఒక చెయ్యిపెట్టి, తన నల్లటి జుత్తు నొక్కుకుంటూ అనుకున్నాడతడు. తరవాత రెండు చేతులూ వేలాడ దీసుకుంటూ అన్నాడతడు: "రష్యా టాంకులు వీధి దొమ్మీలో విధ్వంసం చెయ్యడానికి నేను ఎలా చేతులు కలిపానో ఇప్పటికీ నాకు ఆశ్చర్యంగానే వుంది."

అతడి మాటలు వింటే, ఇస్త్వానువంటి మంచి శిష్యుణ్ణి పోగొట్టుకోడం రష్యనుల దురదృష్టమే అనిపిస్తుంది.

పీటరు జిగేటీ విషయంలో అలాంటి దురదృష్టం కలగలేదు. పీటరు చక్కనివాడు. మర్యాద తెలిసినవాడు. అతడి వయస్సు 27 సంవత్సరాలు. పార్టీలోవుండి అతడు కమ్యూనిస్టుసిద్ధాంతం క్షుణ్ణంగా నేర్చుకున్నాడు. విమర్శదృష్టితో దాన్ని విడమర్చి, దానిలోతుల్ని తడివి చూశాడు. చివరికి అదంతా హంగేరీకి అపచారకరమైందని గ్రహించాడు.

"పదహారో సంవత్సరంనించీ నేను కమ్యూనిజంమీద భక్తికలవాణ్ణి. నా తల్లిదండ్రులు తిండిలేక మాడుతూవున్న రైతులు. ఒకనాడు నేను కార్లుమార్క్సు రచనలు చూడడం తటస్థించింది. అతడిభావాలు నాకు కొరడాదెబ్బలులా తగిలాయి. అన్నివిషయాలు అద్దంలోలా తేటతెల్లమయాయి. 1946 లో దేశంలో తెలివితేటలైనవాళ్ళని వెదుకుతూ ఒక కమ్యూనిస్టుజట్టు మాగ్రామం వచ్చింది. మావూళ్ళోవాళ్ళు వాళ్ళతో నావిషయం చెప్పారు. కమ్యూనిస్టులువచ్చి నాతో చాలా సేపు మాట్లాడారు. కమ్యూనిస్టు సిద్ధాంతాలు వాళ్ళకంటే నాకే బాగాతెలుసు. నన్నుచూసి వాళ్ళకి ఆశ్చర్యం కలిగింది. "నీలాంటివాడే మాకు కావాలి" అన్నారు వాళ్ళు. నన్ను స్కూలుకిపంపే ఏర్పాటుచేశారు. అప్పటికే చదువువచ్చునాకు. 'ఇతడికి చాలా తెలుసు' అన్నాడు మాష్టరు. దాంతో నన్ను సరాసరి పార్టీసభ్యుడిగా తీసుకున్నారు. సభ్యుల్లో కల్లా నేనే చిన్నవాణ్ణి

నాకు పెద్ద ఉద్యోగం దొరికింది. విదేశాంగశాఖలో నాకు దర్బీదు ఇచ్చారు. అంతకంటే మంచిఉద్యోగం మరొకటి వుండదు. 18దో ఏటనించే నేను కమ్యూనిస్టు యువకుల్లో అగ్రగణ్యుణ్ణని నన్ను ప్రదర్శించారు. చాలా కాలంవరకూ కమ్యూనిస్టు యువకసంస్థల కేంద్రసంఘంలో పనిచేశాను. నా ఇరవయ్యోఏట విదేశాంగశాఖకి కావలిసిన [illegible]

సంస్థ నిర్ణయించింది. 'ఇక విదేశాలికికూడా ఈ యువకుణ్ణి పంపవచ్చు' అన్న ప్రతిష్ఠ నాకు లభించింది. అలా కావలసిందంతావుంది నాకు." ఇదంతా స్పష్టమైన ఇంగ్లీషులో చెప్పాడు పీటరు.

అదిగో అలాంటి యువకుడిజీవితం మనకి సరదాగా వుంటుంది. అతడు ఖర్చుపెట్టడానికి డబ్బిచ్చారు. విదేశగ్రంథాలు చదువుకోడానికి అనుమతి ఇచ్చారు. ప్రపంచవార్తలు ఎప్పటికప్పుడు తెలుసుకోడానికి అవకాశమిచ్చారు. ఉండడానికి చక్కని పెద్ద ఇల్లూ ఇచ్చారు. చిన్న రైతుకుటుంబంలో పుట్టి ఇంత అభివృద్ధికివచ్చినవాళ్ళలో పీటరు మొదటివాడు. అతడికి ఎన్నోఅన్ని అసాధారణమైన హక్కులు ఏర్పడ్డాయి. ఏవివోవాళ్ళ అనుగ్రహం వున్నంతకాలం ఈ మర్యాదలూ, ఈహక్కులూ నిరాఘాటంగా సాగుతాయనే అనుకోవాలి.

కానైతే కమ్యూనిజానికి వ్యతిరేకంగా తిరుగుబాటు జరిగినప్పుడు పీటరు అందులో చేరిపోయాడు. దానికి నాయకత్వంకూడా వహించాడు.

"కమ్యూనిస్టులు అధికారం సంపాదించేముందు చేసే వాగ్దానాలికీ, అధికారంలోకి వచ్చినతరవాత చేసిందానికీ మధ్య పెద్ద అఖాతంవుందని నేను గ్రహించాను. దాంతోనే ప్రారంభమయిందనుకుంటాను తిరుగుబాటు చేయాలన్న కోరిక'' గతంగురించి ఆలోచిస్తూ అనేవాడు పీటరు.

పీటరు జిగేటీ మంచి తీవ్రమైన వ్యక్తి. కమ్యూనిస్టు యువకులందరూ అలాగే వుంటారు. చురుకైన చూపులూ, బలమైన సన్నని శరీరమూ, నిశితమైన వాక్కూ, కమ్యూనిష్టు పంథాకి అంకితమైన తీరూ—ఇవన్నీ వాళ్ళ లక్షణాలు. దురదృష్టవశాత్తూ కమ్యూనిస్టులికి తగని రసికహృదయం మాత్రం పీటరుకుండేది.

"మేం ప్రజలికిచెప్పిన అబద్ధాలపట్టిక ఒకటి రహస్యంగా రాసి వుంచాను. మా కార్యక్రమాలన్నీ ఏవిధంగా అయిఅవకండావుంటాయో మీకు తెలిస్తే మీరు చకితులవుతారు. ఏదొఒక తప్పుఊహమీద ఒక కార్యక్రమం వేస్తాం. దాంతో దేశంలో ఒక్కొక్కభాగానికి తిండిలేకండా పోవచ్చు. ప్లానులోవున్న అంకెలుకూడా చూడకండా ప్రణాళిక వేస్తాం.

రెండు: 'క్యాపిటలిజం ఒక కార్మికుణ్ణి నూరిపారేస్తుంది. కమ్యూనిజమో, అతడికి గౌరవస్థానమిస్తుంది.' కమ్యూనిష్టురాజ్యంలో కార్మికుడుగా వుండడంకంటే నికృష్టమైనపని మరొకటి లేదు. దానికంటే కుక్కయిపుట్టడం

మంచిది. పెద్దపెద్ద వాగ్దానాలుతప్ప కార్మికుడికి మరేమీ దొరకదు. నేను ఎల్లప్పుడూ కార్మికులతో అనేవాణ్ణి: "మీరు కమ్యూనిస్టు మనుషులు" అని. కాని మంచి మంచి వస్తువులూ, మంచి ఆహారపదార్థాలూ నాలాంటివాళ్ళకే, కాని వాళ్ళకి దొరికేవికావు.

మూడు : 'క్యాపిటలిజంకి ఆత్మలేదు. ప్రతీవాళ్ళకీ కమ్యూనిజం సంపన్నజీవితం చిత్రిస్తుంది.' నిజమేమిటంటే, కమ్యూనిజం ప్రతీమనిషినీ విశాల ప్రపంచంనించి ఒక ఇరుకుప్రపంచంలో వేసి నొక్కేస్తుంది. దానిప్రపంచం రష్యా. పాశ్చాత్య సంస్కృతితో హంగేరీ ఒకప్పుడుండిన అనుబంధం అది ధ్వంసంచేసేసింది. మేము రష్యాపుస్తకాలే చదవాలి. రష్యానాటకాలే చూడాలి. రష్యాతత్వశాస్త్రమే మననం చెయ్యాలి.

ఇలా నేనుకనిపెట్టిన విషయాలు గంటలతరబడి చెప్పగలను. అవన్నీ నాలోనేను తలుచుకుని నవ్వుకునేవాణ్ణి. కానైతే ఒక్క విషయం గురించి మాత్రం నేను ఎన్నడూ నవ్వలేకపోయాను.

"మేం హంగేరీ ప్రజలతో ఇలా చెప్పాం — సోవియటు రష్యాప్రజలూ, మీరూ అన్నదమ్ములు. మనం అందరమూ కలిసి ప్రపంచాన్ని ప్రతిఘటించి నిలబడదాం." అయితే వాళ్ళూమేమూ అన్నదమ్ములంకాం, వాళ్ళకి మేం బానిసలం. ఇది నేను బాగా తెలుసుకున్నాను.

"ఈమధ్య జరిగిన దొమ్మిలో హంగేరీ ప్రజలు నినాదాలు చేశారు — 'మా యురేనియం మాకు ఇచ్చెయ్యండి. మాఆహారం మాకు ఇచ్చెయ్యండి' .అని ఇవేమీ వుత్తుత్తి కేకలుకావు.

"ఉదాహరణకి నేను ఎరిగిన ఒక కార్మికుణ్ణి తీసుకుందాం. అతడు నెలకి 331 గంటలు పనిచేస్తాడు. దానికి గాను అతడికి 1053 ఫోరింట్సు కూలి దొరుకుతుంది. అంటే అమెరికా డబ్బులో ఇరవైఒక్క డాలర్లు అన్నమాట. ఇకధరలు చూడండి; ఒకసూటు కుట్టించుకోవాలంటే 980 ఫోరింట్లు అవుతాయి. అదిసుమారు ఒక నెలజీతం అన్నమాట. ఇక ఒక అమెరికా కార్మికుణ్ణి ఉదాహరణగా తీసుకోండి. అతడు అదనంగా పనిచేస్తే గంటకి గంటన్నరకూలి ఇస్తారు. అతడు నెలకి 331 గంటలు పనిచేస్తే సుమారు 700 డాలర్లు దొరుకుతాయి. అంటే కమ్యూనిజంకింద ఒకసూటు కుట్టించుకోవాలంటే 680 డాలర్లు అవుతుందన్నమాట. అమెరికా కార్మికులు మంచి సూటు 50 డాలర్లకు కుట్టించుకుంటారని విన్నాను.

కమ్యూనిజంకింద భార్యాభర్తా బతకాలంటే ఇద్దరూ తలాపదిగంటలు చొప్పున పనిచెయ్యాలి. 10 గంటలు పనిచేసినా ఏదైనా కొనుక్కోడానికి సరిపోయినంతరాదు. కమ్యూనిస్టు నాయకుడిగా నేను ఒకప్రత్యేకమైన దుకాణంలో నాకు కావలిసింది కొనుక్కుంటాను. అక్కడ అన్నీ చవక. నూటికి డబ్బయిచొప్పున ఒక్కొక్కప్పుడు డిస్కవుంటు వుంటుంది మాకు.

ఇదంతా అకళించుకునే పీటరు తీవ్రంగా ఆలోచించాడు. ఏకాంతంగా కూచుని తనమనస్సుతో తానే సంప్రదించుకున్నాడు. ఏమంటే అపరిస్థితుల్లో ఎవ్వరినీ నమ్మడానికి వీలులేదు.

"నేను మొట్టమొదట ఏవివోవేపు చూశాను. దానిలో వల్లమాలిన సంస్థలు వున్నాయి. అవి ఒకదానిమీద ఒకటి పెత్తనం చేస్తూవుంటాయి. కేంద్ర ఏవివో సంఘమొకటి వుంది. అది అన్నిసంస్థలమీదా అధికారం చెలాయిస్తుంది. దానిమీద రష్యావాళ్ళు పెత్తనం వహిస్తారు. ఈవైజ్ఞానికప్రపంచంలో ఇంత అనుమానం ఎందుకో అర్థంకాదు నాకు."

"ఇక కమ్యూనిస్టుల తట్టు దృష్టిసారించాను. అది ఒక పగటిదొంగల సంస్థ. దేశంలోవున్న మంచివస్తువులు యావత్తూ తమ వశంచేసుకోడం, తమ్ము తాము రక్షించుకోడం – ఇవేవాళ్ళ పనులు. కమ్యూనిస్టులుచేసిన ఒక్కస్వార్థ రహితమైన పనీ నేను ఇంతవరకూ చూడలేదు.

"చిట్టచివర ఎప్పుడూ భయపడుతూ బతికే మా జీవితాలమీదికి దృష్టి మళ్ళించాను. 'కమ్యూనిజంకింద బతుకుమీద ఆశలేదు; భావిలేదు; అర్థం లేదు. నిన్నా, నేడూ, రేపూ – అన్నీపోయినట్టే లెక్క' ఇలా తేల్చుకుని నేను పెటోఫీక్లబ్బులో చేరాను."

1842 లో హంగేరీ ప్రజలు తమఆస్ట్రియా పాలకుల మీద తిరగబడ్డారు. ఎంతో రక్తపాతమయింది. ఆపోరాటంలో శాండోర్ పెటోఫీ అనే ఒక యువకవి కావ్యాలు హంగేరీ జాతినంతటినీ ఆవేశపూరితం చేశాయి. ధైర్యసాహసాలు పురికొల్పాయి. హంగేరీ దేశభక్తికి అయువకవి మహాజ్యోతిగా వెలిగాడు. అప్పుడేకాదు ఇప్పుడూ అతడు అలాగేవున్నాడు. స్వాతంత్ర్య పిపాసువులందరికీ అతడు ధృవతార. రణరంగంలో వీరుడిలా జీవించాడతడు. హంగేరీ ప్రజల స్వాతంత్ర్యపిపాస ప్రతిఫలింపజేస్తూ ఎన్నో కావ్యాలు రాశాడు. ఆమహాకవిపేర అంకితమైన క్లబ్బులోనే కమ్యూనిష్టు యువకుడు పీటరు జిగేటీ చేరాడు. అక్లబ్బులో చేరడం అతడిజీవితంలో ఒక ప్రధానఘట్టం.

బుడాపెస్టు పెటోఫీక్లబ్బు మార్క్సిస్టుక్లబ్బే, సందేహంలేదు. దాని సభ్యులూ కమ్యూనిస్టులే. కానైతే వాళ్ళ లక్ష్యంమాత్రం 'సహృదయమైన హంగేరీ కమ్యూనిజం.' దానిమీద రష్యా పెత్తనం వుండకూడదు. హంగేరీ సంపద హంగేరీలో వుండాలన్నదే వాళ్ళ ప్రత్యేకమైన కోరిక. సోవియటు రహస్యపోలీసులు రష్యాలోనే వుండాలని వాళ్ళసిద్ధాంతం. క్లబ్బు సభ్యులలో కవులూ, నాటకరచయితలూ, నవలాకారులూ, ప్రముఖకమ్యూనిస్టు తత్వ వేత్తలూ వున్నారు. సామాన్యంగా అరవయ్యేళ్ళు దాటినవాళ్ళే దానిలోసభ్యులు కొంపరు పైకివస్తూన్న యువకులూ వున్నారు. అయితే వాళ్ళంత చొరవ కలవాళ్ళుకాదు పక్షపాతం లేకండా చర్చించే ఒక పక్షపత్రిక వాళ్ళఅందు బాటులోవుంది. అదిసాహిత్యపత్రిక. రచయితల సంఘం దాన్ని ప్రచురి స్తుంది. కాని దాని అధికారవర్గంలోవాళ్ళు అందరూ పెటోఫీక్లబ్బు రహస్య సభ్యులు. ఆపత్రిక జనప్రియమైన పత్రిక. డబ్బయివేల ప్రతులు దుకాణా లికి వచ్చీ రావడంతోనే ప్రజలు ఎగరేసుకు పోయేవాళ్ళు. క్లబ్బుసభ్యులు యావన్మందీ నిశ్చితమైన అభిప్రాయాలుకల కమ్యూనిస్టులు. వాళ్ళలో ఎవ్వ రూకమ్యూనిజానికి వ్యతిరేకులనడానికి వీలులేదు.

1956 వేసవిలో పీటరుజిగేటి పెటోఫీక్లబ్బులో చేరాడు. అప్పుడు కమ్యూనిస్టు పరిపాలనకింద హంగేరీ ఆర్థికంగానూ నైతికంగానూ నాశనం పొందుతూవున్న విషయం తీవ్రమైన చర్చలు సాగుతున్నాయి క్లబ్బు సభ్యులు ఈవిషయంగురించి నిరంతరాయంగా వొత్తిడిచేస్తూ వచ్చారు. చర్చలు సాగుతూన్నకొద్దీ వాళ్ళ అభిప్రాయాలు దృఢపడుతూ వచ్చాయి. క్లబ్బు సభ్యుల్లో ఒక ముసిలాయన ఇలా అన్నాడు; "గ్రామాలు ప్రయాణం చేస్తూంటే, యువకుల్ని సంబోధించేశక్తి నాలో మాయమయిందని తెలుసు కున్నాను; దుఃఖపడ్డాను. వాళ్ళు కమ్యూనిజానికి వ్యతిరేకులు కారు. అలా అని ప్యాసిస్టులూకారు. కాని వాళ్ళ సమస్యలగురించి నిజాయితీగా, నిక రంగా ఏదో నేను చెప్పాలని వాళ్ళ ఆశ. 'పాతకమ్యూనిస్టులంమేం. సరయిన నాయకత్వం చెయ్యలేకపోతున్నామా ఏం?' అనినన్ను నేనే ప్రశ్నించుకు న్నాను. హంగేరీని అలుముకున్న విపత్తుగురించి విమర్శాపూర్వకంగా మాట్లాడడం మొదలెట్టాను. దానిగురించి ఎంత అధికంగా మాటాడితే అంత ఆవేశపూరితులయి యువకులు నావంక వొరిగారు. వాళ్ళ ఈప్రవర్తన వల్ల నేను మళ్ళీ చదువుకోవలిసి వచ్చింది. ఎన్నో విషయాలు నేర్చుకోవలసి

వచ్చింది. గ్యోరునగరంలో జరిగిన ఒకసభలో, మరుపురాని ఆరాత్రి గంటల కొద్దీ, సభ్యులు నన్ను ఎన్నో అడ్డుప్రశ్నలతో ముట్టడించారు. క్రమంగా నేను మన ప్రస్తుతపద్ధతి దివాలాతీసిందని చెప్పకోక తప్పిందికాదు. విద్యార్థులతో ఈ విషయం నేను అంతస్పష్టంగా చెప్పలేకపోయినా నాలో నేనుమాత్రం అనుకోకండా వుండలేకపోయాను."

ఇలాంటి మేధావులతో ఇప్పుడు పీటరుజిగేటీకి సంపర్కం కలిగింది. వాళ్ళ ప్రసంగాలవల్లా, చర్చలవల్లా పీటరు ఒకవిప్లవాత్మక దృష్టి అలవరుచుకున్నాడు. వాళ్ళసాహచర్యం అతడు మానలేదు. చిత్రమేమిటంటే, కమ్యూనిస్టు యువకసంస్థ భవనంలోనే ఈక్లబ్బు సభ్యులు తమసభలు జరిపారు. దానిమీది అంతస్తులోనే ఏవివో మనుషులు వున్నారు.

**1956** అక్టోబరు మధ్యకివచ్చేసరికి, ఏదో ఒకవిధమైన మార్పు ఇక రాకతప్పదని పెటోఫీక్లబ్బు సభ్యులికి స్పష్టమయింది. హంగేరీ కమ్యూనిస్టులు రష్యానించి విడిపోవాలి. ప్రభుత్వం విస్తృత పరచాలి. కమ్యూనిస్టు ప్రభుత్వం కాక, లిబరలు సోషలిష్టు ప్రభుత్వం కావాలి. ఈమాట బహిరంగంగా చెప్పినవాడు పీటరు జిగెటీ.

"నేను విప్లవానికి సిద్ధంగావున్నాను. దాన్ని ప్రారంభించడానికికూడా సిద్ధంగావున్నాను" అన్నాడు పీటరు.

అక్టోబరు **23** నాడు విశ్వవిద్యాలయం విద్యార్థులు తమ'కోరికలపట్టిక' తయారుచేస్తున్నప్పుడే సాహసికులైన పెటోఫీక్లబ్బు సభ్యులు కొందరు తమ 'కోరికల పట్టిక' తాము తయారుచేశారు. రాసేపని పీటరుకి అప్పగించారు.

"హంగేరీని స్వాతంత్ర్యంచేసే చర్యలుమేం ప్రతిపాదించాం. వాటిని అనుసరిస్తే హంగేరీ మంచిదేశమయి, బతకడానికి అనువైందిగా తయారయేది" అన్నారువాళ్ళు. పీటరు ప్రతిపాదనలు ప్రభుత్వం బుట్టదాఖలా చేసింది.

రేడియో స్టేషను దగ్గిరజరిగిన అల్లర్లూ, 'జాబాద్‌నెప్' పత్రిక కార్యాలయందగ్గిర జరిగినగల్లంతూ రేడియోలో విని జిగేటీ తృప్తిపడలేదు.

"మేం వాళ్ళకి శాంతిపద్ధతులే చెప్పాం. అయితే ఇప్పుడు యుద్ధం జరక్కతప్పదనే అనిపిస్తూవుంది" అన్నాడతడు.

**25** మధ్యాహ్నానికే ఏదో గందరగోళం జరుగుతుందని అనుకున్నాడు పీటరు. పార్లమెంటు భవనంముందు చేరిన జన ప్రవాహంలో పీటరుకూడా

చేరాడు. "ప్రభుత్వం ఏదోఒక నికరమైన మాట ఇస్తేతప్ప ప్రజలు ఈసారి పూరుకునేటట్టులేరు" అనుకున్నాడతడు.

ఉద్యోగస్థు లెవరూ అక్కడికి రాలేదు. ఉదయమల్లా పార్లమెంటు స్క్వేరులో పరిస్థితులు పరిశీలిస్తూ తిరుగా డా డతడు. "పార్లమెంటు భవనం కప్పుమీద మరతుపాకులు పట్టుకుని ఏవివో మనుషులు నాకు కనిపిస్తున్నారు. ఉత్తరాన సుప్రీంకోర్టు భవనం కప్పుమీద మరతుపాకులు బారులు తీర్చివున్నాయి. నాకుడివేపు వ్యవసాయం మంత్రాంగ కార్యాలయముంది. వానిలోనూ తుపాకులు పేరుస్తున్న సందడి వినిపిస్తూవుంది.

తాను వున్నచోటినించి చూడలేకపోయాడు పీటరు. కానైతే, పార్లమెంటు భవనంగోడ వెంబడినే వరసగా రష్యాటాంకులు నిలబడి వున్నాయి. ముందువరసలో వెళ్ళే నిగ్గయిన సైనికులు అందులో వున్నారు. అతిథిసత్కారానికి పేరుపడ్డ హంగేరీలో డ్యూటీమీద తిరిగి తిరిగి, హంగేరీ ప్రజలంటే ఎంతో సానుభూతికలవాళ్ళు రష్యాసైనికులు. అంచేత 'అసలు క్రియకాలానికి వచ్చేసరికి మనసైనికులు మెత్తపడిపోరుకదా' అని అఫీసర్లు బితుకూ బితుకూ మంటున్నారు.

ప్రాణాంతకమైన మరఫిరంగులూ, టాంకులూ విరుచుకుపడడానికి సిద్ధంగావున్నా ప్రజలు నిర్లక్ష్యంగానే వున్నారు; 'ఇమ్రీనాగీ మాముందుకి రావాలి' అని కేకలువేస్తున్నారు. తాము సమర్పించదలచుకున్న దరఖాస్తులు అతడికే సమర్పిస్తా మన్నారు. పీటరులాగ వెనకవున్న వాళ్ళు ముందుకి తోసుకురావాలని ప్రయత్నించినప్పుడల్లా, ముందున్నవాళ్ళు రష్యాటాంకులు సమీపించి వాళ్ళని వెనక్కితోస్తున్నారు. వాళ్ళని 'ఆగండి' అనికానీ, 'జాగ్రత్త, ముందుకి రావద్దు' అనికానీ ఎవ్వరూ అనలేదు. అయినా సుప్రీం కోర్టు కప్పుమీదవున్న ఒక ఏవివో తుపాకీ 'డాం' మని ఒకగుండు పేల్చేసింది.

దురదృష్టవశాత్తూ ఆగుండు ఒకతల్లి చేతుల్లోవున్న ఒక శిశువుకి తగిలింది. తల్లీపిల్లా పేవుమెంటుమీద దొర్లిపోయారు పిచ్చెత్తిన కోపంతో ఆమె తన పిల్లశవం పైకిఎత్తి సోవియట్ టాంకుముందుకి దూసుకువెళ్ళింది. "నాబిడ్డని చంపావు. నన్నుకూడాచంపు" అంటూ అరిచింది.

గుండెలు తరుక్కుపోయే ఆతల్లి ఏడుపు ఏవివో తుపాకుల్లో లీనమైపోయింది. ఏవివో తుపాకులు జనసమూహంలో గుభీగుభీ గుళ్ళు వర్షించాయి.

గోలుగోలుమంటూన్న ఆతల్లినిచూసి టాంకు కెప్టెను కళ్ళనీళ్ళుపెట్టు కున్నాడు. అతడు తన టాంకు తుపాకులు సుప్రీంకోర్టు భవనంకేసి తిప్పాడు గబాగబా దానిమీదవున్న ఏవివో మనుషుల్ని తుడిచి పారేశాడు.

పీటరు జిగేటీ వ్యవసాయ మంత్రాంగం భవనం దగ్గిర నిలబడి వున్నాడు. సుప్రీంకోర్టుకి ఎదురుగా వుంపది. కోర్టుకప్పుమీదవున్న ఏవివోవాళ్ళ మొహాలమీద భయమూ, అందోళనా తాండవమాడాయి. రష్యావాళ్ళున్నూ హంగేరీవాళ్ళ పక్షంచేరినట్టు కనబడడమే ఆభయానికి కారణం. రష్యా టాంకు కమాండరు తుపాకులు తమతట్టు తిప్పి కొట్టబోయేసరికి వాళ్ళభయం చెప్ప శక్యంకానట్టయింది. అడ్డదిడ్డంగా స్క్వేరులోకి తుపాకిగుళ్ళు అదేపనిగా కురిపించారు వాళ్ళు ఏమాత్రమూ రక్షణలేని స్క్వేరుఅది. పీటరు తలమీంచి తుపాకిగుళ్ళు వెళ్ళాయి. రంయ్యీ రంయ్యీమని అవి అతడి చెవులు దిమ్మెత్తి స్తున్నాయి. అంతా భయంకరంగావుంది ఆక్షణంలో 600 మంది పౌరులు అమాంతంగా హతమైపోయారు. దానితరవాత ఏవివో మనుషులు రాలిపో వడం అరంభమయింది. ఆయుద్ధానికి అంతం అంటూ వుండదనిపించింది.

దక్షిణంవేపు బేథోరీవీధిలో యాంబులెన్సుకారు ఆగింది. అది డాక్టర్లని పంపింది. చౌకంలో గాయపడ్డవాళ్ళకోసం డాక్టర్లు దూసుకువచ్చారు. వాళ్లని రక్షణస్థలాలికి తీసుకువెళ్ళడానికి డాక్టర్లు తప్పించుకొంటూ వచ్చేసరికి ఏవివో వాళ్ళు గుళ్ళుకురిపించారు. డాక్టర్లని హతమార్చారు.

1946 నించీ కమ్యూనిష్టుగా తరిబీదుపొందిన పీటరు, నియంతృత్వం సమకూర్చిన సర్వసౌభాగ్యమూ అనుభవించిన అయువకుడు కమ్యూనిష్టు ప్రభుత్వంలో ఉన్నతస్థానం అక్రమించ దలచుకున్న ఆవర్ధమానచంద్రుడు డాక్టర్లహత్యచూసి నిలవలేకపోయాడు. వెర్రికోపంతో అతడు వొణికిపోయాడు. ఏవివో వాళ్ళతట్టు తిరిగి పిచ్చిగా అరిచాడు—“హంతకులారా! కుక్కల్లారా!! పందుల్లారా!!!”

అంతతో ఊరుకోలేదతడు. టాంకులవరసనుంచి దూరంగా జరిగి, కాల్చకండా నుంచున్న వొక రష్యాసైనికుడిదగ్గిరికి పరిగెత్తాడు. “బాబూ, నీ తుపాకి వొక్కసారి నాకియ్యి” అంటూ బతిమాలాడు. సైనికుడు వొక్కక్షణం తటపటాయించాడు. చౌకంలో ప్రజలశవాలు కుప్పలు పడుతున్నాయి. అదృశ్యం చూసేటప్పటికి అతడి గుండె నీరైపోయింది. ఉత్తరక్షణంలో తన తుపాకి పీటరుచేతికి అందిచ్చాడతడు. పీటరు ఇక పట్టలేకపోయాడు. తుపాకి

బుజానికి అనించాడు. వ్యవసాయం మంత్రాంగభవనం మీదవున్న ఏవివో మనుషులమీద అగ్నివర్షం కురిపించాడు.

— —

## 3. కిలియాను బారక్సు దగ్గర

రష్యాకి ఉపగ్రహాలుగావున్న రాజ్యాల్లో కమ్యూనిజం మొదటిపరీక్ష జరిగినప్పుడు, జోసపుటాత్‌వంటి యువకులు తొలినుంచీ కమ్యూనిష్టు సిద్ధాంతం వెంటపట్టివున్నా, దానికి వ్యతిరేకంగానే తిరగబడ్డారు. ఒకప్పుడు తమ సర్వస్వమూ కమ్యూనిజానికి అంకితం చేసుకున్న ఇస్త్వానుబలోగ్, పీటరు జిగేటీవంటి విద్యార్థికులు పెద్దపెద్ద స్థానాలు వాగ్దానం పొందీకూడా కమ్యూనిజం నిరాకరించడమే కాకుండా దానిమీద కత్తిగట్టి నిలబడ్డారు. ఈవిధమైన అపజయంతో రష్యానాయకులు నిరుత్సాహ పడ్డారు. నమ్మకమైనవాళ్ళ వల్లనే ఇలాంటి మహాపజయం ఎందుకు కలిగిందో ఆలోచించి, ఏవోసాకులతో ఈ అవమానం కప్పిపుచ్చడానికి అప్పుడే కొన్ని సంఘాలు ఉద్యమిస్తున్నాయి. కాని క్రెమ్లిను నియంతలు విపరీతమైన భయంతో వణుకుతున్నారు. నమ్మకమైన కమ్యూనిష్టుసైనికులు కూడా తిరుగుబాటుల్లో కమ్యూనిజానికి ఎదురుతిరుగుతున్నారని వాళ్ళు గ్రహించారు. ఏళ్ళతరబడి కమ్యూనిష్టు సేనలు అన్ని విధాలా ప్రత్యేకసౌకర్యాలు అనుభవిస్తున్నాయి. అందరికంటే వాళ్ళకిహెచ్చు జీతాలు దొరుకుతున్నాయి. కమ్యూనిష్టు మంత్రులందరూ వాళ్ళమీద ప్రత్యేకమైన శ్రద్ధచూపుతూ వచ్చారు. ఇంతా అయి, తీరా కమ్యూనిజానికి అపత్సమయం వచ్చినప్పుడు వీళ్ళు ఇలా ప్రవర్తించారూ?

కమ్యూనిజానికి ఈపరీక్ష బుడాపెస్టు నగరంలో జరిగింది. ఈనగరం ఉనికి విచిత్రమైంది. ఇది డాన్యూబునదీతీరాల మీదవుంది. బుడాపెస్టును రెండుగా విభజించిన ఆనది ఆనగరాన్ని తూర్పు పడమర్లుగా కాక ఉత్తర దక్షిణాలుగా వేరుచేసింది.

దూరంగావున్న ఈప్రాంతానికి రోమనుసైనికులు రాకపూర్వమే నదికి పడమటిభాగాన ఒక చిన్న వర్తకుల గ్రామం వెలిసింది. ఈచిన్న గ్రామమే క్రమంగా పెరిగి ప్రసిద్ధమైన రోమను పట్టణమైంది. ఇక్కడ వేడినీటి వూటలు నేలనించి వుబికి రోమనుల స్నానాలగదుల నిర్మాణానికి తోడ్పడ్డాయి. రోమ

నులు నాటకశాలలూ, విశాలమైన సభాభవనాలూ నిర్మించారు. ఈవిధంగా పడమటితీరం మీదవున్న బుడా యూరపు నాగరికతకి చివరిసరిహద్దుగా వర్ధిల్లింది. తరవాత రోము సామ్రాజ్యం పడిపోయింది. రోమనుసేనలు బుడా నించి వెళ్ళిపోయాయి.స్నానశాలలూ, రోమనుభవనాలూ శిథిలావస్థకి వచ్చాయి. అయినా బుడా యూరపునాగరికతకి దూరపుసరిహద్దుగానూ, వొంటరిగానూ అలాగే నిలిచిపోయింది. యూరపుతో దాని సంపర్కం ఎన్నడూ తెగిపోలేదు.

నది తూర్పుతీరాన పెస్టుఅని వొకచిన్నవూరు లేచింది. నదికి తూర్పు దిక్కుగా ఆసియాతట్టు వ్యాపించివున్న గొప్పమైదానాలకు వ్యాపారకేంద్రంగా ఆగ్రామం పనిచేస్తూ వుండేది. శతాబ్దాలపాటు ఈరెండు గ్రామాలూ నదికి ఇటూ అటూ వొకదానికొకటి అభిముఖమై వుండేవి. వాటిలో సామరస్యం లేకపోవడం అటుండగా, పరస్పర వైషమ్యం కూడా వుండేది. బుడా సంపన్నుల గ్రామం. అందమైన కొండలమీద దాన్ని కట్టారు. దానిచుట్టూ చక్కని చెట్లు గుబురుగా పెరిగివుండేవి. పెస్టు అలాకాదు. అంతగా నాగరికచిహ్నాలు లేని వ్యాపార గ్రామమది. అది దానంమీద వెలిసింది. అంత అందనమైన ప్రదేశమూకాదది. బుడా ప్రాచీన నగరం. దాని ఇరుకువీధులూ, వెయ్యేసం వత్సరాలు పైబడ్డభవనాలూ, చారిత్రాత్మకమైన కోటలూ కల నగరమది. పెస్టు వర్తకపట్టణం. అందులో పెద్దపెద్ద ఫ్యాక్టరీలూ, డబ్బున్న వర్తకులూ వున్నారు.

తుట్టతుదకి ఈరెండుపట్టణాలూ కలిసి హంగేరీకి రాజధాని నగరమయాయి. 19 శతాబ్దంలో వియన్నానగరాన్ని మించిన వొక సంఘజీవనం అందులో పెంపొందింది. బుడాపెస్టూ, వియన్నాలమధ్య ఎప్పుడూ పోటీయే. ఆస్ట్రోహంగేరియను సామ్రాజ్యంలో వొకదానికి వియన్నా, మరోదానికి బుడా పెస్టూ రాజధాని నగరాలుగా వుండేవి. ఈరెంటికీ మధ్య 170 మైళ్ళదూరం. రెంటికీమధ్య మంచి రైలుదారులున్నాయి. డాన్యూబునదిమీద నౌకాయానం సాగుతూ వుంటుంది. ఈనదిమీద ప్రయాణంచేసే విలాసనౌకలు ప్రసిద్ధమైనవి. స్త్రీలూ పురుషులూ తమ ప్రాముఖ్యం ప్రకటించుకోడానికి వియన్నా వెళ్ళేవాళ్ళు. సరదాగా కాలక్షేపం చెయ్యడానికి బుడాపెస్టు వచ్చేవాళ్ళు. త్వరలోనే బుడాపెస్టు చిన్న ప్యారిసు అనిపించుకుంది. ఆస్ట్రో హంగేరియను సామ్రాజ్యపౌరులు ఆరెండునగరాలూ వొకదాంతో వొకటిపోల్చి వినోదించే

వాళ్ళు. బుడాపెస్టు స్త్రీలు అందకత్తెలనీ, అక్కడ పార్టీలు చురుకుగా వుంటాయనీ అందరూ చెప్పుకునేవాళ్ళు. వియన్నా చాలా ప్రశాంతమైన నగరం. అక్కడి సాంస్కృతిక జీవనంలో ఒపెరాలూ, సంగీతశాలలూ, నాటకశాలలూ సుప్రసిద్ధమైనవి.

బుడాపెస్టు వాతావరణమూ,శీతోష్ణస్థితులూ మంచివి. అక్కడివంటకాలు రుచికరమైనవి. అక్కడి నృత్యం మనోహరమైంది. అక్కడి స్త్రీ పురుషులు సహజంగా చలాకీకలవాళ్ళు. అక్కడి సంఘంలో అతిసంపన్నులు హెచ్చు. సామాన్య పౌరులుమాత్రం పీడితప్రజల్లా వుంటారు. వియన్నాలో మతదృష్టి ఎక్కువ. అక్కడి సంగీతం ఉత్తమమైంది. భోజనం విలువైంది. ఆపట్నంలో ఉద్యోగులు హెచ్చు. ఈరెండునగరాల్లోనూ భవనాలతీరూ, సౌరూ దగ్గిర దగ్గిరగా ఒకలాగే వుంటుంది. కాని బుడాపెస్టుకివున్న సహజ సౌందర్యమూ, ప్రకృతి సౌందర్యమూ వియన్నాకి వున్నాయని ఎవ్వరూ అనలేరు.

ఈరెండునగరాల సంపన్నకుటుంబాలమధ్య వివాహాలు జరగడం కద్దు. ఒకడు వియన్నావాసి అయినంతమాత్రాన అతడికి వచ్చిన తక్కువేమీ లేదు. ఒక వియన్నా యువకుడు ఒక హంగేరీ లార్డుకూతుర్ని ప్రేమిస్తే, వాళ్ళ వివాహానికి అడ్డేమీరాదు. కాని వియన్నా పురవాసులు తమ వోపెరాలూ, నాటకశాలలూ, వస్తుప్రదర్శనశాలలూ—వీటి ఆధిక్యత ఆధారం చేసుకుని తమపొరుగు హంగేరీవాళ్ళని పల్లెటూరి దాయాదులుగా భావిస్తారు గత శతాబ్దం మధ్యలో వియన్నా ఆస్ట్రో హంగేరియను సామ్రాజ్యానికి రాజధానిగా వుండి గర్వించేది. నిజ మాలోచిస్తే బుడాపెస్టునించే కొత్తభావాలూ, కొత్త ఉద్యమాలూ, సామ్రాజ్యపరిపాలకులూ వచ్చారు. హంగేరీవాళ్ళు సాధారణంగా ఇలా అంటారు.''బుద్ధివున్న ప్రతీవాడూ యవ్వనంలో బుడాలోబతుకుతాడు. ముసలితనం వియన్నాలోగడిపి, అక్కడే చచ్చిపోతాడు.''

వియన్నావాళ్ళు ఏమంటారంటే, ''వియన్నాకి తూర్పున మూడుమైళ్ళ దూరంనించీ ఏషియా ఆరంభమవుతుంది. మొదటిప్రపంచ మహాయుద్ధం తరవాత ఆస్ట్రో హంగేరియను సామ్రాజ్యం ఆస్ట్రియాగానూ, హంగేరీగానూ, విభజన అయింది. ఈరెంటిలోనూ పెద్దదీ,సంపన్నమైందీ,ఎక్కువ ప్రగతిశీలమైందీ అయిన హంగేరీకి బుడాపెస్టు రాజధాని అయింది. అదిమధ్యయూరపు ఖండానికి రాజధాని నగరంగా అభివృద్ధిపొందేదే, కాని రెండోప్రపంచ మహా యుద్ధంకాలంలో జర్మను సేనలు ఈనగరం ఆక్రమించుకోడంతో రష్యా

సేనలు కొంతభాగం విధ్వంసంచేసేశాయి.(ఈవిధ్వంసాన్నే రష్యాప్రచారకులు 'రష్యాచేసిన బుడాపెస్టు విమోచనం' అంటారు. బ్రిటిషు, అమెరికా సైనిక దళాలు వియన్నా నగరంమీద దాడిచేసి అక్కడి జర్మనుసేనలు తరిమేసి, నగరానికి ఎక్కువనష్టం కలగకండా చేసిన అఘట్టం అమెరికా చేసిన వియన్నా నగర విధ్వంసం అని వాళ్ళే అంటారు.)

కమ్యూనిస్టు పరిపాలనలో నగరం పునర్నిర్మాణమై, అద్భుతమైన రాజధానినగరంగా తయారయింది. పాఠశాలల్లోనూ, విశ్వవిద్యాలయాల్లోనూ సామాన్య రైతుకుటుంబాల బాలబాలికలకి ప్రవేశం దొరికింది. సామాన్యులికి ఇంతకిముందు ఎన్నడూ దొరకని మంచి ఇళ్ళు దొరికాయి. చక్కని నాటకశాలలు లేచాయి. ఉషారిచ్చే నృత్యశాలలు తయారయాయి. మంచి సంగీతం వచ్చింది. కొత్తకొత్త భవనాలు లేచాయి. రష్యావీరుల జ్ఞాపకార్థం స్మారక భవనాలు కట్టారు. ఒకకొత్త వంతెనకట్టారు. స్టాలినువిగ్రహం ప్రతిష్ఠించారు.

బుడాపెస్టు అసమానమైన నగరం. బుడా చక్కనికొండలమీదా, పెస్టు విశాలమైన మైదానంమీదా పెరిగాయి. అందమైన డాన్యూబునది వొయ్యారంగా రెండునగరాలమధ్యా ప్రవహిస్తుంది. సరిగ్గా ఈప్రాంతంలోనే ఈనది ఎంతోఅంత అందంగా వుంటుంది. నగరంతాలూకు సాంఘిక జీవనమంతటికీ ఈనదీతీరాలు ఆకర్షవంతమై, కేంద్రంగా వున్నాయి. మరొకవిధంగాకూడా ఈనగరం అసమానమైంది. నగరమంతా మూడు చక్కని వలయాలుగా విభజింపబడివుంది. లోపలివర్తులం బుడాలో అరంభమై వొక అందమైన వంతెన మీదుగా డాన్యూబునది దాటి, పెస్టులో విస్తరించి, మళ్ళీ రెండోవంతెన మీదుగా పెస్టునించి బుడాకి సాగుతుంది. దీని తరవాతివలయం మంచి విశాలమైంది. అదికూడా ఇలాగే బుడా, పెస్టు నగరభాగాలు చుట్టి మొదటి వంతెనలకు రెండుమైళ్ళదూరంలో రెండుపక్కలావున్న రెండువంతెనల మీదుగా సాగిపోతుంది. మధ్యవలయం బుడాపెస్టు నగరానికి శిరోరేఖ లాంటిది. అది బుడాలో గెలెటు కొండలమీదుగా సాగి మర్గరెట్‌వంతెన మీదుగా డాన్యూబునది దాటి పెస్టునగరానికి ప్రధానరాజమార్గమై లెనిను బులెవార్డూ జోసెఫు బులెవార్డూ, ఫెరెన్సు బులెవార్డూ, అన్నపేళ్ళతో పట్నం చుట్టి, తిరిగి పెటోఫీ వంతెనమీదుగా డాన్యూబునది దాటి మోరిస్ జిగ్మండ్ చౌకంలో అంతమవుతుంది. ఈచౌకంగురించి ముందు ముందు ఎంతో వింటాం మనం.

ఈమూడు వలయాలూ పట్నం అంతటినీ ఒక గురిబల్లలా తయారు చేశాయి. బుడాకీ పెస్టుకీ మధ్యనించి ఇటూ, అటూ వ్యాపించిన తిన్నని వెడల్పాటి రోడ్లమీద రాకపోకల సౌకర్యాలు చక్కగా వున్నాయి. ఈరోడ్లలో స్టాలినురోడ్డు, రకోజీరోడ్డు. ఉల్లాయిరోడ్డు, బుడాపెస్టుకోసం జరిగినయుద్ధంలో పేరుపొందాయి. పెద్దపెద్ద పోరాటాలన్నీ ఈవీధుల్లోనే జరిగాయి. ఈరోడ్లు మధ్య వలయాన్ని కోసినచోటల్లా పోరాటం జరుగుతూ వచ్చింది. రకోసీ వీధికీ, జోసెఫు బులెవార్డుకీ మూలలో జాబాద్‌నెప్ పత్రిక కార్యాలయా లుండడమూ, అక్కడ దొమ్మీజరిగిఆకార్యాలయాలు ధ్వంసంకావడమూ,కమ్యూ నిస్టు పుస్తకశాల తగలబెట్టడమూ, స్టాలిను లోహవిగ్రహం అవమానపరచ డమూ ఇదంతా మనకితెలును. అక్కడినించి కొంత దిగువుకి వెళితే మధ్య వలయం విశాలమైన ఉల్లాయివీధిని కోసుకువెళుతుంది. దానికి దక్షిణం మూల ప్రాచీనమైన కిలియను బారకులు వున్నాయి. ఇది ఇటికలతోనూ, సున్నంతోనూ కట్టిన నాలుగు అంతస్తుల భవనం. దానిగోడలు నాలుగు అడు గులకంటే వెడల్పుగా వుంటాయి. యుద్ధానికిపూర్వం ఈబారకుల్ని మేరియా థేరసాబారకులు అనేవాళ్ళు. బుడాపెస్టు నగరరక్షణకోసం నియమితులైన మంచి సైనికులంపరూ ఇందులో వుండేవాళ్ళు. కమ్యూనిస్టు పరిపాలనకింద అభవనంలో ఒక పెద్ద కార్యాలయం ఏర్పాటయింది. బుడాపెస్టు ప్రాంతం నించి భర్తీఅయినవాళ్ళకు జరిగే రకరకాల పరీక్షలు ఇందులోనే జరుగు తాయి. నిగ్గయిన ఉద్యోగులందరూ ఇందులోనే వుంటారు. ఈభవనానికి ఒక చిన్న రక్షకదళం వుంటుంది. అవసరంవస్తే అభవనంలో 2,500 మంది వుండవచ్చు.కాని సాధారణంగా 400 మంది మాత్రమే అందులో వుంటారు. వాళ్ళుకాక అయుధాలులేని కార్మికులుకూడా అందులో వుంటారు. అందులో బరువైన తుపాకులు కానీ, టాంకులుకానీ వుండవు.

అక్టోబరు 23 న లాస్లోరిగాం అని ఒక సార్జెంటు కిలియనుబారక్సు రెండోఅంతస్తుమీద 19 నెంబరు గదిలో వున్నాడు. అతడు చాలా వుషారైన మనిషి. ఎప్పుడూ సరదాగా వుంటాడు. అతడివయస్సు 22 సంవత్సరాలు. అతడు ఒక రైతుకుటుంబానికి చెందినవాడు. అతణ్ణి కలిసినవాళ్ళు అతణ్ణి తప్పకండా ఇష్టపడతారు. తన స్నేహితులు అతణ్ణి 'చొకే' అంటారు. ఏమంటే అతడి మొహం ఎండలో బాగా కందిపోయి చాక్లెటు రంగుగా వుంటుంది. అతడి నల్లటి కళ్ళూ, బరువైన కనుబొమలూ,అలలుగా తిరిగిన నల్లటిజుత్తూ,

పెద్దనోరూ, తెల్లటిపళ్ళూ, అందంగా వుంటాయి. నలుగురిలో మాటిమాటికి తలదువ్వుకోడం అతడికి అలవాటు. అతడి మంచి బలమైన శరీరం కండలు తేరి శలాకలా వుంటుంది. అడపాదడపా అతడు ఉల్లాసంగా నవ్వేవాడు. కాని సమయంవస్తే దెబ్బలాటకి సిద్ధంగావున్నట్టు అవుపించేవాడు.

అవాళ రాత్రి పదిగంటలవుతుంది. యువకుడైన చొకే పూసు పోడానికి మూజియం పార్కులో ఎక్కడైనా ఒక అందమైన అమ్మాయి దొరుకుతుందేమో అన్న ఆశతో తిరుగుతున్నాడు. ఇంతలో రేడియోస్టేషనువేపు తుపాకుల ధ్వని వచ్చింది. ఎవరో సోల్జర్లు అల్లరిపడ్డారేమో అనుకుని తొందర తొందరగా అటువెళ్ళా డతడు. చూసేసరికి రేడియోభవనంనించి ఏవివో మనుషులు తుపాకులు కాలుస్తున్నారు." ఎవరో ఒక అపరిచితవ్యక్తి అక్కణ్ణించి వెళ్ళిపో అని కేకవేశాడు. చొకేకి ఏమీ అర్ధంకాలేదు. పూర్తిగా అంతా తెలుసుకుందామని రేడియోభవనం వేపు బయులుదేరా డతడు. ఇంతలో ఒక జల్లులా వచ్చాయి తుపాకిగుళ్ళు. బ్రాడీశాండరు వీధిలో ఒక తలుపుచాటున దాక్కున్నాడు చొకే.

"ఇక లాభంలేదు. బారక్సుకివెళ్ళి తుపాకులు తేవాలి"అనుకున్నాడు చొకే.

అయితే ఎవరిపక్షంగా తాను పోరాడాలో మాత్రం అతడికి తెలియడం లేదు. అసలు ఎవరెవరు ఏయే పక్షాలు పోరాడుతున్నాయో కూడా అతడికి తెలియదు. కాని ఒక్కవిషయం మాత్రం అతడి అంతరాత్మ ప్రబోధిస్తున్నట్టు స్పష్టమయింది. ఎవరైతే ఏవివో వాళ్ళమీద తుపాకులు పేలుస్తారో, నేను వాళ్ళతో కలుస్తాను" అనుకున్నా డతడు.

బారక్సు చేరడానికి ఇంకా మధ్య నాలుగు భవనా లున్నాయి. చొకే కేకలువేస్తూ బాణంలా పరిగెత్తాడు. ఒకదూకున రెండో అంతస్తు ఎక్కేశాడు. "రేడియో భవనందగ్గిర పెద్దపోరాటం జరుగుతోంది. ఏవివో వాళ్ళు జనంమీద తుపాకులు కాలుస్తున్నారు." అంటూ అరిశాడు. తనగదిలోకి వురికా డతడు ఆయుధాలుకోసం వెదకడంలో గదిలోని వస్తువులన్నీ తల్లకిందు చేసేశాడు. ఇంతలో సందేహకరమైన ధ్వని ఏదో హాలులో వినపడింది. టపీమని ఆగాడు చొకే. తన గదితలుపు మెల్లిగా తెరిచి ఏంజరుగుతుందో అని చూశాడు.

---

* **Choke:** చిన్న చాక్లెటు ముక్క

సామాన్యదుస్తులతో వున్న ఒకమనిషి వొకసోల్జరు తలకి పిస్తోలు గురిపెట్టి నిలబడి వున్నాడు. సోల్జరు అతడిమీద దూకబోయాడు. మనిషి పిస్తోలు పేల్చాడు. సోల్జరు చచ్చిపోయాడు.

సార్జంటు చొకే తనగదిలో నక్కి తలుపుగెడ వేసేశాడు. 'వీడు ఏవివో వాడై వుంటాడు.' అనుకున్నా డతడు.

చొకే గబగబా చేతిబాంబులు కొన్ని నొల్లుకున్నాడు. ఒకటి కాల్చడానికి సిద్ధంచేశాడు. చప్పుడు కాకండా తలుపుతీసాడు. పిస్తోలుపట్టుకు నుంచున్న మనిషిమీద చేతిబాంబువిసిరి కొట్టాడు. బాంబు డాంమని పేలింది. భవనమంతా ప్రతిధ్వనించింది. మనిషి పడిపోయాడు.చొకే వాడి జేబులు వెదికాడు. అతడు ఏవీవోకి చెందిన మేజరు శాలే అని తేలింది. 'ఏవీవో మనుషులు మన బారక్సు వశపరచుకోడానికి ప్రయత్నిస్తున్నారు'' గట్టిగా అరిచి సోల్జర్లందరినీ హెచ్చరించాడు చొకే.

ఉత్తరక్షణంలో ఏవీవో వాళ్ళని వేటాడడానికి సోల్జర్లు సిద్ధపడ్డారు. కొన్ని నిమిషాలు ఆలస్యంచేస్తే బారక్సు ఏవివో వాళ్ళ వశమయిపోయేదే. 150 మంది ఏవివో వాళ్ళుబారక్సు వశపరచుకోడానికీ, మందుగుండు కొట్టం కాజెయ్యడానికీ వస్తుంటే సోల్జర్లు వాళ్ళని ప్రతిఘటించారు. భయంకరమైన యుద్ధం జరిగింది. ఏవీవో వాళ్ళు దొమ్మీయుద్ధంలో బాగా ఆరితేరినవాళ్ళు. చివరికి ఎలాఅయితేనేం చొకే, తన సహచరులూ కలిసి ఏవీవో వాళ్ళని వెనక్కి తరిమేశారు.

ఏవీవో వాళ్ళంటేనే చొకేకి మంట. తాను సైన్యంలో పనిచేస్తున్నప్పుడు ప్రతీయూనిటులోనూ ఏవీవో మనుషులు వుండేవాళ్ళు. వుల్లానంచూసి వాళ్లు సందేహించేవాళ్ళు.''నువ్వు కమ్యూనిస్టువైతే సీరియస్‌గా వుండాలి'' అన్నాడు వొక ఏవీవో మనిషి. అయితే చొకే ఇంకా కమ్యూనిస్టు కాలేదు. కాని తాను ఆఫీసరు కావాలనుకుంటున్నాడు. అంచేత తాను పార్టీలో చేరక తప్పదు. కనక తనకోపతాపాలన్నీ అణుచుకుని ఏవీవో వాళ్ళుచెప్పినట్టునడుచుకునేవాడు.

రేడియో బుడాపెస్టు దగ్గిర దెబ్బలాడుతూన్న ప్రజలు బారక్సులోకి చొచ్చుకువచ్చారు. 'మాకు ఆయుధాలు కావాలి అంటూ కేకలువేశారు'

ఒక కుర్రాడు పురుగులాగ మెల్లిగా జనంలోంచి పాకివెళ్ళి చొకే చెయ్యి పట్టుకున్నాడు. ''ఏవివో వాళ్ళు కప్పుమీద పెద్దతుపాకులు ఎక్కించారు'' అన్నాడు.

అయినా ఆయుధాలివ్వడానికి ఆఫీసర్లు అంగీకరించలేదు. ఇంతలో ఒకసోల్జరు కేకలు వేసుకుంటూ పరిగెత్తుకువచ్చాడు. "అక్కడ చాలా పెద్ద యుద్ధం జరుగుతోంది. మాకు కొన్ని తుపాకులు కావాలి" అన్నాడు.

చొకే, మరికొంపరు కిలియను సిపాయిలూ "కొన్ని తుపాకులు వాళ్ళకి ఇద్దాం" అన్నారు. ఆవొత్తిడికి కెలియను ఆఫీసర్లు లొంగిపోయారు. కొన్ని తుపాకులూ, మందుగుండూ ప్రజలకిచ్చారు.

అవి తీసుకుని జనం వెళ్ళిపోయారు. కిలియను మనుషులు అక్కడే నిలబడి ఈపరిస్థితుల్లో తమవిధి ఏమిటా అని ఆలోచించారు. ఏపీవో వాళ్ళని వోడించాంకదా అని వాళ్ళలో ఏపాంగూ అవుపించలేదు.

"ఉదయం రష్యావాళ్ళు యుద్ధం ప్రారంభిస్తారు. నాకు తెలుసు" అన్నాడు, చొకే—" 'రష్యావాళ్ళొస్తే టాంకుల్లో వస్తారు' అన్నారు మనఆఫీసర్లు" అన్నాడు.

రష్యాటాంకులు వస్తాయంటే వాళ్లలో ఎవరూ బెదరలేదు. ఏమంటే రష్యానాయకులు వాళ్ళకో సులువు నేర్పారు. 'మీవగ్గిర తుపాకులు లేకపోయినా టాంకులు ఆపెయ్యవచ్చు. గ్యాసోలినుబాంబులు ఉపయోగిస్తే సరి, అవి ఆగిపోతాయి' అని. టాంకుని ఎక్కడకొడితే అది చెడిపోతుందో కూడా హంగేరీవాళ్ళకి రష్యా ఆఫీసర్లు చూపించారు.

"మీరు ఇదిగో ఇక్కడ నుంచుంటే టాంకుతుపాకులు మీదాకా రాలేవు. తరవాత ఇక్కడినించి మీరు తుపాకులు పేల్చండి. టాంకు కాలిపోతుంది" అని నేర్పారు వాళ్ళు.

అంచేత ఆరాత్రంతా చొకే, అతడిస్నేహితులూ గ్యాసోలిను బాంబులు తయారుచేశారు. సీసాలు తీసుకుని వాట్లోగ్యాసోలిను నింపి గట్టిగా బిరడాలు బిగించారు. బిరడాలో చిన్న బెజ్జంపొడిచి దానిలో 8 అంగుళాల గుడ్డవొత్తి ఇమిడ్చారు. సీసా టాంకుమీదికి విసిరేముందు అగ్గిపుల్లతో వొత్తి వెలిగిస్తారు.

ఆవాళ ఉదయం నాలుగుగంటలప్పుడు మొదటి రష్యాటాంకు కనిపించింది. నాలుగో అంతస్తుమీద నిలబడి చూస్తున్నవాడు ఒకడు "ఇదిగో వస్తున్నారు! ఇవిగో రష్యాటాంకులు" అని అరిచాడు.

కానైతే అతడు చెప్పింది సరికాదు. అవి టాంకులుకావు. ఒక్కటే టాంకు. ఇంతకీ అది పూర్తిగా టాంకున్నూ కాదు. టాంకులా కనిపిస్తుందది. అందులో మరతుపాకులుంటాయి. దానికి వుక్కుకవచం వుంటుంది. చక్రాలు

మాత్రం రబ్బరువే. పరిస్థితులు గమనించడానికి వచ్చిందది. అది చీకట్లో నడుస్తోంది. ఇళ్ళలోని లైట్లవెలుగు అప్పుడప్పుడు దానిమీద పడుతోంది. డాన్యూబునదిమీద తేలిఆడే ఒక పడవలావుందది. కాని అది చాలా ప్రమాదకరమైనపడవ. దానిలో రష్యాసైనికులున్నారు. కిలియను బారక్సులో ఎలాటి తిరుగుబాట్లు జరిగినా అణిచెయ్యడానికి నిశ్చయించుకునే వచ్చారు. వాళ్ళు.

కాల్విను స్క్వేరునించి, ఉల్లాయి వీధిగుండా నడిచి అది బారక్సు సమీపించిన కొద్దీ సార్జెంటు చొకే, మరి అరుగురు సోల్జర్లూ బారక్సు కప్పుమీద సర్దుకుంటున్నారు. చీకట్లో నిలబడివున్నారు వాళ్ళు. గ్యాసోలిను బాంబులు వెలిగించి దానిమీద వెయ్యడానికి సిద్ధంగావున్నారు. అదంతా నిజంగా ఒక వింత.

సార్జెంటు చొకే రష్యా బండికోసం ఊపిరి బిగబట్టుకు కాచుకునూచున్నాడు. తన తోడివాళ్ళతో గుసగుసలాడుతున్నాడతడు. ఇంతలో రష్యాబండి బారక్సుముందుకి వచ్చింది. చొకే జట్టు బాంబులు వొత్తులు వెలిగించింది. రెప్పపాటులో బండిమీద బాంబులు పడ్డాయి.

మంటలుకక్కుతూ బాంబులు రష్యాబండిమీద పడ్డాయి. మొదటి బాంబు ఉల్లాయివీధి పేవుమెంటుమీద పడింది. బ్రహ్మాండమైన శబ్దంతో పగిలింది. బండిడ్రైవరు కళ్ళల్లో చీకట్లుకమ్మాయి. బారక్సుగోడకి బండి గుద్దేసింది. మీదినించి వొకటి తరవాత వొకటి మూడుబాంబులు పడ్డాయి. బండికి నిప్పంటుకుంది.

మునిగిపోతూవున్న వోడలాగ బండి ఉల్లాయివీధిలో బారక్సు వెనక్కి తూలుతూ తూలుతూ నడిచింది. ఇంతలో దాని గ్యాసోలినుటాంకు బద్దలయింది. ధ్వంసమైన మొట్టమొదటి రష్యాబండి అది.

తెల్లవారినకొద్దీ రష్యావాళ్ళ వొత్తిడి హెచ్చవుతుందని చొకే అనుకున్నాడు. సరిగ్గా అలాగే జరిగింది. ఉదయం 9 అయేసరికి కిలియను బారక్సు కోసం యుద్ధం ప్రారంభమయింది. 11 అయేసరికి పన్నెండు రష్యాబళ్ళు బారక్సు ముట్టడించాయి. అయితే దానివల్ల వాళ్ళకి ప్రయోజనం మాత్రం కలగలేదు.

"రష్యావాళ్ళు టాంకులు ఎందుకు ఉపయోగించడంలేదో నాకు అర్థం కాలేదు. మామ్మూలు బళ్ళు ఎన్నివచ్చినా వాటిని మేం ధ్వంసంచేసేస్తున్నాం వీధిలో మంచి పట్టయిన స్థలంలో నుంచున్నాం మేం. మా బారక్సుపక్క

ఎత్తయిన ఇళ్ళున్నాయి. మావాళ్ళు కొంతమంది ఆ ఇళ్ళకప్పులు ఎక్కారు. కొందరు కాల్విన్ సినిమా భవనంమీద ఎక్కారు. మేం బాంబులువేస్తే సరిగ్గా రష్యాబళ్ళమీద పడేవి. రెండుగంటల్లో 9 బళ్ళు ధ్వంసం చేసేశాం'' అన్నాడు చొకే.

ఒకబండి వీధి పడమటివేపు దూరంగా నుంచుని, బాంబులు తప్పించుకుంటూ బారక్సుమీద వరసపెట్టి గుళ్ళవర్షం కురిపించింది. దాంతో ఎంతో మంది సోల్జర్లు చచ్చిపోయారు.

"ఆబండి కొట్టేయండి" అందరూ అరిచారు.దానిమీద గ్యాసోలిన్ బాంబులవర్షం కురిసింది.డ్రైవరు తెలివితేటలతో వాటన్నిటినీ తప్పించుకున్నాడు. మరింత గుళ్ళవర్షం కురిసింది బండి. దానిమీద కసితీర్చుకోవాలని మళ్ళీ అరిచారు సోల్జర్లు. కాని దానిని ఎవ్వరూ కొట్టలేకపోయారు. చివరికి ఆబండిలో మందుగుండు అంతమైపోయింది. అది వీధి పడమటివేపునించే వెళ్ళిపోయింది. దాని దాడివల్ల ఎంతోమంది హంగేరీ ప్రజలు హతమైపోయారు.

దాడి ముగిశాక కిలియను సోల్జర్లు అందరూ ఒకదగ్గిర చేరారు."మనలో ఎవడైనా సరే, వాళ్ళకి లొంగిపోయినట్టు కనిపించాడా వాణ్ణి కాల్చిపారెద్దాం" అని ప్రమాణంచేసుకున్నారు. "ఇలా మేం ప్రమాణంచేస్తున్నప్పుడు' అంతా నిశ్శబ్దంగా వుంది. మేం ఆలోచిస్తున్నాం. ఒక్కబండి ఇంతమంది ని చంపగలిగితే, టాంకు ఇంకా ఎంతమందిని చంపేస్తుందో?" ఈప్రశ్నకి జవాబుకోసం ఎంతోసేపు ఆగనక్కరలేకపోయింది.

ఇంతలో కిలియను బారక్సు యువకులికి ఒక సాహసవంతుడైన నాయకుడు దొరికాడు. చొకే తొలిసారి అతణ్ణి కిలియను బారక్సు కప్పుమీద చూశాడు.కొరడాలాగసన్నంగా వున్నాడతడు.రష్యా బొచ్చుటోపీవేసుకున్నాడు. మొహంమీద ఎన్నో గంట్లున్నాయతడికి. కర్నలు పాల్‌మలిటేర్ అతడిపేరు. బ్రహ్మాండమైన లక్ష్యంలేదతడికి. ఒకప్పుడతడు వీరుడని పేరుపడ్డాడు. ఫాసిస్టు నాయకుడైన హార్తీ దగ్గిర మొదట్లో ఆఫీసరుగా వుండేవాడు. తరవాత ఫాసీజం అంటే అసహ్యంపుట్టి, అక్కడ మానేసి 1944 లో హంగేరీలో నాజీలతో వ్యతిరేకంగా జరిగిన గుప్తయుద్ధంలో పాల్గొన్నాడు. ఆకాలంలో అతడు 'ఒక జాతీయవీరుడు' అనిపించుకున్నాడు. రష్యావాళ్ళు అతడికి బ్రహ్మరథం పట్టారు. కమ్యూనిజంకోసం పోరాడుతూవున్న హంగేరీ మహావీరుడని అతణ్ణి మాస్కో తీసుకువెళ్ళారు. అరష్యావాళ్ళే ఇప్పుడు ప్రజలమీద టాంకులు

ప్రయోగించడంచూసి, అతడు హంగేరీవాళ్ళ నాయకత్వం వహించడంకోసం కిల్లియను బారక్సుకి వచ్చాడు.

సార్జెంటు చొకే అతణ్ణిచూసి వికటంగా నవ్వాడు. "ఈకప్పుమీద కావలసినంత గ్యాసోలినువుంది" అన్నాడు. రష్యాలో బాగా అనుభవం గడించిన మాలిటేర్ ఆబాంబులు పరీక్షించాడు. 'టాంకులు కొట్టేబాంబులికి ఇంకా పెద్ద వొత్తులు కావాలి' అన్నాడు.

'టాంకులు పంపిస్తారనే అనుకుంటావా?' చొకే అడిగాడు.

'ఇప్పుడే పంపుతాడు' అన్నాడు వీరపురుషుడు కర్నలు మాలిటేర్— 'ఇప్పుడే వస్తారువాళ్ళు. సార్జెంట్! సిద్ధంగావుండు' అంటూ ఆవిప్లవంలో ప్రధానపాత్ర వహించబోతున్న మాలిటేర్ చొకేని హెచ్చరించి, మెట్లుదిగి మాయమయ్యాడు.

మొదటిటాంకు వచ్చేలోపుగా బుడాపెస్టు నాలుగుమూలలనించీ యువకులు అక్కడికి వచ్చిపడ్డారు. బారక్సుదగ్గిర యుద్ధంజరుగుతుందని వాళ్లకి ఎలాగో ఉప్పందిపోయింది. "మేం యుద్ధంలో చేరతాం" అన్నారు వాళ్ళు పాతతుపాకులూ, చేతిబాంబులూ, కత్తులూ వాళ్ళచేతుల్లో వున్నాయి. ప్రవాహంలా బారక్సులో ప్రవేశించారు వాళ్ళు. భర్తీఅవుతూన్న సిపాయిలలా అవుపించారు వాళ్ళు. సరిగ్గా అదేసమయానికి మరో పెద్దగుంపు కార్వినుసినిమా మీదికి ఎక్కింది అప్పటికింకా పూర్తిగా విధ్వంసంకాని రష్యాబండి ముక్కముక్కలు చేసేశారు కొందరు. అందులో వొక యాంటీటాంకు తుపాకీ, కొంత మందుగుండూ దొరికింది. దాన్ని లాక్కువెళ్ళి టాంకువచ్చేదానికి మధ్య, ఎదురుగ్గా పెట్టారు.

అప్పటికి బారక్సు పరిస్థితి అది.

డెన్యూబునదీతీరంనించి తూర్పుదిక్కుగా వెళుతూన్న ప్రధానవీధుల్లో వొకటి ఉల్లాయివీధి దానికి ఆగ్నేయంగా వుంది బారక్సు భవనం, మధ్యవలయంలో ఫెరన్ బులెవార్డు అనుకుని వుందది. ఉల్లాయి వీధికి అడ్డంగా ఈశాన్యంమూల కార్విడ్ సినిమా, దానిచుట్టూవున్న భవనాలూ వొకగుంపుగా వున్నాయి. ఈ బ్లాకుమధ్య ఇళ్ళకి అడ్డంగా వొక పెద్దకమానువుంది. అక్కణ్ణించి రష్యావాళ్ళమీద గుళ్ళు కురిపించవచ్చు.ఆ భయంకరమైన యుద్ధంలో ఎంతప్రమాదమైనా సరే, లెక్కచెయ్యకండా ఉల్లాయివీధిలో ఇటునించి

అటూ, అటునించి ఇటూ పరిగెత్తుతూ ఎక్కడ అనుకూలపడితే అక్కడి నించి రష్యాటాంకులు కొట్టారు జనం.

బారక్సు పైఅంతస్తులో సార్జెంటు చొకే, అతడిజట్టూ వుంది. కార్విన్ సినిమా భవనం కప్పుమీద యువకులైన సివిలియన్ ఆఫీసర్లు గ్యాసోలిన్ బాంబులు పట్టుకుని నిలబడివున్నారు. ప్రతీభవనంమీదా పన్నెండునించి పదహారేళ్ళ వయస్సుకల కుర్రాళ్ళు ఒక్కొక్కరూ ఒక్కొక్క రష్యాటాంకయినా ధ్వంసంచెయ్యాలన్న ఉబలాటంతో ఎదురుచూస్తున్నారు. ఉల్లాకువీధి దాటడం రష్యాటాంకుకి తలకిమించినపనే అనిపిస్తోంది.

విశాలమైన ఫెరెంకుబులెవార్డు మరోసమస్యగా తయారైంది. అక్కడ టాంకులు ఎటుపడితే అటు తప్పించుకోగలవు. అక్కడ ఒకటాంకు కమాండరు మరతుపాకులతో పిల్లాళ్ళనీ, పెద్దాళ్ళనీ టపటపకాల్చి పారేశాడు. బారక్సులోకీ, సినిమాభవనంలోకీ పెద్ద పెద్ద గుళ్ళు పేల్చాడు. బులెవార్డులో ఒకటాంకు భగ్నంచెయ్యాలంటే ఒకమనిషో, ఒకకుర్రాడో దాని దగ్గిరికి పాక్కుంటూవెళ్ళి, దానితుపాకులకింద గ్యాసోలిను పొయ్యాలి. ఎంతోసాహసం వుంటే తప్ప బులెవార్డు టాంకులమీద దాడిచెయ్యడం కష్టం.

కిల్లియను మనుషులు టాంకులదాడికోసం గంటలతరబడి నిరీక్షించారు. తమ కౌశల్యం చూపించడానికి అదును రాలేదని తొందరపడ్డారు. ఇంతలో 'ఇదిగో అది వస్తోంది' అంటూ ఒకకుర్రాడు పరిగెత్తుకువచ్చి కేకవేశాడు. భయంకరమైన ఆవార్తవిని అందరూ సంతోషించారు. బుడానించి పెటోఫీ వంతెనమీదుగా ఒకేఒక రష్యాటాంకు వింత వింత ధ్వనులుచేస్తూ వచ్చింది. వంతెనదాటింది. ఉత్తరంగా తిరిగింది. బులెవార్డువేపు వచ్చింది. దానిమీదరెండు భారీ మరతుపాకులు వున్నాయి. మంచిదృఢమైన కవచంతో వుంది టాంకు. పైన ఒక పెద్ద రైఫిలు తుపాకి ముందుకి కొట్టవచ్చినట్టు పొడుచుకుని వుంది. అజేయమైన టాంకు అది. ఇప్పుడు మెల్లిగానే నడుస్తోంది, కాని అవసరంవస్తే మహావేగంతో రంగానికి వురకగలదది. సార్జంటు చొకే దానిగురించి ఇలా అన్నాడు: 'అది ఎంత బ్రహ్మాండమైన ధ్వని చేసినా నిశ్శబ్దంగావున్నట్టే. అనిపించింది. ఏమంటే మేమంతా కిక్కురుమనకండా వున్నాం గనక.' బులెవార్డు పూర్తిగా ఖాళీఅయిపోయింది. ఇళ్ళతలుపులూ, కిటికీలూ అన్నీమూత పడిపోయాయి. పిట్ట మనిషికూడా ఎక్కడా అవుపించలేదు.

బారక్సు ఉల్లాయివీధి పక్కనించి ఎంతోమంది సోల్జర్లు శత్రువుని చూడ్డానికి బులేవార్డు తట్టు వచ్చారు. రాకాసిలాటి ఆ టాంకు వగిరపడుతూ వుంటే వాళ్ళ పెదవుల తడి ఆరిపోతూ వచ్చింది. ఇంతలో కార్నిస్ సినిమా మీదనించి పెద్దకేక వినపడింది. "కాలిపోయిన కమ్యూనిష్టు పుస్తకాల దుకాణం వేపునించి మరిరెండు రష్యాటాంకులు వస్తున్నాయి."

ఈబీభత్సం చాలనటు మరి నాలుగు పెద్దటాంకులు బారక్సు దిక్కు వస్తున్నాయి—సారంటు చొకే బారక్సు కప్పుమించి కనిపెట్టాడు. 34 టన్నుల వినాశశక్తులుకల ఏడుటాంకులు అగ్నివర్షానికి బారక్సు గురిఅవుతుందని స్పష్ట మయింది.

"అదిగో వస్తున్నారు" గంభీరంగా అన్నాడు చొకే. ఈసారి ఎవ్వరూ హరధ్వనులు చెయ్యలేదు.

మధ్యాహ్నం దాటింది. అక్టోబరు సూర్యుడు బుడాపెస్టుమీద వెచ్చటి కిరణాలు పిరజల్లుతున్నాడు. బారక్సులో సోల్జర్లు ఆవేగంతో నిరీక్షిస్తూ నిల బడ్డారు. ఏడు రష్యాటాంకులూ వరసతీరి నిలబడుతున్నాయి. బారక్సులో భయం ఆవేసిస్తూ వుంది. బారీతుపాకులు బారక్సును ఎంతో నష్టపరిచాయి ఒకమూల పూర్తిగాకూలిపోయింది. 70 మంది ప్రాణాలు కోలుపోయారు. సుమారు 150 మంది బాగా గాయపడ్డారు. ఇక రష్యావాళ్ళదే గెలుపు అని పించింది.

సరిగా ఆ క్షణంలో ఒక వీధికారు కండక్టరు ఇంకా మున్సిపలు యూని ఫారంలోనేవుండి అవాళటి రష్యావిజయం అపజయంగా మార్చేశాడు. రష్యా టాంకులు కులాసాగా నిలబడి, వరసగా బారక్సు భవనం ముక్కలుగా చెక్క లుగా విడదీయబోతూవున్న సమయంలో ఆమేధావి కార్విసునినిమా ముందు 'టాంకు విధ్వంసక — తుపాకి' పట్టుకుని దాన్ని మరమ్మత్తుచేస్తూ చెమట్లు పోసుకున్నాడు. కొంతసేపయేసరికి ఆతుపాకి మరి బాగుకాదనిపించింది. అయినా వొదలకండా దాన్ని బాగుచేస్తూ వీధిలో కూచున్నాడతడు.

మరి కొంతసేపయేసరికి "ఇక ఇది పనిచెయ్యవచ్చు" అన్నాడతడు. యువకులైన మెకానిక్సు కొందరు ఆతుపాకి సరిచేశారు. 'మీరందరూదూరంగా పొండి' అన్నాడు కండక్టరు—"ఇది బహుశా పేలిపోవచ్చు." మెకానిక్కు యువకులు వెనక్కి తగ్గారు. అతడు అతికష్టంమీద తుపాకి రష్యాటాంకుల వేపు తిప్పాడు; ఢాం మని పేల్చాడు.

'అలాంటి అద్భుతదృశ్యం నేను ఎన్నడూ చూడలేదు' అన్నాడు చొకే. ఆదెబ్బకి టాంకు ముందుభాగం లేచిపోయింది. ఒక్క క్షణం అలావుండి, లోపలనించే పేలిపోయింది.'

ఈ సంఘటన రష్యావాళ్ళని దిగ్భ్రాంతి పరిచింది. తాత్కాలికంగా వాళ్ళు వెనక్కి తగ్గారు. అది ఎలా జరిగిందా అని తటపటాయించారు. చప్పున వీధులన్నీ వొకసారి పరికించారు. కార్విను సినిమా భవనంనించి అతుపాకిజాడ కనపడలేదు.

రష్యావాళ్ళు జాగ్రత్తగా రెండోసారి ముందుకి నడిచారు. మంచి గురి గాళ్ళయిన కిల్లియను సోల్జర్లు ఈసారి టాంకుల బలహీనమైన స్థానాలు కని పెట్టారు. తుపాకులు పేల్చారు. టాంకుల్లో కొంపరు తారుమారైపోయారు. ధ్వంసమైన టాంకు తక్కినటాంకులికి అడ్డమయింది. రెండుబళ్ళు ఇంతకి ముందే శిథిలమై రోడ్డుమీద పడివున్నాయి. టాంకులు రెండునిమిషాలపాటు ముందు వెనక లాడాయి. ఆవ్యవధిలో చొకే మనుషులు కప్పుమీంచి గ్యాసో లిను సీసాలు గబగబా కురిపించారు. వీరులైన యువకులు పెద్దవీధుల్లోంచి దూసుకువచ్చారు. ఒకటాంకు తుపాకుల కిందదూరి వేరేవిధమైన బాంబులు పెట్టి వెళ్ళిపోయారు. గ్యాసోలిన్‌సీసాలూ, ఇవీకలిసి బ్రహ్మాండంగా మండాయి. టాంకుని మేఘంలా పొగ చుట్టుకుంది. అది పూర్తిగా ధ్వంసమయి పోయింది.

బారక్సుమీద తుపాకులు పేలుస్తూ ఇంకా అయిదు రాకాసుల్లాటి టాంకులు మిగిలిపోయాయి. ఉల్లాయివీధినుంచీ, బులెవార్డునించీ అవి గుళ్ల వాన కురిపిస్తున్నాయి. నాలుగు అడుగులు వెడల్పు బారక్సు గోడలుకూడా ఆ దెబ్బలు తట్టుకోలేక కూలిపోయేటట్టున్నాయి.

రష్యా రాకాసుల్ని ఇక ఎవ్వరూ ఎదుర్కోలేరని పించింది. ఏమంటే కార్విను సినిమా తుపాకికి అందుబాటులో లేకండా దూరంగా వుండి అవి పనిచేస్తున్నాయి. ఇంతలో అక్కడా అక్కడా దాక్కునివున్న కుర్రాళ్ళు వొక తమాషా చేశారు. ఉల్లాయివీధికి అడ్డంగా వొకమోకు కట్టేశారు. దాని వొకకొన బారక్సు భవనంలోనూ, రెండోకొన సినిమా భవనంలోనూ, పెట్టారు. ఒక కొనకి అయిదు పెద్ద చేతిబాంబులు కట్టారు.

ఒకటాంకు ఆరెండు భవనాలమీది అంతస్తులు మరఫుపాకులతో ధ్వంసంచేసి, ఉల్లాయివీధిలోంచి ముందుకి నడిచినప్పుడు కుర్రాళ్ళు ఆటి తము

చేతిబాంబుల కిందినుంచి పోయేటట్టు చేశారు. వాళ్ళవ్యూహం ఫలించింది. చేతిబాంబులు బ్రహ్మాండమైన ధ్వనితో పగిలాయి. టాంకు గొలుసులు వూడిపోయాయి. నిస్సహాయంగా అది ఆగిపోయింది.

ఉత్తరక్షణంలో సాహసులైనవాళ్ళు బారక్సు కిటికీలదగ్గిర తోసుకుంటూ వచ్చారు. గ్యాసోలిను సీసాలు గబగబా టాంకుమీద కొట్టారు. ఒక చేతిబాంబుతో గ్యాసోలిను మండింది. గదుల్లో కుర్రాళ్ళు పాటపాడారు: 'అయిపోయిందయిపోయిందీ, ఇక అయిపోయిం దైపోయిందీ!' క్రమంగా గ్యాసోలిను మంట టాంకులోనికి దూరింది. లోపల మందుగుండు అంటుకుంది. టాంకు బ్రహ్మాండమైన శబ్దంతో పగిలిపోయింది. 90 నిముషాల పోరాటంలో మూడు రష్యాటాంకులు నాశనమయాయి.

మిగిలిన నాలుగుటాంకులూ వెనక్కి మళ్ళిపోయాయి. నిజమే. కాని కిల్లియను బారక్సు సిపాయిలూ, చుట్టుపట్ల కుర్రాళ్ళూ కలిసి మూడు ధ్వంసంచేసీ, నాలుగు వెళ్ళగొట్టీ ఏడుటాంకుల్నీ గెలిచారంటే మాత్రం అది సరికాదు. దీనిలో ముఖ్యరహస్యం ఏమిటంటే రష్యావాళ్ళ మందుగుండు అయిపోవడమే. హంగేరీవాళ్ళకి అది సంపూర్ణవిజయం కాకపోయినా రష్యావాళ్ళకి మాత్రం అపజయమే. హంగేరీ ప్రజలకి జరిగిననష్టం అపారం.

హంగేరీయనులు గెలిచారని మరోకారణంవల్ల కూడా అనడానికి వీలులేదు. ఏమంటే, టాంకులు వెళ్ళిపోయేసరికి బారక్సు భవనం చాలామట్టుకు ధ్వంసమైపోయింది. కొన్ని అంతస్తులు ఇక కూలిపోతాయన్నట్టున్నాయి. సోల్జర్లు బారక్సు వొదిలేశారు. సినిమాభవనంలో కేంద్రకార్యాలయం ఏర్పరుచుకున్నారు. చొకే ఒకసోల్జర్లదళం వెంటవేసుకుని, గబగబా వీధిలోకి వచ్చాడు. యాంటిటాంకు తుపాకికోసం ఒకచిన్న పరిధి ఏర్పాటుచేశాడు.

'ఈ కండక్టరు మంచి అద్భుతమైన పనిచేశాడు' అన్నాడు చొకే. ఆ తుపాకితెచ్చి చక్రాలమీద పెట్టించాడు. శత్రువు రాకకోసం ఎదురుచూస్తూ. చిన్నకునుకు తీసాడు.

ఆరోజంతా తిరిగి రష్యాటాంకుల పత్తాలేదు. చొకే తనవాళ్ళతో అన్నాడు: 'బారక్సు అలా వొదిలెయ్యడం బాగాలేదుఅవి పూర్తిగా కూలిపోకండా ఏమన్నా చేద్దాం, పదండి.' మెల్లిగా అందరూ ఆభవనం దగ్గిరికి వెళ్ళారు. శిథిలమైపోతూవున్న చోటల్లా రాటలు బోట్లు పెట్టారు. అక్కడవాళ్ళు పనిచే

స్తూనే వున్నారు. పైన తిరిగి భయంకరమైన రష్యావాళ్ళదాడి జరిగింది. ఈ సారి 9 టాంకులు వచ్చాయి. అని ఫెరెన్సుబులువార్డులో స్థావరాలేర్పరుచుకుని కార్విడ్ సినిమా భవనం ధ్వంసం చెయ్యడానికి పూనుకున్నాయి. కండక్టరు ఆధిపత్యంకింద రెండు యాంటీటాంకు తుపాకులు పనిచేశాయి. అయితే అందులో ఒకటి చెడిపోయింది. ఇప్పుడు ఒకే తుపాకి మిగిలింది. సోల్జర్ల దగ్గిర చేతిబాంబులు తక్కువగా వున్నాయి. గ్యాసోలిను బాంబులు మాత్రం కావలసినన్ని వున్నాయి. తొమ్మిది రష్యాటాంకులతో పోరాడడానికి వాళ్ళదగ్గిర వున్న ఆయుధసామగ్రి అంతా ఇంతే.

అయినా అటాంకుల్లో రెండు వాళ్ళు ధ్వంసంచేసేశారు. మిగిలినవాటిని తరిమేశారు. తమ తుపాకీ రక్షించుకున్నారు. ఆఏడు రష్యాటాంకులూ వెళ్ళి పోయేసరికి సినిమాచుట్టూ ఎన్నో అన్ని హంగేరీశవాలు పడివున్నాయి.భవనం బాగా దెబ్బతినేసింది. అయినా, రష్యావాళ్ళకి గెలుపు కలగలేదని చూపించడానికా అన్నట్టు ఒకకుర్రాడు వెళ్ళిపోతూన్న టాంకుల వెంటపడ్డాడు. పరిగెత్తి గ్యాసోలినుబాంబు విసిరాడు.

"సెలవుతీసుకున్నప్పుడు పెట్టిన ముద్దులావుందిది. తప్పిపోయింది, కాని కుర్రాడి అభిప్రాయం మంచిదే" అన్నాడు చొకే.

రెండుగంటలు గడిచాయి. పెటోఫీ వంతెనమీదుగా మూడు రష్యాటాంకులు దడ దడ మంటూ వచ్చాయి. బులేవార్డు మీదుగా ఉల్లాయివీధి కలిసే చోటికి వచ్చాయవి. చెడిపోయిన అయిదుటాంకులూ ఇంకా వీధిలో పడేవున్నాయి. అంచేత తమకి మంచిస్థావరాలు దొరికాయని టాంకుల్లోవాళ్ళనుకున్నారు.

సరిగ్గా అదేక్షణంలో కండక్టరు తన యాంటీటాంకుతుపాకి టాంకువేపు గురిపెట్టాడు. దాన్ని పేల్చాలనుకునేసరికి టాంకులోని రష్యావాళ్ళు అది కనిపెట్టారు. దాన్ని ధ్వంసం చేయడానికిబదులు వెంటనే వాళ్లు లొంగిపోయిన సూచనగా తెల్లజెండా ఎత్తారు. కిల్లియను మనుషులకి ఇది చిత్రమనిపించింది. మిగిలిన రెండుటాంకులూ ఇంతలో తోకముడిచేశాయి. బులేవార్డులోపడి పెటోఫీ వంతెన తట్టు దౌడుతీసాయి.

చొకే, మరికొందరూ వచ్చి తెల్లజెండా ఎత్తిన టాంకు వశపరచుకున్నారు. బారక్సు ఆవరణలోకి దాన్ని నడిపించుకు పోవాలని ప్రయత్నించారు.

"మాకు టాంకునడపడం సరిగ్గా రాలేదు" నవ్వుతూ అన్నాడు చొకేవాళ్లు టాంకునడిపి, ద్వారందగ్గిర చిక్కుకున్నారు. కొంచేపటివాకా అది అక్కడే వుండిపోయింది. చివరికి ఒక మెకానిక్కు ఎలాగో దాన్ని బైటికిలాగి, జోరుగా వెనక్కి తీసుకువెళ్ళాడు. ఈసారి అది సినిమాగోడకి డీకొంది. కొందరు సైనికులికి దానివల్ల చచ్చేటంతప్రమాదం జరిగింది. "రష్యావాళ్ళకంటే మీరే దీంతో ఎక్కువ నష్టం కలిగిస్తున్నారు" అని అరిచారు వాళ్ళు. కొందరు యువకులు ఏదోవిధంగా దాన్ని దారికి తెచ్చారు. ఒక మంచిచోటికి తీసుకుపోయి నిలబెట్టారు. దానివెనకనే బాగా దెబ్బతిన్న బారక్సు భవనముంది. కుడివేపు కూలిపోడానికి సిద్ధంగా వున్న కార్విన్ సినిమా భవనముంది. చుట్టూ శవాలు పడివున్నాయి. టాంకుమీద బాంబు విసరబోయిన ఒక కుర్రాడు పడివున్నాడు. ప్రమాదవశాత్తూ చచ్చిపోయిన ఒక స్త్రీ పడివుంది. కాలి బుగ్గయిన ఒకవ్యక్తి పడివున్నాడు. కాలిపోతూన్న ఒక టాంకుమించి గెంతేసిన ఒక రష్యామనిషి పడివున్నాడు.

ఇరవైరెండేళ్ళ సార్జంటు చొకేని మనం ఇక్కడ వొదిలేశాం. మార్లన్ బ్రాండోలావున్న అయువకుడు రష్యాటాంకుమీద కూచుని రష్యాదాడికోసం ఎదురుచూస్తున్నాడు.

"ఈసారి రష్యావాళ్ళు దగ్గిరికి వచ్చేదాకా వూరుకుని, అప్పుడు తుపాకులు పేల్చి తుక్కురేగ్గొడదాం" మెకానిక్కులవేపు చూసి అన్నాడు చొకే.

దీని తరవాత జరిగిన పోరాటంలో మరికొన్ని రష్యాటాంకులు ధ్వంసమయాయి. మొత్తం ఇరవైటాంకులూ, పన్నెండు అయుధశకటాలూ ధ్వంసమయాయి. ఎంతోమంది సోల్జర్లు కూలిపోయారు. కానైతే బారక్సు భవనాలు కానీ, కార్విన్ సినిమా భవనం కానీ రష్యావాళ్ళు పట్టుకోలేకపోయారు.

హంగేరీ అంతటా ఇలాగే జరిగింది. కమ్యూనిస్టు సిపాయిలందరూ రష్యావాళ్ళకి ఎదురుతిరిగారు. బల్గేరియా, రుమేనియా, పోలెండు దేశాలలో కూడా ఇలాగే జరుగుతుందని తెలిసినవాళ్ళంతా అభిప్రాయపడ్డారు. అయితే, కమ్యూనిజంమీద తమ తుపాకులు తిప్పగల అవకాశం మాత్రం రావాలి, అంతే. కొన్ని విచిత్ర కారణాలవల్ల చెకోస్లోవియా సైన్యం రష్యావాళ్ళకి బాసటగా నిలవవచ్చు. యూక్రేనియా సేనకూడా కమ్యూనిష్టుల పక్షమే వహించవచ్చు. కాని అది ఎక్కువకాలం నిలవదు. ఐతే ఉజ్బెకిస్తాన్, తాజకిస్తాన్,

మధ్య ఆసియా రాష్ట్రాలనించి వచ్చే సేనలుకూడా రష్యామీద భక్తికలిగి వుంటాయని నమ్మడానికిన్నీ వీలులేదు. అది ముందు ముందు మనమే చూస్తాం.

[రష్యావాళ్ళతో దెబ్బలాడిన ఒక హంగేరీ సోల్జరు అన్నట్టు "రష్యా గెలిచింది. కాని ఆయుధాలుకల ప్రతీ హంగేరీమనిషికీ ఇద్దరేసి రష్యా సైనికుల్ని బుడాపెష్టులో వుంచాలి. అప్పుడుకాని క్రిమ్లినుకి నిద్రపట్టదు."]

---

# 4. ప్రహస్వదృష్టి

బుడాపెస్టుకోసం అక్టోబరు 23 న ప్రారంభమైన యుద్ధం మూడు భాగాలుగా జరిగింపనవచ్చు. మొదటి భాగం 29 ని అంతమైంది. అనుకోని ప్రతిఘటనకి భయపడి రష్యావాళ్ళు తమ బలాలు సరిచేసుకోడానికి వెనక్కి తగ్గేసి, నగరం యావత్తూ స్వాతంత్రయోధులికి వొదిలేశారు. రెండోభాగం అతి క్లుప్తమయింది. కాని మధురమైంది. అయిదు దినాలపాటు, బుడాపెస్టు ప్రజలందరూ, చివరికి రష్యా ఆధిపత్యంనించి హంగేరీముక్తి పొందిందని అపరిమితమైన ఆనందంలో వోలలాడారు. ఏవీవో వాళ్ళ భయంకర పరిపాలన అంతమైందనీ, ఇక లిబరలు ప్రభుత్వం ఏర్పడుతుందనీ ఆశించారు.

మూడోభాగం నవంబరు 4 న ప్రారంభమయింది. అవాళ రష్యాటాంకులు ఒక తుఫానులాగ పట్నంలోకి వచ్చాయి. ఏవీవో వాళ్ళకంటె ఎక్కువ భయంకరంగా ప్రవర్తించాయి. నిష్ఠురంగా విప్లవాన్ని అణిచివేశాయి. రష్యా వాళ్ళకి విజయం కలిగింది. మనసారా కసితీర్చుకోడానికి వాళ్ళకి మంచి అవకాశమున్నూ దొరికింది. స్వాతంత్ర్య స్వప్నంకన్న బుడాపెష్టు నగరం ఈ అయిదురోజుల్లో ఎన్నో మార్పులు పొందింది. హంగేరీకి స్వాతంత్ర్యంవస్తే అది ఎలావుంటుందో ఈ మార్పులు చూస్తే తెలుస్తుంది. ఆ అయిదు రోజులూ అర్థంచేసుకోవాలంటే, అక్టోబరు 29 నించి నవంబరు 4 వరకూ బుడాపెస్టు లోని ఒక కుటుంబం చరిత్ర తెలుసుకుంటే చాలు.

జోల్టానూ అతడిభార్య ఈవాపాలూ ఇంకా ఇరవై ఏళ్ళయినా నిండని దంపతులు. ఉత్తరబుడాలో ఒక నాలుగంతస్తుల భవనంలో ఒక భాగంలో

వాళ్ళుంటున్నారు. దాని అద్దెకే వాళ్ళజీతం నించి చాలాభాగం పోతోంది. దీపాలకీ, వేడికీ అని అయేఖర్చు ఇంకా వుండనేవుంది. వాళ్ళుంటూవున్న ఆ భవనం ప్రభుత్వానిది. లోపలి మరామ్మత్తులు ఏమైనా కిరాయిదార్లే భరిం చాలి. బైట మరమ్మత్తులు మాత్రం ప్రభుత్వం చేయిస్తుంది. కాని "బైట మర మ్మత్తులు వుండనే వుండవు' అంటుంది ఈవా.

భార్యాభర్తలు ఇద్దరూ పనిచేస్తారు. జోల్టాను మోటారు మెకానిక్కు. ఈవా పోస్టాఫీసులో గుమాస్తా. ఆమెపని చెయ్యకపోతే ఇద్దరూ పస్తుపడి వుండాల్సిందే.

"నేను నెలకి 1,500 ఫ్లోరింట్లు సంపాదిస్తాను. నాభార్య 1,000 సంపా దిస్తుంది. ఇలా మేం సంపన్నులమే. కాని ఈ 2,500 ఫ్లోరింట్లసంచీ కమ్యూ నిష్టుపార్టీ చందాలకని ఎన్నోపోతాయి. ఏవేవో వాళ్ళచందాలొకటి. ట్రేడీగ్రూపుల చందా ఒకటి. ఇలా ఇవన్నీ పోగా మాకు మిగిలేవి కొంచెమే. పైగా పన్నులు కూడా ఇచ్చుకోవాలి" అంటాడు జోల్టాను.

ఈవా 6 ఏళ్ళు సంపాదించిన దుస్తులు—ఒకకోటూ, రెండుజతల జోళ్లూ ఒక స్లిప్పర్లజతా, నాలుగు గౌనులూ, రెండుజతల మేజోళ్ళూ, ఒక కళ్ల జోడూ, ఇంతే. కళ్ళజోళ్ళఫ్రేము బ్లాకుమార్కెట్టులో కొన్నది.

కళ్లవైద్యుడు రోగిని మూడునిమిషాలు పరీక్షిస్తాడు. ఇంకా శ్రద్ధగా పరీక్ష చేయించుకోవాలంటే బ్లాకుమార్కెట్టులోకి వెళ్ళవలసిందే. పళ్ళజబ్బు వచ్చినా అంతే. సర్కారు దంతవైద్యుడి దగ్గిరికి వెళ్ళడానికి ఎవ్వరూ సాహ సించరు. సర్కారువైద్యులందరూ గొణుక్కుంటూనే వుంటారు. "మీరు చవ్వకండా ఇంకా బతికేవుంటే పనిలోకిపొండి" అంటారు.

ఈవా మేకప్పుకోసం మాత్రం ఆరాటపడనక్కరలేదు. "ప్రతీ ఆఫీసు లోనూ అయిదారుగురు అమ్మాయిలు కలిసి బ్లాకుమార్కెట్టులో ఒక్క లిప్ స్టిక్కు కొనుక్కుంటారు. అలాగే బుగ్గలికి రంగువేసుకునే ఒకకేకు కొనుక్కుం టారు. ఎవడైనా ఒక కుర్రాడితో ఒక అమ్మాయి సరదాగా కాలంగడపాలను కుంటే అవేళకి ఆ వస్తువులు తక్కినవాళ్ళు ఆమెకి ఇస్తారు. సాలుకి ఏనాలు గైదుసార్లో అవి ఉపయోగించుకునే అవకాశం ఒక్కొక్క అమ్మాయికీ దొరుకు తుంది. "నాకు పెళ్ళయిందనుకోండి, అయినా ఎప్పుడైనా ఒకసారి అం దంగా ముస్తాబు చేసుకోవాలని వుండదూ! అంచేత నేనూ ఆ జట్టులో చేరి అవికొనేదాన్ని. పెళ్ళయినపిల్లలంమేం, పెళ్ళికాని పిల్లలకే ఈవస్తువులు

వాడుకునే అవకాశం ఇచ్చేవాళ్ళం. నేను మాత్రం సాలుకి రెండుసార్లుమించి ఎన్నడూ పూర్తిగా ముస్తాబుచేసుకోలేదు.'' అనేది ఈవాపాలు.

ఈవాపాలు పోస్టాఫీసులో పనిచేయటంవల్లా, రహస్యావార్తలు ఆమెకి తెలుస్తూవుండడం వల్లా ఏవీవో వాళ్ళు ఆమెమీద ప్రత్యేకమైన నిఘావేసి వుంచారు.

''నన్ను గురించిన ప్రశ్నల పత్రం ఎన్నిసార్లని నింపేది? ఆకాశం మీద చుక్కలెన్నో అన్నిసార్లు నింపాను'' అనేది ఆమె విసుగుతో.

భర్తల దుస్తులసంగతి మరీ ఇదిగా వుండేది. జోల్టాను సన్నంగా తీగెలా ఉంటాడు. హంగేరీ పురుషులు చాలా వరకూ అంతే. అయితే అతడు కొంచెం పొడగరి. అతడికి కావలసినంత తిండిలేదు. ''ఒకసూటు కుట్టించు కోడానికి ఎంత ప్రయత్నించినా డబ్బు మిగలడంలేదు.

''నేను మోటారుసైకిలు మీదవెళుతూ వుండేవాణ్ణి. అది కొనడానికి ఆరునెలలు కష్టపడవలసి వచ్చింది. ఆ దినాల్లో వొక్కసారైనా మేం సినిమాకి వెళ్లలేకపోయాం. నాభార్యకి డాన్సుఅంటే చాలా ఇష్టం. ఆ ఆరునెల్లూ వొక్క సారి కూడా మ్యూజియం బారుకి వెళ్ళలేకపోయాం'' అన్నాడు జోల్టాను.

తనభర్త మంచి డాన్సరు అంటుంది ఈవా. కానైతే పట్నంలో ఏ నృత్యశాలలో అయినా వొక్కరాత్రి గడపాలంటే 250 ఫ్లోరింట్లు కావాలి. అంటే కమ్యూనిస్టుచందాలు పోగా మిగిలేజీతంలో నాలుగోవంతు అన్నమాట. ''ఇంచేతే మేం తరుచు డాన్సులకే వెళ్ళం'' అంటుంది ఈవా.

నిజంగా ఆదంపతులికి కమ్యూనిస్టులతో ఎక్కువ పరిచయంలేదు. ఎంచేతంటే, వొక కోటి జనాభాగల హంగేరీదేశం అంతటిలోనూ పన్నెండు లక్షలకి మించి కమ్యూనిస్టులు లేరు.

ఈవాపాలు తన పుట్టింట్లో రహస్యంగా దైవప్రార్థనలు చేస్తుందని పార్టీవాళ్ళకి తెలిస్తే ఏనాడో ఆమెని ఉద్యోగంనించి తీసి పారేసేవాళ్ళు.

''మీరు గుడికి వెళ్లవచ్చు. చాలామంది వెళతారు కూడాను. కాని నా వంటి ఉద్యోగంలో వున్నవాళ్లకి మాత్రం అది సాధ్యంకాదు. పోస్టాఫీసులో పనిచేసేవాళ్ళు ఎవళ్లయినా సరే, చర్చికి వెళ్ళారంటే, ఏవీవో వాళ్ళువెంటనే వారిపేళ్ళు రాసుకుంటారు'' అంటుంది ఈవా.

ఆహారవస్తువులు చాలా ప్రియం. కాని కమ్యూనిస్టు పుస్తకాలు మాత్రం కారు చవక. గ్రామఫోనువంటి వస్తువులు మనం కొనలేనంత ప్రియంగా

వుంటాయి. "జోల్టానుకి సంగీతం అంటే చాలాఇష్టం. మేం మ్యూజికు-హాల్లకి వెళ్లలేం; గ్రామఫోను రికార్డులూ కొనలేం. కనక 'రేడియో బుడాపెస్టు' నించి రష్యా సంగీతం వింటూ వుంటాం. పశ్చిమదేశాల సంగీతంకూడా వింటూ వుంటాం" అంటుందామె.

కమ్యూనిజంలో జోల్టానుకి ఎక్కువ ఆశాభంగం కలిగించిన విషయం ఏమిటంటే, ఏదైనా ఒక పాతకారైనా అతడు కొనుక్కోలేక పోవడమే. కారు ముక్కముక్కలు విడదీసేసి, తిరిగీ అతకడమంటే అతడికి మహాసరదా. "జోల్టాను మంచి మెకానిక్కు. అతడు ప్రయోగాలు చెయ్యడానికి ఒక పాతకారైనా దొరికివుంటే ఎంతో బావుండేది. కాని పాతదొక్కు కొనాలన్నా అమాత్రం డబ్బు ఎన్నడూ మిగల్దు మాకు" అంటుంది ఈవా.

ఓసారి జోల్టాను నన్ను ఇలా అడిగాడు: "అమెరికాలో కార్మికుడు ఎవడైనాసరే, ఒక పాతకారు కొనుక్కోగలిగిన డబ్బు మిగిలించుకోగలడని విన్నాను, నిజమేనా?" అని. అవునని తలపూపాను నేను. "అమెరికాలో మా పట్నంలో 14 ఏళ్లకుర్రాడు ఎవడైనా పాతకారులు కొని, ఇష్టం వచ్చినట్టు నడిపి, తనతల్లికి కంగారు పుట్టిస్తాడు"అని అతడికిచెప్పడానికి నాకు ధైర్యం చాలలేదు. మాకుర్రాళ్లు తమాషాగా పాతకార్లు కొని ఇట్టే విరగ్గొట్టిపారేస్తూ వుంటారు.

అక్టోబరు 23 సాయంకాలం జోల్టాను దంపతులు ఇంట్లో కూచుని రేడియో వింటున్నారు. ఇంతలో హంగేరీ కమ్యూనిస్టుపార్టీ కేంద్రసంఘం ప్రథాన కార్యదర్శి మాట్లాడుతున్నాడని ప్రకటన జరిగింది. దేశంలో ప్రథాన కమ్యూనిస్టునాయకుడైన ఎర్నోగెరో మాట్లాడాడంటే ఏదో కొత్తవార్త వస్తుం దని వాళ్ళకి తెలుసు.

"ప్రియమైన కామ్రేడులారా! ప్రియమైన మిత్రులారా! హంగేరీ కార్మి కులారా!" గెరో మాట్లాడటం మొదలు పెట్టాడు—"ఇవాళ కార్మిక శక్తిని వూపెయ్యాలని మన ప్రజాశత్రువులు ప్రయత్నిస్తున్నారు. రైతుకూలీ బాంధ వ్యం విచ్ఛిన్నంచెయ్యాలని అభిప్రాయ పడుతున్నారు. కార్మికులు మన దేశంలో ఆక్రమించిన ఉన్నతస్థానాలు కూలదొయ్యాలని సంకల్పిస్తున్నారు. హంగేరీ కార్మికపార్టీమీద కార్మికులభక్తి భంగపరచాలని యత్నిస్తున్నారు.ఇతర సోషలిస్టు దేశాలతో హంగేరీ ప్రజారాజ్యానికి వున్న బాంధవ్యం—ముఖ్యంగా సోవియట్ రష్యాతో వున్న అనుబంధం తెంచెయ్యడానికి పన్నాగాలు పన్ను

తున్నారు. మన పార్టీకి సోవియట్ యూనియను కమ్యూనిస్టు పార్టీతోవున్న సంబంధాలు భగ్నం చెయ్యడానికి కుట్రలు పన్నుతున్నారు. కమ్యూనిస్టుపార్టీ లెనినుపార్టీ. కాంగ్రెసు నిర్మించినపార్టీ. సోవియటు యూనియను మీద అపవాదులేస్తూన్నారు. దాంతో మన వర్తకసంబంధాలు పాక్షికమంటున్నారు. ఇంపీరియలు దేశాలనుంచి కాక మన స్వాతంత్ర్యం సోవియటు దేశాలనించి రక్షించాలంటున్నారు" ఇదంతా వొట్టి అబద్ధం. శత్రువులు కల్పించిన బూటకం. ఇందులో రవంతా నిజంలేదు. అసలు నిజమేమిటంటే సోవియటు యూనియను మనదేశాన్ని హార్తీపాసిజంఫా నించీ, జర్మను సామ్రాజ్యవాదులనించీవిముక్తి కలిగించింది. మనదేశం, యుద్ధంచివర ఇంకా మట్టిలో పొర్లాడుతూ" శత్రువుల ఇనపపాదాలక్రింద నలుగుతూ వున్నప్పుడు, మన పక్క నిలబడి మనతో సమానంగా సంధులు చేసుకుని, మనని గౌరవ మర్యాదలతో ఇంతవరకూ చూస్తూ వచ్చింది. హంగేరీ జాతీయభావాలు రెచ్చగొట్టి దేశంలో అల్లకల్లోలం పుట్టించాలని కొందరు ప్రయత్నిస్తున్నారు."

"ఏదో జరిగేటట్టేవుంది గేరో ఇలా మాట్లాడాడంటే ఏదో గడబిడ తప్పకండా జరుగుతుంది" తనభార్యతో అన్నాడు జోల్టాను

"కార్మిక కామ్రేడ్లారా! కార్మికులారా! ఈ విషయం మనం బహిరంగంగా చెప్పాలి. మనకి సోషలిష్టు డెమాక్రసీ కావాలా? బూర్జువా డెమాక్రసీ కావాలా? ఈ ప్రశ్న ఇప్పుడు మన ముందుకి వచ్చింది. ఇప్పుడు సమస్య ఏమిటంటే, మన దేశంలో సోషలిజం నిర్మించదలచుకున్నామా? కాక సోషలిష్టు భవనంలో వొక రంధ్రంచేసేసి అందులోంచి కాపిటలిజం ప్రవేశించడానికి దారి తయారు చేస్తామా? ప్రశ్న ఏమిటంటే కార్మికతరగతి శక్తి, కర్షక కార్మికమైత్రి ఛిన్నా భిన్నమవుతూ వుంటే చూస్తూ వూరుకుంటారా? కాకపోతే మీరందరూ జాగ్రత్తపడి, క్రమశిక్షణతో, సంపూర్ణమైన ఐకమత్యంతో కార్మికుల అధికారాలు, హక్కులు సంరక్షించడానికి జరిగే ఈయుద్ధంలో పాల్గొంటారా? సోషలిజంను సంరక్షిస్తారా?"

"ఏం జరుగుతోందో బైటికి వెళ్ళి చూసివస్తాను. గేరోకి ఏదో చిక్కు వచ్చింది" అన్నాడు జోల్టాను. అతడు బైటికి వచ్చాడు. ఒక ట్రాం కారు ఎక్కి పట్నంమధ్యకి వెళ్ళాడు.

జోల్టాను రేడియోస్టేషనుదిక్కు వెళ్ళాడు. బ్రహ్మాండమైన జనసమూహం భవనంఎదుట మూగివుండడం చూశాడు. రేడియో భవనం కప్పుమీంచి

తుపాకిగుళ్ళు కురుస్తూండడంచూసి భయపడ్డాడు. అక్కడి కోలాహలం పోరాటంగా మారడం, అది చిలికిచిలికి గాలివానఅయి, రేడియో భవనం తుక్కుతుక్కుకావడం కళ్ళారా చూశాడు. ఇంటికి వచ్చేసరికి ఎంతో ఆలస్య మైంది, అక్కడక్కడ జరిగిన అల్లర్లకి ట్రాంబళ్ళు రాకపోకలు ఆగాయి. అంచేత అతడు నడిచి రావలిసి వచ్చింది.

"రేపు రెండువేపులనించీ కావలసినన్ని కాల్పులు జరిగేటట్టున్నాయి. మనం ఎక్కడికీ కదలకండా ఇంట్లోనే వుండాలి" అన్నాడు భార్యతో జోల్టాను.

పగలంతా ఇంట్లోనే వుండడమంటే ప్రాణం బేజారైంది వాళ్ళకి. అంచేత ఈవా పోస్టాఫీసుకి వెళ్ళింది. అక్కడ పనిచేస్తూవున్న కమ్యూనిస్టు లందరూ "ఇంతకీ పెద్ద జరిగిందేమీలేదు" అన్నారు, పెదవులు చప్పరిస్తూ. మామ్మూలుకంటే హెచ్చుగా నవ్వుకున్నారు వాళ్ళు. అయితే ఏవేవో మను షుల సంఖ్యమాత్రం తగ్గింది. ఇంతలో నదిమీదుగా తుపాకుల కాల్పులు వినిపించాయి· దాంతో ఏమీ జరగలేదు అనడం మానేశారువాళ్ళు. వాళ్ళలో వొకడు అన్నాడు "అల్లర్లు ఇంకా సాగుతున్నట్టే వున్నాయి."

జోల్టాను పాల్ తిరుగుబాటువారు కాడు. అసలు తిరుగుబాటంటేనే కిట్ట దతడికి. ఉదాహరణకి — అతడు పదేళ్ళపాటు ఏవీవోవాళ్ళ లెక్కల్లోకి ఎక్కకండా కాలం గడిపాడు. తాను పనిచేస్తున్న మోటారు కర్మాగారంలో ఎప్పుడూ కమ్యూనిజాన్ని పొగుడుతూనే వుండేవాడు. ఎప్పుడోవొకప్పుడు అతడు మంచి పార్టీ మెంబరవుతాడు అని వాళ్ళందరూ అనుకునేట్టు నడు చుకునేవాడు. ముప్ఫయిఏళ్ళు వచ్చేసరికి, అతడు ప్రాముఖ్యానికిరాక, వృత్తి కులాసామనిషిమాత్రమే అనిపించుకున్నాడు. బుడాపెస్టులో అతడి ఈడు వాళ్ళు ఎంతోమంది అలాంటివాళ్ళే.

అతడు బుడాపెస్టులో నడుస్తూ, తిరుగుబాటుగురించి వినేసరికి వొక గంభీరమైన ఆవేశం తనని ఆవేసిస్తూవచ్చింది. ఏవీవో మనుషులంటే అత డికి ద్వేషంలేదు. వాళ్ళంటే వొకవిధమైన అసహ్యంమాత్రం వుండేది. రష్యా వాళ్ళన్నా అతడికి ద్వేషంలేదు.

"ఈ పదేళ్ళలోనూ రష్యావాణ్ణి పెళ్ళాడిన వొక్క హంగేరీ అమ్మాయి లేదు. మా పిల్లల్లో ఎవరైఅయినా వొక్క రష్యావాడితోకలిసి వెళ్ళిందా, ఇక ఎవ్వరూ ఆమెతో మాట్లాడరు. అని జర్మన్‌వాళ్ళు ఇక్కడ వున్నప్పుడు

వాళ్ళతో ఎన్నో పెళ్ళిళ్ళు జరిగాయి?" అంది గతరాత్రి రష్యావాళ్ళని అసహ్యించుకుంటూ ఈవా.

మరోసారి కోపంతో ఇలా అందామె: "ప్రపంచంలో ఎవతెఅయినా రష్యావాణ్ణి ప్రేమిస్తుందా?"

జోల్టాను మార్గరెటువంతెనదాటి పెష్టునగరంవెళ్ళి, అక్కడి పరిస్థితులు చూసేసరికి రష్యావాళ్ళంటే మీకు ఇష్టమా లేదా అన్నది ఒక పెద్ద విషయంకాదని తేలిపోయింది. వాళ్ళు శత్రువులు. ఒకచోట ఒక ఆయుధాలబండి మరొకబండిమీద తుపాకులుపేలుస్తూ బుర్రుమని వెళ్ళిపోయింది. ఆయుధాలబండిలోవాళ్ళు రష్యావాళ్ళు. కార్ల్‌మార్క్స్ స్క్వేర్లో లెనినుబులెవార్డుదగ్గిర ఒక రష్యాబండి ఎవరిమీధో తుపాకులు పేల్చింది. ఆబండిలో వాళ్ళూ రష్యావాళ్ళే.

జోల్టానుపాలు జాబాద్‌నెప్ పత్రిక కార్యాలయం శిథిలాల దగ్గిరికి వచ్చేసరికి అతడి మనస్తత్వం మారిపోయింది. ఇంతలో మరతుపాకులతో ఒక పెద్ద రష్యాకారు అక్కడికి వచ్చింది. "ఇది కిల్లియనుబారక్సుకి వెళుతుంది. ఆపెయ్యండి" అని ఒకకుర్రాడు అరిచాడు.

నెబ్జిన్‌హాజ్ వీధిలోంచి ముగ్గురు యువకులు గ్యాసోలిను బాంబులు పట్టుకుని టాయ్‌వేపు దూసుకుపోయారు. ఆయుధాలబండిలోని రష్యావాళ్లు చప్పున జాగ్రత్తపడ్డారు. టపాటపా తుపాకులుపేల్చి ముగ్గురు యువకుల్ని తుడిచిపారేశారు. కొన్నిగుళ్ళు అటూఇటూ పేలి గాజుకిటికీలు ముక్కలు చేసేశాయి. వీధినిండా గాజుముక్కలు కుప్పలుపడ్డాయి. రాకాసిబండి వాటిమీంచి పోతూవుంటే గలగల చప్పుడుచేశాయవి. ఒక గ్యాసోలినుబాంబు వీధిలో పగిలింది. దాంతో అక్కడి శవాలికి నిప్పంటుకుంది.

గురితెలిసిన ఒక హంగేరీవ్యక్తి ఇంటికప్పుమీంచి కాచుమీద రైఫిలు పేల్చాడు. ఒక రష్యామనిషి దెబ్బతిని పడిపోయాడు. తక్కినవాళ్ళు మరతుపాకి కప్పుమీదికి గురిపెట్టారు. ఇంతలో ఒక కుర్రాడు నెబ్జిన్‌హాజు వీధిలోంచి పరిగెత్తుకువచ్చి ఒక గ్యాసోలినుబాంబు బండిలోకి విసిరాడు. దాని మొత్తి పెద్దది. అంచేత వెంటనే సీసా పగలలేదు. ఒక రష్యా సైనికుడు దాన్నితీసి చప్పున వీధిలోకి విసిరాడు. అది అక్కడ పగిలింది.

ఈ యుద్ధం ఎంత భయంకరంగావుందో అంత ఆకర్షణీయంగానూ వుంది. ఇదంతాచూస్తూ జోల్టాను పాలు ఎవిన్యూకిందుగా వచ్చాడు.

అతడు గబగబా నడిచాడు. ఇంతలో ఎవరో ఒక తలుపుచాటునించి హటాత్తుగా పరిగెత్తుకువచ్చి, అతడిచేతిలో రెండు గ్యాసోలిను బాంబులుపెట్టి "వీటిని వెలిగించి విసురు" అంటూ తొందరచేశారు.

ఒకటి చంకలోపెట్టి రెండోది అగ్గిపుల్లతో వెలిగించాడు జోల్టాను. బులె వార్డు వీధిలోకి రంయ్యిమని వెళ్ళాడు. రష్యావాళ్ళు ఒకకప్పుమీద గురిపెట్టి కొడుతున్నారు. బోల్టాను బాంబువూది వాళ్ళమీద విసిరాడు. సరిగ్గా అదే సమ యంలో 14 ఏళ్ళలోపు కుర్రాళ్ళు ఇద్దరు అదేపనిచేశారు. ఈసారి మూడు బాంబులూ పగిలాయి. రష్యాబండి మండిపోయింది. కళ్లు మిరుమిట్లు గొలిపాయి.

ఆవాళ రాత్రి జోల్టాను దంపతులు ఎన్నో విషయాలు మాట్లాడుకున్నారు. బాంబులుమాట విని ఈవా అడిలిపోయింది.

"మరేం పరవాలేదు. ఇది పెద్ద విప్లవంకింద తేలేటట్టుంది" అన్నాడు జోల్టాను. ప్రభుత్వం అంతా గగ్గోలుపడిపోతున్నట్టు ఎన్నో అర్జంటు సందే శాలు అప్పటికి పంపించి వచ్చింది ఈవా. అక్టోబరు 24 నాడు 'రేడియో బుడాపెస్టు' నించి చిత్రమైన ప్రకటనవచ్చింది. రష్యాసైనికులు నగరంలో ఎందుకు దెబ్బలాడుతున్నారో సంజాయిషీ చెపుతూ చేసినప్రకటన అది. అది విని జోల్టాను దంపతులు ఇద్దరూ అసహ్యించుకున్నారు.

"వార్సా సంధిపత్రంకింద హంగేరీలో సోవియటు సైనికులు ఏయే షరతులకింద, ఏఉద్దేశంతో హంగేరీలో వున్నారో హంగేరీరేడియో శ్రోతలు పలువురు మమ్మల్ని అడుగుతున్నారు. మంగళవారంనాడు మన ప్రజాశత్రు వులు యూనివర్సిటీవిద్యార్థులు చేసిన ప్రదర్శనం సాకుగా తీసుకుని విప్లవం రెచ్చగొట్టారు. వాళ్ళు ఆయుధాలతో తిరగబడ్డారు. దానివల్ల దేశంలో శాంతి భద్రతలు నశించాయి. ప్రజల మానప్రాణాలికి అపాయం తటస్థించింది. శాంతి భద్రతలు నెలకొల్పవలసిన బాధ్యత ప్రభుత్వంమీద వుంది. అందుచేత ప్రభుత్వం తిరుగుబాటుదార్లని అణచివెయ్యడంకోసం రష్యాసైనికుల సహా యంకోరింది. మనదేశంలో శాంతి స్థాపించడానికి, రాజధానినగరం ప్రజలు శాంతిజీవితం గడపడానికి అనుకూలపరిస్థితులు కల్పించడానికి రష్యా సైని కులు తమ ప్రాణాలు ఒడ్డి మనకి సహాయంచేస్తున్నారు. శాంతి భద్రతలు నెలకొన్నతరవాత రష్యాసైనికులు తమతమ స్థావరాలికి వెళ్ళిపోతారు.

ఓ బుడాపెస్టు కార్మికులారా! మనకి మిత్రులూ, ఆప్తులూ అయిన రష్యా వాళ్ళకి ప్రేమతో స్వాగతం చెప్పండి."

ఈవాకి కమ్యూనిష్టుపార్టీ బలంమీద మంచి నమ్మకముంది. అంచేత ఈ తిరుగుబాటు ఇట్టే అణగదొక్కేస్తారని అనుకుందామె.

"ఏవీవో వాళ్ళు కనిపెట్టినట్టు మనం ఏమీ అనకూడదు. మీరు బాంబు విసిరానని ఎవరితోనూ అనకండి" భర్తని హెచ్చరిస్తూ అందామె. ఆమె స్నేహితులూ చాలామంది ఆమెలాగే అనుకున్నారు.

ఇంతలో కిల్లియను బారక్సునించి రేడియో పలుకుతున్నట్టు ప్రకటన జరిగింది. నిజానికి ఒక కోటలాంటి ఆభవనం రష్యాటాంకు తుపాకులికి గురిఅయివుండి అప్పటికి.

"పట్నమంతా ప్రశాంతంగావుంది. ఫెరన్సు బుకెవార్డులో ఒకటిరెండు తుపాకులు మాత్రం వినిపిస్తున్నాయి. ఎక్కడివాళ్ళక్కడ ఇళ్ళల్లో వుండి పోయారు" అని ప్రకటన జరిగింది. జోల్టాను ఆగలేకపోయాడు.

ఒకటీరెండు కాల్పులా? పట్నమంతా పేల్చేస్తున్నారు వాళ్ళు. ఇవాళ మధ్యాహ్నం నేను స్వయంగా చూసాను" అన్నాడతడు.

హంగేరీ అబద్ధాల దుష్ప్రచారంలో మరుగుపడిపోయింది. ఈ విషయం అందరికీ స్పష్టంగా తెలిసిపోయింది. గతరాత్రి రేడియో బుడాపెస్టు దగ్గిర ఏంజరిగిందో నిజమైనకథ చెపుతాం అని రేడియోలో ప్రకటన జరిగింది.

"ఈవా, ఇది విను" అన్నాడు జోల్టాను.

"అక్టోబరు 23 న జరిగిన భయంకర సంఘటనల్లో రేడియోస్టేషన్ దగ్గిర ఏమిటిజరిగింది?" రేడియోలో ఎవ్వరో అన్నారు.

"ఇతడు చెపుతూన్న దాంట్లో వొక్కటిమాత్రం నిజం, ఆ సంఘటన నిజంగా భయంకరమైయిందే" అన్నాడు జోల్టాను.

"నిజంగా అక్కడ ఏమిటి జరిగింది?" సాయంకాలం ఉత్సాహపూరితులూ, క్రమశిక్షణకలవాళ్ళూ అయిన విద్యార్థులు కొందరు బెమ్ విగ్రహం ముందు ప్రదర్శన జరుపుతూవుంటే రేడియోస్టేషను ఎదటి ఇరుకువీధి యావత్తూ యువకులతో కిటకిటలాడిపోయింది.

"రేడియో స్టేషనులోని పనివాళ్ళు మూడురంగుల జెండాతో వాళ్ళకి స్వాగతం చెప్పారు. చప్పట్లు కొట్టారు. కొంతమంది ప్రతినిధివర్గంగా ఏర్పడి

రేడియోస్టేషను అధికార్లని కలిసారు; తమకోరిక వినిపించారు. చాలా విష యాలమీద ఒప్పందం కుదిరింది. కాని ప్రతినిధివర్గం బాల్కనీమీదికి వెళ్ళి మాట్లాడవలిచేసరికి; బాధ్యతలేని కొందరు వాళ్ళని మాట్లాడనివ్వలేదు. వాళ్ల సంఖ్య క్రమంగాపెరుగుతూవచ్చింది. ఒక ప్రతినిధివర్గం తరవాత మరో ప్రతి నిదివర్గం వచ్చింది. నిజాయితీగా వాళ్ళు తమ కోరికలు అధికారవర్గం ముందు పెట్టడం. అవి వాళ్ళు నెరవేర్చడం—ఇక సాధ్యంకాదనిపించింది. ప్రజలు ప్రతినిధివర్గాల మాటలు వినలేదు. బ్రాడీశాండరువీధి ఫాసిష్టు నినా దాలతో మారుమోగింది. రేడియోభవనం కిటికీలమీద జనం ఇటికలు విసి రారు. ప్రతినిధివర్గం చెప్పేమాటలు రికార్డు చెయ్యడంకోసం నిలబడివున్న రేడియోస్టేషను కారుమీద దాడిచేశారు. మరోకారు కాల్చేశారు.

"పరిస్థితి ఇలా విషమించేటప్పటికి యూనివర్సిటీ విద్యార్థుల్లో చాలా మందీ, యువకకార్మికులూ జట్లుజట్లుగా వెళ్ళిపోయారు. కాని ప్రజాసమూ హం కదల్లేదు. బులెవార్డునించి కొత్తవాళ్ళు గుంపులు గుంపులు వచ్చారు. తరవాత సాయుధదళాలు వచ్చాయి. ఎక్కడో ఒక మిలిటరీ బారక్సు తలుపులు పగలగొట్టి, లోపల దూరి జనం ఆయుధాలు సంగ్రహించారు. సరిగ్గా అదేవేళ ప్రజలు రేడియోతలుపులు బద్దలుకొట్టి లోపల ప్రవేశింప బోయారు. కాపలావాళ్ళు నీటిగొట్టాలతో ఆపడానికి ప్రయత్నించారు. ఆ నీటి గొట్టాలే నిప్పంటుకున్న కార్లు ఆర్పడానికి వి. యోగపడ్డాయి. ప్రజలు అదు పులోకి రాలేదు. టియరు గ్యాసు ఉపయోగించవలసి వచ్చింది. పరిస్థితులు మరీ విషమించాయి. జనం రేడియోస్టేషను కిటికీలు విరగ్గొట్టారు. పుష్కిను వీధికి ఎదురుగావున్న స్టుడియోల ఇనపతలుపులు తోసుకుని లోపల చొర బడ్డారు. బ్రాడీశాండరు రోడ్డులో ఒక భవనంనించి ఇటికలు సంపాదించారు. వాటితో రేడియోభవనానికి ఎంతోనష్టం కలిగించారు. "రేడియోస్టేషను వశ పరచుకోండి" అంటూ కేకలువేశారు.

"కాపలాజట్టు గాలిలో తుపాకులు పేల్చింది గుళ్ళులేని తోటాలు పేల్చి దాడిచేసినవాళ్ళని భయపెట్టింది. ఎవ్విధమైన ఆయుధాలూ ఉపయో గించకుండా ప్రజల్ని బయటికి పంపెయ్యడానికి ప్రయత్నించింది. ప్రజలికి ఎవ్విధమైన హానిచేయ్యలేదు. కానైతే ప్రజలు తుపాకులు కాలుస్తూనేవున్నారు. రక్షకదళం మేజరు ఒకడు దెబ్బతిని పడిపోయాడు; చచ్చిపోయాడు. తర

వాత మరో ఆరుగురు కర్షకపక్షంవాళ్ళు చచ్చిపోయారు. అయినా వాళ్ళు ఆయుధాలు ఉపయోగించలేదు.

"స్టేషను ముట్టడిలో వుంది. ప్రోగ్రాంమాత్రం నిరాటంకంగా ప్రసారమవుతూనే వుంది. ఇంతలో గ్యూటెన్‌బర్గుస్క్వేరు పక్కనించి రెండుట్రక్కులునిండా సాయుధులైన యువకులు వచ్చారు. రేడియోస్టేషను ఎదురుగా చుట్టుపక్కలావున్న ఇళ్ళు ఆక్రమించుకుని వాళ్ళు రేడియోస్టేషనుమీద తుపాకులు కాల్చడం మొదలెట్టారు. స్టేషను రక్షకదళంలో చాలామంది గాయపడ్డారు. ఎంతోమంది చచ్చిపోయారు. అప్పటికికాని రక్షకదళానికి తుపాకులు కాల్చడానికి ఆజ్ఞఇవ్వలేదు. అది తప్పనిసరి అయింది. ప్రజల్లో కొందరివగ్గిర మరతుపాకులూ చేతిబాంబులూ వున్నాయి.స్టుడియోమీద దాడి తీవ్రం చేశారు వాళ్ళు. తుపాకిగుళ్లు వచ్చిపడుతూవున్నా, రేడియోస్టేషనులో పనిచేస్తున్నవాళ్ళందరూ చివరివరకూ ప్రోగ్రాం ప్రసారం చేస్తూనేవున్నారు. ప్రజలగుంపు భవనంలో ప్రవేశించింది. అయినా వాళ్ళు కాసూత్‌రేడియో ఆపుచెయ్యలేకపోయారు.

"ప్రియమైన సోదరులారా! మీరు ఇప్పుడు వింటున్నది కాసూత్ రేడియో. దీనిప్రోగ్రాం ఇప్పుడు కొద్దిగానే మారింది హంగేరీరేడియో, కాసూత్ రేడియో ఇంకా మాట్లాడుతూనే వుంది. విప్లవవ్యతిరేకులూ, వాళ్లనాయకులూ దానినోరు కట్టలేకపోయారు. మాస్టుడియోలికి ఎంతోనష్టం కలిగింది స్టుడియో రక్షక దళంలో కొంతమంది వీరమరణం పొందారు. ఇక్కడ పనిచేసే వాళ్ళకికూడా కొద్దోగొప్పో నష్టం కలిగింది. అయినా ఈ ఉదయంనించీ మేం మా మా పనుల్లో మగ్నులమై వున్నాం. ఇంతవరకూ కాసూత్‌రేడియో బుడా పెస్టు పనిచేస్తూనేవుంది.

"ప్రియమైన సోదరులారా! ఇంతవరకూ మీరు గియారీకాల్మర్ ఇచ్చిన రేడియోస్టేషను దగ్గిర ఏమిటి జరిగింది?" అన్న శీర్షికతో ఒక రిపోర్టు విన్నారు:

ప్రభుత్వం చెప్పినవన్నీ అబద్ధాలు అని పెట్టి పాలిస్తున్నదనీ అతడికి అవగతమైంది. దాంతో అతడు విప్లవవాదిగా తయారయాడు.

జరిగిన పోరాటంలో జోల్టాను ఏమంత ప్రముఖపాత్ర వహించలేదు. దానికి కారణం తనభార్య అతణ్ణి ఇంట్లోపెట్టి ఉంచడమే. కాని అక్టోబరు 29

నాడు రష్యావాళ్ళు బుడాపెస్టు వొదిలివెళ్ళాక, జోల్టాను దంపతులు తమలో తాము ఇలా అనుకున్నారు:

'నగరానికి స్వేచ్ఛతేవడంలో మనమూ చేతులు కలిపాం.''

నగరంలో శాంతిపరిస్థితులు ఏర్పడ్డతరవాత, ఎక్కడ ఏం జరుగుతుందో కనుక్కోడానికి జోల్టాను దంపతులకి అవకాశం దొరికింది. కిల్లియను బారక్సు శత్రువులు స్వాధీనం చేసుకోలేకపోయారని విని వాళ్ళు నిర్ఘాంతపోయారు. "దాన్ని చూసినప్పుడు ఇక దానిపని ఆయిపోయిందనే అనుకున్నాను'' అన్నాడు జోల్టాను.

బులెవార్డు పొడుగునా ఎన్నో రష్యాటాంకులు కాలి పడివున్నాయి. ఇన్నిటాంకులు కాలిపోయి వుంటాయని వాళ్ళు ఎన్నడూ అనుకోలేదు.

'ఒకటో రెండో భగ్నమయాయి అనుకున్నాను' అంది ఈవా.

తానూ వొక రష్యాబండి నాశనంచెయ్యటం గర్వంతో చెపుతూ జోల్టాను తనభార్యని అక్కడికి తీసుకువెళ్ళాడు. తాను గ్యాసోలీనుబాంబు విసిరిన టాంకు చూపించాడు. టాంకు గొలుసుల్లో ఇనపగొట్టాలు అల్లిబిల్లిగా ఇరుక్కుని వున్నాయి. టాంకు గమనం నిరోధించడానికి అదంతా కుర్రాళ్ళు చేసినపని.

"ఇంతేసి పనులు సాధ్యమని నేను ఎన్నడూ అనుకోలేదు' అంది ఈవా.

బుడాపెస్టు పట్నమంతా ఇలాగే చిత్రంగావుంది 'నిరాయుధులైన ప్రజలు ఆటాంకులు భగ్నంచేశారంటే, ఎవ్వరూ నమ్మరు. ఇది అడవాళ్ళకమరీ ఆశ్చర్యం కలిగించింది. దేశభక్తి అందరి హృదయాల్లోనూ వుప్పొంగింది. హంగేరీ దేశభక్తులు బొరుటి ప్రపంచంనించి ఏలాటిసహాయమూ లేకండా అయుధాలు లేకండా, మహా శక్తివంతుడైన శత్రువును—క్రూరుడైన విజేతను సోవియటు రష్యాను తమదేశంనుంచి వెళ్ళగొట్టారు.

ఇదంతా మనం చెయ్యగలిగామంటే నేను నమ్మలేకండా వున్నాను. వీళ్ళందరూ బతికి బయటపడతారని నేను అనుకోలేదు'' తనభార్యని హెచ్చరిస్తూ అన్నాడు జోల్టాను—"అయితే వాళ్ళు తిరిగి హంగేరికివచ్చారా, ఐక్యరాజ్యసమితీ, అమెరికా మనకిఆయుధాలు సహాయంచేస్తాయి. సైన్యాలు పంపుతాయి. అప్పుడు మన ప్రజలు నిరాయుధులు కాక సాయుధులయి వుంటారు? రష్యావాళ్ళు మళ్ళీ అక్కడికి రావడం సాధ్యమే అని ఈవా యోచించనైనా యోచించలేదు.

"ఏవేవో వాళ్ళని కూడా ఎలా తరిమెయ్య గలిగామా అనే నాకు మహాశ్చర్యంగా వుంది" అంది ఆమె.

కానైతే అది నిజంమాత్రంకాదు. చాలారోజులుదాకా చెదురుమదురుగా వున్న ఏవేవో వాళ్ళు పెద్ద పెద్ద కార్లమీద గంటకి ఎనభైమైళ్ళు పరిగెడుతూ, వుత్త కసితీర్చుకోడానికా అన్నట్టు ఎక్కడపడితే అక్కడ మరతుపాకులు పేల్చారు. పెస్తులో ఆహారపదార్థములకోసం 'క్యూ'గా నిలబడివున్న ఆడాళ్ళ మీద తుపాకులుకాల్చి చంపేశారు.

ఆహారం పెద్దసమస్య. రొట్టెలదుకాణాలు రోజుకి రెండుగంటలకంటే అధికం తెరవరు. ఇంట్లోవున్న ఆహారమంతా జోల్టాను తిరుగుబాటుదార్లకి పంచిపెట్టేశాడు. ఇప్పుడు సంపాదించాలంటే కాళ్ళకినెత్తురు దిగినట్టు క్యూలో నిలబడాలి. చుట్టుపట్ల పల్లెలనించి రైతులు, తాము స్వాతంత్ర్యసమరంలో పాల్గొనలేవని సిగ్గుపడుతూ, పోగుచేయ గలిగినంత ఆహారపదార్థాలు పోగు చేసి, పట్నంలోకితెచ్చి పంచిపెట్టారు. ట్రక్కులమీదా, బళ్ళమీదా, తోపుడు బళ్ళమీదా, ట్రాక్టర్లమీదా, గడ్డివాగన్లమీదా గ్రామీణులు ఆహారపదార్థాలు పట్టుకువచ్చారు. ముఖ్యమైన వీధుల్లో నుంచుని టన్నులకొద్దీ ఆహారపదార్థాలూ, పందికూనలూ కోళ్ళూ పంచిపెట్టారు.

బుడాపెస్టులో ఇదంతా ఒక పండుగులా జరిగింది. వీధుల్లోని శిథిలాలు ఎవ్వరూ తొలిగించలేదు. కాలిపోయిన రష్యాటాంకుల్లోని శవాలు కూడా ఎవరూ పాతిపెట్టలేదు. చచ్చిపడివున్న ఏవేవో మనుషుల్ని ఎవరూ తియ్యలేదు. స్వాతంత్ర్యయోధుల్ని మాత్రం పార్కుల్లో జనం పాతిపెట్టారు. శత్రువుల శవాలు వీధుల్లో కుళ్ళడానికి వొదిలేశారు. స్వాతంత్ర్యం వచ్చిందనడానికి నిదర్శనంగా, దారిపోయే స్త్రీ పురుషులు ఈ శవాలవేపు వేలెత్తి చూపిస్తున్నారు. ఎక్కడెక్కడినించో పత్రికా ప్రతినిధులు ఏదో మంత్రమహిమవల్ల వచ్చారా అన్నట్టు అక్కడవాలారు. సోషలిస్టు పత్రికలూ, రైతుసంఘపత్రికలూ— అన్ని పత్రికలూ తమ తమ ప్రతినిధుల్ని పంపాయి. "దీంతో జాతీయ సౌభాగ్యానికి ద్వారాలు విడ్డాయ"ని పత్రికలన్నీ ఘోషించాయి.

"చూడండి, పత్రికలూవచ్చాయి" ఒకనాటి సాయంకాలం ఈవా కేక వేసింది. పాలు దంపతులు అక్కడ ఆగారు. అది యుద్ధంలో బాగా బాంబు దెబ్బలు తిన్నస్థలంలో పత్రికల దుకాణం. అక్కడ నాలుగురకాల పత్రికలు

బాగా అచ్చుకానివి వున్నాయి. వాటిల్లో అధికంగా వసంతులూ, అవీ వున్నాయి. అయినా అవి వార్తాపత్రికలే. జోల్టాను దంపతులు తలో పత్రికా కొన్నారు. కమ్యూనిష్టుపార్టీ పత్రిక "జాబాద్‌నెప్" పవిత్రమైన లూయీకానలు సీలు ముఖపత్రంమీద ముద్రించడంచూసి దాన్ని మురికికాలవలో పారేశారు.

ఇలాంటి చిన్నచిన్న విషయాలుకూడా ఆదంపతులమీద ఎంతో ప్రభావం వేశాయి. ఒక్కొక్కప్పుడు ఒకచిన్న సంఘటనకూడా వాళ్ళకళ్ళల్లో నీళ్లు తెచ్చేది. ఒక్కనిమిషం వాళ్ళు ప్రకాశవంతమైన లేతఎండలో నుంచుని 'మనకేమయింది'? అంటూ నిచ్చెరపోయారు. ఒకనాడు ఈవా వీధిలో నడుస్తోంది. ఎవరో ఒకమనిషి ఆమెని రాసుకుంటూ పోయాడు. అతడు ఆగి క్షమాపణ వేడుకున్నాడు. అతడు హంగేరీమనిషి కాడని ఆమెకితెలుసు. అతడేదో పరాయిభాష మాట్లాడాడు. ఒకళ్ళభాష ఒకళ్ళకి అర్థంకాక వాళ్ళు నిమిషం పరస్పరం తేరిపార చూసుకుంటూ నుంచున్నారు. దారిపోయే మరొకడు అతడిమాటల అర్థం ఆమెకిచెప్పి 'ఈయన ప్రత్యేక పత్రికావిలేఖరి. ఫ్రెంచివాడు" అని చెప్పాడు.

"విదేశాలనించి పత్రికా విలేఖర్లని బుడాపెస్టు రానిస్తున్నారా ఇప్పుడు? అని అడిగింది ఈవా.

"వందలకొద్దీ వస్తున్నారు. ఈనగరంలో ఏంజరిగిందో తెలుసుకోవాలని అందరికీ వుంది"అన్నాడు ఫ్రెంచి విలేఖరి. కారణంలేకండానే ఈవా ఏడవడమారంభించింది.

ఆల్ సెయింట్సు డే నాడు జోల్టాను రేడియోవింటూ కూచున్నాడు. "హంగేరీ స్వాతంత్ర్య యుద్ధంలో వీరస్వర్గమలంకరించిన స్త్రీ పురుషుల గౌరవార్థం రేడియో సంగీతం ఏర్పాటుచేసింది. ఎన్నోసంవత్సరాలయి అలాంటి సంగీతం హంగేరీలో వినపడలేదు, అని రేడియో ప్రకటన. మొజార్టు రాసిన 'రెక్వియమ్‌మాస్' సంగీతం ఒక బంగారం వరదలాగ రేడియోనించి వచ్చింది. కమ్యూనిస్టు దినాల్లో అలాంటిది ఎప్పుడోకాని వినిపించలేదు. జోల్టాను నిశ్శబ్దంగా కూచుని విన్నాడు. తదేకదృష్టితో నేలనిచూస్తూ విన్నాడు. 'ఎన్నాళ్ళకి పాశ్చాత్య సంగీతం విన్నానో!' అంటూ వుప్పొంగిపోయాడు.

లండనునించీ, ప్యారిసునించీ, మూనిక్కునించీ వార్తలు వినపడకండా, ఆస్టేషనులు జామ్‌చేసే స్టేషనులు కట్టెయ్యాలని విప్లవం మొదట్లో

విద్యార్థులు కోరారు. ఇప్పుడు జామింగు ఆగిపోయింది. లండను, ప్యారిసు, మూనిక్కు నగరాలనించి వార్తలు నిరాఘాటంగా వస్తున్నాయి. విదేశాల వార్తలు హాయిగా కూచుని వినడమనేది ఎన్నడూ వుండేదికాదు. వెనకటి కాలంలో అదొక మహాభోగంగా వుండేది. అంతేకాదు, విదేశస్థులు ఇక్కడికి రావడం, నిషిద్ధమైన సంగీతం వినిపించడం, యూరపువార్తలు వినడం— ఇలాంటి సామాన్య విషయాలుకూడా 'మేం ప్రపంచంలో మళ్ళీ వొక భాగమయాం' అని జోల్టాను దంపతులచేత అనిపించాయి.

నగరమంతా రకరకాల పుకార్లతో నిండివుంది. ఐక్యరాజ్యసమితి హంగేరీ తరఫున ఆవిప్లవంలో కలగజేసుకుంటుందని వొకవార్త.

కమ్యూనిస్టు జామింగుస్టేషనులు కప్పివెయ్యని ప్రోగ్రాంలన్నీ ఈవా పాలువింటూవుండేది. ఈప్రోగ్రాంలు అమెరికా రేడియోవాళ్లు యూరపునించి ప్రసారం చేసేవాళ్ళు. యునైటెడ్ నేషనువాళ్ళూ, యునైటెడ్ స్టేట్సువాళ్ళూ బుడాపెస్టులో గొడుగుసిపాయిలని దింపుతారనీ, వాళ్ళవెనకాలే టాంకులూ, పటాలాలూ వస్తాయనీ ఆమె రేడియోలోవింది; విని నమ్మింది. చివరికి అపంతా పచ్చి అబద్ధమని తేలింది. బైటిదేశం ఏదీ హంగేరీవిషయంలో కలగజేసుకోదని స్పష్టమైంది. విప్లవంలో నెగ్గినహంగేరీ ప్రాముఖ్యం తగ్గించడానికి ఏ పై దేశమూ ప్రయత్నించలేదు.అయినా దానివిషయంలో జోక్యం కలిగించుకోకండా ఎక్కడివాళ్ళు అక్కడ తప్పించుకుంటారేమో అన్న అనుమానం మాత్రం నగరంలో వ్యాపించింది.

జోల్టాను తనభార్యతో స్టాలినువిగ్రహం భగ్నావశేషాలు చూడడం కోసం స్టాలిన్‌స్క్వేరుకి వెళ్ళాడు. విగ్రహం తాలూకు రెండు కాలిజోళ్ళుమాత్రం అక్కడ మిగిలివున్నాయి. ఒకదానిలో హంగేరీపతాకం పాతివుంది.

"ఇప్పుడు మేం దీన్ని స్టాలిన్‌స్క్వేరు అను చెమారివాడిస్క్వేరు అంటాం" అన్నాడు జోల్టాను నవ్వుతూ.

కమ్యూనిస్టు ప్రభుత్వం ఈకిందివార్త ప్రచారంచేసింది. హత్యా, దోపిడీ, దొంగతనం, బందిపోటూలాంటి నేరాలుచేసి, అక్టోబరు 23 నించీ ఏకారణం చేతయినా జైలునించి విడివడ్డవాళ్ళూ, మూడింట రెండుపాళ్ళు జైలుకాలం పూర్తిచేసినవాళ్ళూ దగ్గిరవున్న పోలీసు హెడ్‌క్వార్టర్సులో రిపోర్టుచెయ్యాలి' అని. వొకనాడు జోల్టాను అన్నాడు.

'ఇమ్రీనాగీ నిజంగా తాను కమ్యూనిష్టుని కానంటాడు. జానెస్‌కాడర్ తాను అసలేకానంటాడు. నిజంఏమిటంటే హంగేరీలో నికిటాకృశ్చేవ్ ఒక్కడే కమ్యూనిష్టు' ఈఛలోక్తిలో చాలా నిజం వుండవచ్చు.

ఇదిగో ఇలాంటి వేళాకోళాలతోటే హంగేరీ జీవితంలో చాలా మార్పులు వచ్చాయి"కామ్రేడు" అన్నమాటఅధికారప్రభుత్వం నిషేధించింది.కామ్రేడు అని ఒకరినొకరు పిలుచుకోడం నేరమయింది. అక్టోబరు 23 దేశమంత టికీ సెలవుదినంగా ప్రకటించారు. కాసూత్ ముద్ర ప్రభుత్వం అధికారముద్ర అయింది. 'విధిగా రష్యాభాష చదవాలి' అన్న నియమం పోయింది.

రాజకీయపక్షాలు పనిచేయడం మొదలెట్టాయి. "అన్నిటికంటే ముఖ్య మైనవిషయం ఇది" అంటూ జోల్టాను దంపతులు సంతోషించారు.

"మనకి నచ్చినవాళ్ళకి వోటు ఇవ్వవచ్చు నిప్పుడు" అని మాటిమాటికీ తమ పొరుగువాళ్ళతో అనేవాళ్లు వాళ్ళు.

స్వతంత్ర పత్రికలూ, రాజకీయపక్షాలూ, స్వేచ్ఛగా సాగే ఎన్నికలూ, ఇష్టంవచ్చినవాళ్ళకి వోటుచేసే రహస్యపద్ధతీ—ఇవన్నీ సాధారణవిషయాలే. హంగేరీ వాతావరణమంతా ఆనందంతో నిండిపోయింది. గనుల్లో పనిచేసే వాళ్ళూ, రైతులూ, విద్యార్థులూ ప్రతినిధివర్గాలుగా బుడాపెస్టు వచ్చారు. ప్రజాపరిపాలనకి సంబంధించిన ఎన్నోసూచనలు జాబితాలుగా తయారు చేశారు. తరవాత కమ్యూనిష్టులు అన్నట్టు అవి ఏమంత విప్లవ వ్యతిరేకమైన సూచనలు కానేకావు. ఫ్యాసిజం అంటేమాత్రం ఎవ్వరికీ ఇష్టంలేదు. వాళ్ళు కోరేదీ, కలలుకనేదీ అంతా ఒక స్వతంత్రమైన మధ్యరకం జీవితం

ఉదాహరణకి—ఒక సాయంకాలం జోల్టాను దంపతులు రేడియో వింటూ కూచున్నారు. బోర్‌సాద్‌జిల్లా కార్మిక సంఘంవాళ్ళు తమ కోరికలు రేడియోలో ప్రకటించారు. చాలా సరళమైన కోరికలవి.

"ప్లాను భగ్నంచేసిన వాళ్ళని తుపాకితో కాల్చెయ్యాలి.
ధరలు తగ్గించాలి.
పెన్షనులూ, కుటుంబ భత్యాలూ హెచ్చించాలి.
ఎక్కువ ఇళ్ళు కట్టాలి.
చిన్న చిన్న ఇళ్ళు కట్టుకునేవాళ్ళకి అప్పులు ఇవ్వాలి.
రష్యావాళ్ళని హంగేరీనించి వెళ్ళగొటాలి.

హంగేరీయురానియం హంగేరీవాళ్ళకి లాభించేటట్టు విక్రయించాలి.

పోలండులో గోముల్కా ఎలాంటి షరతులతో సంధిచేసుకున్నాడో, అలాంటి షరతులతో హంగేరీకూడా సంధి చేసుకోవాలి.

రష్యావాళ్ళకి జోహారుచేసే పార్లమెంటు సభ్యుల్ని కాల్చిపారెయ్యాలి.

సోషలిస్టుపద్ధతి వ్యవసాయం మేం అంగీకరిస్తున్నాం. అయితే రైతులు స్వచ్ఛందంగా అందులో చేరేటట్టు ఏర్పాటుచెయ్యాలి. నిర్బంధం బలవంతం వుండకూడదు."

ఇలా సబబైనకోరికలు రైతులూ, కార్మికులూ సమర్పిస్తూ వుంటే హంగేరీ విప్లవం ఫాసిస్టులు ప్రారంభించారనీ, క్యాపిటలిష్టులూ రియాక్షనరీలూ దేశాన్ని యుద్ధపు పూర్వదినాలికి తీసుకుపోడానికి ప్రయత్నిస్తున్నారని మాస్కోలోనూ, ఇతరచోట్లా కమ్యూనిస్టులు ప్రచారం చేశారు. తిరుగుబాటే సఫలమైతే హంగేరీ మధ్యయుగాలకో, అంతకంటే వెనక్కో మళ్ళుతుందని మాస్కో భావించింది.

కాని వాళ్ళు బతకనిచ్చేవుంటే కొత్తహంగేరీ సోషలిస్టు రాజ్యంగానే వుండేది. వ్యవసాయం చెయ్యని భూస్వాములు వుండేవాళ్ళుకారు. ధనం ఒక్కచోట పోగయేదికాదు ముఖ్యమైన పరిశ్రమలు పుంజీపతులచేతుల్లో వుండేవికావు. ఆపద్ధతి నియంతృత్వం లేని కమ్యూనిజంగా వుండేది. యుగోస్లొవియాకంటే, పోలండుకంటే ఎక్కువ క్యాపిటలిస్టుగా వుండేది. కాని 1890 జమీందారీ పద్ధతిమాత్రం వుండేదికాదు. మధ్య యూరపుఖండంలో జరుగుతూవున్న సంఘటనలు బాగా తెలియని చాలామంది అమెరికా వాళ్లు కొత్త హంగేరీని అపాయకరమైన వామపక్షదేశంగా పరిగణించేవాళ్ళు. కాని కొత్త హంగేరీని ప్రపంచం యావత్తూ, తూర్పు యూరపు క్రమక్రమంగా ప్రజారాజ్యంగా మారుతూవున్న అవస్థలో ఇదిఒక ఆశాజనకమైన మెట్టుగా పరిగణించి, దానికి స్వాగతం చెప్పేది. 1956 అక్టోబరు 23 తో పోల్చి చూస్తే కొత్తహంగేరీ స్వచ్ఛంద ప్రభుత్వానికి ఒక నమూనాగా వుండేది.

ఆ అయిదు స్వాతంత్ర్య దినాలూ పూర్తిగా, సక్రమంగా, సవ్యంగా జరిగాయని చెప్పడంకాదు. ఎంతోమంది ఏవేవో మనుషులు విచ్చలవిడిగా తిరుగుతూనే వున్నారు. రష్యాపటాలాలు నగరంలో ఇంకా వుండనేవున్నాయి. దారిపోయేవాళ్ళని అడపాదడపా వాళ్ళు కాలుస్తూనే వున్నారు. నగరం సుర

క్షితంగా వుందని విప్లవకారులు ఇంకా ప్రకటించలేదు. ఒకవ్యక్తీ, ఒకలా అనుసరించేపని ఇంకా చెయ్యలేదు. అరాచకం ప్రబలివుంది. దానిని వెంటనే అదుపులోకి తీసుకురాకపోతే స్వాతంత్ర్యానికే ముప్పువచ్చేటట్టుంది. అయినా మొత్తానికి తిరుగుబాటూ, అల్లరూ జరిగాక ఎక్కడివాళ్ళు అక్కడ యువకులు సద్దుమణిగి వుండడం చూసి దారులు చకితులయారు. టాంకుల తుపాకుల కిందదూరి, వాటిని చెడగొట్టిన చిన్నపిల్లల సాహసం విని అమెరికావాళ్ళు ముక్కుమీద వేలుపెట్టుకున్నారు. ఆకుర్రాళ్ళే వీధుల్లో చేతిబాంబులు పెట్టారు. తుది రక్తకణం వరకూ వాళ్ళే పోరాడారు. వాళ్ళే ఇప్పుడు వీధుల్లో రక్షకభటులుగా పని చేస్తున్నారు. పోరాటంలో చచ్చిపోయిన పేదల కుటుంబాలకోసం డబ్బాల్లో వాళ్ళే ఆహారపదార్థాలు పంచిపెడుతున్నారు. వాటిని వాళ్ళే రక్షిస్తున్నారు.

బుడాపెస్టులో ఎక్కడచూస్తే అక్కడ ఈ డబ్బాలు జోల్టాను దంపతులకి కనిపించాయి. పేదకుటుంబాలకోసం పౌరులు వేసినడబ్బుకూడా వాటిలో వుంది. ఆడబ్బు ఎవ్వరూ దొంగిలించలేదు. సాయంకాలమయేసరికి కుర్రాళ్లు ఆడబ్బంతా పోగుచేసి పేదవాళ్ళకి పంచిపెట్టేవాళ్ళు.

ఆ దినాల్లో జోల్టాను దంపతులు తమదేశం బావినిగురించి ఎన్నో ఆలోచనలు చేశారు.

"స్వేచ్ఛా వాతావరణంలో ఎన్నికలూ, ఏవీవో వాళ్ళు లేకపోవడమూ, రష్యావాళ్ళ తిరోధానమూ, స్వేచ్ఛగా వార్తాపత్రికలు ప్రచురణ కావడమూ— ఇవే మొట్టమొదట మేం కోరినవి. తరవాత ఒక కొత్తరకం ప్రభుత్వం కావాలని గ్రహించాం. ప్రాతిపదికమైన మార్పు ఈ ప్రభుత్వం చెయ్యాలి. నిజం చెప్పాలంటే ఎలాంటి మార్పులు మంచివో నాకు తెలియదు. నేను యోచించగలిగినంతమట్టుకు ఇమ్రీనాగీ ప్రధానమంత్రిగా వుండి ప్రభుత్వం ఏర్పడితే మంచిదనిపించింది. రష్యావాళ్ళు హంగేరీ వొదిలేసిపోయే కట్టుదిట్టాలు అతడు చెయ్యాలి. నాగీ కమ్యూనిస్టు అన్నసంగతి నాకు తెలుసు. కాని చాలా మంచి కమ్యూనిస్టు" అన్నాడు జోల్టాను.

ఈవా అభిప్రాయాలు వేరు. ఆమె జీవితమంతా మంచి కాతలిక్కుగా గడిపింది. అలా వుండడంవల్ల ఆమెకి కష్టంకూడా కలిగింది. అయినా ఆమె లక్ష్యపెట్టలేదు. ఇప్పుడామె వింటున్నవార్తలు ఆమెని పులకరింపజేస్తున్నాయి ఒకనాడు ఉదయం పదిగంటలకి రేడియోలో ఈవార్త వచ్చింది:

"విజయవంతమైన మన విప్లవం ఫలితంగా మంగళవారం నాడు పెద్ద షాదిల్ జోసెపు కార్డినలు మిండ్ జంటీని జైల్లోంచి వొదిలేశారు. ఈ ఉదయం 8-55 గం. లకి ఆయన బుడానగరంలో తన భవనం చేరుకున్నాడు."

ఈవా ఈవార్త విని వుప్పొంగిపోయింది. ఈ కార్డినలు ఎంతో నమ్మదగ్గ వాడని తనతల్లి దండ్రులు ఎన్నోసార్లు చెప్పారు. ఆయన పడ్డ బాధలూ, ఆయనకి వేసిన శిక్షలూ రహస్యంగా ఆమె ఎన్నోసార్లు వింది. 'ఆయన నిజమైన దేశభక్తుడు' అని ఆమె ఎన్నోసార్లు అంది. అతడు దేశభక్తుడు అన్నది నిజమోకాదో అని సందేహముతో అన్నట్టు అనేది ఆమె ఆమాట.

నమ్మలేనంత అద్భుతంగా అవాళే కార్డినలు జైల్లోంచి పారిపోయాడన్న వార్త బుడాపెస్టంతా అల్లుకుంది. అంతకి ముందురాత్రి హంగేరీ మిలిటరీ ఆఫీసర్లు నలుగురు స్వతంత్రసేనతో కలిసి పోరాడుతూ, బుడాపెస్టు బైట వొక భవనంలో 14 గురు ఏవీవో మనుషులు కార్డినలు మింజెంటీని నిర్బంధంలో వుంచారని విన్నారు ఆ ఆఫీసర్లు అర్డర్లు లేకండానే చప్పునవెళ్ళి ఏవీవో వాళ్ళని నిరాయుధుల్నిచేసి, కార్డినలుని తప్పించి పట్టుకుపోయి వొక సురక్షితమైనచోట పెట్టారు. కొన్ని నిమిషాల తరవాత అక్కడికి వొకరష్యా టాంకు వచ్చింది. కార్డినలు రక్షణకోసం వచ్చామని డ్రైవరు చెప్పాడు. కాని అప్పటికే మింజెంటు శత్రునిర్బంధంనించి తప్పించుకుని తనవాళ్ళ చేతుల్లోకి వెళ్ళిపోయాడు.

సాహసవంతులైన ఆ ఆఫీసర్లు మర్నాడు ఉదయం కార్డినలును బుడాలోవున్న అతడి అధికారనివాసానికి తీసుకువచ్చేశారు. అక్కణ్ణుంచి అతడు హంగేరీ ప్రజలికి ఇలా సందేశమిచ్చాడు:

"యువకులూ, సోల్జర్లూ, విశ్వవిద్యాలయం విద్యార్థులూ, పౌరులూ, రైతులూ, కార్మికులూ తమ ఆయుధాలతో సంపాదించిన ఈగెలుపు నేను అభినందిస్తున్నాను. ఎనిమిదేళ్ళు నేను జైల్లో వున్నాను. ఈ స్వాతంత్ర్యవీరులు నా జైలు తలుపులు పగలగొట్టారు. రెడ్‌శాగ్ (Red Sag) ఆఫీసర్లు సాహసంతో, దేన్నీ లక్ష్యపెట్టకండా, నేను నిర్బంధంలోవున్న ఇంటికి వచ్చారు. నన్ను విడిపించి తీసుకువచ్చారు. బారక్సుల్లో నేను విశ్రాంతి తీసుకున్నాను. హగేంరీ ఆయుధాల్ని నేను ఆశీర్వదిస్తున్నాను. హంగేరీ ఆయుధాలు సంపాదించిన ఈ మహత్తరవిజయం; అవసరం వచ్చినప్పుడు మన రైతాంగం

ద్విగుణీకృతం చెయ్యాలని నేను కోరుతున్నాను. ఇంతకంటే ఎక్కువ చెప్పే ముందు కాని, ఏదైనా కార్యవిధానం అవలంబించే ముందుకాని సంగతి సందర్భాలు తెలుసుకోగోరుతున్నాను."

ఇప్పటికి ఎన్నో ఏళ్ళనించి చాలమంది హంగేరీవాళ్ళమల్లే ఈవా పాలు కార్డినలు మింజెంటీ చిత్రపటం రహస్యంగా దాచి వుంచుకుంది. కమ్యూనిజానికీ, రష్యావాళ్ళకీ వ్యతిరేకంగా తన దేశంలో జరుగుతూవున్న ప్రతిఘటనకి ఆయన ప్రతీకమని ఆమె అభిప్రాయం. నలిగిపోయిన ఆయన చిత్రం ఇప్పుడుతీసి ఆమె గోడకి తగిలించింది. స్వతంత్ర హంగేరీలో ఇలాంటివాళ్ళ నాయకత్వం ఎంతో అవసరమని ఆమెకి ఒక బావన కలిగింది.

"ఈయన ప్రధానమంత్రి కావగ్గవాడు" ఆమె భర్తతో అంది ఆమె.

మతమంటే జోల్టానుకి నిర్లక్ష్యం: "ప్రధానమంత్రికాదు. అసలు కార్డినలు ప్రభుత్వం నడపడమే మంచిదికాదని నా అభిప్రాయం" అన్నాడతడు

"కాని అతడు ప్రభుత్వంతో తప్పకుండా వుండాలి" పట్టుదలగా అంది ఈవా.

"అది సరే కావచ్చు" అంగీకరిస్తూ అన్నాడతడు. తరవాత రేడియోలో కార్డినలు పిలుపువిన్నదామె "అకుంఠితమైన నిశ్చితంకల కార్డినలు హంగేరీ రాజ్యాంగం నడపగల సమర్థుడు" అని తృప్తిపడింది.

"అతడు లేకపోతే మనకి నాయకుడే లేడు" భర్తతో వాదిస్తూ అంది ఈవా - ఇమ్రీనాజ్ నిజంగా నాయకుడని ఎవరు నమ్ముతారు ?" "నాజీ అంటే నాకుఇష్టం. అతడు ధైర్యశాలి" అన్నాడు జోల్టాను.

"మిండ్జెంటీ,నాజీఇమ్రీ కలిసి ప్రభుత్వం ఎందుకు ఏర్పాటుచెయ కూడదు?" అంటూ సూచించింది ఈవా.

"ఇమ్రీ ప్రధాని అయితే అది సాధ్యమే" బలవంతంగా అంగీకరిస్తూ అన్నాడు జోల్టాను.

నాజీ ప్రధానిగా, చర్చినాయకుడు మిండ్జెంటీ మంత్రిగా హంగేరీ ప్రభుత్వం నిర్మాణం కావాలి అనే ప్రతిపాదన ఈవాకి ఏమీవింత అనిపించలేదు. కమ్యూనిస్టు పాతకాపు అయిన నాజీ, మిండ్జెంటీల కలయిక ఇరుగు పొరుగు ఆడంగులికి కూడా ఏమీ వింతగా అవుపించలేదు. ఈప్రతిపాదన చాలామంది ఆమోదించారు.

కార్మికులతో జోల్టాను ఈవిషయం మాట్లాడాడు. నైతికంగా మిండ్‌జెంటీ చాలా గొప్పవాడని అందరూ అంగీకరించారు. ఇమ్రీనాజీ చాలా పాతకాలపు మనిషి అన్నారు.

"అతన్ని అందరూ గౌరవిస్తారు. అందుకని అతన్ని ప్రెసిడెంటుగా పెడదాం. కాని ప్రభుత్వం నడపడానికి విప్లవనాయకులైన పడుచువాళ్ళే కావాలి" అన్నారు.

అటు క్యాపిటలిజమూ కాక, ఇటు కమ్యూనిజమూ కాక మధ్యేమార్గం కావాలన్నారు వాళ్ళు. ఫ్యాసిజంస్థానం ఆక్రమించిన 1945 సోషలిస్టు రాజ్యాంగ ప్రధానాంశాలన్నీ అందులో వుండాలి. కాని వ్యక్తి స్వాతంత్ర్యం, వ్యక్తి గౌరవం పోని పద్ధతి వుండాలి.

"నాకు రెండు విషయాలు కావాలి" అంది ఈవా - ప్రభుత్వవర్గంలో మిండ్‌జెంటీ వుండాలి ఏవీవో వాళ్ళని తీసి పారెయ్యాలి."

"రష్యావాళ్ళనికూడా తీసి పారెయ్యాలి" అన్నాడు జోల్టాను.

నవంబరు 2 సాయంకాలం కార్డినలు మిండ్‌జెంటీ ప్రభుత్వవర్గంలో చేరడంకోసం పెట్టిన షరతుల వివరాలు బుడాపెస్టులో ప్రచారమవుతున్నాయి ప్రభుత్వవర్గం నిర్మాణం కాబోతున్నదని తెలుసుకుని ఈవా సంతోషించింది. కానైతే కార్మికులకి ఏదో బితుకుగానేవుంది.

"ఈషరతుల విషయం రష్యావాళ్ళకి తెలుస్తుంది. మళ్ళీ బుడాపెస్టు రావడానికి ఇదొకసాకుగా వుంటుంది వాళ్ళకి. మీరు చూస్తూవుండండి. ఫాది రీలూ, రీయాక్షనరీలూ ఈవిప్లవం తెచ్చారంటారు వాళ్ళు' అంటూవాదించారు వాళ్ళు.

ఈ విషయంలో తనభయం భార్యతో చెప్పాడు "జోల్టాను విప్లవం జరి గాకే కార్డినలు మిండ్‌జెంటీ జైల్లోంచి బయటికి వచ్చాడు. అంచేత, రష్యా వాళ్ళ ఈవాదం హాస్యాస్పదంగా వుంటుంది" అంది ఈవా - "మనం ఒక అద్భుతమైన కొత్తదేశం నిర్మిస్తున్నాం" ఆశాజనకంగా అంది ఆమె. ఆమాటే మాటి మాటికీ అంటూ వచ్చింది.

రష్యా ఆధిపత్యంనించి విముక్తిపొంది, గౌరవప్రదమైన హంగేరీదేశం అవతరించిందని అందరూ కలలు కన్నారు. ప్రజల్లో వున్నదుంచి యావత్తూ వికసించేవేళ వచ్చిందనిపించింది. దేశం ఎలా పునర్నిర్మాణంచేయాలి అన్న

విషయం మీద నాలుగు మూలలనించీ ప్రతిపాదనలు వచ్చాయి. మొదట్లో కంటే ఇప్పుడు ఎక్కువ రాజకీయ విజ్ఞత ప్రదర్శించే ప్రతిపాదనలు వస్తున్నాయి. హంగేరీలో "సమిష్టి కమతాల పద్ధతి" రద్దుచేయాలని ఒకరైతుసంఘం ప్రతిపాదన చేసింది. అదివిని జోల్టానూ, ఈవా సంతోషించారు, వాళ్ళ సంస్కరణలు రియాక్షనరీగానూలేవు, అలా అని తెలివితక్కువగానూ లేవు.

రైతులు ఇలా ప్రతిపాదించారు :

"అదనంగా పండిస్తున్న "సమిష్టి కమతాలూ", సభ్యులు అట్టే పెట్టడానికి ఉద్దేశిస్తున్న కమతాలూ అట్టే పెట్టాలని మాసిద్ధాంతం. స్వయంపోషకాలు కాని కమతాలూ, సభ్యులు అయిష్టంగా వున్న కమతాలూ రద్దుచేయాలి. ఇది క్రమంగా జరగాలి. చలికాలం పంటలు ప్రారంభ మయాక గాని ఏమార్పు చెయ్యకూడదు. 'సమిష్టి కమతం' రద్దయినచోట భూమంతా రైతులికి పంచి పెట్టాలి. ఎంతకమతం ఆర్థికంగా మంచిదో, వ్యవసాయ శాస్త్రజ్ఞులూ, ఆర్థిక శాస్త్రజ్ఞులూ నిర్ణయించాలి. వసంత ప్రారంభంలో విత్తనాలు చల్లడానికి రైతులికి ఏవిధమైన ఆటంకమూ వుండకండా ఈ ఏర్పాట్లన్నీ జరగాలి. ఒక 'సమిష్టికమతం' రద్దుకాకండా నడుస్తూవుంటే ఆకమతం సభ్యులికి న్యాయంగా దాని ఫలసాయం లభించేటట్టు, ప్రతిరైతుపనీ లెక్కకివచ్చే టట్టు కొత్త ఏర్పాటు జరగాలి. తాత్కాలికంగా ఇప్పటి కమతాలపద్ధతి చెడకండా వుండాలి. కాని దానిమీద పెత్తనం మాత్రం మారాలి. అందరూ యంత్రాలు ఉపయోగించే అవకాశం వుండాలి."

ఫ్యాక్టరీల్లో పనిచేసే వాళ్ళున్నూ ఇలాంటి ప్రతిపాదనలే దేశంముందు పెడుతున్నారు. స్థిరమైన రాజ్యాంగవ్యవస్థ ఏర్పడడంకోసం వివిధపక్షాల నాయకులు చేతులుకలపాలని రాజకీయనాయకులు సూచిస్తున్నారు. ప్రజల స్వాతంత్ర్య పిపాసా, ధైర్యసాహసాలూ, సర్వతంత్ర స్వతంత్ర రాజ్యంగా హంగేరీ వుండాలనే దృఢనిశ్చయమూ - ఇవన్నీ జాతీయ భావంలో ప్రతిఫలించాలని తాత్వికులు హెచ్చరిస్తున్నారు. స్విట్జర్లాండులాగో, స్వీడను లాగో హంగేరీని చేయాలంటున్నారు కొందరు "ఇదిబాగానేవుంది" అన్నాడు జోల్టాను.

"మనది ఒక చిన్నదేశం. మనం ఏపక్షమూ వహించకండా తటస్థంగా వుండడం మంచిది" అన్నాడతడు. హృదయపూర్వకంగా అతడితో ఏకీభవించింది ఈవా.

మధురమైన ఆకొద్ది స్వాతంత్ర్యదినాల్లో హంగేరీ ప్రజలు వివేకవంతంగా మాట్లాడారు. శక్తివంతమైన ఒకజాతి తయారుకావడానికి పునాదులు వేస్తున్నాయనిపించింది.

"ఒకజాతి అనిపించుకోడానికి తగినహక్కు మనం సంపాదించుకున్నాం అనడానికి సందేహంలేదు" అంది ఈవా.

ఇంతలో తూర్పునించి ఒక భయంకరమైనవార్త వచ్చింది. "విమానాశ్రయంనించి వందలాది రష్యాటాంకులు బయలుదేరుతున్నాయి" అంటూ ఒక యువకుడు వీధిలో పరిగెత్తాడు – 'వెనకటిలాంటి చిన్నవికావు. చాలా పెద్దటాంకులవి,"

పెద్దవాళ్ళుకూడా ఈదుర్వార్త నిజమే అన్నారు. "రష్యావాళ్ళు మళ్ళీ భారీఎత్తుమీద వస్తున్నట్టున్నారు" అన్నాడు ఒక సోల్జరు - 'కొత్తటాంకుల్లో మరఫిరంగులు హెచ్చుగావుంటాయి. వాటిని పగలగొట్టడం సాధ్యంకానిపని"

టాంకులు దొర్లివస్తున్న ధ్వని తూర్పువేపునించి భయంకరంగా వినవచ్చింది. రష్యా మైదానాల్లోంచి చలిగాలి వీస్తోంది మర్నాడు ఉదయం 4గంటలికి రష్యాటాంకులధ్వనితో బుడాపెస్టు నగరమంతా మేలుకుంది. అది నవంబరు 4, ఆదివారం. టాంకులధ్వని నగరం చీల్చేస్తుందా అన్నట్టుంది. బుడానగరం ఉత్తరభాగం టాంకులు చేరేసరికి కొంచెం ఆలస్యమయింది. జోల్టాను దంపతులు వున్న వీధిలోకి దొర్లుకుంటూ వచ్చాయి టాంకులు. ఎక్కడో ఇంటికప్పుమీద ఒక గురిగాడు పొంచివుండడం ఒక టాంకు కనిపెట్టింది. దాంతో ఆఇల్లు ధ్వంసంచెయ్యడం లంకించుకుంది. అది జోల్టాను దంపతులు వున్న ఇల్లుకాదు. కాని దానితరవాత తమఇల్లేకావచ్చు. భయంతో వణుకుతూ, ఒకళ్ళని ఒకళ్ళుతోసుకుంటూ నాలుగో అంతస్తులో తమకిటికీ దగ్గిర నుంచున్నారు జోల్టాను దంపతులు. స్వాతంత్రదినాలు అంతమయిపోయాయి. ఏదో ఉజ్వలమైన భావి ఊహించడానికి వీలు కలిగించిన అయిదు రోజులూ అయిపోయాయి. మధురస్మృతులుకూడా ధ్వంసంచేస్తున్నాయి రష్యాటాంకులు.

—o—

# బీభత్సం

నవంబరు 4, ఆదివారం ఉదయం 4 గంటలకు రష్యావాళ్ళు బుడాపెస్టు వచ్చారు. ఎన్నడూ కనీవినీ ఎరగనంత బీభత్సంచేసి నగరానికి నగరం విధ్వంసంచేసేశారు. పిచ్చెత్తినట్టు తమ నిజస్వరూపం ప్రపంచం ముందు ప్రదర్శించారు.

తన పలుకుబడి కిందవున్న ఉపగ్రహరాజ్యాలమీద తాను ప్రకటిస్తున్న స్నేహసౌహార్ద్రాలు బుడాపెస్టు శిథిలాల్లో కప్పడిపోయాయి. మరతుపాకులికి బలిఅయిన స్త్రీలా, పిల్లలానమాధుల్లో పూడ్చుకుపోయాయి. పోలెండునూ, బల్గేరియానూ, లిథువేనియానూ, మధ్యఆశియా రిపబ్లిక్కులనూ రష్యా పాశవిక బలంతో పట్టి వుంచిందని, నరకతుల్యమైన ఆ ఎనిమిది రోజులూ ఋజువు చేశాయి.

ఇది తెలుసుకోడానికి బుడాపెస్టుని బలిపెట్టవలిసి వచ్చింది. దీని సంగతి తెలియనివాళ్ళలో ఈనిజం బాగా వ్యాపిస్తే, సిగ్గుమాలిన రష్యా అనత్యాలు లోకంముందు నగ్నంగా బయటపడితే—అప్పుడు ఈ మహానగర విధ్వంసకాండ పూరికేపోదని భావించవచ్చు.

నిరాయుధమైన ఆనగరంమీద దాడిచేసినప్పుడు రష్యావాళ్ళు మహాధైర్యం చూపించారు. మొట్టమొదట వాళ్ళు గెల్లెర్టు కొండ ఆక్రమించుకున్నారు. డాన్యూబునది పడమటిఒడ్డు నానుకుని 750 అడుగుల ఎత్తు వుందిది. రష్యావాళ్ళు ఈ కొండమీద పెద్ద పెద్ద ఫిరంగులు పెట్టారు. బ్రహ్మాండమైన మందుగుండు నిలవచేశారు. ఈ ఫిరంగుల తోటాలు నాలుగు అడుగుల పొడవైనవి. అవిచేసే విధ్వంసం అపారం. ఆతోటాలగుళ్ళు వచ్చి ఇళ్ళమీదా, ప్రభుత్వభవనాలమీదా పిడుగుల్లాగ పడ్డాయి.

గెల్లెర్టు కొండమీంచి పట్నం అంతటిమీదా అగ్నివర్షం కురిపించవచ్చు. రష్యా సైనికుల జ్ఞాపకార్థం కట్టిన ఒక స్మృతిచిహ్నం దగ్గిరగా ఫిరంగులు పెట్టారు. బుడాపట్నం పెస్టుతో కలిపే ఎనిమిది వంతెనలూ అక్కడికి గురివేటుదూరంలో వున్నాయి. ఉత్తరాన పెట్టిన పెద్దఫిరంగులు పాతబుడాలో అగ్గి కురిపించగలవు. పెద్ద ఫిరంగులు ప్రయోగిస్తే ఆ పురాతననగరం పేలిపోతుందని రష్యావాళ్ళకి తెలుసు. తూర్పువేపు పెట్టిన ఫిరంగులతో యూనివర్సిటీ భవనాలూ, రైలుస్టేషనులూ, మ్యూజియంలూ, రేడియోస్టుడియో,

ఒక ఫ్యాక్టరీకి ఫ్యాక్టరీ బొగ్గయిపోతుంది. హంగేరీ తిరుగుబాటవార్ల దగ్గిర ఒక విమానంలేదు. ఒక్క విమానం పడగొట్టే ఫిరంగిలేదు తుపాకులున్నా మందుగుండు లేదు. సోవియటు విమానాలు ధైర్యసాహసాలతో మీదికెగిరి విధ్వంసక చర్యలు ప్రారంభించాయి.

నేలమీద రాకెట్లున్నాయి. వీటిని ఎటుపడితే అటు తిప్పి మాటు చెయ్యవచ్చు. ఒకపెద్ద భవనం పడగొట్టడానికి ఒక రాకెట్టుచాలు.

రష్యావాళ్ళు చెయ్యతలుచుకున్న మారణహోమానికి ఈమహామారణాయుధాలు సరిపోలేదు! అందుకని అగ్నిబాంబులు పట్టుకుని సైనిక దళాలు నగరమంతా తిరిగాయి. పెద్దపెద్ద పేటలు కాల్చి బుగ్గిచేసేశాయి. హంగేరీ తిరుగుబాటుదార్లు, పట్టుబడ్డ ఏదైనాటాంకు తీసుకువస్తే, దాన్ని పగలగొట్టెయ్యడానికిన్నీ తగిన ఏర్పాట్లు దానిలోనే వున్నాయి, ఒకవేళ బలమైన ప్రతిఘటన జరిగిందే అనుకోండి, అప్పుడు ఎదుర్కొడానికి బాజూకాలుకూడా (Bazookas) వున్నాయి. శరవేగంతో పరిగెత్తే కొత్తరకం బేబీటాంకులు కూడా వచ్చాయి. ఇవికాక, వైర్లెస్సూ, వాకీటాకీలూ(Walkie Talkies: నడుస్తూనే మాటాడేవి), పర్యవేక్షక శకటాలూ (Reconnaissance). ఆయుధాలతో నిండిన జీవులూ వచ్చాయి. ప్రతీసోల్జరుకీ ఒక కొత్తరకం సబ్ మెషీనుగన్ ఇచ్చారు. అది పాతరకం వాటికంటే రెండితలు శక్తివంతమైంది. ఇంత బ్రహ్మాండమైంది రష్యా శక్తి. దానికి ప్రతికూలంగా హంగేరీ వాళ్ళ దగ్గిర గ్యాసోలిను చేతిబాంబులు తప్ప మరేమీలేదు.

అయినా రష్యావాళ్ళు వాళ్ళశక్తి చులకనగా చూడలేదు. దాడిప్రారంభించేముందు తమని నిజంగా వోడించగలిగిన ఒకేఒక హంగేరీ యోధుణ్ణి టెలిఫోనుదగ్గిరికి తెప్పించారు వాళ్ళు. ఆహంగేరీ యోధుడు కర్నలు మాలిటేరు. ఇప్పుడతడు మేజరు జనరలు. బుడాపెస్టునగరం రక్షించి రష్యావాళ్ళని వెళ్ళగొట్టిన మహావీరుడు డతడు.

“హంగేరీనించి సోవియటుసైన్యాలు తొలిగించే విషయంలో నీతో చర్చించాలి” అని చెప్పి టెలిఫోనులో అతణ్ణి పిలిచారు. దారిలో ఏవిధమైన ప్రమాదం కలగకండా ఏర్పాట్లు చేస్తామని వాగ్దానం చేశారు. పాపం, అతడు నిజమే అని నమ్మాడు; మోసపోయాడు. రష్యావాళ్ళు ఒకమూల యుద్ధసన్నాహాలు చేస్తూనే ఈసంధి రాయబారం నడిపారు. హంగేరీ వాళ్ళకి సంపూర్ణ విజయం కలిగిందనే నమ్మకం కలిగించారు.

తెలుగు విశ్వవిద్యాలయం

మాలిటేరు టెలిఫోనులో రష్యావాళ్ళతో మాట్లాడాడు. నమ్మలేనంత బాగున్నాయి వాళ్ళషరతులు. "మేం వెనక్కి వెళ్ళిపోతాం" అంటున్నారు రష్యావాళ్ళు. "అయితే కానివ్వండి" అన్నాడు మాలిటేరు. "మీరు రండి. కాగితాలు సంతకాలు చేద్దాం. ఈలోగా ఎలాంటియుద్ధమూ జరగదు" అన్నారు రష్యావాళ్ళు.

తాత్కాలికమైన ఈసంధికాలంలో రష్యావాళ్ళు పట్నం దిగ్బంధం చేశారు.

జనరలు మాలిటేరు రష్యావాళ్ళతో మాట్లాడి, తెల్లజెండాకింద వస్తున్నాడు. వారితో రష్యావాళ్ళు ఆ తెల్లజెండాతీసి పారేశారు; బుడాపెస్టువీరుణ్ని మాలిటేరుని ఎత్తుకుపోయారు. బహుశా సైబేరియాలో ఏకారాగారానికో పట్టుకుపోయివుంటారు. హంగేరీయువకులు నిరాయుధులుగానే రష్యారాకాసి టాంకులు ఎదిరించారు. వాళ్ళకి ఒకనాయకుడంటూ లేకపోయాడు. వొకసేనానాయకుడంటూ లేకపోయాడు. ఒకళ్ళుచేస్తున్నది ఇంకొకళ్ళకి తెలియదు. అయినా అదేశభక్తులు శత్రువులతో పోరాడి సంపాదించినకీర్తి మాత్రం అజరామరమైంది. మానవ సహనానికి అది పరాకోటి.

ఆదివారమంతా రష్యావాళ్ళు గెల్లెర్టుకొండమీంచి పట్నంమీద అగ్నివర్షం కురిపించారు. టాంకుదళాలు వీధుల్లో గుళ్ళుకుమ్మరించాయి. పదాతిదళాలు సిద్ధంగా నుంచున్నాయి. సోమవారం అవి కార్యరంగంలో దూకుతాయి.

రష్యావాళ్ళు ఫిరంగులు పేలుస్తున్నప్పుడు హంగేరీవాళ్ళు ఇళ్ళల్లో వుండిపోయారు. టాంకుల వాడికూడా వాళ్ళు తప్పించుకు తిరిగారు. కొంద రుపెస్టు వీధుల్లో అడ్డంగా బారికేడ్లు (Barricads) కట్టారు. బాలబాలికలు గుంపుగా చేరి, మెల్లిగా నడుస్తూన్న టాంకులు నిరోధించారు. మోరిను జిగ్మండు స్క్వేరులో సైనికవిద్య నేర్చుకుంటూన్న వొక విద్యార్థి అరిచాడు: "ఈస్క్వేరుచుట్టూ బారికేడ్లు కట్టేసి, ఇక్కడ రష్యావాళ్ళని ఆపేశామా, వాళ్ళుచిక్కుపడిపోతారు. రండి, బారికేడ్లు కడదాం, రండి" అన్నాడు.

అతడు నాయకత్వం వహించి అద్భుతమైన ఒక రక్షణపథకంవేశాడు. ఇంకా పని పూర్తికాలేదు. ఒక కుర్రాడు అరుచుకుంటూ వచ్చాడు: "ఇదిగో ఆరువందుకార్లనిండా రష్యాసోల్జర్లు వస్తున్నారు.

కున్నాడతడు. నోటి ఎడమకొనని సిగరెట్టు వేలాడుతూ వుంది. కొత్తరష్యా టాంకులు అయిదూ చౌకం తుడిచి పారెయ్యడానికి, ప్రళయంలా వచ్చిపడే సరికి డ్యూటీమీదవున్నా డతడు.

"వాళ్ళకి గెలుపు లభించలేదు. మేం ఎలా చేశామో మాకు తెలి యదు. కాని యుద్ధంలో వొకటాంకు హతమార్చేశాం. తక్కినవాటిని తరిమే శాం" అన్నాడు గీగరు. కొద్దిగంటలు గడిచాయి. మరి రెండు టాంకులు చౌకంలో భగ్నమయాయి. బుడాపెస్టుకోసం జరుగుతూవున్న ఈ రెండో యుద్ధం మొదటిదానికంటే కఠినంగా వుంటుందని, ఆవాళరాత్రి రష్యావాళ్లు అంగీకరించారు. ఇది నిజమే అని నిరూపించడానికా అన్నట్టు గీగరూ, అతడి అనుచరులూ 36 గంటలసేపు జిగ్మండుస్క్వేరు రష్యావాళ్ళ వశం కాకుండా చేశారు.

గెల్లెర్టు కొండమీంచి గుళ్ళు కురిశాయి. చౌకంలో నుంచున్న టాంకుల లోంచి తుపాకులు పేలాయి. స్క్వేరులో భవనాలు వొకదాని తరవాత వొకటి కూలిపోతున్నాయి. ఆప్రాంతమంతా రష్యావాళ్ళు పాస్ఫరసుబాంబులు వెద చల్లారు. అయినా హంగేరీ యువకులు రెండుగంటలసేపు దాడి తట్టు కున్నారు. ఇక రక్షించడానికి ఏమీ మిగల్లేదు. అంతా ధ్వంసమయాక వాళ్ళు వెళ్ళిపోయారు.

"వాళ్ళు మహానొల్లుకున్న దేమీలేదు" అన్నాడు గీగరు.

రష్యావాళ్ళు తిరిగీపట్నం ప్రవేశించేనరికి రోడ్డు ఎక్కడి కక్కడ దిగ్బం ధమైవున్నాయి. విరిగిపోయిన కార్లూ, కాలిపోయిన టాంకులూ, చెడిపోయిన రకరకాల బళ్ళూ, కూలిపోయిన ఇళ్ళూ, వున్నాయి. స్వాధీనపరుచుకోడానికి ఏమీ లేదక్కడ. ఇంతకంటే ముఖ్యమైన కేంద్రంలో పోరాడదామని ఇమ్రీ గీగరు మెల్లిగా అక్కణ్ణుంచి జారిపోయాడు.

మోరిసు జగ్మండు చౌకం స్వాధీన పరుచుకున్నాక, రష్యావాళ్ళు మరో ప్రాంతానికి దృష్టి మరల్చారు. గెల్లెర్టు-కొండకి ఉత్తరంగా వొకపాతకోట వుంది. అక్కడికి వెళ్లే వీధుల్లో ఎక్కువభాగం మెలికలు తిరిగి ఎగుడు దిగుడుగా వుంటాయి. ఇక్కడ వొక హంగేరీ యువకదళం తుదిదాకా బుడా పట్నం రక్షించడానికి పూనుకుంది. అందులో కాలేజీవిద్యార్థులు కూడా వున్నారు. జిగ్మండుస్క్వేరు పతనమయాక కొద్దిమందిఅనుభవంకలయోధులు అక్కడినించివచ్చి ఇక్కడ చేరారు. ఇక్కడ జరిగిన యుద్ధానికి స్క్వేరులో

జరిగినయుద్ధానికీ వొక్క విషయంలో భేదముంది. ఇక్కడ యువతులుకూడా యుద్ధంచేశారు. వాళ్ళు చూపినశౌర్యం అద్భుతం.

కొండకోటకి వెళ్ళేటప్పుడు రష్యావాళ్లు జాగ్రత్తగా అన్నిఏర్పాట్లూ చేసుకున్నారు. ప్రపంచంలోకల్లా బలవంతుడైన శత్రువు అక్కడ వున్నాడా అన్నట్టు కట్టుదిట్టం చేసుకున్నారు. ఇంతకీ అక్కడ వున్నది ఆయుధాలైనా లేని కొంతమంది స్త్రీలూ, యువకులూ మాత్రమే. గెల్లెర్టు కొండమీద బ్రహ్మాండమైన ఫిరంగులు పేలాయి. ఒకగంటపాటు దారుణంగా అగ్నిగోళాలు వర్షించాయి. ఆ విలయతాండవంలో మానవమాత్రుడు ఎవడూ మిగిలివుండడని అనిపించింది.

ప్రతిఘటన ఎక్కడవుంటే అక్కడ రూపుమాపడంకోసం రష్యాసేనాని దిట్టమైన టాంకులు ప్రయోగించాడు. వాటివెనకాలే మరతుపాకులతో పదాతి దళం పంపాడు: అక్కడక్కడ మిగిలిపోయినవాళ్ళని వూడ్చి పారెయ్యడమే పదాతులపని.

సోల్జర్లు అక్కడ చేరనేలేదు. వాళ్ళు కొంతదూరం వెళ్ళేసరికి ఎక్కడెక్కడో దాక్కునివున్న యువతీయువకులు వింతగా ఈసుళ్ళులా బైటికి వచ్చారు. కోటకొండ రక్షణకి వాళ్ళుపన్నిన వ్యూహమూ, వాళ్ళు చూపిన సాహసమూ మరవరానివి. కోటలోవున్న యువకులలో ఇమ్రి గీగరు వొకడు రైఫిలు పట్టుకుని అతడు యుద్ధానికి సిద్ధంగా వున్నాడు.

"టాంకులు ఎలా ధ్వంసం చెయ్యాలి? ఇది వొకటే మా ఎదటవున్న సమస్య" అంటాడతడు.

"టాంకులు పడగొట్టడానికి మూడు మార్గాలున్నాయి. మొట్టమొదటిది రోడ్లమీంచి దాన్నిజారిపోయినట్టుచేసి, కిందపడగొట్టి పగిలిపోయినట్టు చెయ్యడం. ఎత్తున కొండమీదికి వెళుతున్నప్పుడు మేం అలాగేచేసేవాళ్ళం. యువతులు రోడ్లమీద సబ్బునీళ్లుపోస్తారు. దాంతో టాంకు గొలుసులు సరిగ్గా పని చెయ్యవు. అవి తిరిగైనాపోతాయి, లేదా జారైనాపోతాయి. ఒక్కొక్క టాంకు ఒక్కొక్క భవనందగ్గిర చిక్కుకుంటుంది. అప్పుడు మేం దానిమీదికి వురుకుతాం.

"మోటారు గరాజులో పనిచేసిన వొకకార్మికుడు మాకు వొక ఉపాయం చూపించాడు. వీధిమూలల్లో గ్రీజూ, మోటారునూనే పూసివుంచితే టాంకులు

జరిగిపోతాయనీ, లేదా ఏచెట్టుకో, ఏభవనానికో గుద్దుకుంటాయనీ చెప్పాడు. అలా అది పట్టువడిపోతుందన్నాడు.

"రెండో ఉపాయమేమిటంటే నడిచిపోతూన్న టాంకుని ఒకనిమిషం ఆపెయ్యడం. తెలివైన ఒక అమ్మాయి ఒకరకంప్లేట్లు రోడ్లమీద బోర్లా పరుస్తూంది. అవి సరిగ్గా లాండుమైన్సు (Land mines) లా కనిపిస్తాయి. అంతవరకూ రష్యావాళ్ళు వస్తారు. వాటినిచూసి సందేహించి వెనక్కి తిరుగుతారు. సరిగ్గా అదేసమయంలో మేం వాటిమీద దాడిచేస్తాం.

"ఒక పనివాడు మంచి ఉపాయం ఆలోచించాడు. ఒక సోడాఫ్యాక్టరీకి వెళ్ళి ఖాళీ ఆక్సిజనుటాంకులు ఒక ట్రక్కునిండాతెచ్చాడు. వాటిని వీధుల్లో పరిచాడు. అడ్డదిడ్డంగా అవి దొర్లుతూవుండేట్టు చేశాడు. కొందరు కుర్రాళ్ళు చేతిబాంబులు తాళ్ళతో కట్టి, వాటికిందికి వెళ్ళేటట్టు చేశారు. టాంకులు ఆదారిని వచ్చాయో అవి ఢాం మ్మంటాయి. ఆదెబ్బకి అవి ఆగిపోవడమో, పగిలిపోవడమో జరుగుతుంది. అందరికంటే సాహసం కలవాళ్ళు పదుచు అమ్మాయిలూ, అబ్బాయిలూనూ. టాంకు కొంచెం ఆగిందో, ఎక్కడినించో వీళ్ళు విరుచుకుపడేవాళ్లు. టాంకుగాడుల్లో పెద్దపెద్ద పైపులు దూర్చేసేవాళ్ళు. అవి చక్రాల్లో ఇరుక్కుపోయి టాంకులు కుంటేవి. నిజంగా అలాంటి అమ్మాయిలనీ, అబ్బాయిలనీ మీరు చూసివుండరు.

"మూడోది ఏమిటంటే, ఒకటాంకు వీధిచివరిదాకా రానివ్వడం. తీరా అదివచ్చేసరికి దాన్ని హతమార్చడం. అది అన్నిటికంటే సులభమైనపని. ఎలాఅంటే, కిటికీలలోంచి, తలుపుల్లోంచి పాతతుపాకుల చివరలు బైటికి కనపడేటట్టు పెడతాం. ఇవన్నీ తుపాకులే అన్నభ్రమ టాంకుల్లో వాళ్ళకి కలుగుతుంది దాంతో వాళ్ళు తోకముడిచెయ్యడ మారంభిస్తారు. అప్పుడు వాళ్ళని ఇట్టే పనిపట్టేస్తాం" అన్నాడు గీగరు, సిగరెట్టు నోటిచివర మెలి పెడుతూ.

ఒకటాంకు ఆపెయ్యడమేమో సులభమే. అయితే అంతమాత్రాన అది లొంగిపోదని హంగేరీ వ్యూహంలో చిక్కుకున్న ఆటాంకులు తమ మూడు తుపాకులనించీ అగ్నికురిపిస్తాయి. నాలుగువేపులా గుళ్ళు విరజిమ్ముతాయి. అదలావుంచి, రష్యావాళ్ళు తమ పెద్దతుపాకులు కూడా ఒక గురీగిరీ లేకుండా కాల్చడానికి సిద్ధపడి వచ్చారు. గ్యాసోలీను బాంబులతో మీదపడే వాళ్ళని తప్పించుకోడానికి వాళ్ళు ఏంచెయ్యవలసి వచ్చినా వెనకాడరు.

కోటకొండ మీది యువకులు మంచిధైర్యసాహసాలు కలవాళ్ళు.రవంత దెబ్బతిన్నటాంకు ధ్వంసం చెయ్యడానికి వాళ్ళు ఎన్నోమార్గాలు కనిపెట్టారు. ఒక కార్మికుడు రోడ్డుమీద చిన్నపగులుచూసి, అందులో గ్యాసోలినునింపి, తలుపుచాటున నుంచున్నాడు. టాంకు సరిగ్గా అక్కడికి రాగానే ఒకచేతి బాంబు గ్యాసోలినులోకి విసిరాడు. భగ్గున మంటలేచింది. టాంకు మంటలో చిక్కుకుంది.

మరో కార్మికుడు ఒక హైటెన్షను ఎలక్ట్రిక్కుతీగ టాంకులోదూర్చి, అందులోని రష్యావాళ్లనందరినీ చంపేశాడు. కొండకింద ఒకడు మోటారు మహావేగంతో పోనిచ్చి, ఒక టాంకుమీద వురికేశాడు. టాంకు నిప్పంటుకుంది.

ఎలాఅయితేనేం యువతీయువకులుకలిసి రాకాసుల్లాటి రష్యాటాంకులు భగ్నంచేశారంటే ఎవ్వరూ నమ్మరు· గ్యాసోలినుబాంబులు విసరడం, టాం కులదగ్గిరికి వెళ్ళడం ఆడపిల్లలు చేశారంటే ఎవరు నమ్ముతారు ?

"నేను అవాళచూసింది నిజంగా ఆడపిల్లలు చేయవలసిందికాదు. అసాధ్యమైన కార్యమది" అంటాడు గీగరు.

"బాంబులు పట్టుకుని వాళ్ళు తలుపుచాటున నుంచునేవాళ్ళు. టాంకు సరిగ్గా నడిచిందా, వాళ్ళు కదిలేవాళ్ళుకారు. కాని అది ఏమాత్రమైనా జారిందా, లేదా ఆగిందా, లేదా ఏగోడకైనా గుద్దిందా— వాళ్లు బాణాల్లా బైటికివచ్చేవాళ్ళు; టాంకుమీద బాంబులు కుమ్మరించేసేవాళ్లు. దాంతో ఆటాంకుపని సరి. అలాదాక్కున్న ఆడపిల్లలు కొందరు మరతుపాకులికి బలి అయిపోయారు తలుపులు తీసివుంటే చాలు రష్యాటాంకులు గుళ్ళు కురి పించేవి. దానివల్ల ఎంతోమంది అమ్మాయిలు చచ్చిపోయారు.

"బుడాపెస్టు ఆడపిల్లలు చూపించిన ధైర్యసాహసాలు నేను ఎక్కడా ఎప్పుడూ కనీవిని ఎరుగను" అన్నాడు కోటకొండ యుద్ధంచూసిన ఒక ఫాదిరీ.

ఒక 12 ఏళ్ళ కుర్రాడు చేసిన సాహసం వినండి. అతడు తనబెల్టులో చేతిబాంబులు వేలాడదీసుకున్నాడు. కొన్ని చేతిలో పట్టుకున్నాడు. టాంకుల మీదికి ఒక్కవూపుని పరిగెత్తాడు. వాటి చక్రాలగాడుల్లో బాంబులు పెట్టాడు. టాంకులు అతని మీదినించి నడిచిపోయాయి. అతడు ముక్కముక్కలయి పోయాడు. అతడితోపాటు టాంకులూ ముక్కముక్కలైపోయాయి. దాంతో

ఒకటాంకు దళం పూర్తిగా స్తంభించిపోయింది. అబాలవీరుడి పేరేమో తెలియదు. ఇంపాకటి ఫాదిరీయే అతడి గురించి ఇలా అన్నాడు:

“ఇది ఇలా జరక్కుండా వుండవలసింది. అపసికందుని ఎవరైనా ఆపు చెయ్యవలసింది. కానైతే తాను ఎవళ్ళతో దెబ్బలాడుతున్నాడో ఆకుర్రాడు ఎరుగును”

చిట్టచివర రష్యావాళ్ళు కోటకొండ పట్టుకున్నారు. పదాతులు పట్నంలో చొరబడ్డారు కనిపించిన వాళ్ళనల్లా కాల్చిపారేశారు. అయితే వీధుల్లో కదం తొక్కినప్పుడు మాత్రం వాళ్ళు జాగ్రత్తగా అడుగులు వేసేవాళ్ళు. సమస్తమైన ఆయుధాలూ ధరించి వచ్చారువాళ్ళు. సుమారు ఇరవైటాంకులు పాడైపడివుండడం వాళ్ళు చూశారు. ఎంతో ప్రశస్థమైన టాంకులు అవి. అయితే వాటిని నాశనం చెయ్యడానికి హంగేరీప్రజలు ఒక పెద్దతుపాకి అయినా ఉపయోగించలేదు. జాతీయ స్వాతంత్ర్యంకోసం వ్యక్తిస్వాతంత్ర్యం కోసం పోరాడుతూన్న హంగేరీ ప్రజలచేతులే వాటిని భగ్నం చేసాయి.

రష్యావాళ్ళుకోటలో ప్రవేశించేసరికి ముప్పయిమంది హంగేరీవాళ్ళు మాత్రం అందులో మిగిలారు. తెల్లజెండా పట్టుకుని లొంగిపోయారువాళ్ళు. శక్తిమంతమైన రష్యాసేనతో మూడుదినాలు హెూరాహెూరిపోరాడారు వాళ్ళు. ప్రతీవాడూ ఒక మహావీరుడుగా ప్రవర్తించాడు. వాళ్ళందరినీ వరసగా నిలబెట్టి సోవియటు కమాండరు మరతుపాలతో కాల్పించేశాడు.

బుడాపెస్టు నగరమంతటా ఇలాంటి ఇలాంటి బీభత్సమే జరిగింది. పోరాటం ప్రారంభమైనప్పుడు సోవియటుసేన పెట్టుకున్న నియమం ఇది:

“ఏ ఇంట్లోంచి అయినా ఒక తుపాకిగుండు వచ్చిందో ఆఇల్లు పూర్తిగా నేలమట్టం చేసెయ్యాలి. ఏవీధిలో తుపాకిపేల్తే ఆవీధి వీధి సర్వదుంబాలా చేసెయ్యాలి”.

ఈ నియమం ఒక రాకాసి నిశ్చయంతో పాటించారు రష్యావాళ్ళు. బుడాపెస్టులో ఏభాగంకూడా టాంకులుబారి పడకండా మిగలలేదు. ఏకమాండరు చెవులో అయినా చిన్నతుపాకి వినపడితేచాలు, టాంకు ఆపేసి తుపాకి శబ్దం వచ్చిన భవనం ఎగరగొట్టేశాడన్నమాటే అతడు. ఏంచేతంటే, తుపాకి పేల్చేవాళ్ళు ఇళ్ళకప్పులమీంచే పేలుస్తారు. గుండు ఇంటిలోంచి వినిపించినా ఇల్లంతా గుండచేసి వొదిలిపెట్టేవాళ్ళు. ఇళ్ళు కూలిపోయి వేలు వేలు హంగేరీప్రజలు బతికివుండే సమాధి అయిపోయారు.

హంగేరీలో రష్యావాళ్ళు పెట్టుబడిదార్లతో దెబ్బలాడలేదు. వ్యతిరేకు లతో దెబ్బలాడలేదు. చరిత్ర గడియారంముల్లు వెనక్కి పెట్టదలిచిన పాతవా ళ్ళతో దెబ్బలాడలేదు. ఒకప్పుడు కమ్యూనిష్టులుగా వున్న వాళ్ళతోనే దెబ్బలా డారు. వాళ్ళనే నాశనంచేశారు.

ఇంతవరకూ రష్యావాళ్ళు చూపినక్రౌర్యం ఒక లెక్కలోదేకాదు. ఇంత కంటే భయంకరమైన క్రౌర్యం ఇంకా ముందేవుంది. లొంగిపోయిన ప్రాం తాల్లో రష్యాటాంకుదళాలు విచ్చలవిడిగా తిరిగాయి. వీధి వీధినీ కనపడ్డ ప్రాణినల్లా కాల్చిపారేశాయి. క్యూలో నుంచున్న ఆడంగుల్ని మూడుచోట్ల వూడ్చి పారేశాయి.

రెడ్‌క్రాసువాళ్ళనీ, యాంబులెన్సు వాళ్ళనీ కూడా వొదిలిపెట్టలేదు; నిర్దాక్షిణ్యంగా పేల్చి వొదలిపెట్టాయి. గాయాలు తగిలినవాళ్ళకి కట్లు కడు తూన్న నర్సుల్ని కూడా తుపాకులికి బలిపెట్టేశాయి.

డరోసీ వీధిలోవున్న హంగేరీ కేంద్రరక్త నిధినించి రక్తమంతా ఎత్తుకు పోయి, రష్యావాళ్ళు తమకోసం ప్రత్యేకంగావున్న జిబోల్సువీధి ఆస్పత్రి చేర్చారు. దెబ్బలుతిన్న హంగేరీ యువకులికి ఇవ్వడానికి రక్తం లేకండా చేశారు. కాళ్ళమీద దెబ్బలు తగిలిన వాళ్ళలో నూటికి ముప్ఫయి అయిదు గురికి ఆపరేషనుచేసి కాళ్ళు తీసెయ్యవలసివచ్చింది. రష్యనులు చిన్నపిల్లల్ని చంపేశారు. ఆస్పత్రులమీద గుళ్ళు కురిపించారు. ఉత్తి అనుమానంమీద ఎంతోమంది యువకుల్ని వురితీసేశారు. జాతీయరికార్డు కార్యాలయం కాల్చి బుగ్గిచేసేశారు. మంటలు ఆర్పడానికి ప్రయత్నంచేస్తున్న అగ్నిమాపకదళాన్ని తుపాకులతో కాల్చేశారు. ఒకదళంవాళ్ళు అగ్నిబాంబులువేసి ప్రొటెస్టెంటు పాఠశాల కాల్చేశారు. తన సామగ్రి కాపాడుకోడానికి ప్రయత్నిస్తున్న వొకణ్ణి తుపాకితో కొట్టేశారు. ఆహారపదార్థాల దుకాణాలు పూర్తిగా దోచుకున్నారు. ఇంతకీ రష్యాసేనకి ఆహారం కొరతలేదు.

46 నట్జిన్ హాజీ వీధిలో మూడో అంతస్తుమీద 23 నెంబరు గదిలో పెద్ద నగలదుకాణం వుండేది. రష్యావాళ్ళు దానిలో చొరబడ్డారు. దాని యజ మానిని చంపేశారు. విలువైన బంగారం గడియారాలూ అవీ జేబులో వేసు కున్నారు. తక్కినసామానులన్నీ తుపాకులతో ధ్వంసం చేసేశారు.

బుడాపెస్టు విధ్వంసం మతిలేకండా జరిగింది. అలా దాన్ని ధ్వంసం చెయ్యడం అనవసరం. గుడ్డిగా హంగేరీ వాళ్ళమీద కసదీర్చుకోడం తప్ప

మ రో ప్రయోజనంలేదు. సోవియటు అబద్ధాలికీ, బీభత్సానికీ, దురాక్రమణకీ ఆనగరవాసులు విసిగిపోయారు. దానికి ఇదీ శిక్ష!

విధ్వంసం పూర్తయింది. అంటే యువతీయువకులు యావన్మందీ హతమయ్యారు. ఇంకా రెండు హంగేరీస్థలాలు లొంగకండా మిగిలిపోయాయి. రష్యావాళ్ళకి గొంతుకులోపడ్డ వెలక్కాయల్లా వున్నాయవి. వాటిలో ఒకటి ఉల్లాయివీధిలోని కిల్లియను బారక్సు. ఇక్కడ ఇంకా ప్రతిఘటన తీవ్రంగానే వుంది. వెడల్పాంటి గోడలుగల ఆభవనం ఒకమూల పూర్తిగా కూలిపోయింది. కప్పు చాలా మట్టుకు ఎగిరిపోయింది. మిగిలినభాగం రాళ్ల దన్నులతో నిలబడివుంది. కొన్నిచోట్ల గోడలు కూలిపోతాయా అన్నట్టుంది. లోపల కొంతమంది సైనికులున్నా వాళ్ళదగ్గిర మందుగుండులేదు; ఆహారంలేదు; నీళ్ళులేవు. అయినా ఆధైర్యవంతులు ప్రతిఘటిస్తూనే వున్నారు.

బారక్సుమీద దాడికోసం రష్యావాళ్ళు టాంకులూ, ఫిరంగులూ, రాకెట్లూ, అగ్గితుపాకులూ తీసుకువచ్చారు. జనరల్ పదవిలోవున్న సేనానాయకులు వచ్చారు. బారక్సుని రూపులేకండా చేసేయాలన్న భయంకరమైన నిశ్చయంతొవచ్చారు. బ్రహ్మాండమైన ఫిరంగిగుళ్ళు పేలాయి. మందుగుండు బారక్సు నేలమట్టం చేసేశాయి. ఈదాడి రెండోరోజు రష్యావాళ్ళు పూర్తిగా బారక్సు వశపరచుకున్నా రనిపించింది. ఆమొండి గోడల్లోంచి హంగేరీ పటాలం ఆఫీసర్లు వచ్చి బారక్సును రష్యావాళ్ళకి వశపరచబోయారు. అంతలో వాళ్ళనీ బారక్సులో ఇంకా మిగిలిన సిపాయిలనీ రష్యావాళ్ళు గుళ్ళతో కాల్చేశారు. విరామంలేకండా అయుద్ధంసాగింది.

కిల్లియన్ బారక్సు యుద్ధం వీరోచితంగా ముగియలేదు. అసలు ఆ యుద్ధం ముగిసిందన్న సంగతే ఎవరికీ తెలియదు. మానవ మాత్రుడు సహించలేని ఆమూడు దినాల దాడిలో పేరులేని కిల్లియను సైనికులు ఇటూ అటూ చెల్లాచెదురై పోయారు. కొందరు మురుకుతూముల్లోంచి నడిచి కాల్విన్ సినిమా భవనం చేరుకున్నారు. అక్కడినించి మెల్లగా ప్రజల్లో కలిసిపోయారు. మరికొందరు రాత్రిదాకా వుండి వెనకదోవంట తప్పుకున్నారు. నాలుగోనాడు బారక్సు పూర్తిగా రష్యావాళ్ళు వశపరచుకున్నారు.

ఇంతకంటే రష్యావాళ్ళకి క్రోధజనకమైన ప్రతిఘటన కేంద్రంఇంకొకటి వుంది. ఇమ్రీగిగరు నవంబరు 7 ఉదయం అక్కడికే చేరుకున్నాడు.

కాని సెపెల్ మనుషులు తమదీవికి తిరిగిపోయి, ఒక్క రష్యాయే కాకండా ప్రపంచం అంతా అదిరిపడేటట్టు ప్రతిఘటించారు.

ఇమ్రీ గీగరు పనికిమాలిన తనతుపాకితో సెపెల్‌దీవి చేరేసరికి స్వాతంత్ర్యం అప్పుడే కొనవూపిరితో వుంది. స్టాలిను గర్విస్తూవుండిన అక్కడి ఫ్యాక్టరీలలో కార్మికులు బారికేడ్లు కట్టి ప్రతిఘటించి నిలబడివున్నారు. వాళ్ళదగ్గిర మందుగుండులేదు. విమానాలు పడగొట్టే ఒకేఒక్క ఫిరంగీ, కొన్ని మామూలు ఫిరంగులూ మాత్రమున్నాయి. దీవిలో నూనెపరిశ్రమ వుండడం చేత గ్యాసోలిను కావలిసినంత పుష్కలంగా వుంది. అయితే కార్మికులలో ఉత్సాహం పూరించే నాయకుడు లేడు. పెద్ద భావాలూ, పెద్ద ఆశయాలూ వాళ్ళకీలేవు. వాళ్ళకివున్న ఆయుధమల్లా ఒక్కటే, రష్యావాళ్ళమీదా వాళ్ళ తొత్తులైన ఏవివో వాళ్ళమీదా ద్వేషం.

ఏవివో మనుషులతో ఏదో ఒకవిధం సంపర్కంలేని మనిషి సెపెల్‌లో ఒక్కడూలేడు. ఎక్కడచూసినా గూఢచారులే. ఈ గూఢచారులు మీమీద ఏ మాత్రం అనుమానం చూపించినా, కమ్యూనిజంమీద మీఉత్సాహం తగ్గినట్టు వాళ్ళు ఏమాత్రం పసికట్టినా మీకు కఠినమైన శిక్షలు వచ్చిపడ్డాయన్నమాటే. మిమ్మల్ని పీడించుకు తినడం వాళ్ళకి ఒక సామాన్యవిషయం. ఏమాత్రం చిన్న పొరపాటైనాసరే చారుల పట్టికల్లోకి ఎక్కిపోయేవి. సెపెల్ మనుషులకి ఇదంతా దుర్భరంగా వుండేది. అంచేతే వాళ్ళు ప్రపంచ కమ్యూనిస్టు వ్యవస్థకి ఒక గుణం పాఠం నేర్పడానికి పూనుకున్నారు.

గెల్లెర్టు కొండమీద పెద్దఫిరంగులు పని ప్రారంభించి నప్పటినించీ, రష్యావాళ్ళు సెపెల్‌దీవిమీద ఒకకన్ను వేసేవుంచారు. కొన్ని టన్నుల మందుగుండు దానిమీద కుమ్మరించారు వాళ్ళు. రష్యా జెట్ విమానాలు సెపెల్ ఫ్యాక్టరీలిమీద రాకెట్లు వేశాయి.

ఇతరచోట్ల జరిగిన బీభత్సమే ఇక్కడా తిరిగి జరిగింది. కానైతే ఇక్కడి కథలో కొన్ని గొప్పఘట్టాలున్నాయి. తిరుగుబాటుచేసిన సెపెలు మనుషులమీద రష్యావాళ్ళకి ప్రత్యేకద్వేషం ఉండడంవల్ల ఇక్కడ మరీ భయంకరమైన దాడి సాగించారు వాళ్ళు. లొంగిపోయి ప్రాణాలు దక్కించుకోడం సాధ్యంకాదని తెలిశాక సెపెల్ మనుషులున్నూ మరీ తీవ్రంగా పతిఘటించారు.

ఉదాహరణనికి— టాంకుల తొలిపాడిలో ఒక కార్మికుడు పెద్దపైపు పట్టుకుని మీదినుంచి టాంకులమీద గ్యాసోలిన్ దట్టంగా విరజిమ్మాడు. ఉత్తరక్షణంలో చేతిబాంబులున్నూ విసిరాడు. టాంకులు నిప్పంటు కున్నాయి.

ఆకాశంమీద ప్రభుత్వం తనదేఅన్నట్టు దీవిమీదుగా ఎగురుతూన్న ఒక జెట్ విమాయాంట్ ఏర్‌క్రాఫ్ట్ తుపాకీతోకొట్టి వొకకార్మికుడు పడగొట్టాడు.

పాశవికంగా వుంది యుద్ధం. అందులో యువకుడు ఇమ్రీ గీగరు వొక వింత అనుభవం సపాదించాడు. నిమిషాలమీద గ్యాసోలిను బాంబులు చేస్తు న్నాడతడు. అతడు తీస్తున్న పీపాలోంచే గ్యాసోలిన్ తీసి మరో యువకుడూ పక్కనే బాంబులు చేస్తున్నాడు. గీగరు తనపని వోనిమిషం ఆపి ఆయువ కుణ్ణి చూశాడు. "అతడు వింతగా అవుపించాడు. ఎవడో కొత్తరకం రష్యా సైనికుడువచ్చి మాతోచేరాడా అనుకున్నాను నేను. అతడెవరోతెలుసా? ఉత్తర కొరియావాడు కొరియా యుద్ధం తరవాత చైనా కమ్యూనిస్టులు అమెరికా వాళ్ళతో పోరాడిన ఉత్తరకొరియా కమ్యూనిస్టుల్ని కొంతమందిని మా ఫ్యాక్ట రీల్లోశిక్షణకోసం పంపారు. వాళ్ళలో ప్రతీవాడూ రష్యావాళ్ళమీద తిరగ బడ్డాడు: మాపక్షంచేరి యుద్ధం చేశాడు" అన్నాడు గీగరు.

గీగరుకి కలిగిన మరోఅనుభవం జాలికరమైంది.\ అతడు వొక దగ్గిర ఇద్దరు యువకుల్ని కలిశాడు. వాళ్ళ వయస్సు పద్దెనిమిది దాటివుండదు. వాళ్ళకి హంగేరీబాష రాదు.

"వాళ్ళిద్దరూ నాతో ఏదో మాట్లాడాలని సతమత మవుతున్నారు. కాని తమ అభిప్రాయం వెలిపుచ్చలేక పోతున్నారు. నాకు ఏదో ఇవ్వాలనుకుంటు న్నారు. ఇంగ్లాండు పంపవలసిన రెండు ఉత్తరాలున్నాయి వాళ్లదగ్గిర. ఒక సారి నేను బయటికి వెళితే ఆ ఉత్తరాలు పోష్టులో వేయవలసిందని వాళ్ళు నన్ను కోరుతున్నారా అనిపించిందినాకు. ఆ ఉత్తరాలు ఏభాషలో వున్నాయ నుకున్నారు? గ్రీకుభాషలో. 'గ్రీకుయువకులు ఎంతోమంది ఆఫ్యాక్టరీలతో పనిచేస్తున్నారు.' అన్నారు వాళ్ళు. అక్కడి అంతఃకలహంలో కమ్యూనిస్టులు ఎత్తుకువచ్చిన యువకులు వాళ్ళు. వాళ్ళకి మంచి కమ్యూనిష్టు శిక్షణ ఇచ్చారు. వాళ్ళకి. కావలసినదంతా కమ్యూనిష్టులు సమకూర్చారు. సెపెల్‌లో

ఒకటోతరగతి ఉద్యోగాలిచ్చారు. కాని అవకాశం దొరికేసరికి వాళ్లు రష్యా వాళ్ళమీద తిరగబడి, యుద్ధం చేశారు" అన్నాడు గీగరు.

చివరిదశలో బ్రహ్మాండమైన యంత్రశక్తికీ, దృఢమైన ప్రజాశక్తికీ మధ్యజరిగిన పోరాటంగా పరిణమించింది సెపెల్ యుద్ధం. సెపెల్ మనుషులు శక్తివంచనలేకండా ప్రతిఘటించి నిలబడ్డారు. రష్యావాళ్ళు భారీ ఎత్తున దీవిలోకి చొచ్చుకువచ్చారు. సెపెల్ మనుషులు గ్యాసోలిన్ ఫ్యాక్టరీకి నిప్పంటించారు. మృత్యువు తాండవమాడుతూన్న అదీవిలో, మెలికలు తిరుగుతూ, భయంకరమైనమంటలు స్తంభాల్లాలేచాయి. ఐనా లాభంలేకపోయింది. రాకాసుల్లాటి సోవియటు ఫిరంగులు నిర్జనమైన ఫ్యాక్టరీల్లోకి మందుగుండు వర్షం కురిపించాయి. కిందుగా ఎగురుతూ జెట్ విమానాలు ట్రాముకార్లు పేల్చేశాయి. ఎర్రఫిరంగులు విరామంలేకండా మోగాయి. సర్వాదుంబాలా చేసి పారేశాయి.

తుదకి నవంబరు 11 నాడు - అంటే ఆయుద్ధం ఎనిమిదోనాడు-ఏవిధంగాచూసినా ప్రతిఘటన అసాధ్యమయి పోయింది.

అలిసిపోయిన కిల్లియను సైనికులు మల్లేనే సెపెల్ మనుషులు కూరగాయలతోటల్లో మాయమైపోయారు. కొంతమంది నదిలోపడి, ఈదుకుంటూ అవతలిగట్టు చేరారు. తెలియకండా ప్రజల్లో కలిసిపోయారు.

వాళ్ళు లొంగిపోలేదు. విప్లవంలో అంతకంటే సాహసమైన ఘట్టంలో పాల్గొనడానికని అప్పటికి తప్పించుకు బతికారు. పెద్దపరిశ్రమలో పనిచేసే కార్మికుల సహకారం సోవియటు రష్యా ఎలా పోగొట్టుకుందో ప్రపంచానికి వ్యక్తమయే ఘట్టమది. ఈఘట్టం ఎడో అధ్యాయంలో వివరిస్తాను. "వాళ్ళు వోడిపోయారు" ఈమాత్రం చెపితేచాలు నిప్పుడు సెపెల్దీవినించి మెల్లిగా జారిపోయినప్పుడు, వాళ్ళతో ఐమ్రి గీగరు కూడా వున్నాడు.

అధికారరీత్యా బుడాపెస్టు యుద్ధం అంతమైంది కాని రష్యా బీభత్సం మాత్రం అంతంకాలేదు. రివాల్వర్లని ఎదిరించడంలో రష్యాటాంకులు అద్భుతంగా పనిచేస్తాయి. నిరాయుధులమీద దాడిచెయ్యడం నల్లేరుమీద బండి నడక వాటికి నగరవీధుల్లో భయంకరంగా గర్జిస్తూ అవి తమ రాక్షసశక్తి ప్రదర్శించాయి; నిర్లక్ష్యంగా తుపాకులు పేల్చాయి. అడ్డులేని విజయగర్వంతో అలా అవి కొన్నాళ్ళదాకా తిరిగాలి. ఆ తరవాత వాటిస్థానం పదాతిదళాలు తీసుకున్నాయి.

అవి చేసిన ఘోరాలు కథలై యూరపులోనూ, తక్కిన స్థలాల్లోనూ వ్యాపించాయి. అవి మధ్యఆశియానించి వచ్చిన మంగోలు దళాలని తెలిసింది. ఆవి చేసిన హత్యాకాండలు వింటే శరీరం గగిర్పొడుస్తుంది.

పట్నంలో బీభత్సం చెయ్యడానికి వాళ్ళని ఎందుకు తెచ్చారు? దానికి ఒక కారణముంది. వార్సాసంధి ప్రకారం హంగేరీలో పెట్టిన రష్యాసేన నిరాయుధులైన పౌరుల్ని చంపడానికి వెనకాడవచ్చునన్న సందేహం రష్యా సేనానాయకుల్ని బాధించింది. ఆ సందేహం బలపడేటట్టు రెండు సంఘటనలు కూడా జరిగాయి. పార్లమెంటు స్క్వేరులో ఒక టాంకు కమాండరు ఒక ఏవీవో హంతకుణ్ణి కాల్చేశాడు. రష్యాసైనికులు వాలంటీర్లుగా హంగేరీ స్వాతంత్ర్య దళాల్లో చేరారు. అంతేకాదు, ఆ అయిదురోజులూ తాత్కాలిక సంధి ప్రకటించడానికికూడా ఒక కారణముంది. మెత్తపడ్డ రష్యాసైనికుల స్థానంలో, అప్పటికింకా 'చెడిపోని' మంగోలుల్ని తీసుకురావడానికి ఈవ్యవధి కావలసి వచ్చింది. ప్రారంభంలో హంగేరీ ఆక్రమణ సైనికులు కొందరు తుపాకులకి గురి అయారనీ, ఎంతోమంది సైబీరియాకి పంపబడ్డారనీ ఒక వదంతి లేచింది. అయితే అది ధృవపడలేదు. ఏమైతేనేం వాళ్ళు మాయం కావడం మాత్రం నిజం.

హంగేరియా వాళ్ళమీద ఈమంగోలుసేన ప్రయోగించినవిధానంలో మరవరాని విషయంఒకటి వుంది. రెండోప్రపంచ మహాయుద్ధంలో జర్మనీవాళ్ళకి వ్యతిరేకంగా ప్రాచ్యరంగంలో రష్యనులు మంగోలుసేనే ప్రయోగించారు. చాలాచోట్ల ఈసేన తుకిడీ తుకిడీలుగా జర్మనీవాళ్ళతో కలిసిపోయింది. రష్యావాళ్ళంటే తమకీ ఒళ్ళు మంటగా వుందనీ, వాళ్ళని కాల్చెయ్యడానికి తమకి అవకాశం కావాలనీ అది ప్రకటించింది.

జర్మనీవాళ్ళు మంగోలుసైనికుల్ని జైలు కాంపుల్లో పెట్టారు. "మాకు జర్మను దుస్తులిచ్చి రష్యావాళ్ళమీదికి పంపండి" అని వాళ్ళు ప్రాధేయపడ్డారు. వాళ్ళని ఒక రెజిమెంటుగా చేసి, ఒక జర్మనుసేనానికింద జర్మనీవాళ్లు యుద్ధరంగానికి పంపారు. రష్యావాళ్ళతో హోరాహోరి పోరాడారు వాళ్ళు. అప్పటినించీ రష్యావాళ్ళు ఏజాతిసైనికుల్ని అజాతివారిమీద దాడికి పంపడం మానేశారు. తన బంధువుల్ని చంపమంటే ఏసైనికుడు ఒప్పుకుంటాడు? బల్గేరియా, రుమేనియావంటి దేశాలమీదికి, అదేశాల్ని అనుకుని

వున్న రష్యాప్రాంతాలనించి సైనికుల్ని పంపరు. అవసరం వచ్చినప్పుడు వాళ్ళని ఆశియాప్రజలని చంపడానికి పంపుతారు.

హంగేరీ సేనంతా రష్యావాళ్ళకి వ్యతిరేకంగా దెబ్బలాడినా రష్యా భీభత్సం విజయవంతంగానే సాగింది. రష్యాసైనికులు అంత విజయ వంతంగా ఎంచేత పనిచెయ్యగలిగారు? హంగేరీసైన్యం తన పెద్దఫిరంగులు ఎంచేత ఉపయోగించలేదు?

మొదటికారణం :– జనరలు మాలటేరుని రష్యావాళ్ళు మాయచేసి పట్టుకుపోయారు. అంచేత హంగేరీసేనకి నాయకుడు లేకుండా పోయాడు.

రెండోకారణం:– అయిదురోజుల శాంతివ్యవధిలో హంగేరీసేన ప్రతి ఘటనకి సిద్ధపడలేదు. రష్యాభీభత్సానికి అది భయపడీపోయింది.

మూడోకారణం:– నవంబరు 3 రాత్రి రష్యావాళ్ళు మాయచేశారు. రుమేనియా సేనలో మంచిదళాలని బుడాపెస్టు బైటికి పంపేశారు. సమీపం లోనివొక గ్రామం పర్యవేక్షణకి వెళ్ళాలని అబద్ధంఉత్తరాలు బనాయించారు.

నాలుగోకారణం:– ఉదయం నాలుగుగంటలకి దాడి ప్రారంభించే ముందు, రష్యా తుఫానుదళాలు చాలమంది హంగేరీ సైనికుల్ని పక్కలమీదే అరస్టు చేశాయి. అన్నిటికంటే పెద్దకారణం–హంగేరీసేనకి రష్యావాళ్ళు ఎన్నడూ పెద్ద పెద్ద ఆయుధాలు ఇచ్చిన పాపాన పోలేదు. హంగేరీ తిరుగు బాటుకి పూర్వమే, కమ్యూనిస్టు చిన్నరాజ్యాల సేనలు వీలు చిక్కినప్పు డల్లా తిరగబడడానికి అవకాశం వుందని రష్యాసేనానులికి భయంగానే వుండేది. అంచేత హంగేరీ, బల్గేరియావంటి దేశాలికి పెద్దపెద్ద ఫిరంగులు కానీ, అధునికమైన టాంకులుకానీ, ఎక్కువ మందుగుండుకానీ, రాకపోక లికి కావలిసిన శకటదళంకానీ ఇవ్వలేదు. ఈవిధానం హంగేరీలో, వాళ్ళకి బాగా పనికివచ్చింది. ఈవిధానం ఇప్పుడు చిన్న కమ్యూనిస్టు దేశాల్లోనూ, మధ్యాసియాలోనూ మరీ కఠినంగా అమలులో వుంది. వేరేమాటల్లో చెప్పా లంటే బుడాపెస్టు విప్లవం ప్రారంభమైనరోజునించీ చాలాకాలందాకా రష్యా వొక విధమైన బితుకుతో వుండవలిసిందే. అబితుకు ప్రపంచ ప్రజారాజ్యాలు పంచేస్తాయో అని కాదు. తన ఉపగ్రహాలుగా వున్న రాజ్యాలు వీలుచిక్కితే ఏం చేస్తాయో అని.

బుడాపెస్టు మీద రష్యావాళ్ళు. సైనిక విజయం పొందాక, ఇంకా ప్రచారవిజయం పొందాలి. అందుకోసం అమెరికా సంయుక్తరాష్ట్రాలే ఈ తిరుగుబాటు లేవతీయకాని ప్రచార మారంభించారు. వానిలో పాల్గొన్న వాళ్ళు ఉత్తి సనాతన వాదులనీ. ఫాసిస్టులనీ, జర్మనీనించి వచ్చిన శరణార్థులనే, కార్డినలు విండ్ జెంటీఅనీ, కార్మిక శత్రువులనీ బాకా పూదడం మొదలెట్టారు. నిజమైన కమ్యూనిస్టులూ, నిజాయితీకల కార్మికులూ, తెలివైన విద్యార్థులూ, కమ్యూనిజంమీద భక్తిగౌరవాలు కలిగేవున్నారని ప్రచారం చేశారు. అవన్నీ బహుశా కొన్ని దేశాలు నిజమే అని నమ్ముతాయి.

"మీరు చేస్తున్న సహాయానికి మేం కృతజ్ఞులం. కాని దయచేసి ఈగొడల్లోకి మీరు రావద్దు. ఈవిప్లవం పూర్తిగా స్వచ్ఛంగా వుండాలని మా అభిప్రాయం. కమ్యూనిస్టులూ, కార్మికులూ మాత్రమే యుద్ధం చెయ్యాలి. అలా అయితే మమ్మల్ని ఫాసిస్టులని రష్యావాళ్ళు అనలేరు." మంచి కుటుంబాలనించి వచ్చిన యువకులందరికీ ఇలాగే చెప్పారు హంగేరీ స్వాతంత్ర్య యోధులు.

బుడాపెస్టు గోడలమీద ఎక్కడపడితే అక్కడ పోస్టర్లు అంటించారు.

"90 లక్షల ఫాసిస్టు విప్లవకారులూ, వెనకటిఫ్యాక్టరీ యజమానులూ, బ్యాంకర్లూ, ఫాదిరీలూ పల్లెపట్టుల్లో దాక్కుని వున్నారు. నెపెల్ జిల్లాలో పాత జమీందార్ల భవనాల్లో దాక్కుని వున్నారు వాళ్ళు. అదృష్టవశాత్తూ ఈదేశం రక్షించడానికి ప్రభుత్వం నిర్మించిన సంస్థలో ఆరుగురు కమ్యూనిస్టులు ఇంకా వున్నారు."

కమ్యూనిస్టు కొత్త వార్తాపత్రిక నెప్ శాబాద్ శాద్ (ప్రజాస్వాతంత్ర్యం) శాబాద్‌నెప్ (స్వతంత్రప్రజ) అనే వెనకటి పత్రికకి మారుపేరు – వీధుల్లో అమ్ముతూ కుర్రాళ్ళు కేకలు వేసుకుంటూ తిరిగారు.

"ఇవాళటి తాజా అబద్ధాలు, అరప్లోరింటు!"

విప్లవం నిజమైనవార్తలు స్వాతంత్ర్యవీరుల ద్వారానే ప్రచారమయాయి. ఒక చిన్న చేతి ముద్రాయంత్రంలో "సత్యం" వార్తాపత్రిక ప్రకటించేవాళ్ళు వాళ్ళు. అందులో అమెరికా, బ్రిటిషు రేడియో స్టేషనులవార్తలు ప్రకటించేవాళ్ళు. అందులో అచ్చయే ప్రతీవ్యాసమూ, ప్రతీపద్యమూ రచయితల పేర్లతోనే వుండేవి. స్వాతంత్ర్యయుద్ధం జరుగుతూన్న దినాల్లో కుర్రాళ్ళు ఈపత్రికలు సైకిళ్ళమీద దెచ్చి రహస్యంగా అమ్మేవాళ్ళు.

ఒక స్వాతంత్ర్య యోధుడు ఇలా అన్నాడు :

''సత్యం పత్రిక సంచికలు ఒక్కటికూడా మేం పుచ్చుకోడం మాన లేదు. కాని ఈపత్రికలు తెచ్చే కుర్రాళ్ళు మాత్రం చాలామంది చచ్చి పోయారు. వింతేమిటంటే, అలాచచ్చిపోయిన కుర్రాళ్ళకోసం మేం దుఃఖ పడకపోవడమే. వాళ్ళూ మాలాగే స్వాతంత్ర్యంకోసం, సత్యం తెలుసుకునే హక్కుకోసం పోరాడి ప్రాణాలు వొదిలారు.''

స్వాతంత్ర్యయోధులికి ఎప్పటికప్పుడు వార్తలు అందుతూ వుండేవి. ఈవిప్లవంలో జరిగిన గొప్ప విషయయే అది. అలా కాకపోయివుంటే స్వాతంత్రసమరం గురించి ఏదైనా అపోహపడడానికి అవకాశముండేది. అలా జరిగిన రోజు దుర్దినమే అనుకోవాలి. రకోసీ వీధి మొగని పాతశాబాద్ నెప్ భవనంలో, రష్యావాళ్ళు దాడి ప్రారంభించిన ఆదివారం టెలిప్రింటరు దగ్గిర ఒక విలేఖరి కూచుని వున్నాడు. అక్కడికి పడమట 170 మైళ్ళ దూరంలో వున్న వియన్నాలో అసోసియేటెడుప్రెస్సు ఉద్యోగికి అతడు ఒక బహిరంగతంతి పంపాడు. కొన్ని గంటలపాటు, సాహసి అయిన ఆ యువకుడు తన నగర విధ్వంసం గురించి రిపోర్టు టైపుచేశాడు. అతడి రిపోర్టు ప్రపంచంలోని పత్రిక లన్నింటిలోనూ అచ్చయింది. ఆరిపోర్టు చద వని పాఠకులు వుండనే వుండరని చెప్పవచ్చు:

''ఇప్పుడు అంతా నిశ్శబ్దం. తుఫానుముందు వుండే నిశ్శబ్దం అయి వుంటుం దిది.

''మాదగ్గిర ఆయుధాలులేవు. తేలిక మరతుపాకులూ, రష్యాలోచేసిన రైఫిల్సూ మాత్రం వున్నాయి. భారీతుపాకులు ఏవీలేవు.

''ప్రజలు చేతిబాంబులు పట్టుకుని టాంకులమీదికి వురుకుతున్నారు. హంగేరీ ప్రజలికి మృత్యువంటే భయం పోయింది. కాని ఎక్కువకాలం వాడికి నిలవలేకపోవడం చూస్తేమాత్రం జాలివేస్తుంది.

''ఇప్పుడే ఒకమనిషి పక్కవీధిలోంచి వచ్చాడు. వీధంతా ఖాళీగా వుంది. ప్రజలు అక్కడక్కడ దాక్కుని వున్నారు, కొందరు తలుపుల చాటున నక్కి వున్నారు, శత్రువులకోసం ఎదురుచూస్తూ.

సెలవుతీసుకు వెళుతూన్న ఒక సైనికుడితో అతడితల్లి ఇలాఅంది:- నాయనా, నువ్వు వీరుడివి కావద్దు. అలా అని పిరికిపందవీ కావద్దు.'

"టాంకులు దగ్గిరపడుతున్నాయి. పెద్దపెద్ద ఫిరంగులు వస్తున్నాయి. హంగేరీసేనకి మందుగుండూ, కొత్తమనుషులూ వస్తున్నట్టు ఇప్పుడే టెలిఫోనువార్త. అయితే అది చాలదు. ఇంకా ఎంతో కావాలి. ఉత్తచేతుల్తో జనం టాంకులమీద కలబడడం మేం అంగీకరించం. ఐక్యరాజ్య సమితి ఏంచేస్తోంది? మాకు రవంత ప్రోత్సాహమివ్వండి.

"చివరి రక్తంచుక్కవరకూ మేం ప్రతిఘటిస్తాం. మాకు ఆయుధాలివ్వడానికి ప్రభుత్వం చెయ్యవలసినంత చెయ్యలేదు. కింద అంతస్తులో మనుషులు నిలబడి వున్నారు. వాళ్ళదగ్గిర ఒక్క చేతిబాంబే వుంది.

"ఇదిగో తుపాకి పేల్చడానికి నేను పక్కగది కిటికీ దగ్గరికి పరిగెడుతున్నాను. ఏదైనా కొత్తవార్త వచ్చినా, మీ దగ్గిరనించి టెలిఫోను వచ్చినా పరిగెత్తుకు వస్తాను.

"వియన్నాలో అసోసియేటెడ్‌ప్రెస్సు ఒక వాషింగ్టను వార్తప్రకటిస్తూ నిండ్‌జెంటీ బుడాపెస్టు సంయుక్తరాష్ట్ర రాయబారవర్గం కార్యాలయంలో తలదాచుకున్నాడని వివరించింది. శాబాచ్‌నెప్ విలేఖరి ఆ వార్త విని "ఇంతేనా వాళ్ళు చేసింది?" అన్నాడు.

"ఒక రష్యావిమానం ఇప్పుడే మరతుపాకిపేల్చింది. దేనిని గురిచూసి కొట్టిందో చెప్పలేం. దాని ధ్వనిమాత్రం విన్నాం.

"బారికేడ్లు కట్టేపని సాగుతూనేవుంది. పార్లమెంటుభవనం ప్రాంతంలో టాంకులు కిక్కిరిసి వున్నాయి. ఎందుకో తెలియదు. కాని అది మంచి లక్షణం కాదని మాత్రం చెప్పగలను. మీద విమానాలు ఎగురుతున్నాయి. వాటిని లెక్కపెట్టలేకపోతున్నాను; అన్ని వున్నాయవి. టాంకులు వరసలు తీరి వస్తున్నాయి.

"మా భవనంమీద గుళ్ళుకురిశాయి. ఇంతవరకూ ఎవరూ చావ్వలేదు. టాంకుల గర్జన ఘోరంగావుంది. మా మాటలు పరస్పరం వినపడ్డంలేదు.

"గంటా రెండుగంటల్లో అమెరికాసేనలు వస్తాయని వదంతి.

"ఇప్పుడే దగ్గిరగా ఒక బాంబు పేలింది. పదిగంటల ఇరవైనిమిషాలయింది. నేషనల్ థియేటరువేపు బాగా తుపాకులు పేలుతున్నాయి. ఇక్కడికి దగ్గిరగానూ, నగరం మధ్యగానూ వుం చది.

"హంగేరీ తరఫున ప్రపంచం ఏం చర్య తీసుకుంటుందో ? దాని గూర్చి వార్తలు పంపించండి. భయపడకండి. చదవగానే మీ వార్తలు కాల్చేస్తాం.

"మా భవనంలో పదిహేనేళ్ళ కుర్రాళ్ళూ, నలభైయేళ్ళ పెద్దవాళ్ళూ వున్నారు. మాకోసం విచారించకండి. మాది చిన్నదేశమైనా మాకు బల ముంది. యుద్ధం ముగిశాక మా ఈ పీడితమైన, దుఃఖపూరితమైన దేశం తిరిగి మేం నిర్మించుకుంటాం."

అవాళ ఉదయం 10-30 కి తుది సమాచారం వచ్చింది. అంతే, తరవాత శాచాద్‌నెప్ భవనం నించి అవిలేఖరి పత్తాలేదు. ఆ చివరివార్త ఇది:

"కిల్లియన్ బారక్సు దగ్గిర ఇప్పుడిప్పుడే ఘోరంగా యుద్ధం జరుగు తోంది. మరఫిరంగులు తాపీగా పేల్తున్నాయి."

ఆ యువకుడు మాయమయే ముందు, ఇంగ్లాండు పారిపోయిన ఒక బంధువుకి ఒక వర్తమానం పంపాడు :

"మీకు ముద్దులు. మేం క్షేమంగా వున్నాం. ఇపుడు 9-20. మేం దెబ్బలాడుతున్నాం. C. E. T. నవంబరు 4."

తరవాత రష్యా తుపాకులు శాబాద్‌నెప్ భవనం ఇట్టే పేల్చిపారేశాయి.

బుడాపెస్టు విధ్వంసమపుడు కొందరు స్వాతంత్ర్యయోధులు అక్కడ జరిగిన విషయం ఒక రిపోర్టు రాయాలనుకున్నారు. వాళ్ళిచ్చిన అంకెలు అడ్డ దిడ్డంగా వుండడం సహజం. అవి సరైనవని నేను ప్రమాణంచేసి చెప్పడం లేదు. కాని ఈ కిందివిధంగా జరగడంలో వింతేమీ వుండదు.

140 వేలమంది సాయుధులైన రష్యా సైనికులు పట్నంలో చొర బడ్డారు. వాళ్ళకి దన్నుగా అధమం 4 వేల టాంకులూ, సాయుధ దళాలూ వచ్చాయి. ఆధునిక యుద్ధపు తతంగమంతా వచ్చింది. వాళ్ళు ఎనిమిదివేల గృహాలు నేలమట్టం చేశారు. నూటికి అరవై చొప్పున పట్నంలోని కిటికీలు బద్దలుకొట్టేశారు. సుమారు 30 వేలమంది హంగేరీ ప్రజ మరణించారు. లేదా గాయపడ్డారు. మరో 10వేలమంది కూలిపోయిన ఇళ్ళకింద పూడ్చుకు పోయారు. చాలామంది 80 వేలమంది హంగేరీ మనుషులు చచ్చిపోయా రంటున్నారు. రష్యావాళ్ళు 8 వేలకిపైగా చచ్చిపోయారు. 320 టాంకులు భగ్నమయాయి. ఈ చివరి సంఖ్య పూర్తిగా నిజంకాదు. 160 కి తక్కువ

కాకండా 400 కి ఎక్కువ కాకండా భగ్నమై వుంటాయి. నేను చదివిన రిపోర్టుబట్టీ, పోగుచేసిన ఫొటోలబట్టీ ఈ సంఖ్య 480కి సమీపంలో వుంటుంది. మొత్తానికి ఏమైతేనేం నగరం ధ్వంసమైంది.

ఇదంతా రష్యా ప్రకటించిన శాంతి స్నేహవిధానం కింద జరిగిందే.

"హంగేరీ ప్రజలికి నిజమైన మిత్రులుగానే మేం కలగజేసుకున్నాం. శత్రువులుగా మాత్రం కాదు. ఫాసిస్టుల తిరుగుబాటు అణచడంకోసమే మేం ఇలా కలగజేసుకున్నాం."

యుద్ధం తీవ్రంగా సాగుతూ వున్నప్పుడు విద్యార్థులూ, రచయితలూ, కార్మికులూ, బాలికలూ తమ ప్రాణాలు బలి ఇస్తున్నప్పుడు సోవియటు తొత్తులు బుడాపెస్టులో ఇలా నంజాయిషీ చెప్పడానికి సిగ్గయినా పడలేదు.

"భయంకరమైన ఫాసిస్టుజంతువులు కాప్టలిస్టుల అందకారం తిరిగీ స్థాపించాలని ప్రయత్నించాయి. శాంతికాపాడం కోసం హంగేరీ ప్రజలు ఈ ఫాసిస్టుమంద అణచెయ్యడానికి తగిన శక్తి సంపాదించు కుంటారని మాకు నమ్మకముంది. సోవియట్ యూనియన్ నాయకత్వంకింద సోషలిస్టు బ్లాకు దేశాలన్నీ కలిసి గట్టిగా పనిచెయ్యడం ప్రపంచంలో ఒక గొప్ప విషయం. సోవియటు యూనియను సహాయంతో హంగేరీ శాంతి స్థాపించ గలిగితే అది తిరిగీ నిర్మాణాత్మకమైన సామ్యవాద కార్యక్రమం నడిపించ గలుగుతుంది. విప్లవ వ్యతిరేక దళాలమీద త్వరగా విజయం సాధించి, ఈ దళాలు ఎంత బలహీనమైనవో రుజువు చేసిం దది. జనసామాన్యం ఈ తిరుగుబాటు సమర్థించలేదని దీనివల్ల స్పష్టమయింది."

ఒదిలేసిన ఒక స్వతంత్ర రేడియోస్టేషను నించి ఒక స్వాతంత్ర్య వీరుడు ప్రపంచానికి ఈ సందేశమిచ్చాడు: ప్రపంచ నాగరిక ప్రజలారా! వెయ్యి సంవత్సరాల చరిత్రగల హంగేరీదేశం ఆహుతి అయిన చివరి జ్వాలలు శాంతిస్తున్నాయి. బాధతో కుంగిపోతూన్న హృదయాలు నలిపెయ్యాలని సోవియట్ సేన ప్రయత్నిస్తోంది. హంగేరీ గడ్డమీద రష్యా ఫిరంగులు గర్జిస్తున్నాయి. మా స్త్రీలు – తల్లులూ, కూతుళ్ళూ భయభ్రాంతులై వణుకుతున్నారు. 1945 లో ఈ పట్నం సైన్యాలు ప్రవేశించిన నాటి, ఘోరమైన స్మృతులు వాళ్ళ కళ్లముందు నాట్యం చేస్తున్నాయి. మా ఆత్మలు రక్షించండి! రక్షించండి!! రక్షించండి!!!

"ఓ ప్రపంచ పౌరులారా! మా పిలుపులు వినండి. మాకు సహాయం చెయ్యండి. మీ సలహాలూ, మీ మాటలూకావు మాకు కావలసింది. మీచేతలు మీ సేనలు, మీ ఆయుధాలు. బోల్షివిజం చేస్తున్న ఈ దాడి ఇంతటితో ఆగిపోదన్న విషయం మరవకండి. దీని తరవాత దాడి మీ మీదికే రావచ్చు. మమ్మల్ని రక్షించండి. రక్షించండి. రక్షించండి.

"ఓ యూరపు ప్రజలారా! ఒకప్పుడు ఆశియా అడివిజాతుల దాడినించి మిమ్మల్ని మేం రక్షించాం. ఇప్పుడు హంగేరీ భయభ్రాంతమై హాహాకారాలు చేస్తోంది. వినండి.

"ఓ ప్రపంచ నాగరిక జనులారా! స్వాతంత్ర్యం పేర మీ సహాయం అర్థిస్తున్నాం. మా వోడ మునిగిపోతోంది. వెలుతురు మాయమవుతోంది. నిమిష నిమిషానికీ అంధకారం అలుముకుంటోంది. మా మొర్ర వినండి. లెండి. చేయూత ఇవ్వండి.

"ప్రపంచ మహాజనులారా! రక్షించండి. రక్షించండి.

"సహాయం! సహాయం!! సహాయం!!! మిమ్మల్నీ మమ్మల్నీకూడా దేవుడు రక్షించాలి!"

తరవాత ? తరవాత నిశ్శబ్దం తప్ప మరి ఏముంటుంది ?

—o—

# 6. ఏ. వీ. వో. మనిషి

అయిదురోజులు శాంతివ్యవధిలో స్వాతంత్ర్య యోధులు చేసిన కొన్ని పనులు తిరుగుబాటుకి చాలా నష్టం కలిగించాయి. దురదృష్టవశాత్తూ ఈ సంఘటనలు జరిగిన చోట్లల్లా ఫొటోగ్రాఫర్లు వుండడమూ, వాళ్ళు ఫోటోలు తీసుకోవడమూ జరిగింది. ఈ ఫోటోలు ప్రపంచమంతటా వ్యాపించాయి.

ఈఫోటోల సహాయంతో రష్యావాళ్ళు హంగేరీ స్వాతంత్రయుద్ధం కార్మికుల నెత్తిమీద ప్రగతి విరోధకులు బలవంతంగా పెట్టిన ముళ్ళకిరీటమని నిరూపించడం మొదలెట్టారు. ఒకవేపు సోవియటు టాంకులు వీధుల్లో గర్జిస్తూ ఇళ్ళమీద నిర్లక్ష్యంగా గుళ్ళు కురిపిస్తూ, కూలిపోతూన్న ఇళ్ళల్లో పౌరుల్ని పాతిపెడుతూ వున్నప్పుడే సోవియటు ప్రచారకులు ఈఫోటోలతో కరపత్రాలు అచ్చొత్తి యూరపులోనూ, తక్కిన ప్రపంచంలోనూ పంచిపెట్టారు.

అయితే ఆఫోటోలలోని సంఘటనలు ఎందుకు, ఎలా జరిగాయోమాత్రం వాళ్ళు వివరించలేదు. ఈ ఫొటోలతోపాటు వాటి వెనకటి దృశ్యాలుకూడా వాళ్ళు చిత్రించవలసింది. ఉదాహరణకి ఒక ఏవిషోమనిషి చరిత్ర ఇక్కడ వివరిస్తాను. ఇందులో నేనిచ్చినవ్యక్తి చిత్రణ బహుశా సరికాదేమో అని కూడా అనుకుంటాను. కాని అది అక్షరాలా జరిగిన సంఘటనమీదే ఆధార పడివుంది.

టైబరుడొనాత్ ఒక పల్లెటూరు కుర్రాడు. రష్యా సరిహద్దుకి దగ్గిరగా వున్న ఒక కుగ్రామంలో అతడు 1925 లో పుట్టాడు. దురదృష్టవశాత్తూ అతడు అందమైనవాడు కాడు. పాలిపోయిన జుత్తూ, నీరసమైన కళ్ళూ, పొడుచుకువచ్చిన గెడ్డమూ– చూస్తే అసహ్యం వేస్తుంది. బడిలో అతడి చదువు వేసంగిచదువే అయింది. ఇంట్లో చదివిస్తే చురుకుగా వుండేవాడు. తల్లీ తండ్రీ అతడివైఖరిచూసి బాధపడేవాళ్ళు. 'పెద్దవాడైతే బాగా తయారవుతాడు' అన్నాడు పాదిరీ, వాళ్ళని వోదారుస్తూ– "అయితే అతడు ఆటల్లో మాత్రం పాల్గొనాలి."

అది ఎన్నడూ జరగలేదు. అతడంటే తక్కినకుర్రాళ్ళకి ఇష్టంగా వుండేదికాదు. అది మరొకకారణం. అలాంటి ఆశాభంగాలు సహిస్తూ టైబరు తన బాల్యం గడిపాడు. యవ్వనం వచ్చింది. ఏ అమ్మాయీ అతణ్ణి ప్రేమించలేదు. అతడంటేనే ఆడపిల్లలు పక్కకి తప్పుకునేవాళ్ళు. మళ్ళీ ఫాదిరీ అన్నాడు: "మరికొంచెం పెద్దవాడు కానివ్వండి, అన్నీ వాటంతటఅవే సర్దుకుంటాయి."

కాని టైబరు డొనాత్ పరిస్థితులు ఏమీ మారలేదు. 1943 లో అతడి తోడివాళ్ళందరూ యుద్ధానికి వెళ్ళారు. డొనాత్‌ని సైనికాధికారులు నిరాకరించారు. అతడి బరువు సరిపోలేదన్నారు. అయితే అది డాక్టరు చెప్పినమాట. కాని నిజమైన కారణం ఏమిటంటే, డొనాత్ మతి స్థిరంగా లేకపోవడమే. దీనికి ఒక తార్కాణంకూడా దొరికింది, అదే నిరాకరణకి కారణమని. 1944 లో జర్మనీవాళ్ళు హంగేరీని ఆక్రమించినప్పుడు ఒక జర్మను లెఫ్టినెంటుతో శాశ్వతమైన సంబంధం కలిగించుకున్నా డతడు. ఆ లెఫ్టినెంటు తరవాత కొద్ది దినాల్లోనే రష్యాయుద్ధంలో చచ్చిపోయాడు.

యుద్ధం శాంతించింది. ఇప్పుడు డొనాత్‌కి 20 ఏళ్ళు వచ్చాయి. అతడికి చాలా చిక్కులు తటస్థించాయి. ఉద్యోగం దొరకలేదు. పెళ్ళికూ

తురు లభించలేదు. జీవితంలో నిలకడ కనిపించలేదు. అర్థంలేని బతు కయిం దతడిది. భోంచేసి పూరికే ఇంట్లో కూచోడమూ, పనీపాటూలేకండా కూచున్నాడని తల్లి సాధించడమూ – ఇలా కొన్నాళ్ళు గడిచాయి.

ఒకనాడు డోనాత్ తల్లితో అన్నాడు: "అమ్మా, నేను ఏంచేస్తానో తెలుసా ? రష్యా వెళ్ళిపోతాను."

తల్లి నవ్వింది. జర్మనీవెళ్ళి, చచ్చిపోయిన తన లెఫ్టినెంటు కుటుం బంతో వుంటానన్నా డతడు.

చివరికి అతడికి వొక ఆశ్రయం దొరికింది. అయితే అది అంతముఖ్య మైందిమాత్రం కాదు. అతనికి కావలసిన డబ్బూ ఇచ్చేదికా దది. కాని అది మంచి ఆశ్రయం మాత్ర మౌను. ఏదో తాను కొంతపనికివచ్చేవాణ్ణని మొట్ట మొదట తనకి భావం కలిగించిన పని అది. కమ్యూనిస్టు పార్టీలో చేరి ఇదంతా సంపాదించా డతడు.

అతడికి మొదట ఇచ్చిన పనులు చిల్లర రకానివి. అతడంత తెలివైన వాడు కాడని పార్టీ నాయకులు వెంటనే గ్రహించేశారు. మొదట అతణ్ణి తన స్వగ్రామంలో పెత్తనదారుగా పనిచేయనిచ్చారు. టైబర్ డొనాతుకు ఇంతకంటే ఆనందప్రదమైన పని మరొకటి లేదు. తనని తిట్టిన కుర్రాళ్ళతో దబాయించి మాట్లాడగల డిప్పుడు. తనంటే నిర్లక్ష్యంచేసిన అమ్మాయిలతో కలిసి తిరగ్గల డిప్పుడు. తనతో విరోధంగావున్నవాళ్ళమీద కసితీర్చుకోడానికి మంచి అవకాశం లబించిం దతడికి. తన చిన్ననాటి స్నేహితుల్లో వొకడు 'పాసిస్టయి వుంటాడు'అని కమ్యూనిస్టుపార్టీ నాయకుడితో వొకసారి అన్నా డతడు. నాలుగు నెలలయాక ఆకుర్రాణ్ణి అతడు చూసినప్పుడు తన పాత విరోధి బాగా అణిగిపోయాడనే సంతృప్తి కలిగిం దతడికి.

పార్టీ పోలీసుకి ఇలాంటివెన్నో సూచనలు ఇస్తూవుండేవా డతడు. వీటిలో కొన్ని నిజమయేవి. ఇదంతా అయాక, బుడాపెస్టునించి వచ్చిన వొకాయన అతడితో అన్నాడు: "నువ్వు మంచి స్పెషల్ పోలీసువవుతావని వాళ్ళన్నారు."

"నేను ఆవిషయం ఎన్నడూ అనుకోలేదు" అన్నాడు డొనాత్.

"నీకు వొక యూనిఫారం ఇస్తారు. ముఖ్యంగా చేయవలసిన విధు లుంటాయి నీకు" అన్నా డామనిషి. అతడు సామాన్యమైన దుస్తుల్లోనే వున్నాడని గ్రహించాడు టైబర్.

"మరేపనయినా దొరుకుతుందా ?"

"బహుశా, దొరకవచ్చు."

మరో ఆరుమాసాలవరకూ స్పెషల్‌పోలీసుల విధులగురించి డొనాత్ విన్నది ఈమాత్రమే. తరవాత 1944 లో హఠాత్తుగా వెంటనే ట్రెయినింగు కోసం రమ్మని అతడికి ఆజ్ఞ వచ్చింది. హంగేరీలోని బ్యారక్కులికి ట్రెయినింగుకోసం వెళ్ళాలి. అక్కడ అందమైనవాళ్ళనీ, సమర్థులైనవాళ్ళనీ ఎంతో మంది యువకుల్ని కలిశాడు డొనాత్. తనలాగే వాళ్ళున్నూ జిల్లాలనించి వచ్చినవాళ్ళు. వాళ్ళ ఆఫీసర్లుమాత్రం బుడాపెస్టునించి వచ్చినవాళ్ళే.

బ్యారక్కులలో అతనికిచ్చిన పాఠాలు చాలా సరళమైనవి. సూటి అయినవి. అక్కడి ఉపాధ్యాయుడు ఇలా అన్నాడు: "ఒక అల్లరి అణచాలంటే తుపాకులు ఉపయోగించాలి."

తుపాకి ఎలా ఉపయోగించాలో నేర్పేవా డతడు. మిలిటరీకార్లు ఎలా నడపాలోకూడా నేర్పాడు. అనుకోకుండా రాత్రి శత్రువు దాడిచేస్తే ఏం చెయ్యాలో నేర్పాడు.

"ప్రతీచోటా శత్రువు లున్నారు" అని అధ్యాపకుడు నూరిపోశాడు.

గ్రామంలో డొనాతును కలిసిన మనిషి మూడువారా లయాక క్యాంపుకి వచ్చాడు. అతడి బూట్లు నిగనిగలాడుతున్నాయి. బింకంగా ఇస్త్రీచేసిన కాకి యూనిఫారం వేసుకున్నా డతడు. నీలి లోహం పతాకాలూ అవీ వున్నాయి. డొనాతు వయసులోవున్న యువకులు చాలామంది అతనిచుట్టూ వున్నారు. వాళ్ళకీ అలాంటి యూనిఫారాలే వున్నాయి. కాని పతాకాలుమాత్రం తక్కువగా వున్నాయి.

"యువకులారా! హంగేరీకి మీరే గొప్ప రక్షణ. మీరే జాతీయ వీరులవుతారు. రాత్రింబగళ్ళు మీరు హంగేరీని రక్షిస్తూవుండాలి. తరుచు మీరు యుద్ధాల్లో పాల్గొనవలసివస్తుంది. మీ మొదటివిధి సరిహద్దులు కట్టుదిట్టంగా సీలు చెయ్యడం. మన సరిహద్దులు కోటగోడల్లా మారిపోవాలి" అన్నాడు క్యాంపులో వున్నవాళ్ళని సంబోధిస్తూ అతడు.

అవాళనించీ డొనాత్ శిక్షణ మరింత తీవ్రమైంది. సరిహద్దు రక్షకుల యూనిఫారం ఇచ్చా రతనికి. బింకంగా ఇస్త్రీచేసిన పంట్లాముా, నిగనిగలాడుతూన్న బూట్లూ, ఆకుపచ్చ పతాకాలూ, ఇచ్చారు.

"శత్రువులు హంగేరీలో ప్రవేశించకుండా చేస్తాం" అంటూ ఉద్రేకులైన యువకులందరూ ప్రమాణం చేశారు.

టైబరూ అతడి మిత్రులూ సరిహద్దుల రక్షణకోసం వెళ్ళినప్పుడు తెలిసింది—తాము చేసేపని శత్రువులు లోపలికిరాకండా చెయ్యడంకాదు, హంగేరీవాళ్ళు బైటికి వెళ్ళిపోకుండా వాళ్ళని వేటాడడం అని. డొనాత్ యుగోస్లావియా సరిహద్దుమీద నియమితు డయాడు. అక్కడ టిటోమనుషులు దోపిడిగాళ్ళుగా, హంతకులుగా హంగేరీ ప్రవేశిస్తారని అనుకోవచ్చు. కాని వందలకొద్దీ హంగేరీప్రజలు ఆదేశానికి పారిపోవడం డొనాత్ చూశాడు.

"త్వరలో దీన్ని అరికట్టేద్దాం" అన్నాడు కఠినంగా డొనాతుమీదవున్న కమాండరు.

మొదటిరాత్రి డొనాతూ అతడి సహచరులూ సరిహద్దు దాటివచ్చిన ప్రతీ హంగేరీవాణ్ణి కాల్చిపారేశారు. ఈసంగతి చుట్టుపట్ల తెలిసేటప్పటికి పలాయితులసంఖ్యతగ్గిపోయింది. తరవాత సరిహద్దుచౌకీలుఏర్పాటుచేశారు. ముప్ఫయి గజాల వెడల్పున సరిహద్దుకి ఇవతలనేలంతా దున్నేశారు. పారిపోయేవాళ్ళ అడుగుజాడలు కనపడడంకోసం అలా చేశారు. సాధారణంగా దాటుకుపోయేపట్లలో ముళ్ళతీగ వేశారు. అయితే కమాండరు దాంతో తృప్తిపడలేదు, డొనాత్‌కు ఒకపని పెట్టాడు. ఆపని పూర్తయేసరికి మూడు మాసాలు పట్టింది.

దున్నిన ఆ ముప్ఫయిగజాలమేరా జాగర్తగా మైన్సు పెట్టాడు డొనాత్. పారిపోతున్నవాడు ఎవడైనాసరే, ఆదారిని వెళ్ళాడా మైను ఢామ్మని పేలుతుంది. ఒక్కొక్కచోట ఎనిమిది పది మైన్లు తీగతోకట్టి వరసగా పాతిపెట్టాడతడు. ఒకటి తప్పించుకువెళ్ళినా మరొకటి తగిలి తీరుతుంది. అదీ దాటితే మరొకటి తప్పదు. అవి పగిలాయంటే ఒక తుకిడీకి తుకిడీ మనుషులు ధ్వంసమయిపోతారు.

సరిహద్దుమీద అక్కడక్కడ ముప్పయ్యేసి అడుగుల బురుజులు నిర్మించారు. బరువైన మరతుపాకులు పెట్టగలిగేటంత గట్టి పునాదులు వేసి కట్టారవి. వాటిమీద పెద్దపెద్ద సెర్చిలైట్లు పెట్టారు. అప్రాంతాల్లో ఎక్కడున్నా ఆవెలుగులో పలాయిత కనపడిపోతారు. రాత్రిరాత్రంతా, ప్రతీరాత్రీ- సంవత్సరం పొడుగునా ఈలైట్లు పలాయితుల్ని పట్టుకోడంకోసం వెలుగుతూనే వుంటాయి.

ఇన్ని జాగ్రత్తలు వహించినా కొంతమంది హంగేరీ ప్రజలు దాటిపో తూనే వున్నారు. బుడాపెస్టు స్పెషలుపోలీసు పెద్దలికి ఇది కోపకారణమైంది. ఒక పెద్దఉద్యోగి సరిహద్దు ప్రాంతాలు పర్యటించి, సరిహద్దు రక్షణదళాన్ని ఉద్దేశించి ఇలా అన్నాడు : "ఈ రాజ్యశత్రువులు అమానుషులు. వాళ్ళు పిల్లుల్ని సంచుల్లోవేసి మైన్లు పరిచినచోటికి తీసుకువెళ్ళి విడిచిపెడతారు. పిల్లులు అటూఇటూ పరిగెత్తి మైన్లు తాకుతాయి. మైనులుపేలి పిల్లులు ముక్కలకింద ఎగిరిపోతాయి. అప్పుడు శత్రువులు నిచింతాలేకండా పాక్కుంటూ దాటిపోతారు. వాళ్ళని అరికట్టాలి."

"పిల్లుల అరుపు వినిపిస్తే మరతుపాకులు పేల్చండి" అంటూ ఒక అజ్ఞ వేశారు. దీనివల్ల పలాయితులు చాలామంది చావడమో, గాయపడ డమో జరిగింది. గాయపడికూడా పాకుకుంటూ వెళ్ళే శత్రువుల్ని కుక్కల సహాయంతో పసికట్టి లాక్కురావడం దొనాతుకు ఒక చెలగాటంగా తయా రైంది.

"ఎప్పుడూ ఎవ్వరూ హంగేరీలోకి రావడానికి ఎందుకు ప్రయత్నిం చరూ? ఎప్పుడూ హంగేరీలోంచి పారిపోడానికే ఎందుకు ప్రయత్నిస్తారు?" అంటూ దొనాతు ఎల్లప్పుడూ తన్నుతాను ప్రశ్నించుకోలేదు.

గాయపడ్డ మనిషిని టైబర్ ఎప్పుడైనా పట్టుకున్నాడో, తుపాకి కడు పులోగుచ్చి తన కుడిచేతి పిడికిలితో బలంగా అతడి మోహంమీద గుద్ది సంతోషించేవాడు. తుపాకిదెబ్బకి రక్తం కారుతూన్న మనిషిని కార్యాలయ కేంద్రంవరకూ నడిపించి అక్కడ అతడిమీద ప్రశ్నలు కురిపించడం తనకి పరిపాటి.

పచ్చగుర్తుగల తన తోడిసైనికులు పట్టుబడ్డమనిషిచేత మాట్లాడించ డానికి వింతవింత పద్ధతులు అవలంబించేవాళ్ళు. కొట్టడం, గోళ్ళల్లో సూదులు గుచ్చడం, తుపాకి రెండోకొనతో అండత్రయాలమీద కొట్టడం— ఇంకా ఇలా ఎన్నోరకాల హింసించి, ఆప్రాంతాల్లో పలాయితులు ఎక్కడెక్క డున్నారో చెప్పమనేవారు. తక్కినవాళ్ళు పట్టుబడ్డతరవాత వాళ్ళల్లో ప్రతీ ఒక్కరినీ ఇలాగే యమయాతనలు పెట్టేవాళ్ళు.

"వీళ్ళు ఏయేవిధాల పారిపోతారో ఆవివరాలన్నీ పూర్తిగా తెలుసుకుని కాని వీళ్ళని వొదిలిపెట్టవద్దు" అంటూ దొనాతు పైఅధికారి అజ్ఞాపించాడు.

అప్పటినించీ పట్టుబడ్డ అభాగ్యులనించి రహస్యాలు పిండడంలో నిపుణుడై పోయాడు డొనాత్. అతనిపనికి సంతోషించి బుడాపెస్టులో పెద్దపనిమీద అతడికి ప్రమోషనిచ్చారు. ఈ ప్రమోషను శుభవార్త అతడికి చేరిననాడు అతడు కుక్కలు వెంటపెట్టుకుని రాత్రి సరిహద్దుమీద తిరుగుతున్నాడు. తన అదృష్టంగురించి ఆలోచిస్తూ అనుకున్నాడు :

"తుపాకితో కాల్చిపారేసే ఈపనిలోంచి తొలిగిపోవడం బాగానేవుంది. నిజమైన ప్రభుత్వ శత్రువులు పారిపోతున్నారంటే వాళ్ళని కాల్చి పారెయ్యడం సమంజసంగానే వుంటుంది. కాని పారిపోతూవున్నవాళ్ళలో చాలామంది స్త్రీలు!"

కొన్ని నెలలకిందట తాను కాల్చిపారేసిన భార్యాభర్తలగురించి ఆలోచించా డతడు. వాళ్ళని మరచిపోలేకపోయాడు. ఏమంటే, వాళ్ళు తన గ్రామంనించి వచ్చిన ఒక రైతుకుటుంబంలా అవుపించారు. మరికొంచెం వయస్సువుంటే ఆస్త్రీ తనతల్లేకావచ్చు. సరిహద్దునించి వాళ్ళశవాలు ఈడ్చుకువచ్చి అక్కడ పడేసినప్పుడు, ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఏంపాపంచేసి వాళ్ళు ఈ శిక్షకు పాత్రులయారో అంటూ వాళ్ళనిచూస్తూ ఆలోచించా డతడు. వాళ్ళు కేవలం రైతులు, అమాయకులు. కమ్యూనిజంనించి పారిపోవాలని ప్రయత్నించిన ఇద్దరు సామాన్య రైతులు వాళ్ళన్న భావం డొనాతుకు కలగనేలేదు.

హంగేరీ విడిచిపెట్టి ఎవరైనాసరే, ఎందుకు వెళ్ళిపోవలసివస్తుందో ఊహించలేకపోయా డతడు. "వేసవి ప్రారంభంలో పంటలు ఎంతో బాగున్నాయి. బుడాపెస్టు అద్భుతమైన పట్నం. ఆ డాన్యూబునదీ, ఆప్రజలూ, ఆహోటేళ్ళూ – ఎవరైనా ఎందుకు వొదిలేసి వెళ్ళిపోతారు?" ఇది ప్రశ్న.

రాత్రి గాలి చల్లగా వీస్తోంది. ఆకాశంనిండా నక్షత్రాలు వెలుగుతున్నాయి. పచారుచేస్తూ డొనాతు తనకి ఎలాటి ఉద్యోగం దొరకబోతుందోఅని ఆలోచించాడు. "నా రికార్డు బాగుంది. కెప్టెను చెప్పాడు. తక్కినవాళ్ళూ అన్నారు."

ఇప్పుడు అతడికి మంచిమంచి వస్తువులమీద హక్కుంది. తాను ఎలాంటి పని చెయ్యదలుచుకున్నాడో తానే చెప్పుకోడం మొదలెట్టాడు.

"ఒక పెద్ద మోటారు నడిపేపని దొరికితే బాగుంటుంది. దానిమీద ఎక్కి బుడాపెస్టుచుట్టూ తిరుగుతూవుంటాను. గొప్పగొప్పవాళ్ళని బాలటాన్ సరస్సుదగ్గిరికి ఎక్కించుకు వెళతాను" అని గొణుక్కున్నాడు.

ఒక పెద్దకారు తాను నడుపుతున్నట్టు కలలుకంటూ కొంతసేపు గడిపాడు. కాని ఇది సాధ్యం కాదనుకున్నాడు. మరే ఉద్యోగం సాధ్యమో అంటూ ఊహాగానాలు చేశాడు. "రికార్డులు భద్రపరిచే పనేమో! అది శుభ్రమైన పని. ప్రతీదీ చక్కగా అమిర్చి వుంచడమంటే నాకు మహాఇష్టం. రికార్డులు పని మంచిదేను."

సురంగాలున్న చోటుచూసి అతడికుక్కలు మొరిగాయి. అయితే అవాళ రాత్రి టైబర్‌డొనాత్ మంచి ఆలోచనల్లో మునిగివున్నాడు. తుపాకి పేల్చే దృష్టి అతడికి లేదు. "ఈతుపాకి కాల్చే పనిలోంచి ఎలాగైనా వెళ్ళిపోవాలి." అంటూ తనలోతాను మరోసారి అనుకున్నాడు. "మనుషుల్ని కొట్టడం ఇక నాకు పడదు. ఇంతవరకూ చేయవలసిన బండపని అంతా చేశాను. ఇప్పు డేదైనా కొత్తపని ........ పెద్ద కారునడపడంలాంటిది దొరికితే చాలు" అనుకుంటూ అవాళ రాత్రంతా తాను మంచిదుస్తులు తొడుక్కుని, బుడాపెస్టు వీధుల్లో పెద్దకారెక్కి తిరుగుతూవున్నట్టు కలలుకంటూ గడిపాడు.

చివరికి టైబర్ డొనాతుకి ఇష్టంలేని పనే దొరికింది. కాని ఆపనికి డొనాతు తగినవాడని తరవాత జరిగిన ఉదంతంవల్ల తేలింది. బుడాపెస్టులో బుడాభాగంలో డాన్యూబునది కుడిఒడ్డున ఫోస్ట్రీటు అని ఒక వీధి వుంది. ఆవీధిలో కానూత్ వంతెనదగ్గిర ఏ. వి. వోల జైలుంది. అయిదంతస్తుల మేడ అది. నాలుగువందల అడుగుల పొడవుంటుంది. మొదటి రెండు అంతస్తులు గట్టి ఇనపఊచలతో దిట్టంగా వున్నాయి. దాన్నిబట్టి అది జైలని తెలుస్తూనే వుంది. కాని పైకి కనిపించని లక్షణమొకటి ఆమేడకి వుంది. అందులో రెండు భూగర్భ గృహాలున్నాయి. అందులో పైగదిలో డొనాతుకి పని దొరికింది. ఇక్కడ అతడు తన ఆకుపచ్చ లాంఛనాలు తీసేసి, నీలి లాంఛనాలు ధరించాడు. అది నిజమైన ఏవివో మనిషి లాంఛనం. తన ఆశాభంగం కనపడనియ్యకుండా టైబర్‌డొనాత్ ఆపనిలో ప్రవేశించాడు.

"హంగేరీ కమ్యూనిస్టు ప్రభుత్వాన్ని ఫాసిస్టు, కాపిటలిస్టు, రియాక్షనరీలనించి రక్షించడం నీవిధి" అంటూ అతడికి ఆదేశం వచ్చింది. హంగేరీ

కమ్యూనిస్టు నాయకులికి తాను విశ్వాసపాత్రుడుగా వుంటానని ప్రమాణ స్వీకారం చేశాడు డొనాతు. బుడాపెస్టులో ప్రతిరోజూ ప్రభుత్వానికి వ్యతిరేకంగా శత్రువులు ఎలాంటి కుట్రలు పన్నుతున్నారో అధికారులు చెపుతూ వుంటే విని నిశ్చేరపోయేవా డతడు. వెనకటికంటె ఇప్పుడు అతడికి దొరికిన ఉద్యోగం ముఖ్యమైంది.

"కాని మనం శత్రువుల్ని అణిచిపారేస్తాం. ఈ శత్రువులు ఎక్కడెక్కడ వున్నారో వాళ్ళ అచోకీ తియ్యాలి. మిమ్మల్ని అందరినీ సరిహద్దు కాపలాపనినించి ఇక్కడికి ప్రమోషనుఇచ్చి తీసుకువచ్చాం. మీకు ఈపని బాగా తెలుసునని నమ్మకం మాకుంది" అని గర్జిస్తూ గంభీరంగా అన్నాడు ఆఫీసరు.

ప్రభుత్వ శత్రువుల్ని పట్టుకోడానికి బుడాపెస్టు వీధుల్లో విలాసంగా తిరగడం అనుకున్నాడు మొదట డొనాతు. కాని ఆపని చిన్న ఉద్యోగులు చేస్తారని తరవాత తెలిసిం దతడికి. వాళ్ళు పట్టుకువచ్చిన మనుషుల్ని హింసించి వాళ్ళదగ్గరనించి రహస్యాలు పిండేపని తనది.

దీని తరవాత మళ్ళీ ఒక ఆశాభంగం కలిగింది. వాళ్ళని ప్రశ్నించే పనికి తాను తగడన్నారు అధికార్లు "నువ్వు వృత్తి మూగవాడివి. దీనికి పనికిరావు" అంటూ మొహంమీదే చెప్పేశారు. "వాళ్ళతో మాట్లాడే నిపుణులున్నారు. అనుమానం కలవాళ్ళని వాళ్ళదగ్గిరికి తీసుకురావాలి" అన్నారు. ఈ నిపుణులు ఎక్కువ వయస్సువచ్చినవాళ్ళు. సాధారణంగా ఏవివో దుస్తుల్లో వుండరువాళ్ళు. అఖండమైన తెలివితేటలు వాళ్ళవి. పట్టుబడ్డ శత్రువుల్ని మాటల్లో పట్టికొట్టించి రహస్యాలు లాగడంలో వాళ్ళు చూపించే చాతుర్యానికి డొనాతు ఆశ్చర్యపోయాడు.

తీసుకువచ్చిన ఖైదీలతో నిపుణులు మాట్లాడడానికి వచ్చినపుడు వాళ్ళని మాట్లాడడానికి సిద్ధపడేటట్టు చేయడం డొనాతుపని. అతడిపద్ధతి చాలా తిన్ననైంది. అతడి గదిలోకి ఖైదీవస్తాడు. ఖైదీ భయపడి వుంటాడు. ఏమవుతుందో అనే అదుర్దా వుంటుందతడికి. అక్కడినించి తప్పించుకుపోవడం కాని, ఏదైనా రహస్యం దాచడంకాని ఎంతమాత్రం సాధ్యంకాదని డొనాతు అతడికి నూరిపోస్తాడు. "ఇక్కడికి ఏజడ్జీ రాలేడు. నువ్వు ఎక్కడన్నావో నీకుటుంబానికి తెలియదు. ఒక్క సంవత్సరందాకా నువ్వు ఎవ్వరి

తోనూ ఉత్తరప్రత్యుత్తరాలు జరపలేవు. నువ్వు ఇంకా ఎన్నాళ్ళుంటావో నేనుతప్ప మరి ఎవ్వరూ నీతో చెప్పలేను. నువ్వు చచ్చేదాకా ఇక్కడున్నా నాకు పోయేదేమీలేదు. నిన్ను నేను కొట్టగలను; పస్తు పడెయ్యగలను. నీకు స్పృహతప్పిపోయేదాకా బాధపెట్టగలను. నువ్వు ఏడిచినా కేకలువేసి మొత్తుకున్నా వినేవాళ్ళు ఎవ్వరూలేరు. నేను ఏంచేశానో ఎవ్వరూ తెలుసుకోలేరు. నీదగ్గరనించి నాకు కావలిసింది ఒక్కటే. అది సమాచారం. మా ఇన్స్పెక్టరు తనకి కావలిసిన సమాచారం అడుగుతాడు. ఏమీ వెనకాముందూ ఆడకండా చెప్పెయ్యి" అంటాడు డొనాతు, ఏమిచలించకండా.

అతడు ఇది చెప్పినప్పుడల్లా ఖైదీ బానిసలా ప్రవర్తిస్తాడు. తనని తంతారేమో అన్న భయం అతణ్ణి పట్టుకుంటుంది. కాని అది ప్లానేకాదు. జైబరు అతణ్ణి ఒక మంచం పట్టేటంత చిన్న అరలోకి తీసుకు వెళతాడు. దానికి కిటికీలుండవు. అందులో నీళ్ళుండవు. ఒక పెద్ద ఇనపతలుపు వుంటుంది తొంగిచూడ్డానికి. దానిలో రంధ్రాలుంటాయి. జాజ్వల్యమానంగా ప్రకాశించే దీపం వెలుగుతుంది అది ఆర్పడమంటూ వుండదు.

"ఇదిగో, ఇక్కడ నువ్వు ఒంటరిగా వుండాలి. వెల్లకిలా పడకోవాలి. మరోలాగ పడుకోడానికి వీల్లేదు. చేతులు తిన్నగా చాచివుంచాలి. మరోలా వుంచడానికి వీల్లేదు. తలుపువేపు వీపుచేసి ఎప్పుడైనా పడుకున్నావా, కాపలావాడు పొడుస్తాడు. ఖైదీలు బూట్లుకు లేసుగాని, బెల్టుగాని, టైకాని వుంచడానికి వీల్లేదు. నువ్విక్కడ చచ్చావా సరేసరి!" అంటాడు జైబర్ డొనాతు.

డొనాతు దగ్గిరికి రాకపూర్వం కాపలావాళ్ళే ఖైదీలని మెత్తపరుస్తారు. వాళ్ళపద్ధతులే చాలామట్టుకు పనిచేసేస్తాయి. వాళ్ళుచేసే మొదటిపని కాలవివక్షతలేకండా చెయ్యడం. అప్పుడప్పుడు పగలు పందొమ్మిదిగంటల దీర్ఘం కావచ్చు: మర్నాడు పద్నాలుగుగంటలు కావచ్చు; ఆతరవాతరోజు పగలు ముప్ఫయి ఆరుగంటలు కావచ్చు; మూడుగంటల రాత్రి కావచ్చు. ఎప్పుడూ కళ్ళల్లో జ్వాలలా దీపం వెలుగుతూనే వుంటుంది. కాలవివక్షత నశించిన తరవాత తక్కింది సులభంగా అయిపోతుంది.

ఇలా ముప్ఫయి నలభైరోజులు జరిగినతరవాత ఖైదీని మరొక ఇరుకు గదిలోకి తీసుకుపోతారు. ఇందులోకూడా అలాంటి దీపమే వెలుగుతూ వుంటుంది. కాని కూర్చోడానికాని, పడుకోడానికి కాని అందులో అవకాశముం

డదు. ఇందులో మూడురోజులదాకా తిండి పెట్టరు. కూచుని, మలమూత్రాలు విసర్జనచేసి అందులోనే నుంచోవాలి. వస్తున్నకాలంలో గ్రీజుతోకూడుకున్న ఆహారపదార్థాలు పెడతారు. దాంతో జబ్బుచేస్తుంది. బాగా ఉప్పు వేసిన పదార్థాలూ పెడతారు. దాంతో ఆతడిబాధ విపరీతం అవుతుంది. తినే కంచంలోనే మలమూత్ర విసర్జన చేయమని బలవంతం చేస్తారు. దాంతో అతడి వ్యక్తిత్వం పూర్తిగా నశిస్తుంది.

ఇదంతాఅయాక తిరిగి అతణ్ణి టైబర్‌డొనాతు దగ్గిరికి తీసుకువస్తారు. అక్కడ గోడకి వరసగా రబ్బరుకొరడాలు వేలాడుతూవుంటాయి. వాటి కొనలు ఇనపవి. "వీటిలో నీకు ఏదికావాలో చూపించు" అంటాడు డొనాతు. తరవాత ఒకకొరడా తీసుకుని చచ్చేటట్టు బాదేస్తాడు. ఒక్కొక్కప్పుడు అతడు రాక్షసుడే అయిపోతాడు. తలమీద, మొహంమీద—ఎక్కడపడితే అక్కడ పడబాదేస్తాడు. అతడికళ్ళు చింతనిప్పులయిపోతాయి. దెబ్బలు సహించలేక ఖైదీ పడిపోతాడు. డొనాతు అతడిమీద నీళ్ళుపోస్తాడు. కొంచే పటికి ఖైది లేస్తాడు; నిలబడతాడు. అప్పుడు అంటాడు :

"ఈసారి ఇన్స్పెక్టరు వచ్చినప్పుడు అయనతో సరిగ్గా మాట్లాడు."

తరవాత ఖైదీని అవేకొట్లో బంధించేస్తారు— రాత్రీ పగలూ తెలియని ఆకొట్లో, మండుతూన్న దీపాలున్న ఆకొట్లో, సంపూర్ణమైన పరాభవంతో కూడుకున్న అకొట్లో బంధించేస్తారు. టైబరు రాక్షసదండనకి ఖైదీ ఎముకలు విరిగిపోతాయి. కాని టైబరు ఏమీ పట్టించుకోడు. ఎముకలు విరిగిపోతే విరిగినవాళ్ళే చూసుకోవాలి. అక్కడ డాక్టర్లు వుండరు. ఖైదీచస్తే, ఎలాచచ్చాడని అడిగేవాళ్ళుండరు.

ఒకసారి ఖైదీ బతికి బైటపడ్డాడా, టైబరు అతడిజీవితం దుర్భరమయ్యేటట్టు చేసేస్తాడు. అంతులేకండా కొట్టడం, యమయాతన పెట్టడం, నీళ్ళు పోయడం, మానసికమైన ఒత్తిడిచేయడం — ఇదంతాచేసి. ఇవికాక ఆదివారాలుకూడా వున్నాయి.

ఆదివారం కాపలావాళ్ళకి సెలవుకనక, ఖైదీలు చాలామంది, ఇంకా ఆదివారం ప్రియంగా భావిస్తారు కనక ఆరోజు కావాలని హింసాకార్యక్రమం మరీ హెచ్చిస్తారు. ఆవాళ భోజనాల తరవాత కాపలావాళ్ళు అయిదారుగురు ఖైదీలని పిలిచి ఏవేవో ఆటలు ఆడారు. టైబరుకి కోపం వచ్చింది. తను

స్వయంగా ఆడలేడుకనక మరెవరైనా ఆడుతూవుంటే అతడి పెళ్ళు మండుతుంది. అదీకాక, పొగరుబోతు ఖైదీ ఎవడైనా నిలబడివుండగా కాపలావాడు అతడి మూతిమీద పెక్కటివేసి కిందపడగొట్టడంచూస్తే అతడి రాక్షసానందం కలుగుతుంది. ఖైదీ కదలకండా వుండాలని నియమం కనక కాపలావాడు గురితప్పకండా మొహంమీద గుద్దవచ్చు.

కొన్ని ఆదివారాలు టైబర్ ఇలాంటి గుద్దులాటే చూసి పంకలు గుద్దేవాడు. ఒక్కొక్కప్పుడు తిరగబడ్డ ఖైదీని వెంటనే తీసుకురమ్మని చిన్న కాపలావాళ్ళని కేకలువేసేవాడు. వాళ్ళు తీసుకురాగానే ఇనపకొసల కొరడాతో తలమీద చావబాదేవాడు. ఒకొక్కొక్కసారి ఖైదీ తెలివితప్పి పడిపోయేవాడు. మొహం నించీ, నెత్తిమీంచీ రక్తం వరదలు కట్టేది.

ఆదివారం హింసాకాండలో అత్యంతం క్రూరమైన పద్ధతి కనిపెట్టాడు టైబరు. కాపలావాళ్లు పెక డజను మంచిఖైదీలని ఒకేసారి తీసుకువచ్చి వరసగా నిలబెట్టాలి. వాళ్ళముందు కళ్ళు మిరుమిట్లుకొలిపే దీపాలు పెట్టాలి అలా దీపాలు పెట్టాక "ఇప్పుడు పెంటికాలుమీద నిలబడండి" అని అతడు ఖైదీలని ఆజ్ఞాపించేవాడు. నిప్పుల్లా కనకనలాడుతూవున్న దీపాలు పెంటికాళ్ళమీద నుంచున్న ఖైదీల మనస్సు బేజారు చేసేసేవి. ఒకడుగావుకేకలు వేసేవాడు. మరొకడు మూర్ఛపోయేవాడు. మరొకడు పిచ్చినాట్యం ప్రారంభించేవాడు. ఏమైనాసరే, ఏఖైదీఅయినా కొంచెం కదిలాడా, తక్కిన వాళ్ళందరూ ఘోరంగా దెబ్బలు తిన్నారన్నమాటే. కదిలినవాడు మాత్రం దెబ్బలు తినడు. అంచేత తక్కినవాళ్ళకి ఎక్కడ దెబ్బలు పడతాయో అని ఎవ్వడూ కదలడు అంతకీ ఎవ్వడైనా మూర్ఛపడి కిందపడిపోయాడో, తక్కిన వాళ్ళు మూర్ఛపడేట్టు కొట్టేవాడు టైబరు.

ఖైదీలందరూ మూర్ఛపడి పోయినప్పుడుగాని లేదా వాళ్ళ మతి చెల్లించినప్పుడు గాని కాపలావాళ్ళు కేకలు వేసేవాళ్ళు.

మొండి ఖైదీలని లొంగదియ్యడం కోసం టైబరు మరికొన్ని మార్గాలు కనిపెట్టాడు. ఖైదీని గోడవేపు మొహంచేసి నిలబెట్టేవాడు. అతడి కళ్ళల్లో కొరివిలాటి వెలుతురు పడేట్టు చేసేవాడు. ఒక పెన్సిలు సన్నంగా చెక్కి, చెక్కిన మొన నుదుటికీ, రెండోకొన గోడకీ ఆనించి వుంచేవాడు. పెన్సిలు కిందపడకుండా ఖైదీ అలాగే నిలబడి వుండాలి. "పెన్సిలు కిందపడిందా

చావమోదుతాను అనేవాడు డొనాతు. పెన్సిలుమొన గొడకి నొక్కుతూ ఖైదీ అలాగే నిలబడతాడు. ఇలా రెండుమూడు గంటలు నిలబడేసరికి పెన్సిలుమొన నుదుట్లో బాగా గుచ్చుకునేది.

ఆదివారపు శిక్షలు ఇంకా వున్నాయి. వాటికి తలుచుకోడానికి టైబరు కూడా ఇష్టపడడు. తన పడుచుతనం వచ్చినప్పటినించీ ఆడపిల్లలంటే అంతగా పట్టించుకునేవాడు కాడతడు. ఫోస్ట్రొటులో ఈ జైలుకి వచ్చిన తరువాత ఆడపిల్లలంటే అతడికి అసహ్యమే పుట్టింది. ఏమంటే, ఆదివారం ఆడకాపలావాళ్ళు కొంతమంది ఖైదీలను పెట్టేబాధలు మొగాళ్ళ బాధల కంటే ఎక్కువ కఠినంగానూ, ఎక్కువ అసహ్యంగానూ వుండేవి. కొంత మంది మొగఖైదీలను వాళ్ళు తమ ఇళ్ళకి ఈడ్చుకుపోయి, బట్టలు విప్పిం చేసేవాళ్ళు. తరువాత వాళ్ళని హింసించే విధానాలు మొగకాపలావాళ్ళు కూడా చెప్పుకోడానికి సిగ్గుపడేవాళ్ళు. హింసించడానికి చాకులూ, డిన్నులూ, సిగరెట్లు వెలిగించుకునే లైటర్లూ ఉపయోగించేవాళ్లు. వాళ్ళు చేసేపనులు చెప్పడానికి మొగవాళ్ళే వణికిపోయేవాళ్ళు.

"ఇవన్నీ ఆపుచేయించాలి ఎవరైనా" అన్నాడు ఒకనాడు టైబరు. అదే అతని పతనానికి కారణమైంది. ఎవడో ఒక గూఢచారి ఈ మాట జైలు అధికార చెవిలో వూదాడు. డొనాతునికి వెంటనే పిలుపు వచ్చింది.

జైలు అధికారి బక్కపలచటి మనిషి. నన్నటిముక్కు తీక్షణమైన కళ్ళు—అతణ్ణి చూస్తే భయం వేస్తుంది.

"నువ్వు ఆడకాపలా వాళ్ళకి వ్యతిరేకంగా మాట్లాడావా? అధికారి అడిగాడు.

"నేను ఊరికే ఏమన్నా నంటే........"

"నోరుముయ్యి! అబద్దాలకోరా!" బక్కపల్చటి అధికారి గద్దించాడు చప్పునలేచి, ఒకరిపోర్టుతెచ్చి అతని చేతికిచ్చాడు. "ఇదిచూడు" అంటూ పిచ్చివాడిలా అరిచాడు.

" ఆడకాపలావాళ్ళ పద్ధతులవల్ల ప్రభుత్వ శత్రువులు సులభంగా లొంగుతున్నారనీ. మొగకాపలావాళ్ళ పద్ధతులతో ఎంతమంది లొంగుతు న్నారో అంతకి రెండింతలు మంది ఆడకాపలావాళ్ళ పద్ధతులకి లొంగుతు న్నారనీ లెక్కలు చూపించా డతడు.

"నువ్వు ప్రభుత్వానికి శత్రువివా ?" అని అరిచాడు అధికారి.

"కాను. నా రికార్డు చాలా బాగుంది" అన్నాడు డ్రైబరు.

"అవును నీ రికార్డు మంచిదే. అంచేతే నిన్ను డిస్మిస్ చెయ్యలేదు. కాని ప్రభుత్వ శత్రువులంటే అర్ధంలేని సానుభూతి చూపించిన వాళ్ళు కూడా ప్రభుత్వ శత్రువులే అవుతారని జ్ఞాపకముంచుకో నిన్ను రెస్కికి పంపిస్తున్నాను.

మొండిబారివున్న డ్రైబరు నిశ్చలంగా నిలబడ్డాడు. ఏమీ చలించకుండా అన్నాడు—"సరే"

ఒకటి రెండు సంవత్సరాలు రెస్కిలోవుంటే ప్రభుత్వ శత్రువులు ఎంతటి అసహ్యమైన దుష్టులో వాళ్ళు మన సానుభూతికి ఏ మాత్రం ఎందుకు తగరో నీకే తెలుస్తుంది. నువ్వు తిరిగి వచ్చేసరికి ఇంకామంచివాడవవుతావు.

డ్రైబరు దొనాతు ఇంటికి వెళుతూ తన సహోద్యోగు లందరినీ ఎంతో ద్వేషపూరితమైన కళ్ళతో చూశాడు. వాళ్ళలో ఎవడో ఒకడు అతడిగుట్టు బైట పెట్టాడు. అతడిమీద చాడీలు చెప్పాడు. వాళ్ళలో ఒకడు హంగేరీలో ఎంతో ఘోరమైన జైలుకి తనని ట్రాన్స్ఫరు చేయడానికి కారకుడయాడు. ఆజైలు అందులో వున్నవాళ్ళకీ, దాని పరిపాలకులికి కూడా ఘోరమైందే తాత్కాలికమైన లాభంకోసం, ఎవడో తోటివాడే ఒకదుష్టు తనని బైటపెట్టాడు. అయితే అలాఅని పైకి చెప్పుకోడానికి వీల్లేదు. తనగుట్టు మరొకడు బైట పెట్టాడని భావించడానికే వేల్లేదు.

తనతోటి వాళ్ళని ఒకరొకరినే చూస్తూ "వీళ్ళలోనే ఒకడు చేశాడీపని. ఏదో ఒకనాడు ఎవడో తెలుస్తుంది. అప్పుడు వాడిపీక పిసికేస్తాను. వాడిగుడ్లు పిదివేస్తాను. అంటూ తనలో తాను ప్రతిజ్ఞ చేసుకున్నాడు. పిచ్చికోపం వస్తుందేమో అని ఆవేశం ఆపుకున్నాడు.

తనలో రేగుతున్న తుఫాను అణుచుకుంటూ "నేను రెస్కికి వెళుతున్నాను," అని వూరుకున్నాడు.

వాళ్ళెవ్వరూ చలించలేదు. "అయ్యో" అంటే ఏమి చిక్కువస్తుందో అని వూరుకున్నారు కొంతరు. వెళుతున్నాడని సంతోషం ప్రకటిస్తే బయట పడతామని వూరుకున్నారు కొందరు. ద్వేషంతో మండిపోతూనే డ్రైబరు

దొనాతు ప్రయాణానికి మూటాముల్లే కట్టాడు. ఆవాళరాత్రి అతణ్ణి తీసుకు వెళ్ళడానికి ఒక ట్రక్కు వచ్చింది. భయంకరమైన రెన్కుజైలు అక్కడికి యాభై మైళ్ళుంది.

ఫాస్ట్రీటులో తన నివాసం వొదిలిపెట్టి దొనాతు వెళుతూ వుంటే ఆతడి స్నేహితులందరూగేటుదగ్గిర నిశ్చలంగా నిలబడి చూశారు. మనుషులికి వుండవలసిన ఆవేశం ఏమీ మొహాల్లో ఏనరంతా అవుపించలేదు. వాళ్ళ వైపు చూస్తూ దొనాత్ కూడ నిశ్చలంగా ట్రక్కులో కూచున్నాడు, తనగుట్టు బైట వేసినవాడు పట్టుబడతాడా అని.

"ఎప్పుడో ఒకప్పుడు పట్టుకుంటాను. అప్పుడు వాడిగుండె పీకేస్తాను. అంటూ అతడు ప్రతిజ్ఞ చేసుకున్నాడు. అలా అతడు తనలో తాను మండి పోతూ రెన్కు చేరేసరికి మానుషాదు డైపోయాడు. అది అతడు కొత్తపనికి మంచిదే అయింది.

ఖైబరు దొనాతును రెన్కు తీసుకువెళ్ళిన ట్రక్కులో ఫెరెన్కు గాబరు అని ఒక రాజకీయ ఖైదీకూడా వున్నాడు. ఒక పెట్టెలాంటి అరలో అతణ్ణి పడేసారు. ఒక జంతువులా అందులో అతడు పడివున్నాడు. ఆ పంజరంలో అతణ్ణి తాళ్ళువేసి కట్టేశారు. నోట్లో గుడ్డలు కుక్కారు. చేతులికి ఇనపగొలుసులు వేశారు. అతడు చేసిన అపరాధమేమిటో అందరూ మరిచిపోయారు. మాట్లాడని మనిషి అని మాత్రం అతణ్ణి గురించి అనుకునేవారు. ఫాస్ట్రీటు జైల్లో అతడి కాపలావాళ్ళు చెప్పిన చివరిమాటలు ఇవి :

"జయ్! మూగీ! రెన్కులో నీమూగి వొదులుతుందిలే!"

ఏ వివేల ఈ చివరి జైలుగురించి ఫెరెన్కుగాబరు చెప్పిన మాటలే ఇక్కడ ఉదహరిస్తాను. గాబరు ముప్ఫయి అయిదేళ్ళమనిషి. నేను వియన్నాలో అతణి కలిసినప్పుడు అతడు పూర్తిగా కూలిపోయి వున్నాడు. రెన్కులో అతడు గడిపిన సంవత్సరాల గురించి అత డిలా చెప్పాడు:

రెన్కు గ్రామానికి అయిదుకిలోమీటర్ల దూరంలో వుంది. ఆ భయంకరమైన జైలు దాని ప్రధానద్వారం ప్రవేశించాం. అందులో నేను మూడేళ్ళు గడపవలసి వుండేది. అక్కడ నాకు ఒక యూనిఫారం ఇచ్చాడు. నేను ఉన్నంతకాలం అదే యూనిఫారం నాకు. అది వొంపాత ఏవివోసూటు. దాని కాళ్ళమీదవున్న పట్టీలు తీసేశారు. వాటికి బదులు ఎర్రటిపట్టీలు చుట్టారు.

భుజంమీది లాంఛనాలు కత్తిరించేశారు. మొత్తానికి ఒకకాకి యూనిఫారమే అది. అదివేసుకున్నాడు.

రెన్కుజైలు సమచతుర్భుజంగా వుంది. ప్రతీదిక్కూ వెయ్యి అడుగుల పొడవుంటుంది. దానిలోంచి బైటపడడం అసాధ్యమని ప్రతీతి. అయినా ఒకసారి ఒకజట్టు ఖైదీలు అందులోంచి వుడాయించారు. జైలుచుట్టూ తొమ్మిదడుగుల ఎత్తు ముళ్ళతీగకంచె వేసివుంది. దానికి విద్యుచ్ఛక్తి తగిలించారు. దానికి ముప్పయిగజాల అవతల మరొక కంచెవుంది. దానికి విద్యుచ్ఛక్తి తగిలించారు. యాభైగజాల అవతల మరొకటి అదీ అలాంటిదే ఈ మూడు కంచెలూ ఎవడైనా దాటవచ్చు. రబ్బరుపడివేసిన వైరుకట్టరు సహాయంతో దృఢనిశ్చయంకల ఖైదీ ఎవడైనా దాటవచ్చు. కాని మొదటి కంచెకీ రెండవకంచెకీ మధ్య మందుగుండుకూరిన సొరంగా లున్నాయి. అక్కడ అడుగువేస్తే ధామ్మని పేలిందన్నమాటే సొరంగం. మధ్యకంచెమీద ప్రతి యాభైగజాలికీ బురుజు లున్నాయి. వాటిమీద మరఫిరంగులూ, సెర్చి లైట్లూ వున్నాయి.

లోపలికంచె బోర్డుమీద ఇలావుంది: "జాగర్త! ఈ కంచె ముట్టుకుంటే కాలిపోతారు."

బైటి కంచెమీద ఇలా వుంది: "ప్రభుత్వం ఆస్తి. లోపలికి రాకూడదు లోపల అడుగుపెడితే అడక్కుండా పేల్చేస్తారు." ఇది అదారిని పోయే గ్రామస్థులికి హెచ్చరిక.

"రెన్కుజైలు నరకం కావడానికి ఈ కంచెలు కారణంకాదు. లోపలి స్థితే దానికి కారణం. బాగా ముక్కాకలుతీరిన ఏవివో మనుషుల్నే ఇక్కడ నియమించారు. రెన్కులో పనిచేయడం శిక్షగా భావించాలి. అంచేత వాళ్ళు జీవితాలు నరకప్రాయం చేసేస్తారిక్కడ. చావువస్తేబతికిపోదుమని ప్రార్థించే వాళ్ళం మేం. బుడాపెస్టు జైల్లో మేం అనుభవించింది దీనిముందు ఏమీ కాదంటే నమ్మండి.

"కాంపౌండుకి ఒకమూల 280 అడుగుల ఎత్తు రాతిగుట్ట ఒకటి వుంది. ఈ గుట్టని కంకరగా మార్చేపని మాకిచ్చారు. సన్నగాకొట్టి జల్లెడలో జల్లించి వాళ్ళకి అప్పజెప్పాలి. ప్రతీమనిషీ రెండుతోపుడు బళ్ళనిండా అలాంటి సన్నకంకర ఇవ్వాలి. మాకు కళ్ళద్దాలులేవు. రాతిపెంకులు తుళ్ళి

కళ్ళకి తగిలేవి. చాలామంది కళ్ళుపోయాయి కూడా. అయినా వాళ్ళకి పని మాత్రం తప్పలేదు. అంతపనికి తగినట్టు తిండి వుండేదికాదు. మేం చస్తే వాళ్ళకి లెక్కవుండేదికాదు. ప్రతీ ఖైదీ మొదటిఏడే దాదాపు 70 పౌన్లు తగ్గి పోయేవాడు.

"నా వంతు కంకర ఇవ్వకపోతే రాత్రంతా మోకాలిలోతు నిలబడి వుండాలి. రాత్రంతా నిద్రలేని నాతో కాపలావాళ్ళు ఆడుకోవాలంటే నూరు పౌన్లరాయి నెత్తిమీద పెట్టుకొని పదిహేనుసార్లు నేను నిచ్చెనఎక్కి దిగాలి. మూర్ఛపోయి పడిపోతే, తేరుకున్న తరువాత లేచి మళ్ళ ఇదేపని చెయ్యాలి.

"అన్నిటికంటే ఘోరమైన శిక్ష మరొకటి వుండేది. మాఖైదీల్లోనే కొందరిని మామీద గూఢచారులుగా పెట్టేవాళ్ళు. మేం ఏంచెప్పినా, ఏం చేసినా – ఏం చెప్పబోయినా సరే, ఇట్టే వాళ్ళకి తెలిసిపోయేది. ఈపనిచేసే వాళ్ళకి అదనపు ఆహారం ఇచ్చేవాళ్ళు.

"మేం ఉదయం నాలుగున్నర మొదలు రాత్రి పదేదాకా పనిచేసే వాళ్ళం. మధ్యాహ్నం భోజనంకోసం కొంచెం విరామం దొరికేది. పని అయాక మాగదుల్లోకి తీసుకువెళ్ళేవాళ్ళు. లోపనిజైల్లో చిన్నచిన్నగదులూ, రెండు కాంపౌండులూ వున్నాయి. ఒక్కొక్క కాంపౌండులో ఎనభయ్యేసి మందిని కుక్కేవాళ్ళు. నేనున్న మూడేళ్ళూ, మాకు పుస్తకాలుకాని, కాగితాలుకాని, పెన్సిళ్ళుకాని, రేడియోవార్తలుకాని, వార్తాపత్రికలుకాని, ఇచ్చిన పాపాన పోలేదు. మమ్మల్నివచ్చి ఎవ్వరూ చూడడానికి వీల్లేదు. మాకెవరూ ఉత్తరాలు రాయడానికి వీల్లేదు. మేం ఎక్కడున్నామో మావాళ్ళకి తెలియ చేయడానికి వీల్లేదు. మేమందులో ఎన్నాళ్ళున్నదీ మాకు తెలియదు. ఎందుకున్నామోకూడా తెలియదు. భయానక పరిస్థితిలో బతికాం. మాతోటి ఖైదీలతోకూడా ఏవిషయమూ పల్లెత్తి మాటాడుకోలేదు. దానికి వీల్లే దసలు. ఏమన్నా మాట్లాడుకున్నామో ఏవిహోవాళ్ళకి ఇట్టే ఉప్పందిపోయేది.

"నెలలు గడిచాయి. ఒక్కొక్కనెలా గడుస్తుంటే మేం నీరసిస్తూ వుండేవాళ్ళం. పనిచేయడానికి ఒంట్లో సత్తువ నశిస్తూవుండేది. నిద్రపోవాలన్నా సరిగాపట్టేది కాదు. రాత్రి మమ్మల్ని ఏవిహోవాళ్ళు ఆటకోసమో, ప్రశ్నించడంకోసమో పిలిచినప్పుడుమాత్రమే మా దినసరి కార్యక్రమంలో

కొత్తఅంశం ఒకటివచ్చేది. అక్కడ ఏవివోవాళ్ళు మమ్మల్ని కొట్టేవాళ్ళు, తిట్టేవాళ్ళు, పరాభవించేవాళ్ళు. మమ్మల్ని మాట్లాడమని అరిచేవాళ్ళు. కాని దేన్నిగురించి మాట్లాడమంటున్నారో మాకు తెలిసేదికాదు.

"ఒకనాటి రాత్రి సైబరు అనే కావలివాడు రాక్షస క్రౌర్యంతో నన్ను కొట్టాడు.

"వీణ్ణి తెల్లగుర్రం చేద్దాం" అన్నా డొకడు. నామోకాలి మడమల్లో ఒక చీపురు పెట్టారు. నన్ను ఒక బంతిలా మడిచారు. నామడమలూ, మణి కట్లూ కలిపి కట్టేశారు. ఈ శిక్షంటే మాకు చచ్చేటంత భయంవేసేది. గుండె ల్లోనూ, కడుపులోనూ దుర్భరమైన బాధ కలిగేది. ఆస్థితిలో రెండుగంటల కంటె అధికంగా ఎవరూ బతకలేరు. వాళ్ళకి సరదాపుడితే ఎవణ్ణోఒకణ్ణి "తెల్లగుర్రం"చేసి, తరవాత అతణ్ణి మరిచిపోతారు. అతడు దిక్కూమొక్కూ లేకండా చచ్చిపోతాడు.

"మామ్మూలుగాకూడా ఈ శిక్ష దుర్భరం. కొంచేపు మోకాళ్ళమీద అని కూచుంటేనే ప్రాణంమీదికి వస్తుంది. దానిమీద కొరడాలతో వ్రేళ్ళమీద కొడు తూవుంటే మనిషి దొర్లిపోతాడు. శరీరం ఏభాగం మీదికివుంటే ఆభాగంమీద దెబ్బలు పడుతూవుంటాయి.

"అవాళ రాత్రి నాతోపాటు మరొకణ్ణికూడా తెల్లగుర్రం చేశారు. అతడి ఒళ్ళంతా వాచి తిమ్మిరెక్కేదాకా కొట్టారు. కాలుతూన్న ఒక పొయ్యిదగ్గిరికి అతణ్ణి దొర్లించుకుంటూ వెళ్ళారు. అతడి ఎడమచెయ్యి పొయ్యికి తగిలి చుర్రుమంది. రెండువేళ్ళు కాలిపోయాయి. పాపం, అతడికి ఆసంగతి తెలి యనే తెలియదు. అతడి వేళ్ళూ, అరిచెయ్యీకూడా కాలిపోయాయి. మాడు మాంసం వాసన వేశాకే అతడికాసంగతి తెలిసింది. ఏవివోవాళ్ళ కానంగతి తెలుసు. వాళ్ళు నవ్వుతూ తమాషా చూశారు.

"మామీద ప్రయోగించిన క్రూరమైన ట్రిక్కులలో ఒకటి కేవలం మానసికమైంది. రాయికొట్టినందుకు మాకు ప్రతినెలా మంచికూలి ఇచ్చే వాళ్ళు. కూలి ఇచ్చేననాడు ఏవివోవాళ్ళు మాకు ఉపన్యాసాలిచ్చేవాళ్ళు. 'ఖైదీలచేతకూడా కమ్యూనిజం బానిసపని చేయించదు పెట్టుబడిదారులు మాత్రమే అలాచేస్తారు' అని. అయితే తరవాత మాభోజనానికనీ, బనలకనీ, దీపాలకనీ. మాకావలివాళ్ళ జీతాలకనీ అంతా గుంజుకునేవాళ్ళు. నెలకీ ఒక్క సిగరెట్టుడబ్బాకోసం సరిపోయినంతమాత్రం విడిచిపెట్టేవాళ్ళు. కాని రెన్కు నించి పంపించే రిపోర్టుల్లోమాత్రం ఖైదీలకి మామ్మూలురేటుప్రకారం కూలి ఇస్తున్నట్టే వుంటుంది.

“ఒకజట్టు ఖైదీలు రెన్కు జైలునించి పారిపోయారని వెనక చెప్పాను. ఒక దర్జీవుండేవాడు. కష్టపడి ఒక పాత ఏవివో యూనిఫారం నిజమైన ఏవివో యూనిఫారంగా తయారుచేశా డతడు. ఎలాగో వోలాగ ముక్కలతో ఒకటోపీ తయారుచేశాడు. ఏవివోల చిహ్నాలూ అవీకూడా తయారుచేశాడు. పూర్తిగా ఏవివో యూనిఫారం తయారైంది. తరవాత ధైర్యసాహసాలుకల కొంతమంది ఖైదీలని వెంటపెట్టుకుని అతడు ధైర్యంగా ప్రధానద్వారం లోంచి బైటికి వచ్చేశాడు. ‘డైనామైట్ తీసుకురావడానికి వెళుతున్నాం’అని కాపలావాళ్ళకి చెప్పాడు. అతడు నిజంగా ఏవివోమనిషే అనుకుని వాళ్ళు వెళ్ళనిచ్చారు. బైటపడడమే తడువు, అడివిదార్లుపట్టి వాళ్ళు స్వాతంత్ర్యం సంపాదించుకున్నారు.

“ఇది బైటపడ్డాక ఏవివోవాళ్ళు మరీరాక్షసులైపోయారు. ఎవడు కిక్కురుమని నోరెత్తినా, పిసరంత నవ్వినా, భోజనంవేళ అటూఇటూ పచారు చేసినా అందరినీ—250 మందినీ— పట్టుకుని ప్రత్యేకశిక్ష వేసేవాళ్ళు. వెనకటి రెండువారాల్లో నిర్ణీతమైన పని చెయ్యనివాళ్ళనికూడా పట్టుకునే వాళ్ళు. అందరూ హడిలిపోయారు. శిక్ష ఎంత రాక్షసంగావుంటుందో అందరికీ తెలును. ప్రతీ ఒక్కడూ పక్కవాడిమీద ఏదోచెప్పి, తన శిక్ష తప్పించుకుందామనే ప్రయత్నించాడు.

“ప్రారంభంలో శిక్ష అంత కఠినంగా లేదు. 250 మంది ఖైదీలనీ ఒక ప్రత్యేకమైన కొట్టుకి తీసుకువెళ్ళారు. ఎంతో కఠినంగా వుంటుందను కున్న శిక్ష అంత కఠినమైందిగా తోచలేదు. కాని క్రమంగా ఒక వారంరోజులు గడిచేసరికి, క్రమంగా శిక్ష కఠినమవుతూ వచ్చింది. కొట్టడమూ, పురుగుల అన్నం వెయ్యడమూ, గుహ్యాంగాల్లో హింసించడమూ—ఇలా క్రమంగా హెచ్చిస్తూవున్న శిక్షచూస్తే, 250 మందినీ అరుస్తున్న జంతువులుగా రెన్కు ఏవివోవాళ్ళు మార్చెయ్యాలని చూస్తున్నా రనిపించింది. వాళ్ళ ప్రయత్నం సఫలమైందికూడాన్నూ. ఆప్రత్యేక కారాగృహం అనుభవం ఎంత భయంకర మైందంటే, దాన్ని ఊహించడమే కష్టం. చెప్పినా నమ్మలేరు. ఆ దారుణ హింసలకి రెండు నెలల్లో అందరూ పిచ్చివాళ్ళయిపోయారు. వాళ్ళకి ప్రతి రోజూ మాంసంముక్కలు వేస్తూవుండేవాళ్ళు. ఆముక్కలకోసం వాళ్ళు ఒకళ్ళమీద ఒకళ్ళుపడి రక్కుకుని, గిల్లుకుని కుక్కల్లా కాట్లాడుకుంటూ వుంటే కాపలావాళ్ళు విరగబడి నవ్వుతూవుండేవాళ్ళు. లౌడ్‌స్పీకరుమీద ప్రకటించేవాళ్ళు: “మీ మిత్రులు పారిపోయినందుకు మీకు ఈ శిక్ష.”

"పారిపోయిన దర్జీమీదా, అతడి వెంటవెళ్ళినవారిమీదా రగిల్చిన ద్వేషాగ్ని ఇంతాఅంతా కాదు. ఇది క్రమంగా పైశాచికద్వేషంగా మారింది. మూడు నెలలతరవాత పారిపోయినవాళ్ళలో ఒకడు దొరికిపోయాడు. అతణ్ణి పట్టుకువచ్చి అగుంపులో పారేశారు. లౌడ్‌స్పీకరు ఇలా ప్రకటించింది: "పారిపోయినవాళ్ళలో వీడొకడు. ఇదిగో వీడివల్లే మీకు ఈకష్టాలు."

"ఈ ప్రకటన జరిగిన రెండు నిమిషాల్లో ఆ దౌర్భాగ్యుణ్ణి ఖైదీలు చీల్చిపారేశారు."

"ఈప్లానువేసిన ఏవివో మనుషుల్లో టైబరుడొనాతు ఒకడు. రెస్కోలో సంవత్సరాలపాటువుండి బుడాపెస్టులో చూపిన మెత్తవనం కనపరిచే శక్తి కూడా పోగొట్టుకున్నా డతడు. రెస్కోలో రాత్రిళ్ళుజరిగే క్రౌర్యవాతావరణంలో కాపలావాళ్ళు జతలుజతలుగా ఏర్పడ్డారు. పడుచుకావలివాళ్ళు జట్టువచ్చి నప్పుడల్లా పాతకావలివాళ్ళు వాళ్ళని శ్రద్ధగా పరికించేవాళ్ళు. అలాంటి ఒక సందర్భంలో టైబరు ఒక అందమైన యువకుణ్ణి చూశాడు. అతడితో నేస్తం కట్టాలని ప్రయత్నించా డతడు. యువకుడు అంగీకరించలేదు. ఆవారమే అతడిమీద లంచకొండితనం నేరం మోపారు. ఖైదీలదగ్గిర సిగరెట్లుడబ్బు తీసుకుంటున్నా డన్నారు.

కఠినమైన శిక్షకి పాల్పడ్డా డతడు. అసలు రెస్కోవచ్చినప్పటికే అతడి మీద కొంత కథజరిగింది. టైబరు ఏవివో బ్యారక్కులు ప్రవేశించేసరికి ఆయువకుడు తనమీద ఈచాడీలు చెప్పినవాళ్ళు ఎవరాఅని చూస్తున్నాడు. టైబరు అదిచూసి లోపల సంతోషించాడు. అతడి కది విజయకారణమైనా భయకారణమున్నూ అయింది. యువకుడు ద్వేషంతోనిండిన కళ్ళతోచూసే సరికి టైబరు అనుకున్నాడు:

"ఇతడంటే కొంచెం జాగ్రత్తగా వుండడం మంచిది"అని.

కొన్నాళ్ళతరవాత మరొకనేరం చేసినట్లు ఎవరో ఫిర్యాదుచేశారు. అతడు రెస్కోనించి మాయమయాడు. ఏశిక్షకోసం అతణ్ణి అలా మాయం చేశారో టైబరుకి తెలియదు.

ఖైదీలతో కాపలావాళ్ళు ఆడుతూవుంటే టైబరు చాలాసేపు చూస్తూ నిలబడ్డాడు. ఎంచేతో చెప్పలేడుకాని అదృశ్యం తనకి సరదాగా వుండేది. కొట్టడంలోకాని, చిత్రహింసలోకాని అతడు పాల్గొనలేదు. కాని ఒకొక్కప్పుడు హటాత్తుగ తన స్కూలురోజులు తనకి జ్ఞాపకం వచ్చేవి. తనని ద్వేషించినవాడో, తనని బాధపెట్టినవాడో ఎపడోఒక విద్యార్థి జ్ఞాపకం వచ్చేవాడు. వెంటనే ఒక రబ్బరుకొరడా పట్టుకుని ఖైదీలని తబాదబా బాదడం

లంకించుకునేవాడు. కావలివాళ్ళకంటే ఎంతో దారుణంగా బాదేసేవాడు. ఖైదీలు మూర్ఛపోయి పడిపోయేదాకా అవూపు ఆపేవాడుకాదు. "మాట్లాడు! మాట్లాడు!" అని అరుస్తూ పిశాచంలా తాండవమాడేవాడు.

ఇలాంటి పిచ్చిచేష్టలు అప్పుడప్పుడు చేసినా టైబరుడొనాతు పిచ్చివాడు కాడు. తాను ఏంచేస్తున్నాడో తనకి తెలుసు. వెర్రిగా ఖైదీలని బాదిన తరవాత బసకి వెళ్ళిపోయి, తనని రెస్కుజైలుకి తీసుకువచ్చిన దురదృష్టాన్ని నిందిస్తూ కూచునేవాడు. "ఖైదీలని వూరికే కొడితే ఏమిటి లాభం?" అంటూ ప్రశ్నించుకునేవాడు. ఖైదీలంటే అతడికి ఏమీ చింతావంతాలేదు. ప్రభుత్వశత్రువులు వాళ్ళు. వాళ్ళు హంగేరీని ధ్వంసం చెయ్యడానికి పూనుకున్నారనడంలో ఏనాడు సందేహం కలగలేదతడికి. వాళ్ళని కనికరించనక్కరలేదు. కాని అంతూపంతూలేని ఈశిక్షలవల్ల కావలావాళ్ళమీద ఎలాంటి ప్రభావం పడుతుంది? ఈప్రశ్నే టైబరుని బాధించేది.

"కూచుని చేసేపని నాకిష్టం" అంటూ అనుకునేవాడు టైబరు. "బుడాపెస్టులో పని దొరకాలి. కూచుని చేసేపని నేను బాగా చెయ్యగలను. అని కలలుకనేవాడు. తాను ఎంత దుస్థితిలోవున్నాడో తలుచుకునేవాడు. "ఒక పెద్దకారు నడపడం నాకు చాలాఇష్టం" తానొక పెద్దకారు మెత్తగా బుడాపెస్టు వీధులో తిప్పుతున్నట్టు ఊహించుకునేవాడు. అలా ఊహించుకున్నప్పుడు అతడి వొళ్ళు వుప్పొంగిపోయేది. ఎవరినో వొక గొప్ప ఉద్యోగిని కారులో ఎక్కించుకుని బుడాపెస్టు రాజమార్గాల్లో కారు నడిపిస్తున్నట్టు కలలుకంటూ ఆనందించేవాడు. ఇంతలో గంట మోగేది. బుడాపెస్టులో కాదు, రెస్కులో ఉన్నానని అతడికి జ్ఞాపకం వచ్చేది.

అలా కలలుకంటూన్న క్షణాల్లో అతడు ఖైదీలనించి దూరంగా వుండాలనుకునేవాడు. "వాళ్ళ పాడుమొహాలు చూశానంటే ఎవణ్ణోవొకణ్ణి చంపుతాను" అనుకునేవాడు. ఇంతకీ ఎవరినీ చంపాలని అతడి కెప్పుడూలేదు. ఎవరైనా వొక ఖైదీ చచ్చిపోతే ఎవ్వరూ అడగరు, కాని ఎలాగో అది రికార్డులోమాత్రం ఎక్కిపోయేది. రెస్కులో ఎవరు ఏంచేస్తున్నదీ ఎవ్వరికీ—తన ప్రాణస్నేహితుడికీకూడా చెప్పకూడదు. ఎందుకంటే అక్కడ ప్రతీవాడూ ప్రతీ రెండోవాడిమీద గూఢచారే.

రెస్కులో తన ప్రవానం గురించి ఆలోచిస్తూ అందాకా తోచని వొక విషయం కనిపెట్టాడు టైబరు. "నా మిగిలిన జీవితమంతా నేను ఏవివో మనిషిగా పనిచేస్తాను. ఎందుకు పనిచెయ్యకూడదు? మంచి జీతం దొరుకుతుంది; దుకాణాల్లోని మంచి పదార్థాలు దొరుకుతాయి. బుడాపెస్టు వెళ్ళి

డమే ఎప్పుడైనా సంభవిస్తే సొంతకారు దొరుకుతుంది. మంచి ఇల్లు దొరుకుతుంది. ఇది చాలా మంచి జీవితం. ఎవ్వరూ నామీద ఏవిధమైన నేరమూ మోపలేరు.''

రెస్కులో తన ఇబ్బందులన్నీ మరిచిపోయా డతడు. తనకు రాబోయే మంచిరోజులే తలుచుకుంటూ ఊహారాజ్యంలో విహరించాడు: "బుడాపెస్టులో ఒక మంచి ఇల్లూ, ఒక కారూ, బహుశా ఒక ఆఫీసరు హోదా—. నేను గ్రామంలోనే వుండిపోయివుంటే ఏం దొరికేది?''

ఇలా తన జీవితం పోల్చుకుని నవ్వుకునేవాడు. "రెస్కు శాశ్వతంగా వుండేదికాదు. – తరవాత........సరదాగా........''

చివరికి రెస్కునించి డొనాతుకి బదిలీఅయింది. ఆవార్త అతడికి సంతృప్తి కలిగించిందింది. అతణ్ణి గ్యోరుపట్నం బదిలేచేశారు. అక్కడ కొద్దిరోజుల్లోనే అతడు సమర్థుడైన సార్జెంటు అనిపించుకున్నాడు. గ్యోరులో జరుగుతూవున్న పాశవికకాండ హంగేరీలో ఆప్రాంతం వాళ్ళందరికీ తెలిసిందే. దాని ప్రసిద్ధి తగ్గేపని ఏమీ డొనాతుచేసిన పాపాన పోలేదు.

తుదకి **1956** సంవత్సరం వసంతంలో అతడికి రెండోసారి బుడాపెస్టులో అవకాశం దొరికింది. అయితే కూచుని చేసేపనిమాత్రం దొరకలేదు. కాని కారుమాత్రం కొన్నా డతడు. అతడి జీతం పెరిగింది. పట్టణజీవితం అతడనుకున్నదానికంటే ఎక్కువ సరదాగా ఉంది. "మనం జాగర్తగా వుండాలి. ఈపట్నంలో ఏదో జరిగేటట్లుంది. అదేమిటో మనం తెలుసుకోవాలి'' అన్నారు అతడి ఆఫీసర్లు.

టైబరు మొదటిసారి బుడాపెస్టులో నౌకిరీచేసినప్పటికంటే ఇప్పుడు అరస్టులు అధికమయాయి. జైళ్ళు నిండిపోతూవుండడంచేత వాళ్ళని త్వరగా వొదిలెయ్యవలసి వచ్చేది. అంచేత అరస్టు అయినవాళ్ళవద్ద కొద్దికాలంలోనే సమాచారం లాగవలిసినపని టైబరులాంటివాళ్ళకి కలిగింది. అంచేత వెనకటికంటే ఎక్కువ కాఠిన్యం వహించవలసి వచ్చేది. జైళ్ళలో ఇక్కడ స్థలం సరిపోక రెస్కులాంటి కాన్సంట్రేషను క్యాంపులు రద్దుచేశారు. డొనాతుకి పనివొత్తిడి ఎక్కువయింది. ఖైదీలసంఖ్య హెచ్చింది. వాళ్ళని త్వరగా విడిచిపెట్టవలసిన బాధ్యతా హెచ్చింది. వెనక నానాహింసలూ పెడుతూ కాలనిశ్చయంలేకండా జైల్లో ఖైదీలనుంచే టైబరు ఇప్పుడు వాళ్ళని సాధ్యమైనంత త్వరలో వొదిలేస్తున్నాడు.

**1956** వేసవిలో జరిగిన ఆందోళన టైబరు అంతగా గమనించలేదు. ఏవివో గూఢచారులు అతడితో ఆవిషయం ఏమీ చెప్పనేలేదు. ప్రత్యేక రాజ

కీయఖైదీలను అతడిదగ్గిరికి పంపేవాళ్ళేకారు. "ఏదో అయ్యేట్టుంది. ఏమిటో కనుక్కో" అనిమాత్రం చెప్పారు. అయితే అతడేమి కనుక్కోలేకపోయాడు. విద్యార్థుల ఉత్సవంచూసి అతడి కేమీ అర్థంకాలేదు. చిన్నచిన్న ఆందోళన పరులూ, తెలివితక్కువవాళ్ళూ తనదగ్గిరికి ఖైదీలుగా వచ్చేవాళ్ళు. వాళ్ళు అతడికేమీ చెప్పలేకపోయారు.

అక్టోబరు 23న జరిగిన సంఘటనకి ఆశ్చర్యపడిన అనేకమంది హంగేరీప్రజల్లో పల్లెటూరి డొనాతు వొకడు. "రేడియోస్టేషనుమీద గుళ్ళు పేలుస్తున్నారు" అని వొక నౌకరు వచ్చి చెప్పాడు ట్రక్కునిండా ఏవివో మనుషులు తన భవనంనించే వెళ్ళారు. చూసి టైబరు నిచ్చేరపోయాడు.

స్టాలినుస్క్వేరుకి కొంతమంది వెళ్ళారు. "అక్కడ పెద్ద దొమ్మీ జరుగుతూవుంది" అన్నారు. జీబార్‌నెప్ ఆఫీసుకి మరికొందరు వెళ్ళారు. ఆపత్రిక ధ్వంసం చేస్తున్నారన్నారు. హంగేరీ యావత్తూ ముక్కముక్కలై పడిపోతుంది అనిపించింది టైబరుకి. 24న వెనకటిరాత్రి జరిగిన విషయాలు అతనిదాకా వచ్చేసరికి ఈభావం అతడిలో మరింత తీవ్రరూపం దాల్చింది.

"రేడియోస్టేషను దగ్గిర తిరుగుబాటుదారులు ఏవివో గార్డుల్ని చంపేశారని వొక ఏవివోమనిషి డొనాతుతో చెప్పాడు. "హత్య చేశారు!"

"ఏం?" డొనాతు ప్రశ్నించాడు.

ఇంతలో ఖూడిదరంగు ఆఫీసరు వచ్చి ప్రకటించాడు : "పట్నమంతా తిరగబడింది. దీన్ని అణిచెయ్యాలి. ఏపాటి అనుమానం తోచినా కాల్చిపారెయ్యండి."

ఎవరు ఏంచెయ్యాలో నిర్ణయమైంది. ఇంతలో ఇంకో ఆఫీసరు వచ్చాడు : "మనం పార్లమెంటు స్క్వేరు చుట్టవేద్దాం. అక్కడ ప్రజలు గుమికూడితే పిరికి రాజకీయనాయకులు ఏవైనా వాగ్దానాలు చెయ్యవచ్చు. మన వాగ్దానాలు మరతుపాకుల్తో జరగాలి. మనవాళ్ళకి రేడియోస్టేషనుదగ్గిర ఏంజరిగిందో విన్నారా?" అన్నా డతడు.

ఈ భయంకర వార్తలు వచ్చిపడుతూన్నకొద్దీ డొనాతు ఆందోళన అధికమౌతూవచ్చాయి.

"ప్రభుత్వం ఏమీ చెయ్యదేం?" మాటిమాటికీ ప్రశ్నించుకునేవాడతడు. పట్నంలో చెలరేగుతూవున్న ధ్వనులు అతణ్ణి అదలెత్తించాయి. తన స్నేహితుల మొహా లతడు ఆందోళనతో చూశాడు. తనని ఆపరిస్థితికి తెచ్చినవాడు ఎవడాఅని అతడి అన్వేషణ. వాళ్ళ మొహాల్లోకూడా అతడికి

ఆందోళనే అవుపడింది. రాత్రి ప్రత్యేకంగా మరింత ఆందోళనకరంగావుంది. దీపాలు ఆర్పవద్దన్నాడు దొనాతు. తన ఆఫీసుకింద ఖైదు అరల్లోంచి ధ్వనులు వినిపించాయి. బహుశా ఖైదీలుకూడా తిరుగుబాటు చేస్తున్నారేమో అని అతడికి అనుమానం కలిగింది.

"కిందికివెళ్ళి ఏంజరుగుతూవుందో చూసి రండి" అని అరిచాడతడు.

25న వ్యవసాయ సచివాలయం భవనంమీద ఒక మరఫిరంగి ఏర్పాటుచేశాడు. పార్లమెంటు స్క్వేరులో నడుస్తున్నవాళ్ళమీద అక్కడినించి గుళ్ళు కురిపించవచ్చు. కొంతమంది జెండాలు పట్టుకుని పెద్దగుంపుగా వచ్చారు. ఫిరంగిగుళ్ళకి అందేటంత దగ్గిరికి గుంపువచ్చేసరికి "ఇప్పుడు ఫిరంగి పేలుద్దాం" అన్నాడు దొనాతు. కాని తక్కినవాళ్ళు "మరికొంచెం ఆగుదాం" అనేసరికి అతడి ఆందోళన మరింత హెచ్చింది. తనపక్కవాడు బుజంతో మెల్లగా తోశాడు. "ఆటాంకులు చూడు" అని చెవిలో మెల్లగా వూదాడతడు.

పెద్దపెద్ద రష్యాటాంకులు వరసతీరి వెళుతూవుంటే లైబరు దొనాతు పైనించి చూశాడు. వాటి తుపాకులు ప్రజలమీద గురిపెట్టి వున్నాయి. "వాళ్ళే చూసుకుంటారు" అన్నాడతడు, మరేం ఫరవాలేనట్టు.

రెండో ఏవివో మనిషి తలవూపాడు. సుప్రీంకోర్టు భవనం కప్పుమీద కూచున్న ఏవివోవాళ్ళు కిందనడుస్తున్నవాళ్ళమీద గుళ్ళు కురిపించడంచూసి దొనాతూ, అతడి స్నేహితులూ పైశాచికమైన ఆనందం అనుభవించారు.

"ఇప్పుడు మనమూ పేలుద్దాం" అంటూ అరిచాడు దొనాతు.

"ఇంకా పేల్చమని ఆజ్ఞ ఇవ్వలేదు. ఒక రష్యాటాంకు ఎదురుగ్గా కప్పుమీదవున్న ఏవివొమనుషులమీదికి తుపాకులు తిప్పింది. దొనాతు ఆశ్చర్యపోతూ అదంతా చూశాడు. "ఏం చేస్తున్నారు వాళ్ళు?" అని అరిచాడతడు.

తరవాత రష్యాటాంకులు తుపాకులు మెల్లిగాతిరిగి తానున్న భవనం వేపు గురిపెట్టేసరికి దొనాతుకళ్ళల్లో భయం చీకట్లు కమ్మింది. "మనమీదే గురిపెడుతున్నారు" అంటూ కేకలు వేశాడతడు. తన ఎడమపక్కవున్న ఏవివో మనిషి తన మాటలు లక్ష్యం చెయ్యలేదు. మరఫిరంగి వొదిలేసి, తల దాచుకుందికి కిందికిదూకేసి పారిపోయాడు. లైబరుమాత్రం వున్నచోటు కదలలేదు. తుపాకి పేల్చడ మారంభించాడు. కింది రష్యాతుపాకులు మరిచిపోయి వీధిలోవున్న జనంమీద పిచ్చిగా అదేకురిపించడం కురిపించాడు

గుళ్ళు. కింది ప్రజల్లో ప్రతీవ్యక్తినీ అతడు ద్వేషించాడు. ఈ గందరగోళ మంతటికీ వాళ్ళే కారణం!

ఇంతలో బ్రహ్మాండమైన పేలుడు వినిపించింది. అతడిచుట్టూవున్న గోడలు ఛిన్నాభిన్నం అయిపోయాయి. తన ఎడమవేపువున్న మరతుపాకి దగ్గిరికి వెళ్ళాడు టైబరు. భయం అతణ్ణి మింగేస్తూవుంది. అతణ్ణి అక్కడికి లాక్కువెళ్ళిందీ అదే. కకావికలై పారిపోతూవున్న జనంమీద మళ్ళీ గుళ్ళు కురిపించాడు టైబరు. రష్యా ఫిరంగులు మళ్ళీ పేలాయి. దాంతో టైబరుకి అక్కడవున్న కాస్తరక్షణ వూడిపోయింది.

మరతుపాకికూడా ఖాళీ అయిపోయింది. అతడిచుట్టూ భవనం శిధిలమై కుప్పలుగావుంది. టైబరు లేచాడు. కప్పుమీంచి కుంటుకుంటూ నడిచి వెళ్ళాడు. కిందికి చూశాడు. హంగేరీ ప్రజల శవాలు కుప్పలుకుప్పలు పడి వున్నాయి. రష్యావాళ్ళు అవుపిస్తున్నారు. తన స్థానం వొదిలేసి దొనాతు బైలుదేరాడు. "ఏమిటి జరుగుతోంది?" అంటూ గొణుక్కున్నాడు.

తన ఏ వి వొ చిహ్నాలన్నీ చించిపారేశాడు దొనాతు. సచివాలయం మెట్లు దిగాడు. ప్రధానద్వారంలోంచి బైటికి వెళ్ళలేదు. మెల్లిగా వొక సందులోకి జారాడు. దాంట్లోంచి షరోసందుదాటి వెనక ఒక వీధిలోకి వచ్చాడు. అక్కణ్ణుంచి మెల్లిగా రోజ్జారు నసాగ్ స్క్వేరు చేరుకున్నాడు. ఆ రిపబ్లికుస్క్వేరులో కమ్యూనిష్టుపార్టీ ప్రధాన కార్యస్థాన ముంది. ఏ వి వో ల మహామైన భూగర్భ కారాగారాలుకూడా అందులోనే వున్నాయి.

హంగేరీలో అంతా సవ్యంగా వున్నకాలంలో ఈ ప్రధాన కార్యాలయానికి దొనాతు వచ్చినట్టు జ్ఞాపకంవుంది. అప్పుడు అంతా సక్రమంగా జరుగుతున్నట్టు వుండేది. దేశం బుద్ధిమంతులు పరిపాలిస్తూ వుండేవాళ్ళు. ఇప్పుడు అంతా అరాజకంగా వుంది. బూడిదరంగు సూటు తొడుక్కున్న ఒక మనిషి కేకలు వేస్తున్నాడు. "రకోసీ, గెరేలు నశించాలి! విమానమెక్కి వాళ్ళు రష్యా పారిపోయారు." ఎవళ్ళని ఉద్దేశించినవో ఆ మాటలు దొనాతుకి అర్థం కాలేదు.

"రకోసి ఎక్కడున్నాడు?" ఆ మాటలు వినకుండానే మరొకడు అరిచాడు.

"ఏం చేస్తున్నా విక్కడ?" ఒక కమ్యూనిస్టు ఉద్యోగి టైబరు నడిగాడు.

"రష్యావాళ్ళు మా మీద గుళ్ళు పేలుస్తున్నారు" అన్నాడు దొనాతు.

"అంచరూ మా మీద తుపాకులు పేలుస్తున్నారు. మన పోలీసులే మన సోల్జర్లే, మన ప్రజలే మనమీద తుపాకులు కాలుస్తున్నారా" అన్నా' డతడు.

"ఏమిటి జరుగుతోంది?" నీరసంగా ప్రశ్నించాడు డొనాతు.

"మీ ఏవీవో వాళ్ళందరికీ పిచ్చెత్తింది. నీ గదిలోకి నువ్వు వెళ్ళు" అని అరిచాడు ఉద్యోగి.

తుపాకులంటే ఏమిటో తెలియనివాళ్ళు కిటికీల్లో తుపాకులు అమరు స్తున్నారు. ఏవో అరుపులతో ఆజ్ఞ లిస్తున్నారు. అయితే ఆ ఆజ్ఞలు వినేవాళ్ళు లేరు. డొనాతు మెల్లిగా వొక గదిలోకి జారాడు. అందులోనే ఆరురోజులుదాకా వుండిపోయాడు.

సుమారు రెండువందలమంది ఏవివో మనుషులూ, ఎంతోమంది ఖైదీలూ ఆ గదిలోకి వస్తూ పోతూవున్నారు. అప్పుడప్పుడు ఎవడో వొక ఏవివో మనిషి వచ్చి ఒకవార్త వినిపిస్తూ పోతూవుండేవాడు. "పెటోఫి విగ్రహం దగ్గిర మనవాణ్ణి వొకణ్ణి వురితీశారు."

"కొన్ని నిమిషాలకింద నేను అక్కడే వున్నాను." గడిదేరిన వొక ఏవివో మనిషి వొక స్వాతంత్ర్యయోధుణ్ణి లోపలికి తెచ్చి కొరడాతో బాదాడు. పాత ఏవివో వొకడు 'వీధిలోకి పారిపో' అని మూలిగాడు.

ఆ గదిలో నరకయాతనపడిన ఖైదీలలో కొంతమంది ఆడంగులూ, పిల్లలూ వున్నారు. తెలివైన ఏవివోవాళ్లు కొందరు ఈ ఆడవాళ్ళని అనుకుని వుండడం ఒకనాడు టైబరు కనిపెట్టాడు.

"అలా ఎందుకు చేస్తున్నారు?" అని అడిగాడు.

"ఈ గది వొదిలేసే సమయం వచ్చేటప్పుడు ఈ ఆడంగుల్లో వొకతె నా ముందు నడుస్తుంది" అన్నా డొక ఏవివోమనిషి.

"కాల్పులు జరుగుతా యనుకుంటున్నావా?"

"అటు చూడు."

డబ్బా ఎక్కి కిటికీలోంచి చూశాడు. మొన్నటిదాకా తాము కొరడాలతో కొట్టిన తుచ్ఛులందరూ రిపబ్లిక్కుస్క్వేరువీధిలో గుమికూడి వున్నారు.

"ఈ టాంకులు వీళ్ళని చెల్లాచెదరు చెసెయ్యవేం?" ఆశ్చర్యం వేసింది డొనాతుకి. ఇంతలో రష్యాటాంకులు కొద్దినిమిషాలక్రితం ఎలా ప్రవర్తించాయో జ్ఞాపకం చేసుకున్నాడు. సరే, ప్రపంచం పిచ్చిదైపోయింది. ఆత్మ రక్షణే తనకి శరణ్యం అనుకున్నాడు.

"నిన్ను ఇలా సులభంగా వెళ్ళిపోనిస్తారనుకున్నావా ?" స్త్రీలని డాళ్ళుగా పెట్టుకుని బైటికి దాటెయ్యాలనుకుంటున్న ఏవివోని అడిగాడు.

"తప్పకుండా" అన్నా డతడు.

కాని ట్రైబరు మరీమంచిప్లాను వేశాడు. బైట స్క్వేరులో వున్నవాళ్ళ వైఖరి కనిపెట్టాడు. ఏవివోలు బైటికివస్తే చంపేట్టున్నారు వాళ్ళు. అంచేత ఒక ఖైదీలజట్టు దగ్గిరికి వెళ్ళా డతడు. అతడు కొట్టడానికి వచ్చాడేమోఅని వాళ్ళ వెనక్కి తగ్గారు. తన ఎత్తు ఖైదీని ఒకణ్ణి పట్టుకున్నాడు.

"నీ దుస్తులు నాకు కావాలి" అన్నాడు.

అతడి నోట్లో మాట నోట్లోనేవుంది. కిటికీలోంచి ఎవరో ఒక నీటిగొట్టం లోపలికి వేశారు. అందులోంచి వరదలా వచ్చిపడుతున్నాయి నీళ్ళు. ఏవివో వాళ్ళ ఆ ఆశ్రయం నీళ్ళతో నిండిపోయింది. మరో కిటికీలోంచి మరోగొట్టం దిగింది. ప్రవాహంలా వచ్చేస్తున్నాయి నీళ్ళు. అది భూగర్భగృహం. నీళ్ళతో నిండితే అక్కడివాళ్ళంతా బైటికి వెళ్ళవలసిందే. మరోగతిలేదు.

సరిగ్గా అదేసమయంలో ట్రైబరు దొనాతు ఒక వెనకతలుపమ్మట జారి. సందుసందుల్లోపడి కొంతదూరం వెళ్ళిపోయాడు. స్క్వేరులో ఏంజరుగుతూవుందో చూద్దామనిపించింది. చప్పున వెనక్కి తిరిగాడు. గబగబా స్క్వేరులోకి వచ్చి నుంచున్నాడు. అతడి ఒంటిమీద ఇప్పుడు ఏవివో దుస్తులు లేవు. సామాన్యపౌరుడి దుస్తులున్నాయి. జనంలో కలిసిపోయి నిలబడ్డా డతడు. హంగేరీ విప్లవంతాలూకు ప్రధానసంఘటనల్లో ఒకటి ఆ జనసమూహం చూడబోతూవుంది.

రిపబ్లికు స్క్వేరులో జరిగిన ఈ సంఘటనలగురించి ఈ అధ్యాయం తొలిపేరాలో ముచ్చటించాను. విప్లవచరిత్రలో అవి కళంకపూర్ణమైన సంఘటనలు. ఆ సంఘటనల ఫోటోగ్రాపులున్నాయి. వాటిని ప్రకటించి, పెట్టుబడిదారులు ప్రభుత్వోద్యోగుల్ని దారుణంగా ఎలా చిత్రవధచేశారో రష్యా ప్రపంచానికి చాటింది.

కమ్యూనిస్టు కార్యాలయంలో వరదహెచ్చినకొద్దీ అందులోవున్న ఏవివో మనుషులు బోనులోచిక్కిన ఎలకల్లా అయారు. భవనం పైఅంతస్తు మీద స్వాతంత్ర్యయోధులు నించునివున్నారు. ఏవీవో మనుషులు నీళ్ళలో మునిగి చావనైనా చావాలి, లేదా బైటికివచ్చి లొంగయినా లొంగిపోవాలి. మరోగత్యంతరంలేదు. బైటికివచ్చి లొంగిపోడానికే నిశ్చయించుకున్నారు వాళ్ళు. పన్నెండుగురు బైటికి వచ్చారు. రెస్కుజైల్లో పనిచేసిన

వాళ్ళు వాళ్ళు. అక్కడ ఖైదీలని "తెల్లగుర్రాలు" గా మడిచి తాపులతో చంపినవాళ్ళు. ప్రధానకార్యాలయం భూగర్భగృహాల ఖైదుల్లో రబ్బరు కొరడాలతో మనుషుల్ని బాదినవాళ్ళు. సరిహద్దులు కాపలాకాస్తూ స్వేచ్ఛకోసం పారిపోతూవున్న పౌరుల్ని కుక్కలు వుసికొల్పి, వెంటాడి తుపాకులతో కాల్చిపారేసినవాళ్ళు. వాళ్ళు కిరాతులు, హంతకులు, పిశాచులు.

వాళ్ళు రిపబ్లికు స్క్వేరులో అడుగుపెట్టేసరికి భయంకరమైన నిశ్శబ్దం అలుముకుంది. వాళ్ళ చేతుల్లో యమబాధలుపడ్డ మనుషులు వాళ్ళని తలెత్తి చూచారు. వాళ్ళని ముట్టుకోడానికైనా ఎవ్వరూ ఒక్క అడుగు ముందుకి వెయ్యలేదు. అమానుషులైన ఆ జైలు అధికార్లని చూసి భయపడిందా అన్నట్టు జనసమూహం ఒక్కసారి వెనక్కి తగ్గింది.

వాళ్ళ వెనకాలే నెలలతరబడి, సంవత్సరాలతరబడి భూగర్భకారాగృహాల్లోవున్న ఖైదీలు నడుస్తున్నారు. వాళ్ళని చూసేసరికి ఒక యువకుడి రక్తం వుడికిపోయింది. ఆ ఖైదీలే కనపడకపోయివుంటే స్క్వేరులో ఆ హత్యాకాండ జరిగేదేకాదు.

" వీళ్ళని చూడండి! మమ్మల్ని వీళ్ళు ఎంచేసేవాళ్ళో వీళ్ళనిచూస్తే తెలుస్తుంది " అంటూ అరిచాడు యువకుడు.

జైల్లోంచి బైటికివచ్చిన స్త్రీలూ, పురుషులూ పస్తులుపడి చావడానికి సిద్ధంగా వున్నారు. మొగాళ్ళు నడవలేక కుంటుతున్నారు. కొందరి మొహాల మీద నీలివాతలు అవుపిస్తున్నాయి. కొందరికి మతి చలించిపోయివుంది. ఒక్కసారి అందరూ నిట్టూర్చారు. ఒక తరానికితరం ఈ ఘోరహింసలికి గురి అయిందన్నారు.

ఇంతలో ఒక ఏవివోమనిషి ఒక స్త్రీని డాలుగా పెట్టుకుని నడుచుకుంటూవచ్చాడు. వాణ్ణి చూసేసరికి జనం కోపంతో మండిపోయింది. కొందరు ఏవివో మనుషుల్ని కర్రలతో బాది చంపేశారు జనం. కొందరిని తుపాకుల్తో కాల్చేశారు. పారిపోడానికి ప్రయత్నించినవాళ్ళని పట్టుకుని హతమార్చేశారు. చచ్చినవాళ్ళని కొందర్ని తలకిందుగా వేలాడదీశారు. అమానుషంగా ఆ పిశాచాలు చేసినదానికి ఇదంతా ప్రతిఫలం. కసి అసలు పాపానికి మించిపోయింది.

చచ్చిన ఏవివో మనుషుల్ని రోజులపాటు ఎవ్వరూ పాతిపెట్టలేదు. ఆరోగ్యశాఖవాళ్ళు బాల్దీలతో సున్నం వాళ్ళమీద పోశారు. ఇద్దరు లావాటి ఏవివో వాళ్ళ శవాలు వారంరోజులపాటు స్క్వేరులో అలాగే పడివున్నాయి.

ఆ పాటిపనైనా వాళ్ళకోసం ఎవ్వరూ చెయ్యలేదు. వాళ్ళని చూడడానికి ఎందరో వచ్చారు. అలాంటి ఏవివో మనుషుల్ని పోషించడానికి పదేళ్ళపాటు మోసంలోపడి భయంకరపరిస్థితుల్లో తాము వుండవలసివచ్చినందుకు కార్మికులు కన్నీళ్ళు కార్చారు.

ఆ రెండు శవాలూ అలా వున్నవివున్నట్లు వుంచడానికి ఒక కారణం వుంది. వాళ్ళ జేబుల్లో కొన్నిపత్రాలు దొరికాయి. వాటిలో ఒకదానిలో ఒకడికి నెలకి 18 వేల ఫోరింట్లు జీతం సంతోషపూర్వకంగా కమ్యూనిస్టుపార్టీ ఏర్పాటు చేసిందని వుంది. ఆ కాగితం అతడి గుండెమీద గుచ్చివుంచారు విప్లవకారులు.

ఆ కాగితం చదువుతూ ఒక సెపెల్‌మనిషి అన్నాడు: "నాకు ఎనిమిదివందలే జీతం!"

రెండో శవం ఆఫీసరుదికాదు. అయినా అతడి జీతం పదివేల ఫోరింట్లు అని అతడి జేబులో దొరికిన కాగితంవల్ల తెలిసింది.

ఏవివోలగురించి చెప్పిన చెడ్డకంటే ఈ కాగితాలవల్లే చాలామందికి దురాగ్రహం కలిగింది. సైకిళ్ళూ, రొట్టెలూ, జోళ్ళూ తయారుచేసే కార్మికులకంటే దేశంలో కేవలం భయోత్పాతం కలిగించిన ఏవివో వాళ్ళకి పన్నెండింతల జీతం వస్తుందని తెలుసుకుని కార్మికులు నాలికలు కరుచుకున్నారు.

రిపబ్లికుస్క్వేరులో జరిగిన హత్యాకాండ క్షమించలేను. అర్థం చేసుకోగలను. ఆ హత్యలే జరక్కపోయివుంటే బుడాపెస్టు మహావిప్లవం కల్మషరహితంగా వుండేది. కాని ఏవివో వాళ్ళ హింసలికి గురిఅయిన స్త్రీలూ, పురుషులూ ఆ మాత్రం కసిఅయినా తీర్చుకోరంటే నమ్మడానికీ వీల్లేదు. అమెరికా పత్రికా విలేఖరులలో చాలామెత్తనివాడూ, మధ్యయూరపులో మా విలేఖరు లందరిలోకీ వృద్ధుడూ అయిన ఒకాయన ఏవివోల హింసాకాండగురించి నా·అంత అయినా రాయనివాడు – ఆయన ఇలా అన్నాడు: "అప్పుడు నేను బుడాపెస్టులో వున్నాను. కసితీర్చుకోడానికి చంపడంవల్ల ఏమీ వచ్చేది లేదని నమ్మేవాణ్ణేఅయినా హంగేరియనులు ముప్ఫయివేల ఏవివోలలో ప్రతి ఒక్కణ్ణీ చంపిపారేస్తేనే మానవజాతికి శ్రేయస్కరంగా వుండేదనుకుంటాను. ప్రపంచవాతావరణం ఎంతో పరిశుభ్రంగావుండేది దానివల్ల."

తన బలం నిలుపుకోడానికి ఏవివోలాంటి సంస్థ కమ్యూనిజానికి ఎందుకుకావాలో మనం అర్థం చేసుకోవాలి. నేను చూసినదాన్నిబట్టి ప్రతి

కమ్యూనిస్టుదేశంలోనూ ఏవివో సంస్థలాంటిది ఒకటి తప్పకండావుందని చెప్పవచ్చు. ఇలాంటి సంస్థ ఒకటి తప్పకండా రష్యాలోనూ, లాట్వియా లోనూ, బల్గేరియాలోనూ, ఉత్తరకొరియాలోనూ, చైనాలోనూ ఒక సంవత్సరంనించి పనిచేస్తున్నదని పాఠకులు పూర్తిగా నమ్మవచ్చు. ఈ దేశాలు విడిచిపెట్టి పారిపోయినవాళ్ళు ఏకగ్రీవంగా ఈ విషయం సాక్ష్యమిచ్చారు.

సంఘంలోని ఈ దుర్మార్గులమీద కమ్యూనిజం ఎందుకు ఆధారపడాలి? కమ్యూనిస్టు తాత్వికులు వస్తుతః దుష్టులనియైనా మనం నమ్మాలి – ఇది నేను నమ్మను - లేదా కమ్యూనిజం తన కార్యక్రమం ఎంత అపర్యప్రాయంగా ప్రారంభించినా తుపకి నియంతృత్వపద్ధతికింద అది ఆర్థికంగానూ, సాంఘికంగానూ విషమస్థితిలో చిక్కుకుంటుందనైనా అంగీకరించాలి. ప్రజల్ని అదుపులో పెడితేనేగాని ఆ చిక్కుల్లోంచి నెగ్గిలేకపోవాలి. ఈ సిద్ధాంతమే నేను ఒప్పుకొంటాను.

జరిగేది ఇది : సెపెలు కార్మికులికి కమ్యూనిజం పిచ్చి ఎక్కించేడప్పుడు అతిగా అన్నివిధాల వాగ్దానాలూ చేశారు. దానివల్ల వాళ్ళ మనస్సులో ఆశలు రేకెత్తాయి. దురాశ రేగింది. ఈ వాగ్దానాలు సరళంగా వుండడంవల్ల అని విప్లవంతాలూకు ప్రథమాశయాలుగా తయారయాయి. ఈ ఆశయాలు వెంటనే పూర్తికావాలని ఆశించారు ప్రజలు. కమ్యూనిజం విజయంతో ప్రజలు తమ ఆశయ పూర్తికోసం మరీ తొందరపడ్డారు.

అయితే ఈ వాగ్దానాలు ఎంతపెద్దవంటే, ఎంత అసత్యమైనవిఅంటే వాటిని సాధించడం అసాధ్యమైనపని. ఈ వాగ్దానాలుచేసిన కమ్యూనిస్టునాయకులకు బహుశా ఇది తెలిసేవుంటుందని నా అభిప్రాయం. ఈ వాగ్దానాలు గగనకుసుమాలని వాళ్ళకి బాగా తెలుసు.

ఈ పుస్తకంలో నేను పేర్కొన్న హంగేరీవాళ్ళకి కమ్యూనిస్టునాయకులు ఒకప్పుడు ఏఏ వాగ్దానాలుచేశారో క్లుప్తంగా చూద్దాం : వాళ్ళు ఎన్నడూ కనీ వినీ ఎరగని వాడుకపదార్థాలు ; తక్కువ పనిగంటలు ; హెచ్చుకూలి ; హెచ్చు సాంఘికసౌకర్యాలు : మంచిచదువు : అమితమైన సాంఘికస్వాతంత్ర్యం ; జవాబుదారీ ప్రభుత్వం.

కమ్యూనిజం కింద ఈ వాగ్దానాలు ఏమీ చెల్లవు. కమ్యూనిస్టు ప్రణాళికలకింద ఉత్పత్తి కావలసిన సమస్తమైన వాడుకవస్తువులకూ కావలసిన సహజసంపద యావత్తూ హంగేరీలో వున్నప్పటికీ, ముడిసరుకు వాడుకవస్తువులుగా మార్చే సమర్థతకాని, శ్రద్ధగాని అసలు ఉద్దేశంకాని కమ్యూనిస్టులికి

లేదు. ఏవిధానమైలా – అది ప్రభుత్వ సోషలిస్టువిధానమైనా, పెట్టుబడి దారీ విధానమైనా పదేళ్ళు శ్రద్ధాబుద్ధులతో శ్రమపడితే కమ్యూనిస్టులు చేసిన వాగ్దానాలు పూర్తిచేయవచ్చు. క్రమబద్ధంకాని ఉత్పత్తివిధానంతో అసమర్థుల్ని పోషిస్తూ, చేతకాని మేనేజిమెంటుతో కమ్యూనిజంకింద ఆ ఆశయాలు ఎన్నటికీ ఫలించవని రెండేళ్ళలోనే హంగేరీవాళ్ళు గ్రహించారు. స్వాతంత్ర్యానికిబదులు నిరంకుశత్వం కొనితెచ్చి పెట్టుకున్నట్టు తెలుసుకున్నారు.

పెద్దఎత్తుమీద ఈ జ్ఞానంకలిగి దేశంమొత్తం వ్యాపింపజేసేటప్పటికి మొదటినించీ ఇది తెలిసిన కమ్యూనిస్టునాయకులు సహజంగా ఉత్పన్నమయే ప్రతిఘటన అణచడానికి తగినచర్యలు తీసుకోవాలి. ప్రారంభంలో అది సామాన్యంగా వుంటుంది. శుష్కవాగ్దానాలు కనిపెట్టి, ఆ గుట్టు కాస్త బైటపెట్టిన వైజ్ఞానికుల్ని పట్టుకుని దీర్ఘకాలం జైల్లో వేయడం జరుగుతుంది.

తరవాత మా జీతాలు ఎప్పుడు పెరుగుతాయి అని అడిగిన కార్మికుల్ని, ఎక్కువరెట్టె, తమ పిల్లలికి చౌకజోళ్ళూ అడిగిన కుటుంబాల్నీ, తొలి అరస్టులమీద అనమ్మతి ప్రకటించిన చర్చిమనుషుల్నీ పోలీసులు పట్టుకోడం జరుగుతుంది. అర్థంలేని ఈ అరస్టులతో మామ్మూలు పోలీసులు అలిసిపోతారు. అప్పుడు స్పెషలు పోలీసులు కావలిసి వస్తారు.

ఒకదేశంలో ఏ విపోసంస్థ స్థాపింపబడిందంటే అక్కడికమ్యూనిస్టునాయకులు దానిని జాతీయహింసా సాధనగా ఉపయోగించుకుంటారు. ఇది నేను నమ్మలేను. అంచేతనే హంగేరీవాళ్ళు నన్ను అమాయకుడంటారు. భయభ్రాంతులైన ఉద్యోగులు తమస్థానాలు సంరక్షించుకోడానికి ఒక మామ్మూలు పోలీసుదళంగా దాన్ని ఉపయోగించుకుంటూ దాన్ని గట్టిగా అదుపులో ఉంచాలనే అనుకుంటారని నా అభిప్రాయం. తరవాత అది భయంకరమైన రాకాసి రూపం ధరించి, ఎవరి అదుపులోకీరాక అందరినీ ఒక అజగరంలా చుట్టుకుంటుంది.

“ అదికాదు ” అంటారు నా హంగేరీ స్నేహితులు. “ కమ్యూనిస్టులు మా దేశం వశపరుచుకున్నప్పుడు ముఖ్యుడైన ప్రతికమ్యూనిస్టు నాయకుడూ రష్యాలో తర్ఫీదుపొంది వచ్చాడు. రకోసీ, గేరో - వీళ్ళు ఇద్దరూ రష్యా పౌరులే. కమ్యూనిజం భయోత్పాతంమీద ఆధారపడి వుండాలని వాళ్ళకి మాస్కోలో జాగ్రత్తగా నేర్పుతారు. బుడాపెస్టు వశపరుచుకోడానికి వాళ్ళు వచ్చేసరికే వాళ్ళు జేబులో ఏవివో సంస్థాపనశక్తిచెందిన ప్లాను వేసుకు వచ్చారు. ఆ సంస్థ నిర్మించినప్పుడే అది ఎలాపరిణమిస్తుందో వాళ్ళకి తెలుసు.

అదిలేకండా క్యమూనిజం బతకలేదనీ వాళ్ళకి తెలుసు. మా మొదటి ఏవివో అఫీసర్లు రష్యాలోనే తర్ఫీదు పొందారు. వీళ్ళ భయంకరకృత్యాలు ఇక్కడ పెరిగి పరిపక్వమైనవికావు. నాదు రష్యానించి వచ్చింది. ఇక్కడ పెరిగి పెద్దదైంది.

అదీకాకండా యూరపులో ఏ కమ్యూనిస్టునాయకుడైనా తన దేశం కమ్యూనిజంలో పెంచాలంటే అతడు విధిగా తన ప్రత్యేకమైన ఏవివోమీద ఆధారపడాలి. అది ఏమంత యాదాలాభంగా జరగదు. జాగ్రత్తగా సంఘటితమవుతుంది. దాని ప్రధానోద్యోగులందరూ హింసాచర్యలు ఎలా జరపాలో మాస్కోలో నేర్చుకువస్తారు.''

ఈ రెండు అభిప్రాయల్లో ఏది నిజమో నేను చెప్పలేను. కమ్యూనిస్టు సంఘంతాలూకు సహజమైనక్షీణతకి ఫలితంగా ఏవివో దౌర్జన్యం అధికమవుతుంది. ఇదీ నా నమ్మకం. కమ్యూనిస్టుపరిపాలన ప్రారంభంలోనే ప్రతిపక్షులనందరినీ హతమార్చాలనీ, ప్రజల్ని భయభ్రాంతుల్ని చేసెయ్యాలనీ అధికారం హస్తగతం చేసుకునేతంత్రం ఆదే అనీ లెనిను బోధించాడంటారు హంగేరీవాళ్ళు. ఏది నిజమైనా ఫలితం ఒక్కటే: బీభత్సం!

కాని ఒక్కవిషయంమాత్రం నిశ్చయంగా చెప్పగలను. కొంతమంది షారులు కోరుతున్నట్టు రేపు జపాను కమ్యూనిస్టుదేశమే అయిపోతే ఒక్క సంవత్సరంల్లో ప్రపంచంలో కల్లా ఎంతోఘోరమైన 'రహస్యపోలీసుదళం' అక్కడ తయారవుతుంది. ఇండోనేషియా కమ్యూనిజ మవలంబిస్తే బుడాపెస్టులో జరిగిన బీభత్సమే అక్కడ జరుగుతుంది. నేను ఇండియాలో ఎరిగిన కమ్యూనిస్టులే ఆ విశాలదేశం కమ్యూనిజంకిందికి తెచ్చారా, వాళ్ళ వాగ్దానాలు భంగమయేసమయానికి అక్కడా 'రహస్యపోలీసులు' వచ్చేస్తారు. టైమూరు తరవాత, వాళ్ళు ఎన్నడూ ఎరగని భీభత్సానికి అమృతసర్, ఢిల్లీ నగరాలు పాలుకావలిసి వస్తుంది.

ఇంతవరకూ చెప్పినదాన్నిబట్టిచూస్తే ఏవివో వాళ్ళ ఉనికే సంఘం పూర్తిజీవితాన్ని విషమిళితం చేస్తుందని చెప్పవచ్చు. దాని విధానం ఒకళ్ళమీద ఒకళ్ళు అభాండాలు మోపుకు వెళ్ళడమే. ఫ్యాక్టరీలో ఒక గూఢచారిదళం ప్రతీకార్మికుణ్ణిగూర్చి రిపోర్టు ఇస్తుంది. ఈ దళంలో మళ్ళీ పెద్దగూఢచారులు చిన్నగూఢచారులమీద రిపోర్టు చేస్తారు. ఏవీవోల మీదకూడా గూఢచారులున్నారు. మీదితరగతి కమ్యూనిస్టుల చర్యలుకూడా పర్యవేక్షించే గూఢచారులుకూడా వున్నారు. ఖైదులో ఒకగదిలో వున్నవాళ్ళు మరొక

గదిలో వున్నవాళ్ళని కనిపెడుతూవుండవచ్చు. ఒక ఏవివో చౌకీమీద మరొక ఏవివోవాడు గూఢచారిగా పనిచేస్తూ వుండవచ్చు.

కమ్యూనిస్టు పద్ధతికింద వాళ్ళజీవితాలు ఎలావుంటాయని హంగేరీ ప్రజల్ని ప్రశ్నించాను. వాళ్ళు ఒక ఘోరం చెప్పారు. తమ పొరుగువాడూ, తమ పిల్లల బడిపంతులూ, తాము మాంసం కొనుక్కొనే కసాయివాడు తమ మీద గూఢచారులుగా పనిచేస్తున్నారేమో అన్నభయం వాళ్ళనెప్పుడూ వెంటాడుతూనే వుంటుంది. సన్నిహితులైనవాళ్ళే, స్నేహితులనుకున్నవాళ్ళే తమని ఏవివో వాళ్ళ కప్పగించి హింసల పాలుచేసేవారు. అలా హింస లను భవించినవాళ్ళని ఎంతోమందిని, హంగేరీ స్త్రీపురుషుల్ని నేను కలిశాను. సామాన్యంగా నడుస్తూవున్న సంఘాన్ని ఇలా ఛిన్నాభిన్నం చేయడమే, హంగేరీయా జీవితానికీ ఏవివో సంస్థచేసిన మహాపచారం. ఇది ఎప్పుడూ దారుణ మనిపిస్తూ వుంటుంది నాకు. బతికివున్న ప్రతిహంగేరీవ్యక్తిమీదా ఏదో ఒక అభాండం మోపడమే వాళ్ళకి ఆదర్శమైంది. చచ్చినవాళ్ళనికూడా వొదిలి పెట్టలేదు వాళ్ళు. ప్రతీవాడిమీదా ఏదోఒకనేరం మోపినప్పుడు సాంఘికవ్యవస్థ అస్తవ్యస్తమైపోకతీరదు. ఒక్క ఏవివోవాళ్ళే వర్ధిల్ల గలుగుతారు. ఆ నవం బరురోజు రిపబ్లికుస్క్వేరులో పోగైన స్త్రీ పురుషుల్ని అదిగో ఆ కోణంలో పరికించాలి. తమ పూర్తిజాతిని విషకలుషితంచేసిన దుష్టులతో వాళ్ళు మొదటసారి ముఖాముఖి తారసిల్లారు. ఆగ్రహావేశులైన పౌరులు తిరగబడి తమని హింసించిన దుష్టుల్ని హతమార్చారంటే ఆశ్చర్యంకాదు.

హంగేరీలో ఏవివో నియంతృత్వం పరిశీలిస్తున్నప్పుడు ఒక విషయం వ్యక్తమైంది. ఆ భయంకరగాథకి నా జ్ఞానేంద్రియాలు స్తంభించిపోయాయి. నా మనస్సు బండబారిపోయింది. "రెస్కు చాలాచెడ్డక్యాంపే కావచ్చు. కాని నిజానికి అది అంత చెడ్డదిగా చెప్పకోదగిందికాదు. ఒక పూర్తిజాతిని ప్లానుచేసి దుష్టంచేసినవిధానం యోచించడమే కష్టం" అన్నాను నేను.

ఇలా నేను నిచ్చెరపోయిన మూడు సమయాల్లో నా చిన్నప్రశ్నఒకటి ఒక ఘోరమైనగాథ బైటపెట్టేది. దానివల్ల ఎంతోవిషయం వ్యక్తమయింది. హంగేరీలో కమ్యూనిజం ఎలావుండేవో అర్థమైంది. జాతిమొత్తంమీద జరిగిన భీభత్సం అంగీకరించడానికి మనస్సు వెనకాడినా ఒక మనిషి కథమాత్రం సిద్ధంగావుంది.

వియన్నాలో ఒక ఆదివారం సాయంకాలం మంచిబలంకల ఒక హంగేరీ బొగ్గుగని పనివాడితో మాట్లాడుతున్నానని తాతాబన్యాలో బొగ్గుగనుల

పరిస్థితులు ఎలా వున్నాయని అడిగాను. జీతాలూ, పని స్థితిగతులూ, పని వాళ్ళు జీతంతో ఇచ్చే సెలవులు బాలటాన్ హ్రదంలో గడపడమూ-ఇవన్నీ అతడితో చర్చించాను. (లేక్‌బాలటాన్‌కి గనిపనివాళ్ళు ఎన్నడూ వెళ్ళరు. యజమానులుమాత్రం వెళతారు.) ఈ పనిమనిషి స్పష్టమైన జవాబు లిచ్చాడు. తన వైఖరిలో ఏమీ ఆవేశం కనపరచలేదు. అతడి బలిష్ఠమైన శరీరం చూసి అన్నాను: 'నరేకాని, ఈ రాజ్యంలో అధమం వొక్క మనిష యినా బాగాపుష్టిగావున్నట్టు చూశాను.' నేను బాగా మాట్లాడాననుకున్నాను. అయితే నాచివరివాక్యమే నిజంగా మానంభాషణకి నాంది అయింది.

"ఏవిఏవో వాళ్ళు నాభరతం పట్టించినప్పుడు మీరు నన్ను చూడవలి సింది" అన్నా డతడు.

"నిన్ను అరస్టు చేశారా?"

"అంతకంటే హెచ్చే" అన్నా డతడు, ఏద్వేషమూ లేనట్టు.

"ఎందుకోసం?"

"వాళ్ళు నాసూటు చూశారు."

"సూటేమిటి? ఏమిటది?"

"అది అమెరికాసూటు. పాతది. కాని నాకున్నదల్లా అది వొక్కటే."

"అమెరికాసూటు ఎలావచ్చింది నీకు?"

"వాళ్ళు తెలుసుకోగోరిందీ అదే."

"వాళ్ళతో నువ్వు ఏం చెప్పావు?"

"నిజం చెప్పాను. యుద్ధకాలంలో నన్ను జర్మనీవాళ్ళు బలాత్కా రంగా కార్మికుణ్ణిచేసి పంపారు. అమెరికావాళ్ళు మమ్మల్ని విడిపించడానికి వచ్చినప్పుడు నేను లింజలో వున్నాను. హంగేరీ వెళ్ళిపోయేముందు వాళ్ళ కోసం కొంతకాలం పనిచేశాను. అదిగో అప్పుడు Px లో అమెరికా ఇంజనీ యరు వొకడు ఈసూటు కొని ఇచ్చాడు నాకు."

"మరి ఏవిఏవో వాళ్ళు ఏంచేశారు?"

"అమెరికాసూటు తొడిగిన ప్రతీవాడూ అమెరికావాళ్ళ గూఢచారి అయివుంటాడు అన్నారు."

"అయితే?"

"ముప్ఫయిమూడు రోజులపాటు రోజూ నన్ను కొట్టారు వాళ్ళు. నన్ను పస్తులు పెట్టారు."

"ఇదంతా అమెరికాసూటు తొడుక్కున్నందుకేనా?"

"అవును."

"నీసూటు తనకి నచ్చినంతమాత్రాన ఏొక ఏవివోమనిషి నిన్ను వీధిలోపోతున్నవాణ్ణి పట్టుకుని ముప్పయిమూడురోజులు జైల్లోపెట్టాడంటావు; అంతేనా ?"

"ముప్పయిమూడేళ్ళదాకా పట్టివుంచగలడు."

దీనికంటే జాలికలిగే వృత్తాంతం ఒకరితో వూరికే మాట్లాడుతూవుంటే బైటపడింది. ఏవివో వాళ్ళ దారుణచర్యలు ఎలాంటివో సంక్షిప్తంగా తెలుపుతుంది ఆవృత్తాంతం. తక్కినవాటికంటే ఇది మరుపురాంది. ఎప్పుడూ నామనస్సులో మెలుగుతూ వుంటుంది. సరిహద్దు దగ్గిర ఒక హంగేరీ కుటుంబ యువతిని కలిశాను. ఆమె అందమైన మొహంచూసి ఆమెతో మాట్లాడాలని పించింది. "ఈమెతో మాట్లాడతాను. స్త్రీలు ఈవిప్లవంగురించి ఎలా భావిస్తున్నారో అడుగుతాను" అని మనసులో అనుకున్నాను. మాసంభాషణలో ఆమె ఎన్నో విలువైన భోగట్టాలు చెప్పింది. ఆమె చెప్పినవిషయం, శాంతికాలంలో స్త్రీలు జీవితం ఎలాగడుపుతారో వర్ణించినప్పుడు వివరించాను. ఆమె ప్రతివిషయమూ చాలా తెలివితేటలతో వివరించింది. కసితీర్చుకోవాలన్న భావం ఆమెలో రవంతా అవుపించలేదు. ఆమె ఎంతసరదాగా చెప్పిందంటే ఆమెతో మాట్లాడగలిగినందుకు నన్ను నేను అభినందించుకున్నానంటే నమ్మండి. ఆమె కథలో అతిశయోక్తికాని ఆవేశంకాని లేదు. ఆమెతో మాట్లాడి నోటుబుక్కు మడిచెయ్యబోతున్నాను-ఆమెచేతిమీద గాయాలు కనిపించాయి. "చేతి కేమయింది?" అని అడిగాను.

"ఏవివోవాళ్ళు విరగ్గొట్టారు" సరళంగా అంది ఆమె.

"ఆవేళ్ళు ?"

"ఒకరబ్బరు తాడుతో వీటిని విరగ్గొట్టారు."

"వెనకాలవున్న ఆరెండు రంధ్రా లేమిటి ?

"సిగరెట్టుకాల్పులు."

"ఏం"

"నాస్నేహితురాలు ఒకామె సరిహద్దుదాటి దాగుంది."

"నువ్వు సహాయం చేశావా ?"

"నా కాసంగతి తెలియదు."

"అయినా నిన్ను అరస్టుచేశారా ?"

"అవును."

"ఎందుకని?"

"నా కేమైనా తెలుసునేమో అని అనుమానంమీద."

"అది చెడ్డపనే అంటావా?"

"నేను ఆ అమ్మాయిని ఎరగనన్నా ఎరగను అన్నప్పుడు 'నువ్వొవుత్తి అబద్ధాలకోరువి' అంటూ అరిచారు వాళ్ళు. ఒకమొగాడు వచ్చి నా పళ్ళూడ గొట్టాడు."

ఇంక ఆమెకథ పొడిగించి లాభంలేదు. అది జుగుప్స కలిగించేటంత క్రూరంగావుంది. అంతంలేని పదమూడునెలలఘోరం – అయినా అదొక పెద్ద అసాధారణ విషయ మేమీకాదు. ఎంతోమంది ఖైదీలచేతులు ఇలాగే విరగొట్టారు వాళ్ళు. ఎందరి పళ్ళో ఇలాగే వూడగొట్టారు. కాని మిసెస్ మారొతీకథలో వొకఅంశం ఇతరుల కథల్లోకంటే విశిష్టమైంది.

ఈపుస్తకంలోవున్న చాలాపేర్లు కల్పితాలు. ఏమంటే, నిజమైనపేళ్ళు చెపితే ఏవివోవాళ్ళు తమబంధువుల్నీ, స్నేహితుల్నీ వేటాడి బాధిస్తారనివాళ్ళు ఇంకా భయపడుతూనేవున్నారు. అయితే ఇందులో ఎవరెవరికథలురాశానో వాళ్ళని ఎలాగూ ఏవివోవాళ్ళు గుర్తుపటేస్తారు. ఒక్కొక్కరితో మాట్లాడాక నేను 'పుస్తకంలో ఉపయోగించడానికి ఏదైనా వొకపేరు చెప్పండి' అని అడిగేవాణ్ణి. వాళ్ళు ఏదో వొక కల్పితనామం చెప్పేవాళ్ళు.

కాని మారొతీతో మాట్టాడడం పూర్తిఅయాక ఆమె ధైర్యంగా అంది: "నాపేరు ఉపయోగించండి. మిసెస్ మేరియా మారొతీ నాపేరు. ఈక్రూర జంతువులవల్ల ఎంతహింసపడ్డానంటే నేను వాళ్ళమీద తీసుకున్న కసి ఇంతే. స్వాతంత్ర్యంలో నేను వాళ్ళని ఎంత అసహ్యించుకుంటున్నానో వాళ్ళకి తెలియనివ్వండి."

మిసెస్ మారొతీ ఓహియాలో వుండేది. ఏదోవొక చిన్నపట్నంలో ఆమె ఏదుకాణానికోవెళ్ళి వచ్చీరాని ఇంగ్లీషులో వస్తువులు కొంటున్నట్లు ఊహించగలను. అయితే దుకాణదారుడుకాని, మరొకళ్ళుకాని ఆమెచెయ్యి చూసి 'మీచేతికి ఏమైంది ?' అని అడిగితే, ఆమెచెప్పేకథమాత్రం వాళ్ళెవ్వరూ నమ్మరని నాభయం. ఆమెకథలో వొకవిషయం నేనూ నమ్మలేక పోతున్నాను. విరిగిన చెయ్యిగురించి ఆమెచెప్పేకథ ఇదిగో ఇలా వుంది:

"కమ్యూనిస్టుల్ని మేం ఎంత అసహ్యించుకుంటున్నామో మీకోకథ చెపితే అర్థ మవుతుంది. మాతో ఎవరువచ్చారో మీకు తెలుసా?"

"నేను తెలుసుకోదగిన మనిషా ఆతడు ?"

"అతణ్ణి మీరు ఎరుగుదురు."

"ఎవరు అతడు ?"

"ఇమ్రీ హొర్వాత్ జూనియర్."

ఈమాట ఒక అమెరికామనిషిమీద ఎలాంటి ప్రభావంవేస్తుందో విడమర్చిచెప్పడం కష్టం. నామీదా, మాబల్లచుట్టూకూచున్నవాళ్ళమీదా ఆఒక్కమాటా ఎంతో పనిచేసింది. మేం విని మూగవాళ్ళమైపోయాం. ఏమంటే ఇమ్రీహొర్వాత్ సీనియరు హంగేరీ కమ్యూనిస్టులలోకల్లా ప్రజాద్వేషానికి పేరుపడ్డ వ్యక్తి. బుడాపెస్టువిప్లవం ఉద్ధృతంగా సాగుతున్నకాలంలో సిగ్గుసెరమూలేని ఈరాయబారి న్యూయార్కునగరంలో యునైటెడ్‌నేషన్సు సభలో మాట్లాడుతూ హంగేరీలో ప్రవేశించడానికి రష్యావాళ్ళకి హక్కు వుందనీ, హంగేరీప్రజల్లో మంచివాళ్ళందరూ వాళ్ళకి స్వాగత మిచ్చారనీ, ఫాసిస్టుయుద్ధప్రియులు లేవనెత్తిన ఆందోళనేకాని హంగేరీవిప్లవం మరేమీ కాదనీ వాదించాడు. ఐక్యరాజ్యసమితిలో హొర్వాతు ఇలా మాట్లాడాడని వార్తరాగానే హంగేరీప్రజలు అతడిమీద మండిపడ్డారు. 'దొరికితే అతణ్ణి హతవార్చేద్దా మనుకున్నారు' అని ఎంతోమంది శరణార్థులు నాతో అన్నారు. హంగేరీప్రజలికి అతడు పరమశత్రువు; సందేహంలేదు.

"అతడి కొడుకు హంగేరీ వొదిలిపోతున్నాడా?" అని అడిగాను.

"అవును" నమ్మకంగా చెప్పింది మిసెస్ మారొతీ - "మేం వున్న ఇంట్లోనే అతడు వుండేవాడు. ఏవివో వాళ్ళు నాకుచేసిన అపచారం అతడికి తెలును. తనదేశం అంటే అతడికి సిగ్గువేసేది. ఐక్యరాజ్యసమితిలో తన తండ్రి ఉపన్యాసం విన్నప్పుడు తాను శాశ్వతంగా హంగేరీ వొదిలేస్తానని ప్రమాణం చేశాడు."

"అలా చేశాడా ?"

"ఒక రహస్యం చెపుతాను. దాచగలరా ?"

"తప్పక."

"అతడు బుడాపెస్టు వొదిలిపెట్టాడు. ఇక్కడికి రేపు వస్తాడు."

ఇమ్రీ హొర్వార్తు జూనియరువంటి మనిషిని వాళ్ళు పారిపోనిస్తారంటే నేను నమ్మలేదు. మిసెస్ మారొతీ ఇది కనిపెట్టింది. నా మాట నమ్మండి. హొర్వాతు సీనియరు చేసినదానికి హంగేరీయావత్తూ సిగ్గుపడుతోంది ; అందరికంటే అధికంగా అతడి కొడుకు. నా మాట నమ్మండి. అతడు బైటికి వచ్చేస్తాడు అంది.

రోజులు గడిచాయి. కాని ఇమ్రి రాలేదు. నేను సరిహద్దు వొదిలి వెళ్ళి పోయాను. కాని అతడు ఎక్కడా శరణార్థులలో అవుపించలేదు. నేను న్యూయార్కు వెళ్ళిపోయాను. శరణార్థుల పట్టీలు చూస్తూనే వున్నాను. హొర్వాతు జాడలేదు. అసలు మిసెస్ మారొతీ అతణ్ణి ఎరిగేవుండదనీ ఆ కథ కల్పించివుంటుందనీ అనుకున్నాను. లేవా అతడి అభిప్రాయం ఆమె సరిగా గ్రహించివుండదనీ అనుకున్నాను.

ఈ పుస్తకం రాస్తూవుండగా చివరిరోజున, ఇంకా పుస్తకంలో మార్పులు చేయడం అవసరమే అని అనుకుంటూవుండగా ఇమ్రి హొర్వాత్ జూనియరు పశ్చిమదేశాలు పారిపోయాడని వార్త వచ్చింది. అతడు చెప్పింది చాలాతక్కువే. కాని అతణ్ణీ, మిసెస్ హొర్వాత్‌లాంటి వ్యక్తినీ ప్రవాసం పంపించిన కమ్యూనిస్టు విధానం ఖండించడానికి ఆ మాటలు చాలు.

“లాజ్లోరజక్ (1949 లో స్టాలిను ఆజ్ఞప్రకారం ఉరితీసిన జాతీయ కమ్యూనిస్టునాయకుడు) గతి ఏమైందన్న విషయం మా తండ్రి విషయంతో కలిపి చూశాను. నేను జజ్జరిల్లిపోయాను. ఏమీ ఎరగని అమాయకప్రజల్ని ఎందరినో న్యాయస్థానం ముందుకి ఈడ్చుకువచ్చి మరణశిక్షల పాలుచేస్తున్నారు. ఈ సంగతి హంగేఅంతా ఎరుగును.”

“ఒక్క శత్రువుని పార్టీలో వుండనివ్వడంకంటే వందలాది అమాయకుల్ని చంపెయ్యడం మంచిది.” అని జవాబిచ్చాడాయన.

ఒక పయిల్వాను చెప్పినకథ ఎంతో జుగుప్సాకరంగావుంది. అతడు జగత్ప్రసిద్ధుడైన పైల్వాను. అతడి పేరుచెపితేచాలు, అమెరికాలో అందరూ అతణ్ణి గుర్తిస్తారు. ఏమంటే, అతడు వొకగొప్ప ఆటలో “ప్రపంచ ఛాంపియను” గా వుండేవాడు. పైల్వానులంటే హంగేరీలో చాలాగౌరవంగా చూస్తారనీ, వాళ్ళు కమ్యూనిజంఅంటే భయపడనక్కరలేదనీ సాధారణంగా శరణార్థులు చెప్పేమాట ఎంతవరకూ నిజమో తెలుసుకుందామని నాకు కుతూహలంగా వుండేది. ఒక శరణార్థి అన్నాడు: “పైల్వానులు బాగా మొద్దుగా వుంటారు. నోరులేనివాళ్ళుగా వుంటారు. రాజకీయాల్లో వాళ్ళు కలగజేసుకోరు. అంచేత వాళ్ళని బాగా మేపుతారు; ప్రోత్సహిస్తారు. వాళ్ళ అంతర్జాతీయపోటీల్లో ప్రజాపాలితరాజ్యానికి వ్యతిరేకంగా గెలిస్తే కమ్యూనిజంకి మంచి ప్రచారం కలుగుతుందని వాళ్ళ ఆశ.”

సరిహద్దులో ఒక శరణార్థులగుంపులో ఈ ఛాంపియనుని కలిశాను. చాలా సరదాగా కబుర్లు చెప్పుకున్నాం. ఎంతో చురుకైనవా డతడు. అతడి

"కాదు. ఇంగ్లాండుకీ, ఫ్రాన్సుకీ చాలాట్రిప్పులు చేశాక ఒకనాడు వున్న ట్టుండి నాకు తోచింది: 'హంగేరీ నరకప్రాయంగావుంది. అక్కడ వుండడం అసాధ్యం. ఇక నేను వెళ్ళిపోతాను' అని. కాని సరిహద్దుమీద నామీద తుపాకులు పేల్చారు."

తన బుజంమీదవున్న గుండుదెబ్బలగుర్తులు నాకు చూపించా డతడు.

" అంత పెద్దగుర్తులు ఎలాపడ్డాయి. గడ్డపారతో ఆపరేషను చెయ్యలేదుకదా !" అని అడిగాను.

"అవి డమ్‌డమ్ బులెట్లు. అవి లోపలికిపోయి పేల్తాయి " అన్నా డతడు.

తరవాత అదే పాతకథ—కొట్టడం, పరాభవించడం. అసహ్యమైన ఒక బొగ్గుగనిలో చచ్చేటంత బానిసపని. మూడేళ్ళు ఇలా గడిచాయి. అందులో రెండువిషయాలుమాత్రం కొత్తవి. ఇవన్నీ విని నామనస్సు బండబారిపోయింది. అంచేత అశ్రద్ధగా నోట్సు తీసుకున్నాను.

"మాజట్టు నాయకత్వంవహించిన ఏవిహోమనిషి నేను ప్యారిసులోనూ, ఇంగ్లాండులోనూ రెండుసార్లు మాట్లాడాననీ, అంచేత నేను గూఢచారిననీ రిపోర్టు చేశాడు. గూఢచారిగా పనిచేస్తున్నానన్న అనుమానంమీద నాకు మూడేళ్ళు జైలుశిక్ష వేశారు - పారిపోడానికి ప్రయత్నించాననికాదు."

నేను తీసుకున్ననోట్సులో ఇదికూడా వుంది. "బొగ్గుగనిలో నేను పని చేసిన 21 నెలల్లోనూ 50 మంది చచ్చారు. 250 మంది వికలాంగులయారు. కొంతమంది మునిగిపోయారు. మరికొందరు గ్యాసువల్ల చచ్చారు. మరికొందరు గనుల్లో కప్పడిపోయారు. ఎవ్వరికీ ఒక దమ్మిడీ ఇవ్వలేదు.

ఒకళ్ళతో ఒకళ్ళం చెప్పుకుని మేం వెళ్ళిపోతూవుండగా ఛాంపియను సరదాగా అన్నాడు.

"నేను ఏడుపుమొహంవాణ్ణికాను. ఇదిమాత్రం జ్ఞాపకం వుంచుకోండి. పరిస్థితులు బాగా అధ్వాన్నమైపోయినప్పుడు ఇలా అనుకునేవాణ్ణి: 'ఏమైనా ఆ మేజరు మీదో బాల్ యథాన పడలేదుకదా!'

"అత డెవరు?"

"అతడుకాదు, ఆమె."

"మేజరు మీట్‌బాలు? ఆమె ఏవిహో మనిషా?"

"అవును. మీరు ఏవిహోలని బాగా జ్ఞాపక ముంచుకున్నారు.

"మేజరు మీట్‌బాల్ ఎక్కడుంది?"

"ఆమెపేరు పిరోష్కా. రష్యాభాషలో 'పిరోష్కా' అంటే మాంసం వుండ. బుడాపెస్టులో 60, స్టాలినువీధిలో ఏవివో హింసాగారాల్లో ఆమెని కలిశాను. ఆమెని సరిగ్గా వర్ణించగలను. ఆమెని వొక్కసారిచూస్తే ఎవరైనా వర్ణించగలరు. ఆమెది ఎర్రటిజుత్తు. లావాటి మనిషి ఆమె. వయస్సు ముప్ఫయిఅయిదేళ్ళు. స్ఫోటకంమచ్చలు. బొద్దుపెదవులు. అయిదడుగుల రెండంగుళాలుఎత్తు. స్ఫోటకంమచ్చలు మినహాయిస్తే మొహం అంత వికారమైందికాదు. అయితే భయంకరంగా హింసించడంలో ఆమె రాకాసి. అది అందరికీ తెలుసు.

"ఆమె యథాన పడలేదు అన్నాను. అంటేనాకు నరకప్రాయమైన దుర్గతి పట్టలేదన్నమాట. కాని కావలసినంతశాస్తిమాత్రం అయింది. ఆమె నాపక్కవున్న అరలోకి వెళ్ళింది. అందులోవున్న ఖైదీచేతికి వొకసీసాఇచ్చి 'ఇందులో ఉచ్చపొయ్యిఅంది.' ఆ ఉచ్చసీసా నాదగ్గిరికితెచ్చి 'ఇది తాగు' అంది.

"మరోసారి నాఅరలోకివచ్చి సుద్దతో వొకగిరిగీసింది. దానిచుట్టూ నన్ను తిరగమంది. అలా ఎనిమిదిగంటలు తిరిగాను.

"ఆడఖైదీలకి ఆమె మరీ పైశాచికంగావుండేది. వాళ్ళని ఆమె ఏంచేసేదో ఇప్పటికీ వర్ణించలేను నేను. కాని ఆమె యథానపడలేదని అన్నానే దానికోసం ఇవాళకూడా ఆమెకి నేను కృతజ్ఞుణ్ణే.

'నాపక్కఅరలో వున్నమనిషి తప్పించుకోలేకపోయాడు. ఆమె వొక నాడు రాత్రిదుస్తుల్లో అతడిదగ్గిరికి వచ్చింది. అతణ్ణి రాసుకుంటూ 'నీకు ఆడదంటే కామంలేదూ ?' అంది. 'మొగాడంటే నాకు మహా కామంగా వుంటుంది. ఇవాళరాత్రి నిన్ను నా బసకి తీసుకువెళతాను.' అంది. ఆ రాత్రి అతణ్ణి తనబసకి లాక్కుపోయింది. అతడి బట్టలు విప్పేసింది. సరిగ్గా అదేసమయానికి ఒకఏవివో వాడు ఇంట్లోకి దూసుకు వెళ్ళాడు. 'హారిదుర్మార్గుడా! నాపెళ్ళాంతో వ్యభిచరిస్తున్నావా ?' అంటూ విరుచుకుపడ్డాడు. వాడు మరొకణ్ణి పిలిచాడు. ఇద్దరూకలిసి అతణ్ణి చావ మోదారు. అతణ్ణి వెల్లకిలా పడుకోబెట్టి, ఒకసన్నటి గాపుగొట్టం శిశ్నంలో ఎక్కించారు. తరవాత అదిపగిలి లక్షముక్కలయేట్టు చెడామడా తన్నారు. మేజర్ మీట్‌బాల్ ఇలా పనిచేస్తుంది."

"ఇదంతా ఎలాతెలుసు నీకు?" నీరసంగా అడిగాను.

"అతడు బైటికికూచుంటే నేను పట్టుకు నుంచోవలసివచ్చేది" అన్నాడు ఛాంపియను.

హంగేరీ చరిత్ర తెలియని వాళ్ళు ఈజాతి అనుభవంలో ఇంత బీభత్సం ఎన్నడూ జరిగివుండ దనుకుంటారు. కొన్నివిషయాల్లో ఇది నిజంకాదు. హంగేరీ ఇలాంటి బీభత్సం ఆరుసార్లు చవిచూసింది. కమ్యూనిస్టు బీభత్సం ఈ ఆరింటిలోనూ చివరిది.

చరిత్రప్రసిద్ధమైన రెండు మోహక్స్ యుద్ధాలమధ్య బుడాపెస్టూ, దాని పరిసరప్రాంతమూ తుర్కీ పరిపాలనకింద వుండేది. మొదటి మోహాక్స్ యుద్ధం 1526 లో జరిగింది. అందులో తురకలు 'హంగేరీ ప్రజలమీద అఖండమైన విజయం సాధించారు. రెండోయుద్ధం 1687 లో జరిగింది. అందులో హంగేరీవాళ్ళు తురకల్ని జయించారు. ఈరెండు యుద్ధాల మధ్య కాలం హంగేరీ తుర్కీపరిపాలన కింద వుంది. మధ్యమధ్య తుర్కీపరిపాలన ఎంతోక్రూరంగా వుండేది. కాని హంగేరీవాళ్ళు తురకల పరిపాలన పూర్తిగా అంగీకరించాక తుర్కీ నియంతృత్వం నీతిమాలిన నిరంకుశ పరిపాలన యంత్రంగా మారింది. తుర్కీ బీభత్సం హంగేరీకి ఒక భయంకరమైన అనుభవం కలిగించింది. హంగేరీ ప్రగతికి తీరని నిరోధకరంగా పరిణమించిం దది.

1919 లో ప్రథమ ప్రపంచమహాయుద్ధం అంతమైన తరవాత వ్యాపించిన అరాజక పరిస్థితుల్లో హంగేరీ తనవాళ్ళ చేతుల్లోనే బీభత్సం అనుభవించింది. ఆందోళనకరమైన ఆనాటి బీభత్సం గురించి ఇవాళదాకాకూడా చర్చించుకుంటారు జనం. ఆఏడు పాత ఆస్ట్రోహంగేరియను నావికాదళాధిపతి అడ్మిరల్ హార్తీ హంగేరీకి రీజెంటై, దారుణమైన నియంతృత్వం స్థాపించాడు. అది 1944 దాకా సాగింది. ఈకాలంలో హంగేరీజీవితం అంత సుఖంగా వుండేది కాదు. కాని కమ్యూనిస్టుల కాలంలో పరాభవంతోకూడిన బీభత్సం ఎన్నడూ హంగేరీ అనుభవించలేదు. అయినా కమ్యూనిస్టులు ప్రతి ఉపన్యాసంలోనూ "హార్తీ ఫాసిస్టు ప్రభుత్వం" అని అరుస్తూ వుంటారు. కమ్యూనిస్టులకు హంగేరీ ఇంత త్వరగా, ఇంత సులభంగా లొంగిపోవడానికి కారణం హార్తీయే. దానికోసం అతడు నిందాపాత్రుడే. అతణ్ణి తలుచుకుంటూనే కమ్యూనిస్టులు బుడాపెస్టు ప్రవేశించారు.

1944 లో హంగేరీని నాజీలు ఆక్రమించుకున్నారు. ఒక సంవత్సరంపాటు నాజీ దౌర్జన్యానికి ఆదేశం గురిఅయింది. సామాన్యపౌరులికి నాజీ దౌర్జన్యం అంత చెడ్డదికాదు. దీనికి అందరూ సాక్ష్యమిస్తారు. కాని నాజీపరిపాలనఅంటే హంగేరీప్రజలికి అయిష్టంగా వుండేది. హంగేరీవాళ్ళు నాజీలని ద్వేషించేవాళ్ళు. వాళ్ళనిచూసి పరిహసించేవాళ్ళు. కాని జీవితం దుర్భ

రంగా వుండేదికాదు. యూదులికిమాత్రం నాజీదౌర్జన్యం దుర్భరంగావుండేది; వర్ణనాతీతంగా వుండేది. కాని ఏవివో దౌర్జన్యంముందు అది ఏమంత పెద్దది కాదు. ఈ జర్మను దౌర్జన్యం 1944 లో కొంతకాలం పెరెన్సునలాని పరిపా లనకింద సాగింది.

ఈమూడు కాలాల్లో దేశమంతా అలముకున్న బీభత్సంతోపాటు మరి రెండుసార్లు దేశం కొన్నిభాగాల్లో భయానక పరిస్థితు లేర్పడ్డాయి. తూర్పున ట్రాన్సిల్వేనియాలోవున్న హంగేరీవాళ్ళూ, రుమేనియావాళ్ళూ ఎన్నోసార్లు ఇటునించి అటూ, అటునించి ఇటూ మారారు. ట్రాన్సిల్వేనియా రుమేనియా పాలనకింద వున్నప్పుడు హంగేరీవాళ్ళు కష్టంగా జీవితం గడిపేవాళ్ళు. హంగేరియావాళ్ళ పరిపాలన కిందికివస్తే రుమేనియావాళ్ళు బాధపడేవాళ్ళు. పాశవిక ప్రవర్తనలో మీకు మేంతీసిపోమని హంగేరియావాళ్ళు తమ ఘనత కనపరిచేవాళ్ళు.

దక్షిణాన కూడా ఇలాంటి పరిస్థితులే వుండేవి. ఇక్కడ హంగేరీవాళ్ళు, సెర్బులూ ఒకళ్ళమీద ఒకళ్ళు రాకాసుల్లా ప్రవర్తించేవాళ్ళు. ట్రాన్సిల్వేని యాలోనూ, సెర్బియాలోనూ జరిగిన ఘోరమైన అత్యాచారాలు కలబోసి చూస్తే అవి ఏవివోభీభత్సాన్ని మించిపోతాయి.

అంచేత ఏవివో బీభత్సం వర్ణించేటప్పుడు అతిశయోక్తులు పలకడంలో కొంతజాగర్త పడాలి. ఇంతకీ చెప్పరావడమేమంటే హంగేరీలో అలాంటి బీభత్సాలు అనేకసార్లు జరిగాయి.

అయితే ఏవివోవాళ్ళ హింసాకాండ ఒకప్రత్యేకమైన తరగతికి చెందింది. అందులో ప్రత్యేకంగా జుగుప్సాకరమైన విషయం ఒకటివుండేది. వెనకటి హింసాకాండలో సత్యం మరుగుపరచడమనేది వుండేదికాదు. తుర్క్ప్రభుత్వం హంగేరీప్రజల్ని తురకమతంలో కలపడానికి వచ్చింది. ఇస్లాం మతం నిరాకరించారో వాళ్ళభరతం పడదాం అన్న నిశ్చయంతో వచ్చింది. హంగేరీ జనం ఇస్లాం నిరాకరిస్తే ఏంజరుగుతుందో ఎరుగుదురు. ఏవో వూరికే నినా దాలుచెయ్యడం కాదు. మాట మర్చడమన్నదీ లేదు. వాళ్ళ దౌర్జన్యమే హం గేరీవాళ్ళకి మేలు అని తప్పుడు ప్రచారమూలేదు.

నాజీ దౌర్జన్యకాలంలో హంగేరీని పరిపాలించడానికి వాళ్ళుచేసుకున్న నరళమైన నియమాలప్రకారం పరిపాలన సాగింది. వాళ్ళ ఆక్రమణ. సోద రత్వస్థాపనకోసం' అనిమాత్రం పేరుపెట్టలేదు. ఆవేశంలేని సాదా మిలిటరీ చర్య అది. యూదుడైతేచాలు అతడికి చావు తప్పేదికాదు.

హార్తీ నియంతృత్వంకూడా ఏవిఏవో చేసినంత బీభత్సం చెయ్యలేదు. సామాన్య బుద్ధికూడా తల్లకిందులుచేసే కమ్యూనిజమంత ఘోరమైంది కాదది. సోమవారం రైతుల్ని మోసంచేసి, మంగళవారం 'వాళ్ళమంచికే అది చేశాం' అని బూకరించలేదు ఆ నియంతృత్వం. పెద్ద జనానీకాన్ని అణచివేసే ఎత్తుగడ – అది ఎలాప్రారంభమైందో అలాగే విప్లవంతో అంత రించింది.

ట్రాన్సిల్వేనియా, సెర్బియా రాష్ట్రాల ప్రజలు కష్టాలు శతాబ్దాల ప్రభుత్వాల ఫలితమనీ, ఒక జాతి మరొకజాతిమీద తీసుకున్న కసి అనీ స్పష్టంగా ప్రకటన జరిగింది. ఆ ప్రాంతాల్లో రేగిన ద్వేషాగ్ని మెత్తటి మోసం మాటలతో కప్పడేదికాదు.

కమ్యూనిస్టు బీభత్సం, ఏవిఏవోల పరిపాలనలో హంగేరీజీవితం నీచాతి నీచంచేసింది. ఇదంతా మిత్రధర్మంకోసం అని ప్రపంచానికి ప్రకటించారు. రైతులు పండించిన ఫలసాయం ఎత్తుకుపోయి రష్యా దీనిని "రైతుల ఉద్ధరణ" అంటుంది. కార్మికుల్ని పీడించి "ఇది కింది తరగతి ప్రజల నియంతృత్వం" అంటుంది. ప్రతీ ప్రభుత్వసంస్థనీ నీతిమాలిందిగాచేసి దాన్ని "కొత్త సంఘం" అంటుంది. ఏవిఏవోసంస్థద్వారా హంగేరీపౌరులమీద దాడిచేసి దాన్ని "శాంతి" అంటుంది.

హంగేరీ చరిత్రలో మొదటి అయిదు బీభత్సాలూ దోపుళ్ళు; హత్యలు. అందులో దాపుడేమీలేదు. కాని రష్యా బీభత్సం "పవిత్రమైన" మానవ ద్వేషం. అది పయోముఖ విషకుంభం.

ఇంచేత ఏవిఏవో బీభత్సం హంగేరీ చరిత్రలో అధమాధమమైందని చెప్పవచ్చు. ఏజాతికైనా పునాదివంటి సాంఘికవ్యవస్థకి అది వేరుపురుగు. జుగుప్సాకరమైన ఈ "పవిత్రతే" ఇటలీ, ఇండియావంటి దేశాలతో రష్యా చేస్తున్న నేస్తాన్ని ముందుముందు అంతం చేస్తుంది. మూలకందంవంటిదైన ఈధూర్తత్వం ఇప్పుడు పూర్తిగా బట్టబయలైంది.

హంగేరీ ధీమంతుడు ఒకడు చెప్పినట్టు "బీభత్సం కలిగించడమే క్రూరకార్యం. కాని దానికి ధూర్తత్వం కూడ చేరిస్తే అది దుర్భరమే అవుతుంది."

"మా విప్లవం దీన్ని బాగా నిరూపిస్తుంది" అన్నాడతడు.

వందమందికంటే హెచ్చు శరణార్థులతో నేను మాట్లాడాను. ఏవిఏవో వాళ్ళ ప్రసంగం ఎప్పుడూ తెచ్చేవాణ్ణికాను. ఆవిషయంలో చాలా జాగర్తగా

వుండేవాణ్ణి. అయినా ప్రతిసారీ భయంకరమైన ఏవివోవాళ్ళ ప్రశంస విధిగా వచ్చిపడేది. అలాంటి సమయాల్లో వాళ్ళు చెప్పింది మాట్లాడకండా వినేవాణ్ణి- అది ఎంత దారుణమైన గాథ అయినా సరే. ఏవివోవాళ్ళ పాశవిక కృత్యాల కథలు వినడానికి నేను ఎన్నడు కుతూహలం ప్రకటించలేదు. కమ్యూనిజం కింద సాధారణజీవితం చర్చిస్తూవుంటే అవన్నీ బైటపడేవి.

ఏపునాదిమీద ఏవివో తయారయిందో పరిశోధించాలని దీనివల్ల అనిపించింది. ఆఫీసర్ల కిందితరగతి ఏవివో వాళ్ళందరూ వెనకపడిన పల్లెప్రాంతాలవాళ్ళు. ("ఈపశువు నిరక్షరకుక్షి. ఒకచోటినించి పదిమందిని తీసుకు రమ్మని వాడికి ఆజ్ఞాపిస్తే, లెక్కపెట్టడం చేతకాక మమ్మల్ని ఒక్కొక్కళ్ళనీ నేలమీద పడుకోబెట్టి—ఒకటీ, రెండూ అని వేళ్ళమీద అటునించి ఇటూ ఇటునించి అటూ తిరిగి లెక్కపెట్టేవాడు.")

చాలామంది పురుషసంపర్కం కోరేవాళ్ళు. కొందరు చిన్నచిన్ననేరాలు చేసినవాళ్ళు. ఎంతోమంది ఏవో అంగవైకల్యాలు కలవాళ్ళు. వాటిని కప్పిపెట్టడానికి వాళ్ళు ప్రయత్నిస్తూవుంటారు. ఏవివోల వొక్కవిషయం కమ్యూనిజం ఖండిస్తుంది. దాన్ని గోరింతని కొండంతచేస్తుంది. ఏవివో ఆఫీసరు హార్తీ పరిపాలనలో బండబ్బాయిగానూ, హిట్లరు నాజీపరిపాలకుల చేతిలో బానిస పరికరంగానూ, సలాసీ నియంతృత్వం నడిపిన పశువుగానూ పని చేసేవాడు. ఇవన్నీ ఫాసిస్టు ప్రభుత్వాలే. ఫాసిజం కమ్యూనిజానికి పరమ శత్రువని కదా అంటారు. కాని సోవియట్లు అధికారం వశపరుచుకున్నప్పుడు ఫాసిస్టు పోలీసుదళంనించి అధమాధములైన వాళ్ళని తమ సంస్థల్లోకి తీసుకుని, వాళ్ళని మంచి కమ్యూనిస్టులంది. ఏవివోలలో ఎంతోమందికి కమ్యూనిజం అంటే ఏమిటో తెలియదు.

కొందరు ఆఫీసర్లుమాత్రం తమ జీవితాలు కమ్యూనిజానికి అంకితం చేశారన్నమాట నిజం. వాళ్ళు బాగా చదువుకున్నవాళ్ళుకూడా. ఈపద్ధతిలో బాగా త్వరగా ముందుకివచ్చినవాళ్ళు బీభత్సం ఎలాప్రవర్తింపజేయాలో మాస్కోలో నేర్చుకువచ్చారు. రష్యాఅంటే వాళ్ళకి ఎడతెగని భక్తి. స్వాతంత్ర్య సమరంలో వాళ్ళు విద్రోహులైనట్టు ఎక్కడా కనపడదు.

ఏవివో మనుషుల్ని ప్రారంభంలో చాలా జాగర్తగా ఎంచుకుంటారు. కమ్యూనిజంమీద భక్తే వాళ్ళ మొదటి యోగ్యత. వ్యక్తిగతంకాని శిక్షవేయడంలో వాళ్ళ చాతుర్యం రెండోయోగ్యత. కాని తరవాతి సంవత్సరాల్లో వాళ్ళ సంఖ్య ముప్ఫయివేలకి పెరిగినప్పుడు వాళ్ళ ఎన్నిక అంత జాగ్రత్తగా

సాగలేదు. వాళ్ళేకాక లెక్కాజమాలేని గూఢచారులుకూడా కావలసివచ్చారు. ఇంతమందిని ఏరిఏరి నియమించడమంటే సాధ్యంకాని పని. చాలామంది యువకులు వాళ్ళఇష్టానికి వ్యతిరేకంగా కూడా ఏవివోవళంలో చేరినట్టు సాక్ష్యముంది.

ఒక యూనివర్సిటీ విద్యార్థి తన స్నేహితుడు ఒకడు ఎలా ఏవివో గూఢచారిగా మార్చబడి, తనతోటి విద్యార్థులమీదా, ఉపాధ్యాయులమీదా సి ఐ డీ గా పనిచేశాడో నాతో చెప్పాడు.

"1952 లో యూనివర్సిటీలో నువ్వు మామనిషివిగా వుండాలి" అన్నారు వాళ్ళు. నాస్నేహితుడు నిరాకరించాడు. 'నువ్వు ఒప్పుకోకపోతే నిన్ను చంపుతాం' అన్నారు వాళ్ళు. అతడు నీతినియమాలు కలవాడు. అలానే కానివ్వండి' అన్నాడు తుదకి. 'నీతండ్రినీ, తల్లినీ, చెల్లెలినీకూడా చంపుతాం' అన్నారు. ఇక చేసేదిలేక ఇష్టంలేకపోయినా ఏవివోగూఢచారి కాకతీర లే దతడు.

"అయితే అతడు మంచి గూఢచారి కాలేదు. చూసిందంతా రిపోర్టు చేసేవాడుకాడు. అంచేత ఒక పైశాచిక విధానం అతడిమీద ప్రయోగించారు. 'నీక్లాసులో మరొక గూఢచారిని నియమించాం .... అతడు నీమీద ఒక చెక్‌గావుంటాడు" అన్నారు. ఇక అతడి అవస్థ చూడండి. "జానస్ బాలింట్ క్లాసులో అనుమానాస్పదమైన విధంగా ఏదైనా చర్చిస్తే అది రిపోర్టు చేసేదా? చేశానా ఏవివోవాళ్ళు అతణ్ణి చితకతంతారు. రిపోర్టు చేయకపోతే జానస్ బాలింట్ బహుశా తనమీద గూఢచారేమో! నన్ను పరీక్షడానికే ఇలాఅంటున్నాడేమో?" ఇలాంటి చిక్కుల్లోపడి నా స్నేహితుడు ఆత్మహత్య చేసుకోవాలనుకున్నాడు. ఆ సంగతి తెలిసి అతణ్ణి పిలిచారు. "నువ్వు ఆత్మహత్య చేసుకుంటే నీ కుటుంబం యావత్తూ హతమార్చేస్తాం" అన్నారు.

" ఇలా అయిదేళ్ళు నా స్నేహితుడు బాధపడ్డాడు. కాలం గడపడానికి ఏదో రిపోర్టుచేస్తూనే వుండేవాడు. ప్రతిసంఘటనలోనూ, ఆ పని చేసినవాడు రెండో గూఢచారుడేమో అని చూడవలసివచ్చేది. అసలు రెండో గూఢచారి వున్నాడా నిజంగా అని ఆలోచించవలసి వచ్చేది. అన్నిటికంటే క్రూరమైన విషయం ఒకటి వుండేది. తెలుసా? నేను అతడి ప్రియస్నేహితుణ్ణి; సన్నిహితుణ్ణి. తన జీవితమంతా అతడు నన్ను నమ్మాడు. అతడికి పిచ్చిఎత్తకండా కాపాడింది నేను ఒక్కణ్ణే. చిక్కుల్లోపడ్డ ఏ మనిషయినా ఇంకొకణ్ణి నమ్మవలసివుంటే, అతడు నన్ను నమ్మవలసివుండేది. అయినా కొన్నిసమయాల్లో

అతడు నన్ను భయంతో చూసేవాడు. నేను చెప్పినదేదో అతడిలో ఈ ప్రశ్న రేపేది ; ఇతడే నా మీద గూఢచారికాడుకదా ?''

"మే మిద్దరం నిశ్శబ్దంగా ఒకళ్ళమొహం ఒకళ్ళం చూసుకునేవాళ్ళం. కమ్యూనిజం తొడిగిన అనుమానంతెర చాలాభయంకరమైంది. అది మాస్నేహితులిద్దరిమధ్యా వాలుతుంది. కొంచేపయాక అతడు ఏడ్చేవాడు. నన్ను తాను అపనమ్మకంతో చూశాడనికాదు. ఏవిహో వాళ్ళు జీవితాన్ని కల్మషం చేసి మనని మనం నమ్మలేనట్టు బేరని ఏడ్చేవాడు.

విప్లవం వచ్చినప్పుడు ఏంతోమంది ఏవివోవాళ్ళు రష్యావాళ్ళమీద భక్తితోనే నడుచుకున్నారు. వారిలో ఉషారైనవాళ్ళు కొందరు ఆస్ట్రియాకో. సముద్రందాటి మరేదేశానికో వెళ్ళిపోయారు. కెనడాకి ఇద్దరు వచ్చారు. అమెరికాకి నలుగురికంటే ఎక్కువమందే వచ్చారు. డిసెంబరు 7 న వియన్నాలో అమెరికా కాన్సలేటుముందు క్యూలో విసాకోసం నిలబడ్డవాళ్ళలో ఒక ఏవివోవాడు ధైర్యంగా నుంచుని వుండడం హంగేరీవాళ్ళు కనిపెట్టారు. వాణ్ణి పలకరించేసరికి ఎక్కడో మాయమైపోయాడు. డిసెంబరు చివరిరోజుల్లో ఒక అమెరికా వర్తకుడు సరిహద్దుదగ్గిర, బుడాపెస్టునించి పారిపోవచ్చిన హంగేరీవాళ్ళని ఎంతోమంధిని ఏవివోవాళ్ళునించి రక్షించాడు. తరవాత తాను తప్పించిన వాళ్ళతోకలిసి కులాసాగా కాలయాపన చేస్తుంటే హటాత్తుగా వాళ్ళు కొయ్యబారిపోయారు. ఒక నల్లటిమనిషి ఆ పక్కనించే వెళ్ళాడు. హంగేరియనులు అడిలిపోయారు ; గుసగుసలు ప్రారంభించారు. "వాడు ఏవివో మనిషి.'' ఈ నేరారోపణ నిజమో కాదో అని చూడకముందే నేరస్థుడు యునైటెడ్ స్టేట్సుకి ఎగిరిపోయాడు.

అసలు ఏవివోవాళ్ళు ఎంతమంది వున్నారో మనకి నిశ్చయంగా తెలియదు. మన అంకెలు ఊహాగానాలుమాత్రమే. సాధారణంగా 30 వేలని వింటూ వుంటాం. వీళ్లుకాక మామ్మూలు దుస్తులతో తిరిగేవాళ్ళసంఖ్య రెండు వేలు. మరో అయిదువేలమంది గూఢచారులున్నారు. నేను విన్నమొత్తం రిపోర్టులుబట్టిచూస్తే విప్లవంలో రెండువందల మందికి మించి చావలేదు. దేశమంతా ఉగ్రరూపంతో తిరగబడినాకూడా. ఇంకా 36,800 మంది కొత్త కమ్యూనిస్టు పరిపాలకులకోసం మిగిలారన్నమాట.

రష్యావాళ్ళు హంగేరీని తిరిగి ఆక్రమించుకున్నతరవాత సోవియట్లు కొంతమంది ఏవివో మనుషుల్ని శరణార్థులతో కలిసివుండడానికి పంపించారు. ఇందులో సందేహంలేదు. వాళ్ళు వియన్నా, పారిస్, మాస్ట్రిల్,

న్యూయార్కు నగరాలమధ్య ఒక గూఢచారుల వలపన్నడానికి నియోగింప బడ్డారనడంలో సందేహంలేదు. డిసెంబరు 6న అలాంటి ఏవివోజట్టు ఒకటి వియన్నాలో ఒక శరణార్థిని పట్టుకుని ఎస్టెర్హాజీ కుటుంబానికి చెందిన సమాచారం కావాలని చితగ్గోట్టింది. అదేరోజు ఆస్ట్రియా పోలీసు వియన్నాలో ఒక ఏవివో బసనించి ఒక రేడియో వశంచేసుకున్నారు. బుడాపెస్టులో రష్యా హెడ్క్వార్టర్సుతోవాళ్ళు మాట్లాడుతున్నట్లు తెలిసింది.

సామాన్య అనుభవంకంటే ఏవివో నడవడి ఎంత విలక్షణంగా వుంటుం దంటే చూసినవాళ్ళు "ఇలాంటివాళ్ళు ప్రత్యేకంగా హంగేరీలోనే వుంటారా?" అని అడుగుతారు.

వాళ్ళుహంగేరీ ప్రత్యేకప్రజలుకారు. రష్యాలోనూ, రష్యా చుట్టుపట్లానూ వున్న కమ్యూనిస్టు దేశాలన్నిటిలోనూ ఏవివో సంస్థలలాంటి సంస్థలున్నాయి. కొంతమంది స్త్రీలూ, పురుషులూకూడా జుగుప్సాకరమైన హింసాకార్యాలు చేసి ఆనందించేవాళ్ళూ, అవకాశంవస్తే స్వచ్ఛందసేవకులుగాకూడా పనిచే యడానికి సిద్ధపడేవాళ్ళూ వుండడం మానవజాతి దుర్లక్షణాలలో ఒకటి. ఇలాంటివాళ్ళచేతుల్లో పరిపాలన విడిచిపెట్టే ప్రభుత్వపద్ధతి కమ్యూనిజం.

ప్రపంచంలో ఏ దేశంలో రేపు ఉదయం కమ్యూనిజం అధికారంలోకి వస్తుందో ఆ దేశంలో రేపురాత్రికి హంతకులూ, క్రూరులూ, మతిభ్రష్టులూ పనిచేసే ఏవివోసంస్థని ఒకదాన్ని స్థాపిస్తారు.

అలాంటి అపాయంనించి అమెరికావాళ్ళు తప్పించుకోగలరాఅంటే, నన్ను స్పష్టంగా చెప్పనివ్వండి. అమెరికాలో కమ్యూనిజానికి ఏవివోసంస్థ కావలిసివస్తే - తప్పకండా కావలసివస్తుంది - దానికి కావలసిన మనుషులు. స్త్రీలూ పురుషులూకూడా సులభంగా లభిస్తారు. వాళ్ళు ఒక నీగ్రోని చచ్చి నట్టు తంతూ ఆనందిస్తారు. చిన్నవర్తకులు కెనడాకి స్వాతంత్ర్యకోసం తప్పించుకు పారిపోతూవుంటే తుపాకితో కాల్చిపారేస్తారు.

అయితే టైబరు డొనాతు ఏమయాడు? రిపబ్లికుస్క్వేరులో ఏవివో వాళ్ళమీద ప్రజలు తీసుకున్న కసిచూసి పదిరోజులుదాగున్నా డతడు. ఇంతలో రష్యావాళ్ళు తిరిగీ బుడాపెస్టు ఆక్రమించుకున్నారు. కొత్తమను షుల్ని వేస్తున్నారని తెలిసింది. అప్పుడు హెడ్క్వార్టర్సుకి వెళ్ళి డ్యూటీలో చేరిపోబోయాడు డొనాతు. తీరా అక్కడికి వెళ్ళేసరికి "ఏవివోదళం రద్దు చేసేశారు" అన్నారు. డొనాతు కొయ్యబారిపోయాడు. ఇంతలో వేరే స్పెషలు పోలీసు భర్తీచేస్తున్నారని తెలిసింది. కొంచెం తేరుకున్నా డతడు.

"నీ రికార్డు బాగుంది. నువ్వు అఫీసరు కావచ్చు" అని నచ్చజెప్పాడు ఒక కమ్యూనిస్టు ఉద్యోగి.

"నీకు కారు ఇస్తాం. ని పని వెనకటిలాంటిదే. కాని ఈ సారి నువ్వు నీలి యూనిఫారం తొడగాలి. మిమ్మల్ని 'ఆర్ గ్రూప్స్' అని పిలుస్తాం. వెనకటి ఏవివోలు ఇప్పుడు ఈ కొత్తపేరుతో సోవియటు ఆక్రమించిన హంగేరీలో తిరుగుతున్నారు.

# 7. సెపెల్ మనిషి

బుడాపెస్టు విప్లవానికి కొన్నినెలల పూర్వం హంగేరీదేశం కమ్యూనిస్టు ప్రభుత్వం ఒక అధికారపూర్వకమైన "గైడు" ప్రకటించింది. బాగా ఆరి తేరిన కమ్యూనిస్టులు తయారుచేశా రది. ఏవివో వాళ్ళు దాన్ని బాగా పరి శీలించి వడకట్టారు. పార్టీపద్ధతికి వ్యతిరేకంగా లేకండా చూడడం వాళ్ళ విధి. సెపెల్ గురించి అందులో రాసిన విషయాలు తరవాత జరిగిన సంఘటనల దృష్టితోచూస్తే ఎంతో తమాషాగా వుంటాయి.

"సెపెల్ పారిశ్రామిక కేంద్రాల్లో కల్లా పెద్దది............ సెపెల్‌లోని రకోసీ లోహకర్మాగారానికి సంబంధించినవి 18 ఫ్యాక్టరీలూ, 150 వర్కు షాపులూ వున్నాయి. అక్కడచేసే తవ్వకాల పరికరాలూ, యంత్రాలూ ఎన్నో దేశాలికి ఎగుమతి అవుతూవుంటాయి. సెపెల్‌లో తయారయే మోటారు సైకిళ్ళూ, బైసికిళ్ళూ, కుట్టుయంత్రాలూ, వంటపాత్రలూ, పంపులూ మొదలైనవి ఎన్నో వస్తువులు విదేశాలకు ఎగుమతి అవుతాయి. సెపెల్‌లో ఒక నూనెశుద్ధి కర్మాగారంవుంది; ఒక తోళ్ళ కర్మాగారంవుంది. ఒక పేపరుమిల్లు వుంది.ఈపరిశ్రమలతోపాటు పెద్దపెద్దదుకాణాలూ వున్నాయి. వైద్యాలయాలూ, చక్కనిక్రీడామందిరాలూవున్నాయి. కార్మికుల ఇళ్ళమధ్యవున్నపార్కులోచదువుతూకూచున్న ఒక కార్మికుడి విగ్రహం కొత్తసెపెల్‌కు శోభకూరుస్తూ వుంది. ఇది ఎర్రసెపెల్ వర్తకుల దీర్ఘపోరాటానికి ఫలితంగా వచ్చింది. ఈ కార్మికులు 1919 లో రిపబ్లికు ఆఫ్ కౌన్సిళ్ళను సంరక్షించడానికని కార్మిక సైనికదళాల్లో చేరినవాళ్ళలో మొట్టమొదటివాళ్ళు. తరవాతకూడా సెపెల్ పనివాళ్ళు తమ సంప్రదాయాలమీద విశ్వాసం చూపిస్తూనే వచ్చారు. సెపెల్ ఖాళీచెయ్యమని 1944 లో నాజీలు జారీచేసిన ఆజ్ఞ ప్రతిఘటించారు. ముఖ్యమైన ఫ్యాక్టరీలూ, వాటిలోని సామానులూ కాపాడారు".

చల్లటి సాయంకాలంలో హాయిగా చదువుతూ కూచున్న ఒక కార్మికుడి విగ్రహం తయారుచేయడంలో హంగేరియన్ కమ్యూనిజం రష్యను

నాయకులు నమూనాకి గ్యోర్గీజాబోకంటె మంచిమనిషిని మరొకణ్ణి ఎన్నుకో గలిగివుండరు. గ్యోర్గీజాబో చాలా అంచమైనవాడు. అతడికి ముప్ఫయిఅయి దేళ్ళు వుంటాయి. రకోసీ బైసికిలు కర్మాగారంలో చేతులుతిరిగిన పనివా డతడు. అతడి పొడవు ఐదుఅడుగుల పది అంగుళాలు. సన్నంగా వూచ లాటి మనిషి. కండలు తిరిగిన శరీరం. బూడిదవర్ణం కళ్ళు. నల్లటి జుత్తు. మొహంమీద లోతైన గీతలు అతడు దృఢమైన నిశ్చయభావాలుకల మనిషి అని తెలియజేస్తాయి. గడ్డంకిందవున్న గుంట మంచి జీవితమంటే ఇష్టపడే వాడని వ్యక్తంచేస్తుంది. అతడి భార్య మంచి దృఢమైన శరీరంకల యువతి. అతడికి ముగ్గురు పిల్లలు. ముగ్గురూ మంచి ఆరోగ్యవంతులు. "లోగడ నేను ఆదర్శప్రాయుడైన కమ్యూనిస్టు కార్మికుణ్ణిగా వుండేవాణ్ణి" అంటాడు జాబో, మృదువుగా. తనకి పూర్వం తన తల్లీ, తండ్రీ పనిచేస్తూవున్నట్లే జాబో పదిహేడేళ్ళ వయస్సునించీ సెపెల్‌లో పనిచేస్తున్నాడు. ప్రోలిటేరి యన్ తరగతికి చెందినవాడు కావడంచేత 1940 ప్రాంతాల్లో రహస్యంగా వుండిన కమ్యూనిస్టుపార్టీ అతణ్ణి ఆకర్షించింది. కమ్యూనిస్టులు వెదుకు తూన్న సరైన కార్మికయువకుల లక్షణాలు అన్నీ అతడిలో వున్నాయి. అతడూ, అతడిలాంటి ఎంతోమంది ఇతర కార్మికులూ కమ్యూనిస్టుల బోధలు విని లొంగిపోయారు.

"ఆరోజుల్లో మా సెపెల్ జీవితం చాలా కఠినంగా వుండేది. అంచేత వాళ్ళ వాగ్దానాలు మాకు బాగా నచ్చేవి. 'మనం అధికారంలోకి వస్తే మీరు బానిసల్లా పనిచేయనక్కరలేదు. మనం ఈ ఫ్యాక్టరీ నడిపించామా, మీరు, మోటారుకారులో కూచుని వచ్చే ఈ పెట్టుబడిదారుకోసం పనిచెయ్యరు. కార్మికులే మోటారు యజమాను లవుతారు. ఫ్యాక్టరీ యజమానులూ కార్మి కులే అవుతారు' అని వాళ్ళు అన్నప్పుడు నాకు ఎంతో బాగుండేది.

కమ్యూనిజంకింద కార్మికసంఘాలు ఏర్పడతాయనీ, ఆసంఘాలే ఎంత పనిచేయాలో, ఎంత కూలి ఇవ్వాలో నిర్ణయిస్తాయనీ కమ్యూనిస్టులుచేసిన వాగ్దానం అతణ్ణి బాగా ఆకర్షించింది. "ఇందులో ఎంతయినా అర్థముంది. పెట్టుబడి విధానంకింద ఆఫీసులో ఎవరోఒకరు తమతీర్మానం ఆజ్ఞగా కిందికి పంపుతారు. మేమందరమూ అది కిక్కురుమనకండా శిరసావహించాలి. కమ్యూనిజంలో అలాకాదనీ, బాలటాన్ సరోవరతీరంలో మేం హాయిగా నిశ్చింతగా సెలవుదినాలు గడపవచ్చుననీ చెప్పారు. జీతంతోసహా సెలవులు ఇస్తారన్నారు. ఇప్పుడు అక్కడికి ధనికులుమాత్రమే వెళ్ళగలుగుతున్నారు.

అప్పుడు కార్మికులు వెళ్ళగల రన్నారు. మాకు మంచిమంచి ఇళ్ళుకూడా ఇస్తామన్నారు. ప్రతీకార్మికుడికీ ఒక మోటారుసైకిలుకూడా ఇస్తామన్నారు" అంటాడు జాబో.

కమ్యూనిస్టుల వాగ్దానాల్లో సాధారణంగా ఒక పేదవాడు 'ఇవి వుంటే బాగుండును' అని కలలుకనే వస్తువులన్నీ వుండేవి. ఆకర్షవంతమైన మాటల్లో పొదిగివుండే వాగ్దానాలవి. అంచేతే గ్యోర్గీజాబో రహస్యంగా కమ్యూనిస్టు సంఘంలో చేరాడు. అప్పుడతడు రకోసీమెటల్ పర్క్సులో యుద్ధసామగ్రి తయారుచేసే శాఖలో పనిచేస్తూవుండేవాడు. అంచేతే అతడు యుద్ధంలో చేరనక్కర లేకపోయింది. ఉత్సాహపూరితులూ, ఆవేశపూరితులూ అయిన యువకుల్లో జాబో ఒకడు. తాను కమ్యూనిస్టు హంగేరీకోసం పనిచేస్తున్నాననీ, కమ్యూనిస్టు రాజ్యంలో, పార్టీవాళ్ళుచేసిన వాగ్దానాలన్నీ ఫలిస్తాయనీ గంపెడంత ఆశపెట్టుకున్నాడతడు.

1945 వసంతకాలంలో కమ్యూనిస్టులు పెద్దఎత్తున ప్రచారం సాగించారు. అప్పుడు జాబోకి ఇరవైనాలుగేళ్ళు. ఆ ప్రచారంతోనే కమ్యూనిస్టులికి హంగేరీ వశమయింది. "అదంతా మాలో ఆవేశం రేకెత్తించింది. అయితే పార్టీచేసిన వాగ్దానాలు వెంటనే పూర్తికావని మాకు అర్థమయింది. ఎంచేతంటే, యుద్ధంలో పాడైన హంగేరీ ఇంకా కోలుకోవలిసివుందనీ, పునర్నిర్మితం కావలిసివుందనీ, కొన్ని సంవత్సరాలదాకా మనకి రష్యన్ సలహాదారుల సహాయం ఉంటుందనీ మాకు చెప్పారు. అంతేకాదు, కమ్యూనిజం అంటే ఏమిటో వాళ్ళకే తెలుసుననీ, మాకు తెలియదనీకూడా చెప్పారు.

జర్మనీ చేతులలోంచి హంగేరీని విడిపించినప్పుడు రష్యను విమానాలూ, ఫిరంగులూ దేశాన్ని చాలా నష్టపరిచాయి. అంచేత ఆనష్టమంతా పూర్తిచేయడంకోసం గ్యోర్గీజాబో, అతడి మిత్రులూ రష్యన్ నాయకత్వంకింద నడుం కట్టవలిసివచ్చింది. చేయవలిసిన ఆర్థిక కార్యక్రమం ఎంతోవుండడం చేత, కమ్యూనిస్టులుచేసిన వాగ్దానాలన్నీ వెనకపెట్టవలిసి వచ్చింది. పైకార్యక్రమం పూర్తిచేయడానికి జీతం లేకండానే ప్రతీరోజూ ఒక మూడో భాగం పని ఎక్కువ చేయాలి.

జాబో మంచి కమ్యూనిస్టు. అదనంగా పనిచేయవలిసిన అవసరం అతడు బాగా గుర్తించాడు. "మనకి అట్టే వ్యవధిలేదు. క్యాపిలిస్టులూ, విప్లవ ప్రతికూలవాదులూ హంగేరీని తిరిగి స్వాధీనం చేసుకుని పాతకాలం పాడు దారుల్లోకి దేశాన్ని పట్టుకుపోవాలని చూస్తున్నారు. ఆశక్తి వాళ్ళకి రాకముందే

మనం బలం సంపాదించాలి''అని తనవాళ్ళకి బోధించాడు.

ప్రతీనెలా ఒక్కొక్క మనిషి చేయవలిసినపని అధికమవుతూ వున్నప్ప టికీ జాబో ఏమీ కంగారుపడలేదు. "దానికోసం నేను ఏమీ ఇదికాలేదు. నా మట్టుకు నేను అందరికంటే అధికంగానే పనిచేశాను; పతకంకూడా సంపా దించాను " అనేవా డతడు.

బలమైన అతడి చేతులూ, దృఢమైన అతడి శరీరమూ చూస్తే, అధి కంగా పనిచేయడంలో అతడు అందరినీ మించాడంటే మీకు పిసరంతా ఆశ్చర్యం కలగదు. ఎలాచూసినా అతడు మంచి పనివాడుగానే వుండేవాడు. పోర్టు ఫ్యాక్టరీలోనే పెట్టండి, మరెక్కడైనా పెట్టండి అతడు అంతమంచిగానే పని చేస్తాడు.

"పని అంటే ఎప్పుడూ ఇష్టమే నాకు. అదే మంచిది. ఐతే, 'ఇంత పనికీ ఎంత తక్కువకూలి ఇస్తున్నారో?'అన్నదిమాత్రం నాపెళ్ళి అయ్యేవరకూ నాకు బోధపడలేదు. నాకు పెళ్ళయాక సెలవడిగాను. 'నీ అంత విలువైన మనిషికి సెలవు ఇవ్వలేం' అన్నారు. సెలవల్లో బలాటన్ సరోవరానికి వెళ్ళే వాళ్ళు యావన్మందీ ఒకేరకంవాళ్ళని అప్పుడు నాకు బోధపడింది. ఎప్పుడూ వాళ్ళకే దొరుకుతాయి సెలవలు. మేనేజర్లూ, రష్యన్ సలహాదార్లూ, ఏవీవో చారులూ, పార్టీ నాయకులూ — వీళ్ళే ఎప్పుడూ సెలవులు తీసుకునేవాళ్ళు. కార్మికులకు మాత్రం సెలవులు దొరికేవికావు.

"మోటారులూ, ఉన్నిబట్టలూ, మంచి ఆహారమూ — ఇదంతా ఒక్క రకంవాళ్ళకే దొరికేది. ఈవిషయం నేను ఎవరితోనూ ప్రసంగించలేదు. ఏవీవో మనుషులంటే భయపడడం ఆరంభించాను. ఒకనాడు రకోసీ బైసికిల్ వర్క్సులోపనిచేస్తూన్న నాస్నేహితుడొకడు ఎవ్వరితోనూచెప్పకుండా ఆస్ట్రియా పారిపోయాడు. అతడికి నేను సాయం చేశానని అనుమానపడి ఏవీవోవాళ్ళు నన్ను పట్టుకున్నారు. రెండురోజులు యమయాతనగా గడిచాయి. నన్ను బాగా చిదగ్గొట్టారు. చివరికి ఎలాగైతేనేం నాస్నేహితుడి పలాయనంతో నాకు ఏలాటి సంబంధమూలేదని వాళ్ళకి నచ్చచెప్పేసరికి నాతలప్రాణం తోకకి వచ్చింది. 'అతడి ఆచోకీ ఏమాత్రంతెలిసినా మాకు వర్తమానం చెయ్యి' అంటూ మూడు టెలిఫోను నెంబర్లున్నకార్డు నాకిచ్చివొదిలేశారు. అప్పుడప్పుడు వాళ్ళువచ్చి నేను ఆకార్డు పారేశానో, భద్రంగా వుంచానో అని చూసి వెళ్ళే వారు" అనేవాడు జాబో.

పార్టీలో సభ్యుడయినంతమాత్రాన అంత ఏమీ ఒరిగిపోదని అప్పటికి అర్థమైంది గార్గీజాబోకి. తన జీవితంలో ఎన్నడూ చెయ్యనంతపని ఇప్పుడు చేస్తున్నాడతడు. చెయ్యకతప్పదు కూడాన్నూ కూలిమాత్రం తగినంత లేదు. అలాఅని ఎదురుచెప్పడానికి వల్లకాదు. మణిపూసలాటి కమ్యూనిష్టుఅయినా దెబ్బలు తప్పలేదు. బాలటాన్ సరోవరం ఒడ్డుని కులాసాగా గడపాలంటే సెలవూ దొరకలేదు. తుదకి మంచి కొంపయినా దొరకలేదు.

"ఇంతకీ దీనివల్ల నేను నొల్లుకున్న దేముంది ?" అని తనలో తాను ప్రశ్నించుకున్నాడు జాబో.

వచ్చిందల్లా ఎక్కువ పనిమాత్రమే. అప్పుడప్పుడు — అంటే వారానికి రెండుమూడుసార్లు పని ముగిశాక కమ్యూనిజం ఘనత వినడానికి, వాళ్ళ దీర్ఘమైన ఉపన్యాసాలు ఆలకించడానికి రాత్రంతా పడివుండవలిసివచ్చేది. ఎప్పుడూ ఒకటేపాట "ముందుముందు స్థితిగతులు బాగుపడతాయి" అనే చెప్పేవాళ్ళు. "ఎప్పుడూ స్వయంగా ఏపనీ చెయ్యనివాళ్ళు మాకి ఉపన్యాసాలివ్వడంచూస్తే నాకు ఒళ్ళు మండిపోతుంది" విసిగిపోతూ అనుకునేవాడు జాబో.

"అంతేకాదు, బలవంతాన సమావేశమయ్యే సభలూవున్నాయి. రోజెన్ బర్గు విచారణలు జరుగుతూవుంటే మేము ఊరేగింపుకి బయలుదేరాం. అలాగే ప్యారిసు కార్మికులకోసం, కొరియన్లకోసం ఊరేగింపులు తీశాం. కొరియను యుద్ధకాలంలో చైనా కమ్యూనిస్టువాలంటీర్ల సహాయంకోసం నాలుగు రోజులు కూలిలేకండా పనిచేశాం. అమెరికన్లు చేస్తూవున్న క్రిమియా యుద్ధానికి వ్యతిరేకంగా సభలు చేశాం.

"ఒక్కొక్కప్పుడు కొన్నివారాలపాటు నేను నాకుటుంబాన్ని చూడ నైనా చూడలేదు. తీరా ఇంటికివెళ్ళి వాళ్ళకి ఇవ్వాలంటే చిల్లిగవ్వయినా నాదగ్గిరలేదు. ఇంతా చచ్చి నేను పనిచేస్తే నాకు దొరికేవి నెలకి వెయ్యి ఫ్లోరింగులు మాత్రమే. ఒక జతగుడ్డలకైనా సరిపోదు ఈడబ్బు. ఒకసూటు కుట్టించుకోవాలంటే మిగలదు." అనేవాడతడు.

గోర్గీజాబో గడించే డబ్బంతా అతడి పిల్లల బట్టలికిమాత్రం బొటా బొటీగా సరిపోయేది. కమ్యూనిజం అతడికి ప్రసాదించిన బహుమానమంతా అదే.

గోర్గీ కుటుంబంలోనే మెల్లిగా ఈ మోసానికి వ్యతిరేకంగా తిరుగుబాటు పుట్టింది. అతడి భార్యే ఈ ఉద్యమం లేవనెత్తింది. మొదట ఆమె అడ్డు ప్రశ్నలు మొదలు పెట్టింది భర్తని.

"నువ్వు మంచి కమ్యూనిస్టువి కదా! వాళ్ళ సభలికి హాజరవుతావు; వాళ్ళ ఉత్సవాల్లో పాల్గొంటావు; అయితే మంచి దుకాణంలో వస్తువులు కొనుక్కోలేక పోతున్నావేం మనం, వాళ్ళలాగ?"

"ఎందుకు కొనుక్కోకూడదూ? మహరాజులాగ కొనుక్కోవచ్చు. అయితే బాగా డబ్బుకావాలి దానికి" అన్నాడు జాబో.

"అదికాదు, మంచి దుకాణమంటే ధరలు చౌకగావున్న దుకాణమని నా అర్థం."

"సరే, పెస్టులో పెద్దదుకాణానికి వెళ్ళాలంటే వెళ్ళి చూడు."

"పెస్టుదాకా ఎందుకూ? నేను చెప్పే దుకాణం ఇక్కడ సెపెల్‌లోనే వుంది."

సెపెల్‌లో వున్న మూడు దుకాణాలసంగతీ అతడు చెప్పాడు. మొదటి దుకాణం చాలా మంచిది. అందులో రష్యన్లు మాత్రమే కొనుక్కుంటారు. హంగేరీలో తయారయే మంచిమంచి వస్తువులన్నీ అందులో దొరుకుతాయి. నూటికి ఎనభైవంతులు తక్కువధర వుంటుంది. రెండోదుకాణమూ ఇంచుమించు ఇలాగే వుంటుంది. అది హంగేరియను ఉద్యోగులకోసం పెట్టింది. ఏవివో మనుష్యులు అక్కడ కొనుక్కుంటారు. ముఖ్యంగా వాళ్ళకోసం ఏర్పడ్డదే ఆ దుకాణం. ఇందులో నూటికి డబ్బయివంతులు తగ్గింపుధర వుంటుంది. వనాడో దుకాణం చిన్నకమ్యూనిస్టు ఉద్యోగులకోసం పెట్టింది. అందులోనూ మంచివస్తువులు దొరుకుతాయి. ధరలుకూడా సబబుగానే వుంటాయి.

"ఈ దుకాణాల్లో మంచి వస్తువులున్నా, అయిపోగా మిగిలిన పనికి మాలిన వస్తువులే మనలాంటి కార్మికులకోసం అట్టిపెడతారు. ఇక ధరలా? అందరికంటే మన దగ్గిర అధికం పుచ్చుకుంటారు. ఇలా ఎందుకు చేస్తారో చెప్పూ?" జాబో భార్య అడిగింది.

"ప్రతీదీ అలాగే అనుకుంటాను" అన్నాడు జాబో.

అంతతో వూరుకోలేదామె. "కమ్యూనిజంలో అందరూ సమానంగా వుంటారని నువ్వు చెప్పినట్టు జ్ఞాపకం?" అంది.

"అవును. అంతా సరిగ్గా ఎక్కడెదక్కడ సర్దుకున్నతరవాత అందరూ సమానులే అవుతారు."

"అంతవరకూ పోనీ మనం ఆ చవక దుకాణంలో ఏవైనా మంచి వస్తువులు కొనుక్కోగలిగినట్టు చూడలేవూ ?"

గ్యోర్గీ జాబో రికార్డు ఎంతబాగున్నా, భక్తివిశ్వాసాలతో అతడు పార్టీని ఎంత అంటిపెట్టుకునివున్నా, ఒక సామాన్య కార్మికుడు కావడంచేత అమంచి దుకాణాల్లో వస్తువులు కొనుక్కునే అర్హతమాత్రం అతడు సంపాదించలేక పోయాడు.

"అవి పెద్ద ఉద్యోగులకోసమే. ఆపెద్ద దుకాణాల్లో నీకు అంతబాగుండదుకూడాను" అన్నారు వాళ్ళు.

అవాళరాత్రి జాబో తన భార్యతో రహస్యంగా ఇలా అన్నాడు : "వెనకటికంటె ఎక్కువ దుస్థితిలో వున్నాం మనం. అప్పుడు మనదగ్గిర డబ్బు వుండకపోయినా, కలలయినా కంటూ వుండేవాళ్ళం. డబ్బు దొరికినప్పుడు పెద్ద దుకాణానికి వెళ్ళి ఇష్టంవచ్చిన వస్తువులు కొనుక్కుందాం అనుకునే వాళ్ళం. ఇప్పుడు పెద్దదుకాణానికి మనం వెళ్ళడానికే వల్లకాదట !" మణి వూనల్లాటి ఇలాంటి కమ్యూనిస్టులు కూడా కమ్యూనిస్టు పద్ధతిమీద కత్తికట్టడం విప్లవకాలంలో జరిగిన సంఘటనల్లోకల్లా హృదయం కదిలించేఘట్టం. జాబో విప్లవానికి వ్యతిరేకి కాడు. కమ్యూనిజం పక్షమేవుండి ప్రాణాలుయొడ్డినవాడతడు. రోమను క్యాథలిక్కుకూడా కాడతడు. చర్చివిషయంలో ఎన్నడూ పట్టించుకునే పాపాన పోలేదతడు. శాస్త్రీయంగా కమ్యూనిజంను తూచి, అది మోసమని విలువకట్టినవాడూ కాడతడు. అదంతా ఒక ఫుట్ బాల్ ఆటలో జరిగింది. ఎప్పుడూ మరపురాని ఆ ఆటగురించి అతడు చెవుతూవుంటే, ఆదినాల్లో హంగేరీఅంతటా ప్రజలు తమకు జరుగుతూవున్న మోసం ఒక్కసారి ఎలా పసికట్టారో తెలుస్తుంది........ఇదంతా ఒక చిన్న సంఘటన ఫలితంగానే జరిగింది.

ఆసంఘటన జ్ఞాపకం చేసుకుంటూ గ్యోర్గిజాబో అనేవాడు : "బుడాపెస్టులో ఆవాళ అదొక దివ్యమైన దినం. కొత్త స్టేడియంకు వొరోషిబాల్ వీథమ్మట వెళుతున్నాను. కొత్తసూటు కట్టించుకోడాని డబ్బులేనివాడైనా ఫుట్ బాల్ ఆట చూడడానికి కొన్ని ఫ్లోరింగులు దాచిపెట్టుకుంటాడు. ఏమంటే అసలు ఆస్టేడియంలోకి వెళ్ళడమంటేనే ఆనందంగా వుంటుంది. అది ఎంత ఆనందంగా వుంటుందో నువ్వు వూహించలేవు. కమ్యూనిస్టులుచేసిన

మహాకార్యం ఇది ఒక్కటే అంటాను. యూరపుఖండంలోకల్లా పెద్ద స్టేడియం అది. ప్రపంచంలో వున్నవాటన్నిటిలోనూ అందమైందని అంటారు దాన్ని.

"ఆటలంటే హంగేరియన్లు పడిచస్తారు. హంగేరీదేశం యావత్తూకలిపినా న్యూయార్క్ జనసంఖ్య అంత వుండదు. అంత తక్కువ ప్రజల్లోంచే జగజ్జెట్టి ఆటగాళ్ళు ఎంతోమంది జయలుదేరారు. కత్తిసాములో, ఈతలో, గుర్రపుస్వారీలో హంగేరియన్లే ప్రపంచ వీరులు. 1952 లో జరిగిన హెల్సిన్కి ఒలింపిక్ ఆటలలో ఎన్నో మొదటిస్థానాలు హంగేరియన్లకే వచ్చాయి. జట్లలో ప్రపంచంలో మూడోస్థానం హంగేరియను జట్టుకే లభించింది. పుట్ బాలు పిచ్చి ఈమధ్య హంగేరీలో మరీఅధికమయింది. సెపెల్ మనుషులికి ఆటంటే నిద్రాహారా లక్కరలేదు. ఈ ఆట ఇంగ్లాండు, ఫ్రాన్సు దేశాలకు వచ్చిన ఎన్నాళ్ళకోగాని హంగేరీకి రాలేదు. అయినా పదేళ్ళలోనే వాళ్ళు ప్రపంచంలో ఛాంపియను లైపోయారు. ఎంత పేరుపడ్డ జట్టునైనా ఇట్టేవోడించేసేవాళ్ళు. అందుకనే 'మెర్లిన్ కాలంలో మంత్రగాళ్ళనందరినీ ఇంగ్లాండునించి వెళ్ళగొడితే, వాళ్ళు ఎక్కడికి వెళ్ళారో నాకు తెలుసు. వాళ్ళందరూ హంగేరీకి వెళ్ళారు' అన్నాడు ఒక సుప్రసిద్ధుడైన జట్టు నాయకుడు.

"అవాళ గొప్ప ఆట జరుగుతూవుంది. వియన్నానించి ఒకజట్టు వచ్చింది. ఆటలో మేం గెలిచాం. సాధారణంగా మేమే గెలుస్తూవుంటాం; అదొక పెద్దవిషయం కాదు. ఆస్ట్రియానించి ఆట చూడడానికి వచ్చిన ఒక జట్టువెనకాల కూచుని నేను ఆటచూస్తున్నాను. వాళ్ళు హంగేరియను భాష తెలిసినవాళ్ళు. నేను వాళ్ళతో అన్నాను "మీవాళ్ళు ఈ ఆటలో వోడిపోతారు" అని. దాంతో వాళ్ళతో పరిచయమయింది. పిచ్చాపాటీ మాట్లాడుకున్నాం. "మీరు ఆస్ట్రియానించివచ్చి ఇంత చౌకబారు సీట్లలో కూచున్నారేం?" అని అడిగాను.

"మేమూ కార్మికులమే" అన్నారు వాళ్ళు.

"అయితే, ఇంత మంచిసూట్లు మీరు ఎలా కుట్టించుకోగలిగారు?" అని అడిగాను. ఇంకా ఎన్నోప్రశ్నలు వేశాను. "మీరు కార్మికులుకదా! ఇంతదూరం వియన్నానించి బుడాపెస్టుఆట చూడడానికి వచ్చారే, ఇంత డబ్బు మీకు ఎలావచ్చింది? ఇంత అదనపుభోజనం ఎలా దొరికింది?" ఇలా ఎన్నో అడగాలనుకున్నాను; కాని అడగలేదు. పోలీసువాళ్ళు పక్కనించే నడుస్తూవున్నా వాళ్ళు ఎంచేత భయపడలేదో, వాళ్ళటీము వోడిపోతూవున్నా

వాళ్ళు అంతగా ఎందుకు నవ్వుతున్నారో ఇలాంటివే ఎన్నోప్రశ్నలు జాబో హృదయంలో రేకెత్తాయి. బలమైన తన చేతులు చాచుకుంటూ అతడు ఇలా అనేవాడు: "అవాళనించీ నేను ఒకటేప్రశ్న వేస్తున్నాను– 'మంచి కమ్యూనిస్టులమైన మాకు బుడాపెస్టులో లేనివి ఈపాడుపెట్టుబడిదార్లకి వియన్నాలో ఎలావచ్చాయి?' అని.

ఫుట్‌బాల్ ఆటతరవాత గ్యోర్గీజాబో తన బైసికిల్ ఫ్యాక్టరీకి తిరిగి వచ్చాడు. అతడక్కడ కొత్తప్రశ్నలు మొదలెట్టాడు. "మేంచేస్తున్న ఈబైస్కిళ్ళన్నీ ఎక్కడికీ పోతున్నాయి?" అవన్నీ రష్యా పోతున్నాయి. "పెట్టుబడిదార్లకింద పనిచేస్తున్నప్పటికంటే నేను ఇప్పుడేమైనా అధికం సంపాదిస్తున్నానా?" ఆమాటకివస్తే ఇంకా తక్కువే సంపాదిస్తున్నా డతడు. "వస్తువుల ధరలు అప్పటికంటే ఇప్పుడు హెచ్చాయా? తగ్గాయా?" బాగా హెచ్చాయి. "ఈ రష్యనులందరూ ఇంకా ఇక్కడే ఎందుకున్నారు?" హంగేరీమీద పోలీసునిఘా వుంచడానికి.

చిట్టచివర అన్నిటికంటే పెద్దప్రశ్న వేశాడు జాబో. "అప్పటికంటే ఇప్పుడు నాబానిసత్వం ఏమైనా తగ్గిందా?" జవాబు స్పష్టంగానే వుంది. "అప్పుడు నేను స్వతంత్రుణ్ణిగా వుండేవాణ్ణి. అప్పుడు నవ్వాలన్నా; మనస్సులోవున్నది చెప్పాలన్నా భయముండేదికాదు." ఇప్పుడో? "ఇప్పుడు నేను నూరుపాళ్ళూ బానిసని."

అతి ఛాందసంగావున్న కమ్యూనిస్టయిన జాబో అవాళనించీ బహిరంగంగా మాట్లాడడం మొదలుపెట్టాడు. రకోసీ మెటల్‌వర్క్స్ కార్మికులు చాలామంది తనలాగే భావిస్తారని అతడు తెలుసుకున్నాడు. "ఏవివో మనుషులు నరకంలో పడనివ్వండి. ఇలా అన్నవాళ్ళని అరదండాలు వేస్తారా? అయితే, మమ్మల్ని అందరినీ అరదండాలు వెయ్యవలిసివస్తుంది."

జాబో పార్టీసభలకి వెళ్ళడం మానేశాడు. బూటకపు వూరేగింపుల్లో పాల్గొనడం విడిచిపెట్టేశాడు. అధికంగా పనిచెయ్యడమూ మానేశాడు. ఒక సామాన్య మనుష్యుడు ఎంతపని చేస్తాడో అంతపనిమట్టుకే చేయడం మొదలెట్టాడు. "మీరూ, మేమూ ఒక గొప్ప దుఃఖాంతనాటకంలో చిక్కుకున్నాం" అని పిల్లలతో అనేవాడు. "కమ్యూనిస్టురాజ్యాన్ని ద్వేషించాలని వాళ్ళకి నేర్పాను. 'కమ్యూనిస్టు రాజ్యం కార్మికుల భుజాలమీద ఎక్కికూచుంది' అని వాళ్ళకి నూరిపోశాను."

1956 అక్టోబరు 22 తేదీనాడు ప్రభుత్వానికి వ్యతిరేకంగా కొందరు విద్యార్థులు ప్రదర్శనలు జరుపుతున్నారని విన్నప్పుడు జాబో ఇలాంటి మనః స్థితిలో వున్నాడు. పెస్టు నగరంలో అసభ ఎక్కడ జరుగుతుందో కనుక్కోడానికని, భార్యతో చెప్పకుండానే బయలుదేరాడతడు. బుడాలో కొంతమంది విద్యార్థులు సమావేశమయారని తెలుసుకున్నాడు. నది దాటి అవతలికి వెళ్ళాడు. దీపాలతో వెలుగుతూవున్న సభాభవనంలో ప్రవేశించాడు, సభ జరుగుతూవుంది. యువకుడితర్వాత యువకుడు అడ్డదిడ్డంగా మాట్లాడుతున్నాడు. దానివల్ల ఏమీ లాభం లేదనుకున్నాడు జాబో.

ఇంతలో వెనకనించి ఒకవ్యక్తి లేచాడు. "నేను ఒక్కప్రశ్న అడుగుతున్నాను. రష్యను సైన్యాలు ఏఅధికారం కింద మనదేశంలో వున్నాయి ?" అని అడిగాడు. అతడు జాబోలాంటి దుస్తులే వేసుకునివున్నాడు. అతడువేసిన ప్రశ్న జాబోకు మెరుపులా తగిలింది. తరవాత యువకుడి తరవాత యువకుడు లేచి తమతమ సందేహాలు వెళ్ళగక్కారు. అవన్నీ జాబోహృదయం కూడా కలవరపెడుతున్నవే.

"ఏదో ఇదంతా పెద్దయెత్తుమీదే జరిగేటట్టుంది" గొణుక్కున్నాడు జాబో. ఇంతలో ఒక కార్మికుడు లేచి మాట్లాడాడు. సరిగ్గా జాబో మనస్సులో కొట్లాడుతున్న విషయాలే అతడు మాట్లాడాడు. "మీలాగ చక్కని భాష మాట్లాడలేను నేను. నేను ఒక కార్మికుణ్ణి. నాది సెపెల్. నాలాంటివాళ్ళు ఎంతోమంది మీకు అండగా నిలబడతారు" అన్నాడతడు. దాంతో హాల్లో వున్నవాళ్ళు యావన్మందీ హర్షధ్వానాలు చేశారు. రాత్రి జాబో ఇంటికి వచ్చేస్తూ "ఏదైనా పెద్దఎత్తుమీద పోరాటం ప్రారంభమైతే నేనూ నాకుతగినట్టు పాల్గొంటాను" అని నిశ్చయించుకున్నాడు.

మర్నాడు మధ్యాహ్నం అతడు బైసికిల్ వర్కుషాపులో పనిచేస్తున్నాడు. విద్యార్థులు వీధుల్లో వూరేగింపుతీశారని విన్నాడు. వెంటనే తన తోడి కార్మికులతో అతడు అన్నాడు: "ఏదో అల్లరి అయేటట్టే వుంది. వాళ్ళకి మన సహాయం కావలిసే వుంటుంది."

అదే అభిప్రాయం సెపెల్‌లో చాలామందికి ఆ సాయంకాలం తట్టింది. చీకటి పడేటప్పటికి అందరూ విప్లవకారులతో కలవడానికి వెళ్ళారు. జాబో పనిచేస్తూవున్న ప్రాంతంలోని 15,000 మంది కార్మికుల్లో 240 మందితప్ప తక్కినవాళ్ళు యావన్మందీ విప్లవంలో చేరారు. ఈ 240 మందిలోనూ రెండువందలమందిని విప్లవకారులే ఫ్యాక్టరీలలో విధ్వంసకచర్య జరగకండా

కాపలాపెట్టారు. దాని అర్థం ఏమిటంటే 15,000 మందిలో 40 మంది మాత్రమే కమ్యూనిస్టులంటే నమ్మకంతో వున్నారు. కమ్యూనిస్టులు నమ్ముకున్నవాళ్ళంచరూ ఇలా వాళ్ళ శత్రుపక్షంలో చేరిపోయారు.

విప్లవం మూడు దశల్లోనూ గోర్గీజాబో చేసిన పనులు వివరంగా చెప్పాలంటే అదంతా చర్విత చర్వణం అవుతుంది. విప్లవకారులు రేడియోస్టేషను మీద దాడిచేసినప్పుడు జాబో ఒక ట్రక్కునిండా అయుధాలూ, మందు గుండూ సెపెల్ అయుధాగారం నించి తెచ్చి వాళ్ళకి జయం చేకూర్చాడు. కార్విన్ సినీమాలోవుండి యుద్ధంచేసిన యువకులు సెపెల్ మనుషులే. అక్కడ ఉపయోగించిన తుపాకులూ సెపెల్‌నించి వచ్చినవే. కిలియను బారక్కులలో మందుగుండు అయిపోయినప్పుడు సెపెల్ మనుషులు పంపిన సామగ్రే మాటదక్కించింది. ఆ మొదటి రోజుల్లో జరిగిన విజయవంతమైన యుద్ధాలన్నిటిలోనూ గ్యోర్గీజాబో, అతడి తోటికార్మికులూ, తమ సర్వశక్తులూ విప్లవానికి ధారపోశారు. ఎన్నో తుపాకిగుళ్ళు తలవెంట్రుక వారాలో గోర్గీజాబోమీద పడకండా తప్పిపోయాయి. ఎన్నో టాంకులు కాల్చి పారెయ్యడంలో జాబో చేతులు కలిపాడు. విప్లవకాలంలో అతడు చిచ్చుల పిడుగులా పనిచేశాడు. అతడొక్కడేకాదు, ఒకప్పుడు కమ్యూనిజానికి తమను అర్పించుకున్న, కొమ్ములుతిరిగిన కార్మికయోధులు ఎంతోమంది, తమని దగాచేస్తున్న కమ్యూనిస్టులమీద తమ అయుధాలు గురిపెట్టారు. అది విప్లవం మొదటి దశ.

రెండోదశలో శాంతిస్థాపన తరవాత యుద్ధంలోకంటే ఎక్కువ ముఖ్య పాత్ర వహించాడు జాబో. ఏమంటే సెపెల్ కార్మికుల్లోకల్లా జాబో పెద్దవాడు. అతడి అధ్వర్యంకిందే సెపెల్ కార్మికులు కొత్తహంగేరియనురాజ్యంలో రకోసీ మెటల్‌వర్క్సను ఉపయోగించే ప్రణాళిక తయారుచేశారు. వాళ్ళ ప్లాను విప్లవానికి వ్యతిరేకంగా ఏమీలేదు. అమెరికాలో దాన్ని చాలామంది కమ్యూనిజమనేవాళ్ళే. కాని అప్పటి హంగేరీ దేశానికి అది సమంజసంగానే వుంది. "మేం అఫ్యాక్టరీ జాతీయం చేయడమే ప్రతిపాదించాం. ప్రభుత్వమే దానికి యజమాని; దాని పర్యవేక్షణకూడా ప్రభుత్వానిదే. కాని తక్కిన వివరాలుమాత్రం వేరు. కార్మికసంఘాలే దాన్ని నడపాలి. "సామాన్యంగా ఒక కార్మికుడు ఎంతపని చెయ్యాలో, ఆపని మా ఇంజనీర్లు నియమించాలి. ఆఫీసులో ఎవడోఒక అధికారి 'ఇదిగో మీరు ఇంతపని చెయ్యాలి' అని ఆజ్ఞాపించకూడదు. ఏవివో మనుషులుకాని, అలాంటివాళ్ళు ఇంకెవరు

కానీ వుండకూడదు. సెలవులు అందరికీ ఒకలాగేవుండాలి. వైద్యసౌకర్యాలూ అందరికీ ఒకలాగేవుండాలి. ఈ ప్రణాళిక తప్పకండా ఆమోదిస్తారని మాకు నమ్మకం కుదిరింది'' అనేవాడు జాబో.

నవంబరు 20 దీనాటికి గ్యోర్గీ జాబో కమిటీ ఈపథకం ప్రభుత్వానికి పంపింది. అసలు ప్రభుత్వమే ఎలా రూపొందాలోకూడా జాబో ఆపథకంలో సూచించాడు. "లిబరల్ లేబర్‌పార్టీల సంయుక్త ప్రభుత్వం మంచిదని మాకు తోచింది. ప్రజల ఉపయోగంకోసం ఆహారం ఉత్పత్తి కావాలనికోరే ప్రభుత్వం కావాలి. రష్యాకోసం ఆయుధాలు తయారుచేసే ప్రభుత్వం పనికిరాదు. మేం వ్యక్తిస్వాతంత్ర్యం కోరాం. కోర్టులూ, రాజకీయపక్షాలూ, పత్రికలూ, స్వతంత్ర రేడియో స్టేషనులూ, పైదేశాలకు స్వేచ్ఛగా పోగలిగే హక్కూ కావాలని కోరాం" అన్నాడతడు.

కొత్తహంగేరీ సామాన్యంగా ఎలావుండాలో జాబో ఇలా వివరించాడు: "పాత జమిందారు ప్రభువులు మళ్ళీ అక్కరలేదు మాకు. స్వార్థపరులైన పెట్టుబడిదార్లూ అక్కరలేదు. గుళ్ళు ఏర్పడవచ్చు, కాని అవి వెనకటిలాగ రాజకీయాల్లో కలగజేసుకోకూడదు. మనమంతాకలిసి మంచి మర్యాదైన ప్రభుత్వంకోసం పనిచెయ్యాలి. ఏఆస్ట్రియాయో, స్విట్జర్లాండో, స్వీడనో లా అయినా మారాజ్యం వుండాలి."

గెల్లెర్టు కొండమీద ఫిరంగులు ఈ కలలన్నీ తుడిచేసిన తరవాత గ్యోర్గీ జాబో యుద్ధంలో దూకాడు. రష్యన్ ఫిరంగులు రకోసి మెటల్‌వర్క్సు ఫ్యాక్టరీని పిప్పికింద కొట్టేశాయి. అది విప్లవం రెండోదశ.

విప్లవం మూడోదశలో చెలరేగిన ఘోరయుద్ధంలోకూడ జాబో వుర కాడు. అప్పుడు రష్యన్లను హంగేరియను కార్మికసేనే ప్రాణాలొడ్డి ఎదుర్కొన్నది. జాబో సేనలో సెపెల్ మనుషులందరూ చేరారు. వాళ్ళందరూ మెరికల్లాంటివాళ్ళు; ఒక నిశ్చయంతో వచ్చినవాళ్ళు. ఈ సెపెలు కార్మిక సైనికులు యావన్మందీ బుడాపెస్టుకోసం జరిగిన ఆ యుద్ధంలో హోరాహోరి పోరాడారు. సెపెల్ ఆయుధాగారంనించి తుపాకులు తీసుకుని వాడాడు జాబో. రష్యను టాంకులమీద చల్లడానికి గ్యాసొలిన్ సెపెల్ నించే తెచ్చి ఇచ్చాడతడు. విమానాలు కూలగొట్టే ఫిరంగికి మందుగుండూ అక్కడినించే తెచ్చి ఇచ్చాడు. సోవియట్ విమానం దానితోనే పడగొట్టారు. సెపెల్ మనుషులు తాము స్వయంగా ధ్వంసం చెయ్యలేని ఒకటాంకు ఎక్కడైనా చూశారో, ఎలాగో దానిమీదికి ఎక్కేసి, హంగేరీజేండా దానిమీద ఎత్తేసేవాళ్ళు. ఆజెండా

తీసెయ్యడానికి రష్యన్లు పైకి వచ్చారా, వాళ్ళని చంపేసేవాళ్ళు. అప్పు డింకే ముంది, టాంకు ధ్వంసం చెయ్యడం సులభమైపోయేది. జెండా తీసెయ్య డానికరాకండా రష్యనులు టాంకులోపలే వుండిపోయారనుకోండి, ఆ టాంకు మరో రష్యనుటాంకు కంటపడేది. అది హంగేరీజెండా వున్నటాంకును టప్పున పేల్చేసేది. అయితే ఇలాంటి ఎత్తు అన్నిసార్లూ పనిచేసేదికాదు. కాని రష్యన్లకి అది అర్థమయ్యేవరకూమాత్రం బాగాపనిచేసింది.

మొత్తానికి ఎలా అయితేనేం రష్యన్లే గెలిచారు. సెపెల్ ధ్వంస మయింది. దాంతో జాబో, ఆతని సహచరులూ ఎటూకాకండాపోయారు. వాళ్ళు మెల్లిమెల్లిగా జనానీకంలోకి జారిపోయి, గ్రామాలు పట్టిపోయారు. తరవాత వాళ్ళు చేసింది బుడాపెస్టు యుద్ధచరిత్రలో ఉజ్జ్వలమైన అధ్యాయ మయింది. ఆ వీరఘట్టం బాగాఅర్థం కావాలంటే అప్పటి పరిస్థితి సరిగ్గా తెలుసుకోవాలి.

పట్నంమీద రష్యన్లు పూర్తిగా ఆధిపత్యం వహించారు. పేరుకి ఒక ప్రభుత్వంనిలిపి దాంతో ఎవళ్ళనిపడితే వాళ్ళని చంపించెయ్యడం, ఏ శిక్ష పడితే ఆ శిక్ష వెయ్యించడం చేసేవాళ్ళు. ఆహారపదార్థాలన్నీ తమ స్వాధీనంలో పెట్టుకున్నారు. తమ అదుపులోకి వస్తారని నమ్మకం కుదిరినవాళ్ళకే ఆహారపదార్థాలిచ్చారు. పోలీసుల్నికూడా తమ వశంలో పెట్టుకున్నారు. ఆహారశాఖా, తదితరశాఖలూ తమ పిడికిలిలో పెట్టుకున్నారు. రష్యన్ల ఈఅధికారం ధిక్కరించినవాళ్ళు పస్తుపడి మాడవలసిందే; జైళ్ళలో మగ్గవలసిందే; మృత్యువును వరించవలసిందే.

రష్యావాళ్ళదగ్గిర మరో భయంకరమైన ఆయుధం వుంది. హంగేరియనులు దానికి భయపడినట్టు మరిదేనికీ భయపడేవాళ్ళుకాదు. నవంబరు ఆరోతేదీ సాయంకాలం సెపెల్‌కోసం ఇంకా యుద్ధం జరుగుతూవుండగానే రష్యావాళ్ళు హంగేరియన్ సిపాయీలను ట్రక్కులలో వేసుకుని ఎక్కడికో రహస్యమైన రైల్వేడిపోలకు తీసుకుపోయారు. వాళ్ళను రైలుపెట్టెలలోకూరి సైబీరియా తీసుకుపోయారు. అక్కడ బతికివున్నంతకాలమూ బానిసత్వమే. అయితే బహుశా చేయాలనే చేశారో ఏమోకాని, కొంతమందిని అందులోంచి పారిపోనిచ్చారు. అదిగో అలా పారిపోవచ్చినవాళ్ళద్వారానే ఆ భయంకర వార్త దేశమంతటా అగ్గిలా అల్లుకుంది. చాలామంది హంగేరీవాళ్ళకి అలాంటి శిక్షకంటే చావే నయమనిపించింది. చావడానికే సిద్ధపడి ఆ శిక్షనించి బైట పడ్డారు వాళ్ళు. తుపాకీగుళ్ళతో తుత్తునియలైపోయిన వాళ్ళ కళేబరాలే దీనికి సాక్ష్యం.

యుద్ధం అయిపోయాక చావూ, ఖైదూ, ఏవివో మనుషులూ, సైబీరియా మొదలైన భయంకరశిక్షలూ - ఇవన్నీ కళ్ళముందు నాట్యమాడుతూవున్నా గ్యోర్గీజాబో వీరకృత్యం మానలేదు.

నవంబరు 11 తేదీని సెపెల్ కార్మికులు తమతమ పనుల్లోకి వచ్చారు. హంగేరియన్ ప్రభుత్వమూ, దాని రష్యను ప్రభువులూ కార్మికులికి హెచ్చరిక చేశారు. "పెద్దపరిశ్రమల్లో వెంటనేచేరి ఉత్పత్తి సాగించవలిసింది, అలాకాకపోతే ద్రవ్యోల్బణంవల్ల దేశం కూలిపోతోంది" అని ప్రకటించారు. కార్మికులను పనిలోకిరమ్మని ఎలక్ట్రికు ఉత్పత్తికార్ఖానాలలోనూ, గనుల లోనూ నానావిధాల ప్రోత్సహించారు. ఆహారపదార్థాలు ఇస్తామనీ, పూర్తి కూలి ఇస్తామనీ వాగ్దానాలు చేశారు.

దానికి జవాబుగా జాబో సమ్మె చేయించాడు. అన్నిఫ్యాక్టరీలలోనూ సమ్మె జరిగింది. ఈ సమ్మెచేయాలన్నభావం ఒక్కజాబోకేకాదు, చాలామందికి కలిగింది. తన ఫ్యాక్టరీలోమాత్రం జాబో నాయకత్వం వహించాడు. ఏవివో మనుషులు తనకు వ్యతిరేకంగా రిపోర్టుచేస్తారని తెలుసు. కాని ఏవివో మనుషులంటే అతడికి భయంలేదిప్పుడు. "పోలీసువాళ్ళు స్వాతంత్ర్య యోధులదగ్గిర 3,000 సైకిళ్ళు దొంగిలించుకుపోయారు. అన్నిసైకిళ్ళూ తయారుచేస్తాం; స్వాతంత్ర్యయోధులకి ఇస్తాం. తరవాత ఫ్యాక్టరీ విడిలేసి వెళ్ళిపోతాం" అని ప్రకటించాడతడు.

తక్కిన కర్మాగారాల్లోనూ ఇలాగే గుండెనిబ్బరం కలవాళ్ళు బయలుదేరారు. జాబోలాగే ప్రకటించారు. హంగేరీ అంతటా దిగ్విజయంగా సమ్మె సాగింది. సమ్మెకి కారకులైన నాయకులికి మరణశిక్ష వేస్తామని భయపెట్టారు. అయినా సమ్మె ఆగలేదు.

దేశంలో ఆర్థికజీవితం పూర్తిగా స్తంభించిపోయింది. విద్యుచ్ఛక్తి లేక రైళ్ళు ఆగిపోయాయి. కమ్యూనిస్టులకు పంచిపెట్టడానికి అయితే ఆహారపదార్థాలు తీసుకురమ్మన్నారు ట్రక్కులవాళ్ళు. ఇళ్ళుపూడ్చే పనికత్తెలూ పని మానేశారు. సెపెల్‌లోని ఫ్యాక్టరీలన్నీ ఆగిపోయాయి. కొబాన్యాలోని ఫ్యాక్టరీలు కార్మికులికి కావలసినంతమాత్రం ఉత్పత్తి చేస్తున్నాయి.

ప్రభుత్వానికి బాగాకోపం వచ్చింది. కొత్తజడిపింపులు ప్రకటించింది. లాభం లేకపోయింది. తుదకి కళ్ళునీళ్ళు తిప్పుకుంటూ ఇలా అపీలుచేసింది; "ప్రియమైన కార్మికులారా! దయచేసి పనిలోకి రండి." ఈ అపీలుకూడా ఏమీ పనిచేయలేదు. "కూలి హెచ్చిస్తాం. కార్మికుల ఐకమత్యంకోసం,

ప్రపంచశాంతికోసం పనిచేసే కార్మికులకు అధికంగా ఆహారపదార్థాలిస్తాం” అని వాగ్దానాలు చేశారు.

ఏంచేసినా సెపెల్ మనుషులు దారికి రాలేదు. ప్రభుత్వం ప్రకటించిన ప్రతిప్రకటనకీ గర్వంతో జవాబు చెప్పేవాళ్ళు కార్మికులు. “ గుళ్ళతో పేల్చేసినా, తిండిపెట్టక తిప్పలుపెట్టినా లెక్కచెయ్యని స్థితిలోకి వచ్చారు కార్మికులు. తమ హంతకులతో తాము సహకరించేకాలం పోయింది” అనేవాడు జాబో.

“ కావాలి. ప్రభుత్వం నిర్మించడానికి నమ్మకస్తులైన ఆరుగురు హంగేరియనులు కావాలి. అయితే ఒక్కటే షరతు - వాళ్ళు ఆరుగురూ సోవియట్ రష్యాపరులై వుండాలి” అని గోడలమీద కాగితా లంటించారు.

సమ్మె అలాగె సాగింది. సెపెల్‌నించి పట్నం ఇతర ప్రాంతాలికి పాకింది. అక్కడినించి గ్రామాలికి పాకింది. తాతాబన్యా బొగ్గుగనుల్లో కార్మికులు చూపించిన ధైర్యసాహసాలు హంగేరీలో మరెక్కడా ఎవ్వరూ చూపించలేదు. ఇక్కడ సులభంగా తెలిసిపోయి, తరవాత శిక్షకి గురిఅయే కార్మికులు అందరూ ఒకే మాటమీద “ బొగ్గు తీయం ” అని నిరాకరించారు. “కొత్తకమ్యూనిస్టు స్వర్గంకోసం వేడీ వెలుగూ కలిగించడంకోసం మేం బొగ్గు తవ్వం ” అని స్పష్టంగా చెప్పేశారు. రష్యావాళ్ళు వాళ్ళమీద కారాలూ మిరియాలూ నూరారు. దౌర్జన్యంగా ఎంతవొత్తిడి తేవాలో అంతా తెచ్చారు. తాతాబన్యాకి తినుబండారాలు బందుచేశారు. ఎవడైనా ఒక యువకుడు ఒంటరిగా కనిపిస్తేచాలు, అతణ్ణి సైబీరియాకి పంపించేసేవాళ్ళు. వీధుల్లో పటాలాలు తిప్పారు. టాంకులు నడిపించారు. ఎంతభయపెట్టాలో అంతా భయపెట్టారు. ప్చ్ ! పిసరంతప్రయోజనం లేకపోయింది. గనులు మూసేవుండిపోయాయి. వాగ్దానాలన్నీ నవ్వుతాలుకింద పరిణమించాయి. కార్మికుల పట్టుదల ఏమాత్రమూ నడలలేదు. రష్యావాళ్ళ బెదిరింపు మరింత హెచ్చిపోయింది. కార్మికుల్ని చంపేస్తామన్నారు వాళ్ళు.

“ మాలో ఎవడిమీదన్నా ఒక తుపాకిగుండు పేలిందా మీ గనులు అన్నీ నీళ్ళతో నింపేస్తాం. జాగ్రత్త! ” అన్నారు గని పనివాళ్ళు.

ఈ సమ్మె విశేషం ఇక్కడ కొంచెం ఆలోచించడం సమంజసమనుకుంటాను. హంగేరీ విప్లవంలో మూడు దశల్లోనూ సోవియట్ ప్రచారశాఖవారు తమ దేశానికి కలిగిననైతికపతనం గెలుపుగామార్చి చెప్పడానికి అవకాశముండేది. విప్లవం నడిపింది విప్లవవ్యతిరేకశక్తులే అని వాళ్ళు అనవచ్చు.

"ఈ విప్లవంయావత్తూ అధికారంపోయిన జమీందారీవర్గం లేవదీసింది" అని ఆశియాలోనూ, యూరపులోనూ, ఇంకా ఏ పక్షం దిక్కూ పూర్తిగా వెరగని ఇతరదేశాలలోనూ ప్రచారం చెయ్యవచ్చు. కార్డినల్ మిండ్‌జెంటీ ఉపన్యాసం నిదర్శనంగా చూపించి "చర్చిఅధికార్లు హంగేరీ స్వాధీనం చేసుకోవాలిని చూస్తున్నారు" అన్నారు. జేసెన్ కాడార్ నిర్మించిన కీలుబొమ్మ ప్రభుత్వంలో ఒక చర్చిఅధికారిని మంత్రిగావుండి, వ్యతిరేక విప్లవం కోసం తోడ్పడమని ఆహ్వానించారు. అబద్ధప్రచారం చేశారు. 1954 వార్సాసంధిపత్రం ప్రకారం ఇలాంటిపరిస్థితుల్లో హంగేరీలో ప్రవేశించడానికి తమకు హక్కుందనీ, అది తమ కర్తవ్యమనీ మోసప్రచారం చేశారు. విద్యార్థులూ, రచయితలూ, యువకులూ, కార్మికులూ విప్లవంలో పాల్గొని పోరాడిన విషయం ఏదో ఒక విధంగా కప్పిపుచ్చడానికి చెయ్యవలసిన ప్రచారమంతా చేశారు. విద్యార్థులు ఎక్కడైనా ఒకటేమచ్చు; ఇట్టే ఆవేశానికి లొంగిపోతారు. నిజానికి వాళ్ళందరూ కమ్యూనిస్టులే. రచయితలు భయస్థులు. ఒక్కొక్కప్పుడు వాళ్ళు ఏంచేస్తున్నారో వాళ్ళకే తెలియదు. యువకులు దుర్మార్గులైన పెద్దవాళ్ళ మాటలికి లొంగిపోయి తప్పుదార్లు తొక్కుతారు. కార్మికులు సహజంగా తాత్కాలికావేశంలో పడిపోతారు. అర్థంకాని దేశభక్తి, తొందరపాటూ, తలబిరుసుతనమూ చూపిస్తారు. - ఇలాంటి సాకులు ఇండియాలోనూ, కొంతభాగం ఫ్రాన్సులోనూ, ఇటలీలో కొన్నిప్రాంతాల్లోనూ, ఇండోనేషియాలోనూ స్వీకరిస్తారని చెప్పడానికి విచారిస్తున్నాను. నిజానికి ఈ సాకులు ఎంతైనా నష్టం కలిగిస్తాయి.

అయితే ఎంతచాకచక్యంతోచేసిన ప్రచారమైనా సెపెల్ మనుసుబు ఆవేశంలేకండా చేసిననమ్మె తోసిరాజనలేదు. కార్మికులు - భారీపరిశ్రమల్లో పనిచేస్తూవున్న కార్మికులు స్వయంగాచేసిన సమ్మెఅది. రచయితలూ, విద్యార్థులూ, చర్చిఅధికారులూ వెనకవుండి పురెక్కిస్తే చేసిన సమ్మెకాదది. తొందరపడి చేసిందికానీ, ఆవేశంతో నడిపించిందికానీ కాదది. దాని వెనకవున్న దృఢనిశ్చయమూ, అది నడిచిన కాలపరిమితీ ఇందులో ఎంతో ముఖ్యమైన విషయాలు.

కమ్యూనిస్టులకు నమ్మకమైనవాళ్ళే, వాళ్ళపద్ధతి పూర్తిగా మోసమైందని తెలుసుకున్నారనడానికే సెపెల్ సమ్మె తార్కాణం. సమ్మెనాయకులలో చాలామంది కమ్యూనిస్టుపార్టీ సభ్యులే. కమ్యూనిజం అంటే ఏమిటో పదేళ్ళనించీ ఎరుగుదురు వాళ్ళు. కమ్యూనిస్టు ఉద్యమం బాగానడవడానికి ఎంతో

సహాయపడి పనిచేశారనికూడా. ఇంకొకవిశేష మేమిటంటే సెపెల్‌సమ్మెలో ఆవేశపూరితుడైన ఒక్క విద్యావంతుడుకాని, ఒక్క తత్వవేత్తకాని లేడు.

తనమీద తాను ఎదురుతిరిగిన కమ్యూనిజం అది. హంగేరీలోవుండే పద్ధతే - ఆ దురదృష్టమే ఎవరికిపట్టినా - ఇండియాలో, ఇటలీలో, ఫ్రాన్సులో, ఇండోనేషియాలో - ఎక్కడైనాసరే, ఇదేఫలితం కలుగుతుంది. నిజానికి సోవియట్ కమ్యూనిజానికి ఇది గొప్ప నైతికపరాజయం. కాదని బుకాయించడానికి వీల్లేదు. ఒక్క సెపెల్‌ప్రాంతంలోనే ఏ 40 మందోతప్ప, 15 వేల మంది కార్మికులు ఎదురుతిరిగారు. ప్రతీదీ తమకు సంతృప్తికలిగేటట్టు సమర్థించే కమ్యూనిస్టు ప్రచారకులు దీనిని ఏవిధంగా సమర్థిస్తారు ? కార్మికులు ఉత్తచేతులతోనే సోవియట్ టాంకుల్ని ఎదిరించారు. దీనినేమంటారు? గ్యోర్గీజాబోలాంటి మనిషి మారడానికి ఏంసాకు చెపుతారు ? ప్రతిఘటన ఇక సాధ్యంకాదని తోచాక, సోవియట్లకు వ్యతిరేకంగా సమ్మెకట్టి నాయకుడై నిలిచాడు జాబో, దీన్నెలా సరిపెడతారు ?

బుడాపెస్టులో జరిగిన ఉదంతమంతా ఎరిగిన ఏ మనిషయినా సోవియట్ రష్యాలో కార్మికసంఘాలు సమర్థించి చెప్పిన ఈ కింది విషయాలు నమ్ముతాడా ? ఒక నగరానికి నగరం పూర్తిగా నరికిపారేసిన ఘోరం సమర్థిస్తూ యూరపు కార్మికులకు చెప్పినమాటలు ఎవరైనా నమ్ముతారా ? "ప్రియమైన కామ్రేడులారా! మీకు బాగా తెలుసు. మన విప్లవవ్యతిరేకశక్తులు అణిచెయ్యడంకోసం హంగేరీప్రభుత్వం ప్రార్థించగా సోవియటుసైన్యాలు హంగేరీలో అడుగుపెట్టాయి. హంగేరీప్రజల హక్కులు రక్షించడానికీ, యూరపులో శాంతిస్థాపించడానికిమాత్రమే సోవియటుసైన్యాలు హంగేరీవచ్చాయి. సోవియటు సేనలు చూస్తూ వూరుకోలేకపోయాయి. అలా వూరుకునేవుంటే దేశం రక్తపాతమయిపోయేది. కార్మికులికి తీరనినష్టం కలిగేది. సోవియటు సేనలు ఎప్పుడూ న్యాయపక్షమేవుండి, న్యాయంకోసమే దెబ్బలాడతాయి. ఈ విషయమే మీరు గమనించాలని కోరుతున్నాము ".

సెపెల్ మనుషులు ఈ అబద్ధాలు సహించలేకపోయారు.

బుడాపెస్టులో జరిగిన ఆందోళనయావత్తూ జమీందారీవర్గంవాళ్ళు లేవదీసిందే అనీ, అమాయకులైన కమ్యూనిస్టు కార్మికులమీద తిరిగీ జమీందార్ల పెత్తనం సంపాదించడంకోసం ప్రయత్నిస్తున్నారనీ కీలుబొమ్మప్రభుత్వం ప్రచారం చేసింది. అర్థంలేని ఈ ప్రచారం గ్యోర్గీజాబో, అతని స్నేహితులూ ఆవహ్యించుకున్నారు.

"నలభైమంది సెపెల్ జమీందార్లు ఎంతోమంది సేవకులతో కలిసి రకోసీమెటల్‌వర్క్స్ దగ్గర తలో కోటలోనూ నిలిచి ప్రభుత్వాన్ని ఎదిరిస్తు న్నారు" అని పోస్టర్లు ప్రకటించారు.

"సెపెల్‌లో ప్రతిభవనంలోనూ సురంగాలు చేసి వుంచాం. వాటిని ఆక్రమించుకోవాలనిగాని, మమ్మల్ని బలవంతాన పనిచేయించాలనిగాని వూనుకున్నారా ఇవన్నీ ముక్కలకింద ఎగరగొట్టేస్తాం" అనికూడా ప్రకటిం చారు.

సెపెల్‌లో జరిగిన ప్రతిఘటన ప్రాముఖ్యత కార్మికుల అనమాన శౌర్య పరాక్రమాల్లోలేదు, అసమ్మె నడిపించిన కట్టుదిట్టంలోనూ, పద్ధతి లోనూ వుంది. అసమ్మెనుగురించి వినడానికి ప్రపంచానికి వ్యవది దొరికింది. కమ్యూనిస్టు మనుషులే కమ్యూనిజం విధానానికి ఎదురు తిరిగడం చూసి ప్రపంచం ఆశ్చర్యపోయింది. సమ్మెజరక్కపోయివుంటే ఈతిరుగుబాటులో నిజమైన కార్మికులే లేరని సోవియట్లు వాదించేవాళ్ళు. అవిప్లవంలో కార్మి కులు లేరని అన్నారుకూడా. విప్లవం ఆకస్మికంగా కాని, తెలియకండాకాని అణిగిపోయివుంటే రోములోనూ, పారిసులోనూ, న్యూఢిల్లీలోనూ ఏదోవొక సమాధానం చెప్పేసేవాళ్ళే. కానైతే గ్యోర్గీజాబో వంటివాళ్ళు కమ్యూనిజం కోరలలో చిక్కకండా, అంతపట్టుదలతో వొకనెలంతా, రెండో నెలకూడా సమ్మె సాగిస్తున్నారంటే అది కేవలం వొకచిన్నవిషయంగా తోసి పారెయ్య డానికి వీలులేదు. నిజంగా కమ్యూనిజం నిరాకరణే అది. సందేహంలేదు. 1957 చివర ఈపుస్తకం అచ్చుకి వెళుతూవున్నప్పుడే సెపెల్‌కార్మికులు ఆవేశంలేకండా పట్టుదలతో సమ్మెసాగిస్తున్నారు; కమ్యూనిజంగురించి తమ అభిప్రాయం ప్రపంచానికి ప్రకటిస్తున్నారు. సమ్మె ప్రారంభమయి నాలుగు నెలలయింది అప్పటికి.

కొరియా యుద్ధంలోనూ, మున్సిపలుకొట్లాటల్లోనూ, యాండావ్‌దగ్గిర జరిగిన గొప్పసంఘటనల్లోనూ, ఎన్నోసాహసకృత్యాలు చూశాను. కాని సెపెల్ మనుషులు శాంతంగానూ, సక్రమంగానూ సాగించిన సమ్మెను మించిన సాహసకృత్యం ఎక్కడా చూడలేదు. ఒకటాంకు ఎగరగొట్టెయ్య డానికి కొందరికి మొండి ధైర్యం వుంటుంది. సహజమైన ధైర్యం వుప్పొం గితే అద్భుతమైన పనులు చేసేస్తారు కొందరు. కాని సెపెల్‌లో కార్మికులు ప్రకటించిన ధైర్యం అలాంటిది కాదు. అది హృదయంమీదా, ఇచ్ఛాశక్తి మీదా ఆధారపడింది. తమపేర్లు రష్యన్లు రాసుకుంటున్నారని తెలిసీకూడా

నిర్భయంగా మ్యానిఫెస్టోమీద కార్మికులు సంతకాలు పెట్టారు. అడ్డుచెప్ప కండా తమఫోటోలు తీసుకోనిచ్చారు. ఆఫోటోలు వాళ్ళమీద కసితీర్చుకో డానికి ఉపయోగిస్తవని వాళ్ళకి బాగాతెలుసు. అయినా అడ్డుచెప్పలేదు వాళ్ళు. వేషాలు మార్చుకోకండానే రష్యన్ల ఎదట నుంచున్నారు. అవిధంగా వాళ్ళు సోవియట్ అధికార్లమీద తమకువున్న అసహ్యం ప్రకటిం చారు. ధైర్యసాహసాలికి ఇంతకంటే నిదర్శనం ఏం కావాలి ?

నవంబరు 22 దీనాడు సమ్మె బాగా తీవ్రంగా సాగుతూవుంది. గ్యోర్గీ జాబో ఒక మీటింగులో బాగా వాదించాడు. "రష్యావాళ్ళు ఏం చేసినాసరే, సమ్మెమాత్రం సాగవలిసిందే" అని గొంతెత్తిచెప్పాడు. బాగా అలిసిపోయి ఇల్లుచేరుకున్నా డతడు. ఇంట్లో అడుగుపెట్టేసరికి అతడిభార్య చాలాకంగారు పడిపోతూ అంది – "నిన్నరాత్రి ఫర్కాస్‌వారి అబ్బాయిని సైబేరియాపట్టుకు పోయారు." ఆమెకంఠం గద్గదికపడిపోతూవుంది.

"ఇవాళో రేపో మననీ సైబీరియా పంపేస్తారు" కుర్చీలో కూల బడుతూ అన్నాడు జాబో.

"మనం పిల్లలతో ఆస్ట్రియాకి పారిపోవాలి" చేతులు నులుపుకుంటూ గబుక్కున అంది జాబో భార్య.

జాబో మాట్టాడలేదు. రెండుచేతుల్లోనూ తలపెట్టుకుని ఆలోచిస్తూ కూచున్నాడు. ఈపరిస్థితి ఎప్పుడో ఒకప్పుడు తప్పకుండా వస్తుందని ఎన్నాళ్ళయో తెలుసు నతడికి. ఈవిషయం ఆమెతో చెప్పాలని లోగడ రెండు మూడుసార్లు నాలిక చివరిదాకా వచ్చింది. ఇప్పుడిక తప్పలేదు.

"నేను హంగేరీవాణ్ణి. ఆస్ట్రియావాణ్ణి కాదు."

"నేనుకూడా ఆస్ట్రియావాన్నికాను. కానైతే హంగేరీలో నాపిల్లల్ని బతికించుకోలేను." తీవ్రంగా అం దామె.

"ఇది నాఇల్లు." దృఢంగా అన్నాడు జాబో.

"జాబో!"–మృదువైనకంఠంతో అం దామె - "ఆస్ట్రియాలో నీలాంటి వాళ్ళు కావాలి. శరణార్థుల్ని అమెరికా ఆదుకుంటుందని ఇవాళే బి.బి.సి. చెప్పింది."

"నాకు అమెరికా అక్కర్లేదు–" అంటూ అందుకోబోతున్నాడు జాబో, ఇంతలో ఏదోపెద్ద ఆర్తనాదం వినపడింది. జాబోభార్య వులిక్కిపడి కుర్చీ లోంచి లేచింది. "నేను హంగేరీలో వుండలేను" తలమీద చేతులుపెట్టుకు పిచ్చిగా అరిచింది. "ఎంతమాత్రం ఇక్కడ వుండలేను. ఎప్పుడు మోటారు

మన ఇంటిముందు ఆగి పోలీసులు... ....'' కుర్చీలో కూలబడి వెక్కి వెక్కి ఏడుపు ప్రారంభించింది. "జాబో, కొద్దిరోజుల్లోనే నిన్నూ తీసుకుపోతారు."

తల్లి ఏడుపు విని కొడుకుల్లో ఒకడు లోపలికి వచ్చాడు. అతణ్ణి చూసి, "బట్టలూ అవీ సర్దుకో. తమ్ముళ్ళతోకూడా చెప్పు" గబగబా అం దామె.

మణిపూసలాంటి కమ్యూనిస్టు జాబో. పెద్దపరిశ్రమలో పనిచేస్తున్నాడు. సమ్మకస్థుడైన కార్మికుడు. అలాంటివాడు నిస్సహాయుడైపోయి భార్యనిచూస్తూ వుండిపోయాడు. ఆమెతో వూరికే వాదించిమాత్రం ఏం లాభం? మాట్లాడకుండా బైటికి వచ్చేశాడు. చలిగాలిలో పచారుకి బైలు దేరాడు.

ఆ పరిసరాలన్నీ అతడి బాగా తెలిసినవే. అది అతడి సెపెల్. పెట్లుబడిదార్లనించీ, నాజీలనించీ, రష్యావాళ్ళనించి అతడు ఆభూమిని రక్షించాడు. చిన్నప్పటినించీ అతడు అక్కడే పెరిగాడు. అక్కడి పెద్దపెద్ద భవనాలంటే ఆతడికి ఎంతో అంత ప్రీతి. అక్కడ తయారయే వస్తువులంటే ప్రాణం. చీకటిలో అవుపిస్తూవున్న అఫ్యాక్టరీ తనచేతులతో కట్టాడతడు. సోవియట్ టాంకులపాలుకాకండా తాను దాన్ని రక్షించాడు. దాని గోడలమధ్య ఎందరితోనే స్నేహంగా ఆనందించాడు. సెపెల్ దివ్యమైన ద్వీపం. బంగారం లాంటిభూమి. ఎప్పుడూ ఇవాళవున్న పరిస్థితులే వుంటాయా? ఏమో క్రమంగా బాగుపడతాయేమో! ........ తరవాత—తరవాత.

దూరంనించి ఒకమోటారు దీపం కనిపించింది. అనుకోకండానే అతడు నీడచాటుకి జరిగాడు. ఏమంటే కమ్యూనిజంలో మోటారుకారంటేనే ప్రమాదం. పోలీసువాళ్ళకీ, పార్టీపెద్దలికీ తప్ప ఇంకెవళ్ళకీ కార్లు వుండవు. వాళ్ళు వచ్చారంటే ఏదో ఆపదవచ్చిందన్నమాటే. దీపం అటూ ఇటూ తిప్పుతూ మోటారుకారు జాబో వున్నతట్టే వచ్చింది. పోలీసువాళ్ళచేతుల్లో తుపాకులు మెరుస్తున్నాయి. అవి స్పష్టంగా చూశాడు జాబో. నిశ్శబ్దంగా నుంచున్నా డతడు. తానుమాత్రం వాళ్ళకంట బడలేదు. మెల్లిగా కారు తన పని మీదికి వెళ్ళిపోయింది. అచీకటిలో తాను ఎంతభయపడ్డాడో చివర చెప్పాడు జాబో.

"నేను ఎంతభయపడ్డానో చెప్పలేను. ఎన్నోసంవత్సరాలనించి నిరాశతోనే బతుకుతున్నాను. ఎన్నోవస్తువులు కొనాలని వుండేది. కాని వాటి కోసం ఏమీ మిగల్చలేకపోతున్నాను. అవకాశమే లేకండావుంది. అన్నిటికంటే అధమమైంది లోపలివెల్తి. చిన్నప్పటినించీ ఏయే ఆశలు పెట్టుకు బతికామో, అవన్నీ మాయమైపోయాయి. కమ్యూనిస్టులు ఎన్నోవాగ్దానం

చేశాను. ఒక్కటీ క్రియలోకి రాలేదు. నిరాశతోకూడిన భవిష్యత్తు ఎంత భయంకరమైందో మీకు అర్థంకాదు. విప్లవం ప్రారంభంలో మాలో చాలా మందిి మంచి ధైర్యసాహసాలు కలిగి వుండేవాళ్ళు. ఎంచేతో తెలుసా? చచ్చినా, బతికినా మాకు లక్ష్యముండేదికాదు. మాహృదయాల్లో ఆశవుండేది. ఏదొ ఒక కొత్తవిధానం వస్తుందనీ, నిజాయితీ ఏర్పడుతుందనీ అనుకున్నాం. కానైతే రష్యావాళ్ళు తిరిగి వచ్చేసరికి మళ్ళీ ఘోరమైన దినాలు ప్రారంభ మవుతాయని తెలుసు. అప్పుడు ఎంతో ధైర్యంగా వుండేవాణ్ణి. సైబీరియా అంటే లక్ష్యంలేకుండా వుండేది. అది సెపెల్‌కంటే అధ్వాన్నంగా వుండదు కదా అనిపించేది. సైబీరియాలో నువ్వు జైల్లో వున్నానన్నైనా చెప్పుకుంటావు. ఇక్కడ జైల్లోవున్నా అలా చెప్పుకోలేవు. అంచేత ఆనీడలో నిలబడి, మోటారు కారు దీపాలికి భయపడ్డప్పుడూ, నాభార్య ఆర్తనాదం విని ఉలికిపడ్డప్పుడూ నాలో నేను అనుకున్నాను - "కెనడాలోనో, ఆస్ట్రేలియాలోనో ఇంతకంటె బతుకు బాగుంటే అక్కడికే పోతాను. బతికిందే వూరు" అని. ఇంతకీ నేను బాగా భయపడిపోయాను.

గ్యాసోలిన్ చల్లి టాంకులు ధ్వంసంచేసిన మనిషి, నమ్మే నాయకుడుగా రొమ్మువిరుచుకు నుంచున్న మనిషి — చేతుల్తో మొహం బాదుకుంటూ "నేను భయపడిపోయాను" అన్నాడు.

నీడల్లోనే జరుగుతూ జాబో మెల్లిగా ఇల్లు చేరుకున్నాడు. అప్పటికే అతడి భార్యా, ముగ్గురు పిల్లలూ తమ వెచ్చటి దుస్తులన్నీ మూటకట్టుకుని సిద్ధంగా వున్నారు. జాబోభార్య ఏడవడం లేదు. ఆరాత్రే బుడాపెస్టు వొదిలేసి ఆస్ట్రియా పారిపోవడానికి ఆమె నిశ్చయించుకుంది. భర్త తనవెంటవచ్చినా సరే, రాకపోయినాసరే, పారిపోవడంకోసం ఏంచెయ్యవలిసివచ్చినాసరే, అన్నిటికి సిద్ధంగానే వుందామె. భయంకరమైన ఆవాతావరణంలో ఒక్క నిమిషమైనా వుండలే దామె. అలాంటి నరకంలో తన పిల్లలు నిమిషమైనా పెరగకూడదు. అదీ ఆమె నిశ్చయం.

జాబో భార్యతట్టు చూశాడు. తన వున్నిబట్టల దగ్గిరికి వెళ్ళాడు.

"నడవండి, వెళదాం" అన్నాడు. అలా గ్యోర్గీజాబో, తన కుటుంబమూ హంగేరీ వొదిలేశారు. ఒక చేతిసంచిలో పిల్లలకోసం కొంచెం ఆహారం పట్టుకున్నారు. భక్తితో పదేళ్ళు కమ్యూనిజం సేవించి, ప్రతిభాశాలి అయిన ఆ కార్మికుడు భౌతికమైన తన ఆస్తి అంతా ఆచిన్నసంచిలో పెట్టుకుని వెళ్ళిపోయాడు. ఆసంచితోనే తన భయంకూడా తీసుకుపోయాడు. సెపెల్

దీవినించి పెస్టుకు వెళ్ళాడు. అక్కడ వంతెనదాటి బుడాకు వెళ్ళాడు. వెనక్కితిరిగి పెస్టు సౌందర్యం చూడనన్నా చూడకండా వెళ్ళిపోయాడు. ఎంచేతో తెలుసా ? పెస్టు అందమంతా ధ్వంసమే అయిపోయివుంది గనుక.

## 8. పెటోఫీ కావ్యం

బుడాపెస్టు వీధుల్లో ధ్వంసమైన ప్రతీవంద రష్యన్ టాంకుల్లోనూ దాదాపు ఎనభై అయిదు టాంకులు ఇరవై వొక్క ఏళ్ళలోపు యువకుల చేతనే ధ్వంసమయాయి.

ఆయువకుల జీవితానుభవం తెలుసుకుంటే చాలు ఈవొక్క విషయమూ హంగేరీప్రజల జీవితంమీద ఎలాంటి ప్రభావం లేసిందో తెలిసిపోతుంది. 1936 లో పుట్టిన వొక శిశువు అయిదేళ్ళవరకూ అతడికి రాజకీయవిషయాలు ఏమీతెలియవు. సరిగ్గా అప్పుడే రెండో ప్రపంచమహాయుద్ధం వచ్చి హంగేరీకి దెబ్బతగిలింది. ప్రతీక్షణమూ జీవితం వొక విషమసమస్యగా పరిణమించింది. అతడికి ఎనిమిదోఏడు వచ్చేసరికి నాజీ ఆక్రమణవల్ల అష్టకష్టాలూ అనుభవించాడు. పదోఏడు వచ్చేసరికి కమ్యూనిజం వచ్చింది; కొంత శాంతి కలిగింది. ఈవిషయం జ్ఞాపకం వుంచుకోడం చాలా అవసరం. ఇరవయ్యేళ్ళ హంగేరియన్ యువకుడు ఎవ్వడూ తనపెద్దలమల్లే సుఖప్రదమైన గతప్రపంచం భావిస్తూ వెనక్కి చూడలేదు. అతడి ప్రారంభదినాలు వొడుదుడుగ్గా గడిచాయి. కమ్యూనిజంకింద కడుపులో చల్లకదలని వాతావరణం ఏర్పడింది. తొలిసంవత్సరాల్లో అతడికి ఆకలిబాధ తెలుసు. కాని కమ్యూనిజంలో ఆహారం దొరికింది. చిన్నప్పటినించీ తమ సిద్ధాంతాలు తలకిపట్టిస్తే మనిషిని ఎన్నటికీ 'అవి వొదలవు' అన్నది కమ్యూనిస్టుల రాజకీయసిద్ధాంతం. అంచేత పిల్లల్ని బాగా ఆదరించి చేరదీశారు వాళ్ళు. జనంలో తక్కినవాళ్ళకంటే పిల్లలమీదే ఎక్కువ శ్రద్ధచూపించారు. కమ్యూనిజం తెలుసుకోడానికీ, దాన్ని ప్రేమించడానికీ కావలిసిన అవకాశాలన్నీ వాళ్ళకి కల్పించారు.

ఉదాహరణకి — ఒక పదేళ్ళకుర్రాడు పయనీర్లలో చేరవచ్చు. అక్కడ అతడికి వొక ఎర్రటోపీ దొరుకుతుంది. అక్కడ వారానికి రెండుగంటలు కమ్యూనిజంమీద ఉపన్యాసాలుంటాయి. 'మనిషన్నవాడు రష్యాలో వుండడం

మహాదృష్టం' అని మహోపన్యాసాలు జరుగుతాయి. ప్రచారక ఫిలుములికి పూరికే ప్రదర్శనలిస్తారు. ఆకుర్రాడుకాని, అతడి కుటుంబంకాని ఎన్నడూ ఎరగనివి, ఎప్పుడూ కొనలేనివి మంచిమంచి చాక్లెట్లూ, పిప్పరమెంట్లూ, నారింజపళ్ళూ పూరికే ఇస్తారు. 'రష్యావాళ్ళు మీస్నేహితులు. వాళ్ళేమీకు ఇవి పంపారు' అని వాళ్ళకి నూరిపోస్తారు.

పద్దాలుగో ఏట ఆకుర్రాడు 'కోమ్‌సోమాల్' ప్రవేశిస్తాడు. అందులో అతడు కమ్యూనిస్టు సిద్ధాంతాలు నేర్చుకుంటాడు. పడమటిదేశాల్ని ద్వేషించాలని అక్కడ అతడికి ఉపదేశిస్తారు. ఈ ఉపదేశం ఒక ప్రత్యేకమైన శ్రద్ధతో సాగుతుంది. 'మన పవిత్రమైన హంగేరీదేశాన్ని అమెరికా ఫాసిస్టుల బారినించి రక్షించుకోవలసిన దినం ఎప్పుడో ఒకప్పుడు వస్తుంది' అని అక్కడి ఉపాధ్యాయులు రాత్రింబగళ్ళు ఒకేపాట పాడతారు. 'మనదేశం కబళించడానికి ఆస్ట్రియాలో అప్పుడేవాళ్ళు పొంచి కూచున్నారు' అని హెచ్చరిస్తారు.

అదయాక ఆకుర్రాడు 'స్వాతంత్ర్య యోధసంఘం' లో చేరతాడు. అందులో అతడికి మిలిటరీ డ్రిల్లు నేర్పుతారు. రివాల్వరు ఎలావాడాలో, ఒక పెద్దరైఫుల్ ఎలా విరవాలో, మ్యాపు ఎలాచదవాలో - ఇలాంటివన్నీ చెపుతారు. 'మన హంగేరీమీద దాడిచేసే అమెరికావాళ్ళని ఎదుర్కోవాలంటే ఇవన్నీ మీకు వచ్చితీరాలి' అని ఉపాధ్యాయులు పదేపదే పనిగట్టుకు చెపుతారు ఈ శిక్షణ ప్రణాళికలో పశ్చిమదేశాలమీద ద్వేషం పుట్టించడమే ముఖ్యం. మిలిటరీపాటలు పాడడమూ, బార్లుతీరి నడవడమూ – ఇలాంటి ఉత్సాహ కార్యక్రమాలుకూడా వుంటాయి. పడమటిదేశాలు బాగా ద్వేషించే కుర్రాళ్ళూ, అమెరికాతో దెబ్బలాడడానికి ప్రాణాలు ఒడ్డుతామని నిరూపించిన వాళ్ళూ మంచి తెలివైన కుర్రాళ్ళకింద నమోదయేవాళ్ళు. ఇలాంటి 'తెలివైన కుర్రాళ్ళ'కి ఒక ప్రత్యేకమైన శిక్షణప్రణాళిక వుంటుంది. ఇళ్ళల్లో చేసిన గ్యాసోలిన్ బాంబులతో అమెరికా టాంకులు విధ్వంసం చెయ్యడం వాళ్ళకి ముఖ్యంగా నేర్పుతారు. విమానాలూ, క్యాంపింగూ, ఆటలూ – అంటే తుపాకి గురిపెట్టడం, గొడుగు సిపాయీలతో పోట్లాడడం – ఇలాంటి విషయాలుకూడా చెపుతారు. 'ఇంతకీ రష్యాదేశంతో బాగా స్నేహంగావుంటేనే మనకి బలం. ఈస్నేహం ఎంత అధికంగావుంటే హంగేరీబలం అంత అధికంగా వుంటుంది' అంటూ ఆభావి కమ్యూనిస్టు కుర్రాడికి నూరిపోస్తారు. "కార్మికుల పిల్లలందరికీ చదువు నేర్పడం, సోషలిజంమీద భక్తిగావుండడం,

హంగేరీ కమ్యూనిస్టుపార్టీమీద శ్రద్ధకలిగి వుండడం, సోవియట్‌యూనియను మీద విశ్వాసం కలిగివుండడం, విప్లవకరమైన చైతన్యం సంపాదించడం, యుద్ధంకోసం సిద్ధంగా వుండడం – ఇవీ యువజనసంఘాల ఉద్దేశాలు'' అని ఒక అధికారగ్రంథం వివరించింది.

స్కూళ్ళలో కమ్యూనిస్టుప్రచారం మరీ ఒత్తిడిగా వుంటుంది. ప్రతీ తరగతిలోనూ ఉపాధ్యాయులు కుర్రాళ్ళకి కమ్యూనిజం అంటే ఏమిటో బాగా బోధపర్చాలి. కమ్యూనిస్టు 'పరేడ్'లోకి వాళ్ళని తీసుకువెళ్ళాలి. రష్యా గొప్పతనంగురించీ, హంగేరీ కమ్యూనిస్టు చరిత్రగురించీ, ఉపన్యాసా లివ్వాలి. ప్రచార ఫిల్ములు చూపించాలి. అమెరికా సామ్రాజ్యతత్వానికి వ్యతి రేకంగా ప్రదర్శనలు చేయించాలి కమ్యూనిజం చెప్పేదంతా పొగడాలి. దాని 'ఊహాశత్రువుల్ని' దుమ్మెత్తి పోయాలి. ఇవే ఉపాధ్యాయుల పని. కింది తరగతినించి చివరితరగతివరకూ ఏఒక్క విద్యార్థీకూడా ఈఒత్తిడి తప్పించుకోలేడు.

అయితే ఇది ఉపాధ్యాయులందరికీ చేతయేది కాదు. వాళ్ళలో చాలా మంది విప్లవంలో అసాధారణ వీరులనిపించుకున్నారు. కాని దురభిమానం కల కొందరుమాత్రం అఒత్తిడిచేసేవాళ్ళు. వాళ్ళంతా ఏవివో సంస్థ తెచ్చి పెట్టినవాళ్ళు. వాళ్ళు రహస్యపోలీసులతో తమ తోటిఉపాధ్యాయులమీద పితూరీలు చెప్పేవాళ్ళు. ఒక ఉపాధ్యాయుడు కమ్యూనిజమును మనస్సులో ఎంత ద్వేషిస్తూ వున్నా ఈ గూఢచారుల భయంవల్ల విద్యార్థులముందు కమ్యూనిస్టుసిద్ధాంతాలు పొగడక తప్పదు. విద్యార్థులలో బ్రిటను, అమెరి కాల మీద ద్వేషభావం కలిగించక తప్పదు. రష్యామీద అర్థంలేని విశ్వాసం నూరిపొయ్యకా తప్పదు.

ప్రతీ ఉపాధ్యాయుడూ విధిగా తన తరగతి గదిలో మార్క్స్, లెనిన్, స్టాలిన్‌ల పెద్దపెద్ద పటాలు గోడలికి వేలాడగట్టాలి. కొందరు లెనిన్, స్టాలిన్, రకోసీ పటాలు వుంచేవాళ్ళు. విద్యార్థులు వీళ్ళని 'హోలీట్రినిటీ' (పవిత్రు లయిన త్రిమూర్తులు) అనేవాళ్ళు. స్టాలిన్ పటం తీసేసి మాలెంకావ్ పటం పెట్టినదినం ఎంతో అలజడి జరిగింది. తరవాత క్రుశ్చేవ్ పటం పెట్టారు కమ్యూనిజం గొప్పతనం ఇంతిఅంతచేసీ, ప్రజాప్రభుత్వంలోవున్న లోపాలు గోరంతలు కొండంతలుచేసీ చూపిస్తూ అతిచాకచక్యంతో మ్యాపులు తయారు చేశారు.

పాఠ్యపుస్తకాల్లో ఇంకా చాకచక్యం చూపించారు. జాగ్రఫీపుస్తకంలో నూటి డబ్బయి అయిదు పేజీలు రష్యాగురించే రాశారు. మిగిలిన పాతిక పేజీల్లో పాశ్చాత్యదేశాల అన్నిటిగురించీ క్లుప్తపరిచారు. రెండో ప్రపంచ యుద్ధంగురించి రాస్తూ "మిత్రదేశాలుగా ఇంగ్లీషువాళ్ళూ, అమెరికావాళ్ళూ చేసిన దిగ్బంధాలు", "ఏ మాత్రమూ ప్రాముఖ్యంలేని యుద్ధక్షేత్రాల్లో ఆంగ్లో అమెరికన్ సైన్యాలు" అని శీర్షికలు తగిలించారు. యుద్ధంలో ఇంగ్లాండు అమెరికాలు చేసినకృషి వ్యర్థమైందని చూపడమే ఈ శీర్షికల ఉద్దేశం. జపాను ఎలా వోడిపోయిందో చెప్పడానికి యుద్ధం తొలిదశలో మిడ్వే, సోలమన్ దీవులలో కలిగిన చిన్నచిన్న విజయాలుమాత్రం వివరించారు. రష్యాసేనలవల్లే జపాను పతనం జరిగిం దన్నారు.

"కమ్యూనిస్టు రాజ్యానికి ఏ మాత్రం నష్టం కలిగించే పనైనా మీలో ఎవరు చేసినాసరే, వెంటనే మీరు రిపోర్టు చెయ్యాలి" అని విద్యార్థులికి మాటిమాటికీ హెచ్చరిక చేశారు. దాంతో వాళ్ళ పరస్పరస్వభావంలో మార్పు వచ్చింది. ప్రతీవిద్యార్థీ తన పక్కవిద్యార్థిని అనుమానించడం మొదలు పెట్టాడు. చాలామందిమాత్రం తమ స్నేహితులమీద గూఢచారులుగా వుండ డానికి నిరాకరించారు. అయినా ఏవివో మనుషులు వొకళ్ళిద్దరిని ఈ పనిలో బలవంతంగా దింపారు. అయితే ఆలాదిగిన వాళ్ళెవళ్ళో తెలియకపోవడం తోనే ప్రతీ విద్యార్థీ తనప్రక్క విద్యార్థిని అనుమానంతోనూ భయంతోనూ చూసేవాడు.

ఆ భయమే వొక్కొక్కప్పుడు కుర్రాళ్ళు తమ తల్లిదండ్రుల మతాభి మానం గురించో, లేదా వాళ్ళ పురాతనభావాలగురించో చాడీలుచెప్పి, పార్టీ అనుగ్రహానికి పాత్రులు కావడానికి కారణమయేది. ఇది మరీఘోరంగా వుండేది. అయితే ఏవివో మనుషులుమాత్రం అలాంటి కుర్రాళ్ళ ప్రవర్తన ఉత్తమప్రవర్తన అనేవాళ్ళు.

ఏవివో యాజమాన్యంకింద స్కూళ్ళు ప్రతీ ఇంటికీ పన్నిన వలలుగా తయారయాయి.

"కామ్రేడు స్టాలిను చిత్రం మీ నాన్న మీ ఇంట్లో పెట్టాడా?"

"ఏ రేడియో స్టేషనంటే మీ అమ్మకి ఇష్టం?"

"కామ్రేడు లకోసీ ఎప్పుడూ తప్పు చెయ్యడని మీ తండ్రి అంటాడా?"

"రాత్రిళ్ళు ఎప్పుడైనా మీ అమ్మ నిన్ను మతసమావేశాలికి తీసుకు వెళుతుందా?"—

ఇవీ ఉపాధ్యాయులు తరుచు విద్యార్థుల్ని అడిగేప్రశ్నలు.

మతవిద్య చాలా ఇబ్బైన సమస్యగా తేలింది. కొన్ని స్కూళ్ళలో మతం బోధించేవాళ్ళు, చాలా స్కూళ్ళలో తల్లిదండ్రులు రాసి తెలియ చేస్తేనేకాని చెప్పరు. కుర్రాళ్ళ మతం బోధిస్తారు, కాని అది వాళ్ళతత్వాన్ని అనుసరించి మాత్రం బోధిస్తారు. తల్లిదండ్రులు తమ పిల్లలికి మతం బోధించవలిసిందని పెట్టుకున్న దరఖాస్తులు లోపాయికారీగా ఏవిపో వాళ్ళ దగ్గిరికి వెళ్ళిపోతాయి. అలా మతవిద్య కావాలన్న ప్రతీమనిషినీ తుపాకితో కాల్చెయ్యమనో, లేదా లేబర్‌కోర్‌లో వేసెయ్యమనో ఏవివోవాళ్ళు ఆదేశిస్తారు. "తమ పిల్లలికి మతవిద్యకావాలనే తల్లిదండ్రులు ఒక వుత్తరం రాస్తేచాలు" అని స్కూళ్ళలో ప్రకటించారు. అప్రమత్తులైన తల్లిదండ్రులు ఏవివోవాళ్ళకి భయపడి ఈప్రకటనలు చూడటమే మానేశారు.

ఇదిగో ఇలా ఇరవయ్యేళ్ళు వయస్సుగల హంగేరియువకుడు మొదటి పదేళ్ళూ యుద్ధమూ, ఆకలీ, రక్షణలేని స్థితీ— వీటితో గడిపాడు. మిగతా పదేళ్ళూ కమ్యూనిజం ఒడిలో పెరిగాడు. జీవితంలో ఏపాటి మంచికావాలన్నా తాను కమ్యూనిస్టుగా వుండాలి అని తెలుసుకున్నాడు. అతడికి ఆటలంటే ఇష్టమనుకోండీ, అయితే అతడు కమ్యూనిస్టు జట్టులలోనే చేరాలి. వేసవికాంపుల్లోకి వెళ్ళాలని వుందనుకోండీ, కమ్యూనిస్టయితేనే అది సాధ్యపడుతుంది. విశ్వవిద్యాలయంలో ప్రవేశించాలని వుందనుకోండీ, కమ్యూనిస్టుగా తన ప్రవర్తన రుజువైవుండాలి. ఈ ప్రచారం కోరలనించి తప్పించుకోడం హంగేరీలో ఎక్కడా సాధ్యపడేదికాదు. తన వ్యక్తిత్వం తాను నిర్మించుకోవాలంటే అవకాశం వుండేదికాదు. మానవుడి ఆత్మలో పరివర్తనం కలగడమే సాధ్యమైతే, ఆపరివర్తన తానే తీసుకువస్తానంటుంది కమ్యూనిజం.

ఒకప్పుడు జోసఫ్ స్టాలిన్ అన్నాడు: "చదువా? చదువు ఒక ఆయుధం మాత్రమే. అది ఎవరివశంలో వున్నదీ, అది వున్నమనిషి ఎవర్ని కొట్టదలచుకున్నదీ— ఇదిగో ఈ ప్రశ్నలమీద ఆధారపడివుంటుంది దాని ప్రభావం." పదేళ్ళపాటు విడుపులేకండా కమ్యూనిజం శిక్షణపొందిన హంగేరీ యువకుణ్ణిచూస్తే స్టాలిన్‌మాటల్లో ఎంత సత్యంవుందో తెలుస్తుంది. కమ్యూనిజం శత్రువులమీద దెబ్బతియ్యడానికి హంగేరీలో బాలబాలికల్ని బాగా తర్ఫీదుచేశాడు స్టాలిన్. నైతికంగానూ, అధ్యాత్మికంగానూ, ఆర్థికంగానూ కూడా హంగేరియన్ విద్య పేర, రష్యాను ప్రేమించడం, కమ్యూనిజం రక్షించడం అనే రెండుస్తంభాలికి కట్టి పడేశారు.

కానైతే తీరా పరీక్ష వచ్చేసరికి సుమారు నూటికి నూరుమందీ హంగేరీ యువకులు రష్యాఅంటే ద్వేషిస్తున్నట్టే తేలింది. కమ్యూనిజం నాశనంచెయ్యడానికే వాళ్ళు ప్రయత్నించినట్టు రూఢిఅయింది.

ఇది బాగా గుర్తించవలసిన విషయం. ఏమంటే, దీని ప్రభావం ప్రపంచచరిత్రమీద ఎంతోవుంటుంది. రష్యావాళ్ళపథకం హంగేరీలో ఎందుకు భగ్నమయిందో ఆలోచించాలి మనం. అనుకున్నదానికి సరిగ్గా వ్యతిరేకించి హంగేరీయువకులు ఎందుకు ప్రవర్తించారో విచారించాలి. రోజూ వాళ్ళకి ఎక్కిస్తూవచ్చిన విషం ఏమయింది ? ఈ ప్రశ్నకి జవాబు కావాలంటే అసలు హంగేరీవాళ్ళ స్వభావమెలాంటిదో, చరిత్రలో వాళ్ళు వహించిన పాత్ర ఎలాంటిదో తెలుసుకోవాలి. హంగేరీ బురదనేలలో ఆపసోపాలుపడుతూ యాండావు వంతెనదాకా, స్వాతంత్ర్యంకోసం నడిచిన ఒక హంగేరీకుటుంబం పరికించండి. ఎలాంటి వ్యతిరేకశక్తులతో రష్యావాళ్ళు పోరాడుతున్నారో అప్పుడు కాని మనకి తెలియదు.

ఆ అల్లర్లలో దినాలకొద్దీ పనిచేసి బాగా అలిసిపోయిన అమెరికారాయబారవర్గంలోని ఒకాయన అన్నాడు: "ఈ ఒత్తిడి తగ్గాక, హంగేరీవాళ్ళ నెత్తురు కొంచెం నేను లోపలికి ఎక్కించుకుంటాను. అప్పుడు కాని మనిషిని కాను నేను" అని. అప్పటి హంగేరీవాళ్ళు ప్రతిఘటనచూసినవాళ్ళు అందరూ "హంగేరియావాళ్ళు వుక్కు తునకలు" అనే అభిప్రాయపడ్డారు.

ఆ దినాల్లో హంగేరీవాళ్ళ గర్వం హెచ్చించేవీ, చరిత్రని మరుగుపరిచేవీ ఎన్నోరాతలు వెలువడ్డాయి. హంగేరీప్రజలు ధైర్యసాహసాలు కలవాళ్ళన్నది నిజమే. కాని వాళ్ళు తరుచు జట్టీకోర్లు. ఇరుగుపొరుగు దేశాలవాళ్ళు వాళ్ళతో సుఖంగా కలిసిమెలిసి వుండడమన్నది ఎన్నడూ సాధ్యం కాలేదు. గడిచిన కొన్ని సంవత్సరాలలో ఎప్పుడోఒకప్పుడు, తమ సరిహద్దులు తాకిన ప్రతీదేశంతోనూ హంగేరీవాళ్ళు తగువులాడినట్టే తెలుస్తుంది.

తూర్పున రుమేనియాతో వున్న శత్రుత్వం అంతంలేంది; చరిత్ర ప్రసిద్ధమైంది. ట్రాన్సిల్వేనియా అధిపత్యానికి సంబంధించిన తగువు దీనికి కారణం. చిన్న సందుదొరికితేచాలు, రేపే యుద్ధం భగ్గుమంటుంది. రుమేనియామీద కసి తీర్చుకోవాలన్న అభిప్రాయమే హంగేరీవాళ్ళని జర్మనీతో సంధికి పురికొల్పింది.

దక్షిణాదిని సెర్బియాతో ఎప్పుడూ తగువులే. ఈ సరిహద్దులో యుద్ధమూ, ప్రతీకారమూ ఎప్పుడూ సాగుతూనే వుంటుంది. 1924 లో

ఎంతో పెద్దతగువే జరిగింది. పదివేలమంది సెర్బియావాళ్ళని హంగేరీ వాళ్ళు విచక్షణలేకండా చంపేశారని ఆరోపణ జరిగింది. శాశ్వతమైన శాంతి కోసం యుగోస్లావియాతో ఒడంబడిక చేసుకున్న నాలుగునెలల్లోనే హంగేరీ ఆదేశంమీద దండయాత్ర చేసింది. అది ఒప్పుకుంటూ అప్పటి ప్రధానమంత్రి కౌంటుపాల్ టెలిక్ ఆత్మహత్య చేసుకున్నాడు. దీన్నిబట్టే తెలుస్తుంది అంత ర్జాతీయ న్యాయానికి అది ఎంత వ్యతిరేకమైన విషయమో.

పడమట క్రుయేషియాతోనూ, ఉత్తరాదిని స్లోవేకియాతోనూకూడా ఇలాంటి పరిస్థితులే వున్నాయి. మధ్యయూరపుని కట్టివుంచిన ఆస్ట్రోహంగే రియన్ సామ్రాజ్యం పడిపోవడానికి ముఖ్యకారణం హంగేరీ సామ్రాజ్య వ్యావహారాల్లో మూర్ఖత్వంతో కలగజేసుకోడమేఅనీ, తన అల్పసంఖ్యాకవర్గా లతో తాను ప్రవర్తించకపోవడమేఅనీ ఆస్ట్రియను లంటారు. నిజానికి చాలా కాలంవరకూ యూదులికి వ్యతిరేకంగా అదిచేసిన ఆగడాలు మరెవ్వరూ చెయ్యలేదు.

బాల్కన్ వ్యవహారాలు ఎంతోకాలంనించి శ్రద్ధగా పరిస్తూవున్న ఒకా యన ఇలాఅన్నాడు : "ఈ ప్రాంతంలో హంగేరీకి ఒక మిత్రదేశం వుంది. అది బల్గేరియా- అది మిత్రదేశంగా వుండడానికి కారణం అది హంగేరీ సరి హద్దులో లేకపోవడమే."

ఈ ప్రాంతం చరిత్రరాసిన చరిత్రకారులు సెర్బియా, రుమేనియా దేశాల్లో దేనిమీదో ఒకదానిమీద పక్షపాతం చూపుతూనే రాశారు. రుమేనియా మీద పక్షపాతం చూపినవాళ్ళు సెర్బియాదేశం దుర్మార్గదేశం అన్నారు. సెర్బియామీద పక్షపాతంచూపినవాళ్ళు రుమేనియాదేశం దుర్మార్గదేశం అన్నారు. కార్లటన్ జె. హెచ్. హెస్. వంటి పక్షపాతంలేని అమెరికాచరిత్ర కారుడు హంగెరీదేశం ప్రవర్తనగురించి ఇలా రాశాడు :

"........హంగేరీ ప్రజానీకంతో ప్రభుత్వంలో భాగం పంచుకోవాలని మగ్యార్ జమీందార్లు ఎన్నడూ అనలేదు. పాలితప్రజలతో భాగస్వాములు కావడం వాళ్ళకి నచ్చనిపని. అంచేత పెద్దపెద్ద జమీలే ఆక్రమించుకున్నారు వాళ్ళు. రాజ్యమంతటా బళ్ళలో తమభాషే బలవంతంగా రుద్దారు. ఉత్తర రాష్ట్రాల్లో స్లావాక్ రైతుల్నీ, దక్షిణాన సెర్బియాప్రజల్నీ మగ్యారులుగా మార్చడానికి ఎంతచేయాలో అంతాచేశారు. తూర్పున, రుమేనియా భాష మాట్లాడే ట్రాన్సిల్వేనియా రాష్ట్ర స్థానికస్వాతంత్ర్యం రద్దుచేశారు. పడమట 1868 లో క్రొయేషియాకి ఇచ్చిన సామాన్య స్వాతంత్ర్యంమీద వరసపెట్టి

ప్రతిబంధకాలు విధించారు. బుడాపెస్టులో హంగేరియన్ పార్లమెంటునీ, మంత్రివర్గాన్నీ తమ అదుపులో వుంచుకున్నారు. పార్లమెంటు ఎన్నికల వోటుహక్కు అధికంచేయడంటే నిరాకరించారు. ఇంత ఆస్తివుంటేకాని వోటుహక్కు లేదన్నారు. ఎన్నికల నియమాల్లో ఎన్నోఅన్నిచిక్కులుపెట్టారు. ఇన్ని చిక్కులుండబట్టే 1910 లో హంగేరియన్‌రాజ్యంలోని ఇరవై మిలియన్ల జనాభాలో వోటర్లసంఖ్య ఒక మిలియనుకంటే తక్కువే తేలింది. పూర్తి జనసంఖ్యలో సగానికి సగంమంది మగ్యారులూ, మగ్యారులు కాని వాళ్ళూవున్నా, పార్లమెంటు సీట్లన్నీ మగ్యారులతోనే నిండిపోయాయి. పాలిత జాతులు, ఆస్ట్రియాలోకంటే హంగేరీలోనే ఎక్కువ అసంతృప్తి అనుభవించాయి. బుడాపెస్టులోని హంగేరియన్ పార్లమెంటునించి పూర్తిగా వాళ్ళు తొలగింపబడ్డారు. అంచేత వాళ్ళకి ఒక కేంద్రస్థానం లేకండాపోయింది. ఆస్ట్రియాలో ఆలా కాలేదు. వియన్నాపార్లమెంటులో వాళ్ళకి మంచిస్థానమే వుంది. వాళ్ళు తమకష్టాలూ, కోరికలూ ప్రపంచానికి తెలుపుకోడానికి వీలుంది. అవసరంవస్తే ప్రభుత్వాన్ని ఎదుర్కోడానికికూడా అవకాశముంది.

"హంగేరీ ప్రభుత్వాన్ని అదుపులోవుంచుకున్న జమీందార్లవల్ల మగ్యారుల పేదప్రజలూ, తదితర పాలితప్రజలూకూడా అష్టకష్టాలు అనుభవించారు. హంగేరీ పార్లమెంటు విద్యాభివృద్ధికోసం పాటుపడింది; జమీందార్లకి వ్యతిరేకంగా ప్రజలుపెట్టుకున్న ఫిర్యాదులు విచారించింది; అయినా 1867, 1914 మధ్య జరిగిన వ్యవసాయాభివృద్ధి పెద్దపెద్ద భూస్వాములికీ, ప్రభుత్వాధికారులికీ మాత్రమే బాగా లాభించింది. 1896 నించి 1910 వరకూ సుమారు పదిలక్షలజనం దేశం వొదిలేసి వలసపోయారంటే దీనినత్యం తేటతెల్లం అవుతుంది. వోటింగుపద్ధతి సంస్కరించాలని జరిగిన ఆందోళనా, ఇరవయ్యో శతాబ్దం మొదటిలో అంతర్యుద్ధంవరకూవచ్చిన అలజడీ ఈవిషయాన్నే వ్యక్తం చేస్తున్నాయి."

హంగేరీలో సమర్థులైన చరిత్రకారులులేరనీ, అంచేత వివాదాల్లో తన విషయం జాగ్రత్తగా రాసి ప్రపంచంముందు పెట్టలేకపోవడమే తనమీద దురభిప్రాయం కలగడానికి కారణమయిందనీ వొకసాకు చెప్పుకుంటూ తనని తాను సమర్థించుకుంటుంది హంగేరీ.

ఆవేశపూరితమైన ఈ హంగేరీ జాతితో నాకు పరిచయం కావడం వొక సంఘటన. 1930 ప్రారంభంలో నేను యూరపులో విద్యార్థిగా వున్నాను. అప్పుడు వొక ట్రాన్సిల్వేనియా విద్యార్థి నాగదిలో వుండేవాడు. అతడి వునికి

ఒకప్పుడు హంగేరీలోనూ, ఒకప్పుడు రుమేనియాలోనూ వుండేది. ఇప్పుడు ట్రాన్సిల్వేనియాలో చాలాభాగం రుమేనియా పరిపాలనకిందేవుంది. మొదటి ప్రపంచ మహాయుద్ధం తరవాత, గెలిచిన మిత్రరాజ్యాల ఆదేశ మది కాని నాస్నేహితుడి గ్రామం మాత్రం హంగేరీ రాజ్యంలోనే వుండిపోయింది. ఈ పొరపాటు సవరించాలనేవా డతడు. అతడు మొండిపట్టుపలకల విప్లవవాది. హంగేరీ అంటే కావలసినంత వ్యతిరేకం. ఎప్పుడూ పటపటుతూ వుండేవాడు. ఒక్కొక్కసారి అతడి తిట్లు ప్రవాహంలా వుండేవి. వినడమే కష్టమయేది నాకు. అతడి ఈ ధోరణివల్లే హంగేరీ విషయం చదవడం మొదలెట్టాను నేను. హంగేరీ చరిత్రలు చాలా పేలవంగా రాసివున్నాయి. తమ పక్షం తెలివిగా సమర్థించుకునే శక్తి వాళ్ళ చరిత్ర రచయితలకిలేదు. ఐనా, ఆ చిన్నజాతిమీద నాకు ఒక అభిమానం ఏర్పడింది. నా ట్రాన్సిల్వేనియన్ మిత్రుడు తన జీవితంలో తరవాత ఎన్నో తుఫానుల్లోంచి బతికి బయటపడ్డాడు. హిట్లరు కాలంలో ట్రాన్సిల్వేనియా అంతా హంగేరీ కిందికి వెళ్ళిపోయింది. సోవియట్ రష్యాకింద రుమేనియాలోని భాగమయింది. ఇప్పుడు అది అక్కడే వుంది. మొత్తానికి నామిత్రుడి హంగేరీ దూషణ నన్ను హంగేరీ అంటే పక్షపాతం కలిగేలాగ చేసింది.

హంగేరియనులు మంచి వివేకంకలవాళ్ళనీ, వాళ్ళకి వాళ్ళే సాటి అనీ తెలుసుకున్నాను. 1956 లో కమ్యూనిజానికి వ్యతిరేకంగా వాళ్ళు చేసిన తిరుగుబాటుకి పూర్వమే, వాళ్ళ చరిత్రచూస్తే, వాళ్ళు ధైర్యసాహసాలు కల వాళ్ళనీ, ఒక ప్రత్యేక జాతిగా బతుకుదామన్న నిశ్చయం కలవాళ్ళనీ, స్వాతంత్ర్యప్రియులనీ వ్యక్తమవుతుంది. కమ్యూనిస్టులు తెలివితేటలతో వాళ్ళ స్నేహం సంపాదించివుంటే, పశ్చిమదేశాలికి వ్యతిరేకంగా తాముఒక బలమైన గోడ కట్టకలిగివుండేవాళ్ళు. ఏమంటే, వాళ్ళ చరిత్రచూస్తే, అటు పశ్చిమ యూరపు దేశాలతోనూ, ఇటు తూర్పు యూరపు దేశాలతోనూ వాళ్ళు కలిసి వుండగలరని బోధపడుతుంది. క్యాథలిక్కు మతమూ, సంస్కృతీ యూరపుదేశాలికీ వాళ్ళకీ ఒక్కటే. భాషకూడా ఒక్కటే. పైగా వాళ్ళూ, వీళ్ళూ ఒక్కదేశంనించి వచ్చినవాళ్ళే పూర్వం.

తొమ్మిదో శతాబ్దం ప్రారంభంలో మధ్యాసియానించి సుమారు ఇరవై వేలమంది అడవిజాతివాళ్ళు యూరపుమండల పడమటి సానువులమీద నివాసం ఏర్పరుచుకున్నారు. వాళ్ళకి ఎదురుగా యూరపు ఖండం వుంది. ఈ కొద్దిమంది ఉగ్రియన్-తుర్కీ తెగలవాళ్ళు చొరవచేసుకుని పశ్చిమంగా

చొచ్చుకుపోయారు. వోల్గా, డాన్, నైపర్, నీస్టర్ నదులు దాటి, డాన్యూబు నదీముఖం సమీపించారు. ఆప్రాంతం అప్పటికే జనంతో నిండివుంది. అంచేత అలాంటి పోటీవుండని ప్రాంతం వెదుక్కుంటూ అక్కడినుంచి వెళ్ళిపోయారు.

తొమ్మిదో శతాబ్దం మధ్య ఈ ఆసియాతెగవారు ధైర్యంగా కార్పేథియా పర్వతాలు దాటారు. 892 నాటికి మధ్యయూరపు మైదానం చేరుకున్నారు. బ్రహ్మాండమైన మైదాన మది. చుట్టూ గోడల్లాటి కొండలున్నాయి. తూర్పున తూర్పుకార్పేథియన్ కొండలూ, దక్షిణాన నారిక్ఆల్ప్సు పర్వతాలూ, ఉత్తరాన పడమటి కార్పేథియను కొండలూ, పడమటి ఆల్ప్సు పర్వతాలూ ఎంతో అందంగా వున్నాయి. మైదానం మధ్యగా డాన్యూబునది ప్రవహిస్తూవుంటుంది. ఇక్కడే ఇది దక్షిణానికి 90' డిగ్రీల వంపుతో ప్రవహిస్తూవుంటుంది.

విశాలమూ, సారవంతమూ అయిన ఈ మైదానం పూర్వం జనసూన్యంగావుండేది. పడిపోతూ పడిపోతూవున్న రోము సామ్రాజ్యం వియన్నాలోనూ, బుడాపట్నంలోనూ చిన్నచిన్న జనవాసాలు ఏర్పరచింది. వాటిని మించి అక్కడ మరేదీ వుండేదికాదు. ఉగ్రోనియన్-తుర్కీ తెగవాళ్ళు ఈ మైదానంలో అడుగుపెట్టాక, అచిరకాలంలోనే అదంతా వాళ్ళ వశమయిపోయింది. డాన్యుబునదికి అవతలవున్న జర్మనులు వాళ్ళని 'హంగ్రిగ్'అంటే 'ఆకలితోవున్నవాళ్ళు' అని పేరుపెట్టారు. వాళ్ళు మాత్రం తమ అసలు పేరుతోనే పిలుచుకుంటూవచ్చారు. 'మగ్యారులు' (Magyars) అని.

ఇలా చారిత్రక ప్రమాదంవల్ల ఒక ఆసియాజాతి యూరపు మధ్యకి చొచ్చుకువచ్చింది. ఉత్తరాదినీ, దక్షిణాదినీ స్లావులూ, పడమట జర్మనీవాళ్ళూ, తూర్పున జర్మనీవాళ్ళూ, రోమనులూ, సంకరమై ఏర్పడినవాళ్ళూ, దాన్ని చుట్టుకుని వున్నారు. తమ ఆశియా సంప్రదాయాలు మార్పులేకండా ఎన్నో యథాతథంగా నిలుపుకున్నారు వాళ్ళు. భాషకూడా నిలబెట్టుకున్నారు. యూరపుభాషల్లో ఒక్క ఫిన్నిషు భాషే హంగేరీ భాషని పోలివుంటుంది. ఫిన్నులుకూడా హంగేరీవాళ్ళలాగే ఆశియా ఖండంనించీ, అరేబియానించీ వచ్చివుండాలి. అయితే వాళ్ళు వచ్చిన దారిమాత్రం వేరైవుంటుంది. హంగేరీవాళ్ళు మంచిబలమైనవాళ్ళు; మోటైనవాళ్ళు; నమ్మకమైనవాళ్ళు; తమదేశం స్వతంత్రంగా వుండాలని పట్టుదలకలవాళ్ళు.

హంగేరీకి ఎన్నోవిధాల యూరపు రుణపడివుంది. పాశ్చాత్య దేశాలని కాపాడడానికి ఎన్నోఅన్ని బలిదానాలు చేసిన దేశం హంగేరీ దేశం. శతాబ్దాల

పాటు పశువులు కాసుకుంటూ బతికిన ఈచిన్నజాతి, అసలు తామూ ఆశియా నించే వచ్చినా, తరవాత యూరపుఖండంమీద దండెత్తి వచ్చిన ఆశియా వాళ్ళనిమాత్రం తీవ్రంగాప్రతిఘటించింది. మంగోలులు ఎన్నోసార్లు దండెత్తి వచ్చారు. అన్నిసార్లూ వాళ్ళని హంగేరీవాళ్ళే ఎదిరించి తరిమేశారు. అలా వీళ్ళు ఎదిరించకపోయివుంటే, వాళ్ళు రోమునీ, పారిసునీ ధ్వంసం చేసే వాళ్ళే. తరవాత టర్కీముస్లిములికీ, యూరపు వాళ్ళకీ జరిగిన యుద్ధంలో యూరపు పక్షాన హంగేరీవాళ్ళే ఎక్కువగా పోరాడారు. క్రయిస్తవ మతం వొదిలి పెట్టడానికిగానీ, లేదా ఐరోపీయ జీవితవిధానం వొదిలి పెట్టడానికి గాని హంగేరీ ప్రజలు సమ్మతించలేదు.

ఇతర ఆసియా దండయాత్రలు నిరోధించి, తాము ఎందుకు స్వయంగా దండయాత్ర సాగించరాదో హంగేరీవాళ్ళకి అర్థంకాలేదు. జర్మనీ, ఇటలీ, స్లావిక్కు దేశాలతో వాళ్ళు ఎన్నోయుద్ధాలు చేశారు. పశ్చిమదేశాలన్నీ వొకటై "హంగేరీ మైదానం మీది. అక్కడే మీరు వుండండి" అన్నారు. జర్మనీ ప్రాంతాలమీద టర్కీ చెయ్యి వెయ్యకండా హంగేరీ మధ్యవర్తిగా పనిచేసింది. రష్యా ఉత్తర స్లావులూ, యుగోస్లావియా దక్షిణస్లావులూ కలవకండా చేసింది. దండయాత్ర రష్యాద్వారా జరిగినా, ఆసియా టర్కీద్వారాజరిగినా, పూర్తిగా యూరపు ప్రజ అయిపోయిన హంగేరీవాళ్ళు చారిత్రకంగా ఆసియాను యూరపులో కాలుపెట్టకండా అడ్డేశారు. పశ్చిమయూరపునీ, ప్రాచ్య యూరపునీ కలిపివుంచే ముడివంటిది హంగేరీ.

హంగేరీవాళ్ళు పొట్టిగా, నన్నంగా, ఆకర్షవంతంగా వుంటారు. వాళ్ళ దేహాలు మలిచినట్టుంటాయి. ముఖాలు తీర్చి దిద్దినట్టుంటాయి. ఆటలకి వాళ్ళ శరీరాలు బాగా తగివుంటాయి. సంగీతమన్నా, వేటన్నా వాళ్ళు చెవి కోసుకుంటారు. అయితే కోపం మాత్రం ముక్కుమీద వుంటుంది. గ్రామ పరిశ్రమలంటే వాళ్ళకి చాలా ప్రీతి. పాత జాతీయ దుస్తులూ, గాఢమైన రంగులూ అంటే మహాఇష్టం. వెయ్యేళ్ళు యూరపులో వుండి ఆసియా వాసులు తమ సహజ స్వరూపాలు బాగా పోగొట్టుకున్నారు. అక్కడక్కడ మాత్రం వొకళ్ళో, ఇద్దరో హంగేరీవాళ్ళు ఎత్తు దవడలతోనూ, కళ్ళనించి బిగువుగా వెనక్కిలాగిన చర్మంతోనూ కనిపిస్తారు. ఇతర దేశాలతో యుద్ధానికి నడుం కట్టినా, తమలోతాము మాత్రం వాళ్ళు ఐకమత్యంగా వుంటారు. వాళ్ళ కుటుంబజీవితం ఎంతో ఆప్యాయంగావుంటుంది. వంశంఅంటే వాళ్ళు పడిచస్తారు. అంచేతే జమీందారీ పద్ధతి అక్కడ ఆకర్షవంతంగా తయార

యింది. శక్తిమంతులైన జమీందార్లు బయలుదేరారు. వాళ్ళు మంచి పట్టుదలగలవాళ్ళు. హంగేరీ ఒక ఆధునిక జాతిగా తయారుకాకుండా వాళ్ళు ప్రతిఘటించారు. అంచేతే మొదటి ప్రపంచమహాయుద్ధం తరవాత జరిగిన సంధిఒడంబడికలో హంగేరీ పొరుగురాజ్యాలు దాని సరిహద్దు భూములు అనాగరికంగా లాక్కున్నాయి. 1918 లో హంగేరీ పొందినంత జాతీయ పరాభవం మరి ఏదేశమూపొందలేదు.

అదైనా జమీందారీ కుటుంబాలు దేశంమీద తమపట్టు వదలలేదు. ఆధునిక ప్రభుత్వ పద్ధతులు యావత్తూ వాళ్ళు ప్రతిఘటించారు. వీరోచితమైన ఈజాతి దెబ్బలాటల్లోనూ, గిల్లికజ్జాల్లోనూ, నియంతృత్వంలోనూ పడిపోయింది. రెండోప్రపంచ యుద్ధం చివర తన సరిహద్దు రాష్ట్రాలు తిరిగి సంపాదిద్దామని ఒకవ్యర్థప్రయత్నంచేసి, హంగేరీ కాలుజారి కమ్యూనిజంలో పడిపోయింది.

ఇలాంటి జాతిని ఆదర్శమైన కమ్యూనిస్టు ఉపగ్రహదేశంగా తయారుచేయాలని పూనుకుంది రష్యా. అప్పుడు ప్రతీదీ రష్యాకి అనుకూలంగానే వుండేది. చక్కగా సాగుచేసే రైతుల శ్రమవల్ల హంగేరీ మైదానాలు దేశానికి కావలిసినదానికంటే అధికం ఆహారధాన్యాలు పండించేవి. దేశంలో చాలా విలువైన ఖనిజసంపదా వుంది. హంగేరీ ప్రజలు యంత్రయుగానికి తగినవాళ్ళని తేలింది. హంగేరీ యువకులకి మెషీనులంటే చాలాఇష్టం. వాళ్ళలో చాలామంది ఇంజనీర్లూ వున్నారు.

ఏదైనా న్యాయమైన పనికోసం హంగేరీవాళ్ళ స్నేహం సంపాదిస్తే, యూరపులోకల్లా వాళ్ళనిమించిన మంచివాళ్ళు మరొకరుండరనిపిస్తారు. వాళ్ళ వెయ్యేళ్ళచరిత్ర ఇది రుజువుచేస్తుంది. అయితే హంగేరీ ఆత్మగౌరవం భంగపరిచినవాళ్ళు, ఆదేశంతో వ్యవహరించడం యమయాతనఅని దాని పొరుగుదేశాలు నిరూపిస్తాయి. హంగేరీవాళ్ళు సహజంగా వ్యతిరేకవాదులు, దేశభక్తులు, వీరస్వభావులు. వాళ్ళ మిత్రులు వాళ్ళని 'తూర్పుదేశాల ఐరిష్' లని అంటారు. వాళ్ళ శత్రువులు 'బాల్కనులలో ప్రష్యనులు' అంటారు. ఈ గుణాలన్నీ వాళ్ళలో ఎలా మేళవించి వున్నాయో తెలుసుకోవాలంటే మనం యాండావ్ వంతెనకి వెళ్ళాలి. నవంబరు మధ్య కొందరు హంగేరీ వాళ్ళు హంగేరీ భూభాగం చివర కొన్నిమైళ్ళు, అతికష్టంతో నడుస్తున్నారు.

చలికాలం. గడ్డకట్టుకుపోయే చలి. జానస్ హడ్జాకూ, అతడి భార్యా ఇద్దరు పిల్లలతో రొంపినేలలో ప్రయాణం చేస్తున్నారు. పిల్లల్లో తొమ్మిదేళ్ళ

కుర్రా డొకడూ, పదమూడేళ్ళ పిల్ల ఒకతే. యాండావ్ వంతెనకి వాళ్ళ ప్రయాణం. వాళ్ళు ఇంకా చురుకుగా ప్రయాణం చేసేవాళ్ళే, కాని హజ్డాకు భార్య తమ్ముడు గ్యోర్గీ లూష్టిను బాగా అలిసిపోయాడు. రెండు సార్లు కూలబడి పోయి, లేవలేకపోయాడు. పాలిపోయిన అతడి మొహం, అతడి మీద మృత్యువు తాండవిస్తుందని వ్యక్తంచేస్తోంది.

"ఎలాఅయినా నువ్వు రాకతప్పదు" బావమరిదితో అన్నాడు జానసు.

"నన్ను ఇక్కడ వొదిలేసి మీరు వెళ్ళిపొండి" అన్నాడు రోగి.

"నిన్ను వదిలిపెట్టం" అన్నారు జానసు దంపతులు. ఇద్దరూ అతణ్ణి లేవనెత్తారు; వంతెన దాటించారు. అక్కడ వాళ్ళకి స్వేచ్ఛా, స్వాంతత్ర్యమూ దొరికాయి. కానైతే గ్యోర్గీ నరాలు కూలిపోయాయి. ఇప్పుడో అప్పుడో చచ్చిపోతాడన్నట్టు వున్నా డతడు. "నన్ను ఇక్కడ వొదిలేసి పొండి" అంటూ బతిమాలా డతడు.

"గ్యోర్గీ నిన్ను ఆస్పత్రికి తీసుకువెళతాం" అన్నాడు జానసు. ఆస్ట్రియన్ సహాయశాల సహాయంతో అక్కడ ఆ చిన్నకుటుంబం ఆరోగిని యాండావులో ఒక హోటేల్లో చేర్చింది. అందులో అందరూ ఒకమూల నక్కి నిలబడ్డారు.

ఇర్వింగ్ బ్రౌను భార్య, మిసెస్ లిలీ బ్రౌను అక్కడ వుంది. ఆమె యూరపులో ఏ. ఎఫ్. ఎల్. ప్రతినిధిగా వుంది. ఆమె అసలు హంగేరీ మనిషే. ఇరవయ్యో శతాబ్దం ఆరంభంలో ఆమె తండ్రి అమెరికా వలస పోయాడు. ఆమెకి హంగేరీభాష తెలుసు. ఆమె గ్యోర్గీతో హంగేరీ భాషలో మాట్లాడింది. అతడి సంగతంతా తెలుసుకుంది. పాపం అతడి కడుపులో గాయమయిందట. చప్పున ఏదో కట్టుకట్టి లాక్కువచ్చారు. స్వాతంత్ర్యం కోసం వాళ్ళు చేసిన దీర్ఘప్రయాణంలో అతడి పేగులు బైటపడుతున్నట్టున్నాయి. అతడి మొహం బాగా పాలిపోయింది. కొన్నిగంటల్లో ప్రాణం పోయేటట్టున్నాడు.

"ఎసెన్ స్టాటులో వున్న ఆస్పత్రికి నిన్ను వెంటనే చేరుస్తారు" అంది మిసెస్ లిలీ బ్రౌను.

"ఈకుటుంబం కూడానా?" బలహీనంగా అడిగాడు రోగి.

"కుటుంబం తీసుకువెళ్ళలేం" జాగ్రత్తగా అంది ఆమె.

"ఐతే నేను వెళ్ళను" అన్నా డతడు.

"నువ్వు చస్తున్నావు. బాగా వున్నవాళ్ళకోసం ఏడుస్తావేం? నీకు మతి పోయినట్టుంది" అంది ఆమె.

"వాళ్ళే నాతో వుండకపోయివుంటే ఎప్పుడో చచ్చిపోయి వుండేవాణ్ణి. నేను వెళ్ళను" వాదిస్తూ అన్నాడు గ్యోర్గీ.

మిసెస్ బ్రౌనుకి వోర్పు పోయింది. ఒక గార్డుని పిలిచి "ఈమనిషిని కారులోవేసి వెంటనే ఆస్పత్రికి తీసుకుపో" అని ఆజ్ఞాపించింది.

"నేను వెళ్ళను" గట్టిగా అన్నాడు రోగి. చివరికి మిసెస్ బ్రౌను అంది : "ఐతే నీకుటుంబం ఎక్కడవుంది?"

"ఇదిగో అక్కడ" అంటూ చూపించాడు గ్యోర్గీ.

చావుయాతనలో వున్నమనిషి తన తెగవాళ్ళతో వుండాలని ఎందుకు కోరుతున్నాడో ఆమెకి అర్థమైంది. హాజకు 30 ఏళ్ళ అందమైన యువకుడు. అతడి భార్యకూడా అదే వయస్సులో వుంది. ఆమె చిరునవ్వు అద్భుతంగా వుంటుంది. పిల్లలు మరి అందంగా వున్నారు. వీరా చాలా అందమైన పిల్ల. ఆమె మీదిపెదివి మీద వొక చిన్న పుట్టుమచ్చ వుంది. అది చూస్తే గ్రెటా గార్బో జ్ఞాపకం వస్తుంది. ఇక జోహాడ్ తొమ్మిదేళ్ళ పిడుగు. యూండావు వంతెన దాటిన వాళ్ళలో ఈపిల్లలు చక్కని చుక్కలు. వాళ్ళనిచూస్తే ఎవళ్ళకైనా జాలివేస్తుంది. ఎసెన్‌స్టాట్ వెళ్ళే దారిలో మిసెస్ బ్రౌను వాళ్ళ కథ అంతా తెలుసుకుంది.

అన్నికష్టాలికీ మరొక తక్కువ జాతివాళ్ళయితే నలిగిపోయేవాళ్ళే. కలిసివుండి, వొకళ్ళకొకళ్ళు రక్షించుకుంటూ, కుటుంబబాధ్యత ఎంత గురుతరమైందో ప్రదర్శిస్తూ ఆకుటుంబం ఇంతదూరం వచ్చిందంటే మామూలుగా చూసేవాళ్ళకి ఆశ్చర్యం కలుగుతుంది. ఆస్పత్రి అధికార్లతో మిసెస్ బ్రౌను వాదించదలుచుకోలేదు. వాళ్ళ నియమాల ప్రకారం ఆపరేషను చేసేటప్పుడు కుటుంబంలోవాళ్ళు ఎవళ్ళూ దగ్గిర వుండకూడదు.

"చూడమ్మా, నర్సూ! మీనియమాలు నాకు తెలుసు. కాని ఈకుటుంబం మాత్రం అందరూ వొక్కదగ్గిరే కలిసి వుండాలి" అందామె. నర్సు వాదించింది. కుటుంబం అంతా వస్తేనేకాని ఆస్పత్రిలో ప్రవేశించనన్నాడు రోగి. దాంతో నియమభంగం జరిగింది. నలుగురూ వెంట వెళ్ళారు. రోగి ఆస్పత్రిలో ప్రవేశించాడు.

ఆపరేషనై గ్యోర్గీ కోలుకొన్నతరవాత మిసెస్ బ్రౌను తన స్వంత ఖర్చులతో పూర్తికుటుంబాన్ని వొక వియన్నా హోటలులో చేర్చింది. హంగేరీ

సంగతి సందర్భాలు అడుగుదామనీ, కమ్యూనిజం వృత్తికి ఒక కుటుంబం ఎలా తట్టుకుందో తెలుసుకుందామనీ పక్క హోటేలునించి కొంతమంది అక్కడికి వచ్చారు. జానస్ హడ్జాకు స్పష్టంగా అన్నాడు. "కమ్యూనిజం అంటే మాకుటుంబం అందరికీ ద్వేషం. ఇప్పుడేకాదు, అది హంగేరీ ప్రవేశించినప్పటినించిన్నీ. మేం పారిపోవాలని మూడుసార్లు ప్రయత్నించాం. మాజోహాను చంటివాడుగా వున్నప్పుడు 1948 లో యుగోస్లావియా పారిపోదామనుకున్నాం. కాని దొరికిపోయాం. వీడు తప్పడడుగు వేస్తున్నప్పుడు మరోసారి ప్రయత్నించాం. మళ్ళీ దొరికిపోయి, ఏవివో వాళ్ళ శిక్ష అనుభవించాం. విప్లవం చెలరేగిననాడు మాలో మేం ఇలా అనుకున్నాం. "బహుశా ఇప్పుడు మనం గౌరవంగా బతకగలమేమో!" కాని రష్యా వాళ్ళు మళ్ళీ తుఫానులాగ విరుచుకు పడ్డారు. "ఇక ఎలా అయినా ఈ పాడుదేశం వొదిలి పోవలిసిందే" అనుకున్నాం. చాలాదూరం యాండావువరకూ నడిచేవచ్చాం."

"మీ పిల్లలు కూడా మీలానే అనుకుంటున్నారా ?" ఒక వ్యక్తి ప్రశ్నించాడు.

ఈప్రశ్న వేసేసరికి సుందరి వీరా చురుగ్గా మంది. "స్కూల్లో మేం రష్యా చరిత్రా, రష్యా భాషా, రష్యా రాజ్యం మహత్తూ నేర్చుకుంటాం. అక్కడ మాట్లాడకండా వూరుకున్నా లోపలమాత్రం కుములుతూనేవుంటాం. అలాంటి అబద్ధాలు చెప్పే మా మేష్టర్లని అసహ్యాహించుకుంటూ వుంటాం." అంది.

పదమూడేళ్ళపిల్ల అలాంటి మాటలు అందంటే ప్రశ్న వేసినవాళ్ళు, ఆమె మాటలు అనువాదం చేసి చెప్పుతూన్న దుబాషీని అనుమానించారు. అవి ఆమె మాటలో అనువాదకుడు కల్పించి మధ్య చెప్పుతున్నాడో అని సందేహించి, మరొక అనువాదకుణ్ణి పిలిచారు వాళ్ళు. అతడితో ఆ అమ్మాయి మరీ తీవ్రంగా మాట్లాడింది. "వాళ్ళు చెప్పే అబద్ధాలు నిజమని హంగేరీ కమ్యూనిస్టులు కాని, రష్యా కాని మమ్మల్ని నమ్మించలేక పోయాయి." అందామె.

"అవి అబద్ధాలని మీకు ఎలా తెలుసు?" హడ్జాకు భార్య క్లుప్తంగా మాట్లాడింది. "రాత్రి మేడమీద దీపాలన్నీ ఆర్పేశాక మేం ఒక చిన్నగదిలో చేరుకుంటాం. అక్కడ నేను మాపిల్లలికి నిజమైన హంగేరీ చరిత్ర నేర్పుతాను. నీతిగురించీ, క్యాథలిక్కు మతంగురించీ, కార్డినల్ మిండి జెంటీ పాతాల గురించీ నూరిపోస్తాను. ఆవాళ పగలు మాపిల్లలు విన్నదంతా కడిగేయకుండా మేం నిద్రపోం."

ఒక్క క్షణం అంతా నిశ్శబ్దంగా కూచున్నారు. తరవాత వొకాయన అడిగాడు: "అన్నికుటుంబాలవాళ్ళూ ఇలానే చేస్తారా?"

ఈసారి హడ్జాకు మాట్లాడాడు: "మాకు తెలియదు. మా వాళ్ళలో ఎవరు ఏవివో మనుషులో ఎవరు కారో తెలియదు. అంచేత 'మీరు ఇలా చేస్తారా?' అని వొక ప్రాణస్నేహితుణ్ణయినా అడగడానికి భయపడతాం మేం. కాని రహస్యంగా చాలా కుటుంబాలు ఇలాగే చేస్తాయని అనుకుంటాను."

"పిల్లలకి బోధించగలిగినంత చరిత్ర నీకు ఎలా తెలిసింది?" మరొకప్రశ్న.

హడ్జాకు భార్య జవాబు చెప్పింది: "1848 విప్లవం గురించిన నిజం పుస్తకాలవల్ల తెలుస్తుంది. ఈపుస్తకాలు రహస్యంగా ప్రచారంలో వుంటాయి. ఎవరు పంపిస్తారో తెలియదు. ఒక ప్రతి నాదగ్గిర వుంది. నేను చాలా మంది పిల్లలచేత అది కంఠస్థం చేయించాను. ముఖ్యంగా లూయీకా సూతుని గురించి. అతడు గొప్ప దేశభక్తుడు. మాపిల్లలు ఈపుస్తకం పవిత్రగ్రంథంగా భావిస్తారు. ఏమంటే, ప్రపంచంలో ఇందులో మాత్రమే వాళ్ళకి నిజం దొరుకుతుందిగనక."

ఆమె మాటకి అడ్డువచ్చి హడ్జాకు అన్నాడు: "అంతేకాదు, మాతండ్రి లూయీకా సూతు కుమారుణ్ణి స్వయంగా ఎరుగును. ఆ సంప్రదాయం మేం పోగొట్టుకోడం సిగ్గుచేటు."

చుక్కలాటి వీరా వేపు చూస్తూ వొకాయన అడిగాడు: "కానూతు ఎవరో నీకు తెలుసా?"

పరిస్థితులు బాగావుంటే బొమ్మలతో ఆడుకుంటూ వుండాల్సిన వీరా లేచి, తన తల్లిపక్క నుంచుంది. లూ యీ కా సూతు గురించి చిన్న ఉపన్యాసం ప్రారంభించిం దామె. ఆమె మాటల్లో పిసరంత తణుకూ బెణుకూ కనబడలేదు.

"లూ యీ కా సూతు హంగేరీ మహావీరుడు. దేశానికి స్వాతంత్ర్యం తేవాలని అతడు ప్రయత్నించాడు. ప్రజల్లో ఆశాదీపం వెలిగించాడు." అలా ఆమె 18 నిమిషాలు గడగడా మాట్లాడింది. ఆమె ఆవేశం వొక స్వర్ణ నిర్ఝరిలా ప్రవహించింది.

వీరా ఉపన్యాసం పూర్తయింది. ఒకడు ప్రశ్న పరంపర కురిపించాడు.

"కానూతు విప్లవం సఫలమయిందా?"

"లేదు."

“ఏమేమి సంస్కరణలు కావాలని కోరా డతడు?”

“స్వాతంత్ర్యం, ఒక ప్రత్యేక శాసనసభ, మంచి జడ్జీలు, పెద్ద జమీందారీల నాశనం.”

“విప్లవం విఫలమైంది. మరి అతడు సంపాదించిం దేమిటి?”

“మాకూ, మాతరవాతి వాళ్ళకీ అతడు దారిచూపించాడు.”

“ఎన్నాళ్ళక్రితం వున్నా డతడు?”

“నూరేళ్ళక్రితం.”

ప్రశ్నలన్నిటికి చక్కని సమాధానాలు చెప్పింది వీరా. ఆమె కూచున్నాక ఆమె తండ్రి సగర్వంగా అన్నాడు: మతం గురించీ, నీతిని గురించీ అడిగినా ఇంత బాగానే చెప్పుతుంది వీరా. ఇంతకీ నాభార్య మంచి ఉపాధ్యాయిని. ఈమె వీరాంగన కూడాను.”

రష్యావాళ్ళు హంగేరీ వశపర్చుకోక పూర్వం, మార్చి పదిహేను హంగేరీ వాళ్ళకి జాతీయ స్వాతంత్ర్య దినంగా వుండేది. ఆవాళ పండుగుగా భావించేవాళ్ళు. పిల్లలు ‘జాతీయదుస్తుల’ తో బయలుదేరేవాళ్ళు. ఎర్రగులాబులూ, తెల్లగులాబులూ, పచ్చగులాబులూ చిన్నచిన్నవి బొత్తాం రంధ్రాల్లో పెట్టుకుని పెద్దవాళ్ళు తిరిగేవాళ్ళు. ఆరంగులు వాళ్ళ జాతీయమైన రంగులు. పిల్లలు చేతులికి అందమైన పట్టీలు కట్టుకునేవాళ్ళు. కమ్యూనిజం వచ్చాక ఇదంతా తగ్గిపోయింది. కమ్యూనిస్టుల కాలంలో ఉత్సవాలూ, ఊరేగింపులూ జరపడానికి వేరే సెలవు దినాలు ఉన్నాయి. వాటిలో రెడ్ ఆర్మీ డే, మేడే ముఖ్యమైనవి. 1953 మార్చి 15 నాడు తన ఆరేళ్ళ కొడుకుకి ‘జాతీయ దుస్తులు’ వేసి, పెద్ద పట్టీ చేతికి కట్టింది హాడ్జాకు భార్య.

“ఏవీహో వాళ్ళు చూస్తారు” మిత్రులు హెచ్చరించారు.

“ఇవాళ వీడికి ఆరేళ్ళు వచ్చాయి. తన ఆరో జన్మదినంనాడు వీడు తాను హంగేరీ వాణ్ణని తెలుసుకోవాలి. అదీ నా కోరిక” అంది ఆమె.

అభిమానంగా ఆమె అతణ్ణి వీధిలోకి పంపింది. అతణ్ణి చూసిన మొదటి మనిషి కళ్ళల్లో నీళ్ళు తిప్పుకున్నాడు. రెండోవాడు పోలీసువాడు. పిల్లవాణ్ణి ఆపి అతడు అడిగాడు.

“ఎక్కడికి వెళుతున్నావు?”

“ఇవాళ మా జాతీయ దినం” అన్నాడు జోహాను. అంటూనే అతడు పోలీసువాణ్ణి ప్రశ్నించాడు: “నీరంగులేవీ?”

"నాహృదయంలో వున్నాయి" అన్నాడు పోలీసు వాడు. తరవాత కుర్రాణ్ణి ఇంటికి తెచ్చి విడిచిపెట్టి వెళ్ళాడతడు. ఆలా కుర్రాళ్ళని వీధుల్లో వొదిలేస్తే ప్రమాదం తప్పదు.

అవాళనించీ తాను హంగేరీ వాణ్ణని తెలుసుకున్నాడు జోహాను. తమ చిన్నగదిలో తలిదండ్రు లిద్దరూ ఆతడికి పాత హంగేరీ గేయం నేర్పారు. అయితే అందరి ఎదటా అది పాడవద్దని హెచ్చరించారు. ఏవీవో వాళ్ళు వింటారని వాళ్ళభయం. కాని తన ఎనిమిదోఏట జోహాను పోటీ ఉపన్యాసాల్లో పాల్గొని ఆ దేశభక్తి గేయం మహావేశంతో పాడాడు. ఉపాధ్యాయులలో అది కదలిక కదిలించింది. ఎంతోమంది కన్నీళ్ళు కార్చారు. గేయం ముగిశాక వొక పాతఉపాధ్యాయుడు మెచ్చుకుంటూ చప్పట్లు కొట్టాడు. ఈ ఉపాధ్యాయుడిసంగతి వేగులవాళ్ళు ఏవివోవాళ్ళకి వూదారు. తరవాత అతణ్ణి వాళ్ళు తీసుకుపోయారు.

"మా పిల్లలికి స్కూలంటే ఎంతో కష్టమైపోయింది. మేం సాహసించి మతం నేర్పాలని దరఖాస్తు చేశాం. "మతం నేర్చుకుంటే ప్రమోషను ఇవ్వం. జాగ్రత్త" అంటూ హెచ్చరించారు స్కూలు అధికార్లు. మతమే కావాలంటే ఇక స్కూలుకి రావద్దని స్కూలునాయకుడు స్పష్టంగా చెప్పేశాడు. ఏవివోవాళ్ళు పట్టుకుపోయిన ఉపాధ్యాయుడు తిరిగివచ్చాక: రహస్యంగా మతం నేర్పే ఏర్పాటుచేశాడు. దురదృష్టవశాత్తూ పట్టుబడ్డాడా అతడి ప్రాణానికే ముప్పు. అది అతడికి బాగా తెలుసు. అయినా అతడు ఈపనికి పూనుకున్నాడు. చాలా ఉత్తము డతడు" అంది హాడ్జాకు భార్య.

స్కూలుకీ, తలిదండ్రులికీ మధ్య పోరాటం సాగుతూనేవుండేది. "అన్నీ కమ్యూనిస్టుల చేతుల్లోనే వుండేవి. పటికిబెల్లమూ, పళ్ళూ, ఆటలూ, రాత్రి పాఠశాలలూ అన్నీని. మాకు వున్నదొక్కటే – భయం" అన్నాడు హాడ్జాకు.

అతడి భార్య ఇంకా ఇలా అంది: "వాళ్ళకి మేం ముఖ్యంగా నేర్పింది దేవుడిమీద నమ్మకం. కుటుంబంలో వాళ్ళందరూ కలిసికట్టుగా వుండాలని కూడా నూరిపోశాం."

హాడ్జాకు ఇంకా విడమరిచి చెప్పాడు.

"మా కుటుంబజీవితం విచ్ఛిన్నం చెయ్యడానికి వాళ్ళు ఎంత ప్రయత్నించారో, మేం అంత ఎక్కువగా ఐకమత్యంతో వుండాలని బోధించాం.

పగలంతా వాళ్ళు కిందికి దిగదియ్యడం, రాత్రి మేం తలఎత్తి, బలంపట్టి పైకి ఎగరడం — ఇది రోజూ జరుగుతూ వచ్చింది.

"మా వీరాని ఉదాహరణగా తీసుకోండి. ఆరేళ్ళు వచ్చేటప్పటికి రష్యా వాళ్ళంటే ఆమెకి వెగటు పుట్టింది. తొమ్మిదేళ్ళు వచ్చేసరికి అది ద్వేషంకింద తేలింది. పదేళ్ళు వచ్చేసరికి కమ్యూనిజం ఎంత చెడ్డదో ఆమె గ్రహించింది. పదమూడేళ్ళ పిల్ల అయేసరికి మంచి దేశభక్తురాలయింది. ఇప్పుడామెకి నాకంటే అధికం తెలుసు. నాకంటే సులభంగా అన్నీ అర్థం చేసుకుంటుంది" అన్నాడు వీరా మామయ్య.

"కమ్యూనిస్టు ఉపాధ్యాయులు ఉపన్యాసాలిస్తూవుంటే, వాళ్ళ అబద్ధాలన్నీ ఇట్టే అర్థమైపోతాయామెకి" అంది ఆమెతల్లి.

"మీ గుట్టుకాస్తా పిల్లలు బయటపెట్టేస్తారని మీకెప్పుడూ భయం కలగ లేదూ? — ప్రమాదవశాత్తే అనుకోండి" ఆమెమాటకి అడ్డువస్తూ అడిగా డొకాయన.

ఈప్రశ్నకి వెంటనే జవాబు రాలేదు. కమ్యూనిస్టు కోరల్లో చిక్కిపుండిన్నీ, తమ ధార్మిక, వైజ్ఞానిక జీవితం తాము ఎలా నిలుపుకోగలిగారో ఆలోచిస్తూ వాళ్ళు మాట్లాడలేకపోయారు. ఎలా ఎలా తాము ఆలోచనలు సాగించారో, ఎలాంటి ఆపదలకి గురిఅయారో, పిల్లలమీద ఎంత నమ్మకం వుంచారో ఆకుటుంబంలో ప్రతీవ్యక్తికీ తెలుసు. అవన్నీ వాళ్ళు చెప్పదలుచుకోలేదు. అవన్నీ బైటపెడితే కుటుంబరహస్యాలు బైటపెట్టినట్టే అవుతుంది. అనువాదకుడు చటుక్కున ఆవేశంతో ఇలా అన్నాడు. ఒక హంగేరీ కుటుంబం ఇలాంటి సందర్భంలో ఎలా కాలం గడుపుతుందో నేను చెపుతాను. వీళ్ళు కంగారుపడకండా ఇంగ్లీషులో చెపుతాను."

"మాపిల్లలు ఎదుగుతూవుంటే మాకు భరించలేనంత ఆవేదనకలిగేది. మాకొడుకులు ఎర్రటి టైలు కట్టుకుని ఇంటికివచ్చి, కమ్యూనిస్టు అబద్ధాలన్నీ మాతో చెప్పేవాళ్ళు. 'మీరు ఎవళ్ళని ప్రేమిస్తారు?' అని అడిగితే 'అమ్మనీ, నాన్ననీ, స్టాలిను అన్నయ్యనీ' అని చెప్పేవాళ్ళు.

గదుల్లోపెట్టమని తెచ్చియిచ్చేవాళ్ళు. ఉపాధ్యాయులు ప్రతీరోజూ వాళ్ళని 'మీతల్లిదండ్రులు స్టాలినుని ప్రేమిస్తారా?' అని అడుగుతారని తలిదండ్రులికి తెలుసు. ప్రతీరాత్రీ పడుకోబోయేముందు భార్యాభర్తలు ప్రశ్నించుకోడం రివాజు: 'నిజం తెలుసుకోగల వయస్సు మన పిల్లలికి వచ్చిందా?' అని. సామాన్యంగా భర్త జవాబు చెప్పేవాడు: 'ఇంకారాలేదు' అని.

ఒకతల్లి ఎప్పుడూ అంటూవుండేది: 'మీరు ఏమైనా అనండి. నాపిల్లాడు ఇలాంటి అబద్ధాలమీద బతుకుతూవుంటే నాకు తరుక్కుపోతుంది. ఇవాళ వాడితో నిజం చెపుదాము.' తండ్రి ఒప్పుకునేవాడు కాదు: 'అప్పుడేవద్దు. వాడింకా ఎనిమిదేళ్ళవాడే కదా!' తరవాత తల్లీతండ్రీ ఇద్దరూ కుర్రాణ్ణి పరీక్షించేవాళ్ళు. ఈసంగతి పక్కఇంటివాళ్ళకికూడా తెలిసేదికాదు. 'పిల్లాడు బుద్ధిమంతుడు. ఫరవాలేదు' అనేది తల్లి. 'అవును. నాకూ అలాగేతోస్తోంది.' అనేవాడు తండ్రి. ఆరాత్రి గుసగుసలు జరిగేవి. ధైర్యంచేసి ఎలాఅయినా పిల్లాణ్ణి అబద్ధప్రచారంనించి రక్షిద్దామని పట్టుపట్టేది తల్లి.

"బుడాపెస్టులో నమ్మదగిన మరో కుటుంబం ఎక్కడైనా వుందా అని వెదకడ మారంభిస్తారు వాళ్ళు; సూచనలు చేస్తారు. ఏవయస్సులో కుర్రాణ్ణి నమ్మవచ్చునన్నది ప్రశ్న. ప్రాణస్నేహితుడితో ఒక మనిషి అడుగుతాడు: "ఎనిమిదేళ్ళ వయస్సులో—' ఇంకా వాక్యం పూర్తికాకుండానే రెండో మనిషి అందుకుంటాడు: 'మాపిల్లాడితో తొమ్మిదోఏట మాట్లాడాను' అని. అంతే, తరవాత గప్‌చిప్. తల్లి తనతోటి స్త్రీతో మాట్లాడుతుంది: 'ఏమమ్మా! ఎంత వయస్సులో?........' అని. 'ఎనిమిదోఏట' అంటుందామె, మాట గ్రహించి ఆ పక్కనేవున్న మరో ఆమె ఈమాటలు విని తెల్లపోతుంది. ముక్కుమీద వేలు పెట్టుకుని 'పదేళ్ళు నిండితేనేకాని వీల్లేదు' అంటుంది.

"చూశారా, కమ్యూనిజంనించి తమ పిల్లాణ్ణి రక్షించడానికి తగిన వయస్సు ఏది అని ఆ కుటుంబం దేవులాడుతోందన్నమాట. కుర్రాడు మరీ చిన్నవాడైతే, అమాయికంగా ఈరహస్యం చెప్పేశాడా కొంప మునుగుతుంది. ఏవివో వాళ్ళకి ఏపాటి అనుమానం తట్టినా రాత్రి వచ్చి తండ్రిని తీసుకు పోతారు. మళ్ళీ అతడి పత్తా తెలకపోవడం కూడా కద్దు.

"తరవాత గుసగుసలు మరీ హెచ్చిపోతాయి. సంప్రదింపుల అధిక మవుతాయి. నన్ను ఆరుగురు మిత్రులు అడిగారు. మూడుసార్లు నేను కుటుంబసభల్లో పాల్గొన్నాను. ఈ సంప్రదింపులూ, సభలూ ఎప్పుడూ రాత్రిళ్ళే జరుగుతాయి. ఒక్కొక్కప్పుడు తల్లిదండ్రులు పిల్లల్ని పోగుచేసి 'ఇవాళ బడిలో మీరు ఏమిటి చదివారు?' అని అడుగుతారు.

"రష్యానీ, స్టాలినునీ మాత్రమే హంగేరీ నమ్ముకోవాలి. అందులోనే హంగేరీ దేశానికి శ్రేయస్సుంది" అంటారు పిల్లలు.

"బాబూ, అంతతా అబద్ధమోయ్" అంటాడు తండ్రి.

"ప్రమాదకరమైన క్షణాలవి. మృత్యువు నెత్తిమీద వున్నట్టు కనిపిస్తుంది. ఆపిల్లాడి భావం వినకండానే 'ఇస్త్వాన్, ఈరాత్రి జరిగింది ఎవరితో అయినా చెప్పావా, నీతండ్రి చస్తాడు.'

"పిల్లలికి ఇదంతా అర్థమవుతుంది. వాళ్ళు ప్రశ్నలు ప్రారంభిస్తారు. ఇంతలో తల్లి అంటుంది. 'మీమనస్సులో కొన్నిమాటలు దాచిపెట్టుకోండి. అవి మాకు లాభం కలిగిస్తాయి.' ఆమె చెప్పేవి సాధారణంగా బైబిలు వాక్యాలో, లేదా పెటోఫీకావ్యభాగాలో అయివుంటాయి.

"తనతండ్రికి క్రమశిక్షణ ఇవ్వవలసిన క్షణం ప్రతీ తండ్రికీ ఎప్పుడో ఒకప్పుడు తప్పకండా వస్తుంది. తండ్రి ధైర్యం చేస్తాడు. 'కొడుకు:కుటుంబం మీద కసి తీర్చుకోదలిచాడా, కానివ్వండి, దానికేంచేస్తాం?' అంటాడతడు. నాకొడుకుతో ఈవిషయం మాట్లాడినప్పుడు జరినసంగతి నాకు జ్ఞాపకముంది. నేను వాడితో అంతా చెప్పినతరవాత వాడు నన్ను చూస్తూ అలాగే నిలబడి పోయాడు. నేను భయపడుతున్నానని వాడికి తెలుసు. అంచేత అవసరమైనా వాణ్ణి కొట్టననీ వాడికి తెలుసు ......కాని నాప్రాణం పోయినా ఫరవాలేదు. వాడుమాత్రం మంచివాడుగా పెరగాలని నాకోరిక. ఇదిగో ఇలాంటి క్షణాల తోనే మాకుటుంబజీవితం గడుస్తుంది."

అతడు ఒక్కనిమిషం ఆగాడు. తరవాత జోహాను తలమీద చెయ్యి పెడుతూ అన్నాడు:

"పీకలమీద కత్తి వుందని ఈకుటుంబానికి తెలుసు. అయినా ఈకుర్రాడికి వీళ్ళు నిజం చెప్పారా. వాళ్ళు తలుచుకుంటే ఈకుటుంబమంతటినీ మచ్చుకి లేకండా చేసెయ్యగలరు" అన్నాడు.

హేడ్జాలకి ఇంగ్లీషు అర్థమవుతూనేవుంది. అందరూ చిట్టి జోహానువైపు చూశారు. హేడ్జాను భార్య అంది: "అలాంటి అవకాశం తప్పనిసరిగా తీసుకోవలిసి వచ్చింది."

విప్లవంఎదుర్కొన్న ఆకుటుంబం ఇలా ఒక్కతాటిమీద నిలిచే కుటుంబం. ఆమె ఇంకా ఇలా అంది: "మేము చెప్పకండానే మాపిల్లలు రష్యా పుస్తకాలు చించి పారేశారు. 'ఈపుస్తకాలు ఎన్నడూ చదవం' అంటూ ఒట్టు పెట్టుకున్నారు. ఎన్నికుటుంబాల్లోనో ఇలాగే జరిగింది."

"ఆవిప్లవంలో ఎవ్వరూ చెప్పకండానే మాజోహాను పెటోఫీ కావ్యం బిగ్గరగా చదవడం నాకు బ్రహ్మానందం కలిగించింది. నిర్భయంగా గొంతెత్తి చదివాడు మాబాబు."

"పెటోఫీ ఎవరు?" ఒకరు అడిగారు.

"సాండర్ పెటోఫీ 1848 విప్లవ మహాకవి; వీరయోధుడు; మంచి వాడు" అన్నాడు జోహాను.

"ఇదంతా ఒప్పచెప్తున్నట్టుంది. పెటోఫీ ఎవరో నీమాటల్లో చెప్పు" అన్నాడు ప్రశ్నవేసిన వ్యక్తి.

హొటేలంతా హంగేరీవాళ్ళతో నిండిపోయింది. తొమ్మిదేళ్ళ జోహాను మాట్లాడుతూవుంటే అందరూ నిశ్శబ్దంగా విన్నారు.

"పెటోఫీ ఒక యువకుడు" అందుకున్నాడు జోహాను—"ఒక నటుడు. అయితే నటుడుగా అత డేమీ డబ్బు సంపాదించలేదు. విప్లవంలో అతడు దెబ్బలాడాడు. కాని అతడు చేసిన గొప్పపని కావ్యాలు రాయడం. ప్రతివీధిమొగనీ నుంచుని అతడు తన కావ్యాలు గానం చేసేవాడు. అతడి కావ్యాలు బుడాపెస్టు అంతటా మారుమోగాయి. అందరికీ అవి కంఠస్థ మాయాయి. నాకుఇష్టమైన కావ్యం ఇది" అంటూ అతడు సన్నని చిన్నగొంతుకతో, హొటేలంతా వుర్రూతలూగిపోయేట్టు హంగేరీ స్వాతంత్ర్య గీతం పాడాడు.

"లేవండీ!
హంగేరీ సోదరులారా! లేవండీ!
మాతృభూమి పిలుస్తోంది,
కన్నతల్లి పిలుస్తోంది!
ఇదే ఇదే శుభసమయం.
ఇది వొదిలేస్తే, మరి రాదీ శుభసమయం.
బాధలైనా భాగ్యాలే, మరి
స్వతంత్ర జీవం గడపండీ!
అటో ఇటో వే తేల్చా లిప్పుడు.
హంగేరీ భగవంతుడి సాక్షిగ
మేం ప్రమాణం చేస్తున్నాం.
ప్రమాణ మిదుగో చేస్తున్నాం.
బానిస జీవం పరిత్యజిస్తాం.
బానిస జీవం పరిత్యజిస్తాం."

గేయం పూర్తయేటప్పటికి హాలంతా నిశ్శబ్దంగావుంది. హాడ్జాకు భార్య కళ్ళవెంచి కన్నీళ్ళు కారాయి. హాడ్జాకు ముక్కు చీది కొడుకువేపు సగర్వంగా

చూశాడు. ప్రశ్నలు వేసినవాళ్ళల్లో కొందరు పెదవి విరిచారు. పెటోఫీ గేయంతో పులకితులైన హంగేరీవాళ్ళు నిశ్శబ్దంగా కూచున్నారు.

ప్రశ్నలు వేసిన వాళ్ళలో ఒకడు మెల్లిగా అన్నాడు: "వీడిస్తే తప్ప హంగేరీ వాళ్ళకి సుఖంగా వుండదు."

ఈమాటతో అందరూ నవ్వారు. హాడ్జాకు అన్నాడు: "ఇలాంటి పిల్లల్ని కమ్యూనిజం ఏంచేస్తుంది? బుడాపెస్టు అంతటిలోనూ ఒక్క కుర్రాడుకూడా రష్యావాళ్ళ పక్షాన పోరాడలేదంటే దానికి కారణం ఇప్పుడు తెలుస్తుంది."

"మార్క్స్-లెనిను పాఠశాలనించి విద్యార్థులు ఎవ్వరూ స్వాతంత్ర్య యోధులమీద దాడి చెయ్యలేదా?" ఒకరు అడిగారు.

హాడ్జాకు ఇదేం ప్రశ్న అన్నట్టు వుత్తిచూపులతో ఆగిపోయాడు.

"ఏమీ చెయ్యలేదా?"

"చేశారు."

"చాలామందా?"

"కొద్దిమంది."

"పాపం, కొంతమంది వున్నారన్నమాట" అన్నాడు హంగేరీ వ్యక్తి. కొంచెం ఆలోచించి మళ్ళీ అన్నాడు: "బహుశా, వాళ్ళ తల్లిదండ్రులు వాళ్ళకి పెటోఫీ మహాకావ్యం నేర్పలే దనుకుంటాను."

"అదేమిటి?"

"వీరా, ఏదమ్మా ఆ మహాకావ్యం వినిపించు" అన్నాడు హాడ్జాకు.

చక్కని చుక్క వీరా లేచింది. రొదగావున్న హోటేలు యావత్తూ నిశ్శబ్దమైపోయింది సన్నని మృదువైన గొంతుకతో వీరా ఆరంభించింది. తరవాత ఆవేశంతో, భయంపుట్టేటంత ఆవేశంతో కంఠమెత్తింది. పెటోఫీ తనపిల్లవాణ్ణిచూసిరాసిన గేయమది. ఆమె పాడుతూంటే దుబాసీ మెల్లి మెల్లిగా అర్థంచెప్పాడు. అంతలో మళ్ళీ సన్ననిస్వరంతోపాడింది. ఈపాటలో చరణాలు యుద్ధానికి సంసిద్ధులుకండనికాదు. శత్రువుమీదకోపం రేపే మాటలు కావు. కొత్తహంగేరీకోసం చిరకాలంనించీ నిరీక్షిస్తున్న ఒకమనిషి ఆవేదన అది. తాను ప్రేమించిన ఒకజాతి భావిచూసిన ఒక భావుకి పిలుపు అది. "మంచివాడివికమ్మని తన కుమారుణ్ణి ఉద్బోధిస్తున్నాడు కవి" అన్నాడు దుబాసి మెల్లిగా — "జీవితకాలమంతా మంచివాడివిగా వుండమని ప్రబోధిస్తున్నాడు. పెటోఫీ తనకంటే తన కుర్రాడు ఎక్కువ మంచివాడుగా వుంటాడని ఆశిస్తున్నాడు. తానుచూసిన హంగేరీకంటె తన కొడుకు మంచి హంగేరీనిచూస్తాడని ఆశిస్తున్నాడు."

వీరా పాట పూర్తిచేసేటప్పటికే హొటల్లో ఎవ్వరూ ఒకళ్ళమొహం ఒకళ్ళు చూసుకోలేకపోయారు. ప్రవాసవేదన ఒక్కటే వాళ్ళగుండెలు నులిమేస్తూవుంది. అంతా నిశ్శబ్దం. వేదనతోనిండివున్న అనిశ్శబ్దం వీరా గొంతుకు కలగుండు పరిచింది.

"మేం హంగేరీ వొదిలేసి రావలసి వచ్చింది. ఏలాగూ హంగేరీ వొది లెయ్యాలనే అనుకున్నాం. కాని జోహానుచేసినదానివల్ల అది తప్పనిసరి అయింది"

"జోహాను ఏంచేశాడు ?"

హాడ్జాకు కంగారుపడ్డాడు. తడబడుతూ ఇలా అన్నాడు: "స్కూలులో వీడికంటే పెద్దవాడు ఒకరష్యాకుర్రాడు వుండేవాడు. ఒకఆఫీసరు కొడు కతడు. హంగేరీని అవమానిస్తూ అతడు ఏదో అన్నాడు. జోహాను వాడి మీదపడి చెవి కొరికెయ్యబోయాడు."

దీని తరవాత కొంచేపటిదాకా చెప్పటానికి ఏమీ లేకపోయింది.

"పెటోఫీ ఎలా చచ్చాడు ?" ఒక రడిగారు.

వీరా స్వచ్ఛమైన హంగేరీభాషలో చెప్పింది: "దానిగురించి రెండు రకాలుగా చెపుతారు. నిజం ఎవ్వరికీ తెలియదు. మా 1848 విప్లవం అణి చెయ్యడానికి రష్యావాళ్ళువచ్చినప్పుడు రష్యాబల్లెపుసిపాయిలతో పోరాడి మరణించా డంటారు. వాళ్ళు అతడి గుండెల్లో పొడిచేశారట. కొందరు మరోవిధంగానూ చెపుతారు. రష్యావాళ్ళు అతణ్ణి గాయపరిచారట. పెటోఫీ గుక్కతిప్పకుండా రష్యాని చెడామడా తిట్టేశాడట. దాంతో అతణ్ణి బతికి వుండగానే పాతిపెట్టేశారట. ఏమైనా అతడు తన ఇరవై ఆరో ఏట మర ణించాడు."

హడ్జాకు దంపతులు తమపిల్లలు కమ్యూనిష్టులుగా పెరగడానికి ఇష్ట పడలేదు. తమపిల్లలని కమ్యూనిజంనించి రహస్యంగా రక్షించుకున్నారు. మిగిలిన హంగేరీ కుటుంబాలుకూడా ఆదేవిధంగా నిశ్చయించుకున్నట్టు దుబాసీచెప్పినదానివల్ల స్పష్టమవుతుంది. ఇవన్నీ ఆలోచిస్తే సోవియట్ల సిద్ధాంతం తప్పనే తెలుస్తుంది.

యువకులమీద ఎంతో అంత ఒత్తిడివేసినా వాళ్ళని కమ్యూనిజం ఆకర్షించలేకపోయిందని నావాదం. 'చిన్నపిల్లల మనస్సులతో ఏది పడితే అది చెయ్యగలను' అనే స్టాలిను గర్వోక్తి వ్యర్థమయించని నాసిద్ధాంతం.

హంగేరీచరిత్ర దీనికి తార్కాణం కాదని కమ్యూనిస్టులు అనవచ్చు. పెట్టిబడివారులూ, విప్లవవ్యతిరేకవాదులూ తమపిల్లలమనస్సులు బానిసత్వానికి బంధించివుంచారనీ, ఇలాంటి రాకాసులు వుండగా కమ్యూనిజం అభివృద్ధి పొందవదనీ వాళ్ళు వాదించవచ్చు. కమ్యూనిస్టు నిర్వచనం ప్రకారం జానస్‌హడ్జాకూ, అతడిభార్యా ఇద్దరూ రాకాసులే.

నివేదికలో నేను ఇచ్చినసాక్ష్యం ఒక్కటీ తీసుకుంటే కమ్యూనిస్టులు హాడ్జాకుల్ని విప్లవవ్యతిరేకు లనడం స్పష్టమే. (ఏమంటే వాళ్ళు తమ పిల్లలికి చరిత్రనేర్పారు.); వాళ్ళుపెట్టుబడిదారులు: (ఒకప్పుడు చిన్న స్వంత కర్మాగారం వాళ్ళకుండేది); ఫాధిరీలచేతిలో వాళ్ళు కీలుబొమ్మలు (వాళ్ళకి దేవుడంటే విశ్వాసముంది); హంతకులైన ఫాసిస్టులు వాళ్ళు (వాళ్ళఅబ్బాయి ఒకమంచి కమ్యూనిస్టుకుర్రాడి చెవ్వుకొరికెయ్యబోయాడు).

ఇంతకీ హంగేరీ యువకులచరిత్రలో బాగా ఘోరమైన ఘట్టం ఇంకా రావలిసేవుంది. హాడ్జాకు పిల్లలికి కమ్యూనిస్టు వ్యతిరేకసిద్ధాంతాలు నేర్పారు. అందుకనే వాళ్ళు కమ్యూనిస్టులికి వ్యతిరేకంగా పోరాడారు. ఇందులో ఆశ్చర్యపడవలిసినవిషయం ఏమీలేదు; కాని హడ్జాకు లంతధైర్యసాహసాలులేని ఇతరకుటుంబాల పిల్లలసంఖ్యే హెచ్చు. వీళ్ళందరూ కమ్యూనిజానికి వ్యతిరేకంగా దెబ్బలాడారు.

కమ్యూనిజానికి పూర్తిగా అంకితమైపోయినవాళ్ళ పిల్లలూ, పైపైన కమ్యూనిస్టులికి లొంగివున్నవాళ్ళపిల్లలూ - అందరూ ఈ పాడుపద్ధతికి వ్యతిరేకంగానే దెబ్బలాడారు. ఏవివో వాళ్ళపిల్లలుకూడా స్వాతంత్ర్యయోధులతో కలిసి, కమ్యూనిజానికి వ్యతిరేకంగాదెబ్బలాడిన నిదర్శనాలున్నాయి. కొందరు పెద్దఉద్యోగుల పిల్లలుకూడా కమ్యూనిజంతో యుద్ధం చేశారు. ఇమ్రీహెూర్వాత్ దీని కొక నిదర్శనం. అతడు తనతండ్రి ప్రభుత్వానికి వ్యతిరేకంగా పోరాడాడు.

ఈ విషయాలన్నీ ఒకటి రుజువుచేస్తాయి. మార్క్స్ - లెనిన్ ఇన్స్టిట్యూటులోని కొద్దిమంది విద్యార్థులుతప్ప తక్కినవాళ్ళు అందరూ, వాళ్ళ తల్లిదండ్రుల అభిప్రాయాలు ఎలావున్నా కమ్యూనిజం కష్టసమయంలో దాన్ని నిరాకరించారు. లెనిను ఇన్స్టిట్యూటు విద్యార్థులు కొందరుమాత్రం మోహపడి లోపలికివెళ్ళి అక్కడ బందీలయిపోయారు.

## 9. యాండావు వంతెన

యాండావు అనేచోట ఒక వంతెనవుంది. హంగేరీ మనిషి ఎవడైనా ఆ వంతెన చేరుకున్నాడా అతడు ఇంచుమించు స్వతంత్రుడయినట్టే లెక్క

వంతెనఅంటే ఏమంత పెద్దవంతెనకాదది. ఒకకారు వెళ్ళేటంత వెడల్పయినాలే దది. ఒక మోటారుసైకిలు బరువుకూడా అది భరించలేదు. దాని మీద వున్నదల్లా వొకటి రెండు బల్లచెక్కలు ; వొక కాలిబాట. వొదులు బల్ల చెక్కలతో కట్టిం దది. పిల్లలు జారిపోకండా రెండువేపులా కటకటాలు కట్టారు.

అది నిజంగా యాండావు గ్రామంలోనూలేదు. అయినా హంగేరీ అంతటా దాన్ని యాండావు వంతెనఅనే అంటారు. హంగేరీనించి పారిపోయిన వేలాది శరణార్థులు ఈవంతెన దగ్గిరికే ప్రయాణిస్తారు. రష్యావాళ్ళ బారినించి తప్పించుకుని, వొక కాగితం చేతిసంచితోనో, లేదా ఉత్తిచేతులతోనో స్వాతంత్ర్యంకోసం ఈ చిన్నవంతెన దిక్కుపోతారు.

యాండావు హంగేరీలోలేదు. అది ఆస్ట్రియాలో వొక చిన్నగ్రామం. వంతెనకి సమీపంలో వుం దది. అంచేతే వంతెనకి ఆ పేరు వచ్చింది. ఆ గ్రామానికికూడా ఆ వంతెనవల్లే పేరూ ప్రఖ్యాతులు వచ్చాయి. అంతేకాదు శరణార్థులికి ఆశ్రయం ఇవ్వడంలో ఆ గ్రామం మేటి అనిపించుకుంది.

వంతెనకింద పెద్దనదికూడాలేదు. నది కాకపోతేపోయింది, అది వొక వాగుకూడాకాదు. అది వొక బురదకాలవ. ఏన్సరుకాలవ అంటారు దాన్ని. ఆ చుట్టుపట్ల రొంపినీళ్ళు పోవడానికి ఎప్పుడో తవ్విన కాలవ అది. ఇప్పుడు హంగేరికీ ఆస్ట్రియాకీ అదే సరిహద్దు.

ఈ వంతెనకి రోడ్డుకూడాలేదు. రైలు అసలేలేదు .చుట్టుపట్ల రొంపినేలలో పెరిగే చక్కనిగడ్డి కోసుకుని, ఇటునించి అటూ అటునించి ఇటూ పోయే రైతులకోసం ఎప్పుడోకట్టిన వంతెన అది. ఆ రైతులు హంగేరీ ఆస్ట్రియాల విభాగం ఎన్నడూ గమనించలేదు. వంతెనమాత్రం హంగేరీలోనేవుంది. అది దాటి కొన్నివందలగజాలు నడిస్తేనేకాని ఆస్ట్రియారాదు.

యూరపులో ఏవిధమైన ప్రాముఖ్యతాలేని వంతెనఅది. దీనిని అక్కడి రైతులికి అలాగే వొదిలేస్తే, మరికొన్ని తరాలపాటువుండి, చివరికి ఆ కాలవలో కూలిపోయేది. దాన్ని ఎవరూ తలుచుకునేవాళ్ళేకారు.

కాని అనామకమైన ఈ వంతెన కొన్నివారాలపాటు ప్రపంచంలోకల్లా ప్రముఖమైన వంతెన అయిపోయింది. నిలకడలేని దాని చెక్కలమీదుగా వొకజాతి ఆత్మపలాయితమైంది. యాండావు వంతెనమీదుగా ఇరవైవేలమంది పలాయితులయారు. వీళ్ళంతా కమ్యూనిజంకింద పెరిగి, దాన్ని నిరాకరించినవాళ్ళు. వాళ్ళు కమ్యూనిజం కొత్తజీవితవిధానం అనుసరించి చూశారు.

భయంకరమైన కొత్తదుస్తుల్లోవున్న పాతనిరంకుశత్వమే కమ్యూనిజం అని వాళ్ళు తెలుసుకున్నారు. వ్యక్తిహక్కు,భుక్తంలోవున్న ఆస్తిపాస్తులు అది హరించేస్తుంది. పైగా కొత్తగాలికూడా పీల్చనివ్వదు; ఏ కొత్తఆశా హృదయంలో తలెత్తనివ్వదు; ఏ కొత్తభావమూ మొలకెత్తనివ్వదు. రష్యా నిరంకుశత్వనించి పారిపోయివచ్చిన శరణార్థులు యాండావుదగ్గిర తమ విషాద గాథ వివరించారు. ప్రభుత్వవిధానం దృష్ట్యా కమ్యూనిజం ఎంత దివాలా తీసిందో ఇక్కడే ప్రపంచం తెలుసుకుంది.

తమ ఈ చిన్నవంతెనమీదుగా ఇంత దుఃఖభారం, ఇంత విషాదగాథ నడిచి వెళుతుందని ఈ కర్రవంతెన కట్టిన ఆ నాటి మనుషులు ఊహించి అయినా వుండరు. తమ తాత తండ్రులనాటి ఇళ్ళూ వాకిళ్ళూ వొదిలేసి హంగేరీ యువకులు తమ వంతెనమీంచి పలాయితు లవుతారని వాళ్ళు కల్లో అయినా అనుకోనివుండరు. అయిష్టమైన దుఃఖభారంతో వొంగిపోతూ, సాహసవంతులైన హంగేరీ ప్రజలు తమ అందమైన మాతృభూమి వొదిలేసి ప్రవాసం పోవాలని నిశ్చయించుకున్నారు.

యాండావుదగ్గిర జరిగింది అర్థంకావాలంటే ఆ సరిహద్దు ప్రాంతాలన్నీ ఊహించాలి. ఆస్ట్రియా తాలూకు ఈ మూల, పల్లంలోవున్న వొక ఫుట్‌బాలు మైదానంలా వుంటుంది. ఈ మైదానంమధ్య నుంచుని వొక ఆస్ట్రియన్‌గార్డు నాతో అన్నాడు: "దక్షిణాన హంగేరీవుంది. తూర్పునా హంగేరీయేవుంది. స్వాతంత్ర్యానికి అటపట్టయిన వొక చిన్నమూలగా వున్నాం మేం!"

ఆ 'ఫుట్‌బాలు మైదానా'నికి దక్షిణాన ఎత్తయిన వొక కాలవగట్టువుంది. అది పూర్తిగా హంగేరీలోనే వుంది. మందంగా ప్రవహించే ఏన్సర్‌కాలవ వొడ్డుతో దక్షిణాన అది కలిసిపోతుంది. దూకి దాటడానికి వీల్లేనంత వెడల్పుగావుంటుంది ఏన్సర్‌కాలవ. బాగా లోతుగా వుంటుంది కనక నడిచిపోవడానికిన్నీ వీలుండదు. ఇంకా దక్షిణంగా వెళితే హంగేరీ మురుగుభూములున్నాయి. దుబ్బుగడ్డి దట్టంగా వుంటుం దక్కడ. ఈ హంగేరీ సరిహద్దు మీదుగా ఆస్ట్రియాకి పారిపోవాలంటే ఎంతో గుండెనిబ్బరం కావాలి.

ఈ ఆస్ట్రియన్ ఫుట్‌బాలు మైదానానికి తూర్పుతట్టు పరిస్థితులు మరోలావుంటాయి. ఇటు రెండు రాష్ట్రాలికీ సరిహద్దుగా వొక మురుగు కాలవ వుంది. శరణార్థులు ఇది దాటి రావాలంటే గుండెలోతు మురికిలో నడిచి రావాలి. అక్కడక్కడ అదృష్టవంతులికి మోకాలులోతు నీళ్ళేవుంటాయి. కాని ఈ మురికికాలవ చేరాలంటే కాలు పెట్టడానికి వీలుకాని హంగేరీ రొంపి దాటి రావాలి. అందులో మనిషెత్తు తుంగ పెరిగివుంటుంది.

తూర్పు మురికికాలవ దక్షిణంవేపు కాలవతో కలిసేచోట ఇద్దరు హంగేరీ సరిహద్దుదళం మనుషులు కాపలాకాస్తూవుంటారు. అక్కణుంచి అర మైలు దూరంలో ఒక ఎత్తయిన బురుజువుంది. దానిమీద తుపాకి అమర్చి వుంటుంది. అక్కడ ఏవివో మనుషులుంటారు. ఈ బురుజుకి కొన్నివందల గజాల దూరంలోనే యాండావు వంతెన వుంది.

ఆస్ట్రియాకి పారిపోవాలంటే మరొక కష్టం వుంది. హంగేరీ రొంపినేల ల్లోంచి ఎలాగో వూడి బయటపడి, ఆస్ట్రియాలో అడుగుపెట్టినా అంతా రొంపి నేలే. ఒకమైలుదూరం రొంపిలో ఆయాసపడితేతప్ప రోడ్డు దొరకదు. ఇక్కడ ఒక రక్షణకుటీరం వుంది. అందులో స్విస్‌జర్మన్ రెడ్‌క్రాస్ ట్రక్కులు శర ణార్థులకోసం సిద్ధంగా వుంటాయి. స్త్రీలనీ, పిల్లల్నీమాత్రమే ఇవి తీసుకు వెళతాయి. మొగాళ్ళు అయిదుమైళ్ళు నడిచి యాండావుగ్రామం చేరాలి. అదిగో అక్కడ చేరాకే వాళ్ళకి స్వేచ్ఛ.

అన్ని అడ్డంకులున్నా ఒక్కొక్కప్పుడు యాండావు వంతెనదగ్గిర తప్పించుకువెళ్ళడం పండుగులా వుంటుంది. ఏకారణంచేతైనా ఏవివో కాపలావాళ్ళు లేకపోవడమూ, వంతెన నిరాటంకంగా వుండడమూ, రొంపి యావత్తూ గడ్డకట్టి వుండడమూ జరిగితే అది పండుగే. రష్యా తుపాకి మను షులు ఆ ప్రాంతాల్లో లేకపోతే శరణార్థులు కాలవగట్టమ్మటే సుఖంగా నడిచి పోతారు. అలాంటి ఒకరోజున వేలకొద్దీ శరణార్థులు సంతోషంగా పాడు కుంటూ, కేరింతా లాడుతూ, లేతఎండలో నడిచి ఆస్ట్రియా ప్రవేశించారు: నా జీవితంలో అత్యద్భుతమైన అనుభవ మది.

నేను చాలా వలసలు చూశాను. పాకిస్తానునించి బాధపడుతూ వచ్చిన భారతీయుల్నీ, కమ్యూనిస్టులకిందవున్న ఉత్తర కొరియానించి కాళ్ళీడ్చు కుంటూ వచ్చిన సగంచచ్చిన కొరియా స్త్రీలనీ, జపానువాళ్ళబారినించి తప్పించుకు పారిపోతూవున్న ఫసిఫిక్కు ద్వీపవాసుల్నీ - ఎంతోమందిని చూశాను. కాని హంగేరీ వలసవంటిది ఎక్కడా చూడలేదు. మొదటి విష యం-వలస వచ్చేవాళ్ళంతా యువకులు. ఇంతమంది యువకుల్ని ఏ వల సలోనూ చూడలేదు. ఇతరవలసల్లో శరణార్థులు హెచ్చుమంది వృద్ధులు. నేను యాండావులో వుండగా హంగేరీవాళ్ళలో యవ్వనంలో వున్నవాళ్ళు అందరూ వలసపోతుండగా చూశాను. వాళ్ళ సగటు వయసు 23 ఏళ్ళు మాత్రమే.

రెండోవిషయం వాళ్ళ ఉత్సాహం. వాళ్ళలో నిరాశలేదు; నిస్పృహ లేదు. వాళ్ళేమీ దెబ్బతిని గతిలేక రావడంలేదు. రష్యావాళ్ళ కమ్యూనిస్టు మోసం ధిక్కరించి, వాళ్ళంటే అసహ్యంచుకుని వచ్చినవాళ్ళు వీళ్ళు. సంతోషంతో వచ్చేసిన శరణార్థులు.

మూడోఅంశం : వాళ్ళంతా ఒక ఆశయంతో, ఒక ఉద్దేశంతో వచ్చిన యువకులు. వాళ్ళదేశానికి రష్యా ఎలా ద్రోహం చేసిందో ప్రపంచానికి చాటి చెప్పడానికి వచ్చిన యువకులు వాళ్ళు.

"ఫ్రాన్సులోనూ, ఇటలీలోనూ వున్న కమ్యూనిస్టులు కమ్యూనిజం కింద వొక్క ఆరుమాసాలువుంటే తెలుస్తుంది దానిసంగతి" అంటారు వాళ్ళు. "వాళ్ళే ఎందుకు, ఎవరైనా వుండమను" మాటకి అడ్డువస్తూ అంటాడు మరొకడు.

నాలుగోది : ఇలా వలస వస్తున్న వాళ్ళలో విప్లవ వ్యతిరేకవాది ఒక్కడూ లేడు. దుఃఖంతో భూతకాలాన్ని వెనక్కి తిరిగి చూసేవాళ్ళు ఎవళ్ళూలేరు. వాళ్ళు పరాజితులుకారు. ఫాసిస్టులూ, పెట్టుబడిదార్లూ, అమెరికా గూఢచారులూ, క్యాథలిక్కు ఫాదిరీలూ, విప్లవ వ్యతిరేకవాదులూ మాత్రమే హంగేరీనించి పారిపోయారని కమ్యూనిస్టులు ప్రపంచమంతటా ప్రచారం చేస్తున్నారు. వాళ్ళ దుష్టపద్ధతి నిరాకరించి, పారిపోయిన వాళ్ళు ఎవ్వరో అక్కడున్న మాలాటి వాళ్ళని అడిగితే తెలుస్తుంది. వాళ్ళంతా తమజాతిలో నిగ్గయినవాళ్ళు; విశాలహృదయులు.

అలా కాకపోతే సరిహద్దు పర్యవేక్షకులుగా వెళ్ళిన నాబోటివాళ్ళు యావన్మందీ అది వొక విషాదగాథగా ఎందుకు భావించారు? నేను కలిసిన పాశ్చాత్యుడు ఎవడూ దాన్ని విషాదగాథగా కాక మరోవిధంగా భావించలేదు. పత్రికా విలేఖరులూ, శరణార్థి సంక్షేమోద్యోగులూ, ఫోటోగ్రాఫర్లూ ఈ సరిహద్దు దగ్గిర నుంచుని కళ్ళల్లో నీళ్ళు నింపిన దృశ్యాలు కళ్ళారా నేను చూశాను.

ఈ శరణార్థుల దుర్గతికి కాదు, హంగేరీ దురవస్థకే వాళ్ళు దుఃఖపడి వుంటారు. నిగ్గులలాంటి యువకులు తమ దేశాన్ని అసహ్యించుకుంటూ పారిపోతున్నారంటే ఆదేశానికి అంతకి మించిన దుర్గతి ఏముంటుంది? ఉదాహరణకి వొక పదకొండురకాల మనుషుల సంగతి ఆలోచిద్దాం. వాళ్ళు తమ దేశం వొదిలేసి పోవడంవల్ల దేశానికి ఎలాంటి నష్టం కలిగిందో ఊహించండి.

ఒకటి : సోప్రాన్ విశ్వవిద్యాలయంలో చదువుతూన్న 500 మంది విద్యార్థులూ, ముప్ఫయిఇద్దరు అధ్యాపకులూ, హంగేరీలో కమ్యూనిజంకింద మర్యాదగా బతకడం కష్టమని, తమకుటుంబాలతో సరిహద్దు దాటి వచ్చేశారు. ఏ అమెరికా విశ్వవిద్యాలయమూ ఒకేసారి వాళ్ళని తీసుకోడానికి సిద్ధపడకపోవడం శోచనీయం. తరవాత బ్రిటిష్ కొలంబియాలో కెనడా విశ్వవిద్యాలయం వాళ్ళకి సౌకర్యం కలిగించిందని విని సంతోషించాను.

రెండు : బుడాపెస్టు ఒపెరాలోని సుప్రసిద్ధ నర్తకి తన జట్టుయువతులందరితోనూ ఆస్ట్రియాకి లేచి వచ్చేసింది.

మూడు : ఎంతోమంది గొప్పగొప్ప ఫుట్‌బాల్ ఆటగాళ్ళు హంగేరీ వొదిలేసి వెళ్ళిపోయారు.

నాలుగు : హంగేరీలోని సుప్రసిద్ధమైన జిప్సీ ఆర్కెస్ట్రాలు పారిపోయి యూరపులో వివిధనగరాల హొటేళ్ళలో పనిచేస్తున్నాయి.

అయిదు : సెపెల్ ఫాక్టరీలలోని మంచిమంచి నిపుణులయిన ఎంతోమంది మెకానిక్కులు దేశం వొదిలేశారు. జర్మనీ, స్విట్జర్లాండు, స్వీడను మొదలైన దేశాల్లో ఫ్యాక్టరీలు వాళ్ళని వెంటనే తీసుకున్నాయి.

ఆరు : వివిధ పరిశ్రమలలో తర్ఫీదుపొందిన ఇంజనీర్లూ, శాస్త్రజ్ఞులూ ఎంతోమంది పారిపోయారు. ముప్ఫయి ఏళ్ళలోపు వయస్సు గలవాళ్ళని యాభైమంది ఇంజనీర్లని నేను స్వయంగా కలిశాను. జాగ్రత్తగా లెక్కలు తీసుకుంటే అయిదువేలమంది ఇంజనీర్లూ, వైజ్ఞానికులూ ఆదేశం వొదిలి వెళ్ళివుంటారు. వీళ్ళు ఇలా వెళ్ళిపోవడం దేశానికి తీరని నష్టం.

ఏడు : బుడాపెస్టు సింఫనీ ఆర్కెస్ట్రా సంగీతకుల్లో ఎంతోమంది పశ్చిమదేశాల్లో గానసభలు జరుపుకుంటున్నారు. వాళ్ళలో ఎంతోమంది వెళ్ళిపోయారు.

ఎనిమిది : ప్రముఖ రచయితలుకూడా ఎంతోమంది దేశం వొదిలీ వెళ్ళిపోయారు.

తొమ్మిది : హంగేరీ చిత్రకారుల్లో సుప్రసిద్ధులు చాలామంది వెళ్ళిపోయారు.

పది : హంగేరీ ఒలింపిక్ జట్లలో చాలామంది ఆస్ట్రియాలోనే వుండిపోడానికి తీర్మానించుకున్నారు. కొంతమంది సగందూరం ప్రయాణించేసి వుండిపోయారు. కొంతమంది హంగేరీ వెళ్ళి కమ్యూనిజానికి బలికావడానికి నిరాకరించారు. ఇంతకంటె కమ్యూనిజానికి పరాజయమేముంటుంది?

పదకొండు : అన్నిటికంటే ముఖ్యమైన విషయం చిన్నపిల్లలతో లేచి వచ్చిన పడుచుకుటుంబాల విషయం. యాండావు వంతెన దాటడానికి వచ్చిన ప్రతిజట్టులోనూ కొత్తగా పెళ్ళయిన పడుచువాళ్ళు కొంతమంది తప్ప కండా వుండేవాళ్ళు. హంగేరీకి పదిహేనుమైళ్ళ ఇటీవల డాక్టర్లు వచ్చి, పిల్లలు వంతెన దాటే విపత్సమయంలో గడబిడ లేకండా నిద్రపోయే మందులిచ్చి పోతూవుండేవాళ్ళు. తరవాత ఆస్ట్రియాలో వేరే డాక్టర్లు ఆ మందుకి వేరే విరుగుడు మందులిచ్చి లేపేవాళ్ళు.

ఈ వలస అమెరికావాళ్ళకి అర్థంకావాలంటే వెనకటి యూదుల వలసతో దాన్ని పోల్చి చెప్పాలి. చివరికి పూర్తిలెక్క తేలేటప్పటికి జనాభాలో నూటికి ఇద్దరు హంగేరీ విడిచి వెళ్ళారని తెలుస్తుంది. ఇదే అమెరికాలో జరిగివుంటే 34 లక్షలమంది దేశం విడిచి వెళ్ళిపోయినట్లు లెక్క. అంటే ఫిలడెల్ఫియా, బోస్టన్, ప్రావిడెన్సు, హార్ట్‌ఫర్డు జనాభాల మొత్తమన్నమాట. ఇదే జరిగివుంటే అమెరికాలో పరిస్థితులు అధ్వాన్నమని వేరే చెప్పనక్కరలేదు.

ఈ పోలిక కూడా అసలు సత్యం మరుగుపరుస్తుంది. ఏమంటే బోస్టన్ లాంటి పట్నం నించి సమస్తజనమూ, ఆబాలవృద్ధులూ హంగేరీ వొదిలి వెళ్ళలేదు. ముఖ్యంగా పడుచువాళ్ళు మాత్రమే, విద్యార్థులు మాత్రమే వెళ్ళారు.

అమెరికాలో పరిస్థితులు బాగా చెడిపోయి, చీకిపోయిన మన పద్ధతి వొదిలిపెట్టి సదరన్ కాలిఫోర్నియా అంతా; నోటర్‌డామ్ ఫుట్‌బాల్‌జట్టూ, యాంకీలు, బెన్నీగుడ్‌మన్ ఆర్కెస్ట్రా, ప్రస్తుతం బాగా అమ్ముతూన్న పది పుస్తకాల రచయితలూ, బ్రాడ్వే నాటకాలలో నటించే ఆరుగురు మంచి నటులు, హెన్రీఫోర్డు III, వాల్టర్ రూథర్, షికాగో సింఫనీ ఆర్కెస్ట్రా, మాసాచుసెట్స్ ఇన్స్టిట్యూటు ఆఫ్ టెక్నాలజీలో ఇటీవల ఉత్తీర్ణులైన వాళ్ళూ, జెనరల్ మోటార్సులో పనిచేసే 500 మంది మంచి మెకానిక్కులూ, 18 యూనియన్ల కార్యదర్శులూ, పదిలక్షల పడుచు భార్యాభర్తలూ, తమ సంతానంతో సహా–ఇలా జనం పరదేశానికి వలస పోయారనుకుందాం.

ఇలా పారిపోతూన్న ఈ అమెరికన్ల సగటు వయస్సు 23 అనుకోండి. వాళ్ళలో ఎవ్వరూ ముసిలాళ్ళుకానీ, రోగులుకానీ, మానసికంగా కుంగిపోయిన వాళ్ళుకానీ లేకండా అందరూ ప్రశస్తమైన వాళ్ళే అనుకోండి. ఇలాంటివాళ్ళు అమెరికా వొదిలేసిపోతే మీరు ఏమనుకుంటారు? అమెరికా

ఏదో భయంకరమైన పరిస్థితిలో వుందనుకోరూ? అదిగో హంగేరీవిషయం అదే.

యాండావుదగ్గిర నాటకం ఎప్పటికీ పూర్తికాదు. ఇంటర్ గవర్న మెంటల్ కమిటీ ఫర్ యూరోపియన్ మైగ్రేషన్ అధికారి రాబర్టు మార్పిడ్గ్రే ఒకతొమ్మిదేళ్ళకుర్రాణ్ణీ, అతడితల్లినీ క్యాంపులోకి తీసుకువచ్చాడు. కుర్రాడు చెప్పినకథ ఎంత హాస్యాస్పదంగావుండంటే గ్రే అతడివయస్సు నిజమో కాదో అని ఎన్నోసార్లు వాకబుచెయ్యవలసివచ్చింది. కుర్రాడన్నాడు: "గ్యాసొలిను అయిపోతే మా బాంబుల్లో నీళ్ళుపోశాం. అవీ అంతబాగానే పని చేశాయి. మేం వాటిని రష్యాటాంకుల్లోకి విసిరితే వాళ్ళు బెదిరిపోయి, పారిపోవాలని చూసేవాళ్ళు. ఇంతలో మాలోవున్న పెద్దకుర్రాళ్ళు తుపాకులు పేల్చి వాళ్ళని చంపేసేవాళ్ళు."

కుర్రాడి తల్లి అంది: "రాత్రంతా వీడు ఇంటికి వచ్చేవాడు కాడు. రెండురోజులు చూసి వీణ్ణి పట్టుకున్నాను. తొమ్మిదేళ్ళ కుర్రాడు రాత్రంతా వీధుల్లో తిరుగుతూ కూర్చుండడం తప్పుకాదూ! కాని వాడేమన్నాడంటే, 'అమ్మా, నేను వూరికే తిరగలేదే. టాంకులు ఎగరగొట్టేశానే! టాంకులు ఎగరగొడుతూవున్న కుర్రాణ్ణి నేను ఎలా శిక్షించేది చెప్పండి!'"

ప్రతి కథా ఈకథకంటే అసంభవమైంది గానేవుండేది. ఒకనాటి సాయంకాలం ఒక పొడుగాటి అందమైన యువకుడువచ్చాడు. చక్కని ఇంగ్లీషుభాషలో ఇలా అన్నా డతడు: "చూడండి, అక్కడున్నవాళ్ళకోసం మీరు ఏమైనా చెయ్యగలరేమో! మామీద తుపాకులు పేల్చారు. వందాపది మందిమి పారిపోయివస్తూంటే ఇది జరిగింది. అంతమందిలోనూ ఇరవై తొమ్మండుగురంమాత్రం బతికి బయటపడ్డాం."

మేం అతడి పేరు అడిగాం. "నా పేరు జొసెఫ్ కొర్మానీ. నేను కెనడా వాణ్ణి. నా ఇల్లు 82 ఎమరాల్డువీధి, నార్తు హెమిల్టను, ఒంటారియాలోవుంది" ధైర్యంగా చెప్పా డతడు.

అతడు చెప్పినకథ రాతిగుండెలుకూడా నీరు చేసేస్తుంది. అతడు చెప్పడంలో ఎక్కడా ద్వేషంలేదు. ఇన్నిబాధలూపడి, బైటపడి, ఇంత సాదాగా అతడు ఎలావున్నాడా అనే మా అందరికీ ఆశ్చర్యం కలిగింది.

"నేను కెనడా జనరల్ మోటార్సులో మంచిపనే చేస్తూవుండేవాణ్ణి. యునైటెడ్ ఆటో వర్కర్సు లోకలు 199 లో పెద్దఉద్యోగిగా వుండేవాణ్ణి. CKTB రేడియో స్టేషనులో హంగేరీ ప్రోగ్రాములికి మేనేజరుగా వుండేవాణ్ణి.

" నేను మరి హంగేరీకి ఎందుకు వెళ్ళాను ? నా మాతృదేశమది. కమ్యూనిజంకింద అక్కడ ఏమవుతుందో చూద్దామని వెళ్ళాను. ఇప్పుడు అంతా తెలిసిపోయింది. ఏవివోవాళ్ళు నా పాసుపోర్టు తీసేసుకున్నారు. ఇప్పుడు నువ్వు కెనడా పౌరుడివికావు. హంగేరీ పౌరుడివే అన్నారు. నేను తప్పించుకు పారిపోవాలనుకున్నాను. వాళ్ళు గద్దించి అడిగారు. ' నిన్ను గూఢచారిగా ఎవరు పంపారు ? టిటో పంపాడా ? ట్రూమనా ? ' అని. ఇక వాళ్ళు ఎన్నెన్ని బాధలుపెట్టారో మీకు చెప్పను.

" స్పృహతప్పిపోయేవరకూ కొట్టారు. బానిస కార్మికుడిగా నన్ను బొగ్గుగనులికి పంపారు. అక్కడ కొన్నిభయంకరమైన అనుభవాలు అనుభవించాను. నాకు ఎక్కువకోపం ఎందుకువచ్చిందో తెలుసా ? వాడి గొంతుకు పిసికెయ్యాలని ఇంకా వుంది నాకు ......

" ఆ రాక్షసుడు ఏం చేసాడని ? మేం బానిసలంకాం. ఆ భయంకరమైన గనిలో బానిసలకంటే కనిష్టమైనస్థితిలో వుండేవాళ్ళం. రోజుకి పన్నెండుగంటలు పనిచేసేవాళ్ళం. పైకి అంతా బాగాఅవుపించాలని మాకు కూలికూడా ఇచ్చేవాళ్ళు. ఇచ్చి తిరిగీ ఏదోవిధంగా లాక్కునేవాళ్ళు. తిండికనీ, బసకనీ, గుడ్డలకనీ, కావలివాళ్ళకనీ ఆ కాస్త డబ్బూ చపాయించేసేవాళ్ళు. ఎక్కువపనిచేస్తే ఇన్నిసిగరెట్లూ, ఇంతజామూ, కొనుక్కోడానికి డబ్బులు దొరికేవి. ఒక రొట్టెముక్కా, దానిమీద జాముపిసరా చూచి అక్కడి వాళ్ళు ఎంతసంతోషించేవాళ్ళో చూస్తే మీరు నిచ్చెరపోతారు.

" అయితే మేం సిగరెట్లూ, జామూ కొనుక్కున్న మర్నాడు, మేం గనుల్లోవుండగా దుష్టు మా కాపలావాడు మా జైలుగదుల్లోదూరి మా సిగరెట్లు విరిచేసి జాములో కలిపేసి అంతా నేలపాలుచేసి వచ్చేసేవాడు ".

ఎవ్వరూ కిక్కురుమనలేదు. ఒక్కక్షణం ఆగి జోసెఫ్ కొర్మాన్ మళ్ళీ అందుకున్నాడు.

" కెనెడాలో రెండు హంగేరీ భాషాపత్రికలుండేవి. రెండూ కమ్యూనిస్టు పత్రికలే. ఇప్పుడు జీవితంలో ఒక్కపనే మిగిలింది. కెనెడావెళ్ళి ఆ పత్రికలతో దెబ్బలాడడమే. వాళ్ళు నిజమే చెపుతున్నా రనుకొనేవాణ్ణి. వాళ్ళ వాగ్దానాలికి ఆశ్చర్యమూ కలిగేది. ఇప్పుడు ఆ ఆశ్చర్యం పోయింది.

"1951 నుండి 1956 దాకా హంగేరీ కమ్యూనిష్టులు నన్ను ఖైదులో వుంచారు. ఆ దినాలు ఎంతఘోరంగావున్నాయో చెప్పలేను. ఎంచేత ? కమ్యూనిష్టులు ఏయే అబద్ధాలు చెప్పి పరిపాలిస్తున్నారో అవన్నీ నేను కని

పెట్టేశానని వాళ్ళు గ్రహించేశారు. ఒక్క విషయం మీతో చెపుతాను. వాళ్ళు నన్ను ఎంతబాధపెట్టినా నేను కెనెడా పౌరుణ్ణన్నవిషయం మరిచిపోలేదు. కొన్నాళ్ళలో నేను బయటపడతాననీ తెలుసు. ఇంకా కమ్యూనిజాన్ని పొగుడుతూ రాసే కెనడా హంగేరీవాళ్ళని భగవంతుడే రక్షించాలి ".

, అవును, అతడిపేరు జోసెపు కొర్మానీ. అతడిది ఒంటారియా నార్త్ హెమిల్టను. ఒక ప్రత్యేకకారణంవల్ల నాకు అతడు చాలాముఖ్యుడు. కొంత సేపటికిముందే ఒక పహిల్వాను ఒక అడజైలరు కథచెప్పగా విన్నాను. ఆమె పేరు మేజరు మీట్‌బాలు. నిజంగా రాకాసి ఆమె. ఆ కథ రాద్దామనుకున్నాను. కాని సందేహించాను. ఒకవేళ అది నిజంకాదేమో! కొంత సత్యమున్నా అతిశయోక్తులతోనూ, అభూతకల్పనలతోనూ అల్లిందేమో! అని వెనకాముందూ ఆలోచించాను. డజన్లకొద్దీ శరణార్థుల్ని అడిగాను. "మీరు మేజరు మీట్‌బాలుసంగతి విన్నారా?" అని. అందరూ వినలేదనే అన్నారు. అంచేత ఆ కథరాయకూడదనుకున్నాను. ఇప్పుడు జోసెఫ్ కోర్మానీవచ్చాడు.

"ఆమెని ఎరుగుదువా?" అతణ్ణి అడిగాను - "పందెం వేస్తాను: నువ్వు ఆమెని ఎరుగుదువని. ఆమె 60 స్టాలినువీధిలో వుంటుంది ".

"ఆమెకి ముప్పయి అయిదేళ్ళుంటాయి. మొహంనిండా స్ఫోటకం మచ్చలు చళానరి పెదవులు. ఎర్రటి జుట్టు. నాలాగే 60, స్టాలిను తీసుకు వెళ్ళిన వాళ్ళందరూ ఆమెని ఎరుగుదురు ".

"ఆమె చెడ్డక్రూరురాలే అంటావా?"

"ఆమె ఏంచేసేదో మీతో చెప్పను ".

మేజరు మీటుబాలుగురించి నేను చేసిన రిపోర్టులు సరిగ్గా వున్నాయో లేవో తెలుసుకోవాలంటే జొసెఫ్ కొర్మానీ, నార్త్ హెమిల్టను, ఒంటారియోరాసి తెలుసుకోండి. అతడు మీకు ఇచ్చేజవాబుబట్టి నేను చెప్పింది కొంచెమేఅని తెలుస్తుంది. కొర్మానీ మీకు వివరాలిస్తాడు.

బుడాపెస్టునించి 110 మైళ్ళు నడిచి చీకటిలో వచ్చారు శరణార్థులు. సాధారణంగా వాళ్ళు తమతో ఒకేఒక్క కాగితం తెచ్చుకుంటారు: స్వాతంత్ర్యసమరంలో వాళ్ళు తీసుకున్న గౌరవకథ అందులో వుంటుంది. మినుకూ మినుకూమంటూన్న దీపం వెలుగులో నగంచిరిగి, చెమటలో తడిసిన ఒక కాగితం తీసి చూపిస్తారు. సాధారణంగా అది చెప్పరానిచోట్లలో ఒకమూల దాచి తెస్తారు. " లాజోస్ బార్టాక్ కిల్లియను బారక్సుదగ్గిర మూడు రోజులు దెబ్బలాడాడు. విప్లవసంఘం, లాస్ ఏంజెల్సు, 81 క్వీన్‌స్ట్రీటులో అతడికి ఒక తమ్ముడున్నాడు ". ఇదిగో ఇల్లాంటిమాటలే రాసివుంటాయి ఆకాగితాల్లో.

ఒకనాడు రాత్రి ముగ్గురు కొడుకులతోనూ, అలిసిపోయిన భార్యతోనూ వచ్చి ఒక మోటకార్మికుడు కునుకుతూవున్న దీపం వెలుగులో ఒక కాగితం చూపించాడు. అందులో ఇలావుంది. “ అమోఘపత్రం. సెపెల్ నవంబరు 3 1956 సెపెల్ రివల్యూషనరీ కమిటీ గ్యోర్గీ జాబోను తుపాకి పట్టుకుని అవసరమైతే కారుమీద తిరుగుతూ విప్లవంకోసం కృషి చేయవలసిందని కోరుతోంది. ఇవానిచ్ ఇస్త్వాన్, అధ్యక్షుడు, నేషనల్ కమిటీ ”. ఈ పత్రం ముద్రగూడా వుంది. సెపెల్ మనిషి అధ్యాయంలో చెప్పినకథ ఇతడిదే. సెపెల్‌లో ఆవాళ రాత్రి గ్యోర్గీజాబో భార్య దేశం విడిచెయ్యడానికి నిశ్చయించుకున్నాక, ఈ కుటుంబం వందమైళ్ళు నడిచివచ్చి స్వేచ్ఛావాయువు పీల్చింది పిల్లలిద్దరినీ భార్యాభర్తలు బుజాలమీద ఎక్కించుకుని ఇంత ప్రయాణమూ సాగించారు.

తక్కినవాళ్ళు ఇంతకంటే ఇదిగా వచ్చారు. ఇమ్రీగిగరు ఒక పనికి మాలిన తుపాకి పట్టుకుని, నోట్లో సిగరెట్టు వెలిగిస్తూ నికెల్సుడార్ఫువరకూ రైలుపట్టీలంబడినే నడిచివచ్చాడు. ఇది రష్యావాళ్ళు కాపలాకాస్తూన్న అపాయకరమైన దారి. ఆతడు తిన్నగా ఒక ఆస్ట్రియా సైనికస్థావరానికి వచ్చేశాడు. నియమంప్రకారం అతణ్ణి అరస్టుచేసి, ఆయుధాలు లాక్కుని తిన్నగా హంగేరీ పంపెయ్యాలి.

మరో శరణార్థి అప్పటికే ఆస్ట్రియాలో సురక్షితంగా వున్నవాడు రైలుపట్టీలవెంబడే పరుగెత్తుకువచ్చి “ తుపాకి అక్కడ పారేయి” గిగరుతో కేకవేసి చెప్పాడు.

“ పారెయ్యను ” పెద్దగొంతుకతో జవాబు చెప్పాడు పడుచు గీగరు.

“ నిన్ను తిరిగీ హంగేరీకి పంపేస్తారు ”

యువకుడు ఇమ్రీగిగరు పిడుగుపడ్డట్టు రైలుపట్టీలమధ్య నిర్ఘాంతపడి నిలబడిపోయాడు. అతణ్ణి ఎందుకు తుపాకితో పేల్చెయ్యలేదో తెలియదు.

“ నన్ను వెనక్కి పంపేస్తారూ ? ” రష్యావాళ్ళకి గురిగానుంచుని కేకవేశాడు గీగరు.

“ పారిపో – పారిపో ” కేకవేసి కనపడకండా నక్కిపోయాడు. మొదటి మనిషి. గిగరు తన తుపాకివేపు చూస్తూ అలాగే నిలబడిపోయాడు. చివరికి తన తల్లినే, తన చేతినే శత్రువుల పరంచేస్తున్నట్టు బాధపడి తుపాకి పక్కకి పారేశాడు. రైలుపట్టీలమీదుగా ముందుకి సాగిపోయాడు. హంగేరీనించి ఇతనంత ధైర్యంగా మరోశరణార్థి రాలేదు. రష్యా సైనికుల మధ్యనించి

"మూడు దినాలయి నడుస్తున్నాను. అంతకిముందు మాలో కొంద రిని రష్యావాళ్ళు పట్టుకున్నారు. 48 గంటలు ఆపేశారు. కొందరిని తుపా కుల్తో పేల్చి పారేశారు. నేను తప్పించుకు పారిపోయివచ్చాను. ఇంకా ఎంత దూరం వెళ్ళాలి ?" అంటూ అడిగిం దామె.

"రక్షణ శిబిరం ఒక్క కిలోమీటరుదూరమేవుంది" అన్నాడు మెగ్గర్సు, అబద్ధం చెపుతూ ఆమెకి ధైర్యం కలిగించడానికి.

"అంతమాత్రం నడవగలను. మూడురోజులు ప్రయాణం చేసిన దాన్ని ఒక కిలోమీటరు నడవలేనూ ?" అంటూ ఆమె పొగమంచులో చొచ్చుకుపోయింది.

ఎవరామె ? మాకు తెలియదు. ఎలాంటి బాధలికి ఆమె పారిపోతోందో మనం ఊహించుకోగలం. చీకటి చీల్చుకుంటూ ఒంటరిగా ఒకే దీక్షతో పోతూన్న ఆ విషాదమూర్తి ఇప్పటికీ నా కళ్ళముందు కట్టినట్టేవుంది. ఆమె ఎత్తుమడమలజోడు ఆ దీర్ఘప్రయాణంలో, రష్యా నిర్బంధంలో, హంగేరీ రొంపిలో అరిగిపోయింది.

యాండావుదగ్గిర మరోవిషయం జరిగినప్పుడు నేను లేను. కాని సి. బి. ఎస్. రేడియోస్టేషను అనౌన్సరు డాన్ కరానిక్ అదంతా స్వయంగా చూశాడు. కొన్నిఫోటోలుకూడా తీశాడు. వర్షం కురిసి దక్షిణాన రొంపినేల దాటశక్యంకాకండావుంది. అంచేత ఎంతోమంది హంగేరీ శరణార్థులు తూర్పు రొంపినేలమీదుగా రాబోయారు. అయితే ఎత్తయిన దుబ్బుగడ్డిలో వాళ్ళు దారితప్పిపోయారు. ఏవివోవాళ్ళు అది కనిపెట్టేశారు. రష్యా అధికార్ల ఆజ్ఞప్ర కారం ఆ పారిపోతూవున్నవాళ్ళని పట్టుకున్నారు ; జైళ్ళకి పంపేశారు.

ఈ సందర్భంలో ఇరవైఏళ్ళ యువకుడొకడు మనిషెత్తు గడ్డిలోంచి దూసుకు వస్తూండగా కరానిక్ చూశాడు. అతడి నెత్తిమీద టోపీలేదు. ఒంటి మీద జీపర్‌కోటూలేదు. అతడు చాలాగట్టివాడు. అతడు మురికికాలవలో దూకేశాడు. ఈదుకుంటూ ఇవతల ఒడ్డుకివచ్చి ఒక్క ప్రశ్నవేశాడు :

"ఇది ఆస్ట్రియాయేనా ?"

"అవును" అన్నాడు కరానిక్.

"మంచిది" జర్మనీలో అన్నా డతడు. అలా అనేసి గిర్రున వెనక్కి తిరిగాడు. మంచులాంటి ఆ నీళ్ళలో ఈదుకుంటూ వెళ్ళాడు. దుబ్బుగడ్డిలో మాయమైపోయాడు. పదినిమిషాల్లో పదిహేనుమందిని వెంటబెట్టుకువచ్చాడు చలివల్ల వాళ్ళందరూ నల్లగా అయిపోయారు.

"ఆస్ట్రియా" అన్నాడు ఆ యువకుడు. శరణార్థు లతడికి కృతజ్ఞత తెలిపేలోపునే అతడు ఇట్టే మాయమైపోయాడు. కొంచేపటికి మళ్ళీ కొంత మందిని కాలవ ఇవతలికి తీసుకువచ్చాడు. "ఆస్ట్రియా" అంటూ మంత్రం చదివినట్టు చెప్పి మళ్ళీ మాయమయాడు.

ఇలా మరిమూడుసార్లు వెళ్ళి మరి మూడుజట్లు తీసుకువచ్చా డతడు. చివరిసారి హంగేరీ బురుజుమీంచి హంగేరీగార్డు మనుషులు కనిపెట్టేశారు. ఉత్తరక్షణంలో ఇద్దరు సరిహద్దు కాపలావాళ్ళూ, ఒక ఏవివోమనిషీ ఆ గడ్డిలో చొరబడ్డారు. తుపాకిగుళ్ళు వినిపించాయి. ఏదో పెనగులాట విన పడింది. తుదకి ఆ ముగ్గురూ పాపం, ఆ యువకుణ్ణి పట్టేశారు.

అతణ్ణి వాళ్ళు కాలవగట్టుమీదుగా బురుజుదగ్గిరికి తీసుకుపోతున్నారు. బురుజు చేరకముందే అతడు వాళ్ళనించి తప్పించుకున్నాడు. దుబ్బుగడ్డి లోకి వుడాయించాడు. వాళ్ళు ముగ్గురూ పిచ్చివాళ్ళలా అతడి వెంటపడ్డారు. కొన్నినిమిషాల పందెం తరవాత ఆ యువకుడు కాలవ దాటేశాడు. సురక్షిత ప్రాంతానికి వచ్చేశాడు.

"మేమంతా అతణ్ణి సెబాన్ అనకండా వుండలేకపోయాం" అంటాడు కరానిక్.

ఎంతోమంది యువకులు ఇలాంటి ఆపదలే ఎదుర్కొన్నారు. "కాపలా వాళ్ళు తెల్లమొహాలువేసి బురుజుకి వెళ్ళిపోయాక ఆ యువకుడు తడిసి ముద్దయిన తనజోళ్ళు తీసేశాడు. మేజోళ్ళు లేవు. అతడి పాదాలు గడ్డకట్టుకు పోయివుంటాయి. తన మెడలో వేలాడుతున్న మూటవిప్పి పొడిజోళ్ళు తీసి తొడుక్కున్నా డతడు.

"ఆస్ట్రియాదిక్కు వచ్చేస్తాడనే అనుకున్నాం. కాని రాలేదు. లేచి నుంచున్నాడు. దుబ్బుగడ్డి తోపువేపు చెవియొగ్గి విన్నాడు. అందులో ఏదో ధ్వని విన్నాడు. తిరిగీ హంగేరీతట్టు బయలుదేరాడు. ఈ విపత్తులో తిరిగీ వెళ్ళవద్దని ఎంతో చెప్పాం. అతడు వినలేదు. "ఉంగ్రాన్" (హంగేరీవాళ్ళు) అంటూ వెళ్ళిపోయాడు. అంటే ఇంకా ఆ గడ్డితోపులో హంగేరీవాళ్ళు వున్నారు అన్నమాట. మేం నిచ్చేరపోయి, నిశ్శబ్దంగా చూస్తున్నాం. ముమ్మారు మూడు జట్టులు తీసుకువచ్చాడా యువకుడు"- కరానిక్ చెప్పిన ఉదంత మిది.

ఇది నేను చూడలేదు. కాని ఇలాంటిదే మరో అద్భుతమైన సాహస దృశ్యం చూశాను. అది ఆ సరిహద్దు మీద ఒక కథలా తయారైంది.

రష్యా వాళ్ళు వంతెన దగ్గర కాపలా కాస్తున్నారు. సున్నాకి మీద 9 డిగ్రీలు పాదరసం జారింది. కాలవ గడ్డ కట్టుకుపోతే బావుంటుందని మేము దేవుణ్ణి ప్రార్థించాం. కాని అలా జరగలేదు. దానిమీద ఒక మంచు పొరమాత్రం ఏర్పడింది. అలాంటి కాలవ దగ్గిరికి ఒక యువకుడు భార్యా పిల్లలతో కూడా వచ్చాడు. ఆమె బాగా అలిసిపోయి వుంది. వాళ్ళ పిల్లలూ అలిసిపోయి వున్నారు. ఆస్ట్రియాకి దాటి రావడానికి సులువైన మార్గంలేదు. కుక్కలు వెంటపెట్టుకుని ఏవివో వాళ్ళు ఏక్షణాన్నయినా వచ్చి మీద పడవచ్చు.

తండ్రి తన బట్టలు తీసేశాడు; చుట్టకింపచుట్టి కొడుకు చేతికిచ్చాడు. కూతుర్ని చేతుల్తో మీదికెత్తి పట్టుకున్నాడు; గడ్డ కట్టుకుంటూన్న కాలవలో దిగాడు; ఈదుకుంటూ కాలవ దాటాడు; బురదగట్టెక్కి వచ్చి చిన్నికూతుర్ని ఆస్ట్రియా నేలమీద దించాడు.

మళ్ళీ అతడు హంగేరీకి వెళ్ళాడు. ఈసారి కొడుకుని ఎత్తుకున్నాడు. మంచులావున్న కాలవ ఈదుకుంటూ ఇవతల ఒడ్డుకి వచ్చాడు. కొడుకుని ఆస్ట్రియా నేలమీద దించాడు.

తిరిగి కాలవ ఈది హంగేరీ వెళ్ళాడు. తన భార్యని తీసుకువద్దామని ఈసారి ప్రయత్నం. ఆమె పాదమైన తడవకుండా, ఈదుకుంటూ కాలవ దాటాడు. భార్యని ఆస్ట్రియా నేలమీద దించాడు. అతడు బతికేవుంటే మూర్తీభవించిన ప్రేమదేవత అనవచ్చు నతణ్ణి. అతడు బతికాడనుకోను. ఏమంటే నేను చూసేటప్పటికే అతడు నీలిగా మారిపోయి వున్నాడు.

ఇలా ఆ గడ్డి దుబ్బుల్లోంచీ, డొంకల్లోంచీ, బురదలోంచీ, రొంపి లోంచీ, ఊబిలోంచీ, కాలవకి అడ్డంగా, కదులుతూవున్న వంతెనమీదుగా హంగేరీ ప్రజలు నిగుల్లాంటి వాళ్ళు ఆస్ట్రియాకి వచ్చేశారు. ఒక నార్వీజి యను రెడ్ క్రాసు యువతి చెయ్యిపటుకుని నన్ను ఒకసారి అడిగింది :

"ఒక జాతి ఇలాంటి వాళ్ళు ఎలా పోగొట్టుకోగలదు ?"

వచ్చేసిన వాళ్ళు ఎంత గర్వంతో వచ్చారు! వాళ్ళ మొహాలమీద ఆత్మగౌరవం తాండవ మాడుతోంది. అందమైనవాళ్ళూ, ధైర్యవంతులూ, సాహసవంతులూ అయిన నలభై నలుగురు యువకుల్ని ఒకసారి చూశాను. అలాంటి యువకుల జట్టు అంతవరకూ ఎక్కడా చూడలేదు నేను. హంగేరీ నాలుగు వేపులనించీ వచ్చారు వాళ్ళు. వాళ్ళకి నాయకు డెవడూ లేడు వాళ్ళ నెవ్వరూ వెళ్ళాగొట్టలేదు. వేరువేరు మార్గాల్లో, వేరువేరు

విధాలుగా, రకరకాల ఇళ్ళనించి వచ్చి వంతెనదగ్గిర చేరారు వాళ్ళు. నా పక్కనించే వాళ్ళు వెళుతూవుంటే వాళ్ళు తెచ్చుకున్న వస్తువులు లెక్క పెట్టాను. ఈ నలభై నలుగురు శరణార్థుల దగ్గిరా మొత్తం రెండు అడపల్లల సంచులూ, రెండు తోలుసంచులూ, ఒక రొట్టెలసంచీ మాత్రమే. వాళ్ళు ఇలా కట్టుగుడ్డలతోనే బయలుదేరారన్నమాట.

"ఇంత తక్కువ సామాను తెచ్చుకున్నారేం?" వాళ్ళలో ఒకణ్ణి అడిగాను.

"ఇంతే వొదిలిపెట్టారు మాకు కమ్యూనిస్టులు" అన్నాడతడు. "ఆత్మ గౌరవం మాత్రం తెచ్చుకున్నాం."

ఈ వలస అద్భుత సంఘటనలు నన్ను చకితుణ్ణి చేశాయి. మరే వలసా ఇంత చకితుణ్ణి చెయ్యలేదు. ఈ శరణార్థులికి వీలైన సహాయంకోసం ప్రతీరాత్రీ వంతెన దగ్గిరికి వెళ్ళేవాణ్ణి. ఇంతవరకూ నేను వివరించిన హంగేరీ వాళ్ళని మొదటిసారిగా ఇక్కడే కలిశాను.

రేడియో స్టేషనుమీద జరిగిన దాడిలో గాయపడిన జోసెఫుటాత్ వంటి కుర్రాళ్ళు ఈ వంతెనమీంచే కుంటుకుంటూ వచ్చారు. ఇక్కడే వాళ్ళ స్నేహితుల సహాయం దొరికింది. జోల్టానూ, ఈవాపాలూ వంటి వివాహితులుకూడా ఈ వంతెన మీంచే స్వేచ్ఛావాతావరణంలో అడుగు పెట్టారు. కుర్రాడు సోకీ, విద్యార్థి ఇస్త్వాక్ బలోగ్, మేధావంతుడు పీటరు జిగేటీ మరో తోవమ్మట వచ్చారు. వీళ్ళందరిలోకీ చెప్పదగ్గ కుటుంబం హాడ్జాకులిది. ఇంకా ఇతరులు కూడా వున్నారు. నగ్నమైన వాళ్ళ నాటకీయ పరిస్థితులుచూసి అందరూ ముక్కుమీద వేలు పెట్టుకున్నారు.

చలి. రాత్రి నాలుగయింది. పొగమంచులోంచి ఒక యువకుడూ, అతడి భార్యా, ఇద్దరు పిల్లలూ వచ్చారు. వంతెన దాటగానే వాళ్ళని పలకరించాను. ఆస్ట్రియా మరి కొన్ని వందలగజాలే వుంది అన్నాను. భర్త మంచి ఇంగ్లీషులో మాట్లాడాడు. "శుభవార్త." నేను ఆశ్చర్యపోయాను. "నా ఇద్దరు పిల్లలూ ఇప్పుడు క్షేమంగా వుంటారు" ఆవేశంతో అంది అతడి భార్య. ఆ నలుగురూ అలా స్వేచ్ఛాప్రపంచంలో అడుగు పెట్టారు. వాళ్ళు వలస వచ్చిన కథ అప్పటికి నాకు తెలియదు.

అతడు జాక్సాంటో. అతడి కథ ప్రపంచం నాలుగుమూలలా వ్యాపించింది. హంగేరీలో జరుగుతూన్న ఉదంతానికి ఈ కథ తార్కాణంగా వుంది.

సాంటో ఒకప్పుడు న్యూయార్కులో 'ట్రాన్స్పోర్టు వర్కర్స్ ఆఫ్ అమెరికా'కి ప్రధాన కార్యదర్శిగానూ, కోశాధికారిగానూ వుండేవాడు. అతడు కమ్యూనిస్టు అన్న నేరంమీద 1949లో అతణ్ణి దేశం నించి వెళ్ళగొట్టారు. పెద్ద అట్టహాసంతో అతడికీ, అతడి భార్యకీ హంగేరీ ఆశ్రయమిచ్చింది. పెద్ద ఉద్యోగమిచ్చింది. హంగేరీ మాంస పరిశ్రమకి అతడు నియంత అయాడు.

ఆచరణలో కమ్యూనిజం ఎంతకఠోరమైందో క్రమంగా సాంటోకి అవగతమైంది. అంచేత ఇప్పుడు అతడు అమెరికాలో తలదాచుకోడానికి పారిపోతున్నాడు. పశ్చాత్తాపంపొందిన కమ్యూనిస్టు అతడు. ఇప్పుడు అమెరికాలో కమ్యూనిస్టులు పన్నుతూన్న కుతంత్రాలు విడమర్చి చూపించడానికి సిద్ధంగా వున్నా డతడు. ప్రొలిటేరియటు విరుద్ధంగా సంఘటితమైన నియంతృత్వమే కమ్యూనిజం. రైతులికి, వెనకటి ఫ్యాక్టరీ యజమానులికీ, జమీందారులికీ వ్యతిరేకంగా ఏర్పడ్డ నియంతృత్వమది. దీని ఆర్థిక నిరంకుశత్వం కష్టంతో కొంతకాలం సహించి బైటికి వచ్చేశాడు సాంటో.

ఈ వలసలో ఇంకా ఎన్నో వింత లున్నాయి. ఇంతమంది హంగేరీ వాళ్ళు పారిపోతూవుంటే రష్యావాళ్ళు ఎందుకు వూరుకున్నారో ఇంతవరకూ ఎవ్వరికీ అర్థం కాలేదు. మంచూ అదీ లేకండా స్వచ్ఛంగావున్న రోజుల్లో రోజుకి ఎనిమిది వేలమంది హంగేరీ వాళ్ళు నిరాఘాటంగా సరిహద్దుదాటి వచ్చేశారు. రైళ్ళలోనూ, ట్రక్కులలోనూ సరిహద్దుకి కొన్నిమైళ్ళ దూరం వరకూ వాళ్ళు వచ్చారు. తలుచుకుంటే రష్యావాళ్ళు సులభంగానే వాళ్ళని ఆపుచెయ్యగలిగి వుండేవాళ్ళు. ఇంతలో ఒక పుకారు లేచింది. "లక్షమంది గూఢచారుల్ని రష్యావాళ్ళు ఆస్ట్రియా పంపుతున్నారు" అని. ఇందులో సందేహం లేదు. ఈ వలస వచ్చినవాళ్ళలో చాలమంది రష్యావాళ్ళు చూస్తూ వుండగానే సరిహద్దు దాటి వచ్చారు. వాళ్ళు అనుమతి తీసుకు రాలేదు. అది వేరే విషయం. మరొక విషయం ఏమిటంటే, హంగేరీవాళ్ళు రష్యావాళ్ళని బాధపెట్టారు, కనక వాళ్ళు ఎంతమంది పోతే అంత మంచిదని రష్యావాళ్ళు భావించారు. నిజంగా ఇలాగే హంగేరీవాళ్ళు తమ దేశం ఒదిలేసిపోతే ఎనిమిదేళ్ళ లోపల హంగేరీ పూర్తిగా ఖాళీ అయిపోయేది.

ఊండీ వుడికీ రష్యావాళ్ళు దిగ్బంధం కూడా చేసేవాళ్ళు. మెషీను గన్నులూ, పోలీసు కుక్కలూ, పాస్వరసు మంటలూ, రోడ్లు మూసెయ్యడాలూ, లాండ్మైన్సూ, ప్రత్యేకమైన కాపలాలూ-అన్నీ చేసేవాళ్ళు. అలాంటి సమయాల్లో బుడాపెస్టునించి తప్పించుకోవడంకానీ, సరిహద్దులు దాటడం

కానీ సాధ్యపడేదికాదు. చాలామంది ఏవివో వాళ్ళు చేతుల్లో చిక్కిపోయేవాళ్లు. బహుశా వాళ్ళని సైబేరియా పంపేసేవారేమో!

కొందరుమాత్రం బుడాపెస్టునించి ఆడుతూ పాడుతూ వచ్చేసేవాళ్ళు. కొందరు బురదలో కాళ్ళీడ్చుకుంటూ, నరకద్వారంనించి వచ్చినట్టు వచ్చే వాళ్ళు. ఒకరన్నది అక్షరాలా నిజం.

"సరిహద్దు దాటివచ్చిన ప్రతీవ్యక్తి ఒక నవల; పదిమందైతే మహా కావ్యం".

కాపలావాళ్ళు కూడా తమ దుష్టపద్ధతికి ఒక్కొక్కప్పుడు విసిగిపోయే వారని మాకు అనుమానం వేసేది. ఒకనాడు నేను చెక్‌పాయంటుదగ్గిర నుంచుని శరణార్థులికి మార్గం చూపిస్తూ వున్నాను. ఒకతండ్రి ఇద్దరు పిల్లలతో వచ్చాడు. పెద్దకుర్రాడు పదమూడేళ్ళవాడు. దుబ్బులావున్నాడు. రెండోవాడు తొమ్మిదేళ్ళవాడు. తండ్రి ఫర్‌కోటు వేసుకుని వున్నాడు. కాపలా వాళ్ళు అందరినీ వొదిలేశారు, కాని ఈ తండ్రినీ, కొడుకుల్నీ ఆపేశారు.

అక్కడ చూస్తూ నుంచున్న మేము, కాపలావాళ్ళు ముగ్గురినీ ఆపేశా రనుకున్నాం. మా మొహాలు విచారంతో వాడిపోయాయి. ఇంతలో ఒక హంగేరీ సిపాయి తన సబ్‌మెషనుగన్ భుజాన వేసుకుని ఇంటరు నేషనల్ రెస్క్యూ కమిటీ ఉద్యోగి అయిన క్లైబోర్ను పెల్‌తో మాట్లాడ్డానికి వచ్చాడు. అతడు జర్మనీ భాషలో మాట్లాడాడు.

సిపాయి అన్నాడు: "ఈ చిన్నవాడు తన తల్లి రాందే హంగేరీ వొదిలి వెళ్ళడానికి భయపడుతున్నాడు. ఆమె ఇక్కడికి ఎప్పటికీ చేరకపోవచ్చు. మీరు ఈ కుర్రాడితో కొంచెం చెప్పండి. హంగేరీ వొదిలేసి వెళ్ళడమే ఇతడికి మంచిది." పెల్ నిచ్చేరపోతూ విన్నాడు. నాకు హంగేరీ భాష రాకపోయినా, కుర్రాడితో మాట్లాడే పని నామీద పెట్టారు. నేను కుర్రాడి దగ్గిరికి వెళ్ళాను. నా పెద్దకోటు చూసి అతడు నన్ను రష్యా ఉద్యోగి అనుకున్నాడు. నేను మాట్లాడడానికి వొంగాను. తన చొక్కా విప్పేసి, చేతులెత్తి మహాధైర్యంతో నిలబడ్డాడు కుర్రాడు. తన దగ్గిర ఆయుధాలు కానీ, కాగితాలు గానీ లేవని చూపించడమే అతడి ఉద్దేశం.

గడ్డ కట్టుకుపోయిన నేలమీద నా మోకాళ్ళు మోపి, భయపడుతూన్న ఆ పిల్లవాణ్ణి చేతుల్లోకి తీసుకున్నాను.

"నువ్వు ఈవేపు వచ్చేయి" అన్నాను. నేను వాణ్ణి కొట్టకపోవడంవల్ల నేను కమ్యూనిస్టు ఉద్యోగిని కానని గ్రహించి, కుర్రాడు నా వొడిలో కూలి

పోయాడు. వెక్కి వెక్కి ఏడవడ మారంభించాడు. అతడి తండ్రితో చెప్పాను-"అమ్మ తరువాత వస్తుందని చెప్పవయ్యా" అని.

తండ్రీ, పెద్దకుర్రాడూ ఆస్ట్రియా నేలమీద అడుగుపెట్టారు. నేను ఆ హంగేరీ బుల్లాణ్ణి తీసుకుని తండ్రి దగ్గిరికి వెళ్ళాను. హంగేరీ సిపాయి మాట్లాడకుండా తన దారిని తాను వెళ్ళిపోయాడు. నేను నాలుగడుగులు వేశానో లేదో మరతుపాకి ఢాంమ్మని పేలింది. ఉళ్ళిపడి భయంతో వెనక్కి చూశాను. క్లైబోర్న్ పెల్ నవ్వుతున్నాడు.

"'మీరు బురుజులోకి వెళ్ళిపోండి. నేను కాపలా కాస్తున్నాను' అని తక్కిన సపాయిలకి చెప్పడానికి గుర్తుగా ఈ సిపాయి తుపాకి పేల్చాడు, అంతే" అన్నా డతడు.

పెల్ ఆ తండ్రీ కొడుకుల్ని తీసుకు వెళుతూవుంటే, నేనూ, హంగేరీ కాపలా సిపాయీ ఒకళ్ళ మొహం ఒకళ్ళం చూస్తూ నుంచున్నాం కొంత సేపు. ఒక్క క్షణమాగి సిపాయి నాదగ్గిరికి వచ్చాడు. నా చెయ్యిపట్టుకుని హంగేరీ దిక్కు తీసుకువెళ్ళాడు. వంతెన దాటించి, బురుజుదాటి తీసుకు వెళ్ళాడు. ఒక ఆడదీ, ఇద్దరు పిల్లలూ ఒకదగ్గిర కూచుని వున్నారు. ఒక పిల్ల నడవలేకపోతూ వుంది. రష్యావాళ్ళు ఏక్షణాన వచ్చిపడతారో, వీళ్ళు చప్పున వెళ్ళిపోవడం మంచిది. ఆ నడవలేని చిన్నపిల్లని ఎత్తుకుని సిపాయి నాభుజంమీద కూచోబెట్టాడు తరువాత స్త్రీని లెమ్మని తొందర చేశాడు. మమ్మల్ని అందరినీ అతడు ఆస్ట్రియా దాకా తీసుకువచ్చి దిగబెట్టి వెళ్ళాడు. సరిహద్దుమీదికివెళ్ళి మరోసారి తుపాకి ఢాం మ్మనిపించాడు. తాను జాగ్రత్తగా కాపలా కాస్తున్నానని తన ఏవివో యజమానులికి అలా నివేదించాడు. జబ్బుగావున్న ఆ చిన్న పిల్లని నేను స్వేచ్ఛాప్రపంచానికి తీసుకువెళ్ళాను.

స్వాతంత్ర్య యోధుల్లో ఒకడు వుండేవాడు: అతడికి కాళ్లులేవు. అలా అని కర్రకాళ్ళూలేవు. అతడు బుడాపెస్టునించి ఒక బస్సుమీద వచ్చాడు. సరిహద్దుకి 15 మైళ్ళలో బస్సు దిగాడు. ఆ 15 మైళ్ళూ చేతులమీద అను కుంటూ ప్రయాణం సాగించాడు: మే మతణ్ణి చూసేసరికి అతడి మొండి కాళ్ళు పచ్చిపుళ్ళు అయిపోయివున్నాయి. చేతులు చీమూ రక్తమూ కారు తున్నాయి. ఈ మొండిమనిషిగురించి ఎవ్వరూ ఏమీ అనలేదు. అతడిగురించి మాటలతో చెప్పగలిగింది ఏమీలేదు.

యాండావుదగ్గిర ఒకనాడు రాత్రి అందమైన ఇరవై నాలుగేళ్ళ యువ కుడు ఒకడు చేతులు వూపుకుంటూ వచ్చాడు: అజానుబాహు వతడు. జుత్తు

కొంచెం ఎర్రగావుంది. మరిచిపోడానికి తనకి దుఃఖాలూ, విషాదస్మృతులూ ఏవీలేనట్టు ఉషారుగా, నిర్వికారంగా వున్నా డతడు. అతణ్ణి పరిచయం చేసుకున్నాను. హంగేరీలో గొప్పకుటుంబాల్లో వొకదానికి చెందిన వాడతడు. ఫెస్టెటిక్, టిజ్జా, యాంద్రస్సీ, కారోల్యీ, ఎస్టరుహాజీ – ఇవి అక్కడి గొప్పకుటుంబాలపేర్లు. ఈ పేర్లంటే నాకు అసహ్యం. ఈ కుటుంబాల ప్రవర్తనవల్లే హంగేరీ కమ్యూనిజం పరమైంది.

కాని ఈ యువకుణ్ణిచూస్తే నాకు మంచిఅభిప్రాయమే కలిగింది. ఇతణ్ణి ఎస్టర్‌హాజీ అని పిలుద్దాం. చాలానమర్థుడితడు. చమత్కారంగా మాట్లాడతాడు. ఎల్లప్పుడు సరదాగా వుంటాడు. తనకోసం తాను విచారపడడు.

“మా వంశం పదహారో శతాబ్దానికి ముందుది. ప్రాచీనమైంది. కమ్యూనిస్టు అధికారం వచ్చేసరికి బుడాపెస్టు సమీపంలో మాకు నాలుగువేల ఎకరాలభూమి వుండేది. యాభై రైతుకుటుంబాలు మా కింద వుండేవి. మా భూమి లాక్కున్నప్పటికి నాకు పద్నాలుగేళ్ళు. కాని అలా ఎందుకు జరిగిందో నేను గ్రహించగలిగాను. మా కుటుంబంలో మేం అరుగురం. మాకొక రైతు ఇల్లు ఇచ్చారు. అందులో రెండే రెండు గదులున్నాయి. అయితే రైతులుమాత్రం మామీద ప్రేమతోనే ప్రవర్తించారు. అది వాళ్ళకి అపాయమే. అయినా వాళ్ళు మాకు తిండీ, గుడ్డలూ తెచ్చి ఇచ్చారు. మా తండ్రిగారిచుట్టూ వాళ్ళు పాతస్నేహితుల్లాగ కూచున్నారు.

“నేను కొంచెం పెద్దవాణ్ణయాక నాకు అదంతా అవగతమైంది, నేను కాలేజీలో చదవడం మొదలెట్టాను. కాని నేను ఎస్టరుహాజీనని తెలియగానే నన్ను తన్ని బైటికి పంపేశారు. ఏదోవిధంగా స్నేహితులతో కాలక్షేపం చెయ్యవలసివచ్చింది. కాని వీధిలో నన్ను ఎవరైనా ఎస్టరుహాజీనని తెలుసుకున్నారా, నేను పక్కకి తప్పుకోవలసిందే. అపాయం లెక్కచెయ్యమన్నారు నా స్నేహితులు. కాని వాళ్ళని అపాయానికి గురిచెయ్యడం ఇష్టంలేదు నాకు.

“నేను యూనివర్సిటీకి వెళ్ళాలని ప్రయత్నించాను. ‘నీలాంటివాళ్ళకి హంగేరీలో చోటులేదు’ అన్నారు వాళ్ళు.

“పోనీ, హంగేరీ వొదిలేసి అమెరికాలో ఉద్యోగం సంపాదించుకోవచ్చా?” అని అడిగాను.

“వీల్లేదు, అన్నారు వాళ్ళు”–నువ్వు కొత్త హంగేరీనిగురించి అమెరికాలో అబద్ధాలు చెపుతావు” అన్నారు.

"ఐతే నన్ను ఏం చెయ్యమంటారు?" అని అడిగాను. వాళ్ళు ఏమీ జవాబు చెప్పలేదు".

"హంగేరీ వొదిలి వెళతాను" అని సాహసించి చెప్పిన నేరానికి ఏవివో వాళ్ళు అతణ్ణి నానాబాధలూ పెట్టారు. బీట్ పొలాలమీద నిర్బంధకార్మిక దళంలో అతణ్ణి వేశారు. అందరూ సుఖంగావున్న దేశంలో "వెళ్ళిపోతాను" అనడం గొప్పనేరం. అయితే ఇదంతా నమ్మడానికి వీల్లేనట్టు వుంటుంది.

ఎస్టరుహాజీ ఇంకా ఇలా చెప్పాడు:

"ఒకనాడు తెల్లవారుఝాం మూడింటికి మమ్మల్ని పక్కలమీంచి తీసుకుపోయారు. అర్ధరాత్రివరకూ వొంటిపూటభోజనంతో పనిచేశాం. మూడుగంటల తరవాత మళ్ళీ మమ్మల్ని పనిలోకి తోలారు. ఇలా మూడు నెలలపాటు ఏవివోవాళ్ళు తృప్తిపడేవరకూ పనిచేశాం. అప్పుడూ మాకు విడుదల దొరికింది.

అంతయినా మేమేమీ ఉద్యోగం సంపాదించలేకపోయాం. నేను బాధతో అడిగాను—'మాజీవితం గడవడం ఎలా?' అని.

'కార్మికదళంలో చేరు' అన్నారు.

"అందులో నాజీవితం యమయాతనలతో సాగింది. ఉద్యోగులు నాపేరుచూసి కసిగా అనేవాళ్ళు "నరేనోయి, ఎస్టరుహాజీ, ఆకుళ్ళుకాలవ కాస్తా బాగుచెయ్యి.' ప్రతీరోజూ నాకు ఇలాంటిపనులేఇచ్చి ఆనందించేవాళ్ళు వాళ్ళు. కాని తోటికార్మికులుమాత్రం నన్ను ఏమీ బాధపెట్టేవాళ్ళు కారు. 'అతను ఎస్టరుహాజీయే అనుకోండి, అయితేమాత్రం బతికేఅర్హత లేదా అతడికి!' అన్నట్టువుండేది వాళ్ళవైఖరి."

తీరా సోవియట్ల వ్యతిరేకంగా విప్లవంవచ్చినప్పుడు ఈ కార్మికదళం మనుషులు ఎస్టరుహాజీని తమకుసహాయం చెయ్యనివ్వలేదు. "వెనకటి జమీందారులు విప్లవం తెచ్చిపెట్టారనడం మాకు నచ్చదు. మేం గెలిచేవాకా వోపికపట్టు. వ్యవహారాలన్నీ సర్దుకుంటాయి" అని వాళ్ళతణ్ణి వోదార్చారు.

ఈ యువకజమీందారు కథ రాయడానికి నేను శంకించాను. ఎస్టర్ హాజీని పేర్కొన్నానా, రష్యావాళ్ళు "చూశారా, పాతపద్ధతే కావాలంటారు వీళ్ళు" అని తెరగబడతారు. అప్పుడు మళ్ళీ అనుకున్నాను "కొలొరాడాలో నాపాతవిద్యార్థులికి జ్ఞాపకముండే వుంటుంది, 1938 లో వాళ్ళతో నేను చెప్పాను, "హంగేరీజమీందారులు తమభూమి పంచిపెట్టకపోతే అక్కడ

తప్పకుండా విప్లవం రావలిసిందే'' అని, అంచేత ఎస్టర్‌హాజీలన్నా, మరే జమీందారుకుటుంబమన్నా నాకు సానుభూతిలేదని వాళ్ళకితెలుసు. ఈ యువక ఎస్టర్‌హాజీకికూడా జమీందారులంటే ఏమీ సానుభూతిలేదని తెలుసు కుని సంతోషించాను.

ఈకథలో ముఖ్యమైన విషయమేమిటంటే నేను యాండావుదగ్గిర కలిసిన యువకుడు అద్భుతమైన మనిషి. మంచిఇంజనీరు కావగ్గవాడతడు. లేదా మంచిప్రొఫెసరయ్యేవాడు. ఒక ఆఫీసు మేనేజరూ అయ్యేవాడు యంత్రాలంటే అతడికి ఎంతో ఇష్టం. జర్మనీ, ఫ్రెంచీ నేర్చుకున్నాడు. గణితంలో మంచి ప్రవేశముంది. హంగేరీలో ఎవ్వరూ కౌంటుఎస్టె హర్జీని 1938 నాటి రైతులమీద యజమానిగా పెట్టదలుచుకోలేదు. బుడాపెస్టుసమీపంలో అతని 4,000 ఎకరాలజమీ మీద అతణ్ణి స్థిరపెట్టదలచనూ లేదు. ఆరోజులు పోయాయి. ఆసంగతి నాకంటే అతడికే బాగా తెలుసు.

కాని వొకమనిషి వొక కుటుంబంలోనో, వొకతరగతిలోనో పుట్టినంత మాత్రాన అతణ్ణి ఇలా పరాభవించడం సిగ్గుమాలిన పని అంటాను. ఒక మనిషిశక్తులు ఉపయోగించనివ్వకపోవడం పూర్తిగా సంఘానికి అపచారం చెయ్యడమన్నమాటే. మనుషుల సమాజశక్తులు ఉపయోగించుకోకపోవడమే కాకండా, ఆశక్తులు అణచెయ్యడానికీ, చంపెయ్యడానికీ వొకరాజ్య పద్ధతి పూనుకున్నదంటే అధిపతనం కాక తప్పదు.

యువకుడైన ఎస్టరుహాజీ విప్లవం సంఘటితపరచడంలోకానీ, దాన్ని నడపడంలోకానీ ఎలాంటి భాగమూ తీసుకోలేదు. తనదేశం అన్నివిధాలా ఎలాంటి పాడుస్థితికివచ్చిందోచూచి, సహించలేని ఇతర్లు అవిప్లవంనడిపారు. ఎస్టర్‌హజీ ఇంగ్లాండు ప్రయాణమవుతూవుండగా చివరిసారి చూశాను. "ప్లాస్టిక్సో, ఆటోమోటివ్ ఇంజనీరింగో, ఎలక్ట్రానిక్సో – ప్రపంచానికి పనికి వచ్చేది ఏదో వొకటి నేర్చుకుంటాను'' అన్నాడతడు.

సరిహద్దుదగ్గిర ఎన్నాళ్ళున్నాసరే, ప్రతీరోజూ ఏదోవొక వింతవిషయం చూడవచ్చు. ఒకనాటిరాత్రి ముప్పయ్యేళ్ళ హంగేరీయువకు డొకడు, బాగా ఇంగ్లీషు మాట్లాడగలిగినవాడు నాకు దుబాసీగావుండి సహాయం చేశాడు. అతడికి తానుచేసిన ఈపనికోసం ప్రతిఫలం ఇవ్వాలనుకున్నాను.

"నీకు ఏమైనా డబ్బుకావాలా ?'' తెల్లవారుతూవుండగా అడిగాను.

"డబ్బుఅక్కరలేదు. వియన్నా వొపెరా చూడాలని ఎన్నాళ్ళనించో వుంది'' అన్నాడతడు.

"ఇవాళ రాత్రిచూద్దాం" అన్నాను.

అందరిలాగే అతడూ ఒకేసూటుతోవచ్చాడు. ఎలాగో ఆవేళే దాన్ని ఇస్త్రీచేయించుకున్నాడు. ఆరాత్రి అందమైన వియన్నాఒపేరా భవనం ప్రవేశించాం.

"కార్మెన్ కొత్తరచనసంగతి విన్నాను. బుడాపెస్టులో మాకు యూరోపియన్ కళగురించి వార్తలు రావేరావు" అన్నాడతడు.

"ఏమిటా కొత్తరచన?" నేను అడిగాను.

"వియన్నా ఒకరష్యా యువకుణ్ణి నియమించింది. అతడిపేరు జార్జెస్‌వాఖెవిట్స్. అతడు ఒక కొత్తగేయనృత్యనాటిక తయారుచేశాడు. అది అద్భుతంగా వుంటుందట!

తెరలేచింది. వాఖెవిట్స్ గేయనృత్యనాటిక కళ్ళు జిగేలుమనిపించింది. రంగంమీదే ఎన్నోపూర్తయిన ఇళ్ళుకట్టాడు డిజైనరు. ఒకపూరి వీధి నిర్మించాడు. వీధికి అడ్డంగా జెండాలూ అవిపెట్టాడు. వందలకొద్దీ నటీనటుల్ని అద్భుతమైనదుస్తుల్లో తయారుచేశాడు. సంగీతం నృత్యం ప్రారంభమయింది. ఒక్కసారి నర్తకులు రంగంచుట్టివచ్చేసరికి ఒక్కొక్కరంగు మారిపోతుంది. రంగులు ప్రవాహంలా అద్భుతంగా మారిపోతున్నాయి. నర్తకీనర్తకులు తరంగాలమీద తరంగాలుగా పూపిరాడకుండావస్తున్నారు. అంత చిన్నరంగంమీద ఇంతమందిని ఆమేధావి ఎలా ఏర్పాటుచేశాడా అని నేను ఆశ్చర్యపడ్డాను.

వాఖెవిట్స్ గేయనాటిక స్పానిష్‌ఒపెరాకాదు. అది గ్రాండ్ ఒపేరా (సంభాషణలేని సంగీతప్రధానమైన నాటకం). మైకెలా జర్మనునర్తకి. కోరస్‌లో పాడే పాటకత్తెలందరూ జర్మనులే. చాలామంది పెపీల్‌నించీ, మ్యూనిక్‌నించీ వచ్చినవాళ్ళే. ఒపేరా మెల్లిగా అలసభారంతో ముందుకి సాగుతోంది. రాగాలు అద్భుతంగా వున్నాయి.

"పాటలు జర్మనీభాషలో అయినా ఫరవాలేదు" అంటూ పూవాడు నాహంగేరీమిత్రుడు-" స్పానిష్‌భాషలాగే అనిపిస్తుంది.

అతడితో నేను ఏకీభవించాను. ఫ్రెంచిలాకాక అమాటలు స్పానిష్‌లాగే వినిపిస్తున్నాయి.

వాకెవిట్స్‌రంగం అద్భుతంగావుంది. రంగంమీదిభాగంలో నల్లదుస్తుల్లో స్పానిష్ విలాసపురుషులున్నారు. రంగమంతా డజన్లకొద్దీ కొవ్వొత్తులతో జాజ్వల్యమానంగా వెలిగిపోతోంది. మూడోఅంకం చాలాబావుందన్నాడు

నామిత్రుడు. అందులో ఫుట్‌లైట్సు ఉపయోగించలేదు. పాడుతూన్నపాత్ర మీద స్పాట్‌లైటు వేశారు. అపాత్ర కదలికతో లైటుకూడా కదులుతూ పోయింది. 'అదృష్టమూ మృత్యువు' అనే కార్మెన్‌పాట ఈరంగంలో మరీ శక్తివంతమైంది.

అంకానికీ అంకానికీ మధ్య విశ్రామకాలంలో మెల్లిగా నామిత్రు డన్నాడు: "సంపూర్ణకళాప్రపంచంలో రావడం అంటే మీకు అర్థంకాదు. కార్మెన్‌క్రొత్తరచన! ఇతరయూరపుసంబంధాలకోసం మేం ఎంత తహతహ లాడేవాళ్ళం! బిజెట్ సంగీతంవిని ఆనందంలో తేలిపోయా డతడు. "ఒక కొత్తకళాకారుడు తనకళాసృష్టి ప్రదర్శిస్తూవుంటేచూడడమంత ఆనందమైన విషయం మరొకటి ఏముంటుంది? అన్నా డతడు.

చివరిఅంకం అన్నిటికంటే గొప్పగావుంది. సెవిల్‌దృశ్యం మాకు ప్రత్యక్షమైంది. రంగం గంభీరతయావత్తూ ప్రదర్శించారు. ఎన్నో ఇళ్ళ ముందుభాగాలు రంగంచుట్టూవున్నాయి. ఎద్దుల పోట్లాటకి ఒకరంగంవుంది. ఎడమచేతివేపు స్పానియండులు పాడుతూ నుంచునివున్నారు. అది పెద్ద రంగం. దానిచివర దూరంగా అరవైమంది నాట్యకత్తెలు వరసలు తీరి వున్నారు. తరవాత పదహారుజట్ల ఎడ్లతో దెబ్బలాడేవాళ్ళు ఉద్యోగులూ, పౌరులూ పరివారం వెంటపెట్టుకుని రంగంమీదికి వచ్చారు. వాఖెవిట్షే పాతికరకాల రంగురంగులగుడ్డలు రంగానికి అడ్డంగా ఒక దండెంమీద వేలాడవేశాడు. అదంతా ఒక అద్భుతదృశ్యం.

విప్లవంగురించిరాస్తూ మధ్య ఈకార్మెన్‌రచన గొడవ ఏమిటని పాఠ కులు ప్రశ్నించవచ్చు. వియన్నాలోనూ, సరిహద్దుదగ్గిరా మేం కలిసిన ఎంతో మంది హంగేరీవాళ్ళు కళకోసం ఎంతపరితపిస్తున్నారో మీకు తెలియదు. హంగేరీలో వాళ్ళు కళగురించీ, కొత్తభావాలగురించీ, రాజకీయాలగురించీ, మనుషుల కొత్త అనుభవాలనుగురించీ స్వేచ్ఛగా మాట్లాడుకోలేరు. కోలేరు. మనిషిబుద్ధి ఎప్పుడూ స్వతంత్రంగానే వుండాలని కోరుతుంది. జిజ్ఞాస దాని లక్షణం. తెలుసుకోవాలనే కుతూహలం మనిషికి సహజం. హంగేరీప్రజలికి మాట్లాడుకునే స్వేచ్ఛకావాలి. రకరకాల అభిప్రాయాలికి సంఘంలో స్థానంకావాలి. నిజాయితీకల వార్తాపత్రికలు కావాలి.

యూరపుదేశాలమధ్య తలెత్తుకుతిరగాలని హంగేరీమేధావులు గాఢంగా వాంఛిస్తున్నారు. ఈవిషయంలో చాలమంది ఆవేశంతో మాట్లాడారు. "రష్యా మానించి లాక్కున్న పెద్దవస్తువు యూరపుతో మారాకపోకల సౌకర్యం. మా ఉత్తరప్రత్యుత్తరాలు."

విప్లవానికి కొన్నిరోజులపూర్వమే టామస్‌యాక్బెర్ 'ఓడ్ టు యూరప్' అన్నకావ్యంలో ఇలా రాశాడు:

"యూరప్!
మాతల్లీ, నీఒడిలోకే వచ్చేస్తాం.
నువ్వే మాకు ధృవతార.
యుగయుగాలమల్లే మాకు
దారిచూపు దివ్యధాత్రి!
యూరప్, మాతల్లీ, మాతోనేవుండు సదా.
యూరపుకల్లా ప్రేమా,
భాగ్యం, పనీ, భావీ
అంతా అంతా ఒకటే.
హృదయమా! పులకరించు.
ఇదే ఇదే ఖండంలో
వెయ్యిసార్లు చచ్చి, వెయ్యిసార్లు బతుకుతాం.
ఈ నేలే దున్నుతాం.
విత్తనాలు చల్లుతాం.
ఇక్కడే పంటకోస్తాం."

ఒపేరా అయాక నాహంగేరీమిత్రు డన్నాడు:

"విద్యార్థులలో మేధావులు ఉత్సాహం రేకెత్తించారు. విద్యార్థులు సెపెల్ మనుషులికి ఆవేశంకలిగించారు. కాని విద్యార్థులు తిరగబడాలని ఎందుకునిశ్చయించారో తెలుసా? ప్రపంచంలో వాళ్ళు ఏముఖ్యమైన పుస్తకం చదవాలన్నా వొద్దని అధికార్లు నిషేధించారు. కాని అపుస్తకం విమర్శిస్తూ ఏకమ్యూనిస్టురాసిన రాతైనాసరే చదవవచ్చు. కమ్యూనిస్టులు షోపెన్‌హేర్‌గురించి ఏమంటారో నాకుతెలుసు. కాని అతడిగురించి ఏమీ ఎరుగను నేను. మూడోరకంకమ్యూనిస్టు లతణ్ణిగురించి ఏమంటారోమాత్రం నే నెరుగుదును.

"జార్జిసెవాఖివిట్జ్ ఒక వైట్‌రష్యను. బుడాపెస్టులోనే అయితే అతడు కార్మెన్ ఒపేరాలో చేసిన తప్పులన్నీ తెలుసుకునేవాణ్ణి. అది కార్మికుల ఆత్మని కలుషితంచేసే నాటిక. ఇక్కడ వియన్నాలో జరిగేపద్ధతి నాకు నచ్చింది. కార్మెన్‌లోవున్న దోషాలేమిటి అన్నదానిమీద మీరు ఉపన్యాసాలివ్వరు. కార్మెన్ ప్రదర్శించి చూపిస్తారు.

"కార్మెన్‌గురించి నాప్రసంగం మీకు వినుగ్గావుందా?" అతడడిగాడు.

"ఇక్కడ స్వేచ్ఛగాకూచుని, ఇష్టంవచ్చినట్టు మాటాడుతూ ఒక బీరుగ్లాను తాగడం ఎంతగొప్పవిషయమో మీరు ఊహించలేరు. కార్మెన్ గురించి చర్చిస్తూ ఐసెన్‌హోవర్‌నే, బుల్గానిన్‌నే ఖండించవలసివస్తే మీరు జంకనక్కరలేదు. మిమ్మల్ని ఎవ్వరూ అరదండాలు వెయ్యరు. మనం మాట్లాడుతూవుంటే కొత్తభావాలుకలుగుతాయి. ఎంత హాయిగ్గావుంటుంది! బుడాపెస్టులో కార్మెన్‌గురించి మాట్లాడితే సంగీతంవరకే చర్చించవచ్చు. అందులోనూ అనిమిషానికి అది ఎంతవరకు కమ్యూనిష్టులికి స్వీకారమో అంతవరకే మాట్లాడాలి."

వైజ్ఞానిక స్వాతంత్ర్యం, భావస్వాతంత్ర్యం కావాలని యువకులుకోరడం వల్లే హంగేరీలో కమ్యూనిజంమీద తిరుగుబాటువచ్చిందన్నవిషయం అమెరికావాళ్ళు మరచిపోకూడదు. ఇది విప్లవంలో ముఖ్యాంశం. పత్రికలుచదివే స్వాతంత్ర్యంకోసమూ వాక్స్వాతంత్ర్యంకోసమూ పోరాడేవాళ్లు ఈప్రపంచంలో వున్నారని మనం జ్ఞాపక ముంచుకోవాలి. నలుగురుకలిసి ఒకదగ్గిరకూచుని, బీరుతాగుతూ ఇష్టంవచ్చినట్టు మాట్లాడుకోగల రాజకీయపద్ధతి తిరిగి స్థాపించడానికే ఎంతోమంది యువకులు బుడాపెస్టులో ప్రాణాలు బలిపెట్టారు.

యాండావులో ఒకక్యాథలిక్కుఫాదిరీ ఒకశరణార్థిబృందం దగ్గిరికివచ్చి "ఇప్పుడు మీరు స్వతంత్రులయారు. మళ్ళీ ఆదివారంవచ్చి ప్రార్థన చేయించేవా" అని అడిగాడు.

కుర్రాళ్ళు కంగారు పడ్డారు. చివరికి ఒక డన్నాడు : "ఫాదర్! మేం ఒకదగ్గిర మూగి కులాసాగా కబుర్లు చెప్పుకుందామనుకున్నాం".

ఫాదిరీ అర్థంచేసుకుని నవ్వాడు : "అవును........అంతకాలం నోరు మూసుకుని వున్నారు మరి!"

ఆవాళ బుధవారం, నవంబరు 21. యాండావుదగ్గిర ఈ నాటకమంతటికీ ఆవాళ పరాకోటి. ఆవాళ ఈస్సరు కాలవదాటి ఆస్ట్రియాకి ఎంతో అంతమంది శరణార్థులు వచ్చారు. చలి అధికంగా వుంది. ఆకాశం స్వచ్ఛంగావుంది. ఆవాళటి ప్రకృతిసౌందర్యం చిరస్మరణీయమైంది. వేలసంఖ్య మీద శరణార్థులు వచ్చారు. బీతోవెన్ రాసిన ఫిడేలునాటకంలో చీకటిగుహలోంచి పగటివెల్తురులోకి వచ్చే ఖైదీల వరసలావుంది ఆ దృశ్యం. చీకటి పడింది. ఆ ఉత్సవం ఒక్కసారి భయంకరంగా ఆగింది. ఎంతోమంది ఇంకా గట్టుమీదే వున్నారు.....వాళ్ళు ఎవరూ ముందుకి రావడంలేదు. ఏవీవోవాళ్ళు

వస్తున్నారని ఒకవదంతి వ్యాపించింది. అంతా నిశ్శబ్దం. చలిగాలులు హోరున వీస్తున్నాయి. దూరాన్నించి చూస్తున్న మాలో కొందరు వంతెన అవతల ఏం జరుగుతోందో చూద్దామనుకున్నారు.

దూరాన హటాత్తుగా ఒకధ్వని వినిపించింది. మేం చీకటిలో చూడ డానికి ప్రయత్నించాం. ఏమీ అవుపించలేదు.

"వంతెనకి డైనమేటు పెట్టారు" ఒక శరణార్థి కాలపవొడ్డునే పరి గెత్తుకువచ్చి అరిచాడు.

ఎంతనష్టపడిందో చూద్దామని సాహసులైన ఇద్దరు గూఢచారులు కాల వమ్మటే హంగేరీవిక్కు పాకుకుంటూ వెళ్ళారు. బురుజుమీసి కాగడాలకాం తిలో స్పష్టంగా కనిపిస్తోంది—యాండావు వంతెన పూర్తిగా ధ్వంసమైంది. కాలవకి రెండుపక్కలా రెండు మోస్తటుంభాలుమాత్రం నిలబడివున్నాయి. మద్యభాగం అంతా ఎగిరిపోయింది.

"ఇక వంతెన పనికిరాదు" గూఢచారులు తిరిగివచ్చి పెదివి విరచి చెప్పారు.

రాత్రి గాఢం కావచ్చింది. హంగేరీ రొంపినేలలో, దారుణమైన చలిలో వేలకొద్దీ శరణార్థులు యమయాతన పడుతున్నారు. వాళ్ళదుర్గతి మేం ఊహిం చగలుగుతున్నాం. స్వేచ్ఛకి కొన్నిఅడుగుల దూరంలోనే వున్నారు వాళ్ళు. ఆస్ట్రియా చేరడానికి ఒక ఎత్తయిన గట్టూ, ఒక కాలవాదాటి కొంచెం నడ వాలి. అంతే. అంతతో ఆస్ట్రియా భూభాగంమీద అడుగుపెడతారు వాళ్ళు. కాని ఇప్పుడు వంతెన నాశనమైంది. దానిస్థానే వేరే ఏర్పాటైతేతప్ప ఆ శర ణార్థులు యావన్మందీ అవతలివొడ్డునే చిక్కడిపోతారు.

ఆకాశం నిర్మలంగా వుంది. చంద్రుడు ఉదయించాడు. గడ్డకట్టుకు పోతూన్న రొంపినేలమీద మంచు కురుస్తోంది. గడ్డిలోంచి మనుషులు నడు స్తొంటే పెళపెళ చప్పుడవుతోంది. ప్రకృతిదృశ్యం అద్భుతంగా వుంది. రొంపినేలంతా తెల్లపడి మిలమిలా మెరుస్తోంది. చంద్రుడు పాలిపోయి వున్నాడు. అందరూ ప్రకృతి అందానికి ముగ్ధు లవుతున్నారు. అంతా నిశ్శబ్దం.

బాధపడుతూ గంటలతరబడి అక్కడ నుంచున్నాం. దారి నిర్జనంగా వుంది .......వరదలా వస్తోన్న శరణార్థులు వెనక ఆగిపోయారు. ఆ రాత్రి మావేదన వర్ణించలేను. ఆకాశం చుక్కలతో నిండిపోయింది. పైనించి కాంతి వరదలా భూమీద పడుతోంది. చలిమాత్రం కరిచేస్తోంది. నన్నునిమంచు

కురుస్తోంది. అన్నిటికంటే దుఃఖంకలిగిస్తోంది నిశ్శబ్దం. మరవరాని నిశ్శబ్దం. నవ్వుతూ, పాడుతూ స్వేచ్ఛాప్రయాణం సాగించే హంగేరి శరణార్థుల కోలాహలానికి బదులు నిశ్శబ్దం!

అర్ధరాత్రయింది. ముగ్గురు ఆస్ట్రియా విద్యార్థులు ఏదైనా చెయ్యాలి అని నిశ్చయించుకున్నారు. దుంగలు లాక్కువెళ్ళారు. వంతెన బాగు చేశారు. అంత బాగాబాగుచెయ్యలేదు, కాని పదిలంగా వచ్చేవాళ్ళకి మరేం ఫరవా వుండదు. వాళ్ళు చేసిన ఆకాస్తాపనీ రెండువేలమందిని ఆరాత్రి రక్షించింది.

ఆ చేసినవాళ్ళు వృత్తి కాలేజీ కుర్రాళ్ళు. కాని మహాధైర్యసాహసాలు కలవాళ్ళు. వాళ్ళబట్టలు మంచుతో తడిసిపోయాయి. అయినా వాళ్ళు లెక్క చెయ్యలేదు. వాళ్ళు వేసినవంతెనమీంచి వాళ్ళేదాటి హంగేరీ రొంపినేలదిక్కు వెళ్ళారు. కమ్యూనిస్టుగార్డుల్ని తప్పించుకుంటూ, రష్యా ఔటుపోస్టులు దాటుకుంటూ వెళ్ళి, ఎంతోమంది శరణార్థుల్ని వంతెనదాకా తీసుకువచ్చారు. వాళ్ళ ఈ సాహసం చూసి ముక్కుమీద వేలువేసుకున్నాం.

అప్పుడు వచ్చింది వరద! వందలకొద్దీ శరణార్థులు ఆ ఇరుకువంతెన మీంచి వచ్చారు. కాలవగట్టమ్మట్టే మితిమీరిన ఆనందంతో వచ్చారు. ఇక దారిలేదు అనుకున్న సందర్భంలో ఈ దారి దొరికింది. ఆస్ట్రియా విద్యార్థులు "ఇది ఆస్ట్రియా" అని గట్టిగా చెపుతూవుంటే విని సంతోషం పట్టలేక కూలబడిపోయేవాళ్ళు శరణార్థులు.

వాళ్ళు కాలవగట్టమ్మటే నడుస్తూవుంటే వాళ్ళలో జాగ్రత్తఅయిన ఆస్ట్రియా విద్యార్థి "గట్టుమీంచి నడవకండి. ఇది ఇంకా హంగేరీ దేశమే. రష్యావాళ్ళు నీడలమీదకూడా తుపాకులు పేలుస్తారు" అంటూ హెచ్చరించేవాడు, గట్టు కిందినించి నడిచేవాళ్ళు శరణార్థులు. పల్చటి మంచు వాళ్ళ వీపులమీద పేరుకుంది. ఏ కథలోనో, ఏ గంధర్వలోకంనించో దిగివచ్చిన వాళ్ళలా అవుపించారు వాళ్ళు, పొగమంచు లేచి వాళ్ళని కప్పేసింది. అయినా నవంబరుచంద్రుడి వెండివెన్నెల ఆధారం చేసుకుని ముందుకి వస్తూనేవున్నారు వాళ్ళు. ఇంకో లోకంనించివచ్చిన భూతాల్లా వున్నారు వాళ్ళు. దూరాన్నీ, కాలాన్నీ ధిక్కరించేసి, స్వాతంత్ర్యంవేపు ప్రయాణిస్తున్న స్వేచ్ఛార్థుల వలన అది.

అంతకంటే అందమైన దృశ్యం మరొకటి చూడలేదు నేను. ప్రకృతి శీతలవాతావరణంతో వుండడమేకాక, ఆ రాత్రి ఆవేశపూరితమైన ఆ నన్ని

వేశం వర్ణనాతీతంగా వుంది. ఒక స్త్రీ వచ్చింది. ఆకలితో ఆమె మూర్ఛపోయే ట్టుంది. కూలిపోతుందనిపిస్తోంది. కాని 'ఆస్ట్రియా' అన్నమాట వినగానే ఆమెకి ఎక్కడలేని బలమూ వచ్చింది. అనుకోకండానే బారెవే మెగ్గర్స్ వున్నచోటికి వెళ్ళింది. అతడి చేతుల్లో అమాంతంగా ఆమె కూలిపోయింది. అతడి నుదురూ, బుగ్గలూ, పెదవులూ పదిసార్లు ముద్దెట్టుకొంది.

"దేవుడా! ఆస్ట్రియా చేరుకున్నాను" అని అరిచింది గంటలతరబడిగా సరిహద్దుమీద నుంచునివున్న మెగ్గర్స్ ఆమెని ఒక ఆస్ట్రియా విద్యార్థికి ఒప్పచెప్పాడు. అతడు ఆమెని సురక్షితస్థలానికి చేర్చాడు.

"ఇక నేను భరించలేను" అన్నాడు మెగ్గర్స్. పొగమంచులోపడి, పేరుకునివున్న ఆస్ట్రియా రొంపినేలమీంచి మెల్లిగా వెళ్ళిపోయినా డతడు.

సరిగ్గా అప్పుడే నేను ఒక ఫోటోగ్రాఫరుని కలిశాను. మంచిసాహసి అతగాడు. అతడి ఫోటోలవల్లే చాలావరకూ హంగేరీప్రజల ఈ పలాయనం కథ ప్రపంచానికి తెలిసింది. ఎక్కడికైనా వెళ్ళగలడతడు. తరవాత కొన్ని రాత్రిళ్ళు అతడూ నేనూ కలిసి సరిహద్దుమీద తిరిగాం. వందలు వందలు హంగేరీవాళ్ళని ఆస్ట్రియా నేలమీదికి తెచ్చాం. ఒక్కొక్కప్పుడు హంగేరీలోకి చొచ్చుకుపోయేవాళ్ళం. వంతెనదాకా వెళ్ళేవాళ్ళం. శరణార్థుల మధురధ్వని కోసం చెవులప్పగించి నడిచేవాళ్ళం. స్త్రీలూ, పురుషులూ స్వాతంత్ర్యంకేసి నడుస్తూ చేసేధ్వని అది.

ఒకనాటి రాత్రి చూస్తూ నుంచున్నాం. అపరిమితంగా వుంది చలి. వంతెనవేపునించి వింతధ్వనులు వచ్చాయి. మాకు ధైర్యం చాలినంతదాకా పాకుకుంటూ వెళ్ళాం. దారుణమైన దృశ్యం చూశాం. తాగి మత్తెక్కిన కమ్యూనిస్టు కాపలావాళ్ళు వంతెన ముక్కలు చేసేసి చలిమంట వేసుకుంటున్నారు. అక్కడే నక్కి వాళ్ళని చూస్తున్నాం. ఇంతలో మరువురాని విషాదగాథ ఒకటి జరిగింది.

ముప్ఫయిమంది శరణార్థులు రొంపిలోపడి ఆ తాగుబోతు కావలివాళ్ళ వేపు వస్తున్నారు. పాపం, అక్కడ వంతెనలేదని వాళ్ళకి తెలియదు. వాళ్ళని రాకండా ఆపెయ్యడానికి మాకు శక్తిచాలలేదు. కావలివాళ్ళు అలికిడి విన్నారు. చప్పున తుపాకులు తీసారు. కుక్కలు చెవులు రిక్కపెట్టాయి. కావలివాళ్ళు శరణార్థులమీద పడ్డారు. వాళ్ళని ఖైదు చేశారు. పాపం, ఎంత దూరం నడిచివచ్చారో వాళ్ళు. స్వాతంత్ర్యం యాభై అడుగుల్లో వుందనగా దొరికిపోయారు. ఫోటోగ్రాఫరు హియర్‌స్టెన్కూ నేనూ మెల్లిగా వెనక్కి

వచ్చేశాం. కమ్యూనిస్టు గొడ్డళ్ళు వినిపిస్తూనేవున్నాయి. మేం ఆస్ట్రియా నేల మీద అడుగుపెట్టేసరికి యాండావు వంతెన శాశ్వతంగా మాయమైంది.

చిట్టచివరి అద్భుతం మరొకటి జరిగింది. ఏవీవో పోలీసులూ, రష్యా వాళ్ళూ వంతెన విరిచేసి, కాల్చిపారేసిన కొన్నాళ్ళకి, ఒకరాత్రి పెద్దవర్షం కురిసింది. రొంపినేలమీద నడవడం అసాధ్యమైంది. ఆస్ట్రియా విద్యార్థిదళాలుకూడా నిరాశచేసుకున్నాయి. కాని ఒక పత్రికా విలేఖరి, అం...మైన బ్రిటిషు యువతి అర్ధరాత్రి అక్కడికి బైలుదేరింది. ఆమె పేరు షెల్లీర్హోడ్. డైలీ ఎక్స్‌ప్రెస్ ప్రతినిధి ఆమె.

ఆమె గట్టమ్మటే వెళ్ళింది. దుబ్బుగడ్డి దాటింది. రొంపినేలమించి నడిచింది. హంగేరీ రాజ్యంలోకి వెళ్ళింది. ఒకప్పుడు స్వాతంత్ర్యానికి ప్రతీకంగా వుండిన వంతెన దగ్గర చేరింది. అది ప్రశాంతమైన చలిరాత్రి. అప్పుడప్పుడు మరతుపాకి చప్పుడు ప్రశాంతాన్ని చీలుస్తోంది. రష్యావాళ్ళ భాస్వరం మంటలు చీకటి మాయం చేస్తున్నాయి. ఈ మంటవేసి వాళ్ళు శరణార్థుల్ని పట్టేస్తారు. మిస్‌ర్హోడ్ ఆ ప్రాంతం మ్యాపు యావత్తూ మనస్సులో పెట్టుకు నడిచింది. ఇంతలో ఆమెకి ఒక శిశువు అరుపు వినిపించింది. వంతెన వేపు వెళ్ళిం దామె.

ఆమె ఒంటరిగావుంది. శిశువు ఆగకుండా ఏడుస్తోంది. ఆమె ఆగలేకపోయింది. నెత్తిమీద ఆపదవుందని తెలిసీకూడా ఏడుపు వినవస్తున్నదిక్కు అప్రయత్నంగా నడిచిందామె. అదృష్టవశాత్తూ శిశువుతల్లి తనబిడ్డ ఏడుపు మాన్పించలేకపోయింది. మిస్‌ర్హోడ్ వెళ్ళేసరికి ఇరవైఇద్దరు శరణార్థులు చెప్పలేనంత దుస్థితిలో పడివున్నారు. ఎన్నాళ్ళయిందో తిండిలేదు వాళ్ళకి. నీటిలో తడిసిపోయివున్నారు; మంచులో గడ్డకట్టుకుపోయినట్టున్నారు. దారి చూపెట్టేవాళ్ళులేరు. దారీతెన్నూలేకండా ఆహంగేరీ రొంపినేలల్లోపడి వెళదామనుకుంటున్నారు వాళ్ళు. అంచేత రెండుదినాలయి అక్కడేపడి తిరుగుతున్నారు. ఒకసారి అస్ట్రియానేలమీద అడుగుపెట్టారు. కాని వాళ్ళకి అది ఆస్ట్రియా అని తెలియదు. ఇప్పుడు వాళ్ళుపట్టినదారి తిన్నగా రష్యావాళ్ళ గుడారానికి తీసుకుపోతుంది.

శిశువు ఏడుస్తూవుంటే దొరికిపోతామేమో అన్నభయంకూడా పోయింది వాళ్ళకి. ఎలాగో వేలాగ ఆ రొంపినేల దాటిపోతేచాలుఅన్న ఆత్రుత ఒక్కటే వాళ్ళని ఈడ్చుకుపోతోంది. రెండురోజులపాటు మోకాలిలోతు బురదలో ఈదుకుంటూ తిరుగుతూ బండబారిపోయారు వాళ్ళు. కొంతమంది కొరడుబారి

పోయి చవ్వడానికి సిద్ధంగా వున్నారు. అప్పుడు ప్రారంభించింది శిశువు చివరిఏడ్పు—చచ్చేముందు ఏడ్చే ఏడుపు అదిగో అప్పుడే బ్రిటిషు పత్రికా ప్రతినిధి మిస్ ర్హోడ్ ఒకసారి వెళ్ళివద్దామని చివరినిశ్చయం చేసుకుంది.

హంగేరీనించి ఆస్ట్రియావచ్చిన రెండులక్షలమంది శరణార్థులూ మూడు తరంగాలుకింద వచ్చారు. హంగేరీ సరిహద్దు ఆనుకునివున్న కమ్యూనిస్టు యుగోస్లావియాకి 500 మందికంటె ఎక్కువమంది వెళ్ళలేకపోవడం గమనించదగ్గ విషయం. యాండావువగ్గిర నా అనుభవం రెండోతరంగానికి చెందింది. దాన్నే నేను ఇంతవరకూ వర్ణించాను. ఈ తరంగంలో యువకులే అధికం వచ్చారు. ఆ రావడం ఉత్తిచేతులతో వచ్చారు. వాళ్ళలో ఎక్కువమంది ఇంజనీర్లు, టెక్నీషియన్లు. దేశం తాలూకునిగ్గులాంటివాళ్ళు. విప్లవంలో పాల్గొన్నవాళ్ళు. వీళ్ళు వచ్చేయడంవల్ల అప్పుడే హంగేరీ ఆర్థికస్థితి దెబ్బతింది. దేశంలో నాయకత్వం కుంటుపడిందని కొన్నాళ్ళకి బాగాతెలుస్తుంది. ఏ మహాదేశం యువకులికీ వీళ్ళు తీసిపోరు.

మొదటితరంగం నేను చూడలేదు. దాని నిర్మాణం వేరు. సెపెల్ పడిపోయాక బుడాపెస్టు వొదిలేసిన వొక హంగేరీ సాంఘికశాస్త్రజ్ఞుడు ఈ చిన్న తరంగం గురించి ఇలా అన్నాడు:

"వాళ్ళలో చాలామంది వ్యభిచారవృత్తిలో వున్నవాళ్ళు. ఎలాంటప్పుడు ఎటువెళ్ళాలో వాళ్ళకి తెలుసు. ఈ వృత్తిలో వున్నవాళ్ళు ప్రపంచంలో ఎక్కడ వున్నాఅంతే. మే మందరం ఆ శాంతిదినాల్లో మోసపోయాం. ఈ అమ్మాయిలు మాత్రం అలా ఏమీ మోసపోలేదు. నాశనానికి సిద్ధంగావున్న వొకపట్నం వొదిలేసిపోయే అవకాశం వాళ్ళకి దొరికింది. ఆ అవకాశం వాళ్ళు ఉపయోగించుకున్నారు. తరవాత సాహసంకల పడుచు లున్నారు. నిలకడలేని ఇళ్ళబానిసలు వాళ్ళు. పడమటి దేశాలు గొప్పగా వుంటాయని మొదటినించి కథలు వింటున్నారు వాళ్ళు. 'వింతదేశాలికి వెళదామనే కుతూహలంతో వాళ్ళు. ఏదో వొకపాతకథలో వెళ్ళినసాహసవంతుల్లాగ వెళ్ళిపోయారు. మరోరకంవాళ్ళున్నారు; వొట్టిపిరికిపందలు. స్వతంత్ర హంగేరీ అవసరాలికి తట్టుకోలేనివాళ్ళు వాళ్ళు బుడాపెస్టులో వుండిపోయి, మళ్ళావచ్చిన రష్యావాళ్ళతో దెబ్బలాడిన మేం ఈ మొదటితరంగంలో వెళ్ళిపోయినవాళ్ళ గురించి ఏమీ విచారించలేదు. వాళ్ళు పోవడంవల్ల ఏదోనష్టం జరిగిందనీ అనుకోలేదు. కాని మాకు కోపంమాత్రంవుంది. ఇలాంటివాళ్ళు పరదేశాల్లో హంగేరీ ప్రతినిధులుగా వుండడం దేశదృష్టమేఅని. వీళ్ళకి ఆశ్రయమిచ్చిన

దేశాలికి వీళ్ళు గుదిబండలవుతారు. ఇలాంటివాళ్ళకి ఆశ్రయమిచ్చినందుకు నేను విచారిస్తున్నాను. మా అందరి పేరూ దీనివల్ల చెడిపోతుంది ”.

అదృష్టవశాత్తూ మొదటి తరంగం ఏమంత పెద్దదికాదు. వాళ్ళు చేసే నష్టం ఏమంత పెద్దదేమీవుండదు. దీనికోసం హంగేరీ దేశభక్తులు భయపడనక్కరలేదు. నాకు ఈ జట్టువాళ్ళతో ప్రత్యక్షపరిచయంలేదు. వాళ్ళగురించి కొందరు చెప్పగామాత్రం విన్నాను. తరవాతవచ్చిన శరణార్థుల్లో ఒక రిలా అన్నారు:

“ రష్యావాళ్ళు తిరిగీ రాకముందే పారిపోయిన మనిషిని ఏమనాలి ? అతణ్ణి అనవలసినదట్టా ఒక్కటేమాట—పిరికిపంద.”

నేను రాసింది హంగేరీ నిపుణులచేత సరిచూపించుకుంటూ వున్నప్పుడు ఈ మొదటిజట్టు శరణార్థులమీద వారికున్న భావాలు లోతుగా గ్రహించాను. తాత్కాలికంగా హంగేరీవాళ్ళకి కలిగిన విజయం తరవాత బుడాపెస్టు విడిచి వెళ్ళిపోయిన ఒక యువకుణ్ణి నేను వర్ణించాను. అది విని ఒక విమర్శకుడు ఇలా అన్నాడు :

“దయచేసి ఇది మార్చండి. మేం గెలవడానికి ఒక అవకాశం వచ్చినప్పుడు మర్యాదస్తుడైన/ ఏ హంగేరీవాడూ దేశం వొదిలి వెళ్ళలేదు.”

నేను రాసుకున్న జ్ఞాపికలు చూసుకుని ఆభాగం తీసెయ్యడానికి ఒప్పుకోలేదు.

“నా నోట్సు చూసుకుంటే ఇదంతా సరిగ్గానేవుంది. ఆయువకుడు చెప్పిన మాటలన్నీ నాకు జ్ఞాపకమున్నాయి.”

విమర్శకుడు నేను రాసింది మళ్ళీ చదివాడు. అక్కడ ఒక్క గీత గీసి “ఇలాగే అతడు ప్రవర్తించివుంటే, అతని ప్రసంగమే ఇక్కడ అనవసరమంటాను”. అన్నాడు.

మూడో తరంగంలో చాలామంది శరణార్థులు వచ్చారు. వాళ్ళతో పాటు అన్నిసమస్యలూ వచ్చాయి. ఈతరంగంలో వచ్చినవాళ్ళగురించి మాట్లాడేటప్పుడు ఆస్ట్రియన్ ఇమ్మిగ్రేషన్ ఆఫీసల్సుతాలూకు అనధికార అంచనాలు మనస్సులో వుంచుకోవాలి.

“అన్నిరకాల శరణార్థుల్ని లెక్కపెడితే సుమారు రెండు లక్షలుంటారు. అందులో మొదటి తరంగంలో వచ్చినవాళ్ళ సంఖ్య మూడు వేలకి మించదు. పరదేశాల్లో సులభంగా పనిపాట్లు సంపాదించుకుని ఒక ఇంటివాళ్ళయిపోయారు వాళ్ళు. వాళ్ళని మరిచిపోయాం కూడాను. రెండో తరంగంలో వచ్చినవాళ్ళు నిజమైన శరణార్థులు. యాండావులో మీరు చూసిన వాళ్ళలాంటి

వాళ్ళు. వాళ్ళు సుమారు పాతికవేలమంది వుంటారు. ఒక్కటి జ్ఞాపకముంచుకోవాలి. ఈ పాతికవేలమందిలోనూ రెండువేలమందికి మించి విప్లవంలో పాల్గొన్నవాళ్ళుండరు. మూడోతరంగంలో లక్షా డబ్భాయివేలమంది వచ్చి వుంటారు. వీళ్ళలో ఒక్కడూనూడా రష్యావాళ్ళచేత దెబ్బతిన్నవాడుకాడు. ఒక్కడూ విప్లవంలో పాల్గొలేదు. వాళ్ళని చూశాము. అందరూ ఆరోగ్యవంతులు. శుభ్రమైన మధ్యతరగతి ప్రజలు. కమ్యూనిజమంటే వాళ్ళకి ద్వేషం. పారిపోయే అవకాశం కోసం కనిపెట్టుకు వున్నవాళ్ళు వీళ్ళు. పదేళ్ళనించీ పారిపోవాలనే వీళ్ళ సంకల్పం. ఈ అవకాశంలో పారిపోవచ్చారు."

ఆస్ట్రియా ఉద్యోగి లెక్క సరైందనే నానమ్మకం. మొత్తానికి రెండు లక్షలమంది శరణార్థులు. వీళ్ళలో నూటికి ఒక్కడే విప్లవంలో పాల్గొన్నాడు. రెండోతరంగంలో వచ్చినవాళ్ళకీ, మూడోతరంగంలో వచ్చినవాళ్ళకీ భేదం ఇక్కడే తెలుస్తుంది. యాండావులో నేను కలిసిన శరణార్థులు—రెండో తరంగంలో వచ్చినవాళ్ళు కొద్దో గొప్పో విప్లవంలో పాల్గొన్నారు. (వీళ్ళలో అయినా కొద్దిమందే పోరాటంలో పాల్గొని వుంటారు—పాతికవేలమందిలో రెండువేలు.) హంగేరీలో వుంటే వురి; లేదా 'రష్యా బానిస కార్మిక క్యాంపులు'.—ఈ విపత్తులు ఎదుర్కోవాలి. మూడోతరంగంలో వచ్చినవాళ్ళు విప్లవంలో పాల్గొననూలేదు, వాళ్ళకి ప్రతీకారభయమూ లేదు.

మరొక భేదం కూడా వుంది. ఇది మొదటిదానికంటే ముఖ్యమైంది. రెండో తరగతిలో వచ్చిన నిజమైన విప్లవకారులు, రష్యావాళ్ళతో దెబ్బలాడినట్టు రికార్డులున్నవాళ్ళు ఎప్పుడో ఒకప్పుడు స్వతంత్ర హంగేరీకి ఆహ్వానం పొందవచ్చు. వాళ్ళు ప్రభుత్వంలోనూ పాల్గొనవచ్చు. మూడో తరంగంలో వచ్చినవాళ్ళు పరదేశాల్లో తాము బాగుపడాలని వచ్చినవాళ్ళు. స్వాతంత్ర్యం వచ్చాక వీళ్ళని పిలవరు. ఒకవేళ తమంత తాము కోరి వెళ్ళినా ప్రభుత్వంలో వీళ్ళకి భాగం దొరకదు.

ఇదిగో ఇలాంటి వాళ్ళగురించే అమెరికా కాంగ్రెసు సభ్యుడు ఉషర్ బర్డిసన్ ఇలా అన్నాడు:

"దేశంలోనేవుండి స్వాతంత్ర్యం కోసం సోవియటు యూనియనుతో పోరాడడానికి సిద్ధంగావున్న వాళ్ళని వొదిలేసి పారిపోవస్తున్న హంగేరీ వాళ్ళకి అమెరికా వీరోచితమైన గౌరవం చేస్తోంది. అమెరికాలో ప్రవేశిస్తున్న వీళ్ళ గురించి మనకేమీ తెలియదు. హంగేరీ వొదిలి వస్తున్నవాళ్ళలో నిజంగా ఎంత మంది అసలు విప్లవకారులో తెలుసుకోవాలి."

బర్లినన్ భయం నాకు లేదు. మీద వివరించినట్టు నూటికి ఒక్కరే విప్లవంలో పాల్గొన్నా, (రెండులక్షల రెండువేలమంది మాత్రం) తక్కిన 99 గురూ నిజంగా స్వేచ్ఛకోసం వచ్చినవాళ్ళే అని నానమ్మకం. మానసికంగా వాళ్ళు విప్లవాన్ని సమర్థించారు; తోడ్పడ్డారు. ప్రపంచం వాళ్ళకిచ్చిన సాను భూతికీ, ఆశ్రయానికీ వాళ్ళు అర్హులే అన్నవిషయం నిర్వివాదం.

అయినా హంగేరీ మిత్రులు ఒక్క విషయం మాత్రం మరిచిపోకూడదు. హంగేరీలోనే వుండిపోయి దెబ్బలాడినవాళ్ళు పారిపోయినవాళ్ళని గురించి ప్రత్యేకంగా స్వంత ఆర్థికలాభంకోసం వెళ్ళిపోయిన మూడోతరంగం శరణా ర్థులగురించి అనుకుంటూన్న చేదుమాటలు మనస్సులో వుంచుకోవాలి. హం గేరీ గురించి చేసే రాజకీయ తీర్మానాల్లో దీని ప్రభావం పడకపోదు. కానైతే శరణార్థులు దీన్ని త్వరలోనే గ్రహించారు. నిస్సందేహమైన దేశభక్తులూ, రష్యావాళ్ళతో వీరోచితంగా దెబ్బలాడినవాళ్ళూ, స్వార్థంకోసం పారిపోవచ్చిన వాళ్ళూ కూడా, తాము అనుసరిస్తూన్న అపాయకరమైన మార్గం ఎలాంటిదో గ్రహించారు. అప్పుడప్పుడు వాళ్ళు నాతో అనేవాళ్ళు :

“హంగేరీని దాని ఆపత్సమయంలో వొదిలేసి వచ్చాం. మాకు ఆదేశంలో హృదయపూర్వకంగా ఎవ్వరూ స్వాగత మివ్వరు. మాకంటే ధైర్యసాహసాలు కలవాళ్ళు దేశంలోనే వుండిపోయారు. కొత్త హంగేరీకి వాళ్ళే వారసులు.”

కొంతమంది నర్దుకుని ఇలా అనేవాళ్ళు :

“విప్లవంలో పాల్గొన్నామని నిదర్శనం చూపించగలిగిన వాళ్ళకి హం గేరీలో స్వాగతం దొరక్కపోదు.”

కాని మొదట వాళ్ళు అనుకున్నదే నిజమని నాఅభిప్రాయం. బుడా పెస్టులో వుండిపోయి రష్యా ఆగ్రహానికి గురైనవాళ్ళు తుదకి తమ దేశపరిపాల కులవుతారు. అయితే పారిపోయిన తమ సోదరుల్ని ప్రత్యేకపరిస్థితుల్లో తీసు కునే అవకాశంకూడా లేకపోలేదు. తుఫానుకి దూరంగా వియాన్నాలోనో, ఏ అమెరికాలోనో హాయిగా కూచున్న శరణార్థుల వైఖరి వాళ్ళు అంగీకరిస్తారది కానిపని. 1956 విప్లవంలో మంచి రికార్డువున్న ఒక శరణార్థి ఇలా విశ్లే షించాడు :

“మళ్ళీ ఇంకోవిప్లవం వచ్చినప్పుడు ఒక సబ్‌మెషీన్‌గన్ పట్టుకుని స్వచ్ఛంద సేవకుడిగా హంగేరీ ప్రవేశించడమే కర్తవ్యం. అప్పటికిగాని హం గేరీ జీవితంలో చొచ్చుకుపోలేను. సద్భావమూ, నిజాయితీ నిరూపించుకోడా నికి అదొక్కటే మార్గం. ఉత్తికబుర్లు చెప్పి దేశభక్తుణ్ణనిపించుకోదలుచుకో

లేదు. ఫ్రాన్సులోనో, అమెరికాలోనో కడుపులోచల్లకదలకండావుంటె కబుర్లు అసలే చెప్పదలుచుకోలేదు."

హంగేరీవాళ్ళ ఈ ఆవేదన అమెరికావాళ్ళు తెలుసుకోవాలి. సామాన్యంగా మనం ఇష్టమైనవాళ్ళని—ముఖ్యంగా ఓపదులుకలవాళ్ళూ, పెద్ద వ్యాపారస్తులూ అయితే మరిన్ని—నెత్తికెక్కిస్తాం. మనకి ఇష్టంలేనివాళ్ళని గురించి పరదేశాల పౌరులు కృతఘ్నులై వుంటారని భావిస్తాం. వలస ప్రభుత్వాలు సృష్టించి మన ఇష్టంవచ్చినవాళ్ళని అందులో పెడతాం. ఆ ప్రభుత్వాల్లో రాని వాళ్ళని అతివాదులని నిందిస్తాం. న్యూయార్కులోనూ, చికాగోలోనూ వున్న హంగెరీ శరణార్థులు కాక్‌టైల్ విందుల్లో ఎంత ఆకర్షణీయంగావున్నా కొత్త హంగేరీ ఏర్పడినప్పుడు దాని వ్యవహారాలు నడపలేం.

ఈతెలివితక్కువంతా అపుచెయ్యాలి. మన ఇష్టంవచ్చిన శరణార్థులచేత హంగేరీ పరిపాలన జరగదు. విశ్వవిద్యాలయాల్లో వుండిపోయిన విద్యార్థులూ, సెపెల్‌లో వుండిపోయిన కార్మికులూ, తమ జాతి అదృష్టంతో తిరుగుతూ పెరుగుతూ వుండేవాళ్ళూ—వాళ్ళే హంగేరీ పరిపాలిస్తారు. ఫెరెన్సు నాగీ ఉదంతం అమెరికావాళ్ళకి ఒక గుణపాఠంగా వుంటుంది.

వెనకటి హంగేరీ ఉద్యోగి ఫెరెన్సునాగీ ఎంతోకాలందాకా అమెరికాలో తనదేశంతరపున అనధికారరీత్యా మాట్లాడుతూ వుండేవాడు. హంగేరీసమస్యలు అమెరికావాళ్ళకి జ్ఞాపకం చేసేవాడు. హంగేరీవృక్షధం, సమర్థతతో సమర్థించేవాడు. "అమెరికావాళ్ళకి విశ్వాసపాత్రుడైన హంగేరీవాడు" అనిపించుకున్నాడు.

విప్లవంరాగానే ఫెరన్సునాగీని చప్పున విమానంమీద వియన్నాకి పంపారు. అక్కణ్ణుంచి అతడు పత్రికాప్రకటనలు ప్రారంభించాడు. వాళ్ళకి ఆదేశాలివ్వడం మొదలెట్టాడు. బుడాపెస్టు విప్లవనాయకులికి ఒళ్ళుమండింది. "ఆస్ట్రియానించి ఇరవైనాలుగు గంటల్లో ఫెరన్సునాగీ వెళ్ళిపోకపోతే అతణ్ణి కాల్చి చంపేస్తాం" అనిప్రకటించారు. ఇరవైనాలుగుగంటల్లో తమ దేశం విడిచిపోవాలని ఆస్ట్రియాప్రభుత్వం ఫెరెన్సునాగీకి నోటీసిచ్చింది. ఎన్నో వలసప్రభుత్వాలికి వెనక ఆశ్రయమిచ్చి ఆ ప్రభుత్వం ఎంతోబాధపడింది. ఇప్పుడు ఫెరన్సునాగీని వెళ్ళగొట్టడాని కీ సాకు దొరికినందుకు ఎంతోసంతోషించింది. ఒకహంగేరీ దేశభక్తు డన్నాడు:

“ ఫెరన్సునాగీఅంటే మాకేమీ పిచ్చిలేదు. మా ప్రభుత్వవ్యవహారాల్లో ఆతడు జోక్యంకలగజేసుకోడం మా కెంతమాత్రం ఇష్టంలేదు ”.

సున్నితమైన ఈ విషయంమీద నా హెచ్చరిక అంతఉపయోగకరమైంది కాదని నాకు తెలుసు. ప్యారిసులోనూ, న్యూయార్కులోనూ వలసప్రభుత్వాలు ఇప్పుడు ఏర్పడుతున్నా యనుకుంటాను. ప్యారిసులో ఏర్పడుతూన్న ప్రభుత్వ సభ్యులందరూ ఇంగ్లీషు మాట్లాడతారు. కాబట్టి వాళ్ళు మంచివాళ్ళు. అమెరికావాళ్ళు ఫ్రెంచివాళ్ళూ వీళ్ళంటే చాలాఇష్టపడతారు. కాని బుడాపెస్ట ప్రజలుమాత్రం వీళ్ళంటే ఇష్టపడరు. స్వతంత్రహంగేరీమీద మనకి ఇష్టం వచ్చిన ప్రభుత్వం రుద్ది, హంగేరీలో మన అవకాశాలు రద్దుపరుచుకోకూడదు. ఈ తెలివితేటలు అక్కడ పనిచెయ్యవు. కాని రెండు మూడు శతాబ్దాలదాకా మరోవిధానం మనం మార్చుకోలేమేమో!

స్వాతంత్ర్యయోధుల్లో నిజమైనవాళ్ళని, నమ్మకమైన రికార్డులుకలవాళ్ళని భావిహంగేరీ ప్రభుత్వంలోకి ఆహ్వానించడం సాధ్యమే. కాని స్వాతంత్ర్యం చాలాఆలస్యంగా వస్తేమాత్రం ఇది సాధ్యంకాదు. వలసవున్న మనిషి ఎంత త్వరగా తన దేశంతో సంబంధం పోగొట్టుకుంటాడో తెలుసుకుంటే విషాదంగా వుంటుంది. భావిహంగేరీ ప్రభుత్వం ఏదైనా - అది వామపక్షప్రభుత్వమైనా, మరేదైనా - పారిపోయిన యువకవైజ్ఞానికులను పూర్తిగా క్షమించి వాళ్ళకు స్వాగతమిస్తుందనే నమ్ముతాము. ఏమంటే సైంటిస్టులు చాలామంది దేశం వొదిలి వెళ్ళిపోవడం పెద్దలోపం. భావిప్రపంచంలో సైంటిస్టులకోసం ఆకలిగా వుంది. పరిశ్రమలికి వాళ్ళెంతైనా అవసరం. శరణార్థులైన ఈ నిపుణులందరూ ఒక ఏడాదిలోపునే ఏబర్మింగుహాంలోనో, ఏ డ్రాయిట్ లోనో, లేదా ఏ సిడ్నీలోనో మంచిఉద్యోగాల్లో కుదురుకుంటారు. వాళ్ళలో ఎంతోమంది మళ్ళీ హంగేరీకి వెళ్ళరనే నా సందేహం.

ఇక పిల్లలసంగతి పద్దెనిమిదేళ్ళలోపు చిన్నవాళ్ళనందరినీ పంపించెయ్యవలసిందని కమ్యూనిస్టు హంగేరీప్రభుత్వం అంటోంది. ఈ పిల్లల్ని ఎత్తుకుపోయారని నేరం మోపుతోంధి. ఈ చిన్నవాళ్ళే రష్యా టాంకులు ధ్వంసం చేశారన్నసంగతి వాళ్ళకి తెలియదు. వాళ్ళ అభిమతానికి వ్యతిరేకంగా, అనుమతి లేకండా కమ్యూనిజంనించి వాళ్ళని పట్టుకుపోయారని ఆరోపిస్తోంది. కాని మాతృదేశం ఆకర్షణశక్తి అద్భుతమైంది. బహుశా ఈ యువకుల్లో కొంతమంది హంగేరీకి మళ్ళిపోయి, అక్కడ తృప్తికరమైన స్థానాల్లో కుదురుకోవచ్చు.

మొత్తంమీద 1956 చివర హంగేరీనించి బైటికి అడుగుపెట్టిన ప్రతీ వ్యక్తీ తాత్కాలికంగా విజయంపొందినా, ఒక విషాదాంతగాధగా మారిపోయాడు. అతడు స్వాతంత్ర్యంవేపు నడుస్తున్నమాట నిజమే. కాని తన దేశానికీ, కాని భావికీకూడ అతడు దూరమైపోతున్నాడు. ఒక దేశభక్తుడికి అది చేదువిషయమే. సందేహంలేదు.

శరణార్థుల మార్గదర్శులు ఈ నాటకంలో వింతభాగం తీసుకున్నారు. అసలువాళ్ళు రైతులు. శరణార్థుల్ని దయతలిచి, అపాయకరమైన చిత్తడినేళ్ళ దాటించి, సరిహద్దువరకూ తీసుకువచ్చి శరణార్థుల్ని విడిచిపెట్టేవాళ్ళు. ఈ వలస ప్రారంభమైన మూడునెలలికిముందే బుడాపెస్టులో ఎవరో ఒక కమ్యూనిస్టు ఉద్యోగి హంగేరీ ఆస్ట్రియా సరిహద్దుమీదవున్న లాండ్‌మైన్సు తీసేసి, పేల్చెయ్యమని ఆజ్ఞాపించాడు. దీనివల్ల బహుశా పదివేలమంది ప్రాణాలు దక్కాయి. సరిహద్దంతా సురంగాలతో నిండివుంటే వేలకొద్దీమంది ప్రాణాలు కోల్పోయేవాళ్ళు. ఈ మైన్లు తీసెయ్యమన్న ఉద్యోగిపేరు తెలియదు. కాని ఒకశరణార్థి అన్నాడు:

"నేను పందెం వేస్తాను, అతడు ఇప్పుడు ఎక్కడో కొత్తఉద్యోగం కోసం వెతుకుతుంటాడు."

"కాదు, ఒక కొత్తతలకాయకోసం వెతుకుతుంటాడు" అన్నాడు మరొకడు.

మైన్లు లేకపోయినా ఆ రొంపినేలల్లో మార్గదర్శిలేకండా నడవడం సాధ్యంకాదు. శరణార్థులు వరదలా రావడం ప్రారంభించాక ఈ మార్గదర్శులు యాభయ్యేసి డాలర్లు కూలి గుంజుకునేవాళ్ళు. స్త్రీలదగ్గిరా, పిల్లలదగ్గిరా ఎర్రనిఏగానీ వుండేదికాదు. వాళ్ళనిమాత్రం ఉచితంగా తీసుకువచ్చేవాళ్ళు. కొంతమంది తమదగ్గిర డబ్బున్నా ఇవ్వడానికి నిరాకరించి ఏదో వోలాగ ఆస్ట్రియా చేరుకునేవాళ్ళు. మార్గదర్శులు దొరక్కనో, లేదా డబ్బు ఇచ్చుకోలేకనో కొంతమంది దారితెలియక అటునించి ఇటూ, ఇటునించి అటూ తిరిగి నానాబాధలూ పడేవాళ్ళు.

వియన్నాలో మొదటి శరణార్థులు స్థిరంగా నెలకొన్నతరవాత మరొక ఆట ప్రారంభమైంది. శరణార్థుల దగ్గిరికి కొంతమంది యువకులువెళ్ళి 'బుడాపెస్టులో మీవాళ్ళు ఎవళ్ళయినా వుండిపోయారా? వాళ్ళని ఇక్కడికి తీసుకురావాలనుకుంటున్నారా? అయితే చెప్పండి. ఒక వెయ్యిడాలర్లిస్తే తీసుకువచ్చేస్తాం" అనేవాళ్ళు.

నిర్భయులైన ఈ యువకులు హంగేరీ ప్రవేశించేవాళ్ళు, రక్షణదళాలు తప్పించుకుని, బుడాపెస్టుచెక్‌పాయింట్లు దాటి, పట్నంలో సరిగా వెళ్ళవలసిన ఇంటికి వెళ్ళి "వియన్నాలో మీ అన్న నిన్ను తప్పించి తీసుకురమ్మన్నాడు" అనేవాళ్ళు. అప్పుడు ఆ ముగ్గురు మార్గదర్శులూ, హంగేరీమనిషీ, లేదా కొంత మంది హంగేరీవ్యక్తులూ అపాయకరమైన ప్రయాణంచేసి, భద్రంగా ఆస్ట్రియా వచ్చేవాళ్ళు. వెయ్యిడాలర్లిచ్చి మోసపోయినవాళ్ళు ఎవళ్ళూలేరు. ఆ యువ కులు న్యాయంగానే తమకూలి తాము సంపాదించుకున్నారని అందరూ చెప్పుకున్నారు.

ఈ పద్ధతిచుట్టూ ఒక దొంగవ్యాపారంకూడా పెరిగింది. కొంతమంది రష్యాఉద్యోగులికి ఈ దొంగదారులసంగతి తెలిసిపోయింది. "హంగేరీవాళ్ళు దొంగదార్లంబడి ఎలాగూ వుడాయిస్తున్నారు. మనంకూడా ఎందుకు కొంత డబ్బు నొల్లుకోకూడదు?" అని అనుకున్నారు వాళ్ళు. తప్పించుకుపోయే వాళ్ళు ఇచ్చేదానిలోంచి మాకూ భాగంకావాలి అన్నారు. దాంతో కొందరు శరణార్థులు సరిహద్దుకి రెండుమైళ్ళదాకా రష్యాఆఫీసర్లు నడుపుతూన్న రష్యా కార్లలోనే వచ్చేసేవాళ్ళు. ఇది దర్జాగా పారిపోవడం!

ఒక ముసిలాణ్ణి వెయ్యిడాలర్లకి సరిహద్దు దాటిస్తానని ఒక హంగేరీ కాలేజీయువకుడు దారుణమైన సాహసం చేశాడు. అది చదివితే ఎంతో సరదావేస్తుంది. అతడు మంచి మర్యాదస్తుడైన యువకుడు.

"ముసిలాణ్ణి తీసుకువస్తేకాని ఒక్కడమ్మిడీఅయినా పుచ్చుకోను. నేను నెగ్గితే సరిహద్దుమీంచి నిన్ను పిలుస్తాను. నువ్వు కారు తీసుకురా అప్పుడే డబ్బుతీసుకుంటాను" అని అతడు హంగేరీలోకి వెళ్ళాడు.

ఎనిమిదిరోజులు గడిచింది. వెయ్యిడాలర్లు ఒప్పుకున్న వియన్నాలోని మనిషికి హంగేరీ విద్యార్థినించి టెలిఫోను వచ్చింది.

"నేను ముసిలాణ్ణి తెచ్చాను. కాని మీరు కారు తీసుకురావద్దు. బస్సు తీసుకురండి."

స్వాతంత్ర్యంపేరు ఆముసిలాడు అద్దెకివున్న భవనంలో ఈనోటా ఆనోటా పాకి భవనం భవనమంతా వ్యాపించింది. అందులోవున్నవాళ్ళు యావన్మందీ మేంవస్తామంటే మేంవస్తామన్నారు. "ఐతే రండి" అన్నాడు యువకుడు. అంతమందికీ అన్నివేల డాలర్లు పుచ్చుకున్నాడనుకుంటారు మీరు. కాని కాదు, ఒప్పుకున్న వెయ్యిడాలర్లకే ఇస్సెడు మనుషుల్ని తీసుకువచ్చాడతడు. డబ్బయిఒక్కసంవత్సరాల మనిషిమొదలు ఎనిమిదినెలల శిశువుదాకా మొత్తం ఇరవయ్యేడుగురు హంగేరియావాళ్ళని తీసుకువచ్చాడు.

స్త్రీలని కోరేవాళ్ళు. పిల్లల ఏడుపువల్ల కావలివాళ్ళు పట్టేస్తారని భయపడి. చాలమంది తల్లులు పిల్లల్ని వొదిలిపెట్టలేక వొంటరిగా ఆరొంపనేలల్లో పడి వచ్చారు. ఒకయువతి యాండావు వంతెనదగ్గిర అసామాన్యమైన సాహసం ప్రకటించింది. ఆమెభర్త ఆమె సాహసచరిత చెప్పాడు.

"నాభార్య బుడాపెస్టు విడిచిపెట్టినప్పుడు ఆమె ఎనిమిదినెలల గర్భవతి. ఇంత ప్రయాణమూ ఆమె చెయ్యడం మాకు ఇష్టంలేదు. కాని ఒక్క దినంకూడా కమ్యూనిజంకింద వుండనంది ఆమె. తన శిశువు హంగెరీలో పుట్టడం ఆమెకి ఇష్టంలేదు.

"మా ప్రయాణం కష్టమైంది. చాలాదూరం నడవవలసి వచ్చింది. మా జట్టులో వాళ్ళందరూ ఆమెకి సహాయం చేశారు. కొంతదూరం తరవాత ఆమె నడవలేకపోయింది. మాజట్టువాళ్ళు ఒక్కొక్కరే మమ్మల్ని వదలేసి వెళ్ళి పోయారు. నేనూ నాభార్యా యాండావు దగ్గిరగా ఒక చిట్టడివిలో చిక్కుపడి పోయాం. నాభార్యకి ప్రసవకాలం వచ్చింది.

"ఈ దగ్గిర ఏదైనా రైతుకొంపకి వెళ్ళి నా సహాయంకోసం ఒకస్త్రీని తీసుకురండి" అంది ఆమె.

ఒంటరిగా ఆమెని ఆచిట్టడివిలో వొదిలి వెళ్ళదలుచుకోలేదు నేను. నన్ను ముద్దుపెట్టుకుని వెళ్ళమందామె. ఎక్కడైనా ఒక రైతుకొంప దొరుకుతుందేమో అని నేను తిరిగాను. వెదకడంలో చాలాసేపు పట్టింది. చివరికి ఒకరైతుని వెదికి తెచ్చేటప్పటికి నాభార్య ప్రసవించి మూర్ఛపోయివుంది. చీకటిపడేదాకా ఆమెకి ఉపచారాలుచేసి, తరవాత ఆమెనీ, శిశువునీ ఆరైతు ఇంటికి తీసుకువెళ్ళాము. రైతుభార్య మమ్మల్ని నాలుగు రోజులు దాచి వుంచింది. ఐదోరోజు ఆరైతుసహాయంతో తల్లీపిల్లా ముగ్గురమూ ఆస్ట్రియా చేరాం."

ఒక రైలురోడ్డు ఇంజనీరు శరణార్థుల్ని తీసుకురావడంలో చేసిన తమాషా వారాలకొద్దీ చెప్పుకుని మధ్యయూరపువాళ్ళు నవ్వుకునేవాళ్ళు. రష్యావాళ్ళు రెండోమారు బుడాపెస్టు ఆక్రమించుకున్న మొదటిరోజుల్లో పెస్టు నించి రష్యాకి సీలుపెట్లరైలు ఒకటి అతణ్ణి నడపమన్నారు. సీలుపెట్లలో ఏముందో అతడు ఊహించగలిగాడు. సైబీరియాలో కాన్సెంట్రేషను క్యాంపులకో, సెంట్రలు ఏషియాకో పంపుతూన్న హంగేరీ విప్లవవాదులు అందులో వున్నారని రష్యా చేరాక అతడికి తెలిసింది.

ఇంజనీరు కొవాక్సు బుర్ర ఉపయోగించాడు. ఒకబోర్డు తయారుచేసి ఇంజనుముందు తగిలించమని తనకిందపనివాళ్ళతో చెప్పాడు. అతడు చెప్పి నట్టు బోర్డు తయారుచేసిపెట్టారు వాళ్ళు. సామాన్యంగా ఎవ్వరూ ఉపయో గించని సైడింగులో తనబండి పెట్టాడతడు. తరవాత వెనక్కి తిప్పాడు. రష్యానించి తిరిగి హంగేరీవచ్చాడు. బుడాపెస్టు, గ్యోర్ స్టేషన్లమీదుగా బండి నడుపుతున్నాడు. ఇంజనుముందు బల్లచూసి రష్యాగార్డులు తప్పుకుంటు న్నారు. మిహైకొవాక్సు రైలు ముందుకి సాగింది.

రైలు ఆస్ట్రియా సరిహద్దుదాకా వచ్చింది. అక్కడ ఆపాడు కొవాక్సు. నీళ్ళు విరగ్గొట్టాడు. పెట్టెలు తెరిచాడు.

"ఇదిగో దగ్గరగానే ఆస్ట్రియావుంది. నడవండి దారిచూపిస్తాను" అంటూ అరిచాడు. రైల్లోని ఖైదీలనందరినీ పట్టుకుని అతడు ఆస్ట్రియావచ్చే శాడు. తన రైలుబండిమాత్రం అక్కడే వొదిలిపెట్టేశాడు. ఇంజనుమీద బల్ల చకచకా మెరుస్తోంది.

"సోవియటు రష్యానించి హంగేరీకోసం ఆహారం."

శరణార్థులు రాకూడదని ఆస్ట్రియా ఎప్పుడూ సరిహద్దుల్ని మూసెయ్యా లేదు. వచ్చినవాళ్ళందరికీ ఘనంగా స్వాగతమిచ్చింది. దాని సౌహార్దానికి యూరపు యావత్తూ ఆశ్చర్యపోయింది. కమ్యూనిజం నిరాకరించి పారిపో వచ్చిన హంగేరియావాళ్ళకి ఆశ్రయం ఇవ్వకపోవాలంటే ఆస్ట్రియాకి చాలా కారణాలున్నాయి.

మొదటిది : ఈదరిమిలానే ఆస్ట్రియా స్వయంగా రష్యా పిడికిట్లోంచి విడివడింది. వోచిన్నసాకుతోఅయినా రష్యావాళ్ళు దానిమీద విరుచుకుపడ వచ్చు. అంచేత హంగేరీ శరణార్థులికి ఆశ్రయమివ్వడమంటే ఎంతో ధైర్య సాహసాలతోకూడిన పని. ఇక అమెరికా ఆశ్రయమిచ్చిందంటే అది ఉత్తి భ్రాతృత్వమే. ఆస్ట్రియా ఆశ్రయమివ్వడం ఆత్మహత్యా చేసుకోడమే.

రెండోది : చాలాకాలందాకా హంగేరీకి ఆస్ట్రియాకి చుక్కెదురుగా వుండేది. ఈరెండు దేశాలికీ జరిగిన చివరియుద్ధం నిన్నమొన్నే అంతమ యింది. అదేసాకుపెట్టి ఆస్ట్రియా ఈశరణార్థులికి ఆశ్రయమివ్వకపోయివుంటే లోకం ఏమీ అనుకునేదికాదు. అలాకాకండా అది హంగేరీవాళ్ళని ఎంతో ప్రేమతో ఆదరించింది.

మూడోది : ఆస్ట్రియా వొక చిన్నదేశం. దాని జనసంఖ్య 70 లక్షలే. దాని సహజసంపదకూడా పరిమితమైంది. ఆస్ట్రియావాళ్ళు లోభులేఅయితే

యువకులు విరామంలేకండా పని చేశారు. సరిహద్దులన్నీ గాలించి ఎంతో మంది శరణార్థుల్ని కష్టాలనించి తప్పించారు. నిరాపదస్థలాలికి తీసుకు వచ్చారు. పన్నెండుగురిని ఎంతోకష్టంనించి తప్పించడం నేను స్వయంగా చూశాను. నేను చూసింది చాల తక్కువే. కొంతరు యువకులు శరణార్థుల కోసం కనిపెట్టుకువుండి రొంపినేలల్లో దిగబడిపోయేవాళ్ళు కొందరు చలి మంటలు వేసేవాళ్ళు. కొందరు కాలవగట్లమీదకాని శరణార్థులు కాలవలో కాలుజారిపడిపోకండా చూసేవాళ్ళు. వాళ్ళ సాహసకార్యాలు నిజంగా ఉత్తమ మైనవి ; వాళ్ళ సంప్రదాయాలికి అనుగుణమైనవి.

ఒకనాడు ఉదయం కరిచేస్తున్న చలిలో నేనూ ఒకస్నేహితుడూ సరి హద్దుమీద నిలబడి రొంపినేలతట్టు చూస్తున్నాం. మాతో ఒక ఆస్ట్రియా సోల్జరుకూడా వున్నాడు. దూరంగా ఒక పెద్దహంగేరీ శరణార్థులగుంపు దారి తప్పిపొయి, ఆస్ట్రియాసరిహద్దు ఎక్కడాఅని దేవులాడుతూ అవుపించింది. మేం ముగ్గురమూ చూశాం.

ఆలోచించకండా హంగేరీవాళ్ళ సహాయంకోసం మేం ముందుకి పరి గెత్తాం. అస్ట్రియాసోల్జరు నన్ను తనముందుకి లాక్కుని అన్నాడు:

" దయచేసి నన్ను దాచెయ్యండి. నా దగ్గిర తుపాకీవుంది. అస్ట్రియాని చూసిన తొలిచూపులోనే వాళ్ళు తుపాకి చూడకపోవడం మంచిది. "

స్వాతంత్ర్యానికి అస్ట్రియాచేసినసేవ వర్ణించాలంటే మరొకపుస్తకం కావాలి. క్లుప్తంగా ఒక్కమాట చెపుతాను. నేను ఎప్పుడైనా శరణార్థిగా రావ లిసివస్తే అస్ట్రియాకే వస్తాను.

హంగేరీ మళ్ళీ ఎప్పుడు ఎలా స్వతంత్రమవుతుందో నేను చెప్పలేను. హంగేరీప్రజల మెడమీంచి రష్యాకాడి ఎలాతప్పుతుందో ఊహించలేను. కాని ఒక్కటిమాత్రం చెప్పగలను. హంగేరీకి స్వాతంత్ర్యంలభించిన ఆ శుభదినం ప్రపంచం వివిధభాగాల్లోవున్న హంగేరీవాళ్ళు డాలర్లూ, ఫ్రాంకులూ, పెసోలూ, పౌండ్లూ పంపించి యాండావుదగ్గిర స్మృతిచిహ్నంగా వంతెన కడతారు.

తక్కినవంతెనల లాగ అదేమీ పెద్దవంతెన కావక్కరలేదు. ఒకకారు వెళ్ళేటంత వెడల్పుగానూ వుండనక్కరలేదు. హంగేరీవాళ్ళమీద అస్ట్రియా వాళ్ళు చూపించిన ప్రేమా, సౌహార్దమూ జ్ఞాపకానికి తెచ్చేటంత గట్టిగావుంటే చాలు. ఒకజాతి ఆత్మదాటి వెళ్ళగలిగినంత వెడల్పువుంటేచాలు.

# 10. రష్యా పరాజయం

**1956** హంగేరీ విప్లవం ప్రపంచచరిత్రలో ఒక ప్రధానఘట్టం. సందేహంలేదు. దురదృష్టవశాత్తూ కమ్యూనిజం రోడ్డు ఏ దిక్కు మళ్ళుతుందో జోస్యం చెప్పేస్థితిలో లేం. కాని అది పాతదిక్కు వెళ్ళ లేదనిమాత్రం చెప్పగలం. బహుశా రష్యాసేనలు పూర్తిగా హంగేరీ వశంచేసుకుని, ముసుగులేని నియంతృత్వం స్థాపించి, ఆర్థికంగా, నైతికంగా దాన్ని ఎడారిగా మార్చవచ్చు. రష్యా ఈ విధానం అనుసరించిందా, ధన ప్రాణాలు ఎక్కువగా బలి ఇవ్వవలసివస్తుంది. దేశంమీద తమ ఆక్రమణ సడలించవలసివస్తుంది. కొంత స్వేచ్ఛా, స్వాతంత్ర్యమూ వాళ్ళ కివ్వవలసివస్తుంది. కమ్యూనిజం తీసుకున్న కొత్తదారి ఏదైనా పెద్దప్రచారయుద్ధంలో రష్యా ఓడిపోయిందని మాత్రం ఘంటాపథంగా చెప్పవచ్చు. దీనివల్ల రష్యాకి ఎంతనష్టం కలిగిందో అంచనావెయ్యడం ఇప్పటికీ సాధ్యంకాదు.

రష్యా ఈ ఉదంతంవల్ల ఎంతదెబ్బతిన్నదో అర్థంచేసుకోవాలంటే ఒక మార్గముంది. సోవియటుస్థితి ఒక పెద్దచెరువుగా భావించండి. దానిలో ప్రచారమూ, పైడాబూ, మోసమూ, అబద్ధాలూ పచ్చనినాచులా చేరింది. నిశ్చలంగావున్న చెరువుమీదిభాగం చూపించి, కమ్యూనిజంకింద జీవితం ఎంత ప్రశాంతంగావుందో చూడండి అంటూ ప్రపంచాన్ని మోసపుస్తున్నారు. ఈ పచ్చని నాచుకింద ఒక్క రష్యారైతులేకాక హంగేరీవాళ్ళూ, మంగోలులూ, తూర్పు జర్మనీవాళ్ళూ, పోలిష్ప్రజలూ సుఖంగా, హాయిగా కలిసిమెలిసి వుంటున్నారని ప్రచారం జరుగుతోంది.

బుడాపెస్టు ఉదంతానికిపూర్వం ఈ కట్టుకథ భారతీయులూ, ఇండోనేషియావాళ్ళూ, ఇటలీవాళ్ళూ, ఫ్రెంచిప్రజలూ నమ్మడం సాధ్యమే. సోవియటుజీవితంలో ఏదోభావాంశంమీద చిత్రించిన ఒక చిత్రరచనలా చూపిస్తున్నారిది. మీదిభాగం ఎప్పుడూ ప్రశాంతంగానే వుంటుంది. ఈ అబద్ధాల చెరువులో హంగేరీ ఒక పెద్దరాతిబండలాపడికది. దాంతో నిజం అలలుగా నలుమూలలా, చెరువు దూరదూరాల తీరాలదాకా వ్యాపించింది. దూరతీరాలకి నిజం వ్యాపిస్తున్నకొద్దీ పైనినాచు తప్పించి లోపలచూస్తే నిజమైన జీవితం ఎలావుందో తెలుస్తూ వచ్చింది. హంగేరీ బండపడడంవల్ల బయలుపడ్డ విషయాలివి:

మొట్టమొదట రష్యాలోనే వెణుకుపుట్టినట్టయింది. తమ సరిహద్దుల మీద నిలబెట్టివుంచిన ఉపగ్రహరాజ్యసేనలు నమ్మడానికి వీల్లేదని తేలింది. రుమేనియా, బల్గేరియా సేనలు రష్యాని రక్షించడానికి నిలబడకపోవడమే కాకండా అవి బహుశా శత్రువులతో కలిసిపోవచ్చు. మధ్య ఆసియా సేనలు కూడా బహుశా ఇదేమార్గం అవలంబించవచ్చు. ఇది రష్యానాయకులికి నిరుత్సాహంగామాత్రంలేదు ; భయోత్పాతంగాకూడా వుంది.

తన సామ్రాజ్యం సరిహద్దులు కాపాడడానికి తయారుచేసిన మేధావుల్నికూడా రష్యా నమ్మలేకండావుంది. హంగేరీలో విప్లవం అరికట్టకపోవడమే కాకండా వాళ్ళు స్వయంగా విప్లవం నడిపించారు. ఉపగ్రహరాజ్యాలన్నిటిలోనూ మేధావులు ఇలా చేయడానికే అవకాశంకోసం చూస్తున్నారు.

యువకుల విషయంలోకూడా రష్యా పరాజయం పొందింది. హంగేరీ ఆస్ట్రియా సరిహద్దులో యువకులుచేసిన అద్భుతకృత్యాలు సాటిలేనివి. మరే దేశమూ ఇలాటి యువకుల్ని ఎత్తిచూపలేదు. లాట్వియన్, పోల్, టర్కోమన్, మంగోల్ యువకులనించి రష్యా తన్ను తాను రక్షించుకోడానికి సిద్ధపడాలి.

రష్యాకి అన్నిటికంటె పెద్దపరాజయం భారీపరిశ్రమల కార్మికులనించి వచ్చింది. కమ్యూనిస్టు సిద్ధాంతవేత్తలు ఎవళ్ళని ఎక్కువప్రియంగా భావిస్తారో వాళ్ళే పరమశత్రువులయారు. వాళ్ళ సిద్ధాంతం నూటికి నూరింతలూ అబద్ధమని తేలింది. సెపెల్ కార్మికులు సోవియట్లకిచేసిన పరాభవం ఊహించటానికి వీల్లేంది. ఇక్కడ జరిగిన రష్యా పరాభవం ఫలితాలు అంచనా వెయ్యలేం.

కమ్యూనిజమంటే స్త్రీలుకూడా ఎలాంటి సద్భావమూ ప్రకటించలేదు. ఒక్క కమ్యూనిజమే స్త్రీసంక్షేమంకోసం పాటుపడుతోందని ప్రగల్భాలు కొట్టారు. కాని నిజానికి నానాహింసలూ పెడుతున్నారు వాళ్ళని. హంగేరీ స్త్రీలు ఇలాంటి అబద్ధాలికి మోసపోలేదు. అంచేతే తీరా సమయం వచ్చేసరికి వాళ్ళుకూడా నూటికి నూరుమంది కమ్యూనిస్టులికి వ్యతిరేకులయారు. సోవియట్లు ఇక్కడకూడా ప్రచారంలో వీగిపోయారు.

రైతుల్లోకూడా రష్యాకి ఎక్కువ పలుకుబడిలేదు. భారీపరిశ్రమల కార్మికుల్లాగే రైతులుకూడా కమ్యూనిస్టులికి ప్రియతములనే ప్రతీతి వొకటి వుండేది. ఒక ప్రాంతంతరవాత ఒంకోప్రాంతం రైతులు సమిష్టికమతానికి స్వస్తిచెప్పారు. అధికసంఖ్యాకులు పాతపద్ధతికే పోదామనుకున్నారు. ప్రతీ

రైతుకీ కొంత స్వంతభూమి వుండడమూ, పెద్దపెద్ద యంత్రాలు మాత్రం అందరూకలిసి ఉపయోగించుకోడమూ-ఇదీ ఆ పద్ధతి. హంగేరీలో పెద్దసమ్మె జరిగినప్పుడు పంట రష్యాచేతిలో పడుతుందేమోఅని 'ఎక్కువఅవసరంగా ఆహారధాన్యాలు పండించం' అన్నారు రైతులు. ఇలా రైతులు రష్యాని వోడించడం క్రెమ్లిన్ గొంతుక పిసికినట్టు అయిందనుకుంటాను.

ఉపగ్రహరాజ్యాల సామాన్యపోలీసుదళాన్ని నమ్మడానికి వీల్లేదని రష్యా పసికట్టింది. బుడాపెస్టు పోలీసుదళంలో నాల్గింట మూడోవంతు పోలీసువాళ్లు తమ ఆయుధాలు విప్లవకారులి కిచ్చేశారు. కొన్నిఘట్టాలతో విప్లవకారులతోకలిసి పోయారు. ఒక్క ఏవీవోవాళ్ళే రష్యాఅధికార్లకి విశ్వాసపాత్రులుగా వున్నారు. అయితే దానికి కారణం లేకపోలేదు. అలావాళ్ళు వుండకపోతే మరణమే వాళ్ళకి గతిఅయేది. దేశాన్ని వాళ్ళు ఎంతకలుషితం చేశారంటే స్వాతంత్ర్య యోధులు వాళ్ళతో ఏ మాత్రమూ సమాధానపడడానికి వీల్లేకుండాపోయింది. ఈ విషయం వాళ్ళకీ స్పష్టంగా తెలుసు.

చివరికి రష్యా మరోవిషయం కనిపెట్టింది. తన స్వంతసైనికులే వొకప్రాంతంలో ఎక్కువకాలంవుంటే-అది సంస్కృతికలదేశమైతే, ఉన్నతమైన జీవన ప్రమాణంకలదీ అయితే-ఆ సైనికులుకూడా శత్రుపక్షంలో చేరిపోవడం జరుగుతుంది. బహుశా క్రెమ్లిన్ సైనికాధికారులికి ఇది మొదటే తట్టివుంటుంది. వాళ్ళచర్యలే దీనికి తార్కాణం. ఇప్పుడు ఆ విషయం స్పష్టంగానే తెలిసిపోయింది. ఇప్పు డిక ప్రతియూనిట్ కమాండరూ తన సేనని అనుమానదృష్టితోనే చూడాలి. శత్రువులతో దెబ్బలాడవలసివచ్చినప్పుడు వీళ్ళవైఖరి ఎలా వుంటుంది అన్నవిషయం ఎప్పటికప్పుడు పరీక్షలుచేసి తెలుసుకుంటూ వుండాలి. అయితే ఆ దెబ్బలాడవలసిన శత్రువులు ఎవరో ఇంతవరకూ తేలలేదు.

ఇవి గొప్పపరాజయాలు. అయితే ఇవి వొక్క రష్యాకే చెల్లుతాయి. ఇవి ఎంతో అంత ముఖ్యమైనవేఅయినా హంగేరీ అల్లర్ల ప్రభావం అన్నిఉపగ్రహరాజ్యాలమీదా పడితేనేతప్ప దాని ముఖ్యఫలితం తేలదు. ఉపగ్రహరాజ్యాలు అదుపులో వుంచడానికి రష్యా అవలంభించిన జిత్తులుయావత్తూ విఫలమయాయి. బలప్రయోగంవొక్కటే మిగిలింది. ఆశపెట్టడమూ, వాగ్దానాలు చెయ్యడమూ, చంపెయ్యడమూ, భయపెట్టడమూ అన్నీ విఫలమయాయి. ఒక్కబలమే ఉపగ్రహరాజ్యాన్ని అదుపులో వుంచుతోంది.

వాగ్దానాలు: వాగ్దానాలు ఎంతబూటకాలో హంగేరీ సంఘటనలు ఋజువు చేస్తున్నాయి. తనకి దొరికిన ఈ మిత్రరాజ్యసద్భావం కాస్తా రష్యా పోగొట్టుకుంది. దానికి కారణం కష్కశంగా పరిపాలించడమే. క్రమక్రమంగా తన అధికారం తగ్గించుకుని, నిజమైనలాభాలు ఆ దేశానికి రష్యా సమకూర్చివుంటే హంగేరీలో కమ్యూనిజం వేళ్ళుతన్ని బలపడేది. హంగేరీవాళ్ళు రష్యాచేసిన శుష్కవాగ్దానాలికి విసిగిపోయారు. ఆ వాగ్దానాలు ఎన్నడూ ఫలించలేదు. అంచేతే విప్లవం తప్పనిసరిఅయింది. ఇక తక్కిన ఉపగ్రహరాజ్యాల్లోకూడా ఇదేకథ జరుగుతుంది. తన వాగ్దానాలు మరిచిపోయి రష్యా ఇప్పుడు బలం చేసే అదుపులో వుంచుకోవాలనుకుంటున్నది. బహిరంగంగా అది చేస్తున్న బలప్రయోగం లోకం వెయ్యికళ్ళతో చూస్తోంది.

వాగ్దానాలు విఫలమైతే బలప్రయోగంకూడా విఫలమవుతుంది. ఏవివో వాళ్ళు భయంకరులే. కాని ఇతరఉపగ్రహరాజ్యాల్లో పనిచేస్తున్నవాళ్ళకంటే ఎక్కువభయంకరులుకారు. బహుశా రష్యాలోకంటే వీళ్ళ బీభత్సం తక్కువే. బీభత్సంవల్ల హంగేరీలో 'మంచికమ్యూనిస్టు'ల్ని తయారుచేసేపని భగ్నమైనట్టే. వేరేవిధాల బీభత్సంకూడా భగ్నమైంది. పోలండూ,తూర్పుజర్మనీవంటి దేశాల్లో కమ్యూనిస్టులు కానివాళ్ళు ఎంతో అంతమందివున్నారని మనం అనించవచ్చు. వీళ్ళుకమ్యూనిస్టుల శత్రువులై వుంటారు. హంగేరీలో జరిగినవిషయాలు వాళ్ళనిమరింతగట్టిపరిచి వుంటాయి. ఇది కమ్యూనిస్టు చైనాకి అనుసరింపచేయవచ్చు. ఇది చాలాముఖ్యమైన విషయం.

ఉపగ్రహరాజ్యాల ఏ జాతీయనాయకుడైనా హంగేరీలో జరిగిన ఉదంతం జాగ్రత్తగా పరికిస్తే తనదేశంలోని సేనా, పోలీసుదళమూకూడా అదే విధంగా జాతీయవాదులపక్షంచేరి కమ్యూనిస్టులతో పోరాడుతుందని భావించవచ్చు. ఈ విషయం విప్లవవాదులికి చాలాముఖ్యమైంది. ప్రపంచవాతావరణం అనుకూలించి రష్యామీద తిరుగుబాటు లేవదీస్తే వాళ్ళకి ఈ విషయం బాగాపనికివస్తుంది.

ఉత్తమతరజీవనం, కమ్యూనిస్టుదేశాల సౌభ్రాతృత్వం, సోవియటు యూనియను స్నేహవాత్సల్యాలు, రక్షణ-ఇలాంటి అబద్ధాలు ఉపగ్రహరాజ్యాలప్రజలు ఎంతవరకు నమ్ముతున్నారో చెప్పడం కష్టం. ఇలాగే యువకుల విద్యావిషయం, కార్మికులగురించిన అబద్ధప్రచారం, సిపాయిలకి అందచేస్తున్న తప్పుడుప్రచారం-ఇదంతా ఇప్పుడు బైటపడినట్టే. తన నిజమైన రాకాసిరూపంతో రష్యా ఇప్పుడు తన ఉపగ్రహరాజ్యాల ఎదటనుంచున్నదన్నమాట.

కమ్యూనిజం కింద తమ ప్రకృతిసంపద ఏమయిందో ఆవేశంలేని పరిస్థితిలో ఉపగ్రహరాజ్యాలు అంచనావేసుకున్నాయి. హంగేరీ విప్లవకారుల ముఖ్యమైన నినాదం:

" రష్యా మా యురేనియం దోచుకుంటోంది " అని. విప్లవానికిపూర్వం ఇలా అన్నమనిషిని గుండేసి కాల్చేస్తారు. ఇళ్ళల్లో కూచుని గునగునలాడుకోవలసిందే. కాని ఇప్పుడు అది హాలుబజారులోకి వచ్చేసింది. ఉపగ్రహరాజ్యాలన్నిటిలోనూ ఇలాంటి ఆరోపణలే వినవస్తున్నాయి. దీనికి కారణమున్నా లేకపోలేదు. పగడ్బందీగా, దయాదాక్షిణ్యంలేకండా రష్యా తన పొరుగుదేశాల సంపద దోచుకుంటోంది.

పార్టీనించి తొలిగించడాలవిషయంలో ఉపగ్రహరాజ్యాలవైఖరి ఎంతో ముఖ్యమైంది. 1945 నించి హంగేరీని పాలిస్తూవున్న సోవియటు పరిపాలకులు చాలాచిత్రమైన తొలిగింపులు ఆదేశించారు. తామే ఆలోచించి ఈ తొలిగింపులు చేసినట్టు హంగేరీ కమ్యూనిస్టులు భ్రమపడుతున్నారు. మొట్టమొదట ట్రాట్స్కీయిటులని చంపించేశారు. తరవాత టిటోయిసు జాతీయ సామ్యవాదుల్ని చంపించేశారు. తరవాత స్టాలినిస్టుల వంతువచ్చింది. అప్పుడు చంపిన టిటోయిస్టుల్ని పైకితీసి ఇలా అన్నారు:

" ఇంతకీ మీరు నిజాయితీగల కమ్యూనిస్టులు. మిమ్మల్ని చంపినందుకు పరితపిస్తున్నాం. ఇదంతా పొరపాటయింది ".

చివరికి వాళ్ళవిధానంతో ఏ మాత్రం భేదాభిప్రాయంవచ్చినా ఈ 'తొలిగింపు' తప్పలేదు. దీనివల్ల వచ్చినలాభమూ ఏమీలేదు. ఇకముందు ఉపగ్రహరాజ్యాలు 'తొలిగింపుల' విషయంలో ముందడుగులేస్తాయన్నది సందేహాస్పదం. ఇకముందు ఈ హత్యాకాండలు రష్యా స్వయంగా జరుపుకోవాలి.

ఇదంతాచూస్తే ఉపగ్రహసంఘాల పునాదులే కదులుతున్నాయని తెలుస్తుంది. ఇకముందు అవిమండుతూనే వుంటాయి. ప్రతీ ఉపగ్రహరాజ్యం గురించీ రష్యాభయంకరమైన తీర్మానాలు చెయ్యాలి. ప్రతితీర్మానానికీ సైనిక ఆర్థికరంగంలోఅయినా (ఉపగ్రహరాజ్యాల కోరికలు మన్నిస్తే), లేదా శాంతి ప్రచార రంగంలోఅయినా (సైన్యం తీసికెళ్ళి ఉపగ్రహరాజ్యాలు పూర్తిగా అణిచేస్తే) పూర్తిగా అపజయం తప్పదు. ఏ విధంగాఅయినా రష్యా నష్టపడవలసిందే.

రాతిబండ పడడంతో లేచిన మూడో తరంగంవల్ల రష్యాకి ఎక్కువ నష్టమే కలుగుతుంది. యూరపులో ఇటలీ ఫ్రాన్సులూ, ఆసియాలో ఇండియా ఇండోనేషియాలూ, మధ్యఆఫ్రికాలో కొన్నిభాగాలవంటి దేశాలూ

కమ్యూనిస్టుదేశాలు కావడానికి అవకాశముండేది. కమ్యూనిస్టుపార్టీలు పని చేస్తూవున్న ఉరుగ్వే, ఆస్ట్రేలియా, జపానువంటి దేశాలికికూడా ఈ మాట చెల్లుతుంది. హంగేరీ విప్లవం ఇక్కడ ఒక తరంగంలాకాదు తుఫానులా వుంటుంది.

వోట్లిచ్చి ఫ్రాన్సు కమ్యూనిస్టు ప్రభుత్వం అధికారంలోకితెస్తే, దాని వెంటనే భీభత్సమూ వస్తుంది. ఈ భీభత్సం దేశాన్ని వికృతం చేసేస్తుంది. ప్రతి జీవితరంగమూ కలుషితం చేసేస్తుంది. ఫ్రెంచిప్రజలు పరాభవంతో తల్లకిందులు కావలిసివస్తుంది. అక్కడి కమ్యూనిస్టులికీ ఈ దుర్గతి తప్పదు.

ఇటలీ ఒక కమ్యూనిస్టు ప్రభుత్వాన్నే ఎన్నుకుంటే దాని ఆర్థికజీవితం నానాటికి తీసికట్టు నాగంభొట్లూ అవుతుంది. పెద్దపెద్దపట్నాలలో పని చేసే కార్మికులు బాధపడిపోతారు.

ఫ్రాన్సుకాని, ఇటలీకాని కమ్యూనిజాన్ని ఎన్నుకున్నా యనుకోండి. అప్పుడు ఎవడైనా ఒక పెద్దపార్టీనాయకుడు తన అధికారం పోతుందని అనుమానపడ్డాడా, రష్యా సహాయం అర్థిస్తాడు. రష్యా తన టాంకు దించుతుంది. ఇకనేముంది ? రోమునైనా, ప్యారిసునైనా అవి తుక్కుకింద కొట్టి పారేస్తాయి. బుడాపెస్టు కథనం మనకి నేర్పిన గుణపాఠమే అది. ఏమాత్రం తిరుగుబాటు వచ్చినా, ఏ నగరంపడితే ఆ నగరం రష్యాటాంకులు ఎగరగొట్టేస్తాయి. బుడాపెస్టులోలాగ టాంకులు చిక్కుల్లో పడ్డాయనుకోండి, అప్పుడు రష్యా పెద్ద పెద్ద బాంబర్లు పంపిస్తుంది.

ఒకప్పుడు కమ్యూనిస్టు విజయానికి అవకాశమున్న దేశాల్లో ఇప్పుడు ప్రజాసహాయం లేకండాపోతోంది. ఇదే రష్యాపొందిన పెద్ద పరాజయం. అధికారవాంఛకల కమ్యూనిస్టు నాయకులికి బుడాపెస్టు విధ్వంసం చీమకుట్టినట్టయినా లేకపోవచ్చు. వాళ్ళకది ఆశ్చర్యంకూడా కలిగించకపోవచ్చు. కాని ఇటూ అటూ తేల్చుకోలేని వోటర్లు ఎర్రటిక్కెట్టుకి వోటుచేశారా, తమగొయ్యి తాము తవ్వుకున్నట్టేఅవుతుంది. బుడాపెస్టు సంఘటనలు ఇదే చాటుతున్నాయి. ఈరకంవాళ్ళవల్ల సోవియట్ల నష్టం అపారం.

ఈదేశాల్లో కమ్యూనిస్టు సభ్యులు అప్పుడే జారిపోతున్నారు. సామాన్య ప్రజల్ని కట్టికట్టి హతమార్చడానికి వీళ్ళు ఒప్పుకోకండా వున్నారు. ఏ కమ్యూనిస్టు నాయకుడో తన అధికారం నిలబెట్టుకోడానికని, అనాలోచితంగా రష్యా టాంకులు ఆహ్వానించే పరిస్థితి తెచ్చుపెట్టుకోడానికి ఇష్టపడకండా వున్నారు. ఒకప్పుడు ఎంతో నమ్మకమైన కమ్యూనిస్టులేవీళ్ళు. కమ్యూనిస్టు కార్డులున్న

నభ్యులే. బుడాపెస్టులో జరిగింది విని వీళ్ళీ అభిప్రాయానికి వచ్చారు. ప్రము ఖులైన కమ్యూనిస్టునాయకులు ఒక్కొక్కరే మెల్లిమెల్లిగా తప్పుకుంటున్నారు. తమ ప్యారిసు, రోమునగరాల విధ్వంసం వాళ్ళు చూడవలుచుకోలేదు. దీనం తటివల్లా కమ్యూనిజానికి తీరని నష్టం కలిగింది. బుడాపెస్టు పూర్తికథ తెలి సిన తరవాత ఇలా జారిపోయే కమ్యూనిస్టు నాయకుల సంఖ్యా ఇంకా పెరుగుతుంది.

ఆసియాదేశాలు సామ్రాజ్యతత్వంమీద కత్తిదూశాయంటే, అది మాకు అర్థమౌతుంది. సామ్రాజ్యతత్వంకంటే సోవియటు కమ్యూనిజం అనాగరిక మైందనీ, కఠోరమైందనీ బుడాపెస్టుగాథ నిరూపించింది. ఇంతవరకూ జరిగిన అబద్ధప్రచారంవల్ల రష్యా ఐరోపీయ ఉపగ్రహ రాజ్యాల ప్రేమాస్పదుడైన పెద్దన్నఅయి, వాటితో హాయిగా కాలంగడువుతోందనే, ఆదేశాలు రష్యా స్నేహ సౌహార్దాలు అనుభవిస్తూ సుఖంగా వున్నాయనీ ఆసియాదేశాలు నమ్ముతూ వుండేవి.

"ఈ భ్రాతృత్వంలో మీరూచేరి సుఖపడరాదూ?" అని ఆసియాని రష్యా మాటిమాటికీ హెచ్చరిస్తోంది. ఇప్పుడు ఆ భ్రాతృత్వం బండారం బట్ట బయలైంది

విదేశాల్ని రష్యా ఎలా మోసంచేస్తుందో, బుద్ధిమంతులైన స్థానిక దేశ భక్తుల సహాయం ఎలా సంపాదిస్తుందో ఊహించడం కష్టం. బాగా లోతుకి దిగి, ఎలాఅయినా తమదేశాలు కమ్యూనిజంలోకి దింపాలనుకుంటూ వున్న వాళ్ళనే రష్యా నమ్ముకోవాలి. తక్కినదేశమంతా కమ్యూనిజం నిరాకరిస్తూంది. ఏమంటారా? కమ్యూనిజమంటే ఏమిటో అది కళ్ళారా చూసింది. మానవ హృదయంమీద అధికారం సంపాదించాలని చేసిన యుద్ధంలో రష్యా పూర్తిగా పరాజయం పొందింది.

తన పయోముఖవిషకుంభంతో ప్రపంచంలో ఇకముందు రష్యా నెగ్గుకురాలేదు. రెండులక్షల హంగేరీ జనం ప్రపంచమంతా అల్లుకుపోయి కమ్యూనిజం అంటే ఏమిటో చండోరా వెయ్యడానికి సిద్ధంగావున్నారు. నెపెల్ కార్మికులే అక్కడ వుంటే, నన్ను డెట్రాయిట్‌లో సోవియటు ప్రతినిధిగా వుండమన్నారనుకోండీ, లక్ష ఇచ్చినా ఒప్పుకోను. ఈ రెండులక్షల రిపోర్టర్ల ప్రభావమూ ప్రపంచంమీద గొప్పగాపడుతుంది. ఈ శరణార్థుల కథలు అమెరి కాలో గ్రామంనించి గ్రామానికి పాకితే, ఆస్ట్రేలియాలో వూరినించి వూరికి వెళితే, కమ్యూనిస్టు ప్రచారం అక్కడ ఏమాత్రం వేరుదన్ని వుండినా ఇక పెరగడం సున్న.

"హంగేరీవాళ్ళు తమనితామే దూషించుకోవాలి. మాదేశంలో ప్రెసిడెంటు ఎన్నికలు జరుగుతూవున్నప్పుడే తొందరపడి ఎందుకు విప్లవం ప్రారంభించారు? మాకది అనువైనకాలం కాదని వాళ్ళు తెలుసుకోవలసింది."

అయితే చాలాకాలంనించే మేం తిరుగుబాటుకోసం ఎదురుచూస్తున్నాం. ఎన్నికలున్నా, మరేమివున్నా దానికి సిద్ధపడవలసిందే అని ఒకవాదనవుంది.

చివరికి అమెరికావాళ్ళు యూరపు ఖండం పటం చూపించి ఇలా అనవచ్చు :

"మా ఉనికి చూడండి. హంగేరీకి సముద్రంరేవు లేదు. మరి వాళ్ళకి ఏమైనా పంపించాలంటే ఎలా? మావిమానాలు ఆస్ట్రియా, యుగోస్లేవియా వంటి సర్వస్వతంత్రదేశాలమీంచి ఎగరలేవుకదా! అంచేత వాళ్ళకి సహాయం చెయ్యాలన్నా చేసేస్థితిలో లేం."

ఈ వాదంలోవున్న తికమక స్పష్టంగానేవుంది. అమెరికా ఏకొద్దిఇచ్చినా రామగోలచేసి ఇస్తుంది. దాని దాతృత్వం చిట్టచివర ఎప్పుడూ "చూశారా?" అన్నప్రశ్న వుండనేవుంటుంది.

మూడు : అమెరికా తికమక చూసి హంగేరీవాళ్ళు తమమిత్రునికి ఏదో ఒకటి చెప్పి వాళ్ళు చిన్నపోకండా చేస్తున్నారు.

"మీరు కావాలన్నా సహాయం చెయ్యలేకపోయారు" శరణార్థులు మమ్మల్ని సముదాయిస్తూ అనేవాళ్ళు, అమెరికావాళ్ళకి ఇలాంటి వోదార్పు ఏదో వున్నట్టు! అభిమానంకల హంగేరీవ్యక్తి ఒక్కొక్కడు ఇలా అనేవాడు:

"మీరు సహాయం చెయ్యగలిగివుంటే తప్పకుండా చేసేవాళ్ళని మాకు తెలును. రేడియోలో మీరెప్పుడూ గట్టిగా ప్రోత్సహిస్తూనే వుండేవాళ్ళు. మా విప్లవం సరైన అదునులో ప్రారంభంకాలేదు. అందుకని మాకు విచారంగానే వుంది. మీ రేమైనా సహాయం చెయ్యగలిగితే మాకంతకంటే గర్వకారణం మరొకటి లేదు.

యూండావులోవున్న అమెరికావాళ్ళనీ, విప్లవకాలంలో బుడాపెస్టులో వున్న అమెరికావాళ్ళలాగే హంగేరియను స్నేహితులు నిష్కల్మషంగా ఇలా అన్నమాటలు ఎన్నో ఉదహరించగలను.

"మీరేమీ బాధపడనక్కరలేదు. మీరు మాకు ఎందుకు సహాయం చెయ్యలేకపోతున్నారో మాకుతెలును. మీపక్షాన మేం దెబ్బలాడుతున్నందుకు మాకు సంతోషంగావుంది" అన్నారు వాళ్ళు. మొత్తానికి ఎలాఅయితేనేం, రెండో సాకువల్ల మన ఖిన్నత్వం తగ్గింది. అంత నష్టపడ్డ హంగేరీవాళ్ళమీద

అంత విలాసంగా సానుభూతి చూపడంమాత్రం మనం నేర్చుకున్నాం. నా అమెరికా స్నేహితుల్లో ఒకరు ఇలా అన్నారు :

"ప్రపంచం అంతటిచేతా పరిత్యజింపబడ్డారు హంగేరియనులు అయినా ఎవరిమీదా వాళ్ళకి పిచ్చికోపం రాలేదు. ఈవిప్లవంలో ఇదిఒక్కటే మనల్ని చకితుల్ని చేస్తోంది."

హంగేరీవాళ్ళు పైకి అనకపోయినా తమలోతాము గుసగుస లాడుకుంటూనేవున్నారు. ఒకశరణార్థి యువకుడు తాను చెప్పింది రహస్యంగా వుంచుతానని నాచేత ఒట్టువేయించుకున్నాడు. అతడిపేరు ఫెరెన్సు కోజోల్. వయస్సు ఇరవైఆరేళ్ళు. హంగేరీవాళ్ళు ఏడుపుమొహాలవాళ్ళని లోకం అనుకోడం అతడికి ఇష్టంలేదు. కాని అతడన్న మాటలు మాత్రం నన్ను చాలా కదిలించాయి. అంచేత నాచేత ఒట్టు వెయ్యించవద్దని అతణ్ణి కోరాను. అతడన్న మాటలు లోకానికి వెల్లడించడంకోసం అనుమతికూడా పుచ్చుకున్నాను. అత డిలా అన్నాడు :

"మా స్వాతంత్ర్యయుద్ధంలో అమెరికాచూపిన విముఖభావానికి హంగేరీ ప్రజలు కుమిలిపోతున్నారు. కమ్యూనిజానికి వ్యతిరేకంగా మానవహృదయం మీద విజయం సాధించడానికి ఏళ్ళతరబడి మీరు పోరాడుతున్నారు. అందులో ఒకభాగంగా మాకు ఆశగొల్పుతూవచ్చారు. అభయమిస్తూనూవచ్చారు. 'మిమ్మల్ని మేం మరవలేదు. మీరు స్వతంత్రులుకావడమే మాలక్ష్యం. దీని కోసం శాయశక్తులా మీకు సాయం చేస్తాం' అని ఆశపెడుతూవచ్చారు.

"ఇనపతెర వెనకవున్నమాకు ఈ సందేశం అందించడానికి అమెరికా కోట్లు ఖర్చుపెట్టింది. మా మనస్తత్వం మార్చడానికి ఎన్నిమార్గాలు అవలంబించాలో అన్నిమార్గాలూ అవలంబించింది, 'వాయ్సు ఆఫ్ అమెరికా' రేడియో స్టేషను రోజుకి 50 గంటలు స్వాతంత్ర్యప్రోగ్రాం ప్రసారంచేసింది. 70 ఫ్రీక్వెన్సీలమీద మీప్రోగ్రాం వచ్చేది. టాంజియర్సునించి, మ్యూనిక్‌నించి, సెలోనికానించికూడా మీప్రోగ్రాంలు ఒక్కొక్కప్పుడు వింటూవుండేవాళ్ళం. మీ స్టేషనుల నిరోధం (జామింగు) అరికట్టడంకోసం 'కూరియరు' తయారు చేశాం. 'కూరియర్' మీ ఇనపతెరలో పెద్దరంధ్రాలు పొడుస్తుంది" అనిమీరు ప్రకటించినప్పుడు మేం ఆనందంతో పులకరించాం.

1950 లో మీరు 'రేడియో ఫ్రీయూరప్' నెలకొల్పారు. మాస్వాతంత్ర్యవ్యాసంగంలో పూర్తిగా అడుగుపెట్టారు. పదకుండుస్టేషన్లనించి వారానికి వెయ్యిగంటల ప్రోత్సాహం మాకు ప్రసారంచేశారు. ఫ్రాంకుఫర్, మ్యూనిక్,

లిస్బన్-ఇన్నిచోట్లనించి RFE (రేడియో ఫ్రీడమ్ ఆఫ్ యూరప్) మాకు ఎన్నోసార్లు చెప్పింది. 'ఇనపతెర వెనకాలవున్న బానిసరాజ్యాల ప్రజలలో కమ్యూనిజానికి వ్యతిరేకభావం సజీవంగా వుంచటమే మా ఉద్దేశం. మీరు అలాంటివాళ్ళని బలపరిచి, సోవియటు సంకెళ్ళు తెంచుకుని స్వతంత్రులు కావాలని కోరుతున్నాం.'

“మేం బలపడడంకోసం మీరు చేసిందేమిటి? మాటిమాటికీ మమ్మల్ని మరిచిపోలేమని అభయంమాత్రం ఇచ్చారు. ఆర్. ఎఫ్. ఇ'ని ఇంతమంది అమెరికావాళ్లని పోషిస్తున్నదంటే అమెరికా మీకు వెనకదన్నై నిలబడిం దన్నమాట' అన్నారు. మేం మిమ్మల్ని నమ్మాం.

“మీ సందేశం మాకు ఇంకా స్పష్టంగా అందాలని మా దేశంమీదికి మీరు కరపత్రాలతో బెలూన్లు పంపారు. అల్యూమినం మెడల్సు కురిపించారు. నాకు దొరికిన ఒక మెడలుమీద 'స్వాతంత్ర్యగంట' ముద్ర వుంది. దానిమీద “స్వాతంత్ర్యంకోసం హంగేరీవాళ్ళు. ప్రపంచమంతా హంగేరీవాళ్లతోవుంది” అన్న వాక్యాలున్నాయి.

“ఈ బెలూనులు మా మనస్సులమీద చాలాపనిచేశాయి, అప్పుడు నేను ఇలా అనుకున్నట్టు జ్ఞాపకం: 'ఉత్తిమాటలుకాకండా ఏవో గట్టివస్తువులే వస్తున్నాయి. అల్యూమినం మెడల్సు పంపగలిగిన అమెరికా పారచూట్లద్వారా యుద్ధసామాగ్రికూడా పంపుతుంది. విప్లవమే ప్రారంభమైతే, సందేహంలేదు. అమెరికా మనకి సహాయంచేస్తుంది.

“1952లో మీ రేడియోస్టేషనులన్నీ, మీ ఎన్నికలప్రచారంలోచేసిన వాగ్దానాలన్నీ మాటిమాటికీ ప్రసారంచేశాయి. అమెరికా ఇనపతెర చుట్టేస్తుం దని మాకు చెప్పారు. కమ్యూనిస్టు ఆధిపత్యంకిందవున్న 80 కోట్ల మందికీ స్వాతంత్రేచ్ఛ కలిగిస్తా మన్నారు. రష్యాని శాంతిమార్గంలో మీఅధ్యక్షుడు పెడ తాడని ఎన్నోసార్లు అభయమిచ్చారు. ప్రతిరోజూ మీ నాయకుల ఉపన్యాస భాగాలు మాకు వినిపించారు.

“విదేశాల్లోవున్న హంగేరీ యువకులు మా దగ్గరికి ఎలా వచ్చేవాళ్ళో కాని వచ్చి ఇలా అనేవాళ్ళు: 'విప్లవం ప్రారంభించండి. తరవాత మీరు ఏమీ బాధపడనక్కర్లేదు. అమెరికా మిమ్మల్ని ఆదుకుంటుంది. ఆ పక్షం వాళ్ళు ప్రారంభించేదాకా మీరు ఆగనక్కరలేదు. మీరే స్వయంగా ప్రారంభించండి. మీరు ఎంతటివాళ్ళో ప్రపంచానికి తెలియాలి. మీరు కావాలంటున్న స్వాతం త్ర్యానికి హంగేరీ అర్హులని మీరు నిరూపించాలి”.

"1953లో ఉపగ్రహరాజ్యాల్లో కమ్యూనిజానికి వ్యతిరేకంగా పని చేస్తున్నవాళ్ళ సహాయంకోసం అమెరికా పంచమిలియన్‌డాలర్లు కేటాయించిం దని మాకు చెప్పారు. మీరు మా పక్షం వున్నారని పూర్తిగా నమ్మాం.

"తుదకి ఏం జరిగింది? తూర్పు బెర్లినులో జర్మనీవాళ్ళు రష్యాకి వ్యతిరేకంగా అల్లర్లు ప్రారంభించినపుడు మీ రేడియో ఆ అల్లర్ల పూర్తివివరాలు చెప్పింది. ఈ యేడు పోజ్నానులో పోలుప్రజలు రష్యాకి వ్యతిరేకంగా అల్లర్లు చేసినప్పుడు మళ్ళీ మీప్రచారయంత్రం పూర్తివివరా లిచ్చింది. పూర్తిగా స్వాతంత్ర్యప్రచారంచేసింది. మీరు ఎందుకు విన్నారని మమ్మల్ని దూషిస్తారా? మా స్థానంలో మీరు వుండిచూడండి. మాకు నిజంచెప్పే పత్రికలులేవు. మాకు స్వంతరేడియోస్టేషనులేదు. మీరు చెప్పిందే విన్నాం. దాన్నే నమ్ముకున్నాం. స్వాతంత్ర్యం ప్రేమించండని మీరు అన్నారు.

"అమెరికాఅంటే నాలాంటి హంగేరీవాళ్ళు ఇప్పుడు ఎందుకు మండి పడుతున్నారో తెలుసా? ఆరేళ్ళపాటు మీప్రచారంతో మా బుర్రలూ, మన స్సులూ నింపారు. ఆరేళ్ళు రష్యా మమ్మల్ని బురదలో అణగదొక్కింది. మీ మాటప్రకారం మేం తిరగబడి దెబ్బలాటకిదిగితే, ఎంతమంది అమెరికా వాళ్ళు మా సహాయంకోసం వచ్చారు? ఒక్కడూ రాలేదు. మా పక్షంచేరిన వాళ్ళెవరు? రష్యాసైనికులు! ఎన్నిఅమెరికాటాంకులు మాకు సహాయం చేశాయి? ఒక్కటాంకూ రాలేదు. మా స్వాతంత్ర్యసమరంలో మాకు సహా యంగా వచ్చినటాంకులేవి? రష్యా టాంకులు!

మమ్మల్ని రెచ్చగొట్టింది మీరు. తీరా సమయానికి వస్తుసహాయం చెయ్య కపోవడం ఒకటేకాదు మా కోసం ధైర్యంగా ఒక్కమాటాడలేదు మీరు. నా దేశం నిశ్శబ్దంగా చచ్చిపోయింది. అక్టోబరు చివరిదినాల్లో ఒక్కఅమెరికా వాడిగొంతుకయినా స్పష్టంగా, బిగ్గరగా మాట్లాడలేకపోయిందా? బుల్గానిన్ సూయజుకోసం గట్టిగా మాట్లాడాడు. దాంతో ఇంగ్లాండు, ఫ్రాన్సులు తోక ముడిచేశాయి. మా విప్లవంలో పదిరోజులు వ్యవధివుండేది. అప్పుడు తెగించి ఒక్కఅమెరికను అరుపన్నా వినబడితే, బుల్గానిన్‌ని వెనక్కిపంపేది. ఆఅరుపు రానేలేదు. డాన్యూబునదిమీద యునైటెడ్‌నేషన్సులో అంతానిశ్శబ్దమే. చివ రికి ఎన్నాళ్ళతరవాతో అమెరికా మాట్లాడింది. ఆ మాటలు మా దేశభక్తుల శవాలుమాత్రమే విన్నాయి. దుఃఖసందేశంమాత్రమే అది."

ఫెరెన్సు కోబుల్ బాధ్యతలేని యువకవిప్లవవాదికాడు. ఆలోచనపరుడు. ఉత్తిఊహాగానాలమనిషిన్నీకాడు ఏది లాభించేదీ, ఏదీ లాభించందీ చక్కగా అంచనావెయ్యగలవాడు. అమెరికాని అతడు బాగాఅర్థంచేసుకున్నాడు.

"హంగేరీవాళ్ళు అమెరికాఅంటే చాలా నిరుత్సాహపడ్డారు. నిజమే. కాని ఎవ్వరూ 'ఇకముందు ఎన్నడూ అమెరికా నాయకత్వం అనుసరించం' అనలేదు. మాకు తెలుసు. ఎప్పుడైనా మాకు స్వాతంత్ర్యంవస్తే మీ ద్వారానే వస్తుంది. మీరు ఇది ఎలాచేస్తారో నాకు తెలియదు. కాని హైడ్రోజను బాంబు కాలంలో హంగేరీని రక్షించడంకోసం వెళ్ళి ప్రపంచయుద్ధం ప్రారంభించడం ఊహించలేని విషయం. మేం అమెరికాని నమ్ముకుని వుండాలి. మాకు స్వాతంత్ర్యం సంపాదించిపెట్టడంకోసం మీ అధ్యక్షుడు తగినచర్య తీసుకుంటాడనీ మాకు తెలుసు. హంగేరీలాగే పోలండు, జర్మనీదేశాల స్వాతంత్ర్యంకూడా కాని మీ వాళ్ళు రెండుసమస్యలు చాలాజాగ్రత్తగా గమనించాలనుకుంటాను" అన్నాడతడు.

తరవాత ఆ రెండుసమస్యలూ వివరించాడతడు వింటూన్నకొద్దీ అడలు పుట్టేటట్టున్నాయవి.

మొదటిది: "రేడియో ఫ్రీ యూరప్‌మీద ఏ హంగేరీవాడికీ కోపంలేదు. మా ఆశలు ఎప్పుడూ పచ్చగా వుండాలనే మా కోరిక. ప్రసారకులు చెప్పిందంతా నమ్మకండా వుండవలసింది మేం. అదంతా అక్షరాలా నిజమనుకోవడం వల్లే చిక్కువచ్చింది. కొంతమట్టుకుఅది అమెరికా తప్పే. అనాలోచితంగా మాటలు వాడడం పొరపాటు. 'స్వాతంత్ర్యం', 'జాతీయగౌరవంకోసం పోరాటం', 'ఇనపతెర చుట్టెయ్యడం' 'విమోచనం' — ఈ మాటలికి అర్థముంది. కాని ఆరేళ్ళపాటు ప్రతీరోజూ హంగేరీవాళ్ళకీ, బల్గేరియావాళ్ళకీ, పోలండువాళ్ళకీ స్వాతంత్ర్యాన్ని ప్రేమించమని ప్రబోధించి, చివరికి సమయం వచ్చేసరికి కడుపులో చల్లకదలకండా కూచుని మొట్టవేదాంతం చెప్పడం తప్పు. 'మేం ఇన్నాళ్ళూ చెప్పినవి వుత్తిమాటలు' అనడం ఘోరం. గొలుసుల్లోవున్నమనిషికి అలాంటిమాటలు వుత్తిమాటలుకావు. అతడి గొలుసులు తెంచుకోడానికి అవి ఆయుధాలు".

ఫెరెన్సుకోబుల్ తన దేశస్వాతంత్ర్యోద్యమంలో గౌరవమైనభాగం పుచ్చుకున్నాడు. స్వాతంత్ర్యంకోసం తన ప్రాణాలు వొడ్డాడు. "నన్ను మాటలే రెచ్చగొట్టాయి" అంటాడతడు— "మధ్య యూరపునీ తూర్పు యూరపునీ అమెరికా మాటలతో ఊదరగొట్టదలచుకుంటే చివరికి దాని బాధ్యతకూడా

నెత్తినివేసుకోవాలి. కాకపోతే ఆ దేశాలని ఆత్మహత్య చేసుకోమని పురికొల్పడమే అవుతుంది.”

కోబోల్‌లాంటివాళ్ళు ఇలా విమర్శిస్తే అమెరికావాళ్ళు “రేడియో ఫ్రీ యూరప్” మీద కారాలూ మిరియాలూ నూరుతున్నారు.

అమెరికాలో అమెరికావాళ్ళు వోట్లకోసం చేసేఉపన్యాసాలన్నీ ఈరేడియో స్టేషను ప్రచారం చేస్తుందని వాళ్ళకోపం. హంగెరీవాళ్ళు ‘రేడియో ఫ్రీయూరపుమీద దెబ్బలాడడంలేదు. అమెరికావాళ్ళతోనే వాళ్ళు తగువు. ఇంతకీ రేడియోప్రసారం చేసిందల్లా ప్రముఖులైన అమెరికానాయకులు జాతీయ విధానమని ప్రకటనచేసిందేకదా! అందులో వాళ్ళ తప్పేముంది? ఈ ఉపన్యాసాలు కార్యరూపంలో పరిణమించలేదనే వాళ్ళ కోపం.

• రెండోసమస్య మరీ గమనించదగ్గది. అవును. హంగెరీ విప్లవంలో జోక్యంకలగజేసుకోకపోవడానికి ఎన్నోమంచిసాకులున్నాయి మీకు. అధ్యక్షుడి ఎన్నిక. హంగేరీకి దారిలేకపోవడం. మీ మాటలు విదేశాల్లో అక్షరాలా నమ్ముతున్నారని మీకు తెలియకపోవడం—ఇలాంటివి. కాని తూర్పుజర్మనీలోనో, పోలండులోనో అల్లర్లు ప్రారంభమైనప్పుడు మీకు ఈ సాకులు వుండవు. అవి చప్పున మీ అందుబాటులో వున్నాయి. మీకు అప్పుడు ఎన్నికలుండవు. మీ మాటలు అందరూ నిజమే అనుకుంటున్నారనుమా మీ కప్పుడు హెచ్చరిక వస్తుంది. ఇప్పటినించే ఆలోచించుకోండి. జర్మనీలో పోలులు విప్లవం ప్రారంభిస్తే ఏంచెయ్యాలో! ఎంచేతంటే మీరు మాట్లాడుతూన్న మాటలు— అమెరికా ఎప్పుడూ ఇలాంటిమాటలే ఆడింది. లోకం నమ్మదగ్గమాటలే”.

హంగేరీ విప్లవంలో అమెరికా మొదటచేసింది ఏమీ అంతబావుండ లేదు. మనం ఎలాంటిచర్యా తీసుకోకపోయినందుకు, పల్లెత్తి మాటాడనందుకూ హంగేరీవాళ్ళు మనల్ని క్షమిస్తే క్షమించవచ్చు. కాని శరణార్థులవిషయంలో మనం చూపించిన వైఖరిమాత్రం సమర్థించడం కష్టం. అమెరికా ఏదోస్వర్గం కంటె ఒక మెట్టమీదవున్నట్టు “స్వాతంత్ర్యంకోసం వీరోచితంగా పోరాడిన హంగేరీవాళ్ళని అమెరికా రానిస్తాం” అని ప్రకటించారు! అమెరికా రానివ్వడానికి తగినవాళ్ళని ఎంచేపని మతసంస్థలికి అప్పగించారు. వాళ్ళు పెట్టిన షరతులు విని వియన్నాలో నవ్వనివాళ్ళులేరు. చూడండి, విడాకులిచ్చిన వాళ్ళకి అమెరికాలో స్థానం లేదన్నారు. అలాంటివాళ్ళు మతద్రోహులని ప్రకటించారు. పైకి స్వచ్ఛమైన క్రయిస్తవులుగావున్న శరణార్థుల్నే అమెరికా స్వీకరిస్తుందట! దీనికి వ్యతిరేకంగా యూరపుదేశాలన్నీ క్యాంపులదగ్గిరికి

రైలుబళ్ళు పట్టుకువెళ్ళి "ఎక్కడికివస్తారో రండి! ఇంగ్లాండుకా? ఫ్రాన్సుకా? స్విడ్జర్లాండుకా? ఎక్కడికివచ్చినాసరే, అందరినీ తీసుకుంటాం. ప్రతీపురుషుణ్ణీ స్త్రీనీ, శిశువునీ తీసుకుంటాం" అన్నాయి.

హాస్యాస్పదమైన మనవైఖరి అస్ట్రియాలో ఎంతయినా కోపం తెప్పించింది. మన ప్రభుత్వోద్యోగి ఒకడు పత్రికావిలేఖరులతో మాట్లాడుతూ "మేం శరణార్థుల్ని తీసుకోడంలో కొంచెం ఆలస్యం చేసినమాట నిజమే. కాని మాసరిహద్దు దాటివచ్చిన ప్రతీహంగేరీవ్యక్తికీ కొత్తబ్లాంకెటు ఇచ్చాం" అన్నాడు. విన్నవాళ్ళలో ఒకడికి బాగా ఒళ్ళుమండింది.

"ఇంతవరకూ ఎంతమంది శరణార్థులు వచ్చారు?" అని అడిగాడతడు.

"తొంభై ఆరువేలు"

"వీళ్ళలో అమెరికా ఎంతమందిని తీసుకుంది?"

"ఐదువేలు"

"స్విడ్జర్లాండు ఎంతమందిని తీసుకుంది?"

"నాలుగువేలు"

తరవాత మరిప్రశ్న అక్కరలేదు. కానైతే త్వరలోనే అమెరికా తలుపులు తెరుచుకున్నాయి. సరిహద్దుదగ్గిర పనిచేస్తూన్న నాలాంటివాళ్ళం తల ఎత్తుకు తిరగగలిగాం. అదైనా హంగేరీమీద అమెరికా వైఖరి తిన్నబడలేదు. శరణార్థుల్ని క్యాంపుకిల్మరుకి పంపించాం. అక్కడ అరాచకపరిస్థితులున్నాయంటూ న్యూయార్కు టైమ్సుప్రతినిధి రాశాడు.

"ప్రతినిధులికి స్వాగతమిచ్చే ఏర్పాట్లూ, వాళ్ళ బసల ఏర్పాట్లూ— న్యూయార్కుప్రాంతంలో-అధమంగా వున్నాయి. మన దేశానికి తలవొంపులుగా వున్నాయి. ధైర్యవంతులూ, సాహసవంతులూ అయిన ఈ శరణార్థులవిషయంలో కిల్మర్‌క్యాంపులో చూపుతూన్న వైఖరి హేయంగావుంది.

"ప్రతివాళ్ళూ ఈ పనిలో చొరబడ్డారు. శరణార్థుల్ని తెచ్చిన విమానాలు నేలకి దిగినక్షణంనించీ పనంతా సైనికులదే, శరణార్థులికి అమెరికా మొదటి జీవితానుభవం సైనికులూ, సైనికుల ఏర్పాట్లూనూ. వాళ్ళని మిలటరీబస్సుల్లో కిల్మర్‌బారక్సులికి తీసుకువెళ్ళారు. అక్కడ పరిసరప్రాంతం అంతా ఊనరక్షేత్రం. దానిచుట్టూ మిలటరీపోలీసు పహరా, బారక్సులే బసలు. అవి ఎంతో అనాగరికదశలో వున్నాయి. యూరపులో నిర్వాసితుల బసలన్నీ ఇలాగే వున్నాయి. మతస్థులు చాలామంది వాళ్ళ పునరావాస కార్యానికి ఏర్పాటైనా

సైనికాధికారులకిందే వాళ్ళు పనిచెయ్యవలసివచ్చింది. వాళ్ళద్వారానే బారక్సు ల్లోకి వెళ్ళడమూ, శరణార్థికుటుంబాలికి స్వాగతం చెప్పడమూ, వాళ్ళతోకలిసి ఉద్యోగాలగురించీ, ఇళ్ళగురించీ మాట్లాడడమూ జరిగేది.

న్యూయార్కువాళ్ళు శరణార్థుల స్వాగతంకోసం ఇంతకంటే మర్యాదకర మైన, సాత్వికమైనపద్ధతి కనిపెట్టలేకపోయారో ? ఎంచేత? న్యూయార్కునచ్చా వరి ఏమైంది ? సైన్యానికి ఈ పని ఎందుకు ఒప్పగించారు ? స్వచ్ఛందసేవ కులు చేయవలసినపనికదా ఇది ! పౌరులు స్వచ్ఛందంగా చెయ్యవలసిన పనికాదా ? ”

కిల్మర్ క్యాంపులో జరిగిన ఒక సంఘటనవిని యూరపులో అందరూ నవ్వుకున్నారు. అప్పుడే మొట్టమొదటి శరణార్థులజట్టు వచ్చి చేరింది. ఆ జట్టులో వాళ్ళుఅందరూ పదిరోజులు రష్యాటాంకుః తో పోరాడి, వందమైళ్ళు నడిచి, రొంపినేలల్లోంచి పాకుకుంటూ, కాలవ ఈదుకుని, వచ్చినవాళ్ళు. వాళ్ళ ముందుకివచ్చి క్యాంపులో ఒక ఉద్యోగిఅన్నాడు.

“ స్వాతంత్ర్యంగురించి కొన్నివిషయాలు మీతో చెప్పదలచుకున్నాను”.

“ బాల్కనీమీంచి మాట్లాడుతున్నాడా ఈయన ? ” ఒక హంగేరీశర ణార్థి అడిగాడు.

విప్లవంతరవాత కొద్దిరోజుల్లోనే ఒకపోలిష్ వార్తాపత్రికమనిషి జరిగిన దంతా తనపత్రికకి రాశాడు. తనదేశం శరణార్థులకోసం చాలాస్వల్పం చెయ్య గలిగినందుకు తాను ఎంతో సిగ్గుపడుతున్నానని రాశా డతడు. పొరుగునవున్న జెకోస్లోవియా ఏమీ సహాయం చెయ్యకపోవడం సరేకదా, హంగేరీకి వ్యతిరే కంగా రష్యాకి సహాయంచేసినందుకు ఆగ్రహం ప్రకటించాడు.

“ హంగేరీవాళ్ళు పోలీష్లా ప్రవర్తించినందుకు దుఃఖంవేస్తుంది. పోలులు జెక్కులమల్లే ప్రవర్తించారు. జెక్కులు పందుల్లా ప్రవర్తించారు ”.

ఒకమనిషి అన్నాడు : “ అమెరికా అసలు ప్రవర్తించేలేదు. ”.

తనదేశం ప్రశక్తి వచ్చేసరికి, దాని ప్రవర్తన చూస్తూవున్న ఒక అమె రికావ్యక్తి కంగారుపడ్డాడు. ఇంతలో అమెరికాప్రభుత్వం కదిలింది. మాజాతి ఆత్మగౌరవం మేలుకుంది. యునైటెడ్‌స్టేట్సుప్రభుత్వం చివరికి ఉదారమైన కార్యక్రమంతో ముందుకి వచ్చింది. శరణార్థులు అమెరికా ప్రవేశించడానికి గల చట్టబద్ధమైన ఎన్నోనిరోధాలు తొలగిపోయాయి. వలసకి కావలసిన కాగి తాలమర్యాదలన్నీ వియన్నాలోవున్న మా రాయబారకార్యాలయం చకచకా నడిపింది. తాత్కాలికసహాయసంస్థలు-క్యాథలిక్కో, జ్యూయిష్, ప్రొటెస్టెంటు,

ఇతరసంస్థలూ-తమలో తాము రాజీపడి ప్రతీరోజూ రోజుకి ఇరవైనాలుగు గంటలూ పనిచేశాయి. విడిపోయినకుటుంబాల్ని కలుపుతూ, అన్నివిధాలా శర ణార్థులికి సహాయం చేశాయి. యునైటెడ్‌స్టేట్సులో వాళ్ళప్రవేశం సులభ మయ్యేట్టు చేశాయి. అమెరికాలోని సహాయకసంస్థలు బ్లాంకెట్లూ, మందులూ, డబ్బూ, ఆహారమూ, వోకొల్లలు పంపించాయి, హంగేరీ విద్యార్థులికి ప్రవేశ మిచ్చిన ఆస్ట్రియా విశ్వవిద్యాలయాలికి అమెరికా విద్యాసంస్థలు విద్యార్థి వేత నాలూ నగదుడబ్బూ పంపించాయి.

అమెరికా చెయ్యగలిగిందంతా చేశాక డిసెంబరులో క్రిస్మసుపండుగకి మా ఉపాధ్యక్షుడు నిక్సన్ ఆస్ట్రియాదేశానికి వెళ్ళాడు. అమెరికాసహాయం రావడంలోవున్న సమస్తనిరోధాలూ మెలిగించాడు. ఆస్ట్రియా చేస్తున్న కృషికి అన్నివిధాలా తోడ్పడతామని అభయహస్త మిచ్చాడు. శరణార్థుల్ని తీసుకోడంలో ఇంకా ఉదారంగా వుండవలసిందని మా ప్రభుత్వాన్ని హెచ్చరించాడు.

శరణార్థులకోసం విమానాలతరవాత విమానాలు దిగాయి. కిల్మర్ క్యాంపు ఉత్సాహవంతమైన స్వాగతకేంద్రంగా మారిపోయింది. అమెరికా అంతటా ఎన్నడూ ఒక్క హంగేరీవాణ్ణిచూడని అమెరికావాళ్ళు ఈ ఆగంతుకులికి స్వాగతమివ్వడానికి తమచేతులు చాచారు. ఒకళ్ళభాష ఒకళ్ళకి తెలియక పోయినా వాళ్ళ స్వాగతంలో సౌహార్ద మేమాత్రమూ తగ్గలేదు. యునైటెడ్‌స్టేట్సు సంఘటితమయేసరికి దానిప్రవర్తన ఉత్తమంగా తయారైంది. **1957** మార్చి మధ్యకి ముప్ఫయివేల హంగేరీ శరణార్థులు అమెరికాలో ఆశ్రయంపొందారు.

ఇలా మొదట ఏమీచెయ్యలేదని బాధపడడమూ, ఏమిచేయాలో తోచక తికమకపడడమూ, తరవాత తేరుకోడమూ, చివరికి సంప్రదాయసిద్ధమైన ఔదార్యంచూపి, గర్వపడడమూ-ఇదంతా ఒక ఆవేశచక్రంలా గిర్రున తిరిగి పోయింది.

చివరికి అమెరికా తన కర్తవ్యమూ, బాధ్యతా గ్రహించి ఆపత్సమ యంలో ఆదుకున్నంతమాత్రాన, మొదటి తన మానసికాందోళనమాత్రం కప్పి పుచ్చలేదు. మొదట మేం పడిన ఆందోళన చాలాముఖ్యమైంది. ఈ 'కోల్డు వార్' లో మా వైఖరి మరోసారి ఆలోచించాలి. 'రేడియో ఫ్రీడమ్ ఆఫ్ యూరప్' ప్రసారంచేసిన ఉపన్యాసాలన్నీ చదివిచూస్తే అందులో ఒక్కటీ కూడా విప్లవం పురికొల్పిందిలేదు. కాని స్వాతంత్ర్యసందేశాలుమాత్రం అందులో ఎన్నో అన్నివున్నాయి. బహుశా ఇప్పటికీ ఈ రేడియో స్వాతంత్ర్యసందేశాలు ప్రసారంచేస్తూనేవుంది. ఈ సందేశాలికి తిన్ననిబాధ్యతవహించడానికి మనం

సిద్ధంగా వున్నామా? బాధ్యతవహించకండా ఎన్నాళ్ళని ఈ సందేశాలు సాగించడం? యునైటెడ్‌స్టేట్సు ప్రభుత్వం ఉద్యోగులు సూటిగా ఈ శరణార్థుల భారం తమమీద వేసుకోకండా ప్రైవేటుసంస్థల కెందుకు వొదిలిపెట్టాలి? ఈ సంస్థలు శరణార్థుల వ్యవహారాలు తమ ఇష్టాయిష్టాల ననుసరించి చక్క బెడతాయి, కాని నిష్పక్షపాతంగా చెయ్యవు. తనరక్తం ధారపోసి, స్వాతంత్ర్య పిపాసం నిరూపించి వాణ్ణి అర్హుడా కాడా అని పరీక్షించడమా? సమకాలికమైన అమెరికాజీవితంలో అరుదైనగుణాలు 1848 నాటి వుప్లవాదు తెచ్చిపెట్టినవి. అప్పుడు వచ్చినవాళ్ళలో చాలమంది హంగేరీవాళ్ళు అలిసిపోయిన మన ఆంగ్లోఅమెరికన్ వారసత్వానికి కొత్తరక్తమూ, శౌర్యసాహసాలసంప్రదాయమూ తెచ్చారు, బహుశా మనకి మరికొంత హంగేరీ రక్తస్పర్శకావలిసివుందనుకుంటాను.

ఈ 'కోల్డువార్' లో తన వైఖరిగురించి అమెరికా అప్పుడే పునరాలోచన చేస్తోంది. మా జాతీయవిధానం సృష్టికరణకి హంగేరీవిప్లవానికి కృతజ్ఞత తెలపాలి. హంగేరీలో ప్రవర్తించినట్టు మధ్యప్రాచ్యదేశాల్లో ప్రవర్తించడానికి వీల్లేదని ఐసెన్‌హోవర్‌సిద్ధాంతం. సోవియటుప్రపంచానికి నోటీసిచ్చింది. పోలెండు, జెకోస్లోవేకియా, రుమేనియా, బల్గేరియాల్లో ఇలాంటి విప్లవం జరిగితే మనం ఏంచేస్తాం అన్నవిషయంలో ప్రకటితమైన వొకవిధానంలేదు. కానైతే వొకవిధానం పరిణమిస్తుంది. దానికికూడా మనం హంగేరీకి కృతజ్ఞులమై వుండాలి. బుడాపెస్టునించి ప్రసరించిన 'షాక్' తరంగాలు అమెరికామీద బలమైన ప్రభావంవేశాయి.

ఏషియాని కొట్టినతుఫాను ఎంతో దూరపుభావంకలది. 1948 కీ 1956 కీ మధ్య ఎంతోమంది అమెరికావాళ్ళు ఏషియాతో సహకరించడం వ్యర్థమని భావించారు. దానికి కారణం ఏషియానాయకులు వున్నసంగతులు స్వీకరించకపోవడమే. మామ్మూలు మాటలికి వాటి సామాన్యార్థంకాక వేరువిధంగా నిర్వచనం జరిగింది. భావాలమార్పిడి కష్టమైపోయింది. అసలు విషయాల స్వభావం ఎలావున్నా అమెరికావాళ్ళు దుర్మార్గులనీ, రష్యావాళ్ళు బలంలేనివారినీ, శాంతిని ప్రేమించే దేశాన్నీ రక్షించేవాళ్ళనీ వ్యాఖ్యానం జరిగింది. అలాంటి అభిప్రాయాలు పడగొట్టడంకోసం భగీరథప్రయత్నం చెయ్యవలసివచ్చింది.

ఇటీవల నాతో వొక ఆసియా విద్యార్థి ఆవేశంతో వాదించాడు.

“ హైడ్రోజను బాంబుల బలంతో అమెరికా తన సామ్రాజ్యం నిలబెట్టి వుంచింది. ఇది మీరు ఒప్పుకోకతప్పదు. రష్యా తన నాయకత్వంకింద శాంతి ప్రేమించేజాతుల్ని స్నేహపూర్వకమైన బంధనాలతో ఒకటిగా బంధించి వుంచింది. ఈ జాతుల్ని బంధించివుంచింది హైడ్రోజన్ బాంబుల భయంకాదు–కార్మికులకి న్యాయం. ఎంతభేదం ! ”

“ ఏ అమెరికా సామ్రాజ్యంగురించి నువ్వు మాట్లాడుతున్నావు? ” నేను అడిగాను.

“ జపాన్, ఫార్మోజా, ఫిలిప్పైన్స్, ఇంగ్లాండు” అన్నాడతడు.

“ జపానుకు ఇంగ్లాండువాళ్ళు ఏమేమి చెయ్యాలో మేం చెపుతామని నీకు నమ్మకమేనా ? ”

“ తప్పకుండా ”

“రష్యా ఆధిపత్యంకింద ఇనపతెరవెనకవున్న దేశాలలో ప్రజలు హాయిగా వున్నారని నువ్వు నమ్ముతున్నావా ? ”

“ దీనికి జవాబు చెప్పను. నువ్వు ఇనపతెర వెనకవున్న దేశాలంటావు. హంగేరీ, రుమేనియాలాంటి దేశాలు రష్యాతో వుండాలని కోరుతూవుండడం స్పష్టం. రష్యా ఆధిపత్యం అంటావు, అది నిజమైనట్టు! రష్యా తన మిత్రులు ఎవ్వరిమీదా ఆధిపత్యం చెయ్యదు ” అన్నాడతడు.

అప్పటికి హంగేరీ విప్లవం జరగలేదు. అంచేత ఆ విద్యార్థికి సమాధానమివ్వడానికి నాకు విషయం దొరకలేదు. అయినా అడిగాను:

“ లిథ్వేనియాని రష్యా ఆక్రమించడం పాశవికంకాదూ ? ”

“ పెట్టుబడిదారులూ, యుద్ధప్రియులూ చేస్తూవున్న అబద్ధప్రచారం అది. తన పొరుగుదేశాలతో రష్యాసంబంధాలగురించి స్టాలిన్‌చేసిన ప్రకటన మీరు చదివివుండరు ”.

“ ఆ ప్రకటనలో ఏముంది ? ”

మాస్కోలో ప్రచురించిన ఒక చిన్నపుస్తకంతీసి అతడు ఇలా మొదలెట్టాడు :

“ తమ ఇరుగుపొరుగుదేశాల స్వరూపం మార్చాలనేవాంఛ సోవియటు యూనియను ప్రజలికి లేదు. పైగా మేం బలవంతంగా మార్చాలని మీరు అనుకోడం పొరపాటు. ఈరాజ్యాలే సుస్థిరంగా నెలకొంటే, సోవియటు యూనియన్ ప్రజల అభిప్రాయాలు మా పొరుగురాజ్యాలికి ఏమి ఆపదతెస్తాయో నాకు అర్థంకాదు. రష్యా తన పొరుగుదేశాలికి ఆపద రాకండానే ప్రవర్తించింది.

అమెరికా తన పొరుగురాజ్యాలతో ఎలాప్రవర్తించింది? హైడ్రోజనుబాంబు పేల్చి జపానుమీద ఆటమికుధూళి కురిపించింది.''

"ఆటమిక్ ధూళి రష్యా బాంబులనించి వచ్చిందనుకున్నాను. రష్యా కూడా అలాంటి బాంబులే పేలుస్తోందికదా?"

"అవును. కాని అది శాంతికోసం పేలుస్తోంది".

"కాదు. తాను పాలిస్తూన్న ప్రజల్ని బానిసలుగా నొక్కివుంచడానికే పేలుస్తోందని ఎందుకనుకోవు?"

ఇక్కడ నా ఆసియా స్నేహితుడు నవ్వాడు.

"పెట్టుబడిదారులూ, యుద్ధప్రియులూఅయిన మీరు 'బానిసత్వం' వంటి మాటలు ఉపయోగిస్తారు. రష్యా ఎవళ్ళనీ బానిసలు చెయ్యదు. ఎన్నికలమీద ఎన్నికలుజరిగే ఈ మిత్రరాజ్యాల్లో ప్రతీఎన్నికలోనూ నూటికి 95 మంది కమ్యూనిజం కావాలని వోట్లిచ్చారు; రష్యా నాయకత్వం కావాలన్నారు."

"ఈ అంకెలన్నీ నువ్వు నమ్ముతావా?"

"తప్పకండా"

ఇలాటి వాదోపవాదాలు ఎన్నోచేశాక నాకో విషయం తెలిసింది. ఏషియా కమ్యూనిస్టులు రుమేనియా, పోలండు, హంగేరీదేశాలగురించి మాట్లాడేదంతా మాస్కోనించి దిగుమతి అయిన దానిమీద ఆధారపడి వుంటుంది.

వీళ్ళతో వాదించి వాదించి నేను అలిసిపోయాను. ఏ ప్రచారంచేత వాళ్ళు ప్రభావితులయారో ఆ ప్రచారం చాలా చతురమైన ప్రచారం. వాదించడానికి గట్టివిషయాలేమీ కనిపించలేదు. అవి ప్రతిపక్షులు స్వీకరించగలిగినంత గట్టిగా వుండాలి. వాళ్ళదగ్గిర రష్యావాళ్ళ ఊహాప్రపంచంనించి బయలుదేరిన అంకెలున్నాయి. నా దగ్గిర హేతువాదమూ, సామాన్యబుద్ధీ మాత్రమే వున్నాయి.

సింగపూరుని కమ్యూనిజంలోకి లాగడానికి ప్రయత్నిస్తోన్న కొంతమంది చైనా యువకులతో మాట్లాడుతూ కోపంతో అన్నాను:

"కమ్యూనిస్టు స్వర్గాలంటూన్న ఏ పోలండుకో, లిథ్వేనియాకో ఈ యువకుల్ని తీసుకుపోయి విడిచిపెట్టాలనివుంది. పోనీ వీళ్ళు పోలులనో, లిథ్వేనియనులనో అడిగి తెలుసుకున్నా బావుండేది. వాళ్ళు రష్యా కమ్యూనిజంగురించి ఏమనుకుంటున్నారో వాళ్ళనే అడిగి తెలుసుకోవాలి."

సరే, ఇప్పుడు హంగేరీవాళ్ళని అడిగి తెలుసుకోవచ్చు. ఒక జనాభాకి జనాభా రష్యా అధిపత్యం ఎలా నిరాకరించిందో, విశదమయ్యేట్టు ప్రపంచం

కళ్ళఎదట హంగేరీ విప్లవం చూపించింది. హంగేరీ సాక్ష్యం ప్రచారంకాదు; ఇలా అయివుంటుందన్న ఊహకాదు; వెకళ్ళినవారు రిపోర్టర్ల సాక్ష్యంకాదు. ఇరవైమంది హంగేరీవాళ్ళలో 19గురు కమ్యూనిజం అసహ్యించుకుంటు న్నారు - హంగెరి విప్లవం స్పష్టంగా, సరళంగా తెలిపిన సత్యం ఇది.

ఇది నిర్వివాదాంశం. దీనిని ఏషియావాసులకి రిపోర్టుచేస్తే దాని చరిత్ర మీద గంభీరమైన ప్రభావం పడుతుంది. ఏషియా ప్రజలు తాము హేతు వాదులమని గర్విస్తారు విషయం లోతుల్లోకి చొచ్చుకుపోయే కుశాగ్రబుద్ధులు వాళ్ళు. విషయాలు ఎదటవుంటే వివేచనచేయగల వివేకవంతులు. హెచ్చు మంది ఏషియాదేశభక్తులు తమ దేశాలు హాయిగా, సుఖంగా వుండాలనే కోర్తారు. గాఢమైన వాళ్ళ దేశభక్తి పురస్కరించుకుని రష్యా సులభంగా అమె రికాకి వ్యతిరేక దుష్ప్రచార బీజాలు నాటింది. ఆ ప్రచార సస్యం పెంచింది; మంచిపంట నొల్లుకుంది. రష్యా వాదిస్తుంది:

"ఏషియావాసులైన మీరు ఇండియాలో బ్రిటిషు సామ్రాజ్యవాదుల వైఖరి చూశారు. ఇండోచైనాలో ఫ్రెంచిసామ్రాజ్యవాదుల్నీ, ఇండోనేషియాలో డచ్చిసామ్రాజ్యవాదుల్నీ చూశారు. ఈ మూడు రాజ్యాలూ కలిపితే దానికి రెండింతలుంది అమెరికా. దాని సామ్రాజ్యతత్వం రెండింతలు చెడ్డదన్న మాట!"

ఈ రష్యాప్రచారం ఎంతసఫలమైందో ఏటేటా దాన్ని ఖండించడానికి కృషిచేస్తోన్నవాళ్ళకే తెలుస్తుంది. ఏషియాఖండ మేధావులు రెండోపక్షంచూపే సామగ్రిలేక, సాధారణంగా రష్యా హేతువాదం పరిగ్రహిస్తారు.

ఇప్పుడు అంతకంటె పెద్దహేతువాదంవుంది - అది హంగేరీ హేతువాదం. హంగేరీ సత్యమంతా ఏషియా చేరాలి. దాని మూలమూల బజారులోకి అది చొచ్చుకుపోవాలి. సుత్తిపెట్టుల్లా నొక్కినొక్కి చెప్పవలసిన విషయాలు ఇవి.

"విప్లవ నాయకులు మేధావులే. వాళ్ళు కమ్యూనిజంవల్ల మోస పోయారు. సెపెల్ కార్మికులు దాన్ని సమర్థించారు. ఎంచేతంటే, కమ్యూ నిస్టు పరిపాలనకింద వాళ్ళు లాభం పొందకపోవడమేకాకండా, తమకున్నది కూడా పోగొట్టుకున్నారు. తన పొరుగురాజ్య వ్యవహారంలో రష్యా మోటుగా కలగజేసుకుంది. టాంకులతో బుడాపెస్టు ధ్వంసంచేసింది. ఈ విషయాలు ఇండియాలో తెలిస్తే దాని మనస్తత్వం తప్పకండా మారుతుంది.

కాని దురదృష్టవశాత్తూ హంగేరీవిప్లవప్రభావం ఏషియామీద ఎంత వరకూ పడిందో నిర్ణయించడం కష్టం. ఏమంటే రష్యాప్రచారం భగ్నమవుతూ

వుందనగా, ఏష్యా ఇంకోవేపు చూస్తూవుండగానే, మూలమూల బజాపుల
మాట అటుంచి, రాజధానినగరానికిసైతం హంగేరీ గుణపాఠాలు చేరకండా
ప్రజారాజ్యాలు ఈజిప్టుమీద దండెత్తాయి.

హంగేరీ విప్లవం ఏషియాలో గడించిన ఏపాటి నైతికబలమైనా ఈజిప్టు
సంఘటనతో తుడుచుకుపోయింది. బుడాపెస్టు విప్లవం మొదటిరోజుల్లో నేను
ఎంతోమంది ఏషియా స్నేహితులికి రాశాను:

"హంగేరీ కమ్యూనిజం గురించి ఏమనుకుంటూవుందో మీరు పత్రికల్లో
చదువుతూవున్నారనే అనుకుంటాను. నేను ఏ అర్థంతో చెపుతున్నానో మీకు
బోధపడిం దనుకుంటాను".

నా ఉత్తరాలు ఇంకా వాళ్ళకి చేరకముందే ఈజిప్టుమీద దండయాత్ర
జరిగింది. తమ జవాబుల్లో నా స్నేహితులు హంగేరీ పేరైనా రాయలేదు.
వాళ్ళ హృదయాకాశంలో ఇంతకంటే పెద్దసంఘటన వొకటి తారాడుతున్నాది.

" మేము సామ్రాజ్యతత్వం అని దేనినంటామో ఇప్పుడు అర్థమైందా?"
అని రాశారు వాళ్ళు.

ఈ ఈజిప్టు వ్యవహారం చివరిచరిత్ర రాసేసరికి, దాని దోషారోపణ
ఇప్పుడు కనిపిస్తూన్నట్టుకాక, వేరేవిధంగా వుంటుంది. ఈజిప్టు సంఘటన
వల్ల ప్రజారాజ్యాలికి రెండు నష్టాలు కలిగాయి. మొదటిది: ప్రపంచందృష్టి
హంగేరీనించి ఈజిప్టువేపు మళ్ళింది. ఆ వీరజాతిని చీకటిలో నిశ్శబ్దంగా చచ్చి
పోనిచ్చింది. ఆ దేశం వీరప్రవర్తనవల్ల ప్రపంచానికి కలగవలసిన గుణపాఠం
మరుగుపడిపోయింది. ఎవళ్ళయితే ఈ గుణపాఠం నేర్చుకోవలసివుండేదో,
వాళ్ళదగ్గిరే అది వ్యర్థమైపోయింది. రెండోది: పాతసామ్రాజ్యవాదుల దండ
యాత్ర తూర్పున కొత్తగాలేచిన సామ్రాజ్యవాదుల దుర్గుణాలు కప్పి
పుచ్చేసింది.

ఈ రెండు సంఘటనల్లోనూ అమెరికా తీసుకున్నభాగం నాకు జ్ఞాపకం
వుంది. ఒక స్నేహితుడు దాని గురించి రాస్తూ, ప్రపంచనైతిక పతనానికి
దుఃఖించాడు.

" రష్యా హంగేరీలో ఏంచెయ్యాదలుచుకుందో మన గూఢచారులు కని
పెట్టలేకపోవడం శోచనీయం. మన రాయబారులు ఈజిప్టులో మన మిత్ర
రాజ్యాలు ఏంచెయ్యాబోతున్నాయో తెలుసుకోలేకపోవడం క్షమించరాని
విషయం".

ఈ మహావిపత్తువల్ల అమెరికా ఇంతకంటే మంచి విదేశాంగ రాజ్యనీతి తయారుచేసుకోవచ్చు. హంగేరీ సాహసకృత్యంవల్ల ఏషియాలో సహజంగా మనపక్షం కలగవలసిన సద్భావం మాయమైనప్పటికీ ఆ విప్లవం గుణపాఠాలు గురించి ఇప్పుడైనా ఏషియా స్నేహితులతో చర్చించవచ్చు. మేం కఠిన మార్గం నేర్చుకోవాలి. అలాగే వాళ్ళున్నూ నేర్చుకుంటారని ఆశించవచ్చు. ప్రధాన గుణపాఠంమాత్రం దృష్టిపథంనించి తప్పించకూడదు. పదకొండేళ్ళ తరవాత హంగేరీలో హెచ్చుమంది కమ్యూనిజం అసహ్యించుకున్నారు. సోవియట్లు ప్రజా తీర్మానం అంగీకరించకండా, దేశం ధ్వంసం చేయడానికి టాంకులు పంపారు.

హంగేరీ విప్లవం తాలూకు మరోముఖ్యవిషయం ఏషియాకి అనుసరించ జేయవచ్చు. దాన్ని హెచ్చుగా చెప్పను, సూచించి వొదిలేస్తాను. ఏమంటే ఎంతోప్రాముఖ్యమైందది. ఏషియాతో ఏమాత్రం సంబంధమున్న దేశమైనా ఈ ముఖ్యప్రశ్నలు తనలో తాను వేసుకుంటుందనుకుంటాను.

హంగేరీలో నూటికి 95 మంది కమ్యూనిజం ద్వేషిస్తూవుంటే చైనాలో ఎంతమంది ద్వేషిస్తున్నారు?

హంగేరీలో నిసైనికులు యావన్మందీ కమ్యూనిజం వొదిలిపెట్టేస్తే చైనాలో సైనికులు ఎంతమంది నమ్మకంతో వుంటారు?

హంగేరీలో కమ్యూనిజం పాశవికబలంమీద నిలబడివుంటే ఎర్రచైనాలో మాత్రం అలాంటి పాశవికబలం అవసరం లేదా?

హంగేరీలో ద్వేషిస్తూవుంటే, చైనాలో ద్వేషించరా?

ఇదేప్రశ్న మరికొంచెం పొడిగించి అడిగితే, హంగేరీ విప్లవంలో ఉత్తర కొరియా విద్యార్థులు వాలంటీర్లుగా వచ్చి, కమ్యూనిజానికి వ్యతిరేకంగా యుద్ధంచేస్తే కొరియాలో కమ్యూనిజం ఏమాత్రం భద్రంగావుంది?

ఇప్పుడు ఈ ప్రశ్నలు అలంకారికంగా వున్నాయి. ఇవి నిజమైన సంఘటనలయి, దేశం వీటికి జవాబు చెప్పవలసిన కాలం ఎప్పుడు వస్తుందో చెప్పలేం. అలాంటప్పుడు ప్రపంచంయావత్తూ సంబంధం కలిగి వుంటుంది. ఏజవాబులు మనం యూరపుకి అనువర్తించేట్టు చేస్తామో, అవే ఏషియాలో మనకర్తవ్యం నిరూపిస్తాయి.

ఒక హంగేరీమనిషి చెప్పినమాటలు విన్నాక యూరపువిషయంలో నాకు గట్టినమ్మకం కుదిరింది.

" 1848లో కాసూత్, పెటోఫీలతో మా విప్లవం ఆరంభమైందనీ, అది అలాగే శాశ్వతంగా కొనసాగుతుందనీ కొందరు అంటారు. తక్కినవాళ్లు 1956 అక్టోబరు 6న ప్రారంభమైం దంటారు. లాజ్లోరాజక్ గోరీమీంచి రెండువందల మంది దేశభక్తులు వెళ్ళినరోజు అది. రాజక్ నేషనలిస్టు కమ్యూనిస్టు. దేశ ద్రోహి అని అతణ్ణి స్టాలిన్ చంపేశాడు. రాజక్ పేరుకి తగిలించిన ఈ కళంకం కృశ్చేవు తొలిగించాడు. అతడికి తిరిగీ గౌరవస్థానమిచ్చాడు. కాని ఎలా ఇచ్చాడు ? అక్టోబరు మూడున రాజక్ భార్యని ఒక పెద్దగోరీవగ్గిరికి తీసుకు వెళ్ళాడు.

" నీ భర్తకి గౌరవస్థానం ఇవ్వదలుచుకున్నాం. ఈ గోరీలోంచి నీ యిష్టంవచ్చిన ఎముకలు ఎంచుకో. అవి నీ భర్తవే అంటాం " అన్నాడు. ఆమె ఎంచుకున్న ఎముకలమీద ఒక గోరీకట్టారు. అదిగో ఆ గోరీమీంచే మేం ఆరో తేదీని నడిచాం.

" రాజక్ జ్ఞాపకానికీ, అతడికిచ్చిన గౌరవానికి నగరంలో అల్లర్లు బైలదేరవలిసింది. కాని అలాజరగలేదు. ఒకవిధంగాచూస్తే మా విప్లవం 1953లో ప్రారంభమైంది. అప్పుడు జరిగిన తూర్పుజర్మనీ అల్లర్లు, ఒక ' ఇనప నియంతృత్వానికి ' వ్యతిరేకంగా ప్రజలు ఏంచెయ్యగలరో నిరూపించాయి. పోజ్నాడ్‌లో పోలులు చేసింది చూసి మా నిశ్చయం మరీదృఢపడింది. నేనేం చెప్పదలుచుకున్నానో మీకు అర్థమైందా? టాంకులమీద రాళ్ళువిసిరిన తూర్పుజర్మనీవాళ్ళు తాము గెలుస్తామని ఆశకూడా లేకండా చచ్చిపోయారు. కాని అది పోలిష్‌ప్రజలికి ఆవేశం కలిగించింది. వాళ్ళు గెలిచారుకూడాన్ను. పోలిష్‌ప్రజలు పోలులుగానే ప్రవర్తించారు. అయితే వాళ్ళప్రభావం ఎక్కువగా మా హంగేరీవాళ్ళమీద పడింది. మేం ప్రపంచానికి ఇచ్చినగుణపాఠం ఎక్కడ అంతమవుతుందో ఎవరు చెప్పగలరు? మేంవేసిన విప్లవబీజం ఏ దేశంలో మొలకలెత్తుతుందో చెప్పలేం. కాని ఎక్కడో ఒకచోట తప్పకండా అది మొలకెత్తి పెరుగుతుంది. రష్యాకూడా ఎప్పుడో ఒకప్పుడు భగ్గునమండి పోకపోదు. ఏమంటారా? హంగేరీవాళ్ళమైన మేం పోలులుదగ్గిర నేర్చుకున్నాం•••కొంతకథ మేంకూడా నడిపి దారిచూపించాం ".

మన భావికర్తవ్యమూ, బాధ్యతా ఆలోచిస్తే బుడాపెస్టు స్త్రీలని తలుచుకోవాలంటాను. ఇప్పుడు ధ్వంసమైన ఆ నగరంలో తిరుగుబాటుజరిగి అప్పుడే ఆరువారాలయింది. ఇంకా వీధుల్లో కుర్రాళ్ళూ, సెపెల్ కార్మికులూ రష్యా వాళ్ళని ఎదిరిస్తూనేవున్నారు. బుడాపెస్టు " ఆత్మహత్యచేసుకున్న నగరం "

అయిపోయింది. ఆ నగరం ప్రజలు చచ్చేదాకా కమ్యూనిజంని ఎదిరించడానికే నిశ్చయించుకున్నారు. వాళ్ళ ధైర్యానికి ప్రపంచం విస్తుపోయింది.

రష్యా టాంకులు పెద్దబలగంతో వచ్చిననెలరోజులతరవాత, డిసెంబరు 4న బుడాపెస్టుస్త్రీలు నల్లటిదుస్తులు వేసుకుని "హంగేరీ అజ్ఞాతసైనికుల" సమాధులమీద పువ్వులుంచడానికి వెళ్ళారు. మరతుపాకులతోనూ, టాంకులతోనూ రష్యావాళ్ళు వాళ్ళని అడ్డాలని ప్రయత్నించారు. కాని వాళ్ళు ఆగలేదు.

"మీదగ్గిర తుపాకులున్నాయి. మా దగ్గిర పువ్వులే వున్నాయి. ఎందుకూ మీకీ భయం?" చేతుల్లోని పూలగుత్తులాడిస్తూ ఆగకుండా నడిచారు వాళ్ళు.

ఒక రష్యాసిపాయికి మతిపోయింది. ఒక స్త్రీకాలిమీద గుండుపేల్చాడతడు. నల్లటిదుస్తుల్లో వున్న ఆ స్త్రీలు ఇది ఏమీ లెక్కచెయ్యలేదు. ఆగకుండా వాళ్ళు ముందుకే నడిచారు. మరోసిపాయి "ఆగండీ" అంటూ అరిచాడు. ఆడంగులు లెక్కచెయ్యలేదు. ఒక సిపాయి ఒకామె చెయ్యిపట్టుకున్నాడు. ఆమె ఒక్క గుంజుగుంజి విడిపించుకుంది; అసహ్యంతో అతణ్ణి చురచురా చూసింది; అతడి మొహంమీద తుపుక్కున ఊసేసింది.

## 11. ఇది నిజమే అయి వుంటుందా?

ఈ కథ రాయడానికి నేను రెండువిధాలుగా అర్హుణ్ణనుకుంటాను. సమకాలికసమస్యలు విలువకట్టడంలో నేను చాలాజాగ్రత్తపడ్డాను. ఎవరైనా తన గురించి తాను మంచికథచెపితే దాన్ని అనుమానించడం నేర్చుకున్నాను.

తొందరపడకపోవడం నా చదువులోనేవుంది. 1925 లో నేను ఒక చిన్న లిబరల్ క్వేకర్ కాలేజీ ప్రవేశించాను. తమ దగ్గిర చదువుకుని పట్టభద్రుడైన మిచెల్‌పావర్ యుద్ధకాలంలో వుడ్రోవిల్సనుకు అట్టార్నిజనరల్ కొంతచెడ్డపేరు సంపాదించాడని అక్కడి ఆచార్యులందరూ చాలాభయపడ్డారు. పామరు మంచిక్వేకరు. యుద్ధకాలంలో విన్నదంతా నమ్మాడతడు. యుద్ధమయాక కొన్ని తెలివితక్కువపనులు చేశాడు. అవి చెయ్యాలని చెయ్యలేదతడు. బలవంతంగా అందులో దిగవలసివచ్చింది. దానికోసం అమెరికా ప్రజలూ, ప్రభుత్వమూకూడా తరవాత విచారించారు. అతడి తరవాతపనులున్నూ ఎంతో విమర్శకి గురిఅయాయి. అతడి ప్రొఫెసర్లే అతణ్ణి తీవ్రంగా విమర్శించారు.

నేను కాలేజీలో వుండగా యుద్ధకాలం ప్రచారసందర్భంలో జార్జ్‌క్రీల్ కమిటీవాళ్ళు చేస్తున్న జోహుకుం పని స్వయంగా పరిశీలించాను. యుద్ధ

కాలంలో ఏం చెప్పినా, దాని నిజం ఆలోచించకండా అంగీకరిస్తే ఎంతప్రమాదం వస్తుందో అప్పుడు తెలుసుకున్నాను. భయానకమైన బెల్జియంకథలు విడదీసి విమర్శించి చూశాను. మొదటిప్రపంచ మహాయుద్ధకాలంలో మాకు చెప్పిన ఎన్నోవిషయాలుగురించి సందేహాలు ప్రకటించి, చరిత్ర యావత్తూ తిరిగీ రాయాలనే చారిత్రకుల సిద్ధాంతాలు పరిశోధనచేసిన అమెరికా కాలేజీ విద్యార్థుల మొదటి జట్టులోవాణ్ణి నేను.

ఇదిగో ఈ అర్హతలతో ఈ హంగేరీకథ రాయడానికి పూనుకున్నాను నేను. ఇందులో నేను అబద్ధాలు గ్రహించినా, తెలియక వాటిని పునశ్చరణంచేసినా, చతురులైన ప్రచారకులవల్ల మోసపోయినా నన్ను నేనే నిందించుకోవాలి. చరిత్రా, విజ్ఞానమూ జరిగిపోయినసంగతులు తెలుసుకోవడమూ - ఇలాంటి వాటిగురించి నేను ముందే జల్లుకున్నాను. ఎవరైనా ఒక పెద్దవిమర్శకుడు నేను ఈ విషయాల్లో మోసపోయానని నిరూపిస్తే దూషణకి పాత్రుణ్ణి అవుతాను. అప్పుడు నలుగురిలోనూ నన్ను అవమానపరచవచ్చు. కాదనను.

తమనిగురించి తాము చెప్పుకున్నప్పుడు చాలామంది అబద్ధాలు చెపుతారు. అంచేత వ్యక్తిగతమైన కథల్ని నేను సందేహిస్తున్నాను. ఎన్నోకథలు విన్న అనుభవంమీద నేను చెపుతూన్న మాటలివి. అది ఏనాడో చెప్పినా అతడి మాట నమ్మను. చర్వితచర్వణంగా మేము ఎన్నెన్నిసార్లు ఒక్కొక్కకథా వోపికతో విమర్శించుకుంటూ వచ్చామో నాతో పనిచేసిన దుబాసీలు చెపుతారు. ఒక్క హంగేరీ వ్యక్తితోకాక డజనుమందితో ఒక్కవిషయం మాట్లాడి, అందరూ అది అంగీకరిస్తేనేతప్ప తీసుకోలేదు. వియన్నాలో ఒపేరాభవనం దగ్గిరగావున్న జొసెఫ్స్మట్స్ హొటల్లో పెద్దబల్లచుట్టూ మేం నలుగురైదుగురం కూర్చునేవాళ్ళం. ఒకసమస్యగురించి ఒక్కొక్కసారి నాలుగేసి గంటలు మధనపడేవాళ్ళం. అదయాక నలుగురు శరణార్థుల్ని పిలిచేవాళ్ళం. తరవాత మరోనలుగుర్ని పిలిచేవాళ్ళం. ఇలా అంతంలేకండా ఒకే సమస్యగురించి మాట్లాడేవాళ్ళం.

హంగేరీ తిరుగుబాటు ఎంతపెద్దవిషయమో తెలిసినతరవాత, అయిదు భాషలుతెలిసి బాగాతర్ఫీదుపొందిన ఒక రీసెర్చి నిపుణుణ్ణి నాకు సహాయం పంపమని కోరాను. అతడు వచ్చాడు. నేను మాట్లాడిన హంగేరీవాళ్ళని విడిచిపెట్టి, అతడు క్యాంపులికి వెళ్ళేవాడు. అక్కడ శరణార్థుల్ని కలుసుకుని విషయ సంగ్రహం చేసేవాడు. నాచివరికథనం అతడి కథనంతో భేదించి నప్పుడు నలుగురైదుగురు కొత్తహంగేరీవాళ్ళనికలిసి ఈతేడాలు వాళ్ళముందు

పెట్టేవాళ్ళం. ప్రతీ విషయమూ చర్చించేవాళ్ళం. ప్రతిదానిలోనూ ఫొటోగ్రాఫులూ, ఇతరపత్రాలూ తీసుకుని ఒకమనిషి తాను చెప్పినదగ్గిర వున్నాడా లేడా అని నిరూపణ జరిగేవరకూ పరిశోధించేవాళ్ళం. మరొకడు అది నిజమే అనేదాకా దాన్ని పూర్తిచేసేవాళ్ళం కాదు. నమ్మరాని మేజర్ మీట్‌బాల్ కథ కోసం రెండువారాలు శోధించాం. ఇమ్రీ హొర్వాత్ కొడుకు తనతో పారిపోదామని నిశ్చయించినట్టు మిసెస్ మరొతీ చెప్పిన అసాధారణ కథ నిజానిజాలు తేల్చడానికి ఏడువారాలు పట్టింది.

ఒక్కొక్క సంఘటనా తుదిముసాయిదా తయారయేలోగా ఎంతోమంది హంగేరీ నిపుణులు దాన్ని వేరేవేరే ఒక్కొక్కరూ విమర్శించేవాళ్ళు. ప్రతీ మాటా జాగ్రత్తగా చూసేవాళ్ళు. అసలు ఆసంఘటనలు జరుగుతూన్నప్పుడు బుడాపెస్టులోవున్నవాళ్ళే వాళ్ళు. నేను రాసిన వ్యక్తుల ఆద్యంతాలు బాగా ఎరిగినవాళ్ళు. ఏవిషయం ఎక్కడ, ఏరోజు, ఎన్నిగంటలికి జరిగిందో చెప్పగలవాళ్ళు.

ఇందులో నేను స్వయంగారాసిన ప్రతీకథా నిజమైంది. యాండావు సరిహద్దుదగ్గిర నేను కలిసిన ముగ్గురు పద్ధెనిమిదేళ్ళ స్వాతంత్ర్యయోధుల అనుభవాలమీద ఆధారపడివుంది. తండ్రులో తల్లులో బతిమాలితే వాళ్ళు బుడాపెస్టునించి పారిపోవచ్చారు. ప్రతివాడూ విప్లవంలో పాల్గొన్నవాడే; తన అన్నదమ్ముల్నీ, అక్కచెల్లెళ్ళనీ వొదిలేసివచ్చినవాడే. ఏవివో వాళ్ళ ఇట్టేవాళ్ళని బాధించవచ్చు. ఈ ముగ్గురు కుర్రాళ్ళకథా జోసెఫ్‌టాత్ కథగా చెప్పాను. వాళ్ళవయస్సు వాళ్ళే మరిద్దరుకుర్రాళ్ళు విప్లవంలో ప్రాణాలు పోగొట్టుకున్నారు. బుడాపెస్టులో వాళ్ళుచేసిన సాహసకృత్యాలు కొద్దిభాగమే వర్ణించాను. అవికూడా అంతులేకండా నవరించాను. నేను వొక్క కుర్రాడికథే రాయడానికి ఇష్టపడతానని ఆకుర్రాళ్ళకి తెలును. నిజమైన పేరు వొక్కటే వాడడం నా అభిమతం. కాని ప్రతీకారానికి వాళ్ళు భయపడ్డారు. అంచేత ఇలా రాజీనామాకి వచ్చాను.

ఇస్త్వాన్‌బలోగ్, పీటర్‌జిగేటీ మహాధైర్యసాహసాలు కలవాళ్ళు. ఈపేర్లు వాళ్ళ నిజమైన పేళ్ళుకావు. మారుపేర్లుమాత్రమే. జిగేటీ విషయంలో సంఘటనలుకూడా మార్చవలిసి వచ్చింది. కాకపోతే ఇతరులు ఇందులో చిక్కపడతారని భయం. హంగేరీ మేధావులు ఈకథ బలపరచడమేకాదు, వాళ్ళ పేర్లూఅవీ దాచడానికి సామగ్రికూడా యిచ్చారు.

సోక్ ఎంతో ధైర్యసాహసాలు కల యువకుడు.

"నా నిజమైన పేరు తప్పకండా పుస్తకంలో రాయండి. వాళ్ళ కుళ్ళి క్రితం పద్ధతికి నేను ఏంచేశానో వాళ్ళకి తెలియాలనే నాకోరిక" అన్నాడతడు.

అతడు చెప్పినదానిలో చాలాభాగం నిజమేఅని నా నమ్మకం. అతడు కిల్లియనుబారక్సులో చేసిన సాహసకృత్యమే రాశాను నేను. ఆనాటి దాడీ, అందులో జనరల్ పాల్‌మాల్టేరు తీసుకున్న భాగమున్నూ అక్కడవున్న నలుగురు సోల్జర్లూ, ఒక విమర్శకుడూ సరిచూశారు. సోకీ తాను అమెరికా వెళ్ళాలనుకున్నా నన్నాడు. నేను సంతోషించాను. బోస్టన్‌లోనో, డల్లాస్‌లోనో ఎక్కడోవొకదగ్గిర పనికి కుదురుకుని పదేళ్ళతరవాత వొక మోటారు గరాజు యజమానై రిపబ్లికన్లకి వోటుచేస్తానన్నాడు.

ముగ్గురు యువకదంపతులు కలిసి మనకథలో జోల్టానూ, ఈవాపాలూ అయారు. ఇందులో ఇద్దరు దంపతుల్ని నేను యాండావులో కలిశాను. ఈ అరుగురు పడుచువాళ్ళూ ప్రారంభంలో చాలా భయపడ్డారు. వాళ్ళ పేర్లు ఎక్కడ బైటపడిపోతాయో అని అడలిపోయారు. బుడాపెస్టులో వాళ్ళ తల్లి దండ్రులికి ఎలాటి ఆపద వచ్చిపడుతుందో అని వాళ్ళభయం. ఈపడుచు వాళ్ళతో నేను ఎన్నోగంటలు గడిపాను. వాళ్ళు చెప్పిందంతా నిజమేఅని నా నమ్మకం. వాళ్ళు చెప్పిందానిలో ఘోరమైన సంగతులేవీ నేనిందులో వాడ లేదు. ఇద్దరు దంపతులతో దీర్ఘంగా చర్చిస్తూ వొకనాడు వొకవిషయం కని పెట్టాను. బాలిక లిద్దరికీ పెళ్ళివుంగరాలులేవు. నాకు అనుమానంవేసింది. అసలు వీళ్ళు పెళ్ళిచేసుకున్నారా లేదా అని. ఇలాంటి ట్రిక్కులు జరుగుతూ నేవుంటాయి కాబట్టి ఈప్రశ్న అడగడంలో నాకేమీ కంగారు కలగలేదు.

"మీరు నిజంగా పెళ్ళిచేసుకోలేదు కదూ! ఇలాగే ఇద్దరూ లేచివచ్చి ఈకథలు అల్లుతున్నారు. అంతేనా?"

నలుగురూ నావేపు తుళ్ళిపడి చిత్రంగా చూశారు. "పెళ్ళిచేసుకున్నా మని రుజువు చెయ్యలేం, కాని మేం పెళ్ళిచేసుకున్నవాళ్ళమే" అంది వొకామె.

"ఏదీ మీదగ్గిర అకాగితం వుండాలికదూ! చూపించండి" అంది వొకామె. అతడు వొక కాగితం తీసి చూపించాడు. అందులో వాళ్ళు పెళ్ళిచేసు కున్నట్టు రాసివుంది.

"ఇలాంటి ప్రశ్న మీరు ఎందుకు వేశారు?" అని అడిగా డతడు.

"ఈ ఇద్దరు అమ్మాయిలికీ పెళ్ళివుంగరాలు లేవు."

"కమ్యూనిజంలో మాలాంటి యువదంపతులికి ఉంగరాలు కొను క్కునేపాటి తాహతు వుండదు" అన్నదామె.

తరవాత మరో ఇద్దరిని కలిసినప్పుడు చూశాను, ఆ అమ్మాయికి వుంగ రం వుంది. ఆమెనడిగాను, ఇలా అంది :

"మతం అంటే బాగా నమ్మకం వున్నవాళ్ళు తలుచుకుంటే ఎలాగో ఒకలాగ వుంగరం కొనుక్కుంటారు. అయితే మిగతావేవీ కొనుక్కోకండా మనస్సు చంపుకోవాలి."

ఇలా కొందరికిమాత్రం పెళ్ళివుంగరా లున్నాయి.

సిగరెట్టు వెలిగించి, తుపాకిపట్టుకుతిరిగే ఇమ్రిగ్రేగరుని నికెల్స్‌డార్ఫ్ దగ్గిర అతడు సరిహద్దుదాటినప్పుడు కలిశాను. రైలుపట్టాలుమధ్య పూగుతూ అతడు నడిచివస్తూంటే చూశాను. అతణ్ణి రష్యావాళ్ళు ఎందుచేత పేల్చేయ్యో లేదో నాకు తెలియదు. మాట్లాడడానికి అతడు చాలా సరదాఅయినవాడు. తన నిజమైనపేరు పుస్తకంలో ఉదహరించమన్నాడు. కాని తనకీ తల్లిదండ్రు లున్నారు, స్నేహితులున్నారు. అతడి అసలుపేరు వెల్లడయితే వాళ్ళకి హాని కలుగుతుంది. విప్లవం చివరిలో అతడు ఎక్కువ పాల్గొనడంవల్ల అతడిపేరు మరుగునవుంచడమే మంచిదనుకున్నాను.

నేను కలిసినవాళ్ళలోకల్లా సెపెల్‌నించి వచ్చిన గ్యోర్గీజాచో చాలా ఉత్తమపురుషుడు. తన కథ రుజువుచేసే ధ్రువపత్రాలు అతడిదగ్గిరే వున్నాయి. అతడి మొహంమీద నిజాయితీ తాండవిస్తూవుంటుంది. అతడితో మాట్లాడిన మాఅందరికీ తలవొంచుకోవలిసివచ్చింది. అతడు చెప్పిన కథ యావత్తూ తక్కినవాళ్ళు బలపరిచారు. అతడు హంగేరీ వొదిలేసి వచ్చిన వాంట్లోనో తేడా కనపడుతుంది. నేను కావాలనే ఆభాగం మార్చేశాను.

హాడ్జాకు కుటుంబం గొప్పకుటుంబం. వాళ్ళని నేను వంతెనదగిర చూశాను. మిసెస్ లిలీబ్రౌను వాళ్ళనిచూసిన హొటలుదగ్గిర వాళ్ళని కలి శాను. తరవాత వియన్నాలో కలిశాను. 9, 13 ఏళ్ళ పిల్లలికి ఇంతేసి విష యాలు ఎలా తెలిశాయా అని సందేహించాను. అందుచేత వాళ్ళని వేరే తీసుకు వెళ్ళి, ఏకాంతంలో అడిగాను. వాళ్ళు చెప్పిందాంట్లో పిసరంతా సందేహిం చడానికి అవకాశం లేదు.

మిసెస్ మేరియా మారొథీ నిజమైన పేరు. ఈమె తనపేరు ఉన్న దున్నట్టు వుంచమని కోరింది. బొగ్గుగని కార్మికుడు చెప్పినకథ అందరినీ చకితుల్ని చేసింది. కొన్ని కుటుంబకారణాలచేత తన అసలుపేరు ఉదహ

రించే ధైర్యం అతడికి లేకపోయింది. అయితే అతడు చెప్పినకధలో మాత్రం అబద్ధంలేదు. అతడు చెప్పిందంతా తక్కినవాళ్ళూ బలపరిచారు.

ఇక ఏవీవో మనిషికథలో జాలిపడాల్సిన పాత్రగురించి కొంచెం చెప్పాలి. ఫెరెన్సుగాజోర్ రెసిక్‌లోచూసి ప్రతీకారానికి భయపడి తన అసలు పేరు మానోట్సులోకూడా రాయనిచ్చాడుకాదు. అతడుచెప్పిన రెపెక్‌కథకూడా కల్పనకావచ్చు. కాని రెసెక్ అబద్ధంకాదు. అదివుంది. నేను చెప్పనవిధంగా నేవుంది. జగజ్జెట్టి పహిల్వానుకథ నాకు చాలా విషాదం కలిగించింది. దానికి కారణం దాని సరళకథనమే. తుపాకిగుళ్ళ గాయాలుచూసి, అతడి బలప్రదర్శనం ఫలుముతీస్తానని పట్టుబట్టాను. 'బానిస కూలీపని' గురించి అతడిచ్చిన రిపోర్టు సరైందోకాదో అని విచారించాను. మేజర్ మీట్‌బాలు గురించి అతడిచ్చిన వివరాలగురించి సాక్ష్యం సేకరించాలనుకున్నాను. ఇంతకీ దురదృష్టవశాత్తూ అతడికథ యావత్తూ నిజమే అని తేలింది. ఏ వి వో మనిషి టైబర్‌దొనాత్ నాసృష్టి. అందులో వివరాలన్నిటికీ నేనే బాధ్యుణ్ణి. ఎంతో పరిశోధనమీదా, కొన్ని రహస్యపత్రాల ఆధారంమీదా అతడిసృష్టి జరిగింది. ఎవీవో వాళ్ళగురించి చెప్పిన ప్రతీహంగేరీవ్యక్తినీ నేను ఒక ప్రశ్న వేసేవాణ్ణి.

"హంగేరీయువకులు దేశభక్తులనీ, వీరులనీ మీరు చెపుతున్నారు. ఇవిగో చూడండి, పదిహేనుగురు ఏ. వీ. వో. వాళ్ళ బొమ్మలు ఇవి. వీళ్ళందరూ యువకులే. అందరూ హంగేరీవాళ్ళే. వీళ్ళనిగురించి ఏమంటారు?"

ఓపికతో మేం ఒక ఏవీవో మనిషి చిత్రం నిర్మించేవాళ్ళం—అహంగేరీ అతడు ఎరిగిన ఏ వి వో మనిషిని. పోలీసుపోస్టులో మూలవున్న ఒక ఏ. వీ. వో, ఫ్యాక్టరీలోవున్న ఏవీవో, వసతిగృహాల్లోవున్న ఏవివో, రెస్కిలో ఏ. వీ. వో, 33 దినాలపాటు ఒక గనికార్మికుణ్ణి తన్ని, కొట్టిన ఏవివో (కారణం అపని వాడి నూటు అతడికి నచ్చకపోవడమే), ఒక ఆడమనిషిచెయ్యి విరగ్గొట్టి, ఆమె పళ్ళు వూడగొట్టిన ఏవీవో – వీళ్ళందరూ నామనస్సులో వున్నారు. నేను ఏవీవోమనిషిని ఊహించగలననుకుంటాను.

మరొక్క విషయం ఇక్కడ చెప్పాలి ఈపుస్తకంలో పేర్కొన్న చాలా మందికి నేను స్వయంగా హంగేరీనించి వాళ్ళులేచి రావడంలో సహాయం చేశాను. యాండావు ధగ్గిర కాలవవొడ్డున వాళ్ళని కలిశాను. వంతెన దాటడంలో వాళ్ళకి సహాయంచేశాను. నాఅనువాదకులందరిలోకీ సమర్థుడైన శరణార్థిని- అతడు ఆస్ట్రియాలో అడుగుపెట్టి వందఅడుగులైనా వేశాడోలేదో – కలిశాను. అతడు స్వేచ్ఛావాయువుపీల్చి అప్పటికి కొన్ని నిమిషాలే అయింది.

యాదృచ్ఛికంగా నేను సంపాదించిన కథలివి. తరవాత వందలకొద్దీ హంగేరీవాళ్ళతో మాట్లాడాను. వాళ్ళకథలు ఒకదానితోఒకటి లంకెపడుతున్నాయి. ఒకదాన్ని ఒకటి సమర్థిస్తున్నాయి. ఇదంతాచూసి రెండు నిర్ణయాలకి వచ్చాను.

మొదటిది: నేను కలిసినవాళ్ళంతా నాతో నిజమే చెప్పారు! ఒక కథ పూర్తిగా నిరాకరించడం అసంగతమైతే పరిశోధకుడు సాధ్యమైన ఒక సిద్ధాంతం అంగీకరించాలి. రష్యావాళ్ళలాగ ఇదంతా అభూతకల్పనఅని మీరూ అంటే ఆస్ట్రియా పారిపోయివచ్చిన రెండులక్షల హంగేరియావాళ్ళూ వారిలో ఎక్కడో సమావేశమై, ఒక పెద్దఅబద్ధం చెప్పడంకోసం కూడబలుక్కున్నారన్నమాట. ఆఅబద్ధం వివరాలన్నీ జాగ్రత్తగా వాళ్ళు జ్ఞాపకంపెట్టుకున్నా ఇది ఎంత అసంగతమో ఆలోచించండి.

రెండోది: నాకు లభించిన ప్రమాణాలన్నీ పరిశీలించి, మిచెల్‌పామర్‌నీ, క్రీల్‌కమిటీ విషయాలన్నీ జ్ఞాపకం తెచ్చుకుని బహుశా నేను ఒక సంకటస్థితిలో పడిపోతున్నానేమో అని నాకు సందేహం కలుగుతోంది. నాకు ఇదంతా చెప్పి సంకటానికి గురైన అంతమంది హంగేరీవాళ్ళని విచారిస్తే, ఈపాటి విపత్తు నేను ఎదుర్కోలేకపోతే, ఇకమీంచి నేను స్వతంత్రులతో తిరగడానికి సిగ్గుపడవలసివస్తుంది.

సంపూర్ణం.